# భారతీయ సామాజిక రాజకీయ తత్వ విచారము

## ఎం.ఏ.రాజనీతి-శాస్త్రము,రెండవ సంవత్సరము, పేపరు -4


**రచయితలు**

**ఆచార్య ఎం.వి.యస్.కోటేశ్వరరావు**,M.A.,Ph.D.
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున యూనివర్సిటి
నాగార్జున సాగర్

**ఆచార్య బి.యస్.ఆర్.ఆంజనేయులు**,M.A.,Ph.D.
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆంధ్రా యూనివర్శిటి
విశాఖపట్నం

**శ్రీ ఎం.రవి శేఖర్**,M.A.
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున యూనివర్సిటి
నాగార్జున సాగర్

**డా. ఎల్.శారద**, M.A.,Ph.D.
పి.ఏ.అండ్ ఎస్.కాలేజి
రాజనీతి శాస్త్ర పి.జి విభాగము
పెదనందిపాడు

**ఆచార్య వి.దాసగిరి రావు**,M.A.,Ph.D.
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఏ.వి.పి.జి.సెంటర్ ,కాకినాడ

**డా॥ టి.సుధాకర్**,M.A.,Ph.D.
హిందూ కాలేజి పి.జి. సెంటర్
గుంటూరు

సంపాదకులు
**ఆచార్య .పి.పద్మనాభ రెడ్డి** ,M.A.,Ph.D.
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
శ్రీ కృష్ణదేవరాయ యూనివర్శిటి, అనంతపురం

సమన్వయ కర్త
**డా॥ యం.రవిశేఖర్**.,యం.ఏ.,యల్.యల్.బి.,పి.హెచ్.డి.,
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున యూనివర్సిటి

డైరెక్టర్
**ఆచార్య .వి.చంద్రశేఖర రావు**.ఎం.కాం.,పి.హెచ్.డి

దూరవిద్యా కేంద్రము
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం .నాగార్జున సాగర్-522 510**
Ph :0863-2293299 , (08645) 211023 ,211024, Cell :9848285518
E-mail : info@anucde.ac.in
Website: www.anucde.ac.in

# ఆధునిక రాజనీతిసిద్ధాంతము మరియు విశ్లేషణ

**ఎం.ఏ.,రాజనీతి శాస్త్రము,2వ సంవత్సరము, పేపరు-5**

**రచయితలు**

**డా॥ ఎం.వి.యస్.కోటేశ్వరరావు**
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున యూనివర్సిటి

**డా॥ కె.రామచంద్రమూర్తి**
రాజనీతి శాస్త్ర విభాగము
శ్రీ సి.ఆర్.ఆర్.కాలేజి
ఏలూరు.

**డా॥ వి.దోసగిరి రావు**
రాజనీతిశాస్త్ర విభాగము
ఏ.యు.ఎం.ఎస్.ఎన్.పి.జి.సెంటర్
తిమ్మాపురం.కాకినాడ

సంపాదకులు

**ఆచార్య .ఎం.వి.యస్.కోటేశ్వరరావు**
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సమన్వయకర్త

**డా॥ యం.రవిశేఖర్.,యం.ఏ.,యల్.యల్.బి.,పి.హెచ్.డి.,**
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

డైరెక్టర్

**ఆచార్య .వి.చంద్రశేఖర రావు**

దూరవిద్యా కేంద్రము

**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ,నాగార్జున సాగర్...522 510**

**Ph :0863-2293299 , (08645) 211023 ,211024, Cell :9848285518**

E-mail : info@anucde.ac.in
Website: www.anucde.ac.in

# తులనాత్మక రాజకీయాలు

## ఎం.ఏ.రాజనీతి శాస్త్రము,రెండవ సంవత్సరము,పేపర్-1


**రచయితలు**

**ఆచార్య ఎం.వి.యస్.కోటేశ్వరరావు.**M.A.,Ph.D.
అసోసియేట్ ప్రొఫెసర్
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున యూనివర్సిటి
నాగార్జున నగర్

**డా॥ఎం.పాండు రంగారావు.**M.A.,Ph.D.
లెక్చరర్
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర పి.జి.విభాగము
సర్ సి.ఆర్.ఆర్.కాలేజి
ఏలూరు

**డా॥ వి.దేవగిరి రావు.**M.A.,Ph.D.
అసోసియేట్ ప్రొఫెసర్
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆంధ్ర విశ్వవిద్యాలయ,విశాఖపట్నం.

**డా॥ బి.బాలకృష్ణ** M.A.,Ph.D.
లెక్చరర్
రాజనీతి శాస్త్ర పి.జి.విభాగము
సర్ సి.ఆర్.ఆర్.కాలేజి, ఏలూరు.

**డా॥ కె.రామచంద్రమూర్తి.**M.A.,Ph.D.
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
సర్ సి.ఆర్.ఆర్.కళాశాల,ఏలూరు.

సంపాదకులు

**ఆచార్య వి.భవాని** ,M.A.,Ph.D.
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము.
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

సమన్వయ కర్త

**డా.యం.రవిశేఖర్.,యం.ఏ.,యల్.యల్.బి.,పి.హెచ్.డి.,**
రాజనీతి మరియు ప్రభుత్వ పాలనా శాస్త్ర విభాగము
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

డైరెక్టర్

**ఆచార్య .వి.చంద్రశేఖర రావు. ఎం.కాం.,పి.హెచ్‌డి**



దూరవిద్యా కేంద్రము
**ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ,నాగార్జున నగర్-522 510**
Ph :0863-2293299 , (08645) 211023 ,211024, Cell :9848285518
E-mail : info@anucde.ac.in
Website: www.anucde.ac.in

# ముందుమాట

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 1976లో స్థాపించబడి మొదలు నేటి వరకు ప్రగతి పథంలో పయనిస్తూ వివిధ కోర్సులు, పరిశోధనలు అందిస్తూ, 2003 వ సంవత్సరంలో NAAC చే B++ (80-85) గ్రేడును సంపాదించుకొని దేశంలోనే ఒక ప్రముఖ విశ్వవిద్యాలయంగా గుర్తింపు సాధించుకొన్నదని తెలియజేయటానికి ఎంతో సంతోషిస్తున్నాను. ప్రస్తుతం గుంటూరు, కృష్ణా, ప్రకాశం జిల్లాలలోని సుమారు 300 అనుబంధ కళాశాలల విద్యార్థులకు డిగ్రీ, పి.జి. స్థాయి విద్యాబోధనతో పాటు పరిశోధన డిగ్రీలను కూడా ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం అందిస్తోంది.

ఉన్నత విద్యను అందరికి అందించాలన్న లక్ష్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, దూర విద్యా కేంద్రాన్ని స్థాపించింది. దీని ద్వారా పూర్తి స్థాయిలో కళాశాలకు వెళ్ళి విద్య నభ్యసించలేనివారికి, ఎంతో వ్యయ భరితమైన ఫీజులు చెల్లించలేని వారికి, ఉన్నత విద్య చదవాలన్న కోరికవున్న గృహిణులకు ఈ దూర విద్యావకాశం ఎంతో దోహదపడుతుంది. ఇట్టి వారందరికి తమ ముంగిట్లో విద్యను అందించే ఉద్దేశ్యంతో ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, 2003-04 విద్యా సంవత్సరంలో డిగ్రీస్థాయిలో బి.ఏ., బి.కాం.; పి.జి. స్థాయిలో ఎం.ఏ., ఎం.కాం., ఎం.ఎస్.సి., ఎం.బి.ఏ, ఎల్ఎల్.యమ్ కోర్సులను ప్రారంభించడం జరిగింది.

ఈ దూర విద్యా పద్ధతి ద్వారా విద్యనభ్యసించే విద్యార్థుల కొరకు రూపొందించే పాఠ్యాంశాలు, సులభంగాను, సరళంగాను, విద్యార్థి తనంతట తానుగా అర్థం చేసికొనేలా ఉండాలనే ఉద్దేశ్యంతో విశేష బోధనానుభవం కలిగి, రచనా వ్యాసంగంలో విశేష అనుభవంగల అధ్యాపకులతో పాఠ్యాంశాలను వ్రాయించటం జరిగింది. వీరు ఎంతో నేర్పుతో, నైపుణ్యంతో, నిర్ణీత సమయంలో పాఠ్యాంశాలను తయారుచేశారు. ఈ పాఠ్యాంశాలపై విద్యార్థిని విద్యార్థులు, ఈ పాఠ్యాంశాల బోధనలో నిష్ణాతులైన వారు ఇచ్చే సలహాలు, సూచనలు సహృదయంతో స్వీకరించబడతాయి. నిర్మాణాత్మకమైన సూచనలను గ్రహించి మున్ముందు చేసే ప్రచురణలలో మరింత నిర్దిష్టంగా, మరింత సులువుగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ప్రచురణ చేయగలం. ఈ పాఠ్యాంశాల అవగాహన కోసం, సంశయాల నివృత్తి కోసం డిగ్రీ స్థాయిలో వారాంతపు తరగతులు, పి.జి. స్థాయిలో కాంటాక్టు క్లాసులు ఏర్పాటు చేయటం జరిగింది.

దూర విద్యా కేంద్రం ద్వారా విజ్ఞాన సముపార్జన చేసి, ఉన్నత విద్యార్హతలు సంపాదించి జీవనయాత్ర సుగమం చేసుకోవడమేగాక, చక్కటి ఉద్యోగావకాశాలు పొంది, ఉద్యోగాలలో ఉన్నత స్థాయికి చేరాలని వాటి ద్వారా దేశ ప్రగతికి దోహదపడాలని నా ఆశయం. రాబోయే సంవత్సరాలలో దూర విద్యా కేంద్రం మరిన్ని కొత్త కోర్సులతో దిన దినాభివృద్ధి చెంది ప్రజలందరికి అందుబాటులోకి రావాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ మా ప్రయత్నానికి సహకరించిన దూర విద్యా కేంద్రం డైరెక్టర్లకు, సంపాదకులకు, రచయితలకు నా అభినందనలు.

**ఆచార్య .బి.వియన్నా రావు**
ఇన్‌చార్జ్
ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం

# SYLLABUS

M.A., Political Science : Centre for Distance Education

## Paper - IV : SOCIAL AND POLITICAL THOUGHT IN INDIA

1. Historical Back ground : Manu and Kautilya
2. Modern Indian Renaissance
   a) Historical, Cultural and Intellectual Factors
   b) Renaissance and Nationalism
3. Pioneers of Indian Renaissance
   a) Ram Mohan Roy : Freedom of the Press, Humanism and Universal Religion, Bahmo Samaj
   b) Dayananda Saraswati : Social Philosophy, Nationalism and political ideas.
4. Liberalism and the Indian Moderates :
   a) Dadabhai Naoroji b) Gopalakrishna Gokhale
5. Political Radicalism and the Extremists
   a) Bal Gangadhar Tilak b) Sri Aurobindo
6. Mahatma Gandhi
   a) Bases of Gandhian Thought
   b) Non-Violence and Satyagraha : Relationship between means and ends.
   c) Concept of State and Government
   d) Property Rights and Trusteeship formula
   e) Religion and Communal Harmony
   f) Varna Vyavasta and Social inequalities
   g) Ideal of Swaraj
   h) Decentralisation
   i) Views on Women, War and Trade Union Movement
7. Problems of Minorities and Backward Social Groups
   a) M.A. Jinnah b) Mohammed Iqbal c) B.R. Ambedkar
8. Democratic Socialism and Humanist Thought
   a) M.N. Roy : New Humanism
   b) Socialists : Narendra Deva & Ram Manohar Lohia
   c) Jawaharlal Nehru : Democracy, Socialism, Nationalism and Internationalism.
9. Post - Independence trends :
   a) Sarvodaya : Vinobha Bhave and Jayaprakash Narayana
   b) Communist Thought : Strategies of Revolution in India - Ranadive, Mohit Sen.

## GENERAL READINGS :


1. Sankar Ghose : Modern Indian Political Thought
2. O.P. Goyal : Studies in Modern Indian Political Thought
3. G.N. Sama and Moin Shakir : Politics and Society : Ram Mohan Roy to Nehru
4. V.P. Varma : Modern Indian Political Thought
5. Vishnoo Bhagavan : Indian Political Thinkers
6. Ram Chandra Gupta : Great Political Thinkers : East and West.


## REFERENCES :


1. Sankar Ghose : Modern Indian Political Thought
2. A. Appadorai : Indian Political Thinking in the 20th Century from Naoroji to Nehru
3. Sankar Ghose : Political Ideas and Movement in India
4. O.P. Goyal : Contemporary Indian Political Thought
5. A.M. Zaidi : Encyclopaedia of Indian National Congress (Students should refer for relevant sections in different volums)
6. Bipin Chandra : Nationalism and Colonialism in Modern India
7. A.R. Desai : Social Background of Indian Nationalism
8. Thomas Pantham and Deutsch : Modern Political Thought in India
9. K.P. Karunakaran : Democracy in India
10. V.P. Varma : The Political Philosophy of Mahatma Gandhi and Sarvodaya
11. K.P. Misra and S.C. Ganguli (eds) : Gandhi and Contemporary World.
12. G.P. Bhattacharjee : Evolution of Political Philosophy of M.N. Roy
13. Jawaharlal Nehru : Autobiography
14. Bhola Singh : The Political Ideas of M.N. Roy and Jayaprakash Narayana
15. Akhilendra Prasad Rai : Socialist Thought in Modern India
16. M. Arumugam : Socialist thought in India. The Contribution of Ram Manohar Lohia
17. Sankar Ghose : Socialism and Communism in India
18. D.R. Bali : Modern Indian Thought

**M.A. Political Science (Final) DEGREE EXAMINATION, DECEMBER 2005.**

Paper IV - **SOCIAL AND POLITICAL THOUGHT IN INDIA**

Time : Three hours　　　　Maximum : 100 marks

Answer any FIVE questions
All questions carry equal marks.

1. Discuss Manuís views on State and Government.
   రాజ్యం మరియు ప్రభుత్వంపై మను ఉద్దేశ్యాలను చర్చించుము.

2. Explain the cultural and intellectual factors contributing to Nationalist Movement in India.
   భారత జాతీయోద్యమానికి సాంస్కృతిక మరియు మేధాపర కారకాలు ఏ విధంగా తోడ్పడినవో వివరింపుము.

3. Estimate Ram Mohan Royís contribution to modern Indian Political Thought.
   ఆధునిక భారతీయ తత్వానికి రామ్ మోహన్ రాయ్ చేసిన సేవలను అంచనావేయుము.

4. Examine the economic and political ideas of Dadabhai Naoroji.
   నౌరోజి ఆర్థిక మరియు రాజకీయ భావాలను పరిశీలింపుము.

5. Describe the political ideas of Tilak.
   తిలక్ రాజనీతి భావాలను వర్ణింపుము.

6. Critically examine the basis of Gandhian Thought.
   గాంధీతత్వ ఆధారాలను విమర్శనాత్మకంగా పరిశీలింపుము.

7. Elucidate Gandhijiís concept of Varnavyavasta and social inequalities.
   వర్ణవ్యవస్థ మరియు సాంఘిక అసమానతలపై గాంధీ భావాలను విశదీకరింపుము.

8. Assess Dr. B.R. Ambedkarís social and political ideas.
   అంబేద్కర్ సాంఘిక మరియు రాజకీయ భావాలను మదింపుచేయుము.

9. Narrate M.N. Royís radical humanism.
   రాయ్ రాడికల్ మానవతా వాదమును వర్ణింపుము.

10. Write short notes on any TWO of the following :

    (a) Bhoodhan Movement, (b) Partyless Democracy, (c) Democratic Socialism, (d) Mohit Sen.

    ఈ క్రింది వానిలో రెండింటికి లఘుటీకలు వ్రాయుము :

    (a) భూదాన ఉద్యమం, (b) పార్టీ రహిత ప్రజాస్వామ్యం, (c) ప్రజాస్వామ్య సామ్యవాదము, (d) మోహిత్‌సేన్.

**M.A. (Final) DEGREE EXAMINATION, MAY 2006.**

Political Science

Paper IV - **SOCIAL AND POLITICAL THOUGHT IN INDIA**

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions

All questions carry equal marks.

1. Give the outlines of Manu's political thought.

   మనువు రాజనీతి తత్వ విచారము యొక్క రూపురేఖలను చూపుము / యివ్వుము.

2. What are the essential features of Indian renaissance ?

   భారత సాంస్కృతిక పునరుజ్జీవము యొక్క ఆవశ్యక లక్షణములు ఏవి ?

3. Why is Rammohan Roy called the father of Political reformism ?

   రామ్మోహనరాయ్ రాజకీయ సంస్కరణవాద పితగా ఎందువలన పిలువబడెను ?

4. Examine Naoroji's contribution to modern Indian political thought.

   ఆధునిక రాజనీతి తత్వ విచారమునకు నౌరోజీ కృషిని పరీక్షింపుము.

5. Discuss Gandhi's theory of 'Swaraj' as presented in 'Hind Swaraj'.

   "హింద్ స్వరాజ్"లో యివ్వబడిన గాంధీ స్వరాజ్య సిద్ధాంతమును చర్చించుము.

6. Explain Gandhi as a feminist.

   గాంధీని స్త్రీవాదిగా వివరించుము.

7. Examine Ambedkar's views on 'minorities'.

   మైనార్టీలపై అంబేద్కర్ అభిప్రాయములను పరీక్షించుము.

8. What is M.N. Roy's critique of Marxism ?

   ఎమ్.ఎన్.రాయ్ యొక్క 'మార్క్సిజమ్‌పై విమర్శ' ఏమి ?

9. Estimate the effectiveness of 'sarvodaya movement' in India.

   ఇండియాలో 'సర్వోదయ ఉద్యమం' ఫలితవంతమును అంచనావేయుము.

10. Write short notes on any TWO of the following :

    (a) Nehru Secularism

    (b) Backward classes

    (c) Trade unionism

    (d) Mohit sen.

    ఈ క్రింది వానిలో ఏ రెండింటికైనా సంక్షిప్తముగా వ్రాయుము :

    (a) లౌకికవాదముపై నెహ్రూ

    (b) వెనుకబడిన వర్గాలు

    (c) కార్మిక సంఘ వాదము

    (d) మోహిత్ సేన్.

# విషయ సూచిక


| | | |
|---|---|---|
| 1. | మనుధర్మ శాస్త్రము | 1.1 - 1.12 |
| | ఎ) కౌటిల్యుని అర్థ శాస్త్రం | 1.1 - 1.12 |
| 2. | సాంస్కృతిక పునరుజ్జీవనము భారత జాతీయోద్యమము | 2.1 - 2.9 |
| 3. | రాజా రామమోహన్ రాయ్ | 3.1 - 3.9 |
| 4. | స్వామి దయానంద సరస్వతి | 4.1 - 4.12 |
| 5. | దాదాభాయి నౌరోజి | 5.1 - 5.7 |
| 6. | గోపాలకృష్ణ గోఖలే | 6.1 - 6.9 |
| 7. | బాలగంగాధర్ తిలక్ | 71. - 7.8 |
| 8. | అరవింద్ ఘోష్ | 8.1 - 8.7 |
| 9. | మహాత్మాగాంధీ - 1 | 9.1 - 9.19 |
| 10. | మహాత్మాగాంధీ - 2 | 10.1-10.12 |
| 11. | సర్వోదయ | 11.1 - 11.7 |
| 12 | డా॥ బి.ఆర్. అంబేద్కర్ | 12.1 - 12.11 |
| 13. | యం.యన్. రాయ్ | 13.1 - 13.8 |
| 14. | మహ్మదాలీ జిన్నా | 14.1 - 14.10 |
| 14ఎ. | ఇక్బల్ ఆధునిక ఇస్లామ్ | 14.1 - 14.7 |
| 15. | జవహర్‌లాల్ నెహ్రూ | 15.1 - 15.17 |
| 16. | ఆచార్య నరేంద్రదేవ్ మరియు డా॥ రామ్‌మనోహర్ లోహియా | 16.1 - 16.13 |

పాఠం - 1

# మను ధర్మశాస్త్రము

## 1.0 లక్ష్యం :-

మను చరిత్ర యొక్క చారిత్రక అభివృద్ధి పురాతన నాగరికత సంస్కృతుల నుండి వచ్చినది. మను స్మృతి పై వేదాల యొక్క ప్రభావం స్పష్టంగా గోచరమౌతుంది. మనువు రాజ్యం గూర్చి, రాజు లక్షణాలను గూర్చి, న్యాయ వ్యవస్థను గురించి, పన్నుల గూర్చి వివరించాడు. సామాజిక వ్యవస్థ పై, ఆస్థి పై, స్త్రీల పై, రాజ్యం యొక్క విధుల గూర్చి మనువు యొక్క అభిప్రాయాలను తెలుసుకొనుట ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :-


1.0 లక్ష్యం
1.1 పరిచయం
1.2 రాజు
1.3 మంత్రి మండలి
1.4 న్యాయ వ్యవస్థ
1.5 పన్నులు
1.6 సామాజిక వ్యవస్థ పై మనువు యొక్క అభిప్రాయాలు
1.7 ఆస్థి విషయంలో మనువు యొక్క అభిప్రాయాలు
1.8 స్త్రీల పై మనువు యొక్క అభిప్రాయాలు
1.9 పౌర సంరక్షణా విధానం
1.10 విదేశాంగ విధానము
1.11 నేరము - శిక్ష
1.12 శాసన మండలి
1.13 శాసన ఆధారాలు
1.14 స్థానిక పాలన
1.15 సార్వభౌమాధికారం
1.16 విదేశీ సంబంధాలు
1.17 యుద్ధం
1.18 శాంతి
1.19 రాజ్యం యొక్క విధులు
1.20 ముగింపు
1.21 మాదిరి ప్రశ్నలు
1.22 ఆధార గ్రంథాలు

## 1.1 పరిచయం :-

మను స్మృతి ఎప్పుడు రచించబడింది అనేదానికి చాల వాదోపవాదాలు ఉన్నాయి. విలియం జోన్సు అభిప్రాయంలో మనువు క్రీస్తుకు పూర్వం 1200 శతాబ్దివాడని పేర్కొనడం జరిగినది. మరి కొంతమంది ఈయన క్రీస్తుకు పూర్వం 12, 13 శతాబ్దికి చెందినవాడని పేర్కొనడం జరిగినది. R.G. భండార్కన్ అభిప్రాయంలో మనువు 5వ శతాబ్దిలో కుషాణ గుప్తుని కాలం నాటి వాడని అభిప్రాయపడినాడు. హవ్‌కిన్స్ తన కేంబ్రిడ్జ్ చరిత్రలో మనువు క్రీస్తు శకం ఆరంభంలో గాని, అంతకు ముందువాడు కాని అయి ఉండవచ్చని వ్రాసినాడు. విష్ణువు మూడవ శతాబ్దిలో యాజ్ఞల్క్యుడు, నాల్గవ శతాబ్దిలో నారదుడు, బృహస్పతి, కాత్యయనుడు ఆరవ, ఏడవ శతాబ్దికి చెందినవాడని పేర్కొనడం జరిగినది.

మను స్మృతిలోని రాజకీయ భావనలు అనేక స్మృతులలో వ్యక్తం చేయడం జరిగినది. మను స్మృతికి అనేక పర్యాయ పదాలు కలవు. మను సంహిత, మను ధర్మశాస్త్రం మొదలైనవి. వేదాల తరువాత మను స్మృతి హిందూ జీవన విధానాన్ని గూర్చి వివరించడం జరిగినది. మను స్మృతిలో 12 అధ్యాయాలు కలవు. సమాజంలోని విభిన్న వర్గాలను, మతాన్ని గూర్చి మరియు రాజ్య వ్యవస్థను గూర్చి వివరించడం జరిగినది. ఇందులో న్యాయ వ్యవస్థ మరియు సమాజంలోని వివిధ వర్ణాలు, వాటి యొక్క ఆవిర్భావం గూర్చి వ్రాయడం జరిగినది.

మను చరిత్ర యొక్క చారిత్రక అభివృద్ధి పురాతన నాగరికత సంస్కృతుల నుండి వచ్చినది. రాజకీయ పరిస్థితులను గమనించినట్లయితే మను స్మృతి పై విదేశీ సంస్కృతుల ప్రభావము లేదు. అప్పటికి భారత దేశం పై విదేశీ దాడుల ప్రభావము లేదు. తరువాత మౌర్య సామ్రాజ్య కాలంలో విదేశీ దాడులు ఆరంభమైనాయి. వాటి ఫలితంగా ఉత్తర భారతదేశం విదేశీ పాలన క్రిందకు రావడం జరిగినది. వారి సంస్కృతి ప్రభావం భారతీయ నాగరికత పై కన్పిస్తుంది. అప్పటి సామాజిక, రాజకీయ పరిస్థితుల పై బ్రాహ్మణ ఆధిక్యత గోచరమౌతుంది.

## 1.2 రాజు :-

మను స్మృతి పై వేదాల యొక్క ప్రబావం స్పష్టంగా గోచరమౌతుంది. మను స్మృతిలో రాజ్య ఆవిర్భావానికి ముందు అరాచక స్థితి ఉండేదని రాజులేని రాజ్యముందని అక్కడ బలమున్న వాడిదే రాజ్యమని పేర్కొనడం జరిగినది. మనువుకు దైవదత్తాదకార సిద్ధాంతం పైన నమ్మకము ఉంచినాడు. ప్రజలు అరాచక స్థితిలో ఉన్నప్పుడు వారి సమస్యలను పరిష్కరించడానికి భగవంతుడు రాజును సృష్టించినాడనియు, రాజు సర్వోన్నతాధికారియనియు, చట్ట పరిధిని విస్మరించిన ప్రజలను శిక్షించే అధికారం రాజుకు ఉందని పేర్కొన్నాడు. రాజు శాంతి భద్రతలను కాపాడి ప్రజలకు సుఖశాంతులను అందజేయడం ద్వారా వారి అవసరాలను తీర్చడం జరుగుతుంది.

మనువు యొక్క అభిప్రాయంలో రాజ్యం భగవంతుడు సృష్టించడం ద్వారా ఆవిర్భవించడం జరిగినది. రాజ్యం ఏడు అంగాలతో కూడి ఉన్నదని పేర్కొన్నాడు. (1) స్వామి (సార్వభౌమాధికారి), (2) అమాత్యుడు, (3) పుర (రాజధాని), (4) రాష్ట్ర (5) కోశ (రెవెన్యూ), (6) బల (సైన్యము), (7) మిత్ర (విశేశా స్నేహితుడు).

మనువు రాజు కుండవలసిన లక్షణాలను వివరించినాడు. రాజు తన విధులను సక్రమంగా నిర్వర్తించడం ద్వారా తన ఆధీనంలో ఉన్న వారితో స్నేహ పూర్వకంగా మెలగడం జరుగుతుంది. రాజు చెడు అలవాట్లకు అతీతంగా ఉంటాడు. రాజు కోపం నుండి విముక్తుడు కావాలి. కోపమనేది అన్ని దురలవాట్లకు మూలం. రాజు ధర్మ, అర్థ, కామ, మోక్షములను సాధించే వాడుగా ఉండాలి. రాజు యొక్క ప్రధాన కర్తవ్యం ప్రజా సంక్షేమాన్ని కాపాడటం. రాజు ఎల్లప్పుడు సత్ ప్రవర్తనను కల్గి ఉండాలి. మనువు యొక్క అభిప్రాయంలో రాజుకు రెండు ప్రధాన లక్షణాలు ఉండాలి. అవి - (1) ధర్మము లేదా కర్తవ్యం, (2) బల ప్రయోగం

మరియు శిక్షాస్మృతి. ఈ అంశాలలో రాజుకు పరిజ్ఞానం లేనట్లయితే తన వ్యక్తిత్వాన్ని, గౌరవాన్ని పెంపొందించు కోలేరు. రాజు ధర్మానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వాలి అని పేర్కొన్నాడు. రాజు శిక్షాస్మృతిని వినియోగించడం ద్వారా తన కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తించగల్గుతాడు. రాజు యొక్క ప్రధాన కర్తవ్యాలలో ఒకటి వేదాలను వినడం, పండితులకు తగిన గౌరవాన్ని ఇవ్వడం వారి యొక్క సలహాలను పాటించడం.

## 1.3 మంత్రి మండలి :-

మనువు యొక్క అభిప్రాయంలో రాజు ఒక్కడే పరిపాలన నిర్వహించడం కష్టమని ప్రభుత్వ కార్యకలాపాలను నిర్వహించడానికి ఒక్కొక్క శాఖను నిర్వహించడం కొరకు మంత్రులను నియమించడం జరిగినది. మంత్రులు ఉత్తములు, విద్యావంతులై సమర్థులై మరియు ఆచరణ సాధ్యమైన పనులను నిర్వహించే వారై ఉండాలి. మంత్రుల యొక్క సంఖ్య 8 నుండి 10 మధ్యన ఉండాలని పేర్కొన్నాడు. మను స్మృతిలో మంత్రులు కొన్ని లక్షణాలను కల్గి ఉండాలి.

1. సంప్రదాయాన్ని పాటించే వారై ఉండాలి.
2. సమర్ధతను కల్గి ఉండాలి.
3. ధైర్యంగా ఉండాలి.
4. ఏ పరిక్షకైనా నిలవగల్గి ఉండాలి.
5. తన లక్ష్యాన్ని సాధించే వాడై ఉండాలి.

రాజు మంత్రుల యొక్క అధికారాలను విభజించాలి. ఈ అధికార విభజన వ్యక్తుల యొక్క సామర్థ్యాన్ని ఆధారం చేసుకొని ఉండాలి.

మను స్మృతిలో రాయబారులకు ఉండవలసిన అర్హతలను గూర్చి కూడ వివరించినాడు. రాయబారి యొక్క ప్రధాన లక్షణం ఇతర రాజ్యాలతో స్నేహ సంబంధాలను పెంపొందించడం, స్నేహ పూర్వ సంభాషణలు సల్పడం, రాజ్య క్షేమాన్ని యోచించి నిర్ణయాలను తీసుకో గల సామర్థ్యాన్ని కల్గి ఉండటం మొదలైనవి.

మనువు కోట నిర్మాణానికికూడ ప్రాధాన్యతను ఇచ్చాడు. కోట ఎల్లప్పుడు అడవులకు, పశుగ్రాసానికి, మంచి నీరు, ఆహార ధాన్యాలు లభ్యమయ్యే ప్రాంతానికి దగ్గరగా ఉండాలి.

## 1.4 న్యాయ వ్యవస్థ :-

మను స్మృతిలో న్యాయ వ్యవస్థను గూర్చి వివరించినాడు. న్యాయ పరిపాలన సవ్యంగా ఉన్నట్లయితే రాజ్యం సుభిక్షంగా ఉంటుందని పేర్కొన్నాడు. మనువు యొక్క అభిప్రాయంలో రాజు యొక్క ప్రధాన కర్తవ్యమేమనగా ప్రతి రోజు ఉన్న వ్యాజ్యాలను పరిశీలించాలి. మొత్తం 18 రకాల వ్యాజ్యాలకు పరిష్కారాలను సూచిస్తాయి. ఈ శాసనలు ఆయా ప్రాంతాలలో ఉన్న వ్యవహారాలను బట్టి నిర్ణయించటం జరుగుతుంది. రాజు శాసనాలను ప్రాంతీయ తీర్మానాలకు అనుగుణంగా రూపొందించాలని పేర్కొన్నాడు.

మనువు న్యాయమూర్తులకు ఉండవలసిన లక్షణాలను గూర్చి వివరించినాడు. న్యాయమూర్తి అయిన వానికి మంచికి, చెడుకు మధ్య వ్యత్యాసాన్ని గుర్తించే వాడై ఉండాలి. సాక్ష్యాన్ని నిర్ణయించడానికి మూడు రకాల అంశాలను వివరించినాడు. 1. వ్రాతపూర్వకమైనది, 2. భగవంతుని సాక్ష్యం, 3. నోటి ద్వారా చెప్పే సాక్ష్యం. మనవు న్యాయవాదులు, స్త్రీలు, బానిసలు సాక్ష్యమివ్వరాదని పేర్కొన్నాడు.

రాజు దేశంలోని ఆర్థికపరమైన అంశాలను కూడా నియంత్రించాలని పేర్కొన్నాడు. రాజు వ్యాపారులను గమనించి వారిని నియంత్రించవలసిన ఆవశ్యకత కలదు. మార్కెట్‌లో అయ్యే వస్తువుల ధరలను నియంత్రించాలి. తూనికలను, కొలతలను ఆరు నెలలకు సక్రమంగా అందించక పోయినట్లయితే రాజ్యంలో వివిధ రకాల పనులను నిర్వహించే పనివారి పై రాజ్యం యొక్క నియంత్రణ ఉండాలని పేర్కొన్నాడు. మనువు గనుల వస్తువుల తయారి ధాన్యపు నిలవలుమరియు రెవిన్యూ పై కూడ నియంత్రణ అవసరమని పేర్కొన్నాడు.

మను పన్ను విధించే పద్ధతులను గూర్చి వివరించినాడు. రాజ్యం సక్రమమైన పన్ను విధానాన్ని నిర్ణయించినట్లయితే ప్రభుత్వం సక్రమంగా పని చేయలేదని పేర్కొన్నాడు. పన్ను విధించే వివిధాంశాలను నిర్ణయించారు.

1. భూమి శిస్తు
2. ఫీజులు
3. జరిమానాలు
4. నది నీటిని వినియోగించడం, పడవ నడపడం పై పన్ను
5. పశువుల పై పన్ను
6. సమాజంలోని వివిధ చేతి వృత్తుల వారు మరియు వృత్తి నైపుణ్యం ఉన్న వారి పై పన్ను
7. అమ్మకం పన్ను మొదలైనవి.

మనువు రాజ్యం పన్నును ఏ విధంగా విధించాలనే విషయాన్ని వివరించడం జరిగినది. రాజ్యం పన్నులను మితంగానే విధించాలి. వారు వస్తు ఉత్పత్తి చేసేటప్పుడు రాజ్యానికి ఇవ్వవలసిన పన్నును దానిలో నిర్ణయించడం జరుగుతుంది. ప్రభుత్వం పన్ను విధించేటప్పుడు ప్రజలకు ఇబ్బంది కల్గించకుండా ఉండే విధంగా విధించాలని పేర్కొన్నాడు. జలగ, తేనెటీగ ఏ విధంగా నిదానంగా తమ ఆహారాన్ని తీసుకోవడం జరుగుతుందో అదే విధంగా ప్రభుత్వం తన ప్రజలకు తెలియని విధంగా పన్ను విధించాలని పేర్కొన్నాడు. పన్ను విధించినప్పుడు ప్రభుత్వానికి మంచి వాటాని పొందే విధంగా ఉండాలని పేర్కొన్నాడు.

బంగారం పై 15%, 6%, 8%, 12% వివిధ రకాల పన్నులను వాటి యొక్క ప్రాధాన్యతను బట్టి విధించడం జరుగుతుంది. రాజ్యం 6% పన్నును మాంసం పైన, చెట్లు, తేనె, వెన్న సుగంధ ద్రవ్యాల పైన, మూలికలు, పండ్లు, దుంపల పైన, రాతి వస్తువుల పైన, శ్రామికుడు ఒక రోజు వేతనాన్ని నెలకొకసారి చెల్లించడం జరుగుతుంది. ఇవికాక రాజ్యానికి మరికొన్ని ఆదాయాలు కలవు. కస్టమ్స్, ఎగుమతి పన్నులు, రహదారులు, గనులు, వస్తు తయారీలు, ధాన్యాగారాలు మొదలైన వాటి పైన రాజ్యానికి ఆదాయం కలదు. ఆర్థికపరంగా శక్తివంతంగా ఉన్నప్పుడు ప్రజలు పన్ను చెల్లించడం జరుగుతుంది. ఆర్థికంగా దెబ్బతిన్నప్పుడు రాజ్యం ప్రజల పరిస్థితి గమనించి వారికి పన్ను రాయితీ కల్పించవలసి ఉంటుంది.

## 1.6 సామాజిక వ్యవస్థ పై మనువు యొక్క అభిప్రాయాలు:-

సామాజిక జీవనంలో సమైఖ్యతకై భగవంతుడు నాలుగు వర్ణాలను సృష్టించినాడు. ఈ నాల్గు వర్ణాలు తమ తమ విధులను నిర్వర్తించుటకు గాను సమాజంలో అన్ని వర్ణాలకు ప్రాధాన్యత ఉండే విధంగా సృష్టించడం జరిగినది. ఆ కాలంలో బ్రాహ్మణులకు ఆధిక్యత ఉందనే విషయం మను స్మృతిలో నాల్గు వర్ణాలు భగవంతుని యొక్క శరీర భాగాల నుండి సృజింపబడినాయని పేర్కొన్నాడు.

1. బ్రాహ్మణులు - నోటి నుండి
2. క్షత్రియులు - భుజముల నుండి
3. వైశ్యులు - తొడల నుండి
4. శూద్రులు - పాదముల నుండి

మనువు అభిప్రాయంలో ఎవరి ధర్మాన్ని వారు సంపూర్ణంగా నిర్వర్తించాలి. పరధర్మాన్ని అనుసరించ కల్గినప్పటికి వాటి జోలికి పోరాదని పేర్కొన్నాడు. ఈ చాతుర్ వర్ణాలు తమ కర్తవ్యాలను జాగ్రత్తగా నిర్వర్తించగల్గినప్పుడే సామాజిక సమగ్రత ఉంటుందని పేర్కొన్నాడు.

1. **బ్రాహ్మణులు:-** సమాజంలో బ్రాహ్మణులకు ఉన్నత స్థానం కల్పించడం జరిగినది. వారిని ద్విజులు అని పిలవడం జరిగినది. వారికి జన్మతహా కొన్ని విధులను అప్పగించడం జరిగినది. బ్రాహ్మణుడు బోధించడం, చదవడం, తనకోసం తాను త్యాగం చేయడం, ఇతరుల కోసం త్యాగం చేయడం, దానాలను నిర్ణయించడం, దానాలు స్వీకరించడం చేయాలి. బ్రాహ్మణుడు మాంసాన్ని, ఉప్పుని, పాలను విక్రయించినట్లయితే తన వర్ణం నుండి వెలివేయడం జరుగుతుంది. శూద్రుడితో సమానంగా జీవనం కొనసాగించవలసి ఉంటుంది. ఈ వృత్తి తన జీవన భృతికి తగినంతగా లేనప్పుడు క్షత్రియ,.వైశ్య వృత్తులు చేపట్టవచ్చు. బ్రాహ్మణుడు సమాజంలో ఇతరులకు మార్గదర్శకుడై ఉండవలెను. నైతిక నియమాలు నిర్దేశించేది బ్రాహ్మణుడే. వీరికి ప్రత్యేక దినచర్య నిర్దేశించడం జరిగినది. నిర్దేశిత కర్మలను వారు ఆచరించాలి. బ్రాహ్మణునికి సమాజంలో సముచిత స్థానాన్ని ఇవ్వడం జరిగినది.

2. **క్షత్రియులు:-** క్షత్రియులు భగవంతుని భుజముల నుండి సృష్టించబడినారనియు, వారు పరాక్రమవంతులై ఉంటారు. క్షత్రియుడు ప్రపంచాన్ని మొత్తాన్ని సంరక్షించేవాడు. అందువలన క్షత్రియుడు రూపొందించిన శాసనాన్ని ఎవరు ఉల్లంఘించరు. చట్ట పరిరక్షణా భారం వీరి పైనే ఉంది. వీరు బ్రాహ్మణుల నుండి సలహాలను, సూచనలను పొందుతారు. వారిచే వేదపఠనం చేయిస్తారు. రాజ్య పరిపాలనా భారం నిర్వహించేది క్షత్రియులే. పాలకవర్గం మొత్తం క్షత్రియులే. వారు యుద్ధ విద్య సకల శాస్త్రాలలో క్షత్రియులకు శిక్షణ ఇచ్చేవారు.

వైశ్యులను వ్యాపారం, ఋణాలను, వ్యవసాయం నిర్వహించమని పురమాయించడం మరియు శూద్రులను ద్విజులకు సేవ చేయవలసినదిగా కోరడం జరుగుతుంది. వారు నిర్ణయించిన విధులను సక్రమంగా నిర్వహించేలా చూడటం జరుగుతుంది.

3. **వైశ్యులు:-** వీరు భగవంతుని యొక్క తొడల నుండి జన్మించినారు. వ్యవసాయం, వ్యాపారం వీరి యొక్క ప్రధాన వృత్తి. ఆర్థిక పరిపుష్టికి వీరు తమవంతు కృషిని నిర్వహించడం జరుగుతుంది. వీరికి వజ్ర వైడుర్యాలను, మణి మాణిక్యాల యొక్క విలువలను నిర్ణయించే శక్తి కలదు. భూమి యొక్క విలువను నిర్ణయించగల్గుతారు. మేలు రకం ధాన్యాలను నిర్ణయించి, వాటి వెలను నిర్ణయిస్తారు. తూనికలను, కొలతలను నిర్ణయించే సామర్థ్యం వీరికి కలదు. ఇతర ప్రాంతాల నుండి దేశంలో లభ్యం కాని వస్తువులను కొనుగోలు చేసి, విక్రయిస్తారు. ఈ విధంగా వీరు వ్యాపార వాణిజ్యాలభివృద్ధిపరచి, ఆర్థిక అభివృద్ధిని సాధించే వారు.

4. **శూద్రులు:-** వీరు భగవంతుని పాదాల నుండి జన్మించినారు. శూద్రులు ఉత్తముడైన వాడు, గర్వాన్ని వదలి మృదు భాషణ కల్గి ఉండి బ్రాహ్మణుని సేవించడం జరుగుతుంది. ఈ విధమైన సేవ బ్రాహ్మణునికి చేయుడం వలన మరు జన్మలో ఉత్తమ వర్ణంలో జన్మించడం జరుగుతుంది. శూద్రుని యొక్క ప్రధాన విధి బ్రాహ్మణుని సేవించడం. వీరికి విద్యాభ్యాసం అనేది ఉండదు. వారు శారీరక శ్రమ చేయడం వారి యొక్క ప్రధాన వృత్తి. వీరు సేవకులుగా ఉండి తమ జీవన ఉపాదిని గడుపుకోవడం జరుగుతుంది. వీరికి ఏవిధమైన విద్యాభ్యాసం గాని, శిక్షణ గాని ఉండదు.

మను స్మృతిలో నాల్గు వర్ణాలతో పాటుగా నాలుగు వర్ణాశ్రమ ధర్మాలను కూడ మనువు వివరించినాడు. బ్రహ్మచర్యాశ్రమం, గృహస్థాశ్రమం, వానప్రస్థాశ్రమం, సన్యాసాశ్రమం. ఈ నాల్గు ఆశ్రమాలలో నాల్గు ఆశ్రమ ధర్మాలను నిర్వహించడం జరుగుతుంది. మానవుని యొక్క జీవితంలోని నాల్గు దశలలో నాల్గు ఆశ్రమ ధర్మాలను వివరించడం జరిగినది. బాల్యం, యవ్వనం, కౌమారం, వృద్ధాప్యం. ఆయా దశలలో మానవుడు తన జీవన విధానాలను కొనసాగించడం జరిగినది.

**బ్రహ్మచర్యాశ్రమం:-** మానవుడు తొలి దశలో తన విద్యాభ్యాసాన్ని కొనసాగించడం జరుగుతుంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు కొనసాగించడం జరుగుతుంది. బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులకు ఉపనయన ప్రక్రియ జరుగుతుంది. ఈ విద్యాభ్యాసం 5 సంవత్సరముల నుండి 36 సంవత్సరముల వరకు కొనసాగుతుంది. వీరు విద్యాభ్యాస కాలములో తల్లి, తండ్రులను వదలి గురుకులాలో గురు శుశ్రూష చేయడం ద్వారా విద్యను అభ్యసిస్తారు. ఈ కాలంలో వీరు ఇంద్రియ నిగ్రహాన్ని కల్గి ఉంటారు. కేవలం విద్య పైనే తమ దృష్టిని కేంద్రీకరిస్తారు. భిక్షాటన చేయడం, భిక్ష సేకరించడం, అడవిలో పుల్లలను ఏరుకొని రావడం మొదలైన పనులను వీరు నిర్వహిస్తారు. వీరి పోషణ బాధ్యత గురుకులాలే నిర్వహిస్తాయి. విద్యాభ్యాసానంతరం పరీక్షల నిర్వహణ జరుగుతుంది, సకల శాస్త్రాలలో తమ ప్రావీణ్యతను తెలియ చేయడం ద్వారా వారు విద్యను పూర్తి చేయడం జరుగుతుంది. చివరిగా వారు గురుదక్షిణ సమర్పించడం, బ్రహ్మచర్య ఆశ్రమం తరువాత గురువు పెద్దల యొక్క అనుమతితో వారు గృహస్థాశ్రమం స్వీకరించడం జరుగుతుంది.

**గృహస్థాశ్రమం:-** గృహస్థాశ్రమం వివాహానంతరం భార్య, బిడ్డల యొక్క పోషణ బాధ్యత తీసుకొనడంతో పాటు, తల్లిదండ్రుల బరువు, బాధ్యతలను నిర్వహించడం జరుగుతుంది. కుటుంబ పోషణ నిమిత్తం తనకు వచ్చిన వృత్తిని చేపట్టడం ద్వారా ధనార్జన చేయడం జరుగుతుంది. కుటుంబ బాధ్యత నిర్వహణ అనంతరం వనప్రస్థాశ్రమాన్ని నిర్వహించడం జరుగుతుంది.

**వనప్రస్థాశ్రమం:-** గృహస్థాశ్రమ అనంతరం వనప్రస్థాశ్రమం. గృహ సంబంధమైన పనులను వదలి ఆధ్యాత్మికపరమైన చింతనలో అడవులలో జీవనాన్ని గడపడం జరుగుతుంది. ఈ ఆశ్రమంలో గృహ సంబంధమైన సమస్యలు పూర్తిగా వదలిపోవు. వారితో సంబంధ బాంధవ్యాలు ఉంటాయి. ఆహార విహారపరమైన అంశాలలో నిగ్రహశక్తిని సముపార్జించుకొనుటకు మానవుడు ప్రయత్నిస్తాడు. అడవులలో కంద మూలాలను తీసుకొని పరిమితమైన భోజనంతో వారు నిగ్రహశక్తిని సముపార్జించడం ద్వారా ఆధ్యాత్మిక చింతనను పొందడం జరుగుతుంది. వనప్రస్థాశ్రమంలో ప్రాపంచిక సంబంధమైన సమస్యలు పూర్తిగా సమసిపోవు. దీనిలో పరిపక్వత పొందినవారు సన్యాసాశ్రమమునకు చేరడం జరుగుతుంది.

**సన్యాసాశ్రమం:-** ఈ ఆశ్రమంలో ప్రాపంచిక సంబంధమైన సమస్యలకు అతీతంగా ఉంటూ ఆధ్యాత్మిక చింతనలో పరిక్వతను సాధించడం ద్వారా భగవంతుని ధ్యానంలో నిమగ్నం కావడం జరుగుతుంది. తద్వారా తాను ఈ ప్రపంచాన్ని తృణప్రాయంగా భావించడం జరుగుతుంది. ఐహికపరమైన ఆలోచనలను పూర్తిగా విస్మరించి భగవంతునిలో తాదాప్యం పొందడం ద్వారా మోక్షమార్గంలో మనిషి జీవనాన్ని కొనసాగించడం జరుగుతుంది.

ఈ విధంగా మను స్మృతిలో నాల్గు వర్ణాలను, వర్ణాశ్రమ ధర్మాలను గూర్చి వివరించడం జరిగినది. మను స్మృతిలో చట్టపరమైన అంశాలను, వేదాలను ఆధారంగా చేసుకొని వివరించడం జరిగినది. సామాజిక ధర్మమనేది రెండు రకాలుగా ఉంటుంది. చట్టమనేది రాజకీయ అధికారం నుండి ఆవిర్భవిస్తుంది. పాలకుని నియంత్రణలో ఉంటుంది. కర్మ ఫలితంగా వచ్చే చట్టం. ఇది వ్యక్తిగతమైన చర్యలను నియంత్రించడానికి ఉపయోగపడే సాధనం.

మనువు యొక్క అభిప్రాయంలో శూద్రులు, వైశ్యులువారి కర్తవ్యాలను నిర్వహించేలా రాజు వ్యవహరించాలి. వారు తమ కర్తవ్యాలను నిర్వహించనట్లయితే ప్రపంచం సందిగ్దంలో పడుతుందని పేర్కొన్నాడు. ఎవరైతే తమ కర్తవ్యాలను సక్రమంగా నిర్వర్తిస్తారో వారు మరణరహిత జీవనాన్ని కల్గి తమ కోర్కె తీర్చుకోగల్గుతారు. మనువు వేదాలే ధర్మానికి మూలమని మరియు దాని ద్వారానే ధర్మానికి సంబంధించిన పరిజ్ఞానాన్ని సముపార్జించ వచ్చుననియు పేర్కొన్నాడు. మనువు నాల్గు వర్ణాలలో పై మూడు వర్ణాల వారు తమ కర్తవ్యాలను నిర్వర్తించడం వలన వారు తమని తాము పరిరక్షించుకో గల్గుతారు. వివిధ కాలాల్లో వివిధ ధర్మాలను నిర్వర్తించడం జరిగినది. ధర్మాలు సత్యకాలంలో ఒక విధంగా, త్రేతా యుగంలో ఒకవిధంగా, ద్వాపర యుగంలో ఒక విధంగా, కలి యుగంలో మరియొక విధంగా ఉన్నాయి. యుగాలు మారే కొద్దీ ధర్మము దిగజారుతూ వచ్చినది.

1. సత్య యుగంలో యజ్ఞ యాగాలకు ప్రాధాన్యత ఉండేది.
2. త్రేతా యుగంలో జ్ఞానానికి ప్రాధాన్యత ఇవ్వడం జరిగినది.
3. ద్వాపర యుగంలో త్యాగానికి ఎక్కువ ప్రాధాన్యత ఉండేది.
4. కలి యుగంలో కేవలం బహుమతులకు ఎక్కువ ప్రాధాన్యత ఉంది.

కాలాలు మారే కొద్ది ధర్మము దిగజారుతూ వచ్చింది. మనువు అభిప్రాయం బ్రాహ్మణులు సంస్కారవంతులనియు ఎపుడయితే ధర్మాన్ని గూర్చి సరియైన వివరణ ఇవ్వలేదో అప్పుడు వారు ధర్మసూత్రాలకు సంబంధించిన వివరణ ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నాడు. ధర్మవిరుద్ధమైన కోర్కెలను ధనాన్ని త్యజించవలెనని పేర్కొన్నాడు.

మనువు ఉత్తమ వర్ణాల వారు తమ పౌర హక్కులను అవసరమై ఆయుధాలను ఉపయోగించడం ద్వారా వాటిని సంరక్షించటం జరుగుతుందని పేర్కొన్నాడు.

1. తనని తాను సంరక్షించుకొనే హక్కు.
2. రాజకీయ సంక్షోభంలో ప్రజలను కాపాడటం.
3. అణచివేతకు గురి చేసే పాలకునికి వ్యతిరేకత తెలియచేయడం మొదలైనవి.

## 1.7 ఆస్థి విషయంలో మనువు యొక్క అభిప్రాయాలు:-

మనువు అభిప్రాయంలో ఆస్థి అనేది రెండు ప్రధాన సూత్రాలపై ఆధారపడి ఉంటుంది. (1) రాజ్యం యొక్క సహకారంతో వచ్చేది. (2) వ్యక్తి తన యొక్క సమర్థతతో సముపార్జించేది. రాజు తన దండాన్ని ఉపయోగించని ఎడల వ్యక్తి ఆస్థి పై యాజమాన్యం ఉండదని పేర్కొన్నాడు. క్షత్రియుడు బ్రాహ్మణుని యొక్క ఆస్థిని స్వాధీనపరచుకొనరాదు. ఆకలిలో ఉన్న వ్యక్తి దోపిడిదారుల నుండి ఆస్థిని దాచుకొనవచ్చును. వ్యక్తి యొక్క ఆస్థిని సంరక్షించడం రాజ్యం యొక్క ప్రధాన కర్తవ్యం. ఆస్థి అనేది నైతికపరమైనది ఉండాలి. పాపం చేసిన వారి యొక్క ఆస్థిని నీతిమంతులకు అనుగుణంగా స్వాధీనపరచుకొనవచ్చును.

## 1.8 స్త్రీల పై మనువు యొక్క అభిప్రాయాలు:-

మనువు యొక్క అభిప్రాయంలో "స్త్రీ స్వాతంత్ర్యమర్హసి" అనగా స్త్రీ స్వాతంత్ర్యానికి యోగ్యురాలు కాదు. స్త్రీ అన్ని వయస్సులలోను పురుషుని యొక్క సంరక్షణలో ఉండాలనిపేర్కొన్నాడు. బాల్యంలో తండ్రి సంరక్షణ, యవ్వనంలో భర్త సంరక్షణ, వృద్ధాప్యంలో పిల్లల యొక్క సంరక్షణలో ఉండాలని పేర్కొన్నాడు. స్త్రీ ఆస్థి హక్కును నిషేధించినాడు. స్త్రీ కేవలం గృహపరమైన కార్యకలాపాలు నిర్వహించడానికి మాత్రమే పరిమితమనియు వారికి రాజకీయ రంగంలో స్థానం కల్పించరాదనియు పేర్కొన్నాడు. స్త్రీకి సాక్ష్యం చెప్పే హక్కు లేదనియు, యజ్ఞ యాగాదులను, క్రతువులను నిర్వహించడానికి కూడ అర్హురాలు కాదు. వేద వేదాంగాలను అభ్యసించే అర్హత స్త్రీకి లేదు. స్త్రీకి వివాహము సమయంలో తండ్రి ఇచ్చే ఆభరణాలు ధనము మాత్రమే ఆమెకు చెందుతుంది. భర్త వలన లభించే బహుమతులను స్త్రీ ధనంగా పరిగణించే వారు. స్త్రీకి వారసత్వంగా తండ్రి నుండి కాని, భర్త నుండి కాని ఆస్థిని పొందే హక్కు లేదు. స్త్రీని అగౌరవపరచరాదని పేర్కొన్నాడు. ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తారని వారిని హింసించడం తప్పని పేర్కొన్నాడు. స్త్రీ పవిత్రతకు మనువు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినాడు.

## 1.9 పౌర సంరక్షణా విధానం:-

మనువు యొక్క అభిప్రాయంలో రాజు గూడచారుల యొక్క సహాయంతో తన విధి నిర్వహణ చేపట్టడం జరిగినది. రాజు వేగుల సహాయంతో వివిధ తరహాలకు చెందిన దొంగలను గుర్తించడం జరుగుతుంది. గూఢచారులు రాజు యొక్క నేత్రముల

వంటి వారు. రాజు వారి యొక్క నేత్రములతో రాజ్యము యొక్క శాంతి భద్రతలు కాపాడటం జరుగుతుంది. మనువు రెండు రకాలైన నేర ప్రవృత్తులను గుర్తించినాడు.

1. నిజాయితీ లేని అవినీతిపరుడు
2. క్రూర ప్రవృత్తి కల్గి హింసాత్మక చర్యలకు పాల్పడేవారు

మొదటి తరగతికి చెందినవారు అవినీతికరమైన వ్యాపారం చేసేవారు, లంచగొండులు, కల్తీ వ్యాపారం చేసేవారు, మోసగాళ్ళు, దగాకోరులు, జ్యోతిష్యం చెప్పేవారు. అవినీతిపరులైన అధికారులు మొదలైనవారు.

రెండవ తరగతికి చెందిన వారు దోపిడీ దొంగలు, దారి దోపిడి చేసేవారు, హంతకులు మొదలైనవారు.

దొంగలు బహిరంగంగా పట్టు పడినట్లయితే వారికి ఆశ్రయమిచ్చిన గ్రామీణులతో సహా అదరికి మరణ దండన విదించడం జరుగుతుంది. మనువు వివిధ రకాల నేరాలకు వివిధ రకాలైన శిక్షలను నిర్దేశించినాడు.

వంతెనలను నాశనం చెయ్యటం, నీటి పారుదలను నిలిపి వేయడం, రోగులకు సరియైన చికిత్స చేయకపోవడం, ఆహార పదార్థాలలో కల్తీ, అవినీతిపరులైన కంసాని వాళ్ళకు వ్యవసాయ ఉత్పత్తులను దాచుకునే వారికి వివిధ రకాల శిక్షలను విధించినాడు.

## 1.10 విదేశాంగ విధానం:-

మనువు ఆరు రకాల విదేశాంగ విధానాలను గూర్చి పేర్కొన్నాడు.

1. రాజు శాంతిని కుదుర్చుకొనే ముందు భవిష్యత్తులో తన యొక్క ఆధిక్యత ఉండే విధంగా జాగ్రత్తపడాలి. వర్తమానంలో తనకు ఏ విధంగా నష్టం జరగకుండా చూడాలి.
2. రాజు తాను శక్తివంతుడుగా ఉన్నప్పుడే తాను శత్రువును జయించగలనన్న నమ్మకం ఉన్నప్పుడు యుద్ధం చేయాలని పేర్కొన్నాడు.
3. యుద్ధానికి సన్నద్ధుడు అయ్యే ముందు తన సైన్యం తనకు అనుకూలంగా ఉందని భావించి ఈ సైన్యం శత్రు సైన్యం కంటే శక్తివంతంగా ఉన్నప్పుడు శత్రువు స్థితి అనుకూలంగా లేనప్పుడు శత్రువు మీద దాడి చేయాలి.
4. రాజు తాను శత్రు దాడులకు గురి అవుతాననే భయం ఉన్నప్పుడు యుద్ధం చేయరాదు.
5. రాజు తన యొక్క రథాలు, సైన్యం బలహీనంగా ఉన్నప్పుడు యుద్ధం చేయరాదు.
6. రాజు తన యుద్ధ విధానాన్ని నిర్ణయించేటప్పుడు భవిష్యత్తుని గూర్చి ప్రస్తుతాన్ని గురించి ఆలోచించి గతంలో జరిగిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని చేయాలని పేర్కొన్నాడు.

క్షత్రియుని యొక్క ప్రధాన ధర్మం యుద్ధంలో విజయాన్ని సాధించడమే గాని భయపడి వెను తిరిగి పోవడం క్షత్రియ లక్షణం కాదు.

## 1.11 నేరము - శిక్ష:-

మనువు ధర్మ సంబంధమైన అంశాలను పరిగణలోకి తీసుకొనేటప్పుడు అనేక సందర్భాలను గమనించవలసిన ఆవశ్యకత కలదు. సామాజిక స్థితి గతులను గమనించినట్లయితే అనేక ఒత్తిడులు వ్యక్తిపై పని చేస్తాయి. అవి ప్రత్యక్షమయినవి, పరోక్షమైనవి ఉంటాయి. నేరాన్ని పరిశీలించేటప్పుడు నేరస్తుని యొక్క మానసిక స్థితిని, నేరం చేసిన సమయం, నేరానికి దారి తీసిన పరిస్థితులను పరిగణలోనికి తీసుకోవలసిన ఆవశ్యకత కలదు.

శిక్ష విధించటం దశల వారీగా జరుగుతుంది. మొదట బెదిరించటం, రెండవది ప్రజాముఖంగా తెలియచేయడం, మూడవది జరిమాన, నాల్గవది శిక్ష అమలు జరపడం జరుగుతుంది.

సాధారణ వ్యక్తికి జరిమాన నేర ప్రవృత్తిని బట్టి మూడు రెట్లు ఉంటుంది. రాజు నేరం చేస్తే వెయ్యి రెట్లు జరిమాన విధించటం జరుగుతుంది. శూద్రుడు దొంగతనం చేసినట్లయితే వానిని 8 రెట్లు జరిమాన చెల్లించాలి. వైశ్యుడు ఆ పని చేసినట్లయితే దానికి రెండు రెట్లు చెల్లంచాలి. క్షత్రియుడయితే దానికి నాల్గు రెట్లు చెల్లించవలసి ఉంటుంది. సమన్యాయ పాలన అనేది లేదు. ప్రకృతి సహజంగా సమానత్వం అనేది లేదు. కనుక శిక్ష విదించే విషయంలో అన్ని వర్ణాలకు సమానత్వం లేదు. బ్రాహ్మణుడు, ఇతరులకుమార్గదర్శకత్వం వహించేవాడు కనుక వారు తప్పు చేసినట్లయితే ఎక్కువ శిక్ష విధించవలసి ఉంటుంది. శిక్ష ఎప్పుడు ప్రతీకారాన్ని తీర్చుకునేదిగా ఉండరాదు.

## 1.12 శాసన మండలి:-

శాసన సభ్యులు అయ్యేవారు వేదాలను వాటి వ్యాఖ్యానాలను అధ్యయనం చేసిన వారై ఉండాలి. శాసన మండలిలో సభ్యుల సంఖ్య 10గా ఉండాలని పేర్కొన్నాడు. సభ్యుల సంఖ్య ఇక్కడ ప్రధానం కాదు. సభ్యుల మేధా సంపత్తికి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం జరిగినది. సభ్యుడు చురుకుగా ఉండి అవసరమైన చర్య త్వరితగతిని తీసుకొనే వాడుగా ఉండాలి. వారిలో కనీసం ముగ్గురికి మీమాంస, నిరుక్త మరియు ధర్మ శాస్త్రాన్ని అధ్యయనం చేసిన వారై ఉండాలి. శాసన సభ్యుడు ప్రజల నాడి తెలిసిన వాడై ఉండాలి. జాతీయ విధానాలను రూపొందించగల్గిన సమర్థత ఉండాలి.

## 1.13 శాసన ఆధారాలు:-

శాసన ఆధారాలు నాలుగు వేదాలు, శాసన ఒడంబడికలు, ధర్మశాస్త్రం, పెద్దలు నిర్ణయించిన ఆధారాలు ఆదునిక యుగంలో ఏర్పాటు రాజ్యాంగ చట్టాలు, శాసనాలకు ఇవి ఆధారభూతమైనవి.

## 1.14 స్థానిక పాలన:-

రాజ్యాన్ని పరిపాలనా సౌలభ్యం కోసం చిన్న భాగాలుగా విభజించడం జరిగినది. రాజు ఉన్నతాధికారిగా అన్ని బాధ్యతలు నిర్వహించలేడు. కనుక ప్రాంతీయ అధికారులను నియమించడం జరిగినది. ప్రతి గ్రామానికి ఒక గ్రామాధికారిని నియమించడం జరిగినది, గ్రామానికి ఒక ఉన్నతాధికారి కలడు. ఇరవై గ్రామాలకు ఒకడు, వంద గ్రామాలకు ఒకడు, వెయ్యి గ్రామాలకు ఒకడు ఉన్నతాధికారులు కలరు. వీరి యొక్క జీతభత్యాలు వారి యొక్క పదవిని బట్టి నిర్ణయించబడినాయి. పెద్ద రాజ్యాన్ని సంరక్షించాలన్నట్లయితే రాజ్యాన్ని చిన్న చిన్న భాగాలుగా విభజించినప్పుడు మాత్రమే సాధ్యమవుతుంది. స్థానిక పాలన నిర్వహించడానికి ఒక మంత్రి నియామకం కావాలని పేర్కొన్నాడు. ప్రతి నగరానికి ఒక పర్యవేక్షణాధికారిగా ఉంటాడని పేర్కొన్నాడు. ఈయన చారుల ద్వారా ప్రజల యొక్క ప్రవర్తనను తెలుసుకోగల్గుతాడు. కొంత మందిసైనికులను రక్షణ ఏర్పాట్లకై ప్రతి 2, 3, 5 వందల గ్రామాలకు నియమించడం జరుగుతుంది.

## 1.15 సార్వభౌమాధికారం:-

రాజ్యానికి సార్వభౌమాధికారం ఉంది. అంతర్జాతీయంగా రాజ్యం సార్వభౌమాదికారి కాదు. ప్రతి పౌరుడు పరిపాలనాపరంగా రాజ్యానికి లోబడి ఉంటాడు. మనువు స్వీయ నియంత్రణకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినాడు. స్వీయ నియంత్రణ కల్గినవాడు ఇతరుల పై ఆధారపడరు. ప్రతి వ్యక్తి స్వీయ నియంత్రణ కల్గి ఉన్నప్పుడు సంతోషకరమైన జీవితాన్ని గడిపే అవకాశం కలదు.

ఇతరుల మీద ఆధారపడటం బానిసత్వంతో సమానం. ఒక రాజ్యం ఇంకొక రాజ్యం మీద ఆధారపడటం కూడ బానిసత్వమే. ప్రజలు సంతోషంగా ఉండాలంటే జాతీయ స్వాతంత్ర్యం అత్యవసరం. రాజ్యానికి ప్రధానంగా సార్వభౌమాధికారం స్వాతంత్ర్యం రెండు అవసరమే. ఒక రాజ్యానికి పొరుగు రాజ్యంతో సమానమైన శక్తి ఉన్నప్పుడు వారి పై దండెత్తే అవకాశం ఉండదు. ఒకరు బలవంతుడు, మరొకరు బలహీనులు అయినప్పుడు యుద్ధం జరుగుతుంది. పాలకుడు నీతిమంతుడు అయినప్పుడు ఒక మంచి ఉద్దేశంతో అవసరమైనప్పుడే యుద్ధం చేయడం జరుగుతుంది.

సార్వభౌమాధికారం స్వీయ శక్తి మరియు ఇతరుల మీద ఆధారపడకపోవడం మీద ఆధారపడి ఉంది. రాజు రాజ్యాన్ని సంరక్షిండమనే కర్తవ్యాన్ని భగవంతుడు తనకు దత్తం చేసిన హక్కుగా భావించి నిర్వర్తించడం జరుగుతుంది.

## 1.16 విదేశీ సంబంధాలు:-

మనువు విదేశాంగ విధానాన్ని నిర్వర్తించటంలో నాల్గు రకాలైన మార్గాలు ఉన్నాయని పేర్కొన్నాడు. సామ, దాన, భేద, దండోపాయాలు.

## 1.17 యుద్ధం:-

యుద్ధమనేది రాజ్య సార్వభౌమాధికారానికి భంగం వాటిల్లినప్పుడు మాత్రమే చేయాలని పేర్కొన్నాడు. రాజ్యము మొదట, మూడు మార్గాల ద్వారా సయోధ్య కుదుర్చుకొనడానికి ప్రయత్నించి అది సఫలం కానప్పుడు యుద్ధం చేయడం జరుగుతుంది. యుద్ధాన్ని ఆఖరి ప్రయత్నంగా చేయడం జరుగుతుంది. యుద్ధంలో జయాపజయాలు సందిగ్ధంగా ఉంటాయి. అంతేకాక జన నష్టం ప్రాణ నష్టం కూడ సంభవించే అవకాశం ఉంది.

రాజు యుద్ధాన్ని రహస్యంగా చేయరాదు. ఇది బహిర్గతంగా ఉండాలి. రాజు తన శత్రువుతో యుద్ధం చేసేటప్పుడు విషపూరితమైన ఆయుధాలు గాని, అగ్నితో కూడిన ఆయుధాలు గాని ఉపయోగించరాదు. శరణు వేడిన శత్రువుని కాని, నిద్రిస్తున్న శత్రువుని కాని, నిరాయుదుడైన శత్రువుని కాని హతమార్చరాదు.

విజయాన్ని సాధించిన తరువాత రాజు తిరిగి రాజ్యంలో శాంతిని, రక్షణను, భద్రతను కాపాడవలసిన బాధ్యత కలదు. విజయాన్ని సాధించిన రాజు దేవతలను ఆరాధించాలి. యుద్ధంలో మరణించిన యోధులకు నివాళులు అర్పించాలి. సాహసాన్ని ప్రదర్శించిన వారికి పురస్కారాలను అందించాలి. కొత్తగా ఆక్రమించిన రాజ్యానికి రాజు బంధువులలో ఒకరిని ప్రజామోదం అధినేతగా నియమించడం జరుగుతుంది.

## 1.18 శాంతి:-

అంతర్జాతీయ సంబంధాలలో శాంతిని నెలకొల్పుటకు రాజ్యాలు రాయబారులను పంపడం జరుగుతుంది. రాయబారి అయినవాడు అన్నింటిని క్షుణ్ణంగా పరిశీలించగల్గిన సామర్థ్యం కలిగి ఉండాలి. మరి ముఖ్యంగా మానవ స్వభావాన్ని అధ్యయనం చేసిన వాడై ఉండాలి. అతను ఎదుటివారి హావ భావాలను గ్రహించగల్గిన వాడై ఉండాలి. రాయబారి అయినవాడు నిజాయితీపరుడై నిపుణుడై ఉన్నత కుటుంబానికి చెందినవాడై ఉండాలని పేర్కొన్నాడు. ఈయన విశ్వాసపాత్రుడై మంచి జ్ఞాపక శక్తిని కల్గినవాడై ఉండాలి. భయరహితుడై, సమయోచితమైన నిర్ణయాన్ని తీసుకోగల్గినవాడై ఉండాలి. సైన్యమెప్పుడు సైనికాధికారి యొక్క ఆధీనంలో ఉండాలి. సైన్యం కోశాగారాన్ని, ప్రజలను, పాలకుడిని కాపాడుతుంది. యుద్ధం చేయలా, శాంతిని కుదుర్చుకోవాలా అని నిర్ణయించేది రాయబారి. స్నేహ సంబంధాలను కుదిర్చేది రాయబారి.

రాజ్యమెప్పుడు అంతర్జాతీయ సంబంధాలను పరిశీలిస్తూ ఉండాలి. ఆ విధంగా ప్రాబల్య సమతుల్యతను రాజ్యం సాధించడానికి అవకాశం ఉంది. రాజ్యమెప్పుడు ఇరుగు పొరుగు రాజ్యాల విధానాలను చర్యలను గమనించవలసిన ఆవశ్యకత కలదు. 12 రాజ్యాల మండలంలో ప్రాబల్యతను సాధించడానికి రాజ్యాలు ప్రయత్నిస్తాయి. దౌత్యపరమైన సంప్రదింపులు శాంతియుతమైన పరిస్థితులలోనే జరుగుతాయి. శాంతి పరిరక్షణకు దౌత్యవిధానమే సరియైన మార్గమని మనువు భావించడం జరిగినది. శాంతి పరిరక్షణ రాజ్యం యొక్క ప్రధాన లక్ష్యం.

## 1.19 రాజ్యం యొక్క విధులు:-

రాజ్యానికి రెండు ప్రధాన విధులు కలవు. 1. శాంతి పరిరక్షణ, 2. బయట నియంత్రణ నుండి స్వాతంత్ర్యాన్ని కాపాడటం. రాజ్యం ప్రధానంగా ప్రజా సంక్షేమాన్ని కాపాడవలసిన ఆవశ్యకత కలదు. రాజ్యం కుటుంబాల మధ్య, తెగల మధ్య వివాదాలను పరిష్కరించేదిగా ఉండాలి.

రాజ్యం వైశ్యులను వ్యాపార వాణిజ్యాలను నిర్వహించడం, శూద్రులు బ్రాహ్మణ క్షత్రియ వైశ్యులకు సేవలను అందించేలా చూస్తుంది. ఈ చాతుర్ వర్ణాలు వారికి అప్పగించిన విధులను నిర్వర్తించనట్లయితే రాజ్యంలో అరాచక స్థితి ఉంటుందని మనువు భావించడం జరిగినది.

రాజ్యం విద్యను అభివృద్ధిపరిచే విషయంలో కూడ శ్రద్ధ తీసుకోవలసిన ఆవశ్యకత కలదు. విద్యాభ్యాసం ముగించిన తరువాత ఉపాధ్యాయులుగా పని చేయడం జరుగుతుంది. విద్య రాజ్యానికి గొప్ప సంపద వంటిది. బ్రాహ్మణులు వేదాలను అధ్యయనం చేయడానికి ప్రోత్సహించడం జరుగుతుంది. రాజ్యం ఉపాధ్యాయుల పై ఏ విధమైన పన్నులను విధించడం జరగదు. వారు విద్యను వాటి ప్రమాణాలను సంరక్షించే వారు, వారు జ్ఞానప్రతీకలు.

గర్భవతియైన స్త్రీ పైన, సన్యాసి పైన, బ్రాహ్మణుని పైన ప్రభుత్వం పన్నులను విధించదు. రాజ్యం మైనర్ యొక్క ఆస్తిని సంరక్షిస్తుంది. అతని విద్య పూర్తయ్యేవరకు అతనికి యుక్త వయస్సు వచ్చే వరకు మైనర్ ఆస్థిని రాజ్యం సంరక్షిస్తుంది.

రాజ్యం సంతానం లేని స్త్రీలను, విధవలను, బలహీనుల సంరక్షణ బాధ్యత రాజ్యానికి ఉంది. ఎవరైనా ఆస్థి హక్కుదారుడు పరారై మూడు సంవత్సరాలు కావచ్చినట్లయితే అతని ఆచూకీని కనుగొని ఆస్థి అతనికి అప్పగించే బాధ్యత రాజ్యానికి ఉంది. గుడ్డి, కుంటి, మతిభ్రమించిన వాడు, బ్రాహ్మణుని సేవలో ఉన్న వారి నుండి కూడ పన్నులను వసూలు చేయరాదు. రాజ్యం లంచగొండులను, మోసగాళ్ళను, వేషదారులను శిక్షిస్తుంది.

గర్భవతియైన స్త్రీ కాని, అత్యవసర పరిస్థితులలో పిల్లలు నేరం చేసినట్లయితే వారిని క్షమించి వారి వద్ద నుండి కొంత మొత్తంలో జరిమానాను తీసుకొనడం జరుగుతుంది. నాల్గు వర్ణాల ప్రజలు తమకు అప్పగించిన విధులను నిర్వహించినప్పుడు మాత్రమే సమాజ క్రమం కొనసాగుతుంది. సామాజికపరంగా శాంతిని, సౌభాగ్యాన్ని, సంక్షేమాన్ని పరిరక్షించడమే రాజ్యం యొక్క ప్రధాన విధి.

మనువు వివరించిన రాజకీయ వ్యవస్థలో శ్రమ విభజన సిద్ధాంతం పై ఆధారపడి ఉంది. క్షత్రియుడు రాజకీయ వ్యవస్థలో పాలకునిగా ప్రముఖ పాత్రను నిర్వహించడం జరుగుతుంది. క్షత్రియుడు పాలనా వ్యవస్థలో కీలక పాత్రను నిర్వహించడం జరుగుతుంది. పాలకుడు వేదాలతో పాటు ఉన్నత విద్యను అభ్యసిస్తాడు. విద్య అనేది రాజకీయ కార్యకలాపాలలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తుంది. రాజుకు విద్యతో పాటు స్వీయ నియంత్రణ మరియు క్రమశిక్షణ చాల అవసరం. రాజు అవసరమైనప్పుడు ప్రజా సంబంధాలలో త్వరితగతిన నిర్ణయం తీసుకోవలసి ఉంటుంది. ఈ విధంగా పని చేయాలంటే రాజుకు సునిత పరిశీలనతో పాటు సమయోచితంగా ఆలోచించే పరిజ్ఞానం ఉండాలని పేర్కొన్నాడు.

## 1.20 ముగింపు:-

ధర్మశాస్త్రం కేవలం సామాజిక సంబంధాలను తెలియజేసే శాస్త్రమని చెప్పడానికిని వీలు లేదు. ఇది ప్రస్తుతం మానవ జీవన సరళులను తెలియ చేసే శాస్త్రంగా ఉంది. మను ధర్మశాస్త్రం వేదాలలో ఉన్నంప్రధాన అంశాలను ఆధారంగా సామాజిక తత్వాన్ని వివరించడం జరిగినది. మనువు యొక్క ప్రధాన ఉద్దేశం ఈ ధర్మశాస్త్రం సామాజికంగా అన్వయింపచేసినట్లయితే సమగ్రమైన మానవ సామాజిక క్రమం ఏర్పడుతుందని పేర్కొన్నాడు.

మనువు తన యొక్క పరిశోధనలో ప్రధానంగా మానవ సంక్షేమం కోసం విద్య సామాజిక కట్టుబాట్లు, సాంప్రదాయకమైన ఆచార వ్యవహారాలను గూర్చి, కట్టుబాట్లను గూర్చి మరియు సామాజిక విధులు, పద్ధతులు, ఆహారపు అలవాట్లు, స్త్రీ యొక్క స్థాయి మరియు ఆఖరి దశలో మానవుడు నిర్వహించవలసిన విధులు మొదలైన అంశాలను గూర్చి వివరించడం జరిగినది. మానవ జీవన విధానం ఆదిమ స్థితిలో ఏ విధంగా ఉండేదో దానిలో పరిణామాత్మక మార్పులను గూర్చిన వివరణ సంపూర్ణంగా లేదు. ఈయన వర్ణ వ్యవస్థ శ్రమ విభజన సిద్ధాంతానికి అనుగుణంగా ఉంది. అనాది నుండి స్త్రీకి స్వాతంత్ర్యాన్ని వ్యతిరేకించినప్పటికి స్త్రీని బానిసగా చూడడానికి ఇష్టపడలేదు. ఆమెకు సమాజంలో గౌరవ స్థానాన్ని కల్పించాలని పేర్కొన్నాడు. గృహ సంబంధమైన బాధ్యతా నిర్వహణలో భర్తకు స్నేహితురాలిగా వ్యవహరిస్తుందని పేర్కొన్నాడు. పితృస్వామ్య సమాజాన్ని మనువు సమర్థించాడు. మనువుకుటుంబ వ్యవస్థకు వివాహానికి ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినాడు. స్త్రీ, పురుష సమానత్వాన్ని ఈ యుగంలో అంగీకరించలేదు. భారతీయ సాంప్రదాయంలో సమన్వయ పాలన లేదు అనే అంశం మను స్మృతి ద్వారా స్పష్టమౌతుంది. చట్టం యొక్క ఆధారాలను గూర్చి వివరించి నాడు న్యాయ వ్యవస్థను గూర్చి కూడ స్పష్టంగా తెలియ చేయడం జరిగింది. భారత రాజనీతి తత్వంలో మనువు చేసిన రాజ్య విశ్లేషణ విశేషమైనది. పరిపాలనా విధానాలను గూర్చి న్యాయపరమైన అంశాలను గూర్చి మొట్ట మొదటిసారిగా మనువు వివరించడం జరిగినది.

## 1.21 మాదిరి ప్రశ్నలు :-

1. సామాజిక వ్యవస్థ పై మనువు యొక్క అభిప్రాయాలు?
2. రాజ్యము యొక్క విధులను గూర్చి వ్రాయుము?
3. స్త్రీల పై మనువు యొక్క అభిప్రాయాలు?

## 1.2 ఆధార గ్రంథాలు:-


1. Manu Smurithi A Sociological Analysis - Dupali Bhargava
2. Indian Political Traditions - H.H. Das, PSN Patro
3. The Social & Political Thought - Clarisso of Dr.S.Radha Krishnan Rodigeus
4. The Status of Women in Ancient India - Mtilal Banarsidas, India
5. Manu Smuriti - Kumar, Surendra
6. Women in Ancient India - Badan Clarisse
7. The Law of Manu - Buhdu George

పాఠం - 1a

# కౌటిల్యుని అర్థశాస్త్రం

## 1a.0 లక్ష్యం :-

కౌటిల్యుడు వ్రాసిన ప్రధాన గ్రంథం అర్థశాస్త్రము రాజనీతి తత్వంలో బహుముఖ ప్రాధాన్యత సంతరించుకున్నది. అంతర్గతంగా సామాజిక జీవనాన్ని గూర్చి, బహిర్గతంగా సార్వభౌమాధికారాన్ని గూర్చి అధ్యయనం జరిగింది. రాజ్య భౌగోళిక అంశాల పై చట్టము, ధర్మము పై, రాజ్య విస్తరణకు మార్గాన్ని గూర్చి తెలుసుకొనుట ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :-


1a.0 లక్ష్యం

1a.1 పరిచయం

1a.2 అర్థశాస్త్రం యొక్క ప్రాధాన్యత

1a.3 రాజు

1a.4 రాజ్య భౌగోళిక అంశాల పై కౌటిల్యుని భావనలు

1a.5 గ్రామ పరిపాలన

1a.6 చట్టము, ధర్మము పై కౌటిల్యుని అభిప్రాయాలు

1a.7 రాజ్య నిర్మాణం

1a.8 ప్రభుత్వ సిద్ధాంతం

1a.9 మంత్రులు

1a.10 పరిపాలనా కళ

1a.11 అధ్యక్ష ప్రకారాలు

1a.12 రాజు ప్రజా కార్యకలాపాల నిర్వహణ

1a.13 రాజ్య విస్తర్ణకు మార్గాలు

1a.14 మతము, నైతికపరమైన అంశాల పై కౌటిల్యుని అభిప్రాయాలు

1a.15 సారాంశం

1a.16 మాదిరి ప్రశ్నలు

1a.17 ఆధార గ్రంథాలు


## 1a.1 పరిచయం :-

కౌటిల్యుడు జన్మ వృత్తాంతము గురించి మరియు అతని యొక్క నామాన్ని గురించి భిన్నాభిప్రాయాలు కలవు. ఈయన తక్షశిలలో జన్మించినాడనియు, ఈయనకు చాణుక్యడనియు, విష్ణు గుప్తుడనియు పేర్లు కలవని కాదంబరి నీతిసారంలో పేర్కొనడం

జరిగినది. కౌటిల్యుడు చంద్ర గుప్తుని సమకాలీనుడనియు, అతడు నందులను పడగొట్టి మగధ సామ్రాజ్యానికి రాజును చేశాడనియు కొన్ని చోట్ల పేర్కొనడం జరిగినది.

కౌటిల్యుడు వ్రాసిన ప్రధాన గ్రంథం అర్థశాస్త్రము. అర్థశాస్త్రాన్ని వ్రాసిన వారిలో కౌటిల్యుడు మొదటివాడు కాదు. ఈ అర్థశాస్త్రము అంటే భూమి సంపాదించి కాపాడటమని అర్థం (Acquisition and Preservation of Land). కౌటిల్యునకు ముందు మనువు, బృహస్పతి, ఉసానస్ అర్థశాస్త్రాన్ని వ్రాసారు. కౌటిల్యుని యొక్క అర్థశాస్త్రానికి ప్రధాన ఆధారాలు వారి రచనలు. ఈయన క్రీ॥పూ॥ 321 జీవించి ఉన్నాడనియు, ఆయన వ్రాసిన అర్థశాస్త్రం అప్పటిదని పేర్కొనడం జరిగినది. ఈ ఆధారాన్ని బట్టి కౌటిల్యుని అర్థశాస్త్రం క్రీ॥పూ॥ 321 నుండి 3000 మధ్యలో వ్రాసి ఉండవచ్చును.

కౌటిల్యుని అర్థశాస్త్రంలో 15 గ్రంథాలు కలవు. మొత్తం 150 అధ్యాయాలు కలవు. ఆరు వేల శ్లోకాలు ఉన్నాయి. పురాతన అర్థశాస్త్రం పురాణాలను అధర్వ వేదంలో భాగంగా ఉండేవి. దానిని ఉపదేశం అని కూడ పిలవడం జరిగినది. దీని యొక్క ప్రధాన ఉద్దేశమేమనగా భౌతిక ప్రపంచంలో విజయాన్ని సాధించడం దీని యొక్క లక్ష్యం. ఎక్కువ భాగం వ్యవసాయ, పశువుల పెంపకం ఆనాడు వారి ప్రధాన వృత్తిగా ఉండేది. ఈ ప్రపంచంలో వ్యక్తికి కావలసిన ఐశ్వర్యాన్ని పొందటమెలా అనే అంశాల గూర్చి చర్చించడం జరిగినది. దీనినే అనివిక్షకి అనే వారు. దీనిలోరాజుల యొక్క విజయాలను గూర్చి, వారి రాజ్యాల అభివృద్ధిని గూర్చి కూడ చర్చించడం జరిగినది. కౌటిల్యుని అర్థశాస్త్రం చాతుర్ వర్ణాలకు ప్రాధాన్యతనిచ్చినది. ధర్మ, అర్థ, కామ, మోక్షాలు నాల్గింటికి సమాన ప్రాధాన్యత ఇవ్వడం జరిగినది. కౌటిల్యుడు వివాహాన్ని, కుటుంబాన్ని వ్యక్తిగత ఆస్థికి కూడ ప్రాధాన్యతను ఇచ్చాడు. ఈ వ్యవస్థలన్ని మంచి నైతిక జీవనాన్ని అందించడానికి దోహదం చేస్తాయని పేర్కొన్నాడు.

## 1a.2 అర్థశాస్త్రం యొక్క ప్రాధాన్యత :-

అర్థశాస్త్రం భారత రాజనీతి తత్వంలో బహుముఖ ప్రాధాన్యత సంతరించుకొన్నది. రాజ్య యంత్రాంగాన్ని గూర్చి భారతీయ శైలిలో వివరించినాడు. ఇది ఐరోపా రాజనీతి తత్వాన్ని వాస్తవికతా దృక్పథంతో అధ్యయనం చేసినాడు. కౌటిల్యుడు మత, రాజకీయాలను వేరు చేసినాడు. రాజకీయ సమస్యలను మతపరమైన తత్వం ద్వారా ఈయన విశ్లేషణ చేయలేదు. కౌటిల్యుడు స్థానికమైన పద్ధతులను ఆయా తెగల యొక్క సంప్రదాయాలను ఆ రాజ్యంలోని సాధారణ చట్టాన్ని ఆధారంగా చేసుకొని తను విశ్లేషణ చేయడం జరిగినది.

అర్థశాస్త్రంలో ప్రాచీన సంప్రదాయాన్ని శాస్త్రబద్ధంగా విశ్లేషణ చేయడం జరిగినది. చరిత్ర అనేది కేవలం వ్యక్తుల మధ్యన ఉత్పన్నమైన పగ, ప్రతీకారాల వలన అభివృద్ధి చెందలేదు. ఇది మానవుని యొక్క మేధాసంపత్తి వలన అభివృద్ధి చెందినది. మానవ అనుభవాల ఫలితంగా వచ్చినది చరిత్ర.

అర్థశాస్త్రం రాజరిక వ్యవస్థను అధ్యయనం చేసేది. రాజ్య విస్తరణను గూర్చి వివరించేది మరియు ఆర్థికపరమైన సంస్థలు, వాటి యొక్క అభివృద్ధి ద్వారా అవి ఎంతమేరకు యుద్ధానికి తమ వంతు సహకారాన్ని అందించగలవనే అంశాన్ని కూడా అంచనా వేయడం రాజ్యం యొక్క ఆర్థిక సైనిక అవసరాలను గుర్తించి ఉన్న ఆర్థిక వనరులను వీలైనంత ఎక్కువగా వినియోగించుకొనుట ఎలా అనే విషయాన్ని విశ్లేషణ చేయడం జరిగినది. రాజ్యాల మధ్య సంబంధాలను కూడ విశ్లేషణ చేయడం జరిగినది.

అర్థ శాస్త్రంలో రెండు ప్రధాన అంశాలు ఉన్నాయి.

1. అంతర్గతంగా సామాజిక జీవనాన్ని గూర్చి బహిర్గతంగా భారత సార్వభౌమాధికారాన్ని గూర్చి అధ్యయనం చేయడం జరిగినది. రాజు ప్రధాన కార్యనిర్వహణాధికారి. రాజు రాజ్యాధికారిగా, ప్రధాన కార్య నిర్వహణాధికారిగా అనేక కార్యకలాపాలను నిర్వహిస్తాడు. ఈయన రాజ్యాధికారి రాజ్యంలో ఉద్యోగిస్వామ్యానికి అధికారి. రాజ్యాంగ సంరక్షుడు, రాజ్య యంత్రాంగాన్ని నియంత్రించే వాడు మరియు ప్రజానాయకుడు కౌటిల్యుని అభిప్రాయంలో రాజ్యం సప్తాంగాలను కలిగి ఉంటుంది.

1. రాజు, 2. అమాత్యుడు, 3. ప్రజలు, 4. కోట, 5. సైన్యం, 6. మిత్రుడు, 7. కోశాగారము.

## 1a.3 రాజు :-

రాజు రాజ్యానికి సర్వాధికారి. రాజు లేని రాజ్యంలో మత్స్య న్యాయం నడుస్తుందని పేర్కొన్నాడు. రాజుకి ప్రభుత్వంలోను, రాజకీయాలలోను ఉన్నత స్థానం కలదు. రాజు యొక్క అధికారమే అన్ని కార్యకలాపాలకు మూలం. రాజు నైతికమైన, చట్టబద్ధమైన, సార్వభౌమాధికారి. రాజు ఉన్నత కుటుంబాకి చెందినవాడై ఉండాలి. రాజు వ్యాయామాలలో ప్రవీణుడై, శక్తివంతుడై, ధైర్యశాలి అయి ఉండాలి. రాజు మతపరమైన విశ్వాసాన్ని కల్గి ఉండాలి. రాజు సమయ స్ఫూర్తితో త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలి. రాజు ప్రజల యొక్క గౌరవాన్ని, మన్ననలను పొందేవాడై ఉండాలి. రాజు పరిపాలనా కళలో నైపుణ్యాన్ని సంపాదించాలి. రాజు శత్రువులను ఓడించే సమర్థతను కల్గి ఉండాలి. రాజు అన్ని అలవాట్లకు అతీతుడుగా ఉండాలి. రాజు ఇంద్రియ నిగ్రహము కల్గినవాడై ఉండాలి.

రాజు ప్రధాన కార్యనిర్వహణాధికారి. రాజ్య పరిపాలనలో నిర్ణయాన్ని ఆయన యొక్క నిర్దిష్టాధికారంలోనే జరుగుతాయి. రాజు సర్వసైన్యాధికారి. న్యాయ పరిపాలన మొత్తం రాజు యొక్క ఆధీనంలోనే ఉంటుంది. సామాజిక సంస్థలన్నింటి పైన పరిమితులను విధించే అధికారం కలదు.

రాజు వర్ణాశ్రమ ధర్మాలను పాటించే వానిగా ఉండాలి. రాజు తన ప్రజలను కన్నబిడ్డల వలె చూచుకొను వాడై ఉండాలి. ప్రకృతి భీభత్సాలు, కరువు కాటకాలతో ప్రజలు బాధపడుతున్నప్పుడు వారికి కావలసిన సౌకర్యాలను అందించడంతో పాటు ఆహారాన్ని అందించాలి. రాజు ప్రజా ప్రయోజనాన్ని తన ప్రయోజనంగా భావించాలి. రాజు నైతిక ప్రమాణాలను కాపాడేవాడుగా ఉండాలి.

రాజు పరిపాలనా కార్యకలాపాలలో కేంద్ర బిందువు వంటివాడు. రాజు కొన్ని అధికారాలను తన సేవకులకు బదిలీ చేయడం జరుగుతుంది. తద్వారా ప్రజల యొక్క సమిష్టి పనులను నిర్వహించడం జరుగుతుంది. వారిలో సమర్థులైన వారు నిర్వహించే సేవలను మెచ్చుకొని వారికి కొన్ని ప్రత్యేక సౌకర్యాలను కల్పించడం జరుగుతుంది.

రాజు పరిపాలనా కార్యకలాపాలను నిర్వహించడానికి కాలాన్ని 16 భాగాలుగా విభజించటం జరిగినది. ఒక్కొక్క భాగాన్ని నాలిక అని పిలవడం జరుగుతుంది. పగలు 8 నాలికలు, రాత్రి 8 నాలికలుగా విభజించటం జరుగుతుంది. నాలిక యొక్క కాలవ్యవధి $1\frac{1}{2}$ గంటలు.

మొదటి భాగంలో రక్షణ ఏర్పాట్లకు సంబంధించిన చర్యలు, ఆదాయం వ్యయం మొదలైనవి.

రెండవ భాగంలో ప్రజల వద్ద నుండి వచ్చిన ఫిర్యాదులను పరిశీలించడం.

మూడు, నాలుగు నాలికలలో విశ్రాంతి మరియు అధ్యయనం జరుగుతుంది.

ఐదవ నాలికలో వివిధ శాఖాధిపతుల నుండి వచ్చిన ద్రవ్యాన్ని తీసుకొనడం.

ఆరవ నాలికలో ఉత్తర ప్రత్యుత్తర కార్యక్రమాలు జరుగుతాయి. వార్తాహరుల నుండి, గూఢచారుల నుండి వచ్చిన వర్తమానాలను వినడం.

ఏడు, ఎనిమిది నాలికలలో చతురంగ బలాలను పర్యవేక్షించటం, వివిధ దళాధిపతులతో చర్చలు.

తొమ్మిదవ నాలిక సాయంకాలం ప్రార్థనలు నిర్వహించడం, గూఢచారులతో రాత్రి మొదటి భాగంలు గడపడం.

11, 12 మూడు గంటల పాటు నిద్ర పోవడం. మరుసటి రోజు చేయవలసిన పనులను గూర్చి ఆలోచించడం.

13వ నాలికలో మంత్రులతో సమాలోచనలు, గూఢచారులను బయటకు పంపడం.

14వ నాళికలో రాత్రి చివరి భాగంలో పురోహితులతో ఆశీర్వచనాలు, వైద్యులు, భవిష్యతుని గూర్చి చెప్పే వారితో సంభాషణలు సల్పుట.

15, 16 నాళికలలో దర్బారు హాలులో ప్రవేశించి ప్రజలను కలవడం.

రాజు పైన పేర్కొన్న సమయాలలో అవసరాన్ని బట్టి మార్పులు, చేర్పులు చేయవచ్చును. కొన్ని సందర్భాలలో కొన్ని కార్యక్రమాలను రద్దు చేయవచ్చును.

రాజు ప్రజల యొక్క వివాదాలను పరిష్కరించడంలో ప్రముఖ పాత్రను నిర్వహించేవాడు. రాజు విదేశీ సంబంధాలను నిర్వహిస్తాడు. తన స్నేహితులతో, శత్రువులతో ఏ విధంగా ప్రవర్తించవలెనో నిర్ణయించేది, రాజు ఆర్థిక వనరులు అన్నింటి పై నియంత్రణ కల్గి ఉండి వచ్చే ఆదాయం పైన, ఖర్చు పైన తన పర్యవేక్షణ ఉంటుంది.

ఈ కార్యక్రమాలను సక్రమంగా నిర్వహించడానికి ఉన్నతాధికారును నియమించడం జరుగుతుంది.

## 1a.4 రాజ్య భౌగోళిక అంశాల పై కౌటిల్యుని భావనలు :-

రాజ్యం యొక్క సైనిక మరియు రాజకీయ భావనలను ఆర్థిక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకొని రాజ్య భౌగోళిక అంశాలను నిర్ణయించడం జరుగుతుంది.

కౌటిల్యుడు జనపద నిర్మాణానికి కావలసిన లక్షణాలను వివరించాడు.

1. కోట నిర్మాణానికి కావలసిన స్థలం ఏర్పాటు ఉండాలి.
2. కోటలో ప్రవేశించడానికి ఒక ద్వారం బయటకు పోవటానికి మరియొక ద్వారాన్ని నిర్మించాలి.
3. ప్రమాదం జరిగినప్పుడు రక్షణ ఏర్పాట్లకు అనుగుణంగా ఉండాలి.
4. రాజ్య ప్రజల యొక్క అవసరాలను తీర్చేదిగా ఉండాలి.
5. రాజ్యంలో ప్రజలు శత్రువు పట్ల ద్వేష భావనతో మెలగాలి.
6. సామంతులు రాజుకు విధేయులై ఉండాలి.
7. రాజ్యంలో పరస్పర విరుద్ధమైన భావనలతో వున్న శత్రు వర్గాలు ఉండరాదు.
8. రాజ్యంలో పనికిరాని బీడు భూములు ఉండరాదు.
9. క్రూర మృగాలతో, అడవులతో రాజ్యం ఉండరాదు.
10. వ్యవసాయ భూములు, గనులు, అడవులు, వన్య సంరక్షణకు అనుగుణంగా ఉండాలి.
11. పెంపుడు జంతువులకు, మనుషులకు అనుగుణంగా ఉండే ప్రాంతమై ఉండాలి.
12. రాజ్యం ఎప్పుడు వర్షపు నీటి పై ఆధారపడి ఉండరాదు.
13. వ్యాపార వాణిజ్యాలకు అనువైన ప్రదేశమై ఉండాలి.
14. రాజ్యంలో భూ, జల మార్గం రెండు ఉండాలి.
15. రాజ్యంలో ప్రజలు జరిమానాలు, పన్నులు చెల్లించే వారుగా ఉండాలి.
16. వ్యవసాయదారులు కష్టించి పనిచేసే వారై ఉండాలి. తెలివైన వారై ఉండాలి.
17. తక్కువ వర్ణానికి చెందిన ఎక్కువ జనాభా రాజ్యంలో ఉండాలి.

18. ప్రజల్లు విశ్వాస పాత్రులైన వారై ఉండాలి: కౌటిల్యుడు గ్రామీణ ప్రాంతాలు నగర ప్రాంతాల పై ఆధిక్యతను కల్గి ఉండాలని పేర్కొన్నాడు.

ఈ లక్షణాలు కల్గి ఉన్నప్పుడు కోట సంరక్షించబడుతుంది.

## 1a.5 గ్రామ పరిపాలన :-

గ్రామంలో 100 నుండి 500 కుటుంబాలు ఉంటాయి. ప్రతి గ్రామానికి సరిహద్దులు ఉంటాయి. గ్రామాధికారిని గ్రామిక అని పిలవడం జరుగుతుంది. ఈయన గ్రామ బృంద సహాయంతో అనేక పనులు నిర్వహించడం జరుగుతుంది.

(a) వీరు మైనర్ ఆస్తిని, మరియు దేవాలయాలను సంరక్షిస్తారు.

(b) సరిహద్దు తగాదాలను పరిష్కరిస్తారు.

(c) మతపరమైన, పరిపాలనా సంబంధమైన ఆస్తులను సంరక్షించడం జరుగుతుంది.

(d) కుటుంబ వ్యవస్థలో క్రమశిక్షణారాహిత్యానికి సంబంధించి వివాదాలను పరిష్కరించడం జరుగుతుంది.

(e) గ్రామంలో నిస్సహాయులకు, పేదలకు, వృద్ధులకు మద్దతునివ్వడం జరుగుతుంది.

## 1a.6 చట్టము, ధర్మము పై కౌటిల్యుని అభిప్రాయాలు :-

రాజ్యానికి, చట్టానికి సంబంధించి కౌటిల్యుడు వెల్లడించిన అభిప్రాయాలు అతని ముందు వారికంటే ఎక్కువ విశదంగా ఉన్నాయి.

(1) ధర్మశాస్త్రము

(2) వ్యవహార (వ్యవహారిక శాస్త్రం)

(3) సంస్థ

(4) న్యాయ.

రాజు చట్ట విశ్లేషణ చేసేటప్పుడు సమకాలీన చట్టాలను పరిశీలన చేయడం ద్వారా తీర్పునివ్వడం జరుగుతుంది.

కౌటిల్యుని అభిప్రాయంలో ఆస్థి విభాగాలు వారసత్వం మొదలైన వాటికి సంబంధించిన వివాదాలను సంప్రదాయబద్ధమైన ధర్మాన్ని ఆధారం చేసుకొని ఆయా ప్రాంతాన్ని బట్టి, కులాన్ని బట్టి మరియు వివిధ సంస్థలను బట్టి పరిష్కరించడం జరుగుతుంది. చట్టపరమైన అధికారం మరియు వివిధ పరిపాలనా శాఖలను ఆధారం చేసుకొని విశదీకరించడం జరుగుతుంది. చట్టపరమైన నాల్గు ఆధారాలతో పాటుగా రాజు యొక్క శాసన పరమైన అధికారం మరియు వివిధ పరిపాలనా శాఖలను ఆధారం చేసుకొని విశదీకరించడం జరిగినది.

కౌటిల్యుడు వాజ్యాలను 8 రకాలుగా విభజించడం జరిగినది.

(a) రాజు కార్యాలయానికి ఇచ్చే సూచనల ద్వారా చట్టబద్ధం కాని సంపద ఉన్నప్పుడు

(b) పాలకుడు ఇచ్చే బిరుదు ప్రధానాలు మరియు శిక్షలు వారి యొక్క సేవకులకు ఇతరులకు ఇచ్చేవి

(c) ఎవరికైనా గౌరవ ప్రధానాలు చేయడానికి

(d) తన దిగువన పని చేసే ఉద్యోగులు ఇచ్చే విన్నపాల పై సంతకాలు చేయడం జరుగుతుంది

(e) రాజు ఇచ్చే సమాధానాలు

(f) రాజు యాత్రికులకు ఇచ్చే రక్షణ ఏర్పాట్లతో పాటు కొత్తగా ఆక్రమించిన రాజ్య భాగాలలో శాంతిని నెలకొల్పుట. సత్సంప్రదాయాలను పరిరక్షించి చెడు అలవాట్లను పారద్రోలడం జరుగుతుంది.

(g) రాజు సివిల్ మరియు క్రిమినల్ చట్టాలకు లోబడి రాజకీయబద్ధతను పూర్తి చేయుగల్గుతాడు

(h) ధర్మపాలన కోసం రెండు రకాల న్యాయ స్థానాలను ఏర్పాటు చేసినాడు. ధర్మాదిష్ట, కంటక శోధన.

**ధర్మాదిష్ట:-** వ్యవహారికి సంబంధమైన సివిల్ వ్యాజ్యాలను చూడడం జరుగుతుంది.

**కంటక శోధన:-** కంటక శోధన అనగా సమాజానికివ్యతిరేకంగా చేసే నేరాలు. ఉద్యోగుల యొక్క చెడు ప్రవర్తన, వారు ప్రజా సంబంధమైన కర్తవ్యాలను నిర్వహించడంలో విఫలమైనప్పుడు ఈ న్యాయస్థానం ద్వారా చర్య తీసుకోవడం జరుగుతుంది. కంటక శోధన ప్రధాన లక్ష్యం సమాజంలో నేర వృత్తి అనే ముళ్ళను ఏరిపారవేయడం. ఈ నేరాలను కనుగొనుటకు కూడ చారులను నియమించడం జరుగుతుంది.

కౌటిల్యుని అభిప్రాయంలో చట్టానికి నాల్గు పాదాలు కలవు.

1. పవిత్ర శాసనం
2. ఒడంబడిక
3. సంప్రదాయం
4. రాజతీర్మానాలు.

దీనిని బట్టి రాజుకు న్యాయ సార్వభౌమాధికారం సూత్రాన్ని ఆచరించినట్లుగా వెల్లడిఅవుతుంది. దీనిని బట్టి రాజ శాసనానికి ఎక్కువ విలువ ఉన్నట్లు తేటతెల్లమవుతుంది. ఒక వేళ సమస్య ఉత్పన్నమైనట్లయితే రాజుదే అంతిమ తీర్పు అవుతుంది.

## 1a.7 రాజ్య నిర్మాణం :-

కౌటిల్యుడు గణతంత్ర రాజ్యాన్ని సమర్థించినాడు. ఈయన రాజరిక వ్యవస్థకు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినాడు. కౌటిల్యుడు రాజ రాజ్యాన్ని సమర్థించినాడు. రాజులేని ఎడల మత్స్య న్యాయం కొనసాగుతుంది. చిన్న చేపను పెద్ద చేప మింగినట్లుగా బలమున్న వాడు బలహీనుడిని హింసించడము జరుగుతుంది. రాజు అరాచకాన్ని నిర్మూలించి శాంతి పరిరక్షణ చేయగలడు. రాజు ఈ కార్య భారాన్ని నిర్వర్తించడం కోసం వ్యాపారుల ఆదాయంలో ఆరవ భాగాన్ని సేకరించడం జరుగుతుంది.

## 1a.8 ప్రభుత్వ సిద్ధాంతం :-

రాజు తన రాజ్య అంగాలన్ని అర్థవంతమైన రీతిలో పని చేయుచున్నవో లేదో గమనించడం జరుగుతుంది. రాజే అన్ని విభాగాలలో శాఖాదిపతులను నియమించి వారి ద్వారా రాజ్యంలో మానవ భౌతికపరమైన అంశాలన్నింటిని శక్తి వంతం చేసి అనుకోని ఉపద్రవాలు వచ్చినప్పుడు తగు రక్షణ ఏర్పాట్లు చేయడం జరుగుతుంది. చెడు ప్రవర్తన కల్గిన అధికారిని మార్చటం ద్వారా మంచి అధికారులను నియమించడం జరుగుతుంది. అన్ని రంగాలలో నిష్ణాతులైన వారికి బహుమతి ప్రధానం చేయడం జరుగుతుంది. క్రూర ప్రవృతి కల్గిన వారిని శిక్షించడం జరుగుతుంది.

కౌటిల్యుని అభిప్రాయంలో రాజు ఎప్పుడు ఉన్నత వంశీయుడై ఉండాలి. ఆ రాజునే ప్రజలు గౌరవిస్తారని పేర్కొన్నాడు. కౌటిల్యుని అభిప్రాయంలో రాజ్య సంక్షేమం రాజు యొక్క వ్యక్తిగత లక్షణాల పై ఆధారపడి ఉంటుంది. పాలకుని విద్య శిక్షణ కూడ అవసరమని కౌటిల్యుని అభిప్రాయంలో రాజుకు ఉపనయనం జరిగిన తరువాత చదవటం, వ్రాయడం గణితాన్ని నేర్పడం జరుగుతుంది. పవిత్ర శాసనాన్ని (త్రాయి) (అనివిక్షకి) తత్వశాస్త్రాన్ని, ఆర్థిక శాస్త్రాన్ని (వర్త) వివిధ శాఖాదిపతుల నుండి నేర్చుకొంటాడు. రాజకీయాలు

(దండనీతి) ఎవరైతే ఈ సిద్ధాంతాలను అధ్యయనం చేస్తారో వారి వద్ద నుండి నేర్చుకొంటాడు. 16 సంవత్సరాలు దాటే వరకు అధ్యయనం చేయడం జరిగినది. కౌటిల్యుని అభిప్రాయంలో పాలకుడు రెండు రకాలైన జ్ఞానాన్ని పొందుతాడు.

(1) సహజ జ్ఞానం

(2) గ్రహించటం ద్వారా వచ్చే జ్ఞానం.

రెండవ తరహా జ్ఞానం గురువుల నుండి నేర్చుకొనుట జరుగుతుంది. రాజు ఇంద్రియ నిగ్రహంతో ఈ విద్య నేర్చుకొనుట జరుగుతుంది. రాజు స్వీయ నియంత్రణను కల్గి ఉంటాడు. రాజు మంచి మేధాసంపత్తిని కల్గి, మంచి నడవడిని కల్గి ఉండాలి. రాజు సమస్యలు వచ్చినపుడు ఇబ్బందికరమైన పరిస్థితులలో సమయ స్ఫూర్తితో నిర్ణయాలను తీసుకొనే సామర్థ్యాన్ని రాజు కల్గి ఉండాలి. ప్రజల యొక్క ఆనందాన్ని తన యొక్క ఆనందంగా భావించేవాడు రాజు.

## 1a.9 మంత్రులు :-

కౌటిల్యుని అభిప్రాయంలో రాజు తన ప్రభుత్వాన్ని ఇతరుల సహకారం లేకుండా నడుపలేడు. అందువలన రాజు తప్పనిసరిగా మంత్రులను నియమించవలసి ఉంటుంది. మంత్రి పరిపాలనా సంబంధమైన విధులను నిర్వహిస్తాడు. జన పదాలను అభివృద్ధిపరచడం, అంతరంగికమైన, బాహ్యమైన అలజడుల నుండి ప్రజలను కాపాడటం, పోరంబోకు స్థలాలను అభివృద్ధిపరచడం, జరిమానాలను, పన్నులను విధించడం, రాజ్య భాగాన్ని అభివృద్ధిపరచడంలో మంత్రి ప్రేరక శక్తిగా వ్యవహరిస్తాడు. రాజు మంత్రుల నియామకంలో వారి యొక్క అర్హతను గమనించి నియమిస్తాడు. మంత్రులకు ధైర్యము, విశ్వసపాత్రత మరియు సాంకేతిక పరిజ్ఞానము ఉండాలని పేర్కొన్నాడు. రాజు మంత్రులను నియమించేటప్పుడు నాల్గు అంశాలలో వారిని పరీక్షించడం జరుగుతుంది.

1. సు/ుణము
2. సంపద
3. కోర్కె
4. భయం

రాజు కాని, రాణి కాని తమంత తాముగా ఈ పరీక్ష నిర్వహించిన తరువాత మంత్రులను నియమించడం జరుగుతుంది. కౌటిల్యుని అభిప్రాయంలో రాజు ఒకరు లేక ఇద్దరితో రహస్య సమాలోచనలు సల్పడం ద్వారా నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. కౌటిల్యుడు ఎక్కువ మంది మంత్రులు ఉండడాన్ని బలపరచినాడు.

## 1a.10 పరిపాలనా కళ :-

కౌటిల్యుడు రాజుకు పరిపాలనా కళలో సామర్థ్యాన్ని కల్గి ఉండాలని పేర్కొన్నాడు. ఈ పరిపాలన పౌర సైనిక సంబంధమైనదిగా ఉంటుంది. రాజు సైన్యాన్ని, రెవిన్యూని తన ఆధీనంలో ఉంచుకొంటాడు. కౌటిల్యుని అభిప్రాయంలో వివిధ పాలనా శాఖాధికారులు మెరిట్ ప్రాతిపదికగా ఎంపిక చేయుటం జరుగుతుంది. కౌటిల్యుని అభిప్రాయంలో సైన్యంలోని నాల్గు దళాలు ఏనుగులు, ఆయుధ సేన, రథ బలం మరియు కాల్ బలం నలుగురు ఉన్నతాధికారుల ఆధీనంలో ఉండాలి.

## 1a.11 అధ్యక్ష ప్రకారాలు :-

కౌటిల్యుని అర్థశాస్త్రంలోని రెండవ గ్రంథంలో నగర ప్రణాళిక, కోట నిర్మాణము మరియు ఆర్థికపరమైన పరిపాలనను 30 మంది అధ్యక్షులను నియమించడం జరిగినది. ఇది ప్రాచీన భారతీయ సంస్కృతిలో కీలకమైనది. కౌటిల్యుడు ప్రధానంగా ఉద్యోగ బృంద పాలన పై తన యొక్క దృష్టిని కేంద్రీకరించడం జరిగినది. ఇది ప్రాచీన భారతీయ సంస్కృతిలో కీలకమైనది. కౌటిల్యుడు

రాజ్యంలో రాజకీయ ఆర్థిక, సాంఘికపరమైన కార్యకలాపాలను దృష్టిలో ఉంచుకొని దానిని నిర్వహించడం జరిగినది. ఈయన రాజ్య విషయాలలో అప్రమత్తంగా ఉన్నప్పుడే సేవకు అప్రమత్తంగా ఉంటారు. ఆ విధంగా రాజా శత్రువుల మీద ఆధిక్యతను కల్గి ఉంటాడు. రాజు తన దిగువన ఉన్నవారి పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ ఉండాలి అని పేర్కొన్నాడు. ప్రజల యొక్క ప్రయోజనాలే తన ప్రయోజనాలుగా భావించాలి.

## 1a.12 రాజు ప్రజా కార్యకలాపాల నిర్వహణ :-

రాజు ప్రజానురంజకమైన పాలనను అందించాలి. రాజుకు పంటలో 1/6 వంతు, వ్యాపారంలో 1/10 వంతు ఆదాయాన్ని ఇవ్వాలి. రాజు ఈ ధనాన్ని ప్రజావసరాలకు వినియోగిస్తాడు. రాజు తప్పు చేసిన వారిని శిక్షించటం, జరిమాన విధించడం ద్వారా ప్రజలకు రక్షణ, వారి సంక్షేమాన్ని చూడటం జరుగుతుంది.

కౌటిల్యుడు రాజు యొక్క నిరుపేక్ష అధికారాన్ని మూడు కోణాల ద్వారా విశ్లేషించినాడు. దండనీతి అనగా రక్షణ శాంతి సౌభాగ్యాలను పరిరక్షించే మూడు శాస్త్రాలను అధ్యయనం చేయవలసిన ఆవశ్యకతను గుర్తించినాడు. ఇవి పవిత్ర శాసనం, తత్వ శాస్త్రం మరియు ఆర్థిక శాస్త్రం. ఈ ప్రాపంచిక సంబంధమైన అవసరాలను తీర్చడానికి ఈ దండాన్ని ఉపయోగించడం జరుగుతుంది. ఈ దండనీతి అన్నింటికి ఆధార భూతమైనది. మానవ జీవన మనుగడకు ఈ దండనీతి యొక్క ఆవశ్యకత కలదు.

## 1a.13 రాజ్య విస్తర్ణకు మార్గాలు :-

కౌటిల్యుడు తన అర్థశాస్త్రంలో నాల్గు విభాగాలలో కోటను ముట్టడించే మార్గాలను గూర్చి వ్రాసినా దానికి 5 రకాల పద్ధతులను పేర్కొన్నాడు.

1. శత్రువుల మధ్య విభేదాలను సృష్టించడం ద్వారా
2. రహస్య పద్ధతుల ద్వారా శత్రువును వదిలించుకొనడం
3. గూఢచారుల నియామకం
4. కోటను సైన్యం ద్వారా ఆకస్మికంగా ముట్టడించటం
5. కోటను ఆక్రమించటం

ఈ కోటను ఆక్రమించే 5 పద్ధతులు కాకుండా మరియొక నాల్గు పద్ధతులను గూర్చి చెప్పినాడు.

1. రాజు సామ్రాజ్యాన్ని విస్తరణ చేసేటప్పుడు శత్రు పక్షంలో తటస్థంగా ఉన్న రాజును నియంత్రించిన తరువాత శక్తివంతమైన రాజుని అణచడానికి ప్రయత్నించడం జరుగుతుంది.
2. రాజు తన యొక్క ఆధిక్యతను ప్రదర్శించడం ద్వారా శత్రువును అధిగమించగల్గుతాడు.
3. రాజు శత్రువును రెండు మార్గాల ద్వారా హతమార్చగల్గుతాడు. శత్రువును శత్రువు యొక్క శత్రువు ద్వారా, శత్రువుని తన యొక్క మిత్రుని ద్వారా నియంత్రించగల్గుతాడు.
4. రాజు తన శక్తిని ఉపయోగించడం ద్వారా తన సామంతునితో అధిగమించగల్గుతాడు. దీని వలన తన శక్తి రెండింతలవుతుంది. ఆ శక్తితో మరియొక సామంతుని నియంత్రించడం జరుగుతుంది.

కౌటిల్యుడు నాల్గు పద్ధతులను ఉపయోగించి రాజ్యంలో తన సామంతులందరిని నియంత్రించగల్గుతాడు. రాజ్య రక్షణకు కౌటిల్యుడు నాల్గు రకాల పద్ధతులను ఉపయోగించినాడు.

1. రక్షణ విధానం
2. గ్రామీణ నగరాల యొక్క విభజన
3. అత్యవసర పరిస్థితులలో ఆర్థిక విధానం
4. అంతర్ రాజ్య సంబంధాలు

1. **రక్షణ విధానం:-** కౌటిల్యుడు రాజు వ్యక్తిగత రక్షణకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినాడు. రాజు యొక్క రక్షణ మీద రాజ్యం యొక్క రక్షణ ఆధారపడుతుందని పేర్కొన్నాడు. రాజు జన్మించినప్పటి నుండి అతనికి రక్షణ ఏర్పాట్లు చేయబడతాయి. కొన్ని సందర్భాలలో రాజుని తన కొడుకుల నుండి కూడ కాపాడవలసి ఉంటుంది. స్వీయ నియంత్రణ కల్గిన రాజు సైన్యాధికారిగా నియమించబడతాడు. రాజుకు ఈ పనులు నిర్వహించడానికి తగిన విద్య, శిక్షణ కూడ ఇవ్వబడుతుంది.

రాజు తన దిగువన ఉన్న ఉన్నతాధికారుల ప్రవర్తనను ఎప్పటికప్పుడు తనిఖీ చేయవలసి ఉంటుంది. అవసరమైనచో సాంకేతిక నిపుణత కల్గిన గూఢచారి వ్యవస్థను కూడ ఏర్పాటు చేయవలసిన అవశ్యకతను గుర్తించినాడు. ఈ గూఢచారి వ్యవస్థని తొమ్మిది వర్గాలుగా విభజించినాడు. వీరు రాజు కార్యాలయాధికారులు, ఇతర రాజ్యాల రాజోద్యోగులు, రైతులు, సన్యాసులు, వైద్యులు, వివిధ వృత్తుల వారు గూఢచారులుగా ఉండేవారు.

కౌటిల్యుడు రాజు విశ్వాసరహితంగా ప్రవర్తించే ఉద్యోగులను శత్రు రాజు దుశ్చర్యలను పసిగట్టడం ద్వారా శత్రు కూటమి నుండి తనను తాను కాపాడుకోవలసి ఉంటుంది. ఈ విధమైన ప్రవర్తన ఉన్న వారికి నాల్గు లక్షణాలు ఉంటాయి. కోపం, భయం, పిసినారితనం మరియు గర్వం. ఈ లక్షణాలు ఉన్నవారు రాజుకు వీలైనంత అనుకూలంగా ఉండి వారిని తన మార్గం వైపు మళ్ళించడానికి ప్రయత్నించాలి. శత్రు కూటమిలో ఉన్న వారిని సంప్రదింపుల ద్వారా లేక లంచము ఇవ్వడం, వాటి వల్ల సాధ్యం కానప్పుడు వారి మధ్య కలహాలను రేపడం ద్వారా ఒకరి పై ఒకరికి ద్వేష భావం కల్పించడం ద్వారా తన పనిని సానుకూలపరచడం జరుగుతుంది.

2. **గ్రామీణ నగర ప్రాంతాలు:-** కౌటిల్యుడు భౌగోళికవసరమైన సౌకర్యం కోసం గ్రామీణ ప్రాంతాలకు ఉండవలసిన లక్షణాలను గూర్చి వివరించినాడు. నాల్గు రకాలైన కోట నిర్మాణాలు నాల్గు సరిహద్దులలో నిర్మించాలని సూచించినాడు. నగర నిర్మాణం కోసం ప్రణాళికను రూపొందించినాడు.

నగర నిర్మాణం గ్రామాలకు మధ్యన నిర్మాణం చేయాలని పేర్కొన్నాడు. ఈ విధమైన నిర్మాణం ద్వారా గ్రామాల నుండి రెవిన్యూను కోశాగారానికి అప్పగించవచ్చును. మార్కెట్‌లో వివిధ వస్తువుల వ్యాపారానికి అనువుగా ఉంటుందని పేర్కొన్నాడు. కౌటిల్యుడు రక్షణ ఏర్పాట్లకు నాల్గు వైపుల గోడలున్న మైదానాలు, గోడలు, రోడ్ల నిర్మాణాలను గూర్చి వివరించినాడు. రాజధాని నగర నిర్మాణం విశాలమైన రోడ్లు, రాజు యొక్క గృహ నిర్మాణాన్ని మిగిలిన గృహాల నిర్మాణాలను గూర్చి వివరించినాడు. వివిధ పరిపాలనాంగాలను గూర్చి వ్యాపారుల దుకాణాలను గూర్చి మరియు వివిధ సామాజిక వర్గాల యొక్క గృహ నిర్మాణాలను గూర్చి వివరించినాడు. ఈ నిర్మాణాల రక్షణ సరిహద్దులు, పరిపాలన, సైనిక మరియు వ్యాపార కేంద్రాలు రాజ్యంలో నిర్మించినాడు.

3. **అత్యవసర పరిస్థితిలో రాజ్య ఆర్థిక విధానం:-** అత్యవసర పరిస్థితిలో రాజు ఆర్థిక విధానం వీలైనంత తక్కువ రెవిన్యూతో నడుస్తుంది. ఆర్థిక సంక్షోభంలో ఉన్నప్పుడు తన కోశాగారంలో ధనం లేనప్పుడు ధనవంతులైన వ్యవసాయదారుల నుండి పశువుల మందలను పోషించే వారి నుండి పన్నులను ఎక్కువగా వసూలు చేయాలని పేర్కొన్నాడు.

బాగుగా పన్ను చెల్లించే వారికి బహుమతులు, గౌరవ ప్రదానాలు చేయడం జరుగుతుంది. కౌటిల్యుని పరిశీలనలో రాజు క్రూరుల దగ్గర నుండి సంపదను ప్రోగు చేయాలని పేర్కొన్నాడు. చెట్టు నుండి పండ్లు ఏ విధంగా తీసుకోవడం

జరుగుతుందో అదేవిధంగా రాజు అక్రమ సంపాదనను వసూలు చేయాలి. ధర్మబద్ధంగా వచ్చే సంపాదనను రాజు వదలి వేయాలి. ఈ విధమైన సంపాదనను గ్రహించినచో రాజు పై వ్యతిరేక ధోరణులు ప్రబలే అవకాశం కలదు.

4. **విదేశాంగ విధానము, అంతర్జాతీయ సంబంధాలు:-** కౌటిల్యుడు అంతర్జాతీయ సంబంధాలను గూర్చి కొన్ని నియమాలను రచించినాడు. రాజ్య వ్యవస్థలో శత్రు కూటమి, మిత్ర కూటమి ఉంటాయి. మూడు రకాల శక్తులు అంతర్జాతీయంగా రాజ్యాలకు ఉంటాయి.

1. **మంత్ర శక్తి:-** రాజు యొక్క అనుయాయుల సలహాతో ఇచ్చే శక్తి.
2. **ప్రభు శక్తి:-** రాజు యొక్క భౌతిక వనరుల ద్వారా లభించే శక్తి.
3. **ఉత్సాహ శక్తి:-** రాజు తన యొక్క మేధాశక్తిని కల్గి ఉండుట. రెవెన్యూ, సైన్యం మరియు ధైర్య సాహసాలతో యుద్ధంలో పోరాడగల్గడం.

ఈ మూడు శక్తులతో విజయాన్ని సాధించగల్గినప్పుడు వీటి ద్వారానే కౌటిల్యుడు తన విదేశాంగ విధానాన్ని ఈ సిద్ధాంతం ద్వారానే రూపొందించినాడు. విదేశాంగ విధాన ప్రధాన లక్షణం రాజు తన శక్తిని, విజయాన్ని సాధించడం కోసం శత్రువుకు అవి లభ్యం కాకుండా చూడటం కోసం ఉపయోగిస్తాడు. రాజు మూడు రకాల విదేశాంగ విధానాన్ని అనుసరించాలని పేర్కొన్నాడు.

1. రాజు తన కంటే శక్తి వంతుడైన శత్రువుతో శాంతి ఒప్పందాన్ని కుదుర్చుకోవాలి.
2. శత్రువు తన కంటే శక్తి హీనుడు అయినప్పుడు రాజు యుద్ధం చేయుడం ద్వారా తను శక్తివంతుడని నిరూపించుకోగల్గుతాడు.
3. శత్రువు తనతో సమానుడు అయినప్పుడు రాజు శత్రువుతో తటస్థ వైఖరి కొనసాగించవచ్చును. వారు ఇరువురు ఒకరిని ఒకరు జయించే స్థితి లేనప్పుడు తటస్థ వైఖరిని కొనసాగించడం జరుగుతుంది.

రాజుకు మితిమీరిన బలం ఉన్నప్పుడు యుద్ధం చేస్తాడు. తాను బలహీనుడైనప్పుడు లొంగి ఉండటం జరుగుతుంది. రాజు ద్వంద్వ విధానాన్ని అనుసరించేది ఇతరుల సహాయం అవసరమైనప్పుడు.

రాజు ద్వంద్వ విధానాన్ని అనుసరించడం ద్వారా రాజకీయంగా రాజు సుస్థిరతను సాధించి, సైనిక బలాన్ని పెంచుకొని తన స్థాయిని శత్రువుకు తెలియచేయడం జరుగుతుంది. కౌటిల్యుని విదేశాంగ విధానాన్ని నిర్ణయించడానికి సైనిక సమస్య ఉందని పేర్కొనడం జరిగినది. ఈ విధాన నిర్ణయానికి శక్తి, స్థలము మరియు కాలము ఈ ముడు అంశాలు పరస్పరాధారితాలు. కౌటిల్యుడు వాటికి సమాన ఆదరణ చూపడం జరిగినది.

శక్తికి మూడు ప్రధాన అంశాలు ఉన్నాయి. మేధాపరమైన అంశాలు. తన స్వశక్తితో స్వీయ నిర్ణయాలు తీసుకొనే శక్తి. భౌతికపరమైన అంశాలు. ఈ మూడింటిలో మేధాపరమైన అంశాలకు కౌటిల్యుడు ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చినాడు.

పైన పేర్కొన్న విశ్లేషణను బట్టి కౌటిల్యుడు మూడు తరహాల రాజులను విశ్లేషించినాడు.

1. **ధర్మ విజయన్:-** నీతిమంతుడైన విజేత. తన సార్వభౌమాధికారాన్ని పరిరక్షించేవాడు.
2. **లోభ విజయన్:-** ఈ తరహా రాజు భూభాగాన్ని ఆక్రమించడంతో పాటు సంపదను గ్రహించడం జరుగుతుంది.
3. **అసుర విజయన్:-** క్రూర స్వభావాన్ని కల్గిన విజేత రాజ్యాన్ని ముట్టడించడం.

## 1a.14 మతము, నైతికపరమైన అంశాల పై కౌటిల్యుని అభిప్రాయాలు :-

కౌటిల్యుడు మతానికి సంబంధించిన అంశాలను గూర్చి రెండు భిన్న దృక్పదాలను వివరించినాడు. 1. మతపరమైనవి. అవి వారసత్వంగా ఉన్నవి. రెండు రాజకీయమైనవి. ఇవి పరిపాలనా సంబంధమైనవి. వేదాలలో వివిధ వర్ణాల వారు నిర్వర్తించవలసిన విధులను మరియు రాజు వారు ఆ విధులను సక్రమంగా నిర్వర్తించడానికి అవసరమైన నియంత్రణ చేయడం జరుగుతుంది. వేద సంప్రదాయం ప్రకారం ఈ విధులను నిర్వర్తించడానికి ఒక ఉద్యోగిని నియమించి వారి ద్వారా ఈ విధులు సక్రమంగా నిర్వర్తించబడతాయి.

కౌటిల్యుడు రాజ్య ప్రణాళిక ద్వారా బ్రాహ్మణులకు శిస్తు చెల్లించనవసరం లేని భూములను ఇవ్వడం జరిగినది. వీటి ద్వారా అడవుల పెంపకము మరియు వేద పఠనాలు నిర్వహించడం జరుగుతుంది. ఈ విధంగా బ్రాహ్మణులకు కొన్ని చట్టపరమైన సౌకర్యాలను కల్పించడం జరిగినది. శూద్రులకు ఈ అవకాశాలు లేవు. చట్టపరమైన సమానత్వం లేదు. కౌటిల్యుడు మతాన్ని రాజకీయ లక్ష్యాలను సాధించడానికి వినియోగించినాడు. దాని కొరకై తొమ్మిది తరహాల గూఢచారులను నియమించడం జరిగినది. వారు కేవలం రాజు యొక్క ప్రయోజనాలు కాపాడడానికి మాత్రమే ఉన్నారు. రాజు అంతర్గత పరిపాలన నిర్వహణకు మరియు అంతర రాష్ట్ర విధాన రూపకల్పనకు వీరు తోడ్పడతారు. ఆర్థిక సంక్షోభం ఎక్కువగా ఉన్నప్పుడు రాజు దేవాలయాలలో సంపదను తీసుకొనడం జరుగుతుంది. బలహీనమైన రాజును తుద ముట్టించడానికి కూడ ఈ గూఢచారులు పని చేయడం జరిగింది. అంతర్జాతీయ సంబంధాలలో నైతిక నియమాలకు ప్రాధాన్యత లేదు. రాజు తన శక్తివంతమైన బలాలను ఉపయోగించడం ద్వారా కుట్రలు, కుతంత్రాలను పన్నడం ద్వారా శత్రు సైన్యాలను తుద ముట్టించడం జరుగుతుంది.

కౌటిల్యుడు రహస్య ఆయుధాలను వినియోగించడం ద్వారా తనను తాను రక్షించుకొనడమే కాక ప్రమాదకరమైన శత్రువును తుద ముట్టించగల్గుతాడు. వానిలో ప్రధానమైనవి విష ప్రయోగం, అగ్ని, కత్తి దూయడం మొదలైనవి.

పైన పేర్కొనబడిన అంశముల ద్వారా రాజకీయ అవసరాలకు నైతిక పద్ధతులను వినియోగించనవసరం లేదని పేర్కొన్నాడు. కౌటిల్యుడు రాజకీయాలను, నీతిని వేరు చేసినాడు.

## 1a.15 సారాంశము :-

అర్థశాస్త్రం అంటే భూమి సంపాదించి కాపాడటమని అర్థం. కౌటిల్యుని అర్థశాస్త్రం చతుర్ వర్ణాలకు ప్రాధాన్యతనిచ్చింది. ధర్మ, అర్థ, కామ, మోక్ష నాల్గింటికి సమాన ప్రాధాన్యతనివ్వటం జరిగినది. అర్థశాస్త్రంలో రాజ్య యంత్రాంగాన్ని గూర్చి భారతీయ శైలిలో వివరించాడు. రాజ్యం యొక్క సైనిక మరియు రాజకీయ భావనలను ఆర్థిక ప్రాధాన్యతను దృష్టిలోఉంచుకుని రాజ్య భౌగోళిక అంశాలు నిర్ణయించటం జరుగుతుంది. రాజుకు పరిపాలనా కళలో సామర్థ్యాన్ని కల్గి ఉండాలంటాడు. కౌటిల్యుడు మతానికి సంబంధించిన అంశాలను గూర్చి రెండు భిన్న దృక్పథాలను వివరించాడు.

## 1a.16 మాదిరి ప్రశ్నలు :-

1. కౌటిల్యుని అర్థశాస్త్రము యొక్క ప్రాధాన్యత గూర్చి వ్రాయుము?
2. రాజ్య భౌగోళిక అంశాల పై కౌటిల్యుని భావనలు గూర్చి వ్రాయుము?
3. చట్టము, ధర్మము పై కౌటిల్యుని అభిప్రాయాలు వ్రాయుము?
4. రాజ్య విస్తరణకు మార్గాల గూర్చి వ్రాయుము?

## 1a.17 ఆధార గ్రంథాలు :-


1. Kautilyas Thought on Public Adminstration - Umesh Kumar
2. Indian Political Tradition - H.H. Das, PSN Patro
3. The Arthashastra of Kautilya - Kangle RP
4. Arthashastra of Kautilya - Gerota, Vachashothri
5. Kautilya Arthasastra - Meeju JJ


Dr. L. Sarada

పాఠం - 2

# సాంస్కృతిక పునరుజ్జీవనము భారత జాతీయోద్యమము

## 2.0 లక్ష్యం :-

భారత జాతీయోద్యమము మీద సాంస్కృతిక పునరుజ్జీవనము యొక్క ప్రభావము గూర్చి, భక్తి మార్గం యొక్క ప్రభావము, ఆంగ్ల విద్య యొక్క ప్రభావము, రాజకీయ ఆర్థిక పరిణామాల గూర్చి తెలుసుకొనుట ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక :-**


2.0 లక్ష్యం

2.1 పరిచయం

2.2 సారస్వతపరమైన అంశాల ప్రభావం

2.3 భక్తి మార్గం యొక్క ప్రభావం

2.4 ఆంగ్ల విద్య యొక్క ప్రభావం

2.5 రాజకీయ పరిణామాలు

2.6 ఆర్థిక పరిణామాలు

2.7 సారాంశము

2.8 మాదిరి ప్రశ్నలు

2.9 ఆధార గ్రంథాలు


## 2.1 పరిచయం:-

16 మరియు 17వ శతాబ్దాల కాలంలో ఐరోపాలో ఆధునిక శాస్త్రీయ సాంకేతిక పరిజ్ఞానం వృద్ధి చెందటం వలన అంతర్జాతీయ వాణిజ్యంలో ఐరోపా ఉత్పత్తులకు గిరాకీ పెరిగినది. దీని వలన ఐరోపాలో వలస విధానం, సామ్రాజ్య వాదం బాగుగా విస్తరించింది. పారిశ్రామిక విప్లవ ఫలితంగా ఐరోపాలో రాజకీయ ఆర్థిక శక్తి పుంజుకొనడం జరిగినది. ఆసియా ఖండం ఐరోపా కంటే దిగువ స్థితిలో ఉంది. 18 మరియు 19వ శతాబ్దారంభంలో ఆసియా రాజ్యాల పరిస్థితులన్నీ ఇంచు మించుగా ఒకే విధంగా ఉన్నాయి. ఆర్థిక సంక్షోభం, రాజకీయ రంగంలో నిస్సహాయత, సామాజికపరంగా చైతన్యరహితమైన స్థితి, సాంస్కృతికపరంగా పతనావస్థలో ఆసియా రాజ్యాలు ఉన్నాయి. భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్య స్థాపన వలన అనేక మార్పులు ఒక దాని తరువాత మరొకటి చోటు చేసుకున్నాయి. దక్షిణ భారతదేశంలో ఆంగ్లో ఫ్రెంచ్ యుద్ధాలు (1740 - 1763), ప్లాసీ (జూన్ 23, 1757), బక్సార్ (అక్టోబర్ 23, 1764) మరియు యూషా ఆలం ప్రకటించిన దివానీ హక్కులు మొదలైన వాటి వలన భారత రాజకీయాలలో మార్పు చోటు చేసుకొంది. రాను రాను భారత భూభాగాన్ని ఈస్ట్ ఇండియా కంపెనీ స్వాధీనం చేసుకొనడం జరిగినది. క్లైవ్, వారన్ హేస్టింగ్స్, డల్హౌసీ మొదలైన బ్రిటీష్ నేతలు భారతదేశంలో సామ్రాజ్యవాద ప్రతీకలుగా నిలవడమే కాక వారి సంస్కృతి, సంప్రదాయాలను పరిపాలనా విధానాలను కూడ భారతదేశంలో వదలడం జరిగినది. భారతదేశంలో మొదటిసారిగా బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా 1857లో సిపాయిల తిరుగుబాటు జరిగినది. ఝాన్సీ లక్ష్మీ భాయ్, నానా సాహెబ్, తాంతియా తోపే, బహదూర్‌షా జఫర్, మంగళ్ పాండే మొదలైనవారు బ్రిటీష్ ధోరణులకు వ్యతిరేకంగా తిరగబడటం జరిగినది.

19వ శతాబ్ది మధ్య నాటికి ఆసియా ఖండం చైతన్య వంతమైనది. ఆసియాలో సాహసోపేతమైన మేధావంతులైన నాయకులు ముందుకు రావడం ద్వారా ఆసియాలో ఉన్న జనావళిని మేల్కొలిపి చైతన్య వంతులను చేయడం జరిగినది. వీరిలో ప్రముఖులైన వారు సన్‌యెట్ సేన్, గాంధి, హెమల్ పాషా ఆసియా ఖండంలో జాతీయతా భావాలను మేల్కొల్పి రాజకీయ ఆర్థిక రంగంలో మార్పులను తీసుకురావడానికి ప్రయత్నించడం జరిగినది. భారతదేశంలో ఆధునికత ఎప్పుడు ఆరంభమైనదని చెప్పడం అంత సులువైన విషయం కాదు. భారతదేశంలో ఆధునిక యుగం 16వ శతాబ్దిలో ప్రారంభమైనదనియు ఈ శతాబ్ది కాలంలో భారతదేశంలో ఏకేశ్వరోపాసన యొక్క సామాజిక సమానత్వ ప్రభావం కూడ ఉంది. తురుష్కుల దాడుల వలన అగ్నితో కూడిన ఆయుధ వినియోగం మొదటిసారిగా జరిగినది. మొగలుల కాలంలో సామరస్య ధోరణులు, పరిపాలనా సంస్కరణలు కొంతవరకు జరిగినాయి. వాస్కోడిగామా 1498లో ప్రవేశించడం జరిగినది. దీనివలన 16వ శతాబ్దిలో ఇంగ్లీషు, ఫ్రెంచ్, డచ్, పోర్చుగీసు వారు భారతదేశంలో వలసలను స్థాపించిరి. ఈ విధంగా భారతదేశంలో 18, 19వ శతాబ్దాలలో సైనికపరమైన, సాంకేతికపరమైన, శాస్త్రీయపరమైన, తత్వజ్ఞానాన్ని, పాశ్చాత్యపరమైన విద్యా విధానాన్ని భారతదేశంలో ప్రవేశ పెట్టడం జరిగినది. భారతదేశంలో మత, సాంఘిక రాజకీయ ఆర్థిక మేధాపరమైన అంశాలలో పాశ్చాత్యుల ప్రభావం కలదు.

## 2.2 సారస్వతపరమైన అంశాల ప్రభావం:-

భారతదేశంలో మేధాపరమైన సాంస్కృతికి పునరుజ్జీవనం యొక్క ప్రభావం భారత జాతీయోద్యమం మీద ఎక్కువగా ఉంది. భారతీయ ఆత్మను మేల్కొల్పినది మతపరమైన, సాంస్కృతికపరమైన, తత్వపరమైన చైతన్యమే భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనం భారతదేశంలో ప్రధానంగా నైతిక ఆధ్యాత్మికపరమైన ఉద్దేశాలతో కూడినది. భారతదేశంలో ఆధ్యాత్మిక గ్రంథాలైన వేదాలను, ఉపనిషత్తులను సంస్కృత భాష నుండి విదేశీ భాషలకు తర్జుమా చేయడం జరిగినది. ఈ విధంగా తర్జుమా చేసిన వారు విదేశీయులే. దీని వలన భారతీయ సంస్కృతి నాగరికతలను ప్రపంచానికి తెలియచేయడం జరిగినది. వానిలో ప్రధాన రచనలు సంస్కృత పాలీ భాషలలో ఉన్న గ్రంథాలను పాశ్చాత్య భాషలలో తర్జుమా చేయడం జరిగినది. వీరిలో ప్రముఖులు విలియం జోన్స్ (1746 - 1794), చార్లెస్ విల్‌కిన్స్ (1750 - 1936), H.T. కోల్ బ్రూక్ (1765 - 1836), హెచ్ హెచ్ విల్‌సన్ (1786 - 1960). వీరు సంస్కృత గ్రంథాలను తర్జుమా చేయడం జరిగినది.

విల్‌కిన్స్ భగవద్గీతను హితోపదేశ 1785, 1787లో తర్జుమా చేయడం జరిగినది. విలియం జోన్స్ శాకుంతలం 1787, గీత గోవిందం మరియు మను స్మృతిని (1794) తర్జుమా చేయడం జరిగినది. విల్‌సన్ విష్ణు పురాణాన్ని మరియు ఋగ్వేదాన్ని తర్జుమా చేయడం జరిగినది. మొట్ట మొదటిసారిగా జర్మన్ రచయితలు నాల్గు వేదాలను జర్మన్ భాషలో తర్జుమా చేయడం జరిగినది.

| | |
|---|---|
| సామవేదం | - థియోడర్ బెర్ ఫీ (1848) |
| ఋగ్వేదం | - మాక్స్ ముల్లర్ (1849 - 74) |
| వాజసనేయ సంహిత | - వెబర్ (1852) |
| అధర్వణవేదం | - రోత్ |

వీరి యొక్క రచనల వలన భారతీయ సంస్కృతిని సంప్రదాయాలను, నాగరికతను తెలుసుకొనుటకు వీలు కల్గినది.

## 2.3 భక్తి మార్గం యొక్క ప్రభావం :-

విదేశీపాలనకు వ్యతిరేకంగా స్వదేశీ శక్తులు దేశంలో సనాతన సంస్కృతిని తిరిగి పునరుద్ధరించడానికి తమ వంతు ప్రయత్నం చేయడం జరిగినది. విదేశీ సామ్రాజ్యవాద ఫలితంగా క్రమేణ స్వదేశీ రాజ్యాల పతనం జరిగినది. వీనిలో ప్రధానంగా మైసూరియన్లు, మరాఠీలు మరియు సిక్కులు. ఇటువంటి సమయంలో కేవలం మతపరమైన శక్తి మాత్రమే వారిని నియంత్రించగల్గుతుందని పేర్కొన్నాడు. హిందూ, ముస్లింల మధ్య కలహాలు పెరగడంతో వారి మధ్య సామరస్య ధోరణి పెంపొందించడం కోసం భక్తి ఉద్యమం

మొదలయినది. వీరిలో ప్రముఖులు కబీర్ (1440 - 1518), నానక్ (1469 - 1539), చైతన్య తులసీదాస్ (1532 - 1623), సూరదాస్ వీరు బ్రిటీష్ వారి సాంస్కృతిక సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా తమ ఆలోచనలను సమాజానికి అందించడం జరిగినది. సామాజిక చైతన్యానికి గాను భారతదేశంలో బ్రహ్మ సమాజ్, ఆర్య సమాజ్, ప్రార్థన సమాజ్, రామకృష్ణ మిషన్ మొదలైన సంస్థలను స్థాపించడం జరిగినది.

1. **బ్రహ్మసమాజం :-** బ్రహ్మసమాజం బెంగాల్‌లో సాంస్కృతిక మానవతా దృక్పధాలతో సామాజిక సేవ చేయడానికి గాను ఏర్పాటు చేయడం జరిగినది. బ్రహ్మ సమాజ్‌లో ప్రముఖులు రాజారామ్ మోహన్ రాయ్ (1772 - 1833), దేవేంద్రనాథ్ ఠాగూర్ (1817 - 1905), కేశవ చంద్రసేన్ (1838 - 1884) మొదలైనవారు. బ్రహ్మ సమాజం ప్రధానంగా కొన్ని ఆశయాల సాధన కోసం ఏర్పాటైనది. ఏకేశ్వరోపాసన, మేధాపరమైన హేతువాదాన్ని ఒక వైపు ఉపనిషత్తులలో ఉన్న భగవంతుడు ఒక్కడే అనే భావన క్రైస్తవ మత ప్రభావం మరియొక వైపు బ్రహ్మ సమాజ్ పై ఉంది. బ్రహ్మ సమాజ్‌లో రాజారామ్ మోహన్ రాయ్ మతాల తులనాత్మక అధ్యయనం చేయడం జరిగినది. బ్రహ్మసమాజ్ అనేక సామాజిక దురన్యాయాలను పారద్రోలి చైతన్యాన్ని తీసుకొనిరావడానికి ప్రయత్నించడం జరిగినది.

2. **ఆర్య సమాజం :-** ఆర్య సమాజం 1875లో ఆవిర్భవించినది. స్వామి దయానంద సరస్వతి దానిని స్థాపించినారు. ఈయన వేద పండితుడు. ఈయన వేదాలను అధ్యయనం చేయడం ప్రతి ఒక్కరి జన్మహక్కని పేర్కొన్నాడు. వర్ణ వివక్షత స్త్రీ, పురుష భేదం లేకుండా ప్రతి ఒక్కరు వేదాలను అధ్యయనం చేయవచ్చని పేర్కొన్నాడు. చాలా మంది జాతీయ నాయకులు ఆర్య సమాజం వల్ల ప్రభావితులయ్యారు. వీరిలో ప్రముఖులు లాలా లజపతిరాయ్, తిలక్, గోఖలే, హిందువులలో ఉన్నత విలువలను పెంపొందించుట మరియు గతంలో ఉన్న వర్ణ వ్యవస్థలో సంస్కరణలు తీసుకురావటానికి ప్రయత్నించడం జరిగినది.

3. **దివ్యజ్ఞాన సమాజం :-** దానిని స్థాపించిన వారు మేడమ్ బ్లావిస్కి హెన్రీ ఓల్ కాట్. వీరు ఈ సమాజం ప్రజలలో మానసికపరమైన ఉత్సాహాన్ని, హిందూ ఆధ్యాత్మిక గ్రంథాల ద్వారా వాటి యొక్క శాస్త్రీయ పరిణామ క్రమాన్ని వివరించడం ద్వారా కల్గించడం జరిగినది. ఓల్‌కాట్ బ్లావిస్కిలు బౌద్ధమతం వలన ప్రభావితులైరి. అనీబిసెంట్ పురాణ కాలం నాటి హైందవ సాంప్రదాయాల వలన ఎక్కువగా ప్రభావితులైనారు. ఈమె విగ్రహారాధనను కూడ అంగీకరించినారు. ఈమె భారతదేశానికి 1893లో వచ్చినారు. వీరు హిందూ మతం మరియు సంస్కృతికి ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినారు. హిందూమతాన్ని అన్ని దిశలలో వ్యాప్తి చేయడానికి ఆసక్తి చూపారు. 1913 నుండి భారతదేశంలో హోమ్‌రూల్ ఉద్యమంలో పాల్గొని కీలకపాత్రను నిర్వహించడం జరిగినది.

4. **రామక్రిష్ణ మిషన్ :-** హిందూమత వ్యాప్తికి కంకణం కట్టుకున్న ప్రముఖులలో స్వామి వివేకానందుడు ఒకరు. ఈయన రామకృష్ణ పరమహంస శిష్యుడు. రామకృష్ణ పరమహంస బెంగాల్‌లో ఆధ్యాత్మికపరమైన చైతన్యాన్ని తీసుకొనిరావడం జరిగినది. వివేకానందుడు ఆధ్యాత్మికపరమైన వేదాంత జ్ఞానాన్ని కల్గి పాశ్చాత్య తత్వాన్ని కూడ గ్రహించినారు. ఈయన 1893లో చికాగోలో జరిగిన సర్వమత సమావేశానికి వెళ్ళి అక్కడ హిందూమతం యొక్క గొప్పతనాన్ని వివరించడమే కాక అమెరికాలో హిందూమత ప్రచారాన్ని చేయడం జరిగినది. స్వామి వివేకానందుడు వేదాంతి మాత్రమే కాక గొప్ప దేశభక్తుడు. ఈయన ప్రజలకు స్వీయ నిర్దేశకత్వము, నిర్భయత, స్వశక్తి కల్గి ఉండవలసిన ఆవశ్యకత కలదు అని ప్రభోదించినాడు. స్వామి వివేకానందుడు తన ప్రసంగాల ద్వారా భారతీయులను చైతన్యవంతులను చేయడం జరిగినది. భారత యువతకు ఇచ్చిన ప్రధాన సందేశం "Arise and awake stop not until your goal is reached". "లేచి నిద్ర మేలుకో నీ లక్ష్యాన్ని సాధించే వరకు". ఈ విధమైన సందేశాల ద్వారా భారత యువతలో ఉన్న నిర్వీర్యతను పారద్రోలినాడు. రామకృష్ణ మిషన్ ద్వారా స్వామి వివేకానంద అవిశ్రాంతమైన శ్రమ చేయడం వలన స్వల్ప కాలమే జీవించినాడు. ఈయనను బెంగాల్ జాతీయోద్యమ పితామహుడని పేర్కొనడం జరిగినది. ఈయన భోదనల వలన లాలాలజపతి రాయ్, సుభాష్ చంద్ర బోస్ మరియు బాలగంగాధర్ తిలక్ ప్రభావితులైనారు.

5. **సత్య శోధక్ సమాజ్ (1827 - 1895) :-** మహారాష్ట్రలో సత్య శోధక్ సమాజ్‌ను స్థాపించినవాడు జ్యోతి రావ్ పూలే ఈ సమాజం యొక్క ప్రధాన ఉద్దేశం మహారాష్ట్రలోని మాలీ లను సంస్కరించడానికి వచ్చినది. ఇది ప్రధానంగా బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమము.

6. **బ్రాహ్మణ సమాజం (1867) :-** కేశవ చంద్రసేన్ బొంబాయి వచ్చి ఈ సమాజ స్థాపనకు ఇతోధికమైన కృషి సల్పటం జరిగినది. ఈ సమాజం మహారాష్ట్రలో నైతిక, సామాజిక జీవనాన్ని ప్రభావితం చేసినది. R.G. భండార్కర్, M.G. రనడే ఈ సమాజంలో కీలకపాత్రను నిర్వహించిన నాయకులు. ఈ సమాజం ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించబడినాయి. వీనిలో ప్రధానమైనవి విధవా పునర్ వివాహాలు, కులాంతర వివాహం, సమిష్టి భోజనాలు మొదలైనవి. సామాజికంగా వెనుకబడిన వారికి విముక్తిని కల్గించడం ప్రార్థనా సమాజ్ పై క్రైస్తవ సిద్ధాంత ప్రభావం కొంత వరకు కలదు.

7. **పరమ హంస సభ :-** 1849లో పరమహంస సభను దదోబా పాండు రంగ స్థాపించడం జరిగినది. ఇది బ్రహ్మ సమాజాన్ని పోలి ఉంది.

ఈ పైన పేర్కొన్న సమాజాలన్ని సామాజిక చైతన్యాన్ని, సంస్కరణలను తీసుకొని వచ్చే ఉద్దేశంతో ఏర్పాటు చేయబడినాయి. అప్పటి జాతీయ నాయకులు ప్రముఖ పాత్రను నిర్వహించడం జరిగినది. వ్యక్తి పరంగా కాకుండా జాతిపరంగా అనేక సమస్యలను పరిష్కరించడంలోను జాతి పునర్ నిర్మాణానికి ఇవి ఇతోధికమైన సేవ చేయడం జరిగినది. సనాతన సాంప్రదాయానికి భిన్నంగా ఆధునికత వైపు భారత జాతిని నడిపించడానికి ఈ సంస్కరణలు ఎంతగానో దోహదం చేసాయి. రాజకీయ, సాంఘీకపరమైన సమస్యా పరిష్కారానికి ఇవి తోడ్పడినాయి. భారతదేశంలో మేధాపరమైన సాంస్కృతిక పునరుజ్జీవనము బెంగాల్‌లో జరిగినది (Intellectual Renaissance). సంస్కృతిపరమైన చైతన్యానికి కేంద్రముగా దక్షిణ భారతదేశంలో పునాది వేయడం జరిగినది. ఐరోపా ఖండంలో ఇటలీలో జరిగిన సాంస్కృతిక పునరుజ్జీవన ప్రభావం మరియు జర్మనీలో జరిగన మత సంస్కరణోద్యమ ప్రభావం భారతదేశం పై ఉంది. ప్లేటో, అరిస్టాటిల్ సిసిరో మొదలైన వారు హెలెనిక్ నాగరికతను గూర్చి వివరించడం జరిగినది. వీరి యొక్క ప్రభావం మేధాపరమైన అభివృద్ధికి కొంతవరకు దోహదం చేసినది. పెట్రార్క్ బొసాంనో మరియు ఇరాస్ మస్ మొదలైనవారి రచనల వలన మానవ జీవన ప్రాధాన్యతను గూర్చి వివరించడం జరిగినది. భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనకాలంలో నాయకులు వేదాలు గీత ఉపనిషత్తులు పురాణాలు ద్వారా మానవ జీవన శైలిని నిర్దేశించడం జరిగినది. వీరి యొక్క పురాణ ఉద్దేశం విదేశీ స్వదేశీ నాగరికతల మధ్య విభేదాన్ని తెలియజేయడం. భారత జాతీయ నాయకులపై టి.హెచ్ హక్స్లీ, డార్విన్, మిల్, స్పెన్సర్ మొదలైన వారి రచనల ప్రభావం వలన బ్రిటీష్ వారి యొక్క ఆర్థిక రాజకీయ సామాజిక దౌర్జన్యానికి వ్యతిరేకంగా ఉద్యమించడం జరిగినది.

దక్షిణ భారత దేశంలో మద్రాసు కళలకు, సంస్కృతికి, హైందవ సంప్రదాయానికి పుట్టినిల్లు. ఇక్కడ నుండి అనేక మంది కవులు, గాయకులు, దేశభక్తులు, జాతీయోద్యమంలో ప్రముఖ పాత్ర వహించినారు. వారిలో ముఖ్యులు వీర రాఘువా చార్య, సుబ్బారావు పండితులు, జి. సుబ్రమణ్యా అయ్యర్, సుబ్రమణ్యా భారతి మొదలైన వారు. పశ్చిమ భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవనము సామాజికపరమైనది. బ్రిటీష్ ప్రభుత్వం ఉన్నప్పుడు మరాఠాలు 17వ, 18వ శతాబ్ది కాలంలో ఎక్కువ శక్తివంతులై బ్రిటీష్ వారి అధికారాన్ని బలహీనపరచడానికి ప్రయత్నించినారు. మరాఠా నాయకులలో చివరి వారు నానా సాహెబ్, తాంతియాతోపే, ఝాన్సీ రాణి మొదలైన వారు సిపాయి తిరుగుబాటు చేయడం జరిగినది. ఇది మారాఠాల యొక్క రాజకీయ చైతన్యాన్ని తెలియ చేయుచున్నది.

భారతదేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీని స్థాపించిన తరువాత బ్రిటీష్ పాలన భారతదేశంలో వచ్చిన తరువాత క్రైస్తవ మత ప్రచారం జరిగినది. అయితే క్రైస్తవ మిషనరీలు భారతదేశంలో బహుళ ప్రాచుర్యం పొందలేదు. వీటికి వ్యతిరేకంగా మరాఠాలు పోరాటం సాగించినారు. వీరిలో ప్రముఖులు విష్ణు బ్రహ్మచారినారాయణ వర్మన్ తిలక్ బాలగంగాధర తిలక్. ఈయన క్రైస్తవ మతాన్ని అంగీకరించినప్పటికి మరాఠాలో హిందూ మతం యొక్క పట్టు తగ్గలేదు.

భారతదేశంలో వివిధ సంస్కృతుల సమ్మేళనం బ్రిటీషు వారు భారతదేశానికి రావడానికి ముందు భారతదేశంలో పశ్చిమ ఆసియా మరియు ఇస్లాము తూర్పు సంస్కృతుల ప్రభావం ఎక్కువగా ఉంది. బ్రిటీష్ వారి రాకతో భారతదేశంలో ఉదారవాద ప్రభావం ఎక్కువగా ఉంది. ఆధునిక భారతీయ సంస్కృతి పాశ్చాత్య నాగరికతకు వ్యతిరేకంగా ఉద్భవించినది.

ఈ నూతన సంస్కృతిలో రాజ రామ్‌మోహన రాయ్ అనేక సంస్కరణలు చేపట్టడం జరిగినది. భారతదేశంలో స్వేచ్ఛా స్వాతంత్ర్యాల ఆవశ్యకతను గుర్తించినాడు. పత్రికా స్వాతంత్ర్యాన్ని కాపాడడం కోసం బ్రిటీష్ వారితోపోరాటాన్ని సాగించి ప్రెస్ బిల్లును ప్రవేశ పెట్టడం జరిగినది. భారతదేశానికి స్వతంత్రం వచ్చిన తరువాత జవహర్‌లాల్ నెహ్రూ మే 1949 రాజ్యాంగ సభలో ఉపన్యసిస్తూ బ్రిటీష్ పాలన వలన కొంత అభివృద్ధి జరిగినప్పటికి భారతీయులు వారి యొక్క విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమించినారు. ఆంగ్ల భాష ప్రభావం వలన భారత రాజ్యాంగాన్ని బ్రిటీష్ రాజ్యాంగం వలె రూపొందించడం జరిగినదని చెప్పినారు.

## 2.4 ఆంగ్ల విద్య యొక్క ప్రభావం :-

భారతదేశంలో బ్రిటీష్ పాలన వలన పాశ్చాత్య విద్యా ప్రభావం భారత రాజకీయాల పై ఉంది. మెకాలే మొదటిసారిగా భారతదేశంలో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టడం జరిగినది. ఈ విద్యా విధానం కేవలం బ్రిటీషు వారి అవసరాలను తీర్చడానికి వచ్చినది. పూర్తిగా పాశ్చాత్య సంస్కృతీ సంప్రదాయాలను ఈ విద్య ద్వారా భారత దేశంలో ప్రవేశ పెట్టడం జరిగినది. ఇది కేవలం బ్రిటీషు సామ్రాజ్యవాద పునాదులను బలోపేతం చేయడానికి ఉద్భవించినది. దీని పర్యవసానంగానే మెకాలే భారతదేశంలో 1857లో 3 విశ్వవిద్యాలయాలను స్థాపించడం జరిగినది. అవి బొంబాయి, మద్రాస్, కలకత్తా నగరాలలో. వీటి ద్వారా పాశ్చాత్య శాస్త్రాలను, తత్త్వ జ్ఞానాన్ని భారతీయులకు అందించడం జరిగినది. ఈ పాశ్చాత్య విద్యా ప్రభావం వలన భారతదేశంలో ఆధునిక మేధావంతులు క్రియాశీలకంగా రాజకీయాలలో భాగస్వామ్యం వహించడం జరిగినది. భారత జాతీయ నాయకులలో ఎక్కువ మంది విశ్వవిద్యాలయ ఉన్నత విద్యను అభ్యసించడం జరిగినది. ఆగార్కర్, గోకలే, తిలక్, బిష్ణుకర్, రనడే, భండార్కర్ మొదలైనవారు మహారాష్ట్రలో మరియు బెంగాల్ ఠాగూర్ అరబిందో, వివేకనంద, జె.సి. బోస్, పి.సి. రాయ్ మొదలైన వారు ఆంగ్ల విద్యను అభ్యసించడం జరిగినది. పాశ్చాత్య విద్యతో రనడే హైకోర్టు జడ్జిగా నియమితులైనారు. ఈయన తన మేధాసంపత్తితో భారతదేశంలో ఆర్థిక పరిస్థితి పై వ్యాసాలు వ్రాయడం జరిగినది. భారతదేశంలో మిల్, రికార్డో, స్మిత్ యొక్క ఆర్థిక సిద్ధాంతాలు పనికిరావని, భారతదేశంలో ఆర్థిక సమస్యలను పరిష్కరించవలసిన ఆవశ్యకత కలదని పేర్కొన్నాడు. ఈయన వ్రాసిన మరియొక వ్యాసం Rise of Maratha Power. దీని ద్వారా ఈయన భారతీయులలో జాతీయోద్యమ స్ఫూర్తి కల్గించినాడు. 1941లో రవీంద్రనాథ్ ఠాగూర్ మరణించడానికి ముందు తాను ఆంగ్ల భాష వలన ఏ విధంగా ప్రభావితుడు అయినాడో వివరించినాడు. ఈయన మెకాలే, బర్కు, షేక్స్‌పియర్ నాటకాలు, బైరన్స్ పద్యాలకు ఎక్కువగా ప్రభావితుడైనాడు. 19వ శతాబ్ది బ్రిటీష్ రాజకీయాల పై ఉదార వాద ప్రభావం ఎక్కువగా ఉంది.

ఆంగ్ల విద్య భారతదేశంలో సంస్కృతీ సంప్రదాయాలలో కొన్ని మార్పులను చేయడం జరిగినది. డేవిడ్ హారే మరియు రామ్ మోహన్ రాయ్ కలిసి నిర్వహించిన కార్యక్రమాల 1817 హిందూ కాలేజి స్థాపన జరిగినది. ఇది కేవలం ఉన్నత కుటుంబాలలో ఉన్న పిల్లలకు ఆంగ్ల భాష మరియు భారతీయ భాషలను నేర్పడానికి ఐరోపా సారసత్వాన్ని అధ్యయనం చేయడానికి ఉపకరించినది. కొంతకాలం తరువాత బాప్టిస్ట్ మిషనరీలు, కొరా మార్క్స్‌మాన్ మరియు వార్డ్‌లు కలిసి సేరమ్‌పోర్ కాలేజిని క్రైస్తవ మత వ్యాప్తికై స్థాపించినారు. 1830లో అలెగ్జాండర్ డఫ్ మరియొక కాలేజిని స్థాపించడం జరిగినది. ఈ ప్రైవేటు సంస్థలు ప్రభుత్వ దృష్టిని ఆకర్షించడం జరిగినది.

విద్యావేత్తలైన డిరోజియో మిషనరీలైన కొరీ పరిపాలనా వేత్తలైన మెకాలే మొదలైనవారు ఆంగ్ల విద్యను అభివృద్ధిపరచడంలో ప్రముఖ పాత్రను నిర్వహించిరి. మెకాలే విదేశీ సంస్కృతిని భారతదేశంలో ప్రవేశ పెట్టడానికి ఎక్కువ కృషి చేసిరి. రాజారామమోహన రాయ్ స్వదేశీ విదేశీ సంస్కృతులను రెంటిని మిళితం చేసినారు. రాజారామమోహన్ ఆంగ్లభాషతో పాటు భారతీయ భాషలకు కూడ ప్రాధాన్యమిచ్చినాడు. ఆయన ప్రోద్బలంతో ప్రభుత్వం 1823లో ఒక సంస్కృత కళాశాలను స్థాపించినారు. ఆ విధంగా సంస్కృత

వ్యాకరణము, అలంకార శాస్త్రాలను యువతకు అందించడం జరిగినది. ఆంగ్ల విద్యను అభ్యసించిన వారిని ప్రభుత్వ ఉద్యోగాలలో నియమించడం జరిగినది. వీరు బ్రిటీష్ ప్రభుత్వానికి విశ్వాసపాత్రులుగా ఉన్నారు. వారి ఆదేశానుసారం నడుచుకునేవారు. సంస్కృత భాషను అభ్యసించిన వారిలో ఎక్కువ మంది బ్రాహ్మణులు వారు కూడ ఆంగ్లం పట్ల ఆకర్షితులైనారు. వారిలో ప్రముఖుడు ఈశ్వర చంద్ర విద్యాసాగర్ (1820 - 91). ఈయన సంస్కృత కళాశాల ప్రధానోపాధ్యాయుడుగా పని చేసినారు. రాజారామ్‌మోహన రాయ్ వలె ఈయన కూడ ఆంగ్ల భాషను ఆహ్వానించినాడు. భారతీయ తత్వాన్ని ఆంగ్లభాషలో బోధించడాన్ని అధ్యయనం చేయడాన్ని ఈయన ప్రోత్సహించినాడు. భారతీయ తత్వం ఎక్కువ భాగం సంస్కృత భాషలో ఉంది.

ఆంగ్ల భాష ఆంగ్ల విద్య మరియు ఆంగ్ల పరిపాలన కలిసి ఉన్నాయి. ఆంగ్ల భాష జాతీయ ఉద్యమాన్ని నడిపించడంలో ఎక్కువ దోహదం చేసింది. ఆంగ్ల భాషా పరిజ్ఞానం వలన మితవాదులు తమ భావనలను బ్రిటీషు వారికి తెలియచేయగల్గినారు. బ్రిటీష్ వారు రూపొందించు ప్రభుత్వ విధానాలను సంస్కరించడానికి దోహదం చేసింది. 1903 గోపాలక్రిష్ణ గోఖలే తన ఉపన్యాసంలో ఇప్పుడు నెలకొని ఉన్న పరిస్థితులలో ఆంగ్ల విద్య ఎంతో విలువైనది మరియు ఉపయోగకరమైనదిగా చెప్పడం జరిగినది. 1913 పండిట్ విషన్ నారాయణం ధార్ అభిప్రాయాలు ఆంగ్ల గ్రంథాలైన హిస్టరీ ఆఫ్ సివిలిడేషన్, మెయిన్ "ఏన్ హన్ట్ లా" మిల్ వ్రాసిన "ఆన్ లిబర్టీ" మరియు "రిప్రజెంటేటివ్ గవర్నమెంట్" ఆల్‌ఫ్రెడ్ యల్ వ్రాసిన ఏషియాటిక్ స్టడీస్, మోర్లే వ్రాసిన కాంప్రమైజ్ బేజ్‌హట్ వ్రాసిన ఫిజిక్స్ మరియు పాలిటిక్స్ సిలీ వ్రాసిన ఎక్స్‌ప్రెషన్ ఆఫ్ ఇంగ్లాండ్ అండ్ లెక్చర్స్ ఇన్ పాలిటిక్స్ ప్రధానమైనవి. ఈ గ్రంథాలను డిగ్రీ స్థాయి విద్యార్థులకు ప్రవేశ పెట్టడం జరిగినది. కాని ఈ పరిజ్ఞానం శాస్త్ర సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందడానికి సరిపోదని మితవాదుల అభిప్రాయం.

అతివాదులు జాతీయ విద్యను సమర్థించినప్పటికి ఆంగ్ల విద్యను బహిష్కరించమని వారిని కోరలేదు. జాతీయ విద్యా కౌన్సిల్ యొక్క ప్రధాన లక్ష్యం ప్రజలలో జాతీయ భావాలను రేకెత్తించడం. బెంగాల్ విభజన కాలంలో బెంగాల్ విభజన వ్యతిరేకోద్యమ కాలంలో విద్యలో జాతీయ భావాలు ప్రతిబింబించవలసిన ఆవశ్యకతను గుర్తించడం జరిగినది. అతివాదుల ధృక్పథంతో జాతీయ విద్యలో భారతీయ విద్యను సంస్కృతి సంప్రదాయాలను తత్వాన్ని ప్రవేశ పెట్టవలసిన ఆవశ్యకతను గుర్తించడం జరిగినది.

## 2.5 రాజకీయ పరిణామాలు :-

విదేశీ పాలన వలన భారతదేశంలో నూతన రాజకీయ పరిణామాలు ఏర్పడినాయి. దీని వలన నూతన రాజకీయ సంస్థలను ఏర్పాటు చేయడం జరిగినది. లా మెంబర్ లా కమీషన్ సుప్రీమ్ కోర్టు మొదలైన సంస్థలను ఏర్పాటు చేయడం జరిగినది. వీటన్నిటి మీద బ్రిటీష్ పార్లమెంట్ అజమాయిషి కలదు. భారతదేశ పరిపాలనను నిర్వహించడానికి బ్రిటీష్ ప్రభుత్వం బోర్డు ఆఫ్ కంట్రోల్ ఇండియా కౌన్సిల్ మొదలైన సంస్థలను ఏర్పాటు చేయడం జరిగినది. భారత జాతీయోద్యమకారులు భారతీయులను ప్రభుత్వ సర్వీసు నియమించవలసినదిగా కోరినారు. ఈ కారణాల చేత 1833వ సంవత్సరంలో ప్రభుత్వ చట్టం చేయడం జరిగినది. 1958వ సంవత్సరంలో విక్టోరియా మహారాణి ఒక ప్రకటన చేయడం జరిగినది. దీనిలో కొన్ని నూతనమైన సంస్కరణలను చేయడం జరిగినది.

1. చట్టం ముందు అందరూ సమానులే.
2. ప్రతిభ ఉన్న వారికి అర్హత కల్పించడం.
3. మత సామరస్యం, మత స్వాతంత్ర్యాన్ని అందరికి కల్పించడం.

లిట్టన్, కర్జన్ పాలనవలన బ్రిటీష్ సామ్రాజ్య నిజ స్వరూపం బయటపడినది. రాజారామ్‌మోహన రాయ్ గోపాల కృష్ణ గోఖలే, సురేంద్రనాద్ బెనర్జీ, దాదాబాయ్ నౌరోజీ మొదలైన వారి యొక్క రాజకీయ పరిజ్ఞానంతో వారు అనేకమైన రాజకీయ సంస్కరణలను సూచించడం ద్వారా బ్రిటీష్ వారి పరిపాలనా విధానాలలో మార్పులను కోరడం జరిగినది. భారతదేశంలో రాజకీయ చైతన్యం రావడానికి వీరు చేసిన కృషి చాలా ఎక్కువ.

భారత జాతీయ కాంగ్రెస్ 1885లో స్థాపించడం జరిగినది. ఇది భారత జాతీయోద్యమ చరిత్రలో కీలకమైన సంఘటన. దీనిని స్థాపించిన వారిలో ప్రముఖులు ఏ.ఓ. హ్యూమ్. ఈయన ప్రభుత్వ కార్యదర్శిగా పని చేశారు. భారత జాతీయ కాంగ్రెస్ మొదటి జాతీయ నాయకులు తమ భావ వ్యక్తీకరణకు ఒక వేదికగా వాడుకొనడం జరిగినది. ఈ భారత జాతీయ కాంగ్రెస్ మొదటిసారిగా సూరత్‌లో 1907లో అతివాద మితవాద వర్గాలుగా విభజన జరిగినది. మితవాదులలో ప్రముఖులు సురేంద్రనాథ్ బెనర్జి, దాదాబాయ్ నౌరోజీ, గోపాలకృష్ణ గోఖలే. మితవాదులు రాజ్యాంగబద్ధంగా పరిమాణాత్మక మార్పులను సూచించినారు. 1915 - 1920 వరకు అతివాద శకంగా చెప్పవచ్చును. అతివాదులలో ప్రముఖులు బాలగంగాధర్ తిలక్, లాలాలజపతిరాయ్, అరవింద ఘోష్. వీరు స్వదేశీ, స్వరాజ్ మరియు జాతీయ విద్యకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినారు. 1920 నుండి గాంధీ శకంగా పేర్కొనడం జరిగినది. గాంధీ భారత రాజకీయాలలో ప్రముఖ పాత్రను నిర్వహించడం జరిగినది. భారత జాతీయ కాంగ్రెస్ ప్రధానంగా మధ్య తరగతి వర్గం పనిచేయడం జరిగినది.

## 2.6 ఆర్థిక పరిణామాలు :-

16, 17వ శతాబ్దాలలో భారతదేశం బ్రిటీష్ ఫ్రెంచ్, డచ్ కంపెనీలు తమ వ్యాపార కార్యకలాపాలను కొనసాగించడం జరిగినది. ఐరోపాలో పెట్టుబడిదారీ విధానాలు, విస్తృతంగా కొనసాగుతున్న సమయంలో వీరు వ్యాపార కార్యకలాపాల ద్వారా లాభాలు గడించి వారి ఆర్థిక పురోగతికి దోహదం చేయడం జరిగినది. దీని వలన భారతదేశంలో ఆర్థిక భారం పెరుగుతూ వచ్చినది. భారతదేశ ఆర్థిక అభివృద్ధికి వీరు ఏవిధమైన ప్రాధాన్యతను ఇవ్వలేదు. ఇంగ్లండ్ పారిశ్రామిక విప్లవ ప్రభావం వలన బ్రిటీష్ వారు బెంగాల్ సంపదను దోచుకొనడం జరిగినది. అంతేకాక భారతదేశంలో స్వదేశీ పరిశ్రమలు పని చేయకుండా పోవడానికి ఇది కారణభూతమైనది. ముఖ్యంగా ఢాకా మార్షిదాబాద్‌లలోని చేనేత మిల్లు పై తయారైన మాన్ చెస్టర్ వస్త్రాలను భారతదేశంలో విక్రయించడం జరిగినది. భారతదేశంలో ఉత్పత్తి అయ్యే వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాధాన్యత లేకుండా పోయినది. నగరాల వ్యాప్తి వలన గ్రామీణ ప్రాంతాల సౌకర్యాల మీద దృష్టిని సారించలేదు. గ్రామీణ ప్రాంతాలలో వ్యవసాయమే ప్రధాన వృత్తిగా తమ జీవనాన్ని సాగించడం జరిగినది. ఈ వ్యవసాయం ఋతుపవనాల పై ఆధారపడి ఉండటం వలన ఎక్కువ నష్టాలలోనే ఉండేది. రైతులకు ఋణ భారం ఎక్కువగా ఉండేది. అప్పటికి భారతదేశంలో ఫ్యూడల్ వ్యవస్థ ప్రభావం ఉంది. భూమి పై గుత్తాధిపత్యం కొద్ది మందికే ఉండేది. రైతులు పన్ను చెల్లించవలసి ఉండేది. మొగల్ సామ్రాజ్యకాలంలో ఈ ఫ్యూడల్ ప్రభావం ఎక్కువగా ఉండేది. బ్రిటీష్ వారి సామ్రాజ్యవాద ప్రభావం వలన నూతన పెట్టుబడిదారీ వర్గం నగరాలలో వ్యాపించడం వలన జాతీయ ఉద్యమాలకు వారు విరాళాలను ఇవ్వటం జరిగినది. నగరాలలో ఉన్న బనియా వర్గం బ్రహ్మ సమాజ్, ఆర్య సమాజ్, భారత జాతీయ కాంగ్రెస్, సోషలిస్ట్ మరియు కమ్యూనిస్ట్ ఉద్యమాలకు విరాళాలను ఇవ్వడం జరిగినది. 19, 20 శతాబ్దాల కాలంలో ఉద్భవించిన నూతన ఆర్థిక పరిణామాల వలన వ్యాపార వాణిజ్యాలు, బ్యాంకింగ్ పరిశ్రమలు బాగుగా అభివృద్ధి చెందినాయి. వీని వలన సాంఘిక రాజకీయ ఉద్యమాలు వెలుగులోకి వచ్చినాయి.

బ్రిటీష్ వారి యొక్క సామ్రాజ్య పెట్టుబడి విధానాల ప్రభావం సామాజిక రాజకీయ పరిస్థితుల మీద ఉంది. వీనిలో ప్రధానంగా స్త్రీ యొక్క సామాజిక పురోగతిని పునరుద్ధరించవలసిన అవశ్యకతను గూర్చి మరియు వివాహ వ్యవస్థలో మార్పును తీసుకొనిరావలసిన ఆవశ్యకతను ఆనాడు గుర్తించడం జరిగినది. ఈ మార్పును తీసుకొని రావడం కోసం కేశవ చంద్రసేన్, ఈశ్వర్ చంద్ర విద్యాసాగర్, దయానంద సరస్వతి, మలబర్జీ, తెలంగ్, రనడే లు కృషి చేయడం జరిగినది. బ్రిటీష్ పాలకులు భారతీయుల సామాజిక వ్యవహారాలలో జోక్యం చేసుకొనుటకు ఇష్టపడలేదు. వీరు ఈ విధంగా జోక్యం చేసుకొనకపోవడానికి ప్రధాన కారణాలు భారతీయుల నుండి తిరుగుబాటు వస్తుందనే భయం మరియొకటి వారు రాజకీయ విముక్తికై పోరాటాన్ని సాగించుతారనే ఆపోహ కూడ వారిలో ఉంది. బ్రిటీష్ భారతదేశంలో కేవలం ఆర్థికపరమైన లాభాలకు రాజకీయ పాలన కోసం మాత్రమే తమ శక్తి యుక్తులను వినియోగించినారు. కాని భారతీయుల సామాజిక సమస్యల అవగాహనకు వారు కృషి చేయలేదు. వారు సామాజిక సమస్యల విషయంలో తటస్థ వైఖరిని కొనసాగించడం జరిగినది. రాజకీయ నాయకుల ప్రోద్బలంతో సామాజిక పరంగా కొన్ని శాసనాలను రూపొందించడం జరిగినది.

ఆధునిక భారత జాతీయ స్వతంత్రోద్యమం విశ్వ జనీనమైనది. ఆధునిక భారతదేశంలో భూర్జువా మేధావి వర్గ రాజకీయాలలో ప్రముఖ పాత్రను నిర్వహించడం జరిగినది. వీరి పై పాశ్చాత్య రచనల ప్రభావం ఎక్కువగా కలదు. సురేంద్రనాథ్ బెనర్జీ, లాలాజపతి రాయ్, విడిసావర్కర్ మొదలైన వారు మాజీ నాయకత్వం వలన ఎక్కువగా ప్రభావితులైరి గాంధీ, టాల్‌స్టాయ్, రస్కిన్, ఎడ్వాడ్ కార్పెంటర్ మరియు సోక్రటీస్, బెర్గసన్, హెగెల్ మరియు నిషే వలన ప్రభావితులైనారు. 1920 తరువాత మార్క్స్, లెనిన్, ముస్సోలినీ, హిట్లర్ యొక్క భావాలు కమ్యూనిస్టులను సోషలిస్టులను ఫార్వాడ్ బ్లాకిస్టులను ప్రభావితం చేయడం జరిగినది.

భారత జాతీయ సమరం సాంస్కృతిక పునరుజ్జీవనం కేవలం పాశ్చాత్య భావనల వలననే ప్రభావితమైనదని చెప్పడానికి వీలులేదు. భారతీయ సంస్కృతి నాగరికతల ప్రభావం కూడ దీనిపై కలదు. భారతీయులలో దేశభక్తిని ప్రేరేపించినది ప్రధానంగా రామదాస్, శివాజీ, మహదాజీ సింధియా, రంజిత్ సింగ్ మొదలైన వారిని మరియు 1857 ఉద్యమనాయకులు. ఆవరి యొక్క జాతీయోద్యమము భారత జాతిని లౌకికతత్వం వైపు మళ్ళించినది. మహారాష్ట్రలో హిందూ - పద్ - పదక్షిణిని పీష్వా బాజీరావ్ స్థాపించడం జరిగినది. దాని ద్వారా భారత రాజకీయాలలో పాశ్చాత్య సంస్కృతి మరియు భారత నాగరికత మిళితమైనవి. భారత జాతీయోద్యమం పై జర్మన్ ఆదర్శవాదం మరియు మార్క్సిజం యొక్క ప్రభావం ఉంది. కౌంట్ యొక్క నైతిక వాదం జర్మన్ నాజీ భావ జాలం పై స్పష్టంగా కన్పిస్తుంది. భారత జాతీయవాదం ఎక్కువ కౌంట్ వెల్లడి చేసిన నైతిక అంశాల వలన ప్రభావితమైనది. కాని రాజకీయ అంశాల వలన మాత్రం కాదు.

కొన్ని వేల సంవత్సరాల హైందవ సంస్కృతి పై బైబిల్ మరియు ఖురాన్‌ల యొక్క ప్రభావం ఎక్కువగా ఉంది. దానితో పాటుగా గురునానక్ బోధనల ప్రభావం కూడ విశేషంగా ఉంది. దీనివలన హైందవ మతంలో ఉన్న సంకుచిత భావం పోయి విశాల దృక్పధం ఏర్పడినది. బిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడానికి ఇది దోహదకారి అయినది. సనాతన హిందూ సంస్కృతికి, ఆధునిక హిందూ సంస్కృతికి మధ్య తేడా, ముస్లింల పరిపాలన. ఈ పరిపాలన యొక్క ప్రభావం భారతదేశం పై ఉంది. పాలకుడు సర్వాధికారి అతని యొక్క మాట శాసనంగా ఉండేది. షేర్‌షా పాలనలో రోడ్లు, బావులు మొదలైన సదుపాయాలు ఏర్పాటు చేయటం కొన్ని ప్రజాప్రయోజన కార్యక్రమాలను నిర్వహించటం జరిగినది. తరువాత అక్బర్ తోడర్ మల్ కాలంలో రెవిన్యూ వ్యవస్థను అభివృద్ధిపరచడంలో ప్రముఖ పాత్ర నిర్వహించడం జరిగినది.

భారతదేశంలో మతపరమైన ఐక్యత కలగకపోవడానికి ప్రధాన కారణాలు మూడు. భావ జాలం, భాషాపరమైన ఐక్యత, భౌగోళిక ఐక్యత లేకపోవడం. ఈ మూడు లక్షణాలు ఉన్నచో మత సామరస్యం ఉంటుంది. ఇవి లోపించినచో వేర్పాటువాదం పని చేస్తుంది.

భారతీయ సంస్కృతిలో శ్రమకు గౌరవం లేదు. అగ్రవర్ణాలైన బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్యులు శ్రమ చేసేవారు కారు. శూద్రులు శ్రమ జీవులుగా ఉండేవారు. వారికి గౌరవ స్థానం ఉండేది కాదు. జాతి వివక్షత అనేది ఈ భావం వలన వచ్చినది. దీని వలన సమాజంలో ఆర్థిక అసమానతలు కూడ ఎక్కువగా ఉండేవి. ఈ సామాజిక సమస్య ఆధునిక యుగంలో లేదు. ఈ వర్ణ వ్యవస్థ మాయమై కులవ్యవస్థ ఉద్భవించినది. కుల వ్యవస్థ, వర్ణ వ్యవస్థ మధ్య చాలా వ్యత్యాసం ఉంది. పురాతన కాలంలో ఉన్న వర్ణాలు అగ్ర కులాలుగా మారాయి. శూద్రులు కొందరు అగ్రకులాలలో ఉన్నారు. ఈ విధమైన వ్యత్యాసాల వలన సామాజిక సంస్కర్తలు కొందరు దళితులకు ప్రత్యేక అవకాశాలను కల్పించడం జరిగినది. భారతదేశంలో ఆధునికత అనేది ఎప్పుడు వచ్చిందనేది చెప్పడం చాలా కష్టం.

దక్షిణ భారతదేశంలో ద్రవిడమున్నేట్ర కజగం (తమిళనాడు), మహారాష్ట్రలో శివసేన మొదలైన ప్రాంతీయ పార్టీలు మతపరమైన, భాషాపరమైన తత్వాలను ఆధారంగా చేసుకొని వచ్చినవి. ఈ ఉద్యమాలు బ్రాహ్మణ వ్యతిరేక ఉద్యమాలుగా, హిందీ వ్యతిరేక ఉద్యమాలుగా పేరొందినవి. ఈ సమస్యల వలన భారతదేశంలో ఏర్పాటు వాదం ప్రబలినది.

ఆధునిక భారతీయ తత్వం ఎప్పుడు మొదలైనది అనేది ఒక పెద్ద సమస్య. S.C. సర్కార్, షాఫత్ అహమ్మద్ ఖాన్ అభిప్రాయంలో మొగల్ పరిపాలన ఆరంభంలో భారతదేశంలో ఆధునికత ప్రారంభమైనది. మొగలుల రాజకీయ వ్యవస్థ జాతి రాజ్యాన్ని పోలి ఉంది. లౌకికతత్వం కూడ వీరి పాలనలోనే ఉద్భవించినది. కళలు అందమైన భవన నిర్మాణావకాశం వీరిపాలనలోనే ఉంది. రనడే అభిప్రాయంలో ఆధునికత బ్రిటీష్ వారి కాలానికి ముందు ఉందని పేర్కొన్నాడు. ఈ కాలంలోనే భారతదేశంలో వ్యక్తి శ్రేయోవాదం సామాజిక సమానత్వ మొదలైన భావాలు మరాఠీ గురువులు మరియు ప్రొటెస్టెంట్‌ల వలన ఎక్కువ ప్రాచరంలోకి వచ్చినవి. V.P. వర్మ యొక్క అభిప్రాయంలో 1773వ సంవత్సరంలో మలుపు ఆరంభమైనదని పేర్కొన్నాడు. లా, పొలిటీజారిస్‌ప్రుడెన్స్ మొదలైన వాటిలో సనాతన హిందూ, సంప్రదాయం మరియు మధ్య యుగాలలో హిందూ, ముస్లిం సంప్రదాయాల ప్రభావం విశేషంగా ఉంది. ఈదని వలన సమ న్యాయపాలన ప్రవేశ పెట్టటం, వర్ణ వివక్షత, సామాజిక అసమర్థతలు మొదలైన సమస్యలను పారద్రోలడానికి ప్రయత్నం జరిగినది.

## 2.7 సారాంశం :-

భారతీయ ఆత్మను మేల్కొల్పినది, మతపరమైన, సాంస్కృతికపరమైన, నైతిక ఆధ్యాత్మికపరమైన ఉద్దేశాలతో కూడినది. విదేశీ పాలనకు వ్యతిరేకంగా స్వదేశీ శక్తులు దేశంలో సనాతన సంస్కృతిని తిరిగి పునరుద్ధరించడానికి తమ వంతు ప్రయత్నం చేయడం జరిగినది. అతివాదుల దృక్పథంతో జాతీయ విద్యలో భారతీయ విద్యను సంస్కృతి సంప్రదాయాలను తత్వాన్ని ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకతను గుర్తించడం జరిగినది. విదేశీ పరిపాలన వలన భారతదేశంలో నూతన రాజకీయ పరిణామాలు ఏర్పడినాయి. బ్రిటీష్ వారి యొక్క సామ్రాజ్య పెట్టుబడి విధానాల ప్రభావం సామాజిక, రాజకీయ పరిస్థితుల మీద ఉంది. భారత జాతీయ సమరం సాంస్కృతిక పునరుజ్జీవనం కేవలం పాశ్చాత్య భావనల వలననే ప్రభావితమైనదని చెప్పడానికి వీలు లేదు.

## 2.8 మాదిరి ప్రశ్నలు :-

1. సారస్వతమైన అంశాల ప్రభావం గూర్చి వ్రాయుము?
2. భక్తి మార్గం యొక్క ప్రభావం, ఆంగ్ల విద్య యొక్క ప్రభావము గూర్చి వ్రాయుము?
3. రాజకీయ, ఆర్థిక పరిణామాల గూర్చి వ్రాయుము?

## 2.9 ఆధార గ్రంథాలు :-


1. Modem Indian Political Thought - Sankar Ghose
2. Modem Indian Political Thought - V.P. Varma
3. British Attitudes towards India(1748 - 1858) - G.D. Bearce
4. Dayananda Saraswathi Light of Truth - Dr Chiranjiva Bharadwaja
5. Independence and After - Jawaharlal Nehru
6. A History of Nationalism in The East - Kohm, Hans
7. The Renaissance in India - Andrews C.E.
8. India Wins Freedom - Azad, Abul Kalam


Dr. L. SARADA

పాఠం - 3

# రాజా రామమోహన్ రాయ్

## 3.0 లక్ష్యం :-

రాజా రామ్మోహన్ రాయ్ ఆత్మీయ సభ అనే సంస్థ ద్వారా బాల్య వివాహాలకు, కుల వివక్ష నిర్మూలనకు వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహించే వాడు. దేశ ప్రజల పరిస్థితి బాగు కోసం ఆయన చేసిన కృషి గూర్చి పత్రికా స్వేచ్ఛను పునరుద్ధరించడంలో ఆయన కృషి గూర్చి, ఆయన ప్రతిపాదించిన సార్వజనీన సిద్ధాంతాన్ని గూర్చి, ఆయన స్థాపించిన బ్రహ్మ సమాజాన్ని, వాటి సిద్ధాంతాల్ని గూర్చి తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :-


3.0 లక్ష్యం

3.1 పరిచయం

3.2 రాజా రామమోహన్ రాయ్

3.3 విద్యాభ్యాసం

3.4 ఆత్మీయసభ

3.5 యూనిటేరియన్ సంఘము

3.6 సంఘ సంస్కరణలు

3.7 వార్తా పత్రికల స్వేచ్ఛ, అభివృద్ధి

3.8 మానవతావాదము మరియు విశ్వమానవ మతము

3.9 బ్రహ్మ సభ - బ్రహ్మ సమాజం

3.10 బ్రహ్మ సమాజ సిద్ధాంతము

3.11 రాజకీయ భావాలు

3.12 సారాంశము

3.13 మాదిరి ప్రశ్నలు

3.14 ఆధార గ్రంథాలు


## 3.1 పరిచయం :-

ఆధునిక భారతదేశ చరిత్రలో అంధకార యుగంగా చెప్పదగిన కాలం అది. ప్రాచీన సామాజిక, రాజకీయ వ్యవస్థలు పూర్తిగా విచ్ఛిన్నం అయ్యాయి. ఈ విధంగా విచ్ఛిన్నమైన సమాజాన్ని పునరుద్ధరించేందుకు అప్పటికి ఇంకా ప్రయత్నాలు ప్రారంభం

కాలేదు. అనేక మూఢాచారాలు, సంకుచిత సాంప్రదాయాలు సమాజ అభివృద్ధికి తీవ్రమైన ప్రతిబంధకాలుగా రూపొందాయి. ఈ క్లిష్ట తరుణంలో రాజా రామమోహన్ రాయ్ రంగ ప్రవేశం చేశాడు. రామ్మోహన్‌రాయ్ ప్రవేశం నాటికి దేశంలో ముస్లింల పాలన అంతిమ దశలోఉంది.

భారతదేశంలో వాణిజ్యం సాగించేందుకు వచ్చిన బ్రిటీష్ వర్తకులు క్రమంగా పరిపాలకులుగా పరిణమిస్తున్నారు. అప్పటికి పదిహేను సంవత్సరాలముందే అంటే, 1757లో ప్లాసీ యుద్ధం బెంగాలు భవిష్యత్తును నిర్ణయించింది. ఆ అల్లకల్లోల పరిస్థితులలోనే కొన్ని నూతన ధోరణులు క్రమంగా రూపుదిద్దుకొంటున్నాయి.

బ్రిటన్ పాశ్చాత్య ప్రపంచానికి ప్రతినిధిగా భారతదేశానికి వచ్చింది. బ్రిటీష్ వారు కేవలం వర్తకం కోసమే రాలేదు. వారు దేశాన్ని నిద్రావస్థ నుంచి మోల్కొలిపి, జాగృతం చేసేందుకు భారతీయ జీవనంలో ఒక నూతన స్రవంతిని ఉత్సాహాన్ని నింపేందుకు చరిత్ర నియమించిన ప్రతినిధిలా దేశంలో అడుగు పెట్టారు.

భారతదేశంలో ముస్లింలు ప్రవేశించాక, జ్ఞాన సంపన్నులైన మహా పురుషులెందరో అవతరించారు. వారు హిందూ తాత్విక ప్రపంచానికీ ఇస్లామ్‌కు మధ్య చక్కని సయోధ్యను ఏర్పరచినారు. ఈ మహా ప్రయత్నములో కబీర్, గురునానక్ వంటి మార్గదర్శకులెందరో పాల్గొన్నారు. అయితే విడివిడిగా ఉన్న మౌళిక భావాలను భౌతికమైన బంధం ద్వారా సమైక్యపరచటం వల్ల వారికి సాధ్యపడలేదు. సంయోగ పద్ధతుల ద్వారా ఈ సమైక్యత సాధ్యం అవుతుంది. పాశ్చాత్య ప్రపంచంతో ఈ సమైక్యతను సాధించడమే ఆ కాలం ప్రధాన లక్ష్యం. చరిత్రలోని ఆ నిర్ణీత సమయంలో భారతదేశపు భవిష్యత్తును నిర్ణయించే అవకాశం రామమోహన్ రాయ్‌కి లభించింది.

## 3.2 రాజా రామమోహన రాయ్ జననం :-

1772 మే నెల 22వ తేదీన రామమోహన రాయ్ బెంగాలులోని రాధా నగర్‌లో ఒక సనాతన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. రాధా నగర్ ఆ రోజుల్లో భారతీయ సంస్కృతికి కేంద్రంగా ప్రసిద్ధి చెందింది. రామమోహన్‌రాయ్ కుటుంబ సభ్యులు చాలా కాలంపాటు ముర్షీదాబాదు ముస్లిం పాలకుల దగ్గర ఉద్యోగం చేశారు.. రామ్మోహన్‌రాయ్ తండ్రి సనాతన హిందువు, తల్లి సౌశీల్యవంతురాలు. ఈ దంపతుల సంతానం రామమోహన్, జగ్‌మోహన్ అనే ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె.

## 3.3 విద్యాభ్యాసం :-

రామమోహన్ ప్రాథమిక విద్యను గ్రామంలోని పాఠశాలలో నేర్చుకొన్నాడు. ఈయన ఒక మౌల్వీ దగ్గర పారశీక భాష కూడ నేర్చుకున్నాడు. అలా గ్రామంలో కొన్నాళ్ళు విద్యాభ్యాసం చేసిన రామమోహన్ రాయ్‌ని ఆయన తండ్రి పాట్నాకు పంపించాడు. ఆ రోజుల్లో పాట్నా ఇస్లా విద్యకు కేంద్రంగా ఉండెడిది. రామమోహన్ అరబ్బీ, పారశీక భాషలు నేర్చుకొన్నాడు. ఖురాన్‌ని, ఇస్లామ్ వేదాంతాన్నీ క్షుణంగా అధ్యయనం చేశాడు. అరబ్బీ ఆనువాదాల రూపంలో లభ్యమయినంత మేరకు యూక్లిడ్, అరిస్టాటిల్ రచనలను అధ్యయనం చేశాడు. ఖురాన్‌లోని ప్రజాస్వామ్య భోదనలు ఆయన పై ఎంతో ప్రభావాన్ని కనపరచాయి. అదే విధంగా అరబ్బీ ఆలోచనా స్రవంతిలో గోచరించే తార్కిక ధోరణి ప్రభావం కూడా ఆయన పై ప్రభావం చూపాయి. పారశీక వేదాంతాలైన సూఫీల నిగూఢమైన కవితా తాత్విక విశేషాలు కూడా రామమ్మోహన్‌ని ఎక్కువగా ప్రభావితం చేశాయనుటలో సందేహం లేదు. రామమోహన్ ఉపనిషత్తుల సారాన్ని గ్రహించి తన పదహారవ యేట బెంగాలీ భాషలో విగ్రహారాధన మొదలైన మూఢ విశ్వాసాల గురించి ఒక గ్రంథాన్ని రచించాడు. కొన్ని కుటుంబ పరిస్థితుల కారణంగా టిబెట్‌లో కొంత కాలాన్ని గడిపాడు. ఆ సమయంలోనే బౌద్ధమతంలోకి ప్రవేశించిన విగ్రహారాధన సాంప్రదాయాన్ని విమర్శించి, టిబెట్ లోని లామా మత గురువుల అసంతృప్తికి గురి అయ్యాడు. ఆ తరువాత రామ్ టిబెట్ నుంచి వారణాసి చేరుకొన్నాడు. అక్కడ ఆయన అనేక సంవత్సరముల పాటు వేద విద్యను అభ్యసించాడు.

అటు పిమ్మట రామమోహన్ రాయ్ ఈస్టిండియా కంపెనీ పాలనలో రెవెన్యూ శాఖలో ఉద్యోగం చేస్తూనే "తుహ్‌ఫత్ - ఉల్ - మువాహ్ - హిదన్' (ఏకేశ్వరోపాసకులకు ఒక కానుక) అనే గ్రంథాన్ని పారశీక భాషలో వ్రాసి, దానికి అరబ్బీ భాషలో ఒక పీఠిక

వ్రాశాడు. ప్రపంచ మత సంప్రదాయాలన్నింటిలో పొడచూపిన విగ్రహారాధన ఛాయలన్నింటిని అరబ్బీ, పారశీక భాషల్లో వెలువడిన ఈ చిన్న ప్రచురణలో ఆయన బహిరంగంగా ఖండించాడు. ఈ కాలంలోనే ఆయనకు హరిహరానందస్వామి అనే గొప్ప పండితునితో పరిచయం లభించింది. ఆయన సహాయంతో రామమోహన్ రాయ్ తాంత్రిక సిద్ధాంత సాహిత్యాన్ని క్షుణ్ణంగా చదివాడు. రాయ్ రంగాపూర్ అనే గ్రామంలో నివసించే కాలంలో ఆ గ్రామం ముఖ్యంగా అన్ని మతముల వారికి కూడలిగా ఉండెడిది. ముస్లింలు, జైనులు వర్తకం చేసుకోవడానికి అక్కడకు వచ్చేవారు. రాయ్ జైనులతో కలిసి కల్ప సూత్రాన్నీ తదితర జైన మత గ్రంథాలను శ్రద్ధగా చదివాడు. రంగాపూరులో ఉన్నప్పుడు రామమోహన్ రాయ్ ఇంగ్లండ్, యూరప్‌ల రాజకీయ పరిస్థితుల గురించి ఆసక్తి కనబరచేవాడు. ఇతను ఇంగ్లండ్ నుంచి తెప్పించే పత్రికలను వార్తా పత్రికలను ఆసక్తితో చదివేవాడు. అలా రాయ్ ఇరవై రెండవ యేటనే ఆంగ్ల భాషలో పరిజ్ఞానాన్ని పెంపొందించుకున్నాడు. రామమోహన్ రాయ్ అప్పట్లో యూరప్‌లో వ్యాప్తిలో వున్న రాజకీయ ఉదారవాద ప్రభావం పట్ల ఆకర్షింపబడ్డాడని తెలుస్తుంది.

అటుపిమ్మట 1814లో డిగ్బీ దొరగారు ఈస్టిండియా కంపెనీ ఉద్యోగం వదిలి భారతదేశం నుంచి ఇంగ్లండు వెళ్ళి పోవటంతో రామమోహన్ రాయ్ కూడ తాను అన్నేళ్ళుగా ఈస్ట్ ఇండియా కంపెనీలో చేస్తున్న ఉద్యోగం మానేసి కలకత్తాలో స్థిర నివాసం ఏర్పరచుకున్నాడు.

ఈ కాలంలోనే రామమోహన్ రాయ్ దృష్టి శతాబ్దాల తరబడి వస్తున్న సాంఘిక ఆచారాలు, మూఢ విశ్వాసాలు, అలవాట్లు మొదలైన వాటిలో గోచరించిన భారతదేశపు వాస్తవాలను వెలికి తీసి, వాటిని ప్రపంచపు సజీవ ఆలోచనా విధానాలకు, నూతన కాలానికి తగినట్లుగా మలచాలన్న తన జీవిత కార్యక్రమాన్ని ప్రారంభించడానికి ఆయన అప్పటికి పూర్తిగా సంసిద్ధుడయ్యాడు. తూర్పు ఇండియా వర్తక సంఘ ఉద్యోగం నుండి విరమించగానే శ్రద్ధగా గ్రంథపఠన సాగించడానికి తీరిక, అవకాశం లభించాయి. అంతేకాకుండా ఇతని దృష్టి దేశ ప్రజలు ఎదుర్కొంటున్న తీవ్రమైన సమస్యల వైపు తిరిగింది. 1814 ఇంగ్లండు నుంచి తిరిగి వచ్చిన రామమోహన్ రాయ్ కలకత్తాలో స్థిర నివాసం ఏర్పరచుకొని సామాజిక, మత సంస్కరణ ఉద్యమాలలో పాల్గొన్నాడు. ఆ రోజుల్లో బెంగాలు సెరాంపూరు క్రైస్తవ మిషనరీలకు కేంద్రంగా వుండేది. ఈ మిషనరీ సంస్థలలో పేరు గాంచిన రెవరెండ్ విలియంకేరి వంటి వారికి బెంగాలు ఋణపడి వుంది. కలకత్తాలో రామమోహన్ రాయ్‌కి సెరాంపూరు క్రైస్తవ మిషనరీలతో పరిచయం ఏర్పడింది. ఈ కాలంలోనే క్రైస్తవ మిషనరీలు ప్రజలను మత మార్పిడికి ప్రయత్నించడం వల్ల సెరాంపూరు మిషనరీ సంస్థలు ప్రజలలో మత విభేదాలు సృష్టించారన్న భావన వుండెడిది. అదీకాక ఈ మిషనరీ సంస్థలు హిందూ మతానికి వ్యతిరేకంగా ప్రచారం చేసేటప్పుడు ప్రదర్శించే పక్షపాత ధోరణీ, హిందూ మతమును గూర్చి అవగాహన లేకపోవడమ వ్యక్తమయ్యేవి. ఈ నేపథ్యంలోనే రామమోహన్ రాయ్ క్రైస్తవుల బైబిల్‌ను అధ్యయనం చేసి గ్రీకు, లాటిన్, హిబ్రూ భాషలను నేర్చుకొని జీసెస్ క్రైస్ట్ బోధనలను మెచ్చుకున్నాడు. అయితే బైబిల్‌లోని పాత వాదాన్ని అతి తేలికైన అద్భుతాలను తిరస్కరించాడు. క్రైస్తవ మతానికి హిందూ మతం ఏ మాత్రము తీసిపోదని వాదించాడు.

రామమోహన్ రాయ్‌చే నడుపబడే పత్రికలు 'బ్రహ్మన్ సెబధి' అనే బెంగాలీ పత్రికలోను, 'బ్రహ్మానికల్ మాగజైన్' అనే ఆంగ్ల పత్రికలలో హిందూ ఏకేశ్వరోపాసనా విధానాన్ని, వేదాంతాన్ని సమర్థిస్తూ సెరాంపూరు మిషనరీల వ్యతిరేకతను ప్రతిఘటించసాగాడు. అంతే కాకుండా క్రైస్తవుల త్రికరణ సిద్ధాంతాన్ని (trinitarisim) తీవ్రంగా విమర్శించాడు. రామమోహన్ రాయ్ ఈ సంస్థలతో చర్చలను 1820 నుంచి 1823 మధ్య కాలం వరకు కొనసాగించాడు. 1820లో రామమోహన్ రాయ్ "ఏసు బోధనలు - శాంతికీ, సంతోషానికీ మార్గదర్శి" (The percepts of Jesus, the guide to peace and hapiness) అనే చిన్న పుస్తకం ప్రచురించాడు. అందులో క్రొత్త నిబంధన (New-Testment) గ్రంథంలోని సిద్ధాంత భాగాన్ని, హేతుబద్ధంగాని అభిప్రాయాలను విమర్శించాడు. రెవరండ్ డిమోకర్ష్మిట్ అనే క్రైస్తవ మత గురువు రామ్మోహన్‌ను 'విగ్రహారాధకుడు' అనీ, 'సత్యకార్యకలాపాలకు కీడు చేసే వాడని' విమర్శించాడు. రామ్మోహన్ ష్మిట్‌కు సమాధానం చెప్పే తీరులో "క్రీస్తు బోధనలు" గ్రంథాన్ని సమర్థిస్తూ క్రైస్తవ ప్రజలకు విన్నపం (An appeal to Christian Public) ప్రచురించాడు. 'ది ఫ్రెండ్ అఫ్ ఇండియా' డాక్టరు జాషువా మార్షమన్ ఇందుకు వ్యతిరేకంగా వ్రాశాడు. రామమోహన్ క్రైస్తవ ప్రజలకు రెండువ విన్నపం (Second Appeal to the Christian Public) లో దానికి సమాధానమిచ్చాడు.

అది 1821లో ప్రచురించబడింది. 1823లో రామమోహన్ 'క్రైస్తవ ప్రజలకు తుది విన్నపం' (Final Appeal to the Christian Public) వెలువడింది. సెరాంపూరు మిషనరీ సంస్థల పత్రికలు వేదాంతాన్ని, హిందూ ఏకేశ్వర విధానాన్ని విమర్శించటం వల్ల రామ్మోహన్ ఆ విమర్శలను ప్రతి ఘటిస్తూనే 1823లో 'బ్రహ్మెనకల్ మాగజైన్' తన వాదనలను ప్రచురించవలసి వచ్చింది.

## 3.4 ఆత్మీయసభ :-

1815లో రామ్మోహన్‌రాయ్ ఆత్మీయ సభ అనే సంస్థను నెలకొల్పాడు. ఈ సంస్థ ద్వారా బాల్య వివాహాలకు వ్యతిరేకంగా, కుల వివక్ష వంటి సాంఘిక దురాచాల నిర్మూలనకు వ్యతిరేకంగా ఉద్యమాలను నిర్వహించేవాడు. ఈ సంస్థ ద్వారా మతపరమైన చర్చలను నిర్వహించాడు. అంతేగాక మత సమైక్యతను ప్రచారము చేయడం ఆత్మీయ సభ లక్ష్యాలు. కలకత్తా నగరమందు స్థిర నివాసమేర్పరుచుకొన్న తరువాత రామ్మోహన్ రాయ్ అనేక గ్రంథములను రచించాడు. 1815లో వేదాంత సూత్రమును బెంగాలీ భాషలోకి అనువదించాడు. 1816లో వేదాంతసారమును బెంగాలీ భాషలోకి, వేదాంతాన్ని ఆంగ్ల భాషలోకి అనువదించాడు. అదే సంవత్సరములో ఆయన ఈశ, కేనోపనిషత్తులను బెంగాలీ, ఆంగ్ల భాషలోకి, 1817లో కాఠిన్యో, మాండూక్యోపనిషత్తులను వంగ భాషలోకి అనువదించాడు.

వేదాంతాన్ని, ఉపనిషత్తులనూ బెంగాలీ, ఆంగ్ల భాషలోకి అనువదించడానికి జరిగిన తొలి ప్రయత్నాలు అవే. 1823లో రామ్మోహన్ రాయ్ ఒక సిద్ధాంత గ్రంథాన్ని రచించాడు. "హిందూ స్త్రీల హక్కుల పై దురాక్రమణ" (The Encrachment on the rights of the Hindu Females) అనే గ్రంథములో ఆయన హిందూ స్త్రీలకు తమ తండ్రుల, భర్తల ఆస్తులలో హక్కు ఉండాలని కోరాడు. 1827లో ఆయన మృత్యుంజయుడు వ్రాసిన 'వజ్రసూచి' అనే సంస్కృత గ్రంథాన్ని ఆవిష్కరించి ప్రచురించాడు. కుల, వర్ణ వివక్షతలకు వ్యతిరేకంగా వ్రాసిన గ్రంథం ఇది.

## 3.5 యూనిటేరియన్ సంఘము (ఏకేశ్వరోపాసకుల సంఘము) :-

రామమోహన్ రాయ్ 1821లో యూనిటేరియన్ సంఘాన్ని స్థాపించాడు. ఈ సంఘానికి ఇతను మార్గదర్శిగా వుండి ఆర్థిక సహాయం కూడా చేశాడు. దేశ ప్రజల పరిస్థితి అన్ని విధాల మెరుగుపడాలన్నదే ఈ సంఘం వారి ఆశయం. ఈ సంఘం సూత్రావళిలోని ఆశయాలను, ధ్యేయాలను అతడే రచించాడు. ఈ సంఘం ఆశయాలను గురించి, ధ్యేయాల గురించి రామ్మోహన్ రాయ్ ఈ విధంగా పేర్కొన్నాడు. "ఏవేవి విద్య వల్ల కలిగే లాభాలను వ్యాపింపజేస్తాయో, ఏవి బుద్ధి స్థాయిని పెంపొందిస్తాయో, ఏవి నైతిక సిద్ధాంతాలను పరిశుభ్రపరుస్తాయో, ఏవి విశ్వాసాత్మకమైన ధాతృత్వాన్ని, ప్రయోగాత్మకమైన దయను పెంపొందిస్తాయో, అవన్నీ వీటి నిర్మాణ పరిధికి చెందినవిగా పరిగణించబడతాయి. ఈ దేశంలోని అసంఖ్యాకులైన ప్రజల బాహ్య స్థితిని మెరుగుపరచడం, ఉపయోగపడే కళలను ప్రోత్సహించడం, ప్రజలలో ఎడతెరగక పరిశ్రమించే అలవాట్లలను పెంపొందించి వారి సాంఘిక, కుటుంబ సౌఖ్యాలను పెంపొందించడం ఇవే తన ప్రధాన ధ్యేయాలని ఈ సంఘం భావిస్తున్నది."

## 3.6 సంఘ సంస్కరణలు :-

ఆ కాలంలో బెంగాల్ సమాజంలో ఆధ్యాత్మికారాధన అంతరించి మత ముసుగులో అనేక మూఢ విశ్వాసాలు ప్రబలాయి. అద్వితీయుడగు ఏకేశ్వరుని ఆరాధనకు బదులు ప్రజలు అనేక విగ్రహములను పూజించటం జరుగుచుండెడిది. ప్రజలు జగన్నాథ రథ చక్రముల క్రిందపడి మోక్షం కొరకు ప్రాణములను అర్పించడం జరుగుచుండెడిది. బెంగాలులో ఈ కాలంలోనే జంతుబలులు, మద్యపానం, వ్యభిచారం విస్తృతంగా వ్యాప్తి చెందాయి. ఈ సమయంలోనే ఆంగ్ల విద్యా వ్యాప్తి ప్రారంభ దశలో నాస్తిక వాదుల సంఖ్య ఎక్కువైంది. సామాన్య జనులలో అందులోను ముఖ్యంగా స్త్రీలలో అధిక శాతం విద్యకు దూరమయ్యారు. సాంఘిక జీవనము

వర్ణించేందుకు వీలు కాని ఘోర దురాచారములకు లోనైంది. సమాజంలో బ్రాహ్మణుల ఆధిక్యత పెరిగింది. ఆ రోజులలో వర్ణాంతర వివాహాలు, సహ పంక్తి భోజనాలు పాపాలుగా పరిగణించబడ్డాయి. అంతే కాకుండా నిమ్న జాతుల ప్రజలు విద్యావకాశాలు లేక తమ కుల వృత్తులకు పూర్తిగా పరిమితం కావలసిన దుస్థితి ఏర్పడింది.

ఆ కాలంలో జీవించిన స్త్రీలు అనుభవించిన కష్టాలు ఊహాతీతం. పురాతన కాలం నుంచి బెంగాలులోని బ్రాహ్మణులలో 'కులీనులు' అనే శాఖ వుంది. వారిలో బహు భార్యాతత్వము ప్రబలంగా ఉంది. ఈ శాఖ బ్రాహ్మణులకు ఆస్థికి సంబంధించిన వంశ పారం పర్యపు హక్కు ఉండటం చేత ఇతర బ్రాహ్మణులు వారికి తమ పుత్రికలను ఇచ్చి వివాహము చేయడం గౌరవ్రపదంగా భావించేవారు. బహు భార్యాతత్వ సంప్రదాయం వాడుకలో వుండుటచే అనేక మంది వివాహిత బ్రాహ్మణ స్త్రీలు వాస్తవానికి కన్యలుగానే జీవించేవారు. ఆ కాలంలో భర్త చనిపోయిన వితంతు స్త్రీల పరిస్థితులు అతి దారుణంగా ఉండేవి. వితంతువులు జీవితాంతం వైదవ్యం అనుభవించటమో లేదా భర్త శవంతో కాలిపోవటమో జరిగేది. ఈ బహు భార్యా పద్ధతి వల్ల సంభవించే దుష్ట పరిణామాలన్నింటిని అనుభవించేది స్త్రీలే. ఆ కాలం నాటి వితంతువులు నిక్రృష్ట పరిస్థితులు సంఘ సంస్కరణాభిలాషియైన రామమోహన్ రాయ్ దృష్టిని ఆకర్షించాయి. 1815 - 1828 మధ్య కాలంలో కేవలం కలకత్తాలోనే దాదాపు ఐదువేల మంది వితంతువులు సతీ సహగమనం వల్ల మరణించారు.

ఈ నేపథ్యంలో రామమోహన్ రాయ్ ఈ సాంఘిక దురాచారాన్ని నిర్మూలించేందుకు తన వంతు కృషిని ప్రారంభించాడు. శాసన సమ్మతమగు హక్కుల కొరకు, స్త్రీల విద్య కొరకును, బాల్య వివాహాల నిర్మూలన కొరకు, సతీ సహగమను దురాచార నిర్మూలన కొరకు తన శక్తినంతయును ధారపోసెను. 1811లో రామ్మోహన్ రాయ్ సోదరుడు మరణించాడు. ఆయన వదిన సతీ సహగమనముకు పాల్పడింది. ఈ దుస్సంఘటన రామ్మోహన రాయ్‌ని కలచి వేసింది. ఫలితంగా సతీ సహగమనాన్ని నిర్మూలించేందుకు కృషి చేయటం ప్రారంభించాడు. క్రమంగా మత సంస్కరణలతో పాటు, సతీ సహగమన దురాచార నిర్మూలన రామ్మోహన్ రాయ్ ఉద్యమంలో ఒక భాగమైంది. 1789లోనే బ్రిటీష ప్రభుత్వము ఈ సాంఘిక దురాచారమును నిర్మూలించేందుకు ప్రయత్నించింది. మోరియా రాజు కొంత వరకు ఈ దురాచారాన్ని నిర్మూలించగలిగాడు. 1815 - 17 మధ్య కాలంలో బ్రిటీష్ ప్రభుత్వము సతీ సహగమన నిర్మూలనానికి కొన్ని చట్టాలను రూపొందించి అమలు పరచింది. అయినప్పటికి 1815 - 18 మధ్య కాలంలో 2,365 మంది వితంతువులు సతీ సహగమనం చేశారు. వీరిలో 1,528 మంది కలకత్తా నివాసులు.

ఈ దుస్సంఘటనలు సంభవించినప్పటికి బ్రిటీష్ ప్రభుత్వం అమలుపరచిన సతిసహగమన నిషేద చట్టాలకు వ్యతిరేకంగా కొందరు హిందూమత నాయకులు ఆందోళన ప్రారంభించారు. ఈ ఆందోళన సమయంలో రామమోహన్ రాయ్ సతిసహగమనం పై తన అభిప్రాయాలను ప్రకటిస్తూ అనేక రచనలు చేశాడు. అయినప్పటికి ఈ ఆందోళన కొనసాగింది. ఇతను సతీ సహగమనాన్ని నిర్మూలించేందుకు ఒక సంఘాన్ని స్థాపించాడు. ఈ సంఘం సతీ సహగమన నిర్మూలన చట్టాలను ఖచ్చితంగా అమలుపరచేందుకు కృషి చేశాయి. ఈ సమయంలోనే భారతదేశానికి గవర్నర్ జనరల్‌గా వచ్చిన విలియం బెంటిక్ 1829లో సంపూర్ణ సతీ సహగమన నిషేదానికి ఒక సమగ్రమయిన చట్టాన్ని ప్రవేశపెట్టాడు.

## 3.7 వార్తా పత్రికల స్వేచ్ఛ, అభివృద్ధి :-

సాంఘిక, విద్యా, ఆర్థిక, రాజకీయ మత సంస్కరణల వల్ల ప్రజలలో ఏర్పడిన చైతన్యానికి అభివృద్ధిపరచేందుకై ఉదాహరవాద ధోరణి కల పత్రికల సాయం అవసరమని రామ్మోహన్‌రాయ్ గుర్తించాడు. ఈ గుర్తింపే బెంగాలులో ముఖ్యంగా కలకత్తాలో వార్తా పత్రికలు అభివృద్ధి చెందడానికి దోహదం చేసింది. 1816లో బెంగాలులో 'బంగళా గెజిట్' వార్తా పత్రిక ప్రచురణ ప్రారంభం అయింది. ఈ పత్రికకు రామ్మోహన్‌రాయ్ ప్రారంభించిన ఆత్మీయ సభ సంఘ సభ్యులు సారధ్యం వహించారు. 1817లో సెరాంపూర్ క్రైస్తవమత సంఘం వారు సమాచారణ దర్పణ్ అనే వారపత్రిక ప్రారంభించారు. దీంతోపాటు, 'ది ఫ్రెండ్ ఆఫ్

ఇండియా' అనే ఆంగ్ల పత్రికను కూడ ప్రచురించారు. 1818లో జేమ్స్ సిల్క్ బకింహామ్ అనే ఆంగ్లేయుడు 'ది కలకత్తా జర్నల్' అనే మరో వారపత్రికను ప్రచురించడం ప్రారంభించాడు. వీటితోపాటు 1820లో తారా చంద్ దత్త, భబానీ చరణ్ బందోపాధ్యాయ సారథ్యంలో 'సంబంధ కౌముది' అనే బెంగాలీ వార పత్రిక ప్రచురణ ప్రారంభం అయ్యింది. ఈ పత్రికా సంపాదకత్వాన్ని రామ్మోహన్‌రాయ్ చేపట్టాడు. రామ్మోహన్ రాయ్ సంపాదకత్వం వహించిన 'సంబంధ కౌముది' దేశీయ భాషలలో వెలువడిన పత్రికలలో మొదటిది. 1829లో డాక్టర్ ఆర్. ఎమ్. మార్టిన్‌చే ప్రారంభించబడిన బెంగాల్ హెరాల్డ్ నిర్వాహకులలో రామ్మోహన్ ఒకరు. ఈ విధంగా ప్రారంభమయిన పలు పత్రికలు రామ్మోహన్ రాయ్ ప్రారంభించిన సంఘ సంస్కరణోద్యములో కీలక పాత్ర వహించాయి.

1818 తరువాత వచ్చిన గవర్నర్ జనరల్‌లు భారతదేశంలో వార్తా పత్రికల అభివృద్ధిని అరికట్టేందుకు కొన్ని చర్యలు చేపట్టారు. భారతదేశంలో వార్తా పత్రికలు తమ స్వేచ్ఛను దుర్వినియోగం పరుస్తున్నాయని గవర్నర్ జనరల్ కౌన్సిల్ సభ్యులు ఆరోపించారు. ఈ సభ్యులు పత్రికా స్వేచ్ఛను పూర్తిగా రద్దు చేయాలని వాదించారు. దీని ఫలితంగా అమలులోకి వచ్చిన ప్రభుత్వ నియమాల వల్ల 1823లో రామ్మోహన్ 'మీరట్ ఉల్ అఖ్‌బార్' ప్రచురణను నిలిపివేశాడు. 1823లో ఆడమ్ పత్రికా స్వేచ్ఛను నిరోధించే ఒక చట్టాన్ని ప్రవేశపెట్టాడు. ఈ చట్టానికి అనుగుణంగా యజమానులు, సంపాదకులు ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా అనుమతి పొందవలసిన అవసరం ఏర్పడింది. ఈ నియమాలకు వ్యతిరేకంగా రామ్మోహన్‌రాయ్ అతని అనుచరులు సుప్రీం కోర్టుకు, ఇంగ్లండు రాజుకు (King in Council) వినతి పత్రాన్ని సమర్పించారు. సుప్రీం కోర్టు ఈ వినతి పత్రాన్ని తిరస్కరించింది. 1835లో రామ్మోహన్ రాయ్ మరణానంతరం పత్రికా స్వేచ్ఛను పునరుద్ధరించడంలో రాయ్ కృషి ఫలితమే.

## 3.8 మానవతావాదము మరియు విశ్వ మానవమతము (Humanism and Universalism) :-

రామ్మోహన్ రాయ్ తన జీవిత కాలంలో భారతదేశానికే కాక విశ్వమానవాళికి ఉపయోగపడే విధంగా సర్వమత సారాన్ని సంగ్రహించి సమన్వయపరుస్తూ ఒక సార్వజనీన సిద్ధాంతాన్ని ప్రతిపాదించేందుకు కృషి చేసాడు. ఈ సిద్ధాంతములోని కీలక అంశాలు ఈ క్రిందివి.

1. సత్యాసత్య విచక్షణ చేయడంలో ప్రేమ స్వరూపం పాత్రను గుర్తించేందుకు అవసరమయిన శక్తి అందరి మానవులలో వుంది. పరమ మంగళ స్వరూపుడు, అనంతుడు, అద్వితీయుడు అయిన సర్వాంతర్యామి అయిన పరమేశ్వరున్ని అంతరంగంలో ఉపాసించాలి.

2. కేవలం సంఘ పరిత్యాగులు సన్యాసులే కాక, బ్రహ్మ నిష్ఠాపరులు, గృహస్థులుకూడా బ్రహ్మ జ్ఞానాన్ని సముపార్జించుకొనే అధికారం బ్రహ్మ నిష్ఠాపరులయిన గృహస్థులకు కూడ వుంది.

3. కేవలం ఈశ్వరుడు ఒక దేశానికి, ఒక జాతికి, ఒక కాలానికి పరిమితం కాదు.

సర్వమానవాళికి భగవంతుడు జ్ఞానాన్ని ప్రసాదిస్తాడు. అన్ని మతాలు ప్రబోధించే సత్యము ఒక్కటే. భిన్న దేశాలకు చెందిన ప్రజల మధ్య అనేక విషయాలలో వ్యత్యాసాలు వున్నప్పటికి మత విషయంలో అన్నీ మతాలకు చెందిన ప్రజలు ఏకాభిప్రాయాన్ని కలిగి వుంటారు. మౌలికంగా మతాలన్నీ ఒక్కటే అయినా, వాటి ప్రభావములో మాత్రమే భిన్నత్వవుంది. అందుచేత బుద్ధిమంతులయిన మానవులు మత జ్ఞానాన్ని ఈశ్వర భక్తిని కలిగి వున్నప్పుడు వారి మధ్య సంఘర్షణకు చోటు లేదు. అందుచేత సర్వజనులు ఈశ్వరుని తండ్రిగా భావించి పరస్పరం మైత్రితో విశ్వమానవ కుటుంబంగా జీవించటం అవసరం. ఇటువంటి మహోన్నతమైన ఆదర్శాలను ప్రబోధించిన రామ్మోహన రాయ్ జీవితం భావాలు అత్యున్నతమయినవి. వివిధ మతాల మధ్య వ్యత్యాసాలను గురితంచగలిగే జ్ఞానాన్ని కలిగిన తొలి మేధావి రామమోహన్ రాయ్ అని 'మానియర్ విలియమ్స్' ప్రసంసించాడు. రామ్మోహన్ విశ్వమత అన్వేషకుడు. హిందూమతం, ఇస్లాం, బౌద్ధమతం, క్రైస్తవమతం మొదలైన అన్ని మతాలను తులనాత్మకంగా పరిశీలించి, వాటి ప్రాథమిక సూత్రాలలోని ఐక్యతను గుర్తించిన మొట్ట మొదటి వ్యక్తి రామ్మోహన్ రాయ్.

ఆయన ప్రపంచ మతాలను సంపుటిత పరిచే దృష్టితోకాక, వాట్టిని సమన్వయం చేసే దృష్టితో వివిధ మతాలను పరిశీలించాడు. ప్రొఫెసర్ "మోనియర్ విలియమ్స్" అభిప్రాయం ప్రకారం మతాల తులనాత్మక పరిశీలన రామమ్మోహన్ రాయ్ మార్గదర్శి. మాక్స్ ముల్లర్ రామ్మోహన్ రాయ్‌ని ప్రాచ్య, పాశ్చాత్య మతాల మధ్య సమన్వయాన్ని, విశ్వజనీయ ఐక్యతను పెంపొందించడానికి సంస్కరణలు అవసరమని రామమోహన్ భావించాడు. ఇతని ఆలోచనల్లోను, కార్యకలాపాల లోను అంతర్లీనంగా వున్న ఈ సూత్రాన్ని పరిశీలించిన బ్రజేంద్ర సీల్ రామ్మోహన్‌ని ఆధునిక భారతదేశానికి తండ్రి వంటివాడుగా పరిగణించవలసిన వ్యక్తి అని ఉద్ఘాటించాడు. హిందూ, బౌద్ధ, క్రైస్తవ, మహ్మదీయ మతాలు ప్రాక్పశ్చిమ నాగరికతలు, భూత, భవిషత్ వర్తమాన కాలాలు, హేతువాద విశ్వాసాలు, రాజకీయాలు, సాంఘిక వ్యవస్థ, ధార్మికత మొదలైన సమస్త విషయాలలో నిగూఢంగా ఉన్న సామరస్యమ్మేఈ సమస్త లోకానికి శాంతి ప్రదాత కళ్యాణ సందేశం అని రామ్మోహన్ రాయ్ ఉద్ఘాటించాడు.

## 3.9 బ్రహ్మ సభ - బ్రహ్మ సమాజం :-

హిందూమతంలో ఏర్పడిన ఛాందస భావాలు క్రతువులను తొలగించి ఏకేశ్వరోపాసన, నిర్మల భక్తి విధానం ప్రవేశ పెట్టటానికే బ్రహ్మ సమాజం ప్రయత్నించింది. సామాజిక, మత రంగంలో అవసరమైన సంస్కరణలను తీసుకురావటానికి వాటిని ప్రచారం చేయటానికి నిర్మల పూజా విధానం, ఏకేశ్వరోపాసనా అమలుపరచటానికి రామ్మోహన్ రాయ్ బ్రహ్మ సమాజాన్ని స్థాపించారు. ఈ బ్రహ్మ సమాజం యొక్క కార్య కలాపాలు బెంగాలులోని ఉన్నత, విద్యావంతులైన వర్గాల వారిని ఆకర్షించింది. దేశ చరిత్రలో రామ్మోహన్‌కు శాశ్వత స్థానాన్ని కల్పించింది. బ్రహ్మ సమాజ స్థాపన. బ్రహ్మ సమాజ స్థాపనకు పూర్వము ఏకేశ్వరోపాసకుల సంఘం తన కార్యకలాపాలను నిర్వహిస్తూ వుండేది. ఈ ఉద్యమ సాధనకు ప్రథమ ప్రయత్నంగా 1816లో ఆత్మీయ సభను స్థాపించారు. ఈ సంస్థ ఏకేశ్వరోపాసకుల విధానాన్ని వ్యాప్తి చేయటంలో విఫలమైంది. అందుచేత రామ్మోహన్ శిష్యులయినటువంటి ద్వారకానాద్ ఠాగూర్, ప్రసన్నకుమార్ ఠాగూర్, కాశీనాద్ రాయ్, రామచంద్ర విద్యావగీష్ మొదలైన వారు తమ ఆస్తులను బ్రహ్మ సమాజానికి విరాళ రూపంలో ఇవ్వటంతో 1828లోఈ బ్రహ్మ సభ ఆవిర్భవించింది. రామ్మోహన్ శిష్యులలో ఒకడయిన తారాచంద్ చక్రవర్తి ఈ బ్రహ్మ సభకు మొదటి కార్యదర్శిగా నియమింపబడ్డాడు.

బ్రహ్మ సభ పూర్వాచార పరాయణులు, ఛాందసులు అయిన కొందరు హిందువుల ఆగ్రహానికి లోనయింది. కాని ఆ సమయంలో రామ్మోహన్ రాయ్ సతీ సహగమన దురాచార నిషేధ ఉద్యమంలో పూర్తిగా నిమగ్నమై ఉండటం వల్ల హిందువుల ఆగ్రహానికి అంతులేకుండా పోయింది. రామ్మోహన్ రాయ్ స్థాపించిన బ్రహ్మ సభకు వ్యతిరేకంగా కొందరు సనాతన హిందువులు 'ధర్మ సభ' అనే సంస్థను స్థాపించారు. భవానీ చరణ బెనర్జీ ధర్మ సభకు అధ్యక్షునిగా, రాదాకాంతదేవ్ కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. 1830 జనవరిలో బ్రహ్మ సభ తన సొంత భవనానికి తరలింది. ధర్మసభ నాయకులు సమాచార చంద్రిక అనే వార్తా పత్రిక ద్వారా రామ్మోహన్‌చే ప్రారంభించిన మత సంస్కరణలను తీవ్రంగా విమర్శించారు. బ్రహ్మ సమాజం సభ్యులు ధర్మసభ చేసిన విమర్శలను 'సంబంద కౌముది' అనే పత్రిక ద్వారా ఖండించారు.

## 3.10 బ్రహ్మ సమాజ సిద్ధాంతము :-

రామ్మోహన్ రాయ్ 1830 జనవరిలో బ్రహ్మ సమాజం సభ్యులు అనుసరించవలసిన మార్గదర్శక సూత్రాలు (Trust deed)ను రూపొందించాడు. ఈ సూత్రాల ప్రకారం బ్రహ్మ సమాజం తన సభ్యులు సమావేశమయ్యేందుకు తగిన ఏర్పాట్లను చేయవలసి వుంటుంది. ఈ సమావేశములలో సభ్యులు పాటించవలసిన నియమాలను ధర్మ శాసనంలో పొందుపరచారు. ఈ నియమాల ప్రకారము సభ్యులు తమ దైవారాధనలో దేవుని ప్రతిరూపం, విగ్రహం, శిల్పం, ఉత్కీర్ణ చిత్రం, భావ చిత్రం ఏ ఇతర రూపం కానీ అంగీకరించదు. అంతేకాక దేవుని ఆరాధించటంలో పొగడ్తలకు తావుండరాదు. దేవునికి నైవేధ్యాన్ని నివేదించడం నిషిద్ధం. బ్రహ్మ సమాజ సభ్యులు మత ప్రయోజనాలకు గాని, తమ ఆహారానికి గాని జీవ హింస చేయరాదు. బ్రహ్మ సమాజ

సభ్యులు తమ ఆరాధన సమయంలో చేసే ఉపదేశాలలో సంకీర్తనలలోను మరే ఇతర కార్యకలాపాలలో పరమత దూషణకు విమర్శలకు పాల్పడరాదు. బ్రహ్మ సమాజ సభ్యులు ధర్మము, నీతి, నిర్మల పూజా విధానం, ఏకేశ్వరోపాసన అమలుపరచటానికి, సర్వమత సౌభ్రాతృత్వాన్ని పెంపొందింప చేసే ప్రయత్నాలను, ఉపదేశాలను, ప్రార్థనలను మాత్రమే చేయవలసి వుంటుంది. పదహారవ శతాబ్దంలో ప్రచారం అయిన భక్తి ఉద్యమం తెచ్చిన విప్లవంలో బ్రహ్మ సమాజం ధ్యేయాలు సాదృశ్యమైనాయి. నిత్యుడు, అగమ్యగోచరుడు, నిర్వికల్పుడు, విశ్వకర్త, విశ్వ రక్షకుడు అయిన ఈశ్వరుని పూజించి ధ్యానించటం బ్రహ్మ సమాజం ప్రధాన ఆశయాలుగా పేర్కొనటం జరిగింది.

ఈ విధంగా తన కార్యకలాపాలను, ఈశ్వరారాధనను నిర్వర్తించినప్పుడే బ్రహ్మ సమాజం పట్ల ప్రజలలో భక్తి భావం, గౌరవము ఏర్పడతాయి. ధర్మ శాసనంలోని పొందుపరచిన వివిధ అంశాలను పరిశీలిస్తే రామ్మోహన్ రాయ్ బ్రహ్మ సమాజాన్ని ఒక ప్రత్యేక మతానికి సంబంధించిన సంస్థగా రూపొందించలేదని అర్థమవుతుంది. రామ్మోహన్ తనను విశ్వమత మానవునిగా చాటుకున్నాడు. తన మరణానంతరం తనను హిందువులు, ముస్లిమ్‌లు, క్రైస్తవులు ఎవరికి వారే తమ మతానికి చెందిన వ్యక్తిగా పరిగణించాలని పేర్కొన్నాడు. అయితే తాను ఏ మతానికి చెందనివాడని విశ్వమత భక్తుడుననీ రామ్మోహన్ రాయ్ ఉద్ఘాటించారు. అన్ని మతాలకు చెందిన విశ్వజనీనయమైన సమాన కేంద్రంగా వుండాలన్న విశాల దృష్టితోనే రామ్మోహన్ రాయ్ బ్రహ్మ సభను స్థాపించాడు. అయితే రామ్మోహన్ రాయ్ మరణానంతరము బ్రహ్మ సమాజం తమ పవిత్రతను, ఉత్కృష్టతను కోల్పోయి కేవలం సమావేశ కేంద్రంగా మాత్రమే మిగిలిపోయింది.

## 3.11 రాజకీయ భావాలు :-

రామ్మోహన్ రాయ్ తన జీవితంలో ఎక్కువ సమయాన్ని, శక్తిని చాలా వరకు సాంఘిక, మత సంస్కరణలకే వినియోగించాడు. ఇతను రాజకీయాంశాలను కూడా క్షుణ్ణంగా అధ్యయనం చేసి తన వంతు కృషి చేశాడు. స్వాతంత్ర్యం అనే భావనను వ్యక్తి ప్రవృత్తికీ, సామాజిక ప్రవృత్తికీ అనువర్తించిన విధంగా రాజకీయ రంగానికీ కూడా దానిని వర్తింప చేయాలన్నది రామ్మోహన్ యొక్క అభిమతం. రాజకీయాభిప్రాయాల్లో బెంథామ్ శిష్యులైన రామ్మోహన్ రాయ్ బ్రిటీష్ వారి రాజకీయాందోళన పద్ధతులను జాగ్రత్తగా గమనించి తమకు జరిగిన అన్యాయాలను సవరించుకోవడానికి అవలంభించిన రాజకీయోద్యమ విధానాన్ని ఏర్పరచుకున్నాడు. 1828లో ముందుగా పత్రికా స్వాతంత్ర్యాన్ని గురించిన శాసనాన్ని వ్యతిరేకిస్తూ ఉద్యమించాడు. సమకాలీన భారతదేశ పరిస్థితి స్వయం విరుద్ధంగా ఉందని రామ్మోహన్ అభిప్రాయపడ్డాడు. ఇతని ఉద్దేశంలో తన దేశానికి మాత్రమే కాకుండా ప్రపంచ దేశాలన్నింటికీ స్వాతంత్ర్యం అవసరమని ఆయన భావించాడు. అయితే భారతీయ సమాజంలోని బలహీనతలు, అందులోని సాంఘిక దురాచారాల ప్రతిబంధక అంశాలు ఆయనను విశేషంగా ఆకర్షించాయి. బ్రిటీష్ ప్రభుత్వ పాలకుల శక్తి సామర్థ్యాలు రామ్మోహన్ ప్రగాఢంగా విశ్వసించాడు. ఔదార్యం అభ్యుదయ భావం, సంస్కారంగల బ్రిటీషు పాలనలో భారతదేశం నైతికంగా ప్రజాసేవ పరంగా ఉన్నత స్థితిని చేరుకొని స్వాతంత్ర్యానికి యోగ్యత సంపాదించుకోవాలని ఆయన ఆశించాడు. రామ్మోహన్ రాయ్ ప్రతిపాదించిన రాజకీయ సంస్కరణలన్నీ ఈ ఉద్దేశాలన్నింటినీ నెరవేర్చటానికి, తక్షణం దేశానికి స్వాతంత్ర్యం ఇవ్వవలసిందని ఆయన కోరలేదు. పౌర స్వేచ్ఛలో వ్యక్తిగత హక్కులు సురక్షితం కావాలి. వ్యక్తి జీవితం, ఆస్తి, అభిప్రాయ ప్రకటనా స్వేచ్ఛ, మత స్వాతంత్ర్యము ప్రజలకు లభ్యం కావాలని భావించాడు.

## 3.12 సారాంశము :-

తన జీవితంలోని చివరి మూడు సంవత్సరాలు రామ్మోహన్ రాయ్ యూరప్‌లో ఎక్కువ కాలం గడిపాడు. తాను చేపట్టిన మత రాజకీయ కార్యక్రమాల్ని అక్కడ నిర్వహించాడు. ఆయన 1833లో బ్రిస్టల్ నగరంలో మరణించాడు. రామ్మోహన్ రాయ్

ఆధునిక భారత నిర్మాతగా చేసిన సేవలు మరవలేనివి. సామాజిక, రాజకీయ, మత, ఆధ్యాత్మిక, విద్యా రంగాల్లో ఆయన ఉద్యమాల నుంచి జాతీయోద్యమం స్ఫూర్తి పొందింది. ఇంగ్లండులోని వివిధ సంస్థలు ఆయన ప్రాముఖ్యాన్ని గుర్తించి గొప్ప భారతీయ నాయుకుడిగా ఆయనను గౌరవించాయి. రామ్మోహన్ రాయ్ ప్రజలకు నిర్వహించిన సాంఘిక, మత సంస్కరణోద్యమానికి ఫలితంగా బ్రిటీష్ ప్రభుత్వం ఆయనకు "రాజా"యను బిరుదును ప్రసాదించింది.

## 3.13 మాదిరి ప్రశ్నలు:-

1. సతీ సహగమనమనగానేమి? రామమోహనుడు సతీ నిషేదము గూర్చి చేసిన సేవలను గూర్చి వివరింపుము.
2. రాజా రామ్మోహన్ రాయ్ పత్రికా స్వాతంత్ర్య ప్రియుడుగా చేసిన సేవలను గూర్చి వివరింపుము.
3. రామమోహన్‌ని బ్రహ్మ సమాజ (బ్రహ్మ సభ) స్థాపన ధ్యేయములను గురించి చర్చించుము.
4. మతమును గురించి రామమోహన్ రాయ్ దృక్పధమును నిశితంగా పరిశీలింపుము.

## 3.14 ఆధార గ్రంథాలు:-


1. చిలకమర్తి లక్ష్మీ నరసింహ పంతులు - మహాపురుషుల జీవితములు (lives of Great mens) ప్రథమ భాగము (వంగ దేశము), కొండపల్లి వెంకయ్య అండ్ సన్స్, శ్రీ సత్యనారాయణ బుక్ డిపో, రాజమండ్రి, 1948.
2. అకురాతి చలమయ్య - రాజా రామమోహన రాయల చరిత్రము, శ్రీ విద్యజ్జన మనోరంజనీ ముద్రాక్షర శాల, 1935 (ద్వితీయ ముద్రణ).
3. శ్రీ.కె. రామశాస్త్రి, బి.ఏ., బి.ఇ.డి (తారకం) - రాజర్షి శ్రీ రాజా రామమోహనరాయుల వారి జీవిత చరిత్ర , రౌతుబుక్ డిపో, ఎడ్యుకేషనల్ పబ్లిషర్స్, రాజమండ్రి, 1946 (సవరణ ప్రతి).
4. శ్రీ జమునానాగ్ - ఆంగ్లమూలం, తెలుగు అనువాదం - శ్రీ. కె. తారకం భారతదేశపు మహా మనిషి, మేటి సంస్కర్త రాజారామమోహన్ రాయ్, యం. శేషా చలం అండ్ కో, మచిలీపట్టణం, మద్రాసు, సికింద్రాబాద్, ద్విశత జయంతి సంవత్సర (1972 - 73) మహోత్సవ ప్రత్యేక ప్రచురణ.
5. సౌమ్యేంద్రనాథ్ఠాకూర్ (మూలం) - అనువాదం - కె. రామలక్ష్మి, భారతీయ సాహితీ నిర్మాతలు. రాజారామమోహన్ రాయ్, సాహిత్య అకాడమి, న్యూఢిల్లీ 1977, ప్రథమ ముద్రణ.
6. VP. Varma. - Modem Indian Political Thought.
7. Sankar Ghose - Modem Indian Political Thought.
8. D.R. Bali - Modem Indian Thought.

పాఠం 4

# స్వామి దయానంద సరస్వతి (1824 - 1883)

## 4.0 లక్ష్యం :

భారతీయ రాజకీయ సామాజిక తత్వ విచారములో స్వామి దయానంద సరస్వతికి అత్యంత విశిష్ట ప్రాధాన్యమున్నది. వ్యక్తి ధోరణిపైన, సామాజిక దృక్పథం పైన, రాజ్యము ప్రసరించే ప్రభావాన్ని గురించి, అవగాహన చేసుకొన్న మరుక్షణం నుంచే తాత్విక చింతనగల మేధావులలో సంఘసంస్కర్తలలో, రాజనీతిజ్ఞులలో సామాజిక వ్యవస్థ గురించి జిజ్ఞాస వివిధ రీతులలో ప్రస్ఫుటమవుతుంది. సమకాలీన సమస్యలకు విభిన్న పరిష్కార మార్గాలను కనిపెట్టడం జరిగింది. భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమంలో దయానందుడు నిర్వహించిన పాత్ర, అతని తాత్విక చింతనకు గల పునాదులను, అతని సామాజిక చింతనను, రాజకీయ చింతనను, విద్య, మతభావాలను, దయానందుడు స్థాపించిన ఆర్యసమాజాన్ని మరియు అతని విశిష్టతను గురించి వివరించడం ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యము.

## విషయసూచిక :


4.1 పరిచయం

4.2 దయానంద రాజకీయ చింతనకు తాత్విక పునాదులు

4.3 దయానందుని సామాజిక తత్వము

4.4 దయానందుని రాజకీయ తత్వ విచారణ

4.5 దయానందుడు - ఆర్యసమాజం

4.6 మతంపై దయానందుని భావనలు

4.7 విద్యను గురించి దయానందుని అభిప్రాయాలు

4.8 సంఘసంస్కర్త దయానంద సరస్వతి

4.9 దయానందుని విశిష్టత

4.10 సారాంశం

4.11 మాదిరి ప్రశ్నలు

4.12 చదువదగిన గ్రంథాలు

## 4.1 పరిచయం :

భారతదేశం అతిపురాతన నాగరికతకు, సంస్కృతికి పుట్టినిల్లు. మహాసామ్రాజ్యాలు ఇక్కడ పుట్టినవి. ప్రపంచమునకు వెలుగు చూపిన హిందూ, బౌద్ధ మతాలకు పుట్టినిల్లు. ప్రపంచం గర్వించదగిన గొప్ప సాహిత్యాన్ని సృష్టించింది. భాషలు, కళలు, శిల్పం, కట్టడాలు, నాట్యం, సంగీతం, చిత్రలేఖనం లాంటి సర్వకళలు పరాకాష్ఠ నందినవి కానీ 16వ శతాబ్దంలో ప్రారంభం నుండి భారతదేశ పతనం ప్రారంభమయింది. 16, 17వ శతాబ్దాలలో ఐరోపాలో జాతీయవాదం పెరిగింది. ప్రపంచ వ్యాపారం, వస్తు ఉత్పత్తి గణనీయంగా పెరిగింది. పారిశ్రామిక విప్లవం వీరి ఆధిపత్యాన్ని చాటి చెప్పింది. పాశ్చాత్య దేశాల సైనిక రాజకీయ శక్తి ప్రపంచం మొత్తం మీద ఆధిక్యతను సాధించాయి. 18, 19వ శతాబ్దాలలో భారతదేశం క్రమేణా బ్రిటీషువారి పాదాక్రాంతమయింది. ఆర్థికంగా క్షీణించినది సామాజిక పెరుగుదల ఆగిపోయింది. రాజకీయంగా దాసోహమైనది.

కానీ 19వ శతాబ్ది మధ్య కాలం నుండి భారతీయ ఆత్మ, మేధస్సు చైతన్యం కావడం ప్రారంభం అయ్యింది దీనికి కారణం పాశ్చాత్య విద్య, పాశ్చత్య విద్య ప్రసాదించిన మేధావికాసాన్ని మత, సాంఘిక, ఆర్థిక, రాజకీయ సమస్యలకు అన్వయించినారు.

భారతదేశంలో మేధా పునరుజ్జీవనము ఆధునిక భారత జాతీయవాదానికి దారితీసింది. ఐరోపా పునరుజ్జీవనము ఐరోపాలో జాతీయవాదానికి పునాదులు వేసినట్లే మన దేశంలో కూడా జరిగింది. వివిధ మత నాయకుల బోధనలు దీనికి తోడ్పడినవి. భారతీయులతో మేల్కొంచిన మనో చైతన్యం ముందు దాని తత్వచింతన, మతం సంస్కృతులతో ప్రారంభమయినది. రాజకీయ చైతన్యం వీటి తార్కిక ఫలితంగా సంభవించిందే బొకాసియో బోధించిన మానవ జీవిత ప్రాధాన్యత, మానవుని అర్థవంతమైన జీవితం ఎరాస్మస్ బోధించిన మానవత్వం, చైతన్యవంతమైన మానవజీవితం, ఐరోపాకు పునర్జన్మ ప్రసాదించినట్లే, భారతీయ పునరుజ్జీవనం కూడా ప్రస్తుత జీవితాన్ని ఉపనిషత్తులు, వేదాలు, పురాణ ప్రాతిపదికన పునర్ నిర్మించాలని భావించారు.

భారతదేశములో సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమంలో స్వామిదయానంద సరస్వతి ఒక ప్రధానశక్తి ఇతడు చిత్త వృత్తిరీత్యా అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన స్వతస్సిద్ధయోధుడు "ప్రపంచం అంధవిశ్వాస అజ్ఞాన శృంఖలాలచే బంధింపబడి ఉంది. నేను ఆ శృంఖలాలను ఛేదించటానికి, బానిసలకు స్వేచ్ఛ కలిగించడానికి వచ్చినాను" అని ఒక సందర్భంలో దయానంద సరస్వతి చెప్పటం జరిగింది. మత సంబంధమైన అంతరాత్మ విషయంలో శైవమతస్థుడైన తన తండ్రి విధించిన నిరంకుశ సాంప్రదాయిక ఆదేశాలను శిరసావహించటానికి తిరస్కరించిన గొప్ప తిరుగుబాటుదారుడు స్వామి దయానంద. హిందూ సనాతన నాయకులు పెట్టిన ప్రలోభాలకు గానీ, ప్రదర్శించిన ఆగ్రహానికి గానీ ఆయన లొంగిపోలేదు. ఆ రోజుల్లో బ్రిటీష్ సామ్రాజ్యవాదం భారతదేశంలో తన విజయపతాకం ఎగురవేసినప్పటికీ, క్రైస్తవ మతంలోని లోపాలను ఖండించడానికి ఆయన వెనుకాడలేదు. పరిపూర్ణ సత్యాన్వేషణలో వ్యక్తి పవిత్రకు, ఔన్నత్యానికి ఆయన దీక్షబూనటం జరిగింది. ఇతడు గొప్ప నైతిక ఆదర్శవాది. ఆయన ఒక సన్యాసి, పవిత్రమూర్తి, సత్యం కోసం ధైర్యంగా పోరాడే వీరోచిత పురుషుడు. ఇతడు స్థాపించిన ఆర్యసమాజంలో "మనమెప్పుడూ సత్యాన్ని అంగీకరించడానికి, అసత్యాన్ని పరిత్యజించడానికి సిద్ధంగా వుండవలె" అని దయానంద సరస్వతి ఉద్బోధించాడు.

దయానంద సరస్వతి యొక్క వ్యక్తిత్వం చాలా వరకు వైదిక ఆదర్శవాదం ప్రభావానికి గురైంది. సాంఘిక విద్యావిషయక, మతసంబంధమైన బహుముఖ కార్యకలాపాల మీద తన దృష్టిని నిలిపాడు. తరగని శక్తిసామర్థ్యాలతో ఆయన దాదాపు 40 సం॥లపాటు తన జీవితంలో ప్రధానమైన ఈ కృషికి అంకితమైనాడు. ఈ విధంగా ఆయన హిందూ సమాజ పునరుద్ధరణకూ, దేశ పునరుద్ధరణకూ కంకణం కట్టుకొని శ్రద్ధాసక్తులతో తన అసాధారణ వాక్పటిమతో అసామాన్యమైన ఓర్పుతో తన ధ్యేయాన్ని

చేరుకోడానికి నిరంతరం నిర్విరామ కృషి చేసినాడు. దైవభక్తిలో పవిత్రతనూ, శీలసంపదనూ ప్రదర్శించి తద్వారా ఆర్జించిన అపార సృజనాత్మక శక్తిసంపదను జాతి ఉద్ధరణకు ఆయన వినియోగించినాడు. ఆయన ఒక యోగి మరణం ఆసన్నమయిన సమయంలో కూడా తన జీవిత కాలమంతా అంతర్గత విజయాలను సాధించడంలోనే నిమగ్నమై ఉన్నట్లు తోస్తుంది.

## 4.2 దయానంద రాజకీయ చింతనకు తాత్త్విక పునాదులు :

ఉన్నత స్థాయికి చెందిన సాహసోపేత ప్రవక్త, సంఘసంస్కర్త మాత్రమేకాక దయానంద ఒక మార్మికవాది కూడా అసంప్రజ్ఞాత సమాధి అనే అత్యున్నత దశలో మానవుని ఊహ అనుభవాతీత అంతర్వర్తనను చేరుకోగలదని ఆయన విశ్వసించినాడు. కాంట్, స్పెన్సర్‌ల అజ్ఞానవాదానికి భిన్నంగా ఆయన పవిత్ర జీవనం ద్వారా చేరుకోగల పరిపూర్ణదైవ విశ్వాసాన్ని ప్రభోదించినాడు. అత్యున్నత వాస్తవికత అతిభౌతిక జ్ఞానాతీతంలో లేదని అతిశయ దృష్టిలోనే కనుక్కోవడానికి సాధ్యపడుతుందని అన్నాడు. కాబట్టి దయానంద యోగాభ్యాసానికి అత్యధిక ప్రాధాన్యం యిచ్చినాడు. రాజీపడని ఏక దైవారాధకుడు. అతిభౌతికశాస్త్ర నిరపేక్షతకూ, దైవశాస్త్ర దేవునికి మధ్య వ్యత్యాసం వున్నదనే అద్వైత వేదాంత సిద్ధాంతాన్ని దయానంద తోసిపుచ్చినాడు.

దయానంద విశ్వసించిన దేవునికి వేదాంత బ్రహ్మ ఈశ్వరులిద్దరికీ కలిసి వున్న సారమూ, విధేయ సంబంధ నిశ్చయాలు వున్నాయి. దయానందుని అభిప్రాయంలో భగవంతుడు గుణరహితుడూ, లక్షణ రహితుడూ అయిన నిర్గుణ బ్రహ్మకాడు ఉదాత్త లక్షణాలు, ఉత్తమ గుణాలు అన్నీ ఆయనలో మూర్తీభవించినాయి. కాబట్టి నైతిక జీవితాన్ని చేరుకోవడానికి గల మార్గాలలో దైవలక్షణాలను, గుణాలను గురించి ఆలోచించడమనేది ఒకటి.

దయానంద ఉద్దేశంలో మూడు రకాలైన శాశ్వత పదార్థాలున్నాయి. భగవంతుడు, ఆత్మలు, ప్రకృతి ఈ మూడు శాశ్వత ఆధ్యాత్మిక పదార్థాలు స్వతంత్ర శాశ్వత ప్రకృతిలో సాంఖ్యులు వలెనే, ఆయన తన విశ్వాసాన్ని వ్యక్తం చేసినాడు. ఈ విధంగా విశ్వశాస్త్ర వాదనలో కూడా ఆయనకు నమ్మకం వుంది. దాని ప్రాతిపదిక మీద దైవవాదాన్ని సమర్థించినాడు. ప్రాపంచిక దృగ్గోచర అంతర్గత ప్రయోజనత, దైవవాద సిద్ధాంతము నిరూపిస్తుంది. ఏకైక విశ్వ సృష్టితార్కిక మేధస్సు, నైతిక భావాలను, వివరించలేదన్న కారణాన, తృప్తికరంగా లేదన్న భావనను ఆయన తిరస్కరించినాడు. ఆత్మబ్రహ్మలో పూర్తిగా అంతర్లీనమై వుందనిగాని లేదా బ్రహ్మనుంచి దానిని కేవలం పాక్షికంగా మాత్రమే వేరు చేయవచ్చునని చెప్పే వేదాంత సిద్ధాంతాలను దయానంద తోసిపుచ్చినాడు.

దయానంద పరిపూర్ణ వైదికవాద ప్రవక్త. నాలుగు వేద సంహితల దర్శన స్వభావాన్ని ప్రకటించి వైదిక సూత్రాలకు అనుగుణంగా జీవిత సమస్యలను పరిష్కరించవలెనని ఆయన కోరినాడు. వేదాలు శాశ్వత, పవిత్ర పరిపూర్ణ విజ్ఞానాన్ని మానవ జాతికి అనాది నుంచీ ప్రసాదిస్తున్నాయని ఆయన అన్నాడు. ప్రాచీన వైదిక విజ్ఞతా పూర్వక నియామవళిలో సాక్షాత్తూ భగవంతుని సుభాషితాలే ఉన్నాయని, కాబట్టి వేదాలలో తనకు అచంచల విశ్వాసం వుందని ఆయన వివరించినాడు.

## 4.3 దయానందుని సామాజిక తత్త్వము :

ఒక వ్యక్తి వర్ణము అతని మనస్తత్త్వానికీ, సహజ లక్షణాలకూ, దైనందిన కార్యకలాపాలకూ సంబంధించినదని దయానందుని భావము. విప్లవాత్మకంగా కనిపించే దయానందుని ఈ సామాజిక భావన మహాత్మాగాంధి ప్రశంసను చూరగొన్నది. జన్మతా సంక్రమించే ఆధిక్యతా భావనకు ఇది ఒక పెద్ద గొడ్డలిపెట్టు. స్వతసిద్ధంగా దయానందుడు వైదిక వర్ణాశ్రమ ధర్మానికి మద్దతుదారే అయినప్పటికీ, భారతదేశంలో ఆచరణలో వున్న కుల వ్యవస్థలో కానవచ్చే అసమానతలనూ, అక్రమాలనూ

అన్యాయాలను ఆయన నిశితంగా విమర్శించినాడు. ఒక వ్యక్తి వర్ణానికి ప్రాతిపదిక జన్మ మాత్రమేనన్న సిద్ధాంతంతో అంతర్గతమై ఉన్న అరిష్టాలను ఆయన తీవ్రంగా ఖండించాడు. వర్ణానికి ఆయన ఒక ప్రజాస్వామ్య సూత్ర ప్రాతిపదికను రూపొందించినాడు.

మనస్తత్వరీత్యా, వృత్తిరీత్యా ఏర్పడిన చతుర్వర్ణ వ్యవస్థ అనేక సామాజిక సంఘర్షణలకు అత్యుత్తమ పరిష్కారమని ఆయన అభిప్రాయపడినాడు. ఏ పని చేయడానికి ఒక వ్యక్తికి ఆసక్తి, శక్తి ఉంటుందో దానికి సంబంధించిన వర్ణానికి మాత్రమే చెంది వుండవలెనని ఆయన స్పష్టం చేసినాడు.

అయితే ఆధునిక భారతదేశంలో సామాజిక స్తరిత సూత్రంగా వర్ణసిద్ధాంత విలువను సందేహించే వారు లేకపోలేదు. ఎందుకంటే శతాబ్దాల చారిత్రక సంప్రదాయ వాదంతో అది కట్టుబడి వుంది. కాబట్టి ఆచరణలో నాలుగు వర్ణాలు నాలుగు కులాలుగా దిగజారడాన్ని నిరోధించటం కష్టం.

స్వీయాభివృద్ధికి ప్రతి మానవునికి తనకు నచ్చిన, తనకు వీలైన మార్గాన్ని అనుసరించడానికి పూర్తి స్వేచ్ఛ వున్నదని దయానంద ప్రకటించినాడు. సుదీర్ఘ నిద్రావస్థలో వున్న భారతాత్మను మేలుకొలిపే ప్రక్రియలో ప్రముఖపాత్ర నిర్వహించినవాడు దయానంద సరస్వతి. ఆయన బహుముఖ వ్యక్తిత్వం మానవునిలోని వివిధ శక్తి సామర్థ్యాల తేజోమయ పరిపూర్ణతకు ప్రాధాన్యం ఇచ్చే ప్రాచీన ఆదర్శాన్ని జ్ఞప్తికి తెస్తుంది. ప్రాచీన గ్రీకులు మేధాసంబంధమైన, సౌందర్య సంబంధమైన, క్రీడా సంబంధమైన ఔన్నత్యానికి ప్రాధాన్యం ఇవ్వగా ప్రాచీన భారతీయులు శక్తిని, దేశభక్తిని కాంక్షించినారు. ప్రాచీన వైదిక ఆత్మ పునరుద్ధరణకు దయానందుడు నిర్విరామంగా కృషి చేశాడు. సమకాలీన భారత సామాజిక, మత సంబంధమైన వ్యవస్థ నిర్మాణం బలహీనంగా వున్నందువల్ల దాని స్థానంలో శక్తివంతమైన పవిత్రవంతమైన వైదిక సంస్కృతి ఆత్మను పునరుద్ధరించడానికి ఆయన కంకణం కట్టుకొన్నాడు.

పూర్ణానంద సరస్వతి ఆదేశాలకు అనుగుణంగా దయానందుడు మధుర వెళ్ళి పురాతన శాస్త్రాలను అధ్యయనం చేయవారంభించారు. అక్కడ ఆయన విరజానందుని తన గురువుగా స్వీకరించి ఈ అధ్యయనాన్ని కొనసాగించాడు. విరజానందుడు హేతువాది, ఆచరణాత్మకవాది. దయానందుడు కూడా తన గురువునే అనుసరించి ప్రాచీన శాస్త్రాలకు నూతనమైన వివరణను యిచ్చి హిందూమతాన్ని హేతుబద్ధమైనదిగాను, శాస్త్రీయబద్ధమైనదిగాను మార్చ ప్రయత్నించాడు. తన గురువు ఆదేశాలకు అనుగుణంగా దయానందుడు హిందూమత సూత్రాలను ప్రచారం చేసి, వేదాల పవిత్రతను గురించి బోధించేందుకు ప్రమాణం చేసి, తన జీవితాన్ని అందుకు అంకితం చేశాడు.

## 4.4 దయానందుని రాజకీయ తత్వ విచారము :

దయానందుని రాజకీయ తత్వ విచారములో, మనుస్మృతి వేదాలలోని భావాల సంశ్లేషణ గోచరిస్తుంది. ధర్మానికి అనుగుణమైన రాజరిక భావనను ఆయన మనుస్మృతి నుంచి స్వీకరించినాడు. మంత్రుల సహాయ, సహకారాలతోనూ ధర్మబద్ధునిగాను పరిపాలించే విజేత అయిన రాజును గురించి మనువు సిద్ధాంతీకరించాడు. వేదాలలో శాసనసభను గురించి రాజు ఎన్నికలను గురించి ప్రస్తావనలు కనబడతాయి. దయానందుడు ఎన్నిక సూత్రాన్ని గట్టిగా బలపరిచినాడు. రాజును ఆయన శాసనసభాధ్యక్షునిగా పరిగణించినాడు. ఆయన అభిప్రాయంలో శాసనసభా సభ్యులలో అత్యంత వివేకవంతుడూ, విజ్ఞానవంతుడూ అయిన వ్యక్తిని రాజుగానో, అధ్యక్షునిగానో ఎన్నుకోవలసి వుంటుంది.

శాస్త్రీయ, అతిభౌతిక విజ్ఞానాలకు వేదాలను మూలాధారాలుగా దయానందుడు అంగీకరించినాడు. రాజకీయ అధికారం అంటే క్షాత్రం - ఆధ్యాత్మికాధికాధారం అంటే బ్రహ్మ నుంచి మద్దతును పొందవలసి వుంటుందనడం వైదిక సంస్కృతి ప్రధాన

భావాలలో ఒకటి. కాబట్టి దయానందుడు నైతిక పునరుజ్జీవనానికి అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినాడు. నైతికాంశాలతో సంబంధం లేని రాజకీయ విషయాలను ఆయన గర్హించినాడు. ఆధ్యాత్మిక నాయకుల మార్గదర్శకత్వం క్రింద మాత్రమే రాజకీయ పాలకులు వ్యవహరించవలెనని ఆయన గట్టిగా వాదించినాడు. మానవాళి శ్రేయస్సుతో నిమిత్తం లేని రాజకీయాలను ఆయన తిరస్కరించినాడు.

దయానందుడు ప్రజాస్వామ్యవాది. ప్రజాస్వామ్య భావనపట్ల ఆయనకు గల అనురక్తి రెండు విధాల నిరూపితమైనది. 1. ఆయన స్థాపించిన ఆర్య సమాజ వ్యవస్థానిర్మాణం ఎన్నికపైన ఆధారపడింది. క్రింది స్థాయి నుంచి పై స్థాయి వరకు కార్యవర్గ సభ్యులందరూ ఎన్నికైనవారే హిందూ మత వ్యవస్థలో ఎన్నిక సూత్రాన్ని ప్రవేశపెట్టడం నిజంగా ఒక విప్లవాత్మక చర్య. హిందూ బ్రాహ్మణుల అధికారం సాంప్రదాయక భావ వృత్తుల మీద ఆధారపడింది. అయితే సామాజిక మత సంస్థ అయిన ఆర్యసమాజంలో, అధికారం అనేది ఎన్నికకు సంబంధించిన ప్రకారము 2. తాను రూపొందించిన ఆదర్శ రాజకీయ వ్యవస్థలో చట్టబద్ధమైన ప్రభుత్వాంగాలు, గుర్తించిన అనేక సంస్థలలో ప్రజాస్వామ్య ఎన్నిక సూత్రాన్ని ప్రవేశపెట్టడాన్ని దయానందుడు సమర్థించినాడు. ధర్మార్య సభ, విద్యార్యసభ, రాజర్యసభ అనే మూడు సంస్థల నిర్మాణాలను, వాటి విద్యుక్త ధర్మాలను ఆయన నిర్వచించినాడు. ఈ సంస్థలు నిరోధ సమతుల్యభావనను అనుసరించవలసి వుంటుంది. దయానందుని మాటల్లో చెప్పాలంటే... ఏ ఒక్క వ్యక్తికి నిరపేక్షాధికారాన్ని ఇవ్వకూడదు. శాసనసభాధ్యక్షుడైన రాజా శాసనసభా పరస్పరం ఆధారపడి వుండి తీరవలె, ఈ రెండు ప్రభుత్వ అంగాలు ప్రజల నియంత్రణ క్రింది వుండవలె, ప్రజలు శాసనసభా పాలనకు లోబడి వుండవలె. ప్రజలు కుత్సితులూ, అన్యాయ వర్తనులూ అయినప్పుడు వారు పూర్తిగా నాశనమవుతారు. కాబట్టి ఒక జాతి అత్యంత విద్యావంతులైన వారినే విద్యాసభ సభ్యులుగా ఎన్నుకోవలె. అత్యంత భక్తి ప్రపూరితులైన వ్యక్తులనే మత సభ సభ్యులుగా ఎన్నుకోవలెనని దయానందసరస్వతి చెప్పటం జరిగింది.

బాహ్యయంత్రాంగం ఒక్కొక్కప్పుడు రాజరికమైనప్పటికి రాజకీయ వ్యవస్థ సారాంశం మాత్రం ప్రజాస్వామిక ఆదర్శవాదంపై ఉండాలని దయానందుడు అభిలషించినాడు. గ్రామం ప్రమాణంగా ఒక విశాల కామన్‌వెల్తును నిర్మించాలని దయానందుడు గట్టిగా వాదించినాడు. గ్రామీణ రాజకీయ ఆర్థిక వ్యవస్థల క్షీణదశ పట్ల దయానందుడు విచారం వెలిబుచ్చినాడు. మనుస్మృతి ప్రాతిపదికపైన పరిపాలనా యంత్రాంగం గ్రామాలకు అవినాభావ సంబంధం వుండి తీరాలనే భావనకు ఆయన మద్దతునిచ్చినాడు. "సత్యార్థప్రకాశిక"లో ఆయన ఈ విధంగా వ్రాసినాడు రెండు, మూడు, అయిదు, ఒక వంద గ్రామాల మధ్య ఒక పరిపాలనా కార్యాలయం వుండవలె. ఒక గ్రామానికి అధిపతిగా ఒక అధికారిని, పదిగ్రామాలకు అధిపతిగా రెండో అధికారిని, ఇరవై గ్రామాలకు అధిపతిగా మూడో అధికారిని, ఒక గ్రామానికి అధిపతిగా నాలుగో అధికారిని అటువంటి ఒక వెయ్యి గ్రామాలపైన ఐదో అధికారిని నియమించవలసి వుంటుంది. ఒక గ్రామ ప్రభువు పది గ్రామాల ప్రభువు ఇరవై గ్రామాల ప్రభువుకు తన నివేదిక సమర్పించవలె. ఇరవై గ్రామాల ప్రభువు అటువంటి విషయాలన్నింటిని గురించి ప్రతిరోజూ వంద గ్రామాల ప్రభువుకు తెలియజేయవలె. వంద గ్రామాల ప్రభువు వెయ్యి గ్రామాల ప్రభువుకు తెలియజేయవలె. ప్రతి పదివేల గ్రామాలపైనా ఇద్దరు అధ్యక్షోద్యోగులను నియమించవలె. వారిలో ఒకరు సభకు అధ్యక్షత వహించగా, రెండవవారు దేశమంతా పర్యటించి, న్యాయమూర్తులందరి, తదితర ఉద్యోగులందరి పనిని, వ్యవహార సరళిని జాగ్రత్తగా తనిఖీ చేయవలసి వుంటుంది.

దయానందుడు జాతీయ దేశభక్తిని ప్రబోధించినాడు. అయితే తన జీవితకాలంతోనే ఆయన అరాచకవాది అయినాడు. భగవంతుని అధికారాన్నే తప్ప భూలోకంలో మరే ఇతర అధికారాన్ని అంగీకరించడానికి ఆయన సిద్ధపడలేదు. కాని రాజ్యవినాశాన్ని మాత్రం ఆయన ఎన్నడూ కోరలేదు. బలప్రయోగం లేని రాజకీయ వ్యవస్థను గురించి కూడా ఆయన యోచించలేదు. అయితే ఒక సన్యాసిగా స్వీయ వ్యక్తిగత జీవితంలో ఆయన భగవంతుడినే సర్వాధికారిగా పరిగణించాడు. దైవ శాసనా-

శిరసావహించటం, రాజశాసనాలను శిరసావహించటం ఈ రెండింటి మధ్య ఎంపిక చేసుకోవలసి వచ్చినపుడు దైవశాసనాలనే తాను శిరసావహిస్తానని దయానందుడు నిర్ద్వంద్వంగా ప్రకటించినాడు. ఎందుకంటే భగవంతునికి సార్వత్రిక సార్వభౌమాధికారం వుందని దయానందుడు భావించినాడు. కాబట్టి దేవుని పట్ల తనకు గల విధేయతను ఆయన అసందిగ్ధంగా వెల్లడించినాడు. ఆయన మాటల్లో చెప్పాలంటే రాజులకు రాజైన విశ్వప్రభువుకు మనమంతా లోబడినవారమని అందరూ అర్థం చేసుకోవలె. ఆయన నిజమైన రాజా, మనమంతా ఆయనకు విధేయులమైన సేవకులం.

ఆధునిక భారతదేశంలో అక్షరాల వైదిక మత పునరుద్ధరణ జరిగి తీరాలని విశ్వసించినవాడు దయానంద సరస్వతి. కాని ఆయన దృష్టి కేవలం దేశ భౌగోళిక పరిధికి మాత్రమే పరిమితం కాలేదు. ఆర్యావర్తంలోనే పుట్టిపెరిగినప్పటికీ, ఆయన యావత్ మానవళి విమోచనకే కంకణం కట్టుకొన్నాడు.

ఏ వ్యక్తి ధ్యానంలో బంధితుడై మగ్గ కూడదని ఆయన అన్నాడు. దయానందుని బోధనలతో మానవకారుణ్యాపూరిత విశ్వజనీనవాద పోకడలు వున్నాయనడానికి ఆయన వ్రాసిన ఈ క్రింది మాటలే ప్రత్యక్ష తార్కాణాలు "మానవాళి శారీరక, ఆధ్యాత్మిక, సామాజిక స్థితిని మెరుగు పరచడం ద్వారా యావత్ ప్రపంచానికి మంచి చేయడమే సమాజం యొక్క ప్రధాన లక్ష్యం".

ఆర్య సమాజంతోపాటు దయానందుడు "పరోపకారిణి సభ" అనే పేరుతో ఒక దాన ధర్మ సంస్థను నెలకొల్పినాడు. ఇరవైముగ్గురు ధర్మకర్తల కమిటీ దానిని నిర్వహించింది. అది మూడు రకాలైన విధులను నిర్వర్తించింది. 1. వేదాలలోనూ. వేదాంగాలలోనూ వున్న విజ్ఞానాన్ని వ్యాపింపజేయడం. 2. మత ప్రచారకులను పంపి ప్రపంచంలో అన్ని ప్రాంతాలలోనూ వైదిక ధర్మాన్ని బోధించడం కోసం, సత్యాన్ని అనుసరించాలని, అసత్యాన్ని పరిత్యజించాలని, ప్రచారం చేయడం కోసం మత ప్రచార సంస్థలను నెలకొల్పడం. 3. అనాథలకు, పేదలకు రక్షణనిచ్చి వారికి నిజమైన విద్యను బోధించడం భారత సమాజంలోని పీడిత, పతిత జనోద్ధరణ విముక్తి ఆవశ్యకతను దయానందుడు గుర్తించినాడు. అయితే అదే సమయంలో వేదాలపై పవిత్ర విశ్వాసాన్ని ప్రపంచంలో వ్యాపింపచేయడానికి కూడా ఆయన దీక్ష పూనినాడు. అంతేగాక విశ్వమానవ వాదంలో ప్రపంచజాతుల రాజకీయ సమాఖ్య భావనను గురించిన యోచన లేదు. యావత్ ప్రపంచమూ వేదాల బోధలను అనుసరించే శుభక్షణం ఆసన్నం కావాలని ఒక మత ప్రచారకుడిగా, మత ప్రవక్తగా ఆయన కలలుకన్నాడు.

### 4.5 దయానందుడు - ఆర్యసమాజం :

దయానంద సరస్వతి ఆర్య సమాజమును 1828న స్థాపించడం జరిగింది. దీనికి ఎంతగానో కృషి చేసిన మహనీయుడు ఈయన స్థాపించిన ఆర్యసమాజం భారతదేశానికి లాలాలజపతిరాయ్, శ్రద్ధానందుని లాంటి గొప్ప నాయకులనిచ్చి నిరాశ నిస్పృహలతో వున్న భారతీయులను తమ జాతీయ సంస్కృతి, వారసత్వం పట్ల భారతీయులు గౌరవపడేటట్లు చేసింది. ఈ సమాజం జాతీయతా స్వభావంలోనికి ప్రాచీన ఆర్యవంశాన్ని ప్రవేశపెట్టే నూతన ఆధ్యాత్మిక జాతీయతను ప్రవేశపెట్టింది. తరువాత సంవత్సరాలలో ఈ ఆధ్యాత్మిక జాతీయత రాజకీయ ప్రగతి వాదానికి దోహదం చేసింది.

ఆర్యసమాజ, బ్రహ్మసమాజాలు పందొమ్మిదవ శతాబ్దంలో సాంస్కృతిక పునరుజ్జీవనాన్ని ప్రారంభించి భారతదేశం జాతీయోద్యమాన్ని గాఢంగా ప్రభావితం చేశాయి. ఆర్యసమాజం భారతదేశపు విశిష్ట సంస్కృతిని పునరుద్ధరించడానికి, హిందూ మత సంస్కరణకు ప్రయత్నించింది. ఈ ఆర్యసమాజం తన దృక్పథం విషయంలో జాతీయతను, సనాతనత్వాన్ని కలిగి వుండేది. దేశానికి మాతృదేశం రూపంలో గూఢమైన రూపాన్ని కల్పించడంతో తీవ్రవాద జాతీయతకు దోహదం చేసింది. ఈ విధంగా ఆర్యసమాజం తీవ్రవాదుల ఆవిర్భావానికి కారణంగా చెప్పవచ్చును.

మతపరమైన, సాంఘిక సంస్కరణల రంగంలో హిందూ మత సంస్కరణోద్యమానికి కారణభూతమైన స్వామి దయానంద సరస్వతి స్థాపించిన ఆర్యసమాజం శక్తివంతమైన సంస్థగా రూపొంది వైదిక పవిత్రతను తిరిగి సంతరించుకోవాలని సూచించింది. దయానందుని ఆర్యసమాజం మొత్తం హిందూమత నిర్మాణాన్ని కుదిపివేసి, హిందూమతంలో నూతనోత్తేజాన్ని ప్రవేశపెట్టింది. హిందువులు తమకు తాము విధించుకున్న ఒంటరితనాన్ని, సోమరితనాన్ని, అనారోగ్యపరమైన మూఢనమ్మకాలను, హానికరమైన సామాజిక, మత దురభిప్రాయాలను విడనాడేటట్లు చేసి ఆర్యసమాజం హిందువులలో నూతన జాగృతిని కలుగచేసింది. ఆర్యసమాజం హిందూమతంలోని గూఢమైన శక్తి వుందని, దానిని సరిగా వినియోగించుకొంటే భవిష్యత్తు ఆశాజనకంగా వుంటుందని హిందువులు భావించేటట్లు చేసింది.

ఆర్యసమాజోద్యమం ప్రారంభించిన హిందూ పునరుద్ధరణ బాలగంగాధర తిలక్, అరవింద్‌ఘోష్, లాలాలజపతిరాయ్, బిపిన్ చంద్రపాల్ వంటి రాజకీయ నాయకులను అధికంగా ప్రభావితం చేసింది. వీరందరు హిందూమత పునరుద్ధరణోద్యమం వల్ల ప్రత్యక్షంగా ప్రభావితులైన వీరందరూ ఉన్నత విద్యాభ్యాసం చేసి ఆంగ్ల, సంస్కృతి, సాహిత్యం వల్ల ప్రభావితులైనప్పటికీ, భారతీయ సాంప్రదాయక సంస్కృతి, నాగరికతల నుండి అధికోత్సాహాన్ని పొందారు. ఈ నాయకులందరూ పాశ్చాత్య ప్రపంచం విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక రంగాల్లో సాధించిన ప్రగతి పురస్కరించుకొని భారతీయ ప్రజల దృక్పథంలో మార్పు తీసుకొని రావటం అవసరమని భావించారు.

పందొమ్మిదో శతాబ్దపు హిందూ సాంస్కృతిక పునరుజ్జీవనం మతపరమైన ఉద్యమంగానే సాంఘిక, రాజకీయ రంగాల్లో సంచలనాత్మకమైన మార్పులకు కారణంగా కూడా పరిణమించింది. మత, సాంఘిక, రంగాల్లోని నూతన శోధనాత్మకతత్వం, రాజకీయ రంగంలోకి కూడా ప్రవేశించి అలాంటి భావాల సృష్టికి దోహదం చేసింది. ఆర్యసమాజ బోధన వల్ల భారతీయులు తమ మతం, గొప్ప సంస్కృతి, నాగరికత పట్ల గౌరవాన్ని పెంపొందించుకోవాలనే విధంగా ప్రభావితులయ్యారు. భారతీయులు, భారతీయ సంప్రదాయాలు, మతం, సంస్కృతి పట్ల భక్తి ప్రవృత్తులను పెంపొందించుకొని, భారతీయునిగా జన్మించడం గర్వకారణమని భావించడంతో, నూతన చైతన్యవంతమైన జాతీయత వల్ల ప్రభావితులయ్యారు. ఈనాడు కూడా దయానందుడు ప్రారంభించిన ఆర్యసమాజోద్యమం భారతదేశపు సామాజిక, మత జీవనంలో ప్రముఖపాత్రను నిర్వహిస్తోంది.

## 4.6 మతంపై దయానందుని భావనలు :

వేదాల సారాంశంపై రూపొందించిన మతాన్ని గురించి దయానందునికి ప్రగతిశీలమైన, హేతుబద్ధమైన భావన ఉంది. హిందూమతం పేరిట నాటి హిందూ సమాజం అనుసరించబడుతున్న మతం వేదకాలం నాటి మతంకంటే భిన్నంగా వుండడం ఆయనకు చాలా బాధ కలిగించింది. హిందూమతం పేరిట, వేదప్రామాణికంగాని చాలా మూఢనమ్మకాలు, ఆచారాలు, సాంప్రదాయాలు అనుసరింపబడుతుండేవి. వీటి అన్నింటినీ ఆయన నిరసించాడు. ఆయన మతసారమైన సత్యపథాన్ని అనుసరించడానికి మానవులకు సామర్థ్యం వుందని, కాని వారు స్వార్థం, అహం, దురాశలవల్ల ఆ మార్గాన్ని అనుసరించలేక పోతున్నారని ఆయన భావించాడు. మానవాళిచే సత్యంగా అంగీకరింపబడి, మత సూత్రాలుగా ఆమోదింపబడిన శాశ్వత, విశ్వవ్యాప్తి సూత్రాలను అనుసరించాలని ఆయన చెప్పాడు. మానవుల మధ్య న్యాయమైన వర్తన, సత్యాన్ని జీవితానికి సంబంధించిన ప్రాథమిక సూత్రంగా అంగీకరించడం, అసత్యాన్ని తిరస్కరించడం, మతానికి చెందిన మూడు ప్రాథమిక సూత్రాలని దయానందుడు పరిగణించాడు. దయానందునికి మతం, సత్యం, న్యాయం, ఋజువర్తన, స్వాతంత్ర్యం, సమానార్థకాలుగా భావించాడు.

దయానందుడు విగ్రహారాధనకు వ్యతిరేకి. అలాగే వేదవిరుద్ధమైన క్రతువులను కూడా ఆయన నిరసించాడు. విగ్రహారాధన హిందువులను విభిన్న వర్గాలుగా విభజించి, వారి ఐక్యతను భగ్నం చేసిందని ఆయన భావించాడు. అవివేకం

వల్ల దేవాలయ నిర్మాణాలు : దానికి సంబంధించిన క్రతువుల నిర్వహణకు కోట్లాది రూపాయలు ఖర్చు చేయడంతో పేదరికం, సోమరితనం పెరిగింది. ఆర్థిక, రాజకీయ, సామాజిక, మత రంగాల్లో భారతదేశంలో క్షీణదశకు చేరుకోవడం వల్లనే విగ్రహారాధన ప్రబలిందని యాన అభిప్రాయపడ్డాడు.

## 8.7 విద్యను గురించి దయానందుని భావనలు :

ఆంగ్లవిద్యాభ్యాసం చేసి, పాశ్చాత్య జీవన విధానాన్ని అనుకరించి, తన సంస్కృతి, మతాలు బ్రిటీషు వారి మతం సంస్కృతి కంటే తక్కువగా భావించిన విద్యావంతులైన భారతీయులపట్ల దయానందుడు అసంతృప్తిని వ్యక్తం చేసాడు. మెకాలే ఆశించినట్లుగానే భారతీయులు ఆంగ్ల విద్యాభ్యాసం చేయుటం వల్ల రక్తమాంసాదులు, రంగుపరంగా భారతీయులై, అభిరుచి, అభిప్రాయాలు, మాటలు, వివేకం విషయంలో ఆంగ్లేయుల స్వభావం గల భారతీయులు ఉత్పన్నమయ్యారు. ఈ విధంగా భారతీయులు ఆంగ్ల విద్యాభ్యాసం వల్ల వక్రగతిని అనుసరించడం వల్ల దయానందుడు తీవ్రంగా ప్రతిస్పందించాడు. అందువల్ల ఆయన వైదిక విలువల ప్రాతిపదికపై భారతీయ సాంప్రదాయాలు, సంస్కృతి మూలాధారాలుగా వున్న విద్యావిధానం అవసరమని ఆయన సూచించాడు. వ్యక్తిత్వ సమగ్రాభివృద్ధి కేంద్రంగా వుండే బ్రహ్మచర్యాన్ని పాటించే ఆర్య విద్యాలయాలను అధిక సంఖ్యలో స్థాపిస్తే భారతదేశపు పురాతన వైభవాన్ని పునరుద్ధరించటానికి వీలౌతుందని దయానందుడు అభిప్రాయపడ్డాడు. ప్రతి పౌరునికి విద్యనభ్యసించే హక్కు వుండదని, ప్రభుత్వమే అందరికి ఉచిత విద్యాబోధన సౌకర్యాలు కల్పించాలని దయానందుడు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. పాఠశాలకు తమ పిల్లలను పంపించకపోతే అలాంటి తల్లిదండ్రులను ప్రభుత్వం శిక్షించాలని ఆయన సూచించాడు. విద్యార్థుల ఆధ్యాత్మిక విజ్ఞానాభివృద్ధికి అనుకూలమైన వాతావరణాన్ని కల్పించిన ప్రాచీన కాలపు గురుకుల వ్యవస్థను పునరుద్ధరించాలని ఆయన అన్నాడు. ఇలాంటి పాఠశాలలో ధనిక, పేద విద్యార్థులను ఒకే విధంగా ఆదరించాలని ఆయన సూచించాడు. ఉపాధ్యాయునికి విద్యార్థులకు మధ్య సన్నిహిత సంబంధం వుండాలని, అలా కాని పక్షంలో నిజమైన విద్యాబోధన, సముపార్జన సాధ్యం కాదని ఆయన చెప్పాడు.

## 8.8 సంఘ సంస్కర్త దయానంద సరస్వతి :

దయానందుడు హిందూ సమాజ విభజనకు, అనైక్యతకు కారణమైన కఠిన కుల వ్యవస్థను చూచి చాలా బాధపడ్డాడు. ఇతోధికమౌతున్న కులాలు, ఉపకులాల మధ్య వైషమ్యాలు నెలకొనడంతో సాంఘిక వ్యవస్థ చాలా బలహీనపడింది. ఇది వర్ణ వ్యవస్థకు వ్యతిరేకంగా పరిణమించింది. ద్విజులు వారి హోదాను కోల్పోయారు. కర్మకాండను నిర్వహించే బ్రాహ్మణమతం హిందూ సమాజం, మతం క్షీణతకు ప్రతీకగా మారిపోయింది. హిందూ సమాజంలోని ఈ బలహీనతల వల్ల, అధిక సంఖ్యాక హిందువులు ఇస్లాం, క్రైస్తవ మతంలోకి మారిపోయారు. వేదాలను సరిగా అధ్యయనం చేయుట జరగలేదు. పురాణాలు వేదాల స్థానాన్ని ఆక్రమించాయి. మూఢనమ్మకాలతో కూడిన కర్మకాండకు, వేదాలకంటే పురాణాల ఆధిక్యతకు బ్రాహ్మణ పురోహితులు కారణమని ఆయన భావించాడు. సమాజంలోని దురాచారాలను నిర్మూలించకుండా సమాజాన్ని పునర్నిర్మించడం సాధ్యం కాదని ఆయన విశ్వసించడం వల్ల మౌలిక వైదిక సంస్కృతిని పునరుద్ధరించేందుకు ఆయన అనేక సాంఘిక సంస్కరణలను ప్రవేశపెట్టాలని అనుకొన్నాడు. హిందూమతం బలహీనంగాను, అనైక్యంగాను ఉన్నంతవరకు యితర మతాల నుండి విమర్శలను ఎదుర్కొనవలసిన స్థితిలో వుంటుందని ఆయన అభిప్రాయపడ్డాడు. అందువలన ఆయన కులవ్యవస్థ, బ్రాహ్మణాధిక్యత, కర్మకాండ, యింకా సామాజిక దురాచారాల పట్ల నిర్విరామమైన పోరాటాన్ని ప్రారంభించాడు.

దయానందుడు అంటరానితనాన్ని తీవ్రంగా వ్యతిరేకించి సమాజంలోని దళితవర్గాలు, తక్కువ కులాల ఉద్ధరణకు కృషి చేశాడు. ఒక వ్యక్తి వర్ణం, అతని శీలం, మంచిపనులు, అతని సంస్కారాన్ని బట్టి నిర్ణయింపబడతాయని రుజువుచేయడానికి

ఆయన వేదాలను ఉట్టంకించాడు. సత్యసంధత, ఆత్మత్యాగం, దైవానికి సంబంధించిన పరిజ్ఞానం, వేదాలకు సంబంధించిన పరిజ్ఞానం, శూద్రుడు కూడా ఉన్నత వర్ణంలో చేరేందుకు ఉపకరిస్తాయి. అదే విధంగా చెడువర్తన, చెడుపనులు, స్వార్థము, అసత్యపూరితంగా ఉండటం వలన ఉన్నత వర్ణానికి చెందిన వ్యక్తి కూడా సాంఘిక వ్యవస్థలోని తక్కువ వర్ణానికి దిగజారిపోయాడు. మంచి చెడు అని రెండు వర్గాల ప్రజలే వున్నారని దయానందుడు చెప్పాడు. వారు ఆర్యులు, దస్యులు స్వామిదయానంద అభిప్రాయం ప్రకారం ఆర్య శబ్దం జాతిపరమైంది కాదు - ఆ పదం ఒక వర్గ ప్రజల వీరోచిత గుణం, ధైర్యం, సౌమ్యత, సాంస్కృతికోన్నతిని సూచిస్తుంది.

## 4.9 దయానందుని విశిష్టత :

భౌతిక ప్రపంచ స్వతంత్ర వాస్తవికతను గురించి తత్వవేత్తగా దయానంద సరస్వతి వెలిబుచ్చిన అభిప్రాయాలకు జాతీయ ప్రాధాన్యం వుంది. సంఘసంస్కరణ, పునరావాసాలను గురించి దయానందుడు రూపొందించిన ప్రణాళిక, కార్యక్రమం ఆధునిక భారత రాజకీయ ప్రగతికి నాందీ వాచకాలు వైదిక సందేశాన్ని స్వీకరించడానికి, వైదిక అధ్యయనాలలో పాల్గొనడానికి అస్పృశ్యులతో సహా ప్రపంచంలోని ప్రజలందరికీ సమానహక్కులు వున్నాయనే ఆయన సందేశంతో అపార జాతీయ పరమార్థం వుంది. ప్రముఖ ఆధునిక భారత నిర్మాతలలో దయానంద సరస్వతి విశిష్ట స్థానాన్ని ఆక్రమించినాడు. హిందువులలో ఆయన ఒక నూతన విశ్వాసాన్ని, గౌరవను, నైతిక సామాజిక బాధ్యతా భావాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగించినాడు. అనేక దశాబ్దాల విదేశీ ఆధిపత్యం మూలంగా హిందువులు తమ ఆత్మవిశ్వాసాన్ని, సామాజిక ఆదర్శవాదాన్ని పోగొట్టుకుంటూ వున్న సమయంలో ప్రాచీన వైదిక విజ్ఞాన విశిష్టతను దయానందుడు ధైర్యంగా చాటి చెప్పినాడు. వైదిక, సంస్కృత విజ్ఞానాన్ని ఆ సమయంలో ఆయన గట్టిగా ప్రచారం చేయడం వల్ల హిందువులు తమ ఆత్మగౌరవాన్ని ప్రదర్శించుకోగలిగినారు. తమ జీవితాలను కొత్త తరహాలో వారు తీర్చిదిద్దుకోగలిగారు. ఉత్తరప్రదేశ్‌లో ఆయన ప్రభావం కూడా పరిగణనీయమైనదే. ఆయన నిర్యాణానంతరం ఆయన జీవిత లక్ష్యసాధనకు ఆర్యసమాజంలోని ఆయన అనుచరులు దీక్షపూనినారు.

దయానందుడు పరోక్షంగా స్వతంత్ర రాజకీయ జీవిత పునాదులకు కూడా సంసిద్ధం చేసినాడు. శీల నిర్మాణానికి, నైతిక విద్యకు, పవిత్రతకు ఆయన ఎంతో విలువ ఇచ్చినాడు. ఉత్తర హిందుస్థానమంతటా దయానందుని వ్యక్తిత్వం, శీలం సామాన్య ప్రజల జీవితాలపై వారి ఆలోచనా సరళిపై చెరగని ముద్రలు వేసినాయి.

దయానంద సరస్వతి వైదిక స్వరాజ్య వైభవాలను ప్రస్తుతించి ప్రబోధించినాడు. దేశ స్వాతంత్ర్యాన్ని ఆయన గాఢంగానే అభిలషించినాడు. ఇతడు హిందూ సమాజ తక్షణ సామాజిక రాజకీయ ప్రయోజనాల పరిరక్షణతో సంబంధం గల వ్యక్తి మాత్రమే కాక ప్రపంచంలో వైదిక సిద్ధాంతాల వ్యాప్తికి కంకణం కట్టుకొన్న వైదిక విశ్వజనీన వాది కూడా.

దయానందుడు నైతిక, వైజ్ఞానిక స్వాతంత్ర పునాదులకు వేసినాడు కేంద్ర కామన్ వెల్తుతో గ్రామాలకు అవినాభావ సంబంధం వుందని ప్రస్తావించడం ద్వారా ఆయన ప్రభుత్వ సిద్ధాంతానికి దోహదం చేసినాడు. వైదిక స్వరాజ్య భావనను ఆయన పునరుద్ధరించినాడు. అయితే రాజీపడని ఆయన వైదిక మతం ఆధునిక మనస్సుకు ఆమోదకరం కాకపోవచ్చు. ఆయన గొప్ప దేశభక్తుడు. కాని తన "సత్యార్థ ప్రకాశికలో" ఆయన వేదాలలోని మనుస్మృతిలోని, మహాభారతంలోని రాజకీయ ఆదర్శాలను సంపూర్ణమని, పరిపూర్ణమని భావించడం ద్వారా ప్రాచీన హిందూ రాజనీతి శాస్త్రపరిధిని అతిశయోక్తిగా చిత్రించినాడు. ప్రాచ్య పాశ్చాత్య విజ్ఞానాల రెండింటి పునాదులపైన సమగ్ర రాజకీయ తత్త్వవ్యవస్థను స్థాపించవలసిన ఆవశ్యకత ఎంతైనా వుండగా, తన మితిమీరిన వైదిక మతాభిమానంతో దయానందుడు పాశ్చాత్య సామాజిక రాజకీయ తత్వవేత్తల రచనలోని సత్యాలను కనుక్కోలేకపోయాడు.

ప్రజాస్వామ్య సిద్ధాంతానికి ఆచరణకు దయానందుడు మూడు విధాలుగా దోహదం చేయటం జరిగింది. 1. ఒక సామాజిక తత్వవేత్తగా జన్మస్థానంలో గుణమూ, కర్మస్వభావాల సమ్మిళితమైన ప్రతిభను జీవితంలో ఒక వ్యక్తి స్థానానికి ప్రాతిపదికగా ఆయన భావించినాడు. 2. ప్రతినిధుల ఎన్నిక అనే ప్రజాస్వామిక సూత్రంపైన ఆర్యసమాజ వ్యవస్థ నిర్మాణాన్ని ఆయన నెలకొల్పినాడు. 3. తన ఆదర్శ రాజకీయ వ్యవస్థ కోసం కూడా ఆయన ఎన్నిక అనే ప్రజాస్వామి సూత్రాన్ని అంగీకరించినాడు. కాబట్టి సాంకేతికముగా పరిశీలిస్తే దయానందుడు రాజనీతి శాస్త్రజ్ఞుడు కాకపోయినప్పటికీ, భారత రాజకీయ తత్వ చరిత్రలో ఆయనకు సముచిత స్థానం ఇవ్వవలసి వుంటుంది. స్వామి దయానంద కేవలం ఒక శక్తివంతమైన వైదిక పునరుద్ధరణోద్యమాన్ని, సంఘసంస్కరణనూ, ప్రారంభించడంలో చొరవ తీసుకోవడమే గాక, ఆయన స్థాపించిన ఆర్యసమాజం భారత రాజకీయోద్యమానికి అసంఖ్యాక నాయకులనూ, అనుచరులనూ ప్రసాదించింది. దైవశాస్త్ర, సామాజిక విషయాలలో కూడా ఆయన హేతువాదాన్ని, స్వేచ్ఛను ప్రసాదించినాడు. మత విషయాలలో అంధ విశ్వాసానికి గాక హేతువాదానికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వాలని ఆయన ప్రకటించడం గొప్ప విశేషం.

సమకాలీన ప్రజల మూఢనమ్మకాలను పటాపంచలు చేయడానికి కంకణం కట్టుకొన్న ధీరునిగా నాయకునిగా, దయానందుని ప్రజా జీవితం పరిగణనీయమైనది. విగ్రహారాధన విషయంలో ఆయన జీవితాంతము రాజీపడనే లేదు. విగ్రహారాధనను ఆయన వైదిక మతానికి విరుద్ధమైనదానిగా పరిగణించాడు.

సాంప్రదాయక వాదులైన పండితులతో ఆయన పోరాడిన తీరు వైదిక మతాన్ని గురించి ఆయనకు గల అపార వాక్పటిమను విదితంచేసింది. సాంప్రదాయక భారతదేశంలో, సాంప్రదాయక సామాజిక మతాభిప్రాయాలకు ధైర్యంగా ఎదురు తిరగడం ద్వారా దయానందుని వ్యక్తిత్వ ఘనత, సందేశ విశిష్టత క్రమ క్రమంగా ప్రజాబాహుళ్యానికి ఆమోదకరాలు అయినాయి. జాతీయ మనస్తత్వాన్ని ఆయన ఎంతవరకు అవగతం చేసుకున్నాడో తెలుసుకోవడానికి ఇది ఒక మంచి ఉదాహరణ. ఆయన మేధాశక్తిని ప్రజానురంజకత్వంతో చక్కగా మేళవించినాడు.

దయానందుడికి ఒక శక్తివంతమైన సామాజిక మతనాయకుడూ కావడానికి అవసరమైన అనేక లక్షణాలు వున్నాయి. ఆయనకు ఒక క్రీడాకారునికి వుండే బ్రహ్మాండమైన శారీరక సౌష్ఠవం వుంది. తన శారీరక శక్తిని, బలాన్ని ప్రదర్శించడం ద్వారా ఆయన అనేక పర్యాయాలు సామాన్య ప్రజల ప్రశంసలను చూరగొన్నాడు. అయితే ఇహలోక సుఖాలను పరిత్యజించిన సన్యాసిగా కూడా ఆయన ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. దయానందుని జీవితం విజయవంతమైన నాయకుడు ప్రజలకు కార్యాచరణ సందేహాన్ని, ఆశాభావాన్ని కలిగించాయనడంలో సందేహం లేదు. ఈ విధంగా దయానందునికి భారత రాజకీయ తత్వ విచారంలో, సంస్కృతిలో దేశ ప్రజలలో ఆయనకు అతి ప్రముఖ స్థానముంది.

## 4.10 సారాంశం :

భారతదేశంలో సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమంలో స్వామి దయానంద సరస్వతి ఒక ప్రధాన శక్తి. ఇతడు చిత్తవృత్తి రీత్యా అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడిన స్వతస్సిద్ధయోధుడు "ప్రపంచం అంధ విశ్వాస అజ్ఞాన శృంఖలాలచే బంధింపబడి వుంది. నేను ఆ శృంఖలాలను ఛేదించడానికి, బానిసలకు స్వేచ్ఛ కలిగించడానికి వచ్చినాను" అని ఒక సందర్భంలో దయానంద సరస్వతి చెప్పటం జరిగింది. మత సంబంధమైన అంతరాత్మ విషయంలో శైవ మతస్థుడైన తన తండ్రి విధించిన నిరంకుశ సాంప్రదాయిక ఆదేశాలను శిరసావహించటానికి తిరస్కరించిన గొప్ప తిరుగుబాటుదారుడు స్వామి దయానంద. హిందూ సనాతన నాయకులు పెట్టిన ప్రలోభాలకు గాని, ప్రదర్శించిన ఆగ్రహానికి గాని ఆయన లొంగిపోలేదు. ఆ రోజుల్లో బ్రిటీష్ సామ్రాజ్యవాదం భారతదేశంలో తన విజయపతాకం ఎగురవేసినప్పటికీ, క్రైస్తవమతంలోని లోపాలను ఖండించడానికి ఆయన

వెనుకాడలేదు. పరిపూర్ణ సత్యాన్వేషణలో వ్యక్తి పవిత్రతతకూ, ఔన్నత్యానికి ఆయన దీక్షబూనటం జరిగింది. ఇతడు గొప్పనైతిక ఆదర్శవాది. ఆయన ఒక సన్యాసి, పవిత్రమూర్తి, సత్యం కోసం ధైర్యంగా పోరాడే వీరోచిత పురుషుడు. ఇతడు స్థాపించిన ఆర్యసమాజంలో "మనమెప్పుడూ సత్యాన్ని అంగీకరించడానికి, అసత్యాన్ని పరిత్యజించడానికి సిద్ధంగా వుండవలె" అని దయానంద సరస్వతి ఉద్బోధించాడు.

దయానంద సరస్వతి యొక్క వ్యక్తిత్వం చాలా వరకు వైదిక ఆదర్శవాదం ప్రభావానికి గురైంది. సాంఘిక విద్యావిషయక, మత సంబంధమైన బహుముఖ కార్యకలాపాల మీద తన దృష్టిని నిలిపాడు. తరగని శక్తి సామర్థ్యాలతో ఆయన దాదాపు 40 సం॥ల పాటు తన జీవితంలో ప్రధానమైన ఈ కృషికి అంకితమైనాడు. ఈ విధంగా ఆయన హిందూ సమాజ పునరుద్ధరణకు, దేశ పునరుద్ధరణకు కంకణం కట్టుకొని శ్రద్ధాసక్తులతో తన అసాధారణ వాక్పటిమతో అసామాన్యమైన ఓర్పుతో తన ధ్యేయాన్ని చేరుకోవడానికి నిర్విరామ కృషి చేసినాడు. దైవభక్తిలో పవిత్రతనూ, శీలసంపదను ప్రదర్శించి తద్వారా ఆర్జించిన అపార సృజనాత్మకశక్తి సంపదను జాతి ఉద్ధరణకు ఆయన వినియోగించినాడు. ఆయన ఒక యోగి మరణం ఆసన్నమయిన సమయంలో కూడా తన జీవిత కాలమంతా అంతర్గత విజయాలను సాధించడంలోనే నిమగ్నమై వున్నట్లు తోస్తుంది.

సమకాలీన ప్రజల మూఢనమ్మకాలను పటాపంచలు చేయడానికి కంకణం కట్టుకొన్న ధీరునిగా, నాయకునిగా దయానందుని ప్రజా జీవితం పరిగణనీయమైంది. విగ్రహారాధన విషయంలో ఆయన జీవితాంతము రాజీపడనే లేదు. విగ్రహారాధనను ఆయన వైదిక మతానికి విరుద్ధమైనదానిగా పరిగణించినాడు. సాంప్రదాయకవాదులైన పండితులతో ఆయన పోరాడిన తీరు వైదిక మతాన్ని గురించి ఆయనకు గల అపార వాక్పటిమను విదితం చేసింది. సాంప్రదాయక భారతదేశంలో, సాంప్రదాయక, సామాజిక మతాభిప్రాయాలకు ధైర్యంగా ఎదురు తిరగడం ద్వారా దయానందుని వ్యక్తిత్వ ఘనత, సందేశ విశిష్టత క్రమ క్రమంగా ప్రజాబాహుళ్యానికి ఆమోదకరాలు అయినాయి. జాతీయ మనస్తత్వాన్ని ఆయన ఎంతవరకు అవగతం చేసుకున్నాడో తెలుసుకోవడానికి ఇది ఒక మంచి ఉదాహరణ. ఆయన మేధాశక్తిని ప్రజానురంజకత్వంతో చక్కగా మేళవించినాడు.

దయానందుడికి ఒక శక్తివంతమైన సామాజిక మతనాయకుడూ కావడానికి అవసరమైన అనేక లక్షణాలు వున్నాయి. ఆయనకు ఒక క్రీడాకారునికి వుండే బ్రహ్మాండమైన శారీరక సౌష్ఠవం వుంది. తన శారీరక శక్తిని, బలాన్ని ప్రదర్శించడం ద్వారా ఆయన అనేక పర్యాయాలు సామాన్య ప్రజల ప్రశంసలను చూరగొన్నాడు. అయితే ఇహలోక సుఖాలను పరిత్యజించిన సన్యాసిగా కూడా ఆయన ప్రజాభిమానాన్ని చూరగొన్నాడు. దయానందుని జీవితం విజయవంతమైన నాయకుడు ప్రజలకు కార్యాచరణ సందేహాన్ని, ఆశాభావాన్ని కలిగించాయనడంలో సందేహం లేదు. ఈ విధంగా దయానందునికి భారత రాజకీయ తత్వ విచారంలో, సంస్కృతిలో దేశ ప్రజలలో ఆయనకు అతి ప్రముఖ స్థానం వుంది.

## 4.11 మాదిరి ప్రశ్నలు :

**ఈ క్రింది వానికి వ్యాసరూపంలో జవాబులు వ్రాయండి.**

1. దయానందుని సామాజిక, రాజకీయ భావనలను పరిశీలించుము.
2. స్వామి దయానంద సరస్వతి తాత్విక చింతనకు గల పునాదులను వివరించండి.
3. భారత రాజనీతి తత్వ విచారణలో దయానంద సరస్వతి యొక్క స్థానాన్ని వివరించండి.

**లఘు ప్రశ్నలు**

1. ఆర్యసమాజం
2. మతంపై దయానందుని భావాలు
3. విద్యపై దయానందుని అభిప్రాయం

## 4.12 చదువదగిన గ్రంథాలు :


1. ఏ.ఆర్. పటేల్ : రివైవలిస్టు దయానంద సరస్వతి
2. వి.పి. వర్మ : మోడరన్ ఇండియన్ పొలిటికల్ థాట్
3. జె.పి. సుధ : మెయిన్ కరెంట్సు ఆఫ్ సోషల్ అండ్ పొలిటికల్ థాట్ ఇన్ మోడరన్ ఇండియా.
4. వి.పి. వర్మ : బుద్ధ అండ్ దయానంద


- డాక్టర్ కె. రామచంద్రమూర్తి

పాఠం - 5

# దాదాభాయి నౌరోజి

## 5.0 లక్ష్యం:-

భారత జాతీయోద్యమ నిర్మాతలలో 'భారతదేశ కురు వృద్ధుని' (Grand Oldman of India)గా పేరుగాంచిన దాదాభాయి నౌరోజి ఒకరు. భారత రాజకీయాలకు ఆర్థికపరమైన వివరణను యివ్వటం ద్వారా ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఆయన సముపార్జించుకున్నారు. ఆయన ఆర్థిక, రాజకీయ, సామ్యవాద భావాలను కాలానుగుణంగా ఆయన భావాలలో వచ్చిన మార్పులను, భారత రాజకీయ తత్త్వ విచారంలో ఆయన స్థానాన్ని అంచనా వేయటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక:-


5.0 లక్ష్యం

5.1 పరిచయం

5.2 దాదాభాయి నౌరోజి - ఆర్థికతత్త్వ చింతన, పారుదల సిద్ధాంతము

5.3 దాదాభాయి నౌరోజి - రాజకీయ భావనలు

5.4 దాదాభాయి నౌరోజి - సామ్యవాద భావాలు

5.5 దాదాభాయి నౌరోజి రాజకీయ భావాలలో వచ్చిన మార్పు

5.6 భారత రాజకీయ తత్త్వ విచారంలో నౌరోజి స్థానం

5.7 సారాంశం

5.8 మాదిరి ప్రశ్నలు

5.9 ఆధార గ్రంథాలు


## 5.1 పరిచయము:-

భారత జాతీయోద్యమానికి పునాదులు వేసిన వారిలో దాదాభాయి నౌరోజి ఒకరు. ఈయన సెప్టెంబర్ 4, 1825న మహారాష్ట్రలోని ఖడక్ అనే గ్రామంలో ఒక పేద పార్శీ ప్రచారకుని యింట జన్మించినారు. జూన్ 30, 1917న చనిపోయారు. ఆయన అనుభవాలు విభిన్నమైనవి. బానిసత్వ నిర్మూలనోద్యమంలో ప్రముఖులైన విలియం విల్బర్ ఫోర్స్ (William Wilber Force), థామస్ క్లార్క్‌సన్ (Thomas Clarkson) వంటి వారి ప్రభావం ఆయన మీద పడింది. 1853లో కొంత మంది స్నేహితుల సహకారంతో బొంబే అసోసియేషన్‌ను స్థాపించినారు. 1854లో ఆయన బొంబాయిలోని ఎల్ఫిన్‌స్టోన్ కళాశాలలో గణిత మరియు ప్రాకృతిక తత్త్వ శాస్త్రంలో ఆచార్యునిగా నియమితుడైనాడు. 1867లో కొంత మంది మిత్రులతో కలిసి లండన్‌లో ఈస్టిండియా అసోసియేషన్‌ను స్థాపించినాడు. 1869లో దానికి అనుబంధంగా బొంబాయి శాఖను ఏర్పరచినారు. 1875లో బొంబాయి కార్పోరేషన్‌లో సభ్యుడైనాడు. 1885లో బొంబాయి శాసన మండలిలో అదనపు సభ్యునిగా నియమించబడినాడు. 1892లో బ్రిటీష

పార్లమెంటుకు ఎన్నిక కాబడి 1895 వరకు కొనసాగినాడు. ఆయన కృషి ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాల నియామకానికి బ్రిటన్‌లోను, ఇండియాలోను ఒకేసారి పరీక్షలు జరిగే విధంగా సిఫారసు చేస్తూ కామన్సీ సభ ఒక తీర్మానాన్ని ఆమోదించింది.

భారత మాత పునరుజ్జీవనం కోసం దాదాభాయి నౌరోజీ సుమారు ఆరు దశాబ్దాలకు మించి అవిశ్రాంతంగా కృషి చేసినాడు. వివిధ వర్గాలకు చెందిన భారతీయుల గౌరవాభిమానాలను ఆయన చూరగొనినాడు. భారత ఆర్థిక వ్యవస్థ గురించి ఆయనకు సమగ్రమైన అవగాహన ఉంది. ఆయన రచనలలో స్పష్టత, వాస్తవికత, మేధాపరమైన లక్ష్యం కనిపిస్తాయి. ఉపాధ్యాయుడిగా, ఆచార్యునిగా, వ్యాపారవేత్తగా, పరిపాలకునిగా, పార్లమెంటు సభ్యునిగా దాదాభాయి నౌరోజీ జీవితం అకుంఠిత దేశభక్తికి, నిష్కలంక ప్రవర్తనకు, త్యాగాలకు, బాధామయి జీవితానికి ప్రతీక.

భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులలో నౌరోజీ ఒకరు. 1886 కలకత్తా, 1893 లాహోర్, 1906 కలకత్తా కాంగ్రెస్ సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించినాడు. 1906 కలకత్తా సమావేశంలో అధ్యక్షోపన్యాసం చేస్తూ భారత రాజకీయాల లక్ష్యం 'స్వరాజ్య సంపాదన' అని ప్రకటించి అందర్నీ ఆశ్చర్యపరచినాడు. దీనిని బట్టి ఆయన రాజకీయ జీవితం ఉదారవాదం (Liberal-ism) నుంచి ఒక విధమైన తీవ్రవాదం (Radicalism) వైపు క్రమేపి మొగ్గ చూపినట్లు కన్పిస్తుంది. బ్రిటీషు రాజకీయవేత్తల పట్ల ఆయనకు ఏర్పడిన నిరాశా నిస్పృహలే ఆయనలో వచ్చిన మార్పుకు కారణంగా మనం పేర్కొనవచ్చు. ఏమైనప్పటికి భారత ప్రజాజీవితంలో దాదాపు అర్థ శతాబ్దం పాటు ఒక విశిష్ట వ్యక్తిగా దాదాభాయి నౌరోజీ వెలుగొందినారు. భారతదేశానికి పాశ్చాత్య విద్య అందించిన అత్యుత్తమ భారతీయులలో నౌరోజీ ఒకరు. అనేక రంగాలలో ఆయన నూతన మార్గాలను కనుక్కొన్న మహా మేధావి. సాంఘిక - ఆర్థిక తత్త్వ చింతనలో బెంథామ్, ఆడమ్‌స్మిత్, టి.హెచ్. గ్రీనీల స్థాయికి చెందిన మౌలిక పండితుడు కాకపోయినప్పటికి భారత దేశ ఆర్థిక పరిస్థితులను ప్రాతిపదికగా చేసికొని ఉత్పత్తి, సంపద, పెట్టుబడి, జాతీయతా వాదం, రాజకీయ విధేయత వంటి సమస్యలను క్రమబద్ధీకరించి సిద్ధాంతపరమైన వ్యాఖ్యాలను ప్రప్రథమంగా చేసిన ఘనత దాదాభాయి నౌరోజీదే. భారత ఆర్థిక తత్త్వ చింతనపై ఆయన ప్రచురించిన **"Poverty and Un-British Rule in India"** అనే గ్రంథం ఒక సాహసోపేతమైన సిద్ధాంత సంబంధమైన కృషి అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. ఆర్థిక దోపిడి నుంచి మాతృ దేశాన్ని విముక్తి చేయటానికి నౌరోజీ చేసిన కృషికి నిదర్శనంగా ఈ గ్రంథం ఆయనకు శాశ్వత పేరు ప్రఖ్యాతులు తెచ్చిపెట్టింది.

## 5.2 దాదాభాయి నౌరోజీ : ఆర్థిక తత్త్వ చింతన - పారుదల సిద్ధాంతం:-

భారత జాతీయ వాదానికి దాదాభాయి నౌరోజీ ఆర్థిక పునాదులను రూపొందించినాడు. బ్రిటీషు వారి పాలనలో భారత ఆర్థిక వ్యవస్థ పూర్తిగ దెబ్బతిన్నదని నౌరోజీ భావించినాడు. బ్రిటీషు వారి దోపిడి విధాన ఫలితంగా భారత వనరులన్నీ తరలి పోతున్నాయన్నది ఈయన సిద్ధాంత సారాంశం. ఆర్థిక వనరుల తరలింపు ద్వారా దేశంలో పెచ్చు పెరిగిపోతున్న బీదరికం, కరువు కాటకాలు, క్షామాలు, ఉపవాసాలు, అంటువ్యాధులకు తాము ఏ విధంగా గురి అయిందీ తోటి భారతీయులకు తెలియజెప్పి వారిలో చైతన్యాన్ని కల్గించినాడు. భారతదేశ, ఆర్థిక సమస్యల పై ఆయన రచించిన **'Poverty and Un. British Rule in India'** గ్రంథం భారత ఆర్థిక రంగంలోను, భారత జాతీయ వాదంలోను ఒక విశిష్ట రచనగా ప్రసిద్ధికెక్కింది. ఈ గ్రంథంలో ఆయన ప్రతిపాదించిన పారుదల సిద్ధాంతం (draine theory) బ్రిటీషు వారు భారత దేశం నుండి ఆర్థిక వనరులను ఏ విధంగా తరలించుకు పోతున్నది, వాటి దుష్పరిణామాలను గణాంక సహితంగా వివరించింది. ఈ విధంగా భారత ఆర్థిక సమస్యలకు గణాంక పద్ధతులను అన్వయింప జేయటంలో దాదాభాయి నౌరోజీ మార్గదర్శకుడైనాడు. ఆయన సిద్ధాంతపరమైన అగమ్య గోచర భావాలకు ప్రాధాన్యత యివ్వకుండా యదార్థాలు, అంకెలు, గణాంక సమాచారం, వివరాలకు, శాస్త్రీయ పద్ధతికి ఎక్కువ ప్రాముఖ్యం యిచ్చినాడు. భారతదేశం యొక్క ఆర్థికపతనాన్ని ఊహాగానాల మీద కాకుండా వాస్తవాలు ఆధారంగా నిరూపించటానికి నౌరోజీ ప్రయత్నించినాడు.

బ్రిటీషు పాలకుల అసహజ ఆర్థిక విధానాలను నౌరోజీ గర్హించినాడు. విదేశీ సామ్రాజ్య వాదుల నిర్బంధ విధానాల ఫలితంగా భారతదేశం పై విపరీతమైన ఋణ భారం పడింది. ఇంగ్లండ్ లోను, భారతదేశంలోను అధిక సంఖ్యలో నియమితులైన

పరిపాలనా సిబ్బంది మూలంగా కూడ భారతదేశం పై ఆర్థిక భారం ఇనుమడించింది. తత్ఫలితంగా భారత దేశ ప్రజలు తమ సహజ హక్కులను, జీవనోపాధి మార్గాలను కోల్పోయినారు. జాతిమనుగడకే మూలాధారమైన ఆర్థికవ్యవస్థ అస్తవ్యస్తం కావటం ఆయనకెంతో బాధ కలిగించింది. కాబట్టి దేశ ఆర్థిక సౌభాగ్యాన్ని పెంపొందించే ఏకైక మార్గం మన ఆర్థిక వనరులు దేశం నుండి తరలి వెళ్లకుండా నిరోధించటమేనని ఆయన భావించినాడు. ఆర్థిక రాజనీతి శాస్త్ర సిద్ధాంతరీత్యా ఆర్థిక రంగంలో భారతీయుల సహజ హక్కును పునరుద్ధరించాలని దాదాభాయి వాదించటం గొప్ప విశేషం.

భారతదేశంలో బ్రిటీషు వారి విధానాలు మన వనరులు తరలి వెళ్లటానికి కారణమని ఆయన భావించాడు. భారతదేశ ఆర్థిక-ఈతి బాధలకు ప్రకృతిని తరచుగా నిందిస్తారు. అధిక జనాభా అని చెబుతారు. కాని ఆయన మాటలలో "తప్పు మీదైనపుడు పాపం! ప్రకృతిని నిందించటం ఎందుకు? అసలు సమస్య మన వాకిళ్లముందు ఉంది. సహజ ఆర్థిక సూత్రాలను స్వేచ్ఛగా పనిచేయనివ్వండి. భారతదేశం మరో ఇంగ్లండ్ అవుతుంది. అందువలన ప్రస్తుతం కంటె ఇంగ్లండ్‌కు ఎక్కువ లాభం చేకూరుతుంది".

భారతదేశంలో ఆర్థిక సంపద క్షీణించుటకు గల కారణాలను తన సిద్ధాంతంలో గణాంక వివరాలతో నిరూపించినాడు. ఇంగ్లండ్‌లో ఉండి భారతదేశాన్ని పరిపాలించుట వలన భారతదేశంలో పరిపాలనకు మితిమీరిన వ్యయమవుతున్నది. భారతదేశ ఆర్థిక సంపద బ్రిటన్‌కు తరలి వెళ్లటం వలన దేశంలో పెట్టుబడికి అవసరమైన మూలధనం అభివృద్ధి చెందలేదని, దాని వలన బీదరికం నిరంతరం పెరిగిందని నౌరోజి పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం **30** నుండి **40** మిలియన్ పౌండ్ల వరకు వనరులు వివిధ రూపాలలో తరలి వెళ్లటం వలన భారత దేశ దారిద్ర్యం నానాటికి పెరిగి పోతున్నది. భారతదేశం నుండి ఆర్థిక వనరులు బ్రిటన్‌కు ఈ క్రింది రూపాలలో తరలి వెళ్లటం జరిగిందని నౌరోజి అభిప్రాయపడినాడు. అవి:

(i) బ్రిటీషు అధికారులకు పింఛనులు

(ii) భారతదేశంలో బ్రిటీషు సైనిక దళాల పోషణ కోసం యుద్ధ కార్యాలయానికి **(war office)** చెల్లింపులు

(iii) ఇంగ్లండ్‌లోని భారత ప్రభుత్వ ఖర్చులు

(iv) బ్రిటీషు వ్యాపారవేత్తలు, వివిధ వృత్తుల వారు భారతదేశంలో సంపాదించి బ్రిటన్‌కు పంపే ఆదాయ వనరులు

వీటన్నింటి వలన భారతదేశం పై అధిక పన్నుల భారం పడటమే గాక దేశ ప్రజల ఆర్థిక ప్రయోజనాలకు హానికరమైన విదేశ వ్యాపారాన్ని ప్రోత్సహించే ఆర్థిక విధానం కూడ అనుసరించటం జరిగింది. ఒక వైపున దేశ సహజ వనరులు పుష్కలంగా ఉన్నప్పటికి మరో వైపున కోటాను కోట్ల ప్రజలు ఆర్థికంగా నిరాధారులైనారు. దీని వలన పొదుపుకు, పెట్టుబడి నిర్మాణానికి అవకాశం లేకుండా పోయింది. పెట్టుబడిని కూడ బెట్టకపోతే దేశ ఆర్థికాభివృద్ధిని పెంపొందించటం అసంభవమౌతుంది.

ఆర్థిక వనరుల తరలింపుతో బాటు దేశ నైతిక వనరుల తరలింపును గురించి కూడ నౌరోజి ప్రస్తావించినాడు. భారతీయులకు చెందవలసిన ఉన్నతోద్యోగాలు బ్రిటీషు వారికి దక్కినందువలన ఈ దేశస్థుల ఆత్మ విశ్వాసం, ఆర్థిక శక్తి విపరీతంగా తరిగిపోతున్నాయి. ఆ బ్రిటీషు వారైనా భారతదేశపు పూర్వపు విజేతల వంటి వారు కాదు. వారు భారతదేశాన్ని కేవలం ఒక పరాధీన దేశంగా పరిగణించి దానిని పాలించతగిన వారు తామేనని భావించినారు. అంతేగాని భారతదేశాన్ని వారెన్నడూ తమ స్వదేశంగా పరిగణించలేదు. అందువలన బ్రిటీషు అధికారులు పరిపాలకులుగా, వృత్తి సంబంధమైన నిపుణులుగా పొందిన అనుభవం, వారు నిష్క్రమించిన తరువాత భారతదేశానికి లభించకుండా తరలిపోతున్నది. ఈ అనుభవ చలనం నైతిక వనరుల తరలింపుగా నౌరోజి పేర్కొన్నారు. గతంలో భారతదేశం విదేశీయులకు దాసోహమన్నప్పటికి నైతిక వనరుల తరలింపు లేదు. గతంలో వారు మనల్ని దోచుకొని వెళ్లిపోయేవారు లేదా ఈ దేశంలోనే స్థిరపడేవారు. అందువలన వారి వృత్తిపరమైన, రాజకీయపరమైన అనుభవాలు ఇక్కడే ఉండేవి. కాని బ్రిటీషు వారు అనుసరించిన విధ్వంసక ఆర్థిక, నైతిక వనరుల తరలింపు భారతదేశ జీవ రక్తాన్ని అవిచ్ఛిన్నంగా పీల్చి పిప్పి చేస్తుంది. ఇంగ్లండ్ అనుసరిస్తున్న సామ్రాజ్యవాద దోపిడి విధానం భారతదేశాన్ని నిరంతర, దాదాపు శాశ్వత ఆర్థిక వినాశక ప్రక్రియకు గురి చేసింది. బ్రిటీషు వారి కంటే ముందు దండెత్తిన వారు భారతదేశాన్ని కొల్లగొట్టి, వెనుకకు మరలినారు. కాని బ్రిటీషు పాలనలో

భారతదేశ ఆర్థిక వనరుల తరలింపు ఇంగ్లండ్‌ను నికృష్టమైన విదేశీ దురాక్రమణ దారునిగా చేసి ఇంతకు ముందెన్నడూ లేని దురదృష్టాన్ని భారతదేశానికి కల్గించింది.

ఫలితంగా నౌరోజి భారతీయ వనరులు తరలి వెళ్లటాన్ని నిరసించినాడు. అది న్యాయ సూత్రాలకు, ఆర్థిక సిద్ధాంతాలకు విఘాతం కలిగిస్తుందని విమర్శించినాడు. భారతదేశ అభివృద్ధికి బ్రిటీషు వారి మూలధనాన్ని మనదేశానికి ఆహ్వానించాడు. ప్రజలను కూడ తమ వనరుల అభివృద్ధికి సంసిద్ధులు కావాలని ఉద్బోధించినాడు. బ్రిటన్‌కు ఒక బానిస జాతిగా కాక, మంచి వినియోగదారునిగ భారతదేశం రూపొందే విధంగా సహాయపడాలనే మెకాలే అభిప్రాయంతో దాదాభాయి నౌరోజి ఏకీభవించినాడు. భారతదేశాన్ని బ్రిటన్ ఆర్థికంగా దోపిడీ చేసిన ఫలితంగా రెండు భారతదేశాలు ఏర్పడ్డాయని నౌరోజి వ్యాఖ్యానించినాడు. వీటిలో మొదటిది కొద్ది మంది భాగ్యవంతులు, దోపిడిదారులు నివసించే భారతదేశం. రెండోది దోపిడికి గురైన కోటాను కోట్ల ప్రజల భారతదేశం. ఇటువంటి పరిస్థితులలో భారతదేశాన్ని 'రత్నగర్భ' అని అభివర్ణించటం హాస్యాస్పదం అని ఆయన భావించినాడు. వాస్తవ పరిస్థితి ఏమంటే క్రమేణ దారిద్ర్యంలో కూరుకుపోతున్న భారతీయుల మీద మరింత పౌర, సైనిక ఖర్చులు రుద్దబడినాయి. ఆయన అభిప్రాయంలో రెండు దేశాల మధ్య ఉన్న సంబంధం రెండు దేశాలకు లాభదాయకంగా ఉండే మార్గాలను అవలంబించాలి. 'ధర్మం ఒక జాతిని ఔన్నత్యానికి తీసుకువెళుతుంది. అన్యాయం అత్యంత శక్తి వంతులను కూడ అధోగతికి దిగజారుస్తుంద'ని బ్రిటీషు వారిని హెచ్చరించినాడు.

## 5.3 దాదాభాయి నౌరోజి - రాజకీయ భావనలు:-

దాదాభాయి నౌరోజి రాజకీయ భావాలకు భారత - బ్రిటీషు సంబంధాలు ప్రాతిపదిక. రాజకీయాధికారానికి నైతిక పునాదుల భావనను భారతీయ ఉదారవాదులందరూ ప్రబోధించినారు. న్యాయం, ఉదారత, మానవత్వం మాత్రమే రాజకీయ వ్యవస్థలను సుస్థిరంగా నిలబెట్టగలవు. "ఆయుధాల ద్వారా లేక పాశవిక శారీరక బల ప్రయోగం ద్వారా మీరు ఒక సామ్రాజ్యాన్ని నిర్మించగలరు. కాని శాశ్వతమైన నైతిక శక్తుల ద్వారా మాత్రమే మీరు దానిని పరిష్కరించగలరు. పాశవికమైన బల ప్రయోగం ఎప్పుడో ఒకప్పుడు కూలిపోతుంది. సద్వర్తనమే కలకాలం నిలుస్తుంది" అని బ్రిటీషు వారికి ప్రబోధించినాడు. అధికారానికి బల ప్రయోగమే ప్రాతిపదిక అని సాధారణంగా అనుకుంటూ ఉంటారు. కానీ ఈ భావనలోని అసమగ్రత కొంచెం లోతుకు పోయి చూస్తే కనబడుతుంది. "వారి సైనిక శక్తి బలం నిజమైన భద్రత ప్రజల సంతృప్తి మీదనే పూర్తిగా ఆధారపడి ఉంటుంది" అని నౌరోజి అభిప్రాయపడినాడు. రాజకీయ అధికారానికి మంచి విశ్వాసం, పరస్పర నమ్మిక సరి అయిన ప్రాతిపదికలు కాని, తుపాకులు కాదు.

బ్రిటీషు పాలన వలన భారతదేశానికి కొంత మేలు జరిగిందని నౌరోజి విశ్వసించినాడు. పాశ్చాత్య విద్య, రైల్వేలను ప్రవేశ పెట్టడం వంటి యాంత్రిక సాంకేతిక పరిజ్ఞానం, సుశిక్షితులు అయిన పరిపాలనా సిబ్బంది, చట్టబద్ధపాలన మొదలైన అనేక ప్రగతిశీలక అంశాలు బ్రిటీషు పాలనలో యున్నప్పటికీ, ఆనాటి ప్రభుత్వ వ్యవస్థలో ప్రబలిన దుర్లక్షణాలను ఆయన నిర్మొహమాటంగా విమర్శించినాడు. "ప్రస్తుత ప్రభుత్వ వ్యవస్థ భారతీయులకు వినాశాత్మకంగాను, నిరంకుశంగాను, బ్రిటన్‌కు అనుచితంగాను, ఆత్మహత్యా సదృశ్యంగాను ఉంది. ఆ విధంగా కాక నిజమైన బ్రిటీష్ విధానమే అయితే బ్రిటన్‌కు, భారతదేశానికి రెంటికి ఖచ్చితంగా, విస్తృతంగా లాభదాయకమవుతుంది" అని నౌరోజి అభిప్రాయపడినాడు. నిరంకుశ ప్రభుత్వం ఎక్కువ కాలం కొనసాగటానికి వీలు లేదని ఆయన అన్నాడు. దుష్ట ప్రభుత్వ వ్యవస్థ దివాళా కోరుతనానికి, సర్వనాశనానికి దారి తీస్తుందని ఆయన హెచ్చరించినాడు. ఈ అవాంఛనీయ పరిస్థితిలో మౌలికమైన మార్పు రావలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని ఆయన భావించినాడు.

ఆంగ్ల జాతికి సంకుచిత స్వభావం లేదని నౌరోజి నమ్మినాడు. భారతదేశం భౌతికంగా, నైతికంగా, రాజకీయంగా పురోగమించటానికి బ్రిటీషు పాలన అపారంగా దోహదం చేస్తుందని ఆయన భావించాడు. బ్రిటన్ భారతదేశానికి చేసిన అనేక వాగ్దానాలను అమలుపరచినప్పుడు, రెండు దేశాల మధ్య సంబంధాలు సద్వర్తనం, న్యాయం, స్వేచ్ఛ, ఉదారతల పై నెలకొంటాయి. మత సహనం, స్వేచ్ఛ, ప్రతిభకు ఉద్యోగాలలో అవకాశం, చట్టం ముందు సమానత్వం అనే నాలుగు సూత్రాలను పొందుపరచుకొన్న

1858 ప్రకటనను అమలుజరిపితే ప్రజలకు, ప్రభుత్వానికి కూడ మేలు జరుగుతుందని ఆయన నొక్కి చెప్పినాడు. విక్టోరియా మహారాణి ప్రకటనను భారతీయులకు మాగ్నాకార్టాగా ఆయన అభివర్ణించినాడు. భారతదేశంలో ఆర్థిక, రాజకీయ బాధలను తగ్గించటం బ్రిటీషు ప్రజాస్వామ్య బాధ్యత అని దాదాభాయి నౌరోజి స్పష్టం చేసినాడు. ఇంగ్లండ్ భారతదేశానికి శాంతి భద్రతలను ప్రసాదించిందనే నినాదాన్ని పదే పదే వర్ణించినందువలన ప్రయోజనం ఏమిలేదు. భారతదేశానికి బ్రిటీష్ పాలనను ఉపయోగకరం చేసే ఏకైక శాశ్వత మార్గం భారతదేశానికి స్వపరిపాలనను తమ ఆధిపత్యం క్రింద, మార్గదర్శకత్వం క్రింద అనుమతించటమే. అరిష్టదాయకమైన విదేశీ ప్రాబల్యాన్ని హేతుబద్ధమైన స్థాయికి తగ్గించే వరకు భారతదేశంలో ఆరోగ్యవంతమైన ఆర్థిక వ్యవస్థ అవతరించదని బ్రిటీషు పార్లమెంటులో దాదాభాయి ధైర్యంగా ప్రకటించినాడు. ఉన్నతోద్యోగాల నుండి భారతీయులను దూరంగా ఉంచటం ఆయన తీవ్ర విమర్శకు గురి అయింది.

## 5.4 దాదాభాయి నౌరోజి - సామ్యవాద భావాలు:-

దాదాభాయి నౌరోజి భావనలలో కొంత సామ్యవాదం వైపు మొగ్గు కనబడుతుంది. రాజకీయ ఆర్థిక శక్తిగా అంతర్జాతీయ సామ్యవాదం పెరుగుదలను, అభివృద్ధిని ఆయన గుర్తించగలిగినాడు. తన ఆశయాల సాధనకు హెండ్‌మాన్ (Hyndman) వంటి బ్రిటీషు సామ్యవాదుల సహకారాన్ని నౌరోజి అర్థించినాడు. 1904వ సంవత్సరంలో ఆగష్టు 14 నుండి 20 వరకు ఆమ్‌స్టర్ డామ్ (Amsterdom)లో జరిగిన అంతర్జాతీయ సామ్యవాద కాంగ్రెస్‌కు దాదాభాయి నౌరోజి హాజరైనారు. ఈ సమావేశంలో ఆయన తాను ఎన్నో సంవత్సరాలుగా బ్రిటీషు సామ్రాజ్య వాదం మీద ఆరోపిస్తున్న పారుదల సిద్ధాంతాన్ని (drain theory) పునరుద్ఘాటించినాడు. హోలే బార్న్ (Holborn) టౌనిహాల్‌లో జరిగిన ఒక సమావేశంలో ఆయన సార్వత్రిక వార్ధక్య పింఛన్‌లను కోరుతూ ఒక తీర్మానాన్ని ప్రతిపాదించినాడు. 'కార్మిక హక్కులు' అనే కర పత్రంలో పారిశ్రామిక కమీషనర్ల న్యాయ స్థానాల స్థాపనను అభ్యర్థించినాడు. కార్మిక శక్తిని ఆస్తిగా ఆయన సమర్థించినాడు.

## 5.5 దాదాభాయి నౌరోజి రాజకీయ భావాలలో వచ్చిన మార్పు:-

దాదాభాయి నౌరోజి రాజకీయ జీవిత తొలిదశలో బ్రిటీష్ పాలన పట్ల విశ్వాసాన్ని వ్యక్తం చేసినాడు. బ్రిటీషు వారు భారతదేశంలో తమ విధులను నిజాయితీగా, నీతియుక్తంగా నిర్వహిస్తారని ఆశించాడు. భారతీయుల అభిప్రాయాలను బ్రిటీషు ప్రజలకు, శాసన కర్తలకు తెలియజేసే ఉద్దేశంతో ఎంతో కష్టపడి బ్రిటీషు పార్లమెంటుకు ఎన్నికైనాడు. 1886 కలకత్తా కాంగ్రెస్ అధ్యక్ష పీఠం నుండి బ్రిటీషు వారికి భారతీయుల విధేయతను చాటి చెప్పినాడు. మరల తిరిగి లాహోర్‌లో జరిగిన తొమ్మిదవ జాతీయ కాంగ్రెస్ (1893) అధ్యక్ష స్థానం నుండి ఈ విధేయతను పునరుద్ఘాటించినారు. భారతీయులను బ్రిటన్‌కు విధేయులుగా ఉంటూ స్వదేశం ఎడల భక్తి భావం పెంపొందించుకోవలసిందిగా సలహా యిచ్చినారు. కాని కాలక్రమంలో బ్రిటీష్ వారి విధానాల పట్ల నిస్పృహ చెంది స్వపరిపాలనా హక్కు సాధించనిదే భారతదేశం జాతీయ ఔన్నత్యాన్ని పొందలేదనే వాస్తవాన్ని గుర్తించినాడు.

## 5.6 భారత రాజకీయ తత్త్వ విచారంలో నౌరోజీ స్థానం:-

ఆధునిక భారత రాజకీయ చరిత్రలో దాదాభాయి నౌరోజి ఒక అద్భుతమైన వ్యక్తి. ఆయన గొప్ప రాజకీయ గురువు, నాయకుడు, భారతదేశ ఆర్థిక సమస్యల పట్ల మంచి అవగాహన కల్గిన ఆర్థిక శాస్త్రవేత్త, దేశభక్తుడు, నీతి సంపన్నుడు మరియు సామాజిక తత్త్వవేత్త. ఆర్థిక సిద్ధాంతవేత్తగ రికార్డు, మిల్, కారల్‌మార్క్‌ల స్థాయికిచెందనప్పటికి సమున్నతమైన ఆయన వ్యక్తిత్వం కారణంగా ఆయన ఆర్థిక, రాజకీయ భావాలకు ఎంతో ప్రాచుర్యం లభించింది. ఆయన ప్రవచించిన 'పారుదల సిద్ధాంతం' (drain theory) భారతీయుల ఆలోచనా విధానంలో ప్రకంపనలు సృష్టించింది.

విద్యావ్యాప్తి పట్ల ఆయన ఆలోచనలు ఎంతో సమున్నతమైనవి. విద్యావ్యాప్తిని ఆయన ఒక రాజకీయ సాధనంగా భావించినాడు. విద్య కేవలం వ్యక్తిగత ఉద్దీపనకు మాత్రమే కాక, హక్కుల పట్ల చైతన్యాన్ని కల్గిస్తుందని ఆయన ప్రబోధించినాడు. విద్యావ్యాప్తి

స్వరాజ్య సంపాదనను శీఘ్రతరం చేస్తుందని ఆయన ప్రబోధించినాడు. కాబట్టి ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను, అన్ని రకాలైన ఉచిత ఉన్నత విద్యనూ ఆయన జాతి అభ్యుదయానికి అత్యంత ఆవశ్యకాలుగా పరిగణించినాడు. ఈ విషయంలో ఆయన ముందు చూపు, ఆధునిక మనస్తత్వం మనకు గోచరిస్తాయి.

భారత రాజకీయ తత్త్వ విచారానికి నౌరోజీ రెండు రకాలైన సేవలు చేసినాడు. మొదటిది భారత రాజకీయాలకు ఆర్థికపరమైన వివరణను యివ్వటం, తన రచనల ద్వారా భారతదేశం నుండి ఆర్థిక వనరులు ఇంగ్లండుకు ఏ విధంగా తరలిపోతున్నది సశాస్త్రీయంగా వివరించినాడు. రెండవది 'సహజహక్కుల' భావనను ప్రస్తావించటం. భారతీయులు కూడ బ్రిటీషు పౌరులు గనుక, బ్రిటీషు పౌరులకు సంక్రమించు హక్కులు, సదుపాయాలు భారతీయులకు కూడ సంక్రమించాలని నౌరోజీ వాదించినాడు. ఈ విధంగా దాదాభాయి నౌరోజీ భారత జాతీయవాద రాజకీయాలకు నైతిక ప్రాతిపదికను కల్పించినాడు. ప్రజా జీవితంలోనే గాక, తన వ్యక్తిగత జీవితంలో కూడ ఆయన సమున్నతమైన నైతిక ప్రమాణాలను నెలకొల్పడం ద్వారా భారత రాజకీయ చరిత్రలో చిరస్మరణీయుడైనాడు.

## 5.7 సారాంశం:-

భారత జాతీయోద్యమ నిర్మాతలలో 'భారతదేశ కురువృద్ధుని'గా పేరు గాంచిన దాదాభాయి నౌరోజీ ఒకరు. భారత రాజకీయాలకు ఆర్థికపరమైన వివరణను యివ్వటం ద్వారా ఒక ప్రత్యేకమైన స్థానాన్ని ఆయన సముపార్జించుకున్నారు. ఉపాధ్యాయునిగ, ఆచార్యునిగా, వ్యాపార వేత్తగా, పరిపాలకునిగా, పార్లమెంటు సభ్యునిగా, మూడు పర్యాయాలు భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షునిగా నౌరోజీ జీవితం అకుంఠిత దేశభక్తికి, నిష్కలంక ప్రవర్తనకు, త్యాగనిరతికి, బాధామయ జీవితానికి ప్రతీక. భారత జాతీయ కాంగ్రెస్ వ్యవస్థాపకులలో ఆయన ఒకరు. 1886 కలకత్తా, 1893 లాహోర్, 1906 కలకత్తా కాంగ్రెస్ సమావేశాలకు ఆయన అధ్యక్షత వహించినారు. తన రాజకీయ జీవితం పూర్వార్థంలో బ్రిటీషు పాలన పట్ల విశ్వాసాన్ని, అభిమానాన్ని వ్యక్తం చేసినప్పటికి కాలక్రమంలోబ్రిటీషు వారి విధానాల పట్ల నిస్పృహ చెంది స్వపరిపాలనా హక్కు సాధించనిదే భారతదేశం జాతీయ ఔన్నత్యాన్ని పొందలేదనే వాస్తవాని గుర్తించినాడు.

బ్రిటీషు పాలకుల అసహజ ఆర్థిక విధానాలను నౌరోజీ గర్హించినాడు. బ్రిటీషు వారి దోపిడీ విధాన ఫలితంగా భారతీయుల ఆర్థిక వనరులన్నీ తరలిపోతున్నాయన్నది ఈయన సిద్ధాంత సారాంశం. ఆర్థిక వనరుల తరలింపు ద్వారా దేశంలో పెచ్చు పెరిగిపోతున్న బీదరికం, కరవు కాటకాలు, క్షామాలు, అంటు వ్యాధులకు తాము ఏ విధంగా గురి అవుతున్నది తోటి భారతీయులకు తెలియజెప్పి వారిలో చైతన్యాన్ని కల్గించినాడు. భారతదేశ ఆర్థిక సమస్యలపై ఆయన రచించిన 'Poverty and Un British Rule in India' అనే గ్రంథంలో ఆయన రూపొందించిన 'పారుదల సిద్ధాంతం' (Drain theory) బ్రిటీషు వారు భారతదేశం నుండి ఆర్థిక వనరులను ఏ విధంగా తరలించుకుపోతున్నది, వాటి దుష్పరిణామాలను గణాంక సహితంగా వివరించింది. ఈ సిద్ధాంతం భారతీయుల ఆలోచనా సరళిలో ప్రకంపనలు సృష్టించింది. ఈ విధంగా భారతదేశ ఆర్థిక సమస్యలకు గణాంక పద్ధతులను, శాస్త్రీయ దృక్పథాన్ని అన్వయింపజేయుటంలో నౌరోజీ మార్గదర్శకుడైనాడు. ఆర్థిక వనరుల తరలింపుతోపాటు దేశ నైతిక వనరుల తరలింపు గురించి కూడ నౌరోజీ ప్రస్తావించినాడు. భారతీయులకు చెందవలసిన ఉన్నతోద్యోగాలు బ్రిటీషు వారికి దక్కినందు వలన ఈ దేశస్థుల ఆత్మవిశ్వాసం, ఆర్థిక శక్తి విపరీతంగా తరలిపోతున్నాయన్నది ఈయన భావన. ఫలితంగా నౌరోజీ భారతీయ వనరులు తరలి వెళ్లటాన్ని నిరసించినాడు. అది న్యాయ సూత్రాలకు, ఆర్థిక సిద్ధాంతాలకు విరుద్ధం కలిగిస్తుందని విమర్శించినాడు.

దాదాభాయి నౌరోజీ విద్యావ్యాప్తి ప్రాధాన్యతను కూడ గుర్తించినాడు. విద్యావ్యాప్తి స్వరాజ్య సంపాదనను శీఘ్రతరం చేస్తుందని భావించినాడు. కాబట్టి ఉచిత నిర్బంధ ప్రాథమిక విద్యను, అన్ని రకాలైన ఉచిత విద్యను ఆయన జాతి అభ్యుదయానికి అత్యంత ఆవశ్యకాలుగా పరిగణించినాడు. భారత రాజకీయ తత్త్వ విచారానికి నౌరోజీ రెండు రకాలైన సేవలు చేసినాడు. మొదటిది - భారత రాజకీయాలకు ఆర్థికపరమైన వివరణను యివ్వటం, తన రచనల ద్వారా భారత దేశం నుండి ఆర్థిక వనరులు ఇంగ్లండ్‌కు ఏ విధంగా తరలి పోతున్నది ఆయన సశాస్త్రీయంగా వివరించినాడు. రెండవది - 'సహజహక్కుల' భావనను ప్రస్తావించటం. భారతీయులు

మాడ బ్రిటీషు పౌరులు గనుక, బ్రిటీషు పౌరులకు సంక్రమించు హక్కులు, సదుపాయాలు భారతీయులకు కూడ సంక్రమించాలని నౌరోజి వాదించినాడు. ఈ విధంగా నౌరోజి భారత రాజకీయాలకు నైతిక ప్రాతిపదికను కల్పించటం ద్వారా ఆధునిక భారత రాజకీయ చరిత్రలో చిరస్మరణీయుడైనాడు.

## 5.8 మాదిరి ప్రశ్నలు:-

1. దాదాభాయి నౌరోజి ఆర్థిక తత్వ చింతనను విపులీకరించుము.
2. భారత రాజకీయ తత్వ విచారంలో దాదాభాయి నౌరోజి స్థానాన్ని వివరించుము.

**లఘు వ్యాసరూప ప్రశ్నలు**

1. దాదాభాయి నౌరోజి 'పారుదల సిద్ధాంతాన్ని' (drain theory) సంక్షిప్తంగా వివరించుము.
2. దాదాభాయి నౌరోజి రాజకీయ భావనలను విశదీకరించుము.
3. దాదాభాయి నౌరోజి సామ్యవాద భావాలను గురించి వ్రాయుము.

## 5.9 ఆధార గ్రంథాలు:-


1. V.P. Varma - Modern Indian Political Thought
2. A. Appadorai - Modern Indian Political Tradition : From Naorogi to Nehru
4. ఆచార్య ఎస్.హెచ్. సీతారామ శర్మ - ఆధునిక భారత రాజకీయ, సామాజిక తత్వ విచారం


(Dr. I. Dosagiri Rao)

పాఠం - 6

# గోపాలకృష్ణ గోఖలే

## 6.0 లక్ష్యం:-

భారత స్వాతంత్ర్యోద్యమం తొలి దశలో భారత జాతీయోద్యమానికి పునాదులు వేసి, అత్యంత గౌరవ పాత్రులైన రాజనీతివేత్తలలో ఒకడిగా గుర్తింపు పొందిన వాడు గోపాలకృష్ణ గోఖలే. మితవాద రాజకీయాలకు ప్రతినిధిగా గుర్తింపబడినాడు. ఆయన మితవాద రాజకీయ భావాలకు పునాదులను, ఆయన రాజకీయ తాత్విక భావనలను బ్రిటీషు వారిపట్ల, స్వదేశీ ఉద్యమంపట్ల, రాజ్యాంగబద్ధమైన ఆందోళనపట్ల ఆయన దృక్పధాన్ని తద్వారా భారత రాజనీతి తత్వ విచారంలో ఆయన స్థానాన్ని అంచనా వేయటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక:-


- 6.0 లక్ష్యం
- 6.1 పరిచయం
- 6.2 గోఖలే రాజకీయ తత్వ విచారం
  - 6.2.1 బ్రిటీషు వారిపట్ల గోఖలే దృక్పధం
  - 6.2.2 భారత సేవక సమాజం వ్యవస్థాపకుడుగా గోఖలే
  - 6.2.3 స్వదేశీ ఉద్యమం పట్ల గోఖలే వైఖరి
  - 6.2.4 గోపాలకృష్ణ గోఖలే రాజ్యాంగబద్ధమైన ఆందోళన
- 6.3 గోఖలే - ఆర్థిక భావాలు
- 6.4 భారత రాజనీతి తత్వ విచారంలో గోఖలే స్థానం
- 6.5 సారాంశం
- 6.6 మాదిరి ప్రశ్నలు
- 6.7 ఆధార గ్రంథాలు


## 6.1 పరిచయము:-

ఆధునిక భారతదేశ ప్రథమ రాజనీతిజ్ఞుడుగా పేరుకెక్కిన గోపాలకృష్ణ గోఖలే మే 9, 1866న మహారాష్ట్రలోని కొల్హాపూర్‌లో ఒక పేద చిత్పావనే బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. ఫిబ్రవరి 19, 1915న పూనాలో చనిపోయాడు. పూనాలోని ఫెర్గూసనే కళాశాలలో చరిత్ర, ఆర్థిక శాస్త్రాలలో ఆచార్యునిగా జీవితాన్ని ప్రారంభించినాడు. చాల సంవత్సరాలు ఆయన 'సార్వజనిక సభ' అనే పత్రికకు సంపాదకునిగ పని చేసినాడు. 1904లో బ్రిటీషు ప్రభుత్వం ఆయనకు CIE బిరుదు ప్రదానం చేసింది. అనేకసార్లు ఇంగ్లండ్‌ను సందర్శించినాడు. ఆకర్షణీయమైన వ్యక్తిత్వం కారణంగా బ్రిటీష్ నాయకులపై ఆయన మంచి ప్రభావాన్ని చూపగలిగినాడు. ఆయన దేశభక్తి నిష్కలంకమైనది. ఆయన ఉదాత్త స్వభావం, ప్రగాఢ చిత్తశుద్ధి, మాతృదేశ సేనా నిరతి, చరిత్ర, అర్థశాస్త్రాలలో

ఆయన పాండిత్య ప్రతిభ, దేశ విదేశాలలో ఆయనకు అసంఖ్యాకులైన అభిమానులను సంపాదించి పెట్టింది. 1902లో ఆయన భారత శాసన మండలిలో సభ్యుడై జీవితాంతం కొనసాగినాడు. ఆయన బడ్జెట్ ప్రసంగాలు వాస్తవిక విషయాల అవగాహనకు, మార్గదర్శక సూత్రాలకు పేరు గాంచినాయి. భారత ఆర్థిక వ్యవస్థపట్ల ఆయనకు పరిపూర్ణ అవగాహన ఉంది.

గోపాలకృష్ణ గోఖలే భారత జాతీయోద్యమ తొలి నాయకులైన మహదేవా గోవిందరనడే, ఫిరోజ్ షామెహతాల వల్ల బాగా ప్రభావితుడైనాడు. 1887 - 1901 మధ్య కాలంలో ఆయనరనడే వద్ద అనేక విషయాలు తెలిసికున్నాడు. మెహతాతో ఆయన అనుబంధం చాల సన్నిహితమైనది. ఫిరోజ్‌షా లేకుండా ఒప్పుగా ఉండటం కన్నా, అతనితో కలిసి తప్పుగా ఉండటం నాకిష్టం అని గోఖలే ఒక సందర్భములో పేర్కొనడం జరిగింది. 1897లో భారత ఆర్థిక పరిస్థితిని పరిశీలించటానికి ఏర్పాటైన వేల్బీ కమిషన్ ముందు, 1908లో హబీవేసీ వికేంద్రీకరణ సంఘం ముందు సాక్ష్యం యిచ్చినాడు. 1905లో బెంగాల్ విభజనను అమలు జరుపవద్దని బ్రిటీష్ రాజకీయవేత్తలను ఒప్పించటానికి ఏర్పాటైన ప్రతినిధి వర్గంలో సభ్యుడుగా గోఖలే ఇంగ్లండ్ వెళ్లినాడు. కాని ఆయన ప్రయత్నాలు సఫలం కాలేదు. కాంగ్రెస్ అగ్ర నాయకులలో గోఖలే ఒకరు. 1905లో బెనారస్ కాంగ్రెస్ మహాసభకు ఆయన అధ్యక్షుడు. ఆయన ఉద్దేశంలో 1907లో సూరత్ కాంగ్రెస్‌లో సంభవించిన మితవాదులు - అతివాదుల మధ్య వచ్చిన చీలిక ఒక అశనిపాతం. 1916లో తిరిగి సమైక్య కాంగ్రెస్‌గా ఏర్పాటు కావటాన్ని ఆయన చూడలేకపోయినాడు. ఏమైనప్పటికి తన జీవిత కాలంలో ఆయన మితవాదులకు, అతివాదులకు మధ్య రాజీ జరగాలని ఆశించాడు.

1907లో భారత శాసన మండలిలో గోఖలే తన బడ్జెట్ ప్రసంగంలో ఉచిత ప్రాథమిక విద్యను ప్రవేశ పెట్టవలసిందిగా కోరినాడు. 1911లో నిర్బంధ ప్రాథమిక విద్యను అమలు జరుపవలసిందిగా శాసన మండలిలో ఆయన ప్రవేశ పెట్టిన బిల్లు, బ్రిటీష్ ప్రభుత్వం వ్యతిరేకత కారణంగా వీగిపోయింది. 1912లో భారతదేశంలో ప్రభుత్వోద్యోగాలకు సంబంధించిన వివిధ సమస్యలను పరిశీలించటానికి ఏర్పాటైన ఇల్లింగ్‌టన్ కమిషనులో గోఖలే కూడ సభ్యుడు. ఎంతో చిత్తశుద్ధితో, నిజాయితీతో, శ్రద్ధా సక్తులతో గోఖలే తన పదవీ బాధ్యతలను నిర్వహించినాడు.

గోఖలేను గాంధిజీ తన రాజకీయ గురువుగా భావించినాడు. గాంధీ పట్ల గోఖలేకు ఎనలేని ప్రేమ, గౌరవం. గాంధీజీ ఆహ్వానం పై గోఖలే దక్షిణాఫ్రికాకు వెళ్లి భారతీయుల సమస్యల పరిష్కారానికి ఎంతో కృషి చేసినాడు. 1913 దక్షిణాఫ్రికా సత్యాగ్రహ ఉద్యమానికి సహాయంగా నిధులు వసూలు చేసి పంపించాడు. నిర్విరామంగా ప్రజాహిత కార్యక్రమాల్లో పని చేసి, తన 49వ ఏటనే గోఖలే కన్నుమూసినాడు.

## 6.2 గోఖలే రాజకీయ తత్త్వ విచారం:-

గోఖలే రాజకీయాలలో నైతిక విలువలకు ప్రాధాన్యం యిచ్చినాడు. జాతీయ నాయకునిగ ఆయన లక్ష్యం రాజకీయాల ఆధ్యాత్మికరణ (Spiritualisation of Politics) మంచి లక్ష్యాలను సాధించటానికి చెడు సాధనాలను ఆశ్రయించరాదు. మంచి సాధనాలనే అనుసరించవలె. శత్రువుల పట్ల కూడ నీతి, ధర్మం తప్పకూడదు. మాటలలోను, చేతలలోను అతివాదాన్ని విడనాడవలెను. ఆయన ఆలోచనలలో హింసకు, బల ప్రయోగానికి, రక్తపాతం వంటి సాధనాల ద్వారా లక్ష్యాలను సాధించటానికి ఎక్కడా తావు లేదు. అందువలననే ఆయన సహేతుకము, చట్టబద్ధము అయిన మార్గాల ద్వారానే బ్రిటీషు వారిని ఒప్పించి, క్రమంగా రాజకీయ ప్రగతిని సాధించాలని భావించినాడు. ఆ విధంగా తన రాజకీయ వ్యూహంలో గోఖలే మితవాదిగా గణతికెక్కినాడు. రాజ్యాంగబద్ధమైన ఆందోళనలోవిశ్వాసాన్ని కనబరచినాడు. బాయ్‌కాట్ వంటి తీవ్రవాద పద్ధతులను ఆయన నిరసించినాడు. ఎడ్మండ్ బర్క్‌వల్ అప్రమత్తత, క్రమ పరిణామం, హేతుబద్ధమైన అభివృద్ధి పట్ల నమ్మకాన్ని కనబరచినాడు.

గోకలే దృష్టిలో రాజకీయ నాయకత్వం ప్రజా సేవకు ఒక సాధనం. ఈ భావనతోనే గోఖలే ప్రమాదకరమైన రాజకీయ పంథాను నిండు మనసుతో అనుసరించినాడు. శ్రద్ధాసక్తులతో దానిని తన వృత్తిగా స్వీకరించినాడు. నిర్మాణాత్మక రాజనీతి వేత్తగా ఉండటానికి అవసరమైన అర్హతలన్నీ ఆయనలో కన్పించినాయి. ఆయన తన వ్యక్తిగత జీవితంలో చూపించిన స్వార్థ త్యాగం

జాతీయ వాదమంటే ఉన్నత లక్ష్యాలకు పాటుపడే నిస్వార్థ చింతన అని నిరూపించింది. రనడేవలెనే గోఖలే దృష్టిలో మానవ విమోచన ప్రధాన కర్తవ్యం. ఇది మానవుల నైతిక, మేధా సంబంధ, శారీరక శక్తుల అభివృద్ధి ద్వారానే సాధ్యమౌతుంది. ఇటువంటి మహత్తర ఆశయం నెరవేరాలంటే తమను తాము ప్రజా సేవకులుగా పరిగణించుకొనే వారు తమ శక్తి సామర్థ్యాలను జాతి సేవకు అంకితం చేయవలసి ఉంటుంది. ప్రజాసేవ, రాజకీయ కార్యకలాపాలు రెండూ ఒకే సమయంలో కలిసి సాగిపోవలె. బాధ పడకుండా, పరస్పరం సహకరించు కోకుండా, నిరాడంబర జీవితం గడపకుండా జాతీయ వాదం అభివృద్ధికి ఏ వ్యక్తీ దోహదం చేయలేడు.

**6.2.1 బ్రిటీష్ వారిపట్ల గోఖలే దృక్పథం:-** ఫిరోజ్ షాదుహతా, దాదాభాయి నౌరోజీల వలే గోఖలేకు బ్రిటీష్ ఉదారవాదం పట్ల అపార విశ్వాసం ఉంది. ఆంగ్లేయుల అంతరాత్మలో ఆయనకు నమ్మకం ఉంది. భారతదేశానికి న్యాయం చేయగల నూతన ఆంగ్ల రాజనీతిజ్ఞత అవతరిస్తుందని ఆయన ఆశించినాడు. విద్యావంతులయిన భారతీయుల ఆలోచనలకు, అభిప్రాయాలకు ఆంగ్ల పాలకులు విలువయిస్తారని గోఖలే విశ్వసించినాడు. మోతిలాల్ నెహ్రూ దృష్టిలో గోకలే స్వపరిపాలనా ప్రవక్త. ఉద్యోగి స్వామ్యం కేవలం సామర్థ్యంతోనే సంతృప్తిపడక, అత్యున్నత పాశ్చాత్య ప్రమాణాల ప్రకారం భారతీయులు తమను తాము పరిపాలించుకొనే స్థాయికి వచ్చే విధంగా భారతదేశాన్ని పరిపాలించవలె. బ్రిటీష్ పాలనలో నానాటికి పెరుగుతున్న నిరాధార మానవ జీవితాల పట్ల ఆయన తన తీవ్ర సంతాపాన్ని తెలియజేసినాడు. భారత పరిపాలన విదేశీ ఆధిపత్యం క్రింద యున్న కారణంగా విపరీతమైన వ్యయం జరుగుతూ ఉందని ఆయన విమర్శించాడు. భారతదేశం, ఇంగ్లండ్‌ల మధ్య సామరస్య పూర్వకమైన సహకారం ఉండాలని గోఖలే భావించినాడు.

ఈ అభిప్రాయాలను ప్రాతిపదికగా చేసికొని, గోఖలే భారతదేశాన్ని నైతికంగాను, భౌతికంగాను అభివృద్ధి చేయటానికి వీలుగా ఒక సమగ్ర ప్రణాళికను రూపొందించాలని కోరినాడు. భారత దేశం ప్రపంచ రాజ్యాలలో ఒక గౌరవనీయమైన స్థానాన్ని పొందాలని, ఇంగ్లండ్ యొక్క ప్రాభవం భారతదేశానికి ఆ స్థానాన్ని లభింప చేయుటంలో సహాయపడగలదని ఆయన అభిప్రాయపడినాడు. భారతీయులను బాధ్యతాయుతమైన పదవుల నుండి మినహాయించినచో వారి వ్యక్తిత్వం వికసించక వారు నైతికంగా దిగజారిపోయారు. కాబట్టి ప్రభుత్వంలో భారతీయులకు ఎక్కువ ప్రాతినిధ్యం ఉండాలని ఆయన వాదించినాడు. అధికారం ఉద్యోగి స్వామ్యంలో కేంద్రీకృతమై ఉండటాన్ని ఆయన విమర్శించినాడు. ఆ తరువాత కాలంలో దాదాభాయి నౌరోజి వంటి వారు బ్రిటిషు వారి విధానాలపట్ల నిస్పృహ చెంది నమ్మకాన్ని కోల్పోయినప్పటికి, గోఖలే బ్రిటీష్ రాజనీతిజ్ఞుల పట్ల తనకున్న సదభిప్రాయాన్ని, నమ్మకాన్ని ఆ తరువాతి కాలంలో కూడ కొనసాగించినాడు. అందువలననే 1909 భారత కౌన్సిళ్ల చట్టాన్ని మనస్ఫూర్తిగా సమర్థించినాడు.

సమకాలీన సమస్యల మీద గోఖలే దృక్పథం రెండు విషయాల మీద ఆధారపడింది. (1) భారతదేశంలో బ్రిటీష్ సామ్రాజ్యం దైవ సంకల్పమనెరనడి సిద్ధాంతాన్ని ఆయన విశ్వసించినాడు. బ్రిటీషుపాలన భారతదేశానికి ఎంతో ప్రయోజనకారి అని ఆయన భావించినాడు. (2) కష్టపడి పని చేయటం ద్వారా, త్యాగనిరతి ద్వారా జాతీయ వాదానికి బలమైన పునాదులను ఏర్పాటు చేయవచ్చునని ఆయన అభిప్రాయపడినాడు. జాతీయ సమైక్యతా భావాన్ని సాధించాలంటే ముందుగా ప్రజలలో సామాజిక చైతన్యాన్ని, నైతికాభివృద్ధిని సాధించాలి. అపుడే పవిత్రమైన జాతీయ స్ఫూర్తిని ప్రజలలో రేకెత్తించటానికి అవకాశం ఉంటుంది.

**6.2.2 భారత సేవక సమాజం వ్యవస్థాపకుడుగా గోఖలే:-** నైతిక ప్రాతిపదిక మీద జాతీయ సమైక్యతను సాధించటానికి వీలుగా, మాతృదేశానికి నిస్వార్థ సేవ చేయు ప్రజాసేవకులను తయారు చేయాలని గోఖలే సంకల్పించినాడు. ఆ ఉద్దేశంతోనే గోఖలే జూన్ 12, 1905న 'భారత సేవక సమాజం' (Servants of India Sociery) అనే సంస్థను ఏర్పాటు చేసినాడు. భారత సేవక సమాజం దేశం కోసం తమ జీవితాలను అంకితం చేయటానికి సిద్ధపడిన వ్యక్తులను మత ధోరణిలో సుశిక్షితులను చేస్తుంది. సకల రాజ్యాంగబద్ధమైన మార్గాల ద్వారా భారత ప్రజల జాతీయ ప్రయోజనాలను పెంపొందించటానికి కృషి చేస్తుంది. ఈ

సమాజం సభ్యులు బ్రిటీషు సామ్రాజ్యంతో భారతదేశం యొక్క సంబంధం దైవ సంకల్పమని భావిస్తారు. వీరి లక్ష్యం బ్రిటీష్ వలస స్థాయిలోనే భారత దేశానికి స్వపరిపాలనను సముపార్జించటం.

ఈ సమాజ సభ్యులు ముఖ్యంగా ఈ క్రింది విషయాల పై తమ దృష్టిని కేంద్రీకరిస్తారు.

(1) తాము ఆదర్శంగా ఉండటం ద్వారా ప్రజలలో ప్రగాఢమైన మాతృదేశ భక్తిని ప్రభోదించటం

(2) రాజకీయ విద్య ద్వారా దేశంలో ప్రజా జీవితాన్ని బలపరచటం

(3) వివిధ వర్గాల ప్రజల మధ్య స్నేహసుహృద్భావ సహకారాలను పెంపొందించటం

(4) విద్యా వ్యాప్తికి, అందులోను స్త్రీ విద్యా వ్యాప్తికి నిర్వహించబడే ఉద్యమాలకు సహకారాన్ని అందించటం

(5) పీడిత వర్గాలనుద్ధరించటం

ఈ సంస్థ కరువు, కాటకాలు సంభవించినపుడు ప్రజా సేవ చేయుటయే గాక, ప్రజలలో జాతీయ భావాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందించటంలోను, నిష్కలంక దేశ భక్తులను తయారు చేయుటలోను ప్రముఖ పాత్ర వహించింది. ఈ సంస్థ సభ్యులు ఇంగ్లండ్‌కు వెళ్లి అచ్చట భారతీయుల సమస్యలను వివరించటం ద్వారా పాశ్చాత్యుల సానుభూతిని పొందటానికి కృషి చేసినారు.

**6.2.3 స్వదేశీ ఉద్యమం పట్ల గోఖలే వైఖరి:-** గోఖలే స్వదేశీ ఉద్యమాన్ని బలపరచినాడు. భారత దేశం పై ప్రగాఢమైన, పరిపూర్ణమైన ప్రేమకు ప్రత్యక్ష ప్రతిబింబమే స్వదేశీ వాదమని ఆయన భావన. అయితే గోఖలే స్వదేశీ వాదాన్ని బలపరచినా అతివాద వైఖరిని సూచించే 'బహిష్కరణ' (Boycott) సాధనాన్ని ఆయన ఆమోదించలేదు. ఆయన ఉద్దేశంలో స్వదేశీ ఉద్యమం దేశభక్తి పూరితము మరియు ఆర్థికపరమైన ఉద్యమము. ప్రజలలో దేశభక్తిని ప్రభోదించటం ద్వారా స్వదేశీ ఉద్యమం ప్రజలను దేశం కోసం త్యాగం చేయటానికి సిద్ధులను చేస్తుంది. ఆర్థకంగా ప్రజల అవసరాను తీర్చటానికి, అభివృద్ధి చెందటానికి దోహదం చేస్తుంది. ఆ విధంగా స్వదేశీ ఉద్యమంపట్ల గోఖలే ఒక సమగ్రమైన అవగాహనను వ్యక్తపరచినాడు.

బెనారస్ కాంగ్రెస్ సమావేశానికి (1905) అధ్యక్షుడిగా, భారతీయుల ఆకాంక్షలను ప్రతిబింబిస్తూ గోఖలే బ్రిటీషు ప్రభుత్వానికి తొమ్మిది అంశాలను సూచించినాడు. అవి:

(1) ఎన్నికైన సభ్యుల సంఖ్య నిష్పత్తిని మొత్తం సంఖ్యలో సగం వరకు ఉండే విధంగా విధాన మండలులను రూపొందించటం.

(2) భారత మండలి (India Council)లో కనీసం ముగ్గురు భారతీయులను నియమించటం.

(3) దేశంలోని జిల్లాలన్నింటిలో సలహా మండలులను సృష్టించటం, జిల్లా మేజిస్ట్రేటులు ఈ మండలాలను తప్పని సరిగా పరిపాలనకు సంబంధించిన ముఖ్య విషయాలలో సంప్రదించటం.

(4) న్యాయవాద వృత్తిలో ఉన్నవారి నుంచి ఇండియన్ సివిల్ సర్వీసుకు చెందిన న్యాయ శాఖను భర్తీ చేయటం.

(5) న్యాయ. కార్య నిర్వాహక శాఖల పరిపాలనను వేరు చేయటం.

(6) సైనిక ఖర్చును తగ్గించటం.

(7) ప్రాథమిక విద్యను వ్యాప్తి చేయటం.

(8) పారిశ్రామిక, సాంకేతిక విద్యను విస్తరింప చేయటం.

(9) గ్రామీణ ఋణ భారాన్ని తగ్గించటం.

ఈ నవ సూత్ర పథకాన్ని భారత మితవాదుల రాజకీయ తత్త్వ విచారంగా పరిగణించవచ్చు.

దేశంలో నెలకొన్న అసంతృప్తి, మితవాదులు, అతివాదులుగా కాంగ్రెసు చీలి పోవటం పట్ల గోఖలే కలత చెందినాడు. ఈ రకమైన ఉద్రిక్త వాతావరణం కారణంగా 1906లోకేంద్ర శాసన మండలిలో భారత ప్రజల నైతిక, భౌతిక పురోభివృద్ధి! ఈ క్రింది సప్త సూత్ర పథకాన్ని కూడ గోఖలే ప్రతిపాదించినాడు. అవి -

(1) భూమి పన్నును తగ్గించటం

(2) వ్యవసాయదారులకు ఋణ విముక్తి

(3) వ్యవసాయ బ్యాంకులను ఏర్పాటు చేయటం

(4) నీటి పారుదల, శాస్త్రీయ పద్ధతుల మీద వ్యవసాయం

(5) దేశంలో వ్యవసాయక, సాంకేతిక విద్యను ప్రోత్సహించటం

(6) ఉచిత ప్రాథమిక విద్యను దేశమంతటా విస్తరించటం

(7) పారిశుధ్యాన్ని అభివృద్ధి పరచటం

గోపాలకృష్ణ గోఖలే పరిపాలనా వికేంద్రీకరణ ఆవశ్యకతను గుర్తించాడు. వికేంద్రీకరణ ద్వారానే ప్రజల రాజకీయ హక్కులు పరిరక్షింపబడతాయని ఆయన భావించినాడు. ఉద్యోగి బృందం చర్యల పై వివిధ స్థాయిలలో నియంత్రణలు నెలకొల్పాలని కోరినాడు. ఆయన అభిప్రాయంలో రాష్ట్ర స్థాయిలో రాష్ట్రమండలాలను విస్తృతపరచి, రాష్ట్ర బడ్జెట్‌ను చర్చించే అవకాశం కల్పిస్తే రాష్ట్రస్థాయిలో వికేంద్రీకరణ సాధ్యపడుతుంది. అదే విధంగా జిల్లా స్థాయిలో జిల్లా పాలనా వ్యవహారాలకు సంబంధించి కలెక్టరుకు అవసరమైన సలహా సంప్రదింపులను అందివ్వటానికి జిల్లా సలహా మండలులను నెలకొల్పవలెను. హాబీ హౌస్ పరిపాలనా వికేంద్రీకరణ సంఘం ముందు తానిచ్చిన సాక్ష్యంలో కూడ గోఖలే ఈ క్రింది వాటి ఆవశ్యకతను గుర్తించినాడు.

(1) అట్టడుగు స్థాయిలో గ్రామ పంచాయితీలు

(2) మాధ్యమిక స్థాయిలో జిల్లా మండళ్లు

(3) పై స్థాయిలో సంస్కరించబడిన శాసన మండళ్లు

ఆంగ్ల వ్యాప్తి ద్వారా భారతదేశంలో చోటు చేసికున్న వివిధ సమస్యలను గోఖలే గుర్తించినాడు. స్వేచ్ఛ యొక్క ప్రాధాన్యతను, స్వేచ్ఛాయుత సంస్థల విలువను గురించి ఆంగ్ల విద్య ప్రబోధించింది. ఇటువంటి క్రొత్త పరిస్థితులలో ప్రభుత్వం యొక్క సమర్థతను అంచనా వేయటానికి గోఖలే నాలుగు సూత్రాలను సూచించినాడు. అవి -

(1) సామాన్య ప్రజల నైతిక, భౌతిక అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలు, నైతిక భౌతిక అభివృద్ధి అంటే విద్య కోసం, వ్యవసాయం కోసం, పారిశుద్ధ్యం వంటి అంశాలకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న చర్యలు.

(2) స్థానిక స్వపరిపాలనా సంస్థల పాలనలో ప్రజలకిచ్చిన భాగస్వామ్యం

(3) విధానాలను రూపొందించే శాసన మండళ్ళలో ప్రజల అభిప్రాయాలకు యిచ్చే విలువ

(4) ప్రభుత్వోద్యోగాలలోనికిభారతీయులు ఎంత వరకు ప్రవేశించారనే అంశం.

ఈ అంశాలు ఆధారంగా ప్రభుత్వం యొక్క సమర్థతనం అంచనా వేయవచ్చని గోఖలే భావన.

తన జీవితం చివరికాలంలో గోఖలే ఫిరోజ్ షామెహతా, ఆగాఖాన్ (Agakuan)లను సంప్రదించి భారతదేశం రాజ్యాంగబద్ధమైన ప్రగతిని సాధించటానికి ఒక పథకాన్ని రూపొందించినాడు. ఈ పథకం ద్వారా కొన్ని సంవత్సరాల తరువాత భారతదేశంలో ఏదో ఒక విధమైన సమాఖ్య వ్యవస్థ అవతరించాలని ఆయన ఆకాంక్షించినాడు. ఆనాటి పరిస్థితులను (1914 - 15 సం॥ల నాటి పరిస్థితి) దృష్టిలో పెట్టుకొని ఆయన గవర్నర్ జనరల్ జోక్యం కలిగించుకునే అధికారాన్ని

అంగీకరించినాడు. ముస్లింలకు, తదితర అల్ప సంఖ్యాక వర్గాల వారికి ప్రత్యేకమైన, ప్రత్యక్ష ప్రాతినిధ్యం ఆవశ్యకతను గోఖలే గుర్తించినాడు.

**6.2.4 గోపాలకృష్ణ గోఖలే - రాజ్యాంగబద్ధమైన ఆందోళన:-** గోఖలే తన ఆశయాల సాధనకు రాజ్యాంగబద్ధమైన ఆందోళన (constitutional Agitation)ను ఆశ్రయించినాడు. ఆయన లక్ష్యం బ్రిటీష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా యుంటూనే దేశానికి స్వయం పరిపాలనా ప్రతిపత్తిని (automonous status) సాధించటం. దీనిని సాధించటానికి రాజ్యాంగ సమ్మతమైన సాధనాలను మాత్రమే చేపట్టవలెను. పరిపాలనా విధానాలను క్రమక్రమంగా సంస్కరిస్తూ, జాతీయ సమైక్యాన్ని పెంపొందిస్తూ, దేశంలో వైజ్ఞానిక, నైతిక, ఆర్థిక, పారిశ్రామిక సంపదలను వృద్ధి చేసికుంటూ, రాజ్యాంగ సమ్మతమైన పద్ధతుల ద్వారా దేశానికి స్వయం పరిపాలనా ప్రతిపత్తిని సాధించవలెను. బ్రిటన్ - భారతదేశాల మధ్య చారిత్రకంగా ఏర్పడిన అనుబంధం దైవ సంకల్పమని, అది అవిచ్ఛిన్నంగా కొనసాగితే కాని భారతదేశం పురోగమించజాలదని ఆయన నమ్మిక. బ్రిటీష్ పరిపాలన మూలంగా భారతదేశానికి అనేక లాభాలు కలిగాయని, కొన్ని నష్టాలు సంభవించినా వాటిని తొలగించటం సాధ్యమని ఆయన భావించినాడు. భారతీయుల ఇబ్బందులను, కష్టాలను అధికారుల దృష్టికి. బ్రిటీషు ప్రజల దృష్టికి తీసికొనిరావటం ద్వారా వాటిని తొలగించుకొనవచ్చునని ఆయన అభిప్రాయపడినాడు. అందువలననే మిగిలిన మితవాదుల పంథాలోనే ఆయన ప్రార్థనలు, విన్నపాలు, పిటీషన్లు లాంటి చట్ట సమ్మతమైన పద్ధతులను, విధానాలను సమర్థించినాడు. స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం, రాజ్యాంగ ప్రభుత్వం వంటి ఉదార భావాలనందించిన బ్రిటీష్ జాతి ఇండియాకు కూడ న్యాయం చేస్తుందని ఆయన ఆశించినాడు.

గోపాలకృష్ణ గోఖలే మితవాదులకు నిజమైన ప్రతినిధి. దేశ శ్రేయస్సును మనస్సులో ఉంచుకొని, ఆయన ప్రభుత్వం చేసే తప్పులను విమర్శిస్తూనే సాధ్యమైనంత వరకు ప్రభుత్వాన్ని బలపరుస్తూ ఉండేవాడు. ఆయనకు బ్రిటీష్ వారి న్యాయ దృష్టి పట్ల, ధర్మనిరతి పట్ల అపారమైన విశ్వాసం యుండేది. భారతదేశంలోని పరిపాలనా యంత్రాగాన్ని నడిపేది ఉన్నత ఉద్యోగి వర్గం అనీ, వారి పైన యాజమాన్యం వహించిన బ్రిటీష్ ప్రజలకు తమ సమస్యలు విన్నవించుకుంటే తమకు న్యాయం జరుగగలదని ఆయన విశ్వసించినాడు. బ్రిటీషు ప్రజలు ప్రజాస్వామిక విధానానికి అలవాటు పడినవారు. ప్రజల అభిప్రాయానుసారం పరిపాలనను సాగించటం ఈ విధానం యొక్క ప్రధాన లక్షణం. ప్రజాభిప్రాయాన్ని మన్నించే వారు భారతదేశ ప్రజల అభిప్రాయం ఏదో తెలిసికున్న తరువాత దానిని మన్నించలేక పోవటమనేది యుండదు. అట్లా మన్నించక పోవటం బ్రిటీష్ ప్రజల సాంప్రదాయానికి విరుద్ధం. అందువలన వారు భారతీయుల అభిప్రాయాలను మన్నించి, వారు కోరిన సంస్కరణలను తప్పకుండా ప్రవేశ పెట్టగలరని గోఖలే ఆశించినాడు. ఈలాంటి ఫలితం వెంటనే లభించకపోయినా కాలక్రమేణా తప్పకుండా లభిస్తుంది. కావలసింది తమ వాదం సహేతుకమేనని ఋజువు చేయటమే. ఈ కారణంగానే గోఖలే వంటి మితవాదులు తమ ఆందోళన భారతదేశంలో ఫలప్రదం కానపుడు బ్రిటీష్ ప్రజలకు వినతి పత్రాలను సమర్పించటం ద్వారా వారి విశ్వాసాన్ని కూడగట్టుకొని, న్యాయం పొందవచ్చునని భావించినారు. ఆ విధంగా మితవాదులకు బ్రిటిష్ వారి న్యాయదృష్టి పట్ల, ధర్మనిరతి పట్ల అపారమైన నమ్మకం యుండేది. ఈ నమ్మకం కారణంగానే ఇంగ్లీషు వారి వద్ద నుండి అధికారాన్ని హస్తగతం చేసుకోవటానికి విప్లవ విధానాలు, బహిష్కరణ వంటి అతివాద సాధనాలను అవలంబించటానికి గోఖలే సమ్మతించలేదు.

గోఖలే రాజ్యాంగబద్ధమైన ఆందోళనను సమర్థించినప్పటికి సాత్విక నిరోధాన్ని (Passive Resistance) అనుసరించటానికి నిరాకరించినాడు. అప్పటి రాజకీయ, సామాజిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని ప్రార్థనలు, విన్నపాలు, పిటీషన్లు వంటి మార్గాల ద్వారా మాత్రమే తాను ఆశించిన లక్ష్యాలను సాధించటానికి ప్రాధాన్యం యిచ్చినాడు. సాత్విక నిరోధాన్ని కూడా రాజ్యాంగబద్ధమైన ఆందోళనా మార్గంగా అంగీకరించినప్పటికి, ఏ మార్గం అందుబాటులో లేనపుడు మాత్రమే చివరి సాధనంగా దానిని అనుసరించాలని ఆయన అభిప్రాయపడినాడు. అది రక్షణాత్మకము (defensive), నైతికము,

ఆధ్యాత్మికము అయిన విలువలతో కూడి ఉంటుంది. అంతేకాని ఎదుటి వారికి హాని కలిగించే ఉద్దేశంతో కాని, ప్రతీకారేచ్ఛతో కాని యుండరాదు. మిగిలిన సాధనాలన్నీ విఫలమైన తరువాతనే సాత్విక [illegible] సాధనాన్ని అనుసరించే విషయం గురించి ఆలోచించలేదు. కాని అప్పటి భారతదేశ పరిస్థితులు సాత్విక నిరోధాన్ని [illegible] అనువైనవి కావని గోఖలే భావించినాడు.

## 6.3 గోఖలే ఆర్థిక భావాలు:-

గోఖలే భారతదేశ పారిశ్రామిక, వ్యవసాయిక [illegible] విద్యా [illegible] పాశ్చాత్య దేశాలకు చెందిన పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు, అభివృద్ధి చెందని దేశాల అవసరాలు, సామాజిక [illegible] మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గురించి ఆయన క్షుణ్ణంగా అధ్యయనం చేసినాడు. ప్రభుత్వ ఆదాయ, వ్యయాలలో [illegible] కూడుకున్న సర్దుబాటు అవసరమని ఆయన వాదించినాడు. ఆదాయ పంపిణీ [illegible] ఆయన కోరినాడు. [illegible] పరిస్థితులను మెరుగుపరిచే విషయంలో ఆయన [illegible] [illegible] ఆయన ఆవేదన చెందినాడు. [illegible] భారతదేశంలోని పరిశ్రమలు తమ వనరులను తమ సామర్థ్యానికి [illegible] ఆయన కోరినాడు. ప్రభుత్వ ఆర్థిక విధానం విద్యావంతులైన మధ్య తరగతి ప్రజలకు ఉపాధి కల్పించు, [illegible] ఉప్పు పై పన్నును తగ్గించాలని ఆయన గట్టిగా వాదించినాడు. 1907 నాటి [illegible] ఉప్పు పై సుంకాన్ని పూర్తిగా రద్దు చేయాలని ఆయన ప్రతిపాదించినాడు. అంతకు పూర్వం 1903, 1904 నాటి [illegible] ప్రసంగాలలో నూలు వస్త్రాల పై ఎక్సైజ్ సుంకాన్ని రద్దు చేయాలని ఆయన కోరినాడు. భారతీయ సైన్యం పై [illegible] ఆయన వ్యతిరేకించినాడు. ఆదాయపు పన్నుకు సంబంధించినంత వరకు పన్ను [illegible] ఆయన వాదించినాడు. [illegible] పరిశ్రమలను పరిరక్షించటానికి అవసరమైన రక్షణాత్మక [illegible] ఆయన [illegible]

## 6.4 భారత రాజనీతి తత్త్వ విచారంలో గోఖలే స్థానం:-

గోఖలే గొప్ప దేశభక్తుడు. జాతీయతా వాది. మితవాద రాజకీయ నాయకులలో అగ్రగణ్యుడు. ఆయన [illegible] రాజకీయ నైతిక జీవనం మహాత్మాగాంధీకి మార్గదర్శకమైనది. [illegible] గోఖలేను తన రాజకీయ గురువుగా పేర్కొన్నాడు. ఆయన నిష్కలంక దేశభక్తి [illegible] తిలక్ [illegible] తిలక్ ఆయనను 'భారతదేశ వజ్రమని, మహారాష్ట్ర [illegible] [illegible] "బ్రిటిష్ పార్లమెంటుతో సహా ప్రపంచంలోని ఏ పార్లమెంటుకైనా [illegible]" అని [illegible] ఆ విధంగా ఆయన బ్రిటిష్ రాజకీయ నేతల, భారత ప్రజా నాయకుల [illegible] [illegible] ఆయనలోని అసాధారణ ప్రతిభావంతమైన నాయకత్వ లక్షణాలను గుర్తించినారు.

గోపాలకృష్ణ గోఖలే చరిత్రకారుడు, ఆర్థిక శాస్త్ర ఆచార్యుడు. [illegible] రాజకీయాలకు గల ఆర్థిక ప్రాతిపదికలను అధ్యయనం చేయటంలో [illegible] ఆర్థిక శాస్త్రవేత్త అయినప్పటికి, రాజకీయాలలో నైతిక విలువలకు [illegible] ఆదర్శవాది, అత్యున్నతమైన నైతిక స్థాయిలో జీవించినాడు. రాజకీయాలను [illegible] ఆయన ధ్యేయం. ఆయన మాటలలోను, చేతలలోను మితవాద రాజకీయ విధానాలను [illegible] ఇంగ్లాండ్ [illegible] మధ్య అనుబంధం దైవ సంకల్పమని, అది అవిచ్ఛిన్నంగా కొనసాగితే కాని భారతదేశం [illegible] ఆయన భావించినాడు. బ్రిటిష్ పరిపాలన మూలంగా భారతదేశానికి అనేక లాభాలు కలిగాయని, కొన్ని నష్టాలు [illegible] ఆయన అభిప్రాయపడినాడు. భారతీయుల ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి [illegible]

బహిష్కరించటమనేది అవివేకమని ఆయన విశ్వసించినాడు. అందువలననే ఆయన రాజ్యాంగబద్ధమైన ఆందోళనను, చట్టసమ్మతమైన పద్ధతులను సమర్థించినాడు.

ఈ విధంగా భారత రాజనీతి తత్వ చింతనకు గోఖలే కృషిని రెండు అంశాల ద్వారా వివరించవచ్చు.

(1) రాజకీయాలలో నైతిక విలువలను ప్రవేశ పెట్టటానికి ఆయన ప్రాధాన్యం యిచ్చినాడు.

(2) లక్ష్య సాధనకు రాజ్యాంగ సాధనాలుగా మితవాదాన్ని, హేతువాదాన్ని, సర్దుబాటు తత్వాన్ని ప్రతిపాదించినాడు. ఆ తరువాత మితవాద రాజకీయాలకు ప్రతినిధిగా చరిత్ర ప్రసిద్ధుడైనాడు.

## 6.5 సారాంశం:-

భారత స్వాతంత్ర్యోద్యమ తొలి దశలో భారత జాతీయోద్యమానికి పునాదులు వేసి, అత్యంత గౌరవ పాత్రులైన రాజనీతి వేత్తలలో ఒకడిగా గుర్తింపు పొందినవాడు గోపాలకృష్ణ గోఖలే. మితవాద రాజకీయాలకు ప్రతినిధిగా ఆయన పరిగణింపబడినాడు. ఆయన సౌమ్య స్వభావం, ప్రశాంత చిత్తవృత్తి, మానవసేవా తత్పరత, చరిత్ర - అర్థ శాస్త్రాలలో ఆయన పాండిత్య ప్రతిభ, దేశ విదేశాలలో ఆయనకు అసంఖ్యాకమైన అభిమానులను సంపాదించి పెట్టింది. భారత ఆర్థిక వ్యవస్థపట్ల ఆయనకు పరిపూర్ణ అవగాహన ఉంది.

గోఖలే రాజకీయాలలో నైతిక విలువలకు ఎక్కువ ప్రాధాన్యం యిచ్చినాడు. జాతీయ నాయకునిగా ఆయన లక్ష్యం రాజకీయాల ఆధ్యాత్మీకరణ. మంచి లక్ష్యాలను సాధించటానికి మంచి సాధనాలనే ఆశ్రయించవలె. అందువలననే ఆయన హేతువాదం, సర్దుబాటు అనే సూత్రాల ద్వారానే బ్రిటీషు వారిని ఒప్పించి క్రమంగా రాజకీయ ప్రగతిని సాధించాలని భావించినాడు. ఆ విధంగా ఆయన రాజకీయ రంగంలో మితవాదిగా ప్రసిద్ధికెక్కినాడు. రాజ్యాంగబద్ధమైన ఆందోళనలో విశ్వాసాన్ని కనబరచినాడు.

గోఖలేకు బ్రిటీషు ఉదార వాదం పట్ల అపార విశ్వాసం ఉంది. ఆంగ్లేయుల అంతరాత్మలో ఆయనకు నమ్మకం ఉంది. బ్రిటీషు ప్రజలు ప్రజాస్వామిక విధానానికి అలవాటుపడినవారు కాబట్టి ప్రజాభిప్రాయాన్ని మన్నించి, భారతీయులు కోరిన సంస్కరణలను తప్పకుండా ప్రవేశ పెట్టగలరని గోఖలే ఆశించినాడు. భారతదేశం, ఇంగ్లండుల మధ్య సామరస్య పూర్వకమైన సహకారం ఉండాలని గోఖలే భావించినాడు. భారతదేశంలో బ్రిటీషు పాలన భారతదేశానికి ఎంతో ప్రయోజనకారి అని ఆయన అభిప్రాయపడినాడు.

మాతృదేశానికి నిస్వార్థ సేవ చేయు ప్రజాసేవకులను తయారు చేయాలనే సంకల్పంతో గోఖలే జూన్ 12, 1905న 'భారత సేవక సమాజం' అనే సంస్థను స్థాపించినాడు. ఈ సంస్థ రాజ్యాంగబద్ధమైన మార్గాల ద్వారా భారత ప్రజల జాతీయ ప్రయోజనాలను పెంపొందించటానికి కృషి చేస్తుంది. ఈ సంస్థ ఆ సమకాలీన కాలంలో భారత ప్రజలలో జాతీయభావాన్ని, సామాజిక చైతన్యాన్ని పెంపొందింపచేయుటంలోను, నిస్వార్థ సేవ భక్తులను తయారు చేయుటంలోను ప్రముఖ పాత్ర వహించింది.

గోఖలే స్వదేశీ ఉద్యమాన్ని బలపరచినాడు. కాని అదే సమయంలో అతివాద వైఖరిని సూచించే 'బహిష్కరణ' సాధనాన్ని ఆయన ఆమోదించలేదు. ఆయన పరిపాలనా వికేంద్రీకరణ ఆవశ్యకతను గుర్తించినాడు. వికేంద్రీకరణ ద్వారా ప్రజల రాజకీయ హక్కులు విస్తృతపరచబడతాయని ఆయన భావించినాడు. గోఖలే ఈ ఆశయాల సాధనకు రాజ్యాంగబద్ధమైన ఆందోళనను ఆశ్రయించినాడు. ఆయన లక్ష్యం బ్రిటీషు సామ్రాజ్యంలో అంతర్భాగంగా యుంటూనే దేశానికి స్వయం పరిపాలనా ప్రతిపత్తిని సాధించటం. దానిని సాధించటానికి రాజ్యాంగ సమ్మతమైన సాధనాలను మాత్రమే చేపట్టవలెను. ఆ విధంగా గోఖలే రాజకీయాలలో నైతిక విలువలను ప్రవేశ పెట్టటానికి ఎక్కువ ప్రాధాన్యం యిచ్చినాడు.

## 6.6 మాదిరి ప్రశ్నలు:-

1. గోపాలకృష్ణ గోఖలే రాజకీయ తత్త్వ విచారం పై ఒక వ్యాసాన్ని వ్రాయుము.
2. మితవాద రాజకీయ నాయకునిగా గోఖలే రాజకీయాభిప్రాయాలను విశదీకరించుము.
3. భారత రాజకీయ తత్త్వ విచారానికి గోపాలకృష్ణ గోఖలే కృషిని వివరించుము.
4. రాజ్యాంగబద్ధమైన ఆందోళన పట్ల గోఖలే అభిప్రాయాలను విపులీకరించుము.

**లఘు వ్యాసరూప ప్రశ్నలు**

1. బ్రిటీషు వారి పట్ల గోఖలే వైఖరిని వివరించుము.
2. గోఖలే నెలకొల్పిన భారతీయ సేవక సమాజం కృషిని వివరించుము.
3. స్వదేశీ ఉద్యమం పట్ల గోఖలే దృక్పధాన్ని విశదీకరించుము.
4. గోఖలే ఆర్థిక భావాలను సంక్షిప్తంగా వ్రాయుము.

## 6.7 ఆధార గ్రంథాలు:-


1. V.P. Varma - Modern Indian Political Thought
2. R.P. Paranjype - Gopal Krishna Gokhale
3. V.P.S. Raghu Varusi - Indian Nationatist Movement and Thought
4. ఆచార్య ఎన్.హెచ్. సీతారామ శర్మ - ఆధునిక భారత రాజకీయ, సామాజిక తత్వ విచారం
5. ఆచార్య మామిడిపూడి వెంకటరంగయ్య - భారత స్వాతంత్రోద్యమ చరిత్ర (2nd)


(Dr. I. Dosagiri Rao)

పాఠం - 7

# బాలగంగాధర తిలక్

## 7.0 లక్ష్యం :-

తిలక్ స్వాతంత్ర్యం ప్రతీ భారతీయుని జన్మ హక్కు అని వాదించాడు. స్వరాజ్ పై తిలక్ భావనలు, ఆయన ఉదారవాద విశిష్టతను, రాజనీతి తత్త్వ విచార ప్రభావాన్ని గూర్చి తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

**విషయసూచిక:-**


7.0 లక్ష్యం
7.1 పరిచయం
7.2 సంగ్రహ జీవిత విశేషాలు
7.3 తిలక్ ఉదారవాదం
7.4 స్వరాజ్ పై తిలక్ భావాలు
7.5 తిలక్ రాజనీతి తత్త్వ విచారం
7.6 సామాజిక మార్పు - సంస్కరణల్పై తిలక్ అభిప్రాయాలు
7.7 సారాంశము
7.8 మాదిరి ప్రశ్నలు
7.9 ఆధార గ్రంథాలు


## 7.1 పరిచయం :-

భారతదేశ స్వాతంత్ర్యోద్యమంలో దాదాబాయి నౌరోజీ, గాంధీ, నెహ్రూల జీవితం వలె బాలగంగాధర జీవితం కూడా అతి ప్రధానమైనది. స్వరాజ్య సాధనకు ఈ ప్రముఖులు చేసిన అవిరళ కృషి, చూపిన త్యాగనిరతి అనన్య సామాన్యమైనది, నిరుపమానమైనది. స్వతంత్ర భావోద్దీపితమైన నవ సమాజ నిర్మాణానికి వారు చూపిన సాహసం అపూర్వమైంది. వీరి దేశభక్తి పశ్చిమ దేశాలలో వ్యాప్తిలో ఉన్న జాతీయ భావం వంటిది కాదు. సామ్రాజ్యవాదాన్ని ప్రభోదించేది కాదు. అది భారత జాతీయ జీవితానికి ప్రాణం వంటిది. భారతీయ సంస్కృతికి బంధురమైంది.

19వ శతాబ్దంలో భారత జాతీయోద్యమంలోని నాయకుల సిద్ధాంతాలు ధృక్పదాలు రెండు విభిన్న ధోరణులను వ్యక్తం చేసాయి. బ్రిటీషు సామ్రాజ్యంలో అంతర్భాగంగా కొనసాగుతూ స్వపరిపాలనను ధ్యేయంగా చేసుకోవాలనీ, సామాజిక, ఆర్థిక రంగాల్లో పాలకుల సహాయంతో అభివృద్ధి సాధించాలనీ వాదించేవారు మితవాదులుగా ప్రసిద్ధికెక్కారు. స్వాతంత్ర్యానికి ఇంకా భారతీయులు మానసికంగా భౌతికంగా సంసిద్ధులు కాలేదు. కాబట్టి బ్రిటీషు వారి విజ్ఞతాయుత పాలనలో అభివృద్ధిని సాధించి ముందు ఆధిక్యతను సంపాదించి తదుపరి స్వాతంత్ర్యం కోసం ఉద్యమించాలని గోఖలే గట్టిగా అభిప్రాయపడ్డాడు.

అయితే దీనికి వ్యతిరేకంగా సంపూర్ణ స్వరాజ్యం సాధించిన తర్వాతనే అన్ని రంగాలలో అభివృద్ధి సాధ్యమవుతుందనీ సంస్కరణల కోసం పరాయి వారి సహాయం అవసరం లేదనీ పాశ్చాత్య భావాలు, సంస్కృతి భారత సమాజానికి సహాయకారి కాజాలదని అందువల్ల జాతీయోద్యమం మూలాలు భారతీయ సాహసత్వం, వారసత్వం, వైభవం పునరుద్ధరణ పై ఆధారపడాలనీ దానికి గాను జాతీయ విద్యా విధానం రూపొందాలని తిలక్, లాలాలజపతి రాయ్, అరబింద ఘోష్, బిపిన్ చంద్రపాల్ తదితరులు వాదించారు. లాల్ - బాల్ - పాల్ త్రయం భారత జాతీయోద్యమంలో అతివాద ధోరణులను వ్యాపింప జేసింది. ఈ అతివాద ధోరణులు చివరికి మితవాద అతివాద సంఘర్షణల మధ్య అఖిల భారత జాతీయ కాంగ్రెస్ సంస్థ 1907 సూరత్ సమావేశంలో చీలిక ద్వారా వ్యక్తమయింది. ప్రత్యక్ష ఆందోళనా రాజకీయాలకు బాలగంగాధర తిలక్ పునాదులు వేసారు.

## 7.2 సంగ్రహ జీవిత విశేషాలు :-

తిలక్ రత్నగిరిలో 1856లో జూలై నెల 23వ తేదీన ఒక మధ్య తరగతికి చెందిన చిత్పావన బ్రాహ్మణ కుటుంబంలో జన్మించాడు. చిత్పావన బ్రహ్మణులు మహారాష్ట్రలో చారిత్రకంగా ప్రసిద్ధి చెందినవారు. ఈ శాఖీయులలోనే మహారాష్ట్ర సామ్రాజ్యానికి సారధ్యం వహించిన పీష్వాలు జన్మించారు. తిలక్ అసలు పేరు కేశవ్. కాని అతనిని చినప్పటి నుంచి బలవంత్, బాల్ అని పిలచేవారు. ఆ పేరే అతనికి స్థిరముగా నిలిచి పోయింది. తిలక్ బాల్యం నుండి చురుకుగా ఉండేవాడు. మొండితనం, ధైర్యం ఇతని సహజ లక్షణాలు. బాల్యంలో విద్యార్థి జీవితంలో తిలక్ అసాధారణ ప్రజ్ఞను ప్రదర్శించాడు. గణితం, వ్యాకరణం, సంస్కృత భాషలలో మంచి ప్రావీణ్యం సంపాదించాడు. తిలక్ 1872లో బొంబాయి విశ్వ విద్యాలయంలో మెట్రిక్‌లేషన్ పరీక్షలో ఉత్తీర్ణుడై, బొంబాయిలో ఎల్ఫిన్‌స్టన్ కళాశాలలోను, తరువాత పూనాలో ఉన్న డక్కన్ కళాశాలలోను విద్యాభ్యాసం చేసి 1876లో గణిత శాస్త్రంలో ప్రథమ శ్రేణిలో పట్టభద్రుడయ్యాడు. తిలక్ తరువాత న్యాయశాస్త్రం అధ్యయనం చేసి భారతీయ న్యాయ సంహితలను, పాశ్చాత్య పండితుల వ్యాఖ్యాన సహాయంతో చదవటం కాక, మను, యజ్ఞ వాల్క్య, నారదస్మృతుల మూలగ్రంథాలను పఠించాడు. క్షుణ్ణంగా న్యాయ శాస్త్ర విషయాలను అధ్యయనం చేసి 1879లో న్యాయశాస్త్ర పట్టభద్రుడైనాడు.

తిలక్, చిప్లుంకర్, అగార్కర్ అనే మిత్రులతో కలిసి 1880లో నవీన ఆంగ్ల పాఠశాల (New English School)ను స్థాపించాడు. తరువాత ఈ సంస్థలోనే అధ్యాపకునిగా చేరి దక్కన్ విద్యాసంస్థలో సభ్యత్వం తీసుకొన్నాడు. దక్కన్ విద్యా సంస్థ సభ్యులు ఉదాత్త త్యాగ నిరతితో కట్టుబడి ఉండేవారు. 1885లో వీరి కృషి ఫలితంగా ఫెర్గుసన్ కళాశాల పూనాలో ప్రారంభం అయ్యింది. "ఉదార విద్యను స్వదేశీ పరం చేయటం" లక్ష్యంగా తిలక్, ఆయన అనుయాయూలు విద్యారంగం అభివృద్ధి చేయటానికి అహర్నిశలు కృషి చేశారు.

## 7.3 తిలక్ ఉదారవాదం :-

బాలగంగాధర్ తిలక్ 20వ శతాబ్దం రెండవ భాగంలో స్వాతంత్రోద్యమంలో కీలక పాత్ర వహించాడు. తిలక్ గొప్ప ఉదారవాది. తిలక్ ఉదారవాదం ప్రత్యేకమైంది, విశిష్టమైంది. తిలక్ ఉదారవాదం ఇతర ఉదారవాద నాయకుల ఉదారవాదానికి పూర్తిగా భిన్నమైంది. ఇదే విధంగా తిలక్ ఉదారవాదానికి పాశ్చాత్య ఉదారవాదుల ఉదారవాదానికి మధ్య కూడ తీవ్రమయిన భిన్నత్వం ఉంది. పాశ్చాత్య ఉదారవాదుల మాదిరి తిలక్ రాజకీయాల నుంచి మతాన్ని వేరుపరచలేదు. వాస్తవానికి తిలక్ మరాఠా రాజకీయ, మత సాంప్రదాయాలను పునరుద్ధరించేందుకు ప్రయత్నించాడు. ఆయన దేశంలోని నిరక్ష్యరాస్యులు, ఇంగ్లీషు అభ్యసించి మేధావులకు వ్యతిరేకంగా ధార్మిక, అర్థ - మత (quasi - religion) సాంప్రదాయాలను ఉపయోగించాడు.

దీనికి అనుగుణంగానే 1893 నుంచి తిలక్ గణేష్ ఉత్సవాలను నిర్వహించాలని ప్రోత్సహించాడు. గోవధ నిషేధ సంఘాలను ఏర్పరచినాడు. గణేష్ ఉత్సవాలు ప్రాచుర్యాన్ని పొందాక తిలక్ సుప్రసిద్ధ మహారాష్ట్ర నాయకుడైన శివాజీ ఉత్సవాలను నిర్వహించడం ప్రారంభించాడు. ఈ దిన పత్రికలలో తిలక్ ప్రజలలో జాతీయ భావాలను, దేశభక్తిని, దేశభక్తిని ప్రజ్వరిల్ల చేసే శక్తివంతమైన

వ్యాసాలను ప్రచురించాడు. తిలక్ రచనలను పరిశీలిస్తే ఆయనను ఒక యదార్థ వాదిగా గుర్తించవచ్చును. ఆయన భగవద్గీత మంచి పనికి, హింసాత్మక చర్యలు రెండింటికి ప్రేరణను కలిపించటమే కాక వాటిని సమర్థిస్తుందని గుర్తించాడు. ఒక సందర్భంలో తిలక్ వ్యక్తి తన సామర్థ్యానికి అనుగుణంగా తిరుగుబాటు చేయటమా? పూర్తిగా లొంగిపోవడమా? అనే రెండిటి మధ్య ఏదో ఒక దానిని ఎంపిక చేసుకోవాలని ఉద్ఘాటించాడు. అయితే ఈ రెండు చర్యలలో స్వధర్మం కీలకమైందని గుర్తించాల్సి ఉంటుంది. బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా నిర్వహింపబడిన ఆందోళనలో తిలక్ స్వల్పమైన సంస్కరణ వల్ల ఎలాంటి ఉపయోగం లేదని గుర్తించాడు. ప్రస్తుతం అమలులో వ్యవస్థ దాదాపు భగ్నమైందనీ, అందుచేత దాన్ని పూర్తిగా తొలగించాలని వాదించాడు. తిలక్ స్వాతంత్ర్యం ప్రతీ 'భారతీయుని జన్మ హక్కు' అని బలంగా వాదించాడు. తిలక్ దృష్టిలో స్వరాజ్యం ఒక నైతిక అవసరం. ఆయన అభిప్రాయం ప్రకారం స్వరాజ్యం ఒక హక్కు మాత్రమే కాదు ఒక ధర్మం కూడా. స్వరాజ్యం అంటే స్వయం నియంత్రణ, అంతర్గత ఆధ్యాత్మిక స్వేచ్ఛ. అయితే రాజకీయపరమైన స్వేచ్ఛ ఉన్నప్పుడు ఆధ్యాత్మిక స్వేచ్ఛ సాధ్యమవుతుందని తిలక్ పేర్కొన్నాడు.

వాస్తవానికి తిలక్ ఒక ఉదారవాదిగా తన రాజకీయ జీవితాన్ని ప్రారంభించాడు. తిలక్ ఉదారవాదిగా ఉన్న దశలో ఆయన ప్రభుత్వాన్ని బలహీనపరచటానికి ప్రయత్నించలేదు. అయితే ఆయన బ్రిటీష ప్రభుత్వానికి రష్యా లేదా ఇతర శత్రు దేశాన్నుంచి రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పాడు. దానికి తిలక్ భారతీయులందరూ ప్రభుత్వాన్ని బలపరచాలని ఉద్బోధించాడు. అయితే ఆయన ఆశయం నెరవేరలేదు. ఈ విషయాన్ని వివరిస్తూ తిలక్ గత 12 సంవత్సరాలుగా భారతదేశ ప్రజలు తమ ఇబ్బందులను తొలగించాలని ప్రభుత్వాన్ని ప్రాదేయపడినప్పటికీ ప్రభుత్వం చలించలేదని పేర్కొన్నాడు. అయినప్పటికీ తిలక్ రాజ్యాంగ బద్ధమైన పద్ధతులను పాటించాలని వాదించాడే తప్ప ప్రతిఘటనకు పూనుకోమని ప్రజలను కోరలేదు. అయితే 20వ శతాబ్దం మొదటి దశాబ్దంలో తిలక్ దృక్పధం పూర్తిగా మారింది. దీనికి అనుగుణంగానే తిలక్ భారతదేశ రాజకీయ భవిష్యత్తు నిస్తేజంగా అణిగి ఉండటం లేదనీ, ధృడచిత్తం (Self Assertion)లో ఉందనీ, అందుచేత బానిసలుగా ఉదాశీనులుగా ఉండక ప్రత్యక్ష చర్యకు పూనుకోవాలని ప్రజలకు ఉద్బోధించాడు.

రాజకీయ హక్కులను పొందాటనికి పోరాటాన్ని సాగించాలని ఆయన వాదించా డు. ఉదార వాదులు ఈ హక్కులను ప్రభుత్వాన్ని ప్రాదేయపడటం ద్వారా సాధించవచ్చును అని భావిస్తున్నారు. కాని వాస్తవంలో వాటిని తీవ్రమైన ఒత్తిడి ద్వారా మాత్రమే పొందవచ్చునని తిలక్ గాఢంగా అభిప్రాయపడ్డాడు.

## 7.4 స్వరాజ్ పై తిలక్ భావాలు :-

1895 నుంచి తిలక్ స్వరాజ్ అవసరం గురించి ప్రబోధించడం ప్రారంభించాడు. తిలక్ సామాజిక సంస్కరణలను ప్రవేశ పెట్టాలంటే స్వాతంత్ర్యం అవసరమని ఉద్ఘాటించాడు. జాతీయ సమైక్యతకు, జాతి ఆత్మగౌరవానికి స్వాతంత్రమే అశాశ్వత పునాది అని తిలక్ అభిప్రాయం. సామాజిక, రాజకీయ స్వాతంత్ర్యానికి, పురోభివృద్ధికి నైతిక అభివృద్ధికి స్వరాజ్ ఆవశ్యక పరిస్థితి అనేది శివాజీ ప్రబోధించినట్లు ఆయన దేశ ప్రజలకు గుర్తు చేశాడు. తిలక్ ప్రతిపాదించిన స్వరాజ్ భావన ఆయన వ్యక్తిగత, రాజకీయ, సామాజిక తాత్వికతలో పెనవేసుకొంది. తిలక్ స్వరాజ్ భావనను ఒక ఆచరణాత్మకత దృక్పధంతో ప్రతిపాదించాడు. తిలక్ స్వరాజ్ భావం మహారాష్ట్ర చరిత్రలో నిగూఢంగా ఉంది. తిలక్ తన కాలం నాటి రాజకీయ పరిస్థితులకు భారతీయ సంస్కృతిలో దేవునికి కల అత్యున్నత స్థానం కోణం నుంచి పరిశీలించాడు. బెంగాల్ విభజన ఫలితంగా ఉత్పన్నమైన పరిస్థితిని, సమర్థవంతమైన రాజకీయ కార్యక్రమాన్ని చేపట్టవలసిన అవసరాన్ని దృష్టిలో ఉంచుకునే తిలక్ జాతీయ నాయకులతో కలిసి ఆయన కార్యాచరణ పథకాన్ని ప్రతిపాదించాడు. తిలక్ రాజకీయాల నుంచి మతాన్ని వేరు పరచడం సాధ్యం కాదని ధృఢంగా విశ్వసించాడు. అందుచేత ఆయన హిందూమత ధర్మాలని ప్రజలలో వ్యాపింప చేయటాన్ని జాతీయ ఉద్యమం కీలక దృక్కోణంగా పరిగణించాడు. ఇదే అభిప్రాయాన్ని గాంధీకూడ వ్యక్తపరచాడు. స్వపరిపాలన (self rule) ఒక నైతిక ఆవశ్యకత. స్వపరిపాలన సాధించడం ఆత్మ గౌరవం కల హిందువుల ధర్మం అని తిలక్ ఉద్ఘాటించాడు. కేవలం రాజకీయ చర్య మాత్రమే ఈ జాతి ధర్మాన్ని సాధించవచ్చునని తిలక్

అభిప్రాయం. భారతదేశం తన గమ్యాన్ని చేరేందుకే భారతీయులను చైతన్యవంతులను చేయటం ప్రథమ కర్తవ్యం అని తిలక్ వాదించాడు. దీంతోపాటు ప్రజలు ధైర్యాన్ని, త్యాగ శీలతను అలవర్చుకోవాలని తిలక్ కోరాడు.

తిలక్ ఇతర జాతీయ వాదులతో కలిసి దేశం ముందు నాలుగు అంశాల కార్యచరణ పథకాన్ని ఉంచాడు. అవి - బహిష్కరణ, స్వదేశీ, జాతీయ విద్య, స్వరాజ్. తిలక్ కార్యాచరణ పథకం ద్వారా బ్రిటీషు ప్రభుత్వాన్ని తీవ్రమైన ఒత్తిడికి గురి చేయవచ్చునని ఆయన పేర్కొన్నాడు. వాస్తవానికి ఆయన ఈ పథకాన్ని బ్రిటీషు ప్రభుత్వం తలపెట్టిన బెంగాల్ విభజనను అడ్డుకునేందుకు ప్రతిపాదించాడు.

తిలక్ ప్రతిపాదించిన బహిష్కరణ బ్రిటన్‌లో తయారయిన ఉత్పత్తి అయిన వస్తువుల బహిష్కరణతో ప్రారంభమై క్రమంగా రాజకీయ రంగానికి వ్యాపించింది. ఇదే విధంగా బెంగాల్ నుంచి మొత్తం భారతదేశానికి ప్రాకింది. ఒక అఖిల భారత రాజకీయ ఆయుధంగా బహిష్కరణ తిలక్ ప్రతిపాదించిన మొట్టమొదటి సూత్రం. బహిష్కరణ సహాయ నిరాకరణ ఉద్యమాన్ని అధిగమించింది.

తిలక్ స్వదేశానికి మొదట్లో ఒక ఆర్థికపరమైన బహిష్కరణకు ప్రతి ఆర్థిక చర్యగా ప్రారంభించాడు. తిలక్ అభిప్రాయం ప్రకారం స్వదేశీ అంటే స్వయంపాలన (self rule). అయితే స్వదేశీ ఉద్యమం క్రమంగా ఒక రాజకీయ ఉద్యమంగా రూపాంతరం చెందింది. స్వదేశీ భావన స్వయంపోషకత్వం, స్వయం సేవ వంటి ఉదాత్త భావాలను అన్ని రంగాలకు అన్వయిస్తుంది. తిలక్ ప్రారంభించిన స్వదేశీ ఉద్యమం క్రమంగా జాతీయ పునర్ వికాస ఉద్యమంగా రూపుదిద్దుకొంది. స్వదేశీ రాజకీయ, ఆర్థిక, ఆధ్యాత్మిక సాధనం.

తిలక్ నాలుగు అంశాల కార్యాచరణలో ఒక అంశమైన జాతీయ విద్య ఆయన ఇంగ్లీషు భాషకు వ్యతిరేకంగా ప్రబోధించిన సూత్రం. తిలక్ అభిప్రాయం ప్రకారం మెకాలే ప్రవేశపెట్టిన ఇంగ్లీషు జాతి ఆరోగ్యానికి, అభ్యున్నతికి ప్రమాద భరితం. ఇంగ్లీషు నేర్చుకోవటం వల్ల భారతీయ యువత తమ కుంటుబాలకే కాక భారతీయ విలువలకు దూరమవుతారు. ప్రభుత్వం ప్రవేశ పెట్టిన పాశ్చాత్య విద్యాబోధన వలన తమ దేశ చరిత్రకు మధ్య ఉన్న బందాన్ని తెంచటమే కాక వారిని నామ మాత్రం భారతీయులుగా మార్చివేస్తుంది. అందుచేత తిలక్ పాశ్చాత్య విద్యను పూర్తిగా తిరస్కరించాడు. ఆయన దేశమంతటా దేశీయ విద్యను బోధించే పాఠశాలను స్థాపించాలని ఉద్బోటించాడు. జాతీయ విద్య వల్ల మాత్రమే వారిలో స్వయం సేవ, స్వయం పోషకత్వం వంటి ఉన్నత విలువలు పెంపొందుతాయనీ, ప్రభుత్వం స్థాపించిన విద్యా సంస్థల ద్వారా ఈ విలువలు పెంపొందాయని ఆయన పేర్కొన్నారు.

స్వరాజ్ తిలక్ ఇతర జాతీయ నాయకులు ప్రారంభించిన జాతీయ ఉద్యమానికి ఊపిరి. అంతేకాక ఇది నైతిక ఆవశ్యకత. అందుకే ఆయన స్వరాజ్ భారతీయుల జన్మహక్కు అని ఎలుగెత్తి చాటాడు. తిలక్ స్వరాజ్‌ను ఉద్యోగ బృందపాలన కాక ప్రజలపాలన అని నిర్వచించాడు. అందుచేత తిలక్ ఆయన అనుచరులు ప్రభుత్వం సాంఘిక సంస్కరణలను ప్రవేశపెట్టి, అమలుపరచాలని వాదించారు. ప్రజలు సమర్థించని, పాటించని సాంఘిక సంస్కరణలు అర్థరహితం అప్రజాస్వామికమని కూడ తిలక్ వాదించాడు. ఇదే ఉద్దేశంతో తిలక్ 1916లో అనిబిసెంట్, తిలక్‌లు హోంమ్ రూల్ లీగును ప్రారంభించారు.

తిలక్ తన స్వరాజ్ కార్యక్రమంలో భాగంగా సమాఖ్య రాజకీయ వ్యవస్థను ప్రతిపాదించాడు. ఈ సందర్భంలో ఆయన అమెరికా సమాఖ్య నమూనాను ప్రవేశ పెట్టాలని సూచించాడు. తిలక్ బహిరంగంగా బ్రిటన్ సార్వభౌమాధికారాన్ని వ్యతిరేకించినప్పటికీ అంతరంగంలో స్వరాజ్ అంటూ సంపూర్ణ స్వాతంత్ర్యమనే భావన దాగి ఉంది. ఆయన ఒక సందర్భంలో అసంపూర్ణమైన స్వరాజ్ అనేది లేనే లేదు అని పేర్కొనడం ఆయన అసలు ఉద్దేశాన్ని వ్యక్తపరుస్తున్నది. స్వరాజ్ ద్వారానే సంపూర్ణ మార్పు సాధ్యమవుతుందనీ అదే భారతీయుల అంతిమ లక్ష్యమని కూడ తిలక్ ఒక సందర్భములో ప్రకటించాడు. ఇంకో సందర్భములో ఆయన స్వరాజ్ భారతీయ ధర్మం ఇదే భారతీయుల లక్ష్యం అని కూడా సూచించాడు. ఈ లక్ష్యాన్ని సాధించటానికి ఆయన ఒక కార్యాచరణ పథకాన్ని ప్రకటించాడు.

తిలక్ స్వరాజ్ సాదనకు ప్రతిపాదించిన కార్యాచరణ పథకం పూర్తిగా శాంతి యుతమైంది. ఆయనస్వరాజ్ శాంతియుతమైన ఉదాశీన ప్రతిఘటన (Passive Ressistance) ద్వారా మాత్రమే సాధించాలని వాంఛించాడు. అయితే ఇక్కడ గమనించవలసిన అంశం ఏమిటంటే విదేశీ విమర్శకుల అభిప్రాయంలో తిలక్ ఒక విప్లవవాది. అయితే వాస్తవం కాదు. ఆయన శివాజీ చేపట్టిన చర్యలను సమర్థించినప్పటికీ, ఒక నైతిక వాదిగా తిలక్ ప్రజల ఆకాంక్షలూ పరిశుద్ధమైనవిగా ఉండునని నొక్కి చెప్పడం ద్వారా తన శాంతి కాముకత్వాన్ని ప్రదర్శించాడు. అయితే దేశభక్తితో శివాజీ, అర్జునుడు చేపట్టిన హింసాపూరిత చర్యలను ఖండించలేదు. ఇదే సందర్భంలో తిలక్ హింసాపూరిత రాజకీయాలను తీవ్రంగా గర్హించాడు. అంతేకాక ఆయన రాజకీయ లక్ష్య సాధనకు హింసాత్మక చర్యలకు పూనుకోకుండా ఏనాడు ఉద్బోదించలేదు. ఒక ఆచరణాత్మిక వాదిగా తిలక్, మాకియవెల్లి పంథాలో ఈ బలప్రయోగాన్ని సమర్థించలేదు. ఆయన కేవలం ప్రజాస్వామ్య పద్ధతులకు, శాంతియుత ప్రతిఘటనను మాత్రమే బోధించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం శాంతియుతంగా ప్రజలు చేపట్టే చర్యలు విప్లవాన్ని సాధించగల శక్తి ఎంతమైనవని ఆయన వాదించాడు. ఆయన ప్రతిపాదించిన బహిష్కరణ, అహింసకు మార్గ దర్శకాలు అయ్యాయి. ఏమైనప్పటికీ తిలక్ రాజకీయ తాత్విక హింసకు చోటులేదు. ఆయన హింస పూర్తిగా అర్ధరహితమైందనీ, వృథా అని పేర్కొన్నాడు. ఆయన బ్రిటీషు ప్రభుత్వానికి అపారమైన సైనిక ఆయుద బలాన్ని ప్రభుత్వం చర్యలను చట్టబద్ధం, రాజ్యాంగబద్ధమైన చర్యల ద్వారా మాత్రమే ఎదుర్కోవాలని, ఏలాంటి హింసాత్మక చర్యలకు పూనుకోరాదని ఆయన భారతీయులకు ఉద్బోదించాడు. ఈ విధంగా తిలక్ దేశ స్వాతంత్ర్య సమూపార్జనకు కేవలం రాజ్యాంగబద్ధమైన, ప్రజాస్వామ్యబద్ధమైన మార్గాన్ని భారతదేశం ముందుంచాడు. అంతేకాక ఆయన ప్రజలు సమైక్యంగా పోరాటం సాగించవలసిన ఆవశ్యకతను కూడా నొక్కివక్కాణించాడు. మొత్తం మీద తిలక్ రాజకీయ లక్ష్య సాధనకు ఒక ఆచరణాత్మకమైన పథకాన్ని రచించాడు.

తిలక్ ప్రతిపాదించిన పథకంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు విదేశీ దోపిడీ నుంచి పరిరక్షించి వారి ఆర్థికాభివృద్ధిని సాధించటం ఒక కీలకాంశం. తిలక్ కారల్ మార్క్స్ ప్రతిపాదించిన చారిత్రక భౌతికవాదాన్ని లేదా మిగులు విలువ సిద్ధాంతాలను బలపరచలేదు. ఆయన రైతులు, కార్మికులు, వృత్తికారులు హక్కుల కొరకు పోరాడినప్పటికీ, భారతీయ పెట్టుబడిదారుల హక్కులను విస్మరించలేదు. తిలక్ సమాజాన్ని ఆర్థిక, సామాజిక వర్గాలుగా విభజించటాన్ని సమర్థించలేదు. అంతేగాక ఆయన వ్యవసాయ రంగం, భూస్వామ్య విధానాన్ని ఖండించాడు. ఆయన స్వరాజ్ సాధనకు దేశంలోని వర్గాలను సమీకరించవసలిసి ఉంటుందని నొక్కి చెప్పాడు. ఆయన గ్రామీణ ప్రాంతాలలో నివసించే కూలీలు ఇతర గ్రామీణులు అనుభవిస్తున్న అంతులేని దారిద్ర్య స్థితి పట్ల వ్యధ చెందారు. వారి పేదరిక నిర్మూలనకు తిలక్, రాజకీయ, ఆర్థిక బహిష్కరణను ప్రతిపాదించాడు.

తిలక్ భారతదేశ ఆర్థిక ప్రగతి సాధనకు వ్యవసాయాభివృద్ధి లేదా వ్యవసాయదారుల అభివృద్ధి ఒక్కటే సాధ్యమని భావించలేదు. ఆయన గ్రామీణాభివృద్ధితో సమానంగా పారిశ్రామికాభివృద్ధిని సాధించాలని ఉద్ఘాటించాడు.

తిలక్ ప్రతిపాదించిన స్వరాజ్ పథకాన్ని మత, సాంస్కృతిక పునాదులతో పాటు, ఆర్థిక పునాదులు కూడ ఉన్నట్లు గుర్తించవచ్చును.

## 7.5 తిలక్ రాజనీతి తత్వ విచారం :-

తిలక్ రాజనీతి తత్వ విచారం మూలాలు భారతీయ సాంప్రదాయం, వర్తమాన పాశ్చాత్య రాజనీతి, న్యాయశాస్త్ర తత్వ విచారాలలో సంక్షిప్తమై ఉన్నాయి. తిలక్ సంస్కృతం, ఆంగ్ల విద్యా సాంప్రదాయాల్లో సమానంగా ప్రకాశం ఉండుట ఒక కారణం. దాంతోపాటు తిలక్ రాజనీతి తత్వ విచారం పై మహాభారతం ప్రగాఢమైన ప్రభావాన్ని కలిగివుంది. ఆయన తన అహింసా సిద్ధాంతాన్ని మహాభారతం పునాదుల మీద నిర్మించాడు. తిలక్ రాజకీయాల్లో నిరపేక్ష అహింసకు చోటు లేదని వాదించాడు. తిలక్ చేసిన ఈ వాదనను భగవద్గీత సమర్థిస్తున్నది. తిలక్ సమర్థించిన సక్రమమైన అహింసకు భగవద్గీత ఆమోదం ఉంది. శివాజీ అఫ్జల్ ఖాన్‌ను రాజకీయ కారణాల వల హత్య చేయటాన్ని తిలక్ భగవద్గీత బోధనల ఆధారంగా సమర్థించటం అందరికీతెలిసిన విషయం.

తిలక్ రాజకీయంగా ఆదర్శవాదాన్ని ప్రతిపాదించలేదు. ప్లాటో ప్రతిపాదించిన ఆదర్శ భావనను సమర్థించలేదు. రాజకీయంగా పరిశుద్ధమైన సమాజాన్ని చిత్రించలేదు. ప్లాటో, అరిస్టాటిల్‌లా ఆదర్శ రాజ్యం ఏవిధంగా ఉండాలో వివరించలేదు. అంతేకాక బొసాంకో, హెగెల్ పంథాలో సైద్ధాంతిక పరంగా అత్యుత్తమ రాజ్యాన్ని సృష్టించలేదు. తిలక్ తన జీవితాంతం భారతదేశాన్ని రాజకీయం ఏ విధంగా అభివృద్ధిపరచాలనే లక్ష్యం మీదనే తన దృష్టిని కేంద్రీకరించాడు. అందుచేత ఆయన రాజకీయ భావాలు పూర్తిగా ఆచరణాత్మకమైనవి. అయితే తిలక్ మాకియవెలి, హబ్స్ వంటి ఆచరణాత్మక వాది కాదు. ఆయన పరిపూర్ణమైన రాజకీయ ఆచరణాత్మక వాది కాదు. ఆయన రాజనీతి తత్వ విచారంలో సాంప్రదాయ భారతీయ రాజనీతితత్వ విచారం ఆధునిక పాశ్చాత్య ప్రాజస్వామ్య జాతీయ సైద్ధాంతిక భావ జాలంలు విడదీయలేని విధంగా పెనవేసుకున్నాయి.

తిలక్ అధి భౌతికవాదం ఆయన రాజకీయ భావజాలం వల్ల గాఢంగా ప్రభావితం అయ్యింది. ఆయన వేదాల్లోని నిక్షిప్తమైన ఆధ్యాత్మిక వాదాన్ని బలపర్చాడు. ఆయన ప్రతిపాదించిన సహజ హక్కుల రాజకీయ భావన భారతీయ వేదాంతంలో కీలకమైన ఏకాత్మ (non-dualism) భావనకు ప్రతిరూపం. ఆయన అభిప్రాయం ప్రకారం పరమాత్మ అత్యున్నత వాస్తవం, మానవులందరూ ఈ నిరపేక్ష ఆత్మ అంసాలుమాత్రమే. అందుచేత మానవులందరికీ సమానమైన స్వతంత్ర్యమైన ఆధ్యాత్మిక శక్తి వుంటుంది. తన అతి భౌతికవాదానికి అనుగుణంగానే తిలక్ స్వాతంత్ర్యాన్ని ఒక దైవాంశ సంభూతమైన అంశంగా భావించాడు. స్వాతంత్ర్యం అంతం లేని సూత్రం. స్వాతంత్రంగా వ్యక్తి ఆత్మ వంటిది. స్వాతంత్రాన్ని దేవున్నుంచి వేరుపరచటం సాధ్యం కాదు. అది ఆయనతో పూర్తిగా ఆధ్యాత్మికం చెందిన అంశం. తన అభిప్రాయాలకు అనుగుణంగానే తిలక్ స్వాతంత్రం రహితంగా భారతీయ ప్రజలకు నైతిక, ఆధ్యాత్మిక జీవితం అసాధ్యమని ఉద్ఘాటించాడు. సామ్రాజ్య వాదం జాతి ఆత్మను పూర్తిగా విచ్ఛిన్నం చేస్తుంది. అందుచేత తిలక్ బ్రిటీష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా పోరాడాలని భారతీయులకు పిలుపునిచ్చాడు. ఈ విధంగా తిలక్ దేశ స్వాతంత్ర్య సాధనకు చేపట్టిన పోరాటానికి బలమైన ఆర్థిక పునాదులు ఉన్నాయి.

తిలక్ జాతీయ వాదం పాశ్చాత్య రాజనీతి సిద్ధాంతాల పై కూడ ఆధారపడి ఉంది. ఆయన జె.యస్. మిల్ ప్రతిపాదించిన జాతీయవాదాన్ని, ఉడ్రోవిల్సన్ ప్రతిపాదించిన స్వయ - నిర్ణీత వాదాన్ని (self-determination) బలపర్చాడు. ఈ రెండు వాదాలను భారతదేశానికి వర్తింపజేయాలని ఆయన వాదించాడు. ఈ విధంగా తిలక్ జాతీయవాదం భారతీయ వేదాలు ప్రతిపాదించిన ఆత్మ అత్యున్నత స్వాతంత్ర్యం అనే వాదం మిల్, బర్క్, ఎల్సన్ మొదలైన పాశ్చాత్య రాజనీతి తత్వవేత్తలు ప్రతిపాదించిన జాతీయవాదం, స్వయం నిర్ధారిత వాదాల సమ్మేళనం. ఈ సమ్మేళనమే తిలక్ ప్రతిపాదించిన స్వరాజ్ భావనలో ప్రతిబింబిస్తున్నది.

తిలక్ తన ఆధ్యాత్మిక దృక్పదానికి అనుగుణంగా స్వరాజ్యం ఒక హక్కు మాత్రమే కాదు, ఒక ధర్మం అని కూడ పేర్కొన్నాడు. ఆయన స్వరాజ్యంకు రాజకీయ అర్థంతో పాటు, నైతిక, ఆధ్యాత్మిక అర్థాలను కూడ ప్రతిపాదించాడు. ఆయన పేర్కొనట్లు రాజకీయంగా స్వరాజ్యం అంటే హోమ్‌రూల్. నైతికంగా స్వరాజ్యం అంటే వ్యక్తి తన స్వధర్మాన్ని నిర్వర్తించేందుకు అవసరమైన పరిపూర్ణమైన ఆత్మ నిగ్రహాన్ని సాధించడం అని అర్థం. స్వరాజ్యం అంతర్గత ఆధ్యాత్మిక స్వేచ్ఛను సాధించేందుకు తోడ్పడటం చేత దానికి ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఉందని తిలక్ వాదించాడు.

## 7.6 సామాజిక మార్పు - సంస్కరణల పై తిలక్ అభిప్రాయాలు :-

తిలక్ ఆధ్యాత్మిక రాజకీయ దృక్పధం సామాజిక మార్పులపై ఆయన అభిప్రాయాలను గాఢంగా ప్రభావితం చేస్తుంది. తిలక్ సామాజిక మార్పు పై తన అభిప్రాయాలను తన రచనల ద్వారా వెల్లడించాడు. తిలక్ సాంఘిక సంస్కరణలను వ్యతిరేకించినప్పటికీ పరిపూర్ణ సామాజిక విప్లవాన్ని తిరస్కరించాడు. ఆయన విప్లవ స్థానంలో ప్రగతిశీలక విద్యా విధానం చైతన్యం ద్వారా సాధించే ఆంగికమైన, పరిణాత్మకమైన స్వరాజ్య జనితమైన సామాజిక మార్పును ఆహ్వానించాడు. తిలక్ పై నుంచి విధించే, చట్టబద్ధంగా సాధించే సామాజిక మార్పు యాంత్రికమైందిగా పరిగణించాడు. ఆయన పరిమాణాత్మకంగా ఒక సమాజం సంతరించుకున్న పొందికను విచ్ఛిన్నం కావటాన్ని ఆయన తీవ్రంగా పరిగణించాడు. విభిన్న పరస్పరం సంఘర్షణలు కలిగిన సామాజిక సిద్ధాంతాలను

ప్రబోధించడం ప్రజలను గందరగోళ పరచటాన్ని తిలక్ అంగీకరించలేదు. సిద్ధాంతాల ద్వారా సామాజిక వ్యవస్థలో ఆచరణాత్మకం కాని సూత్రాలను పెంపొందింప చేయటాన్ని కూడ తిలక్ ఖండించాడు. ఆయన క్రమబద్ధంగా, అంచెలంచెల పద్ధతిలో ప్రగతిశీలక సామాజిక మార్పును ప్రవేశ పెట్టాలని నొక్కి చెప్పాడు. తిలక్ హిందూమత విలువల పట్ల గౌరవం ఉన్న నాయకుల ప్రేరణ ద్వారా మాత్రమే సామాజిక మార్పును సాధించాలని ఉద్ఘాటించాడు. ఆయన సామాజిక మార్పును శాంతియుతంగా సంభావించాలని, ఈ మార్పును సాధించటంలో భారతదేశం పాశ్చాత్య దేశాలను గుడ్డిగా అనుకరించరాదని వాదించాడు.

తిలక్ రాజకీయ ప్రగతిని సాధించటానికి సామాజిక సంస్కరణలను ప్రవేశ పెట్టటం అత్యంత ఆవశ్యకమని తిలక్ పేర్కొన్నాడు. తిలక్ బ్రిటీషు ప్రభుత్వం నుంచి రాజకీయ హక్కుల సాధనకు సమాజాన్ని సంస్కరించడం అవసరమనే వాదాన్ని తిరస్కరించాడు. అందుచేత తిలక్ రాజకీయ హక్కులను సాధించడం భారతదేశానికి అత్యంత ప్రధానమైన అంశమనీ నొక్కి చెప్పాడు. రాజకీయ హక్కులను సాధించిన తర్వాతే భారతదేశం సాంఘిక సంస్కరణలకు పూనుకోవాలని తిలక్ సూచించాడు. అయితే తిలక్ రాజకీయ స్వాతంత్ర్యం ఆ సాధనకు పోరాడుతూనే మరో ప్రక్క సమాజంలో అణగారిన వర్గాల వికాసానికి కూడ కృషిని చేపట్టాలని తిలక్ ఉద్బోధించాడు. అందుచేత తిలక్ సాంప్రదాయ వాదిగా లేదా ఛాందస వాదిగా పరిగణించటం సరికాదు. తిలక్ రాజకీయ ప్రగతికి అత్యంత ప్రాధాన్యతను కనబరచడం వాస్తవమే అయినప్పటికీ తిలక్ ఆయన రాజకీయ ప్రగతి పట్ల ఆసక్తిని కనబరుస్తూనే మరో పక్క భారతదేశాన్ని సామాజికంగా పటిష్టవంతమైన దేశంగా అభివృద్ధి పరచడం పై కూడ తగిన ఆసక్తిని కనబరచాడు.

సామాజిక సంస్కరణల పట్ల తిలక్ దృక్పథంలో మరో కీలకాంశం ఏమిటంటే సామాజిక, మతపరమై అంశాలలో ప్రభుత్వ ఉద్యోగి బృందం జోక్యాన్ని పూర్తిగా తిరస్కరించింది. అంతేకాక తిలక్, ఉద్యోగ బృందంఅధికారం పరిధిని విస్తృతం కావటాన్ని కూడ వ్యతిరేకించాడు. బ్రిటీషు ఉద్యోగులు, న్యాయాధికారులు, విధాన నిర్ణేతలకు హిందూ మతానికి, భారతీయ సంస్కృతికి భిన్నమైన విలువలను కలిగి ఉండటం చేత సామాజిక సంస్కరణ ప్రక్రియలో వారికి భాగస్వామ్యం ఉండరాదని తిలక్ బలంగా వాదించాడు. అందుచేత అప్పటికే స్వయం ప్రతిపత్తిని కలిగి ఉన్న ఉద్యోగ బృందం ప్రభావానికి దూరంగా ఉన్న భారత సామాజిక వ్యవస్థ వ్యవహారాలలో ప్రభుత్వ ఉద్యోగుల ప్రమేయాన్ని తిలక్ నిర్ద్వంద్వంగా తిరస్కరించాడు. ఇటువంటి ప్రయత్నాలు స్వరాజ్యం నైతిక, మేధోపరమైన పునాదుల బలహీనపరుస్తాయని తిలక్ అభిప్రాయపడ్డాడు. దీనికి భిన్నంగా తిలక్ భారతీయులకు రాజకీయ, పరిపాలనా, వ్యవస్థీకరణ రంగాలలో తగినంత అనుభవం ఉంది, అందుచేత భారతదేశంలోసామాజిక సంస్కరణ ప్రక్రియలో భారతీయులకే పాత్ర ఉండాలే తప్ప, ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమేయం ఉండటంలో ఎలాంటి హేతుబద్ధత లేదని తిలక్ వివరించాడు. ఈ విధంగా ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా సాధింపబడే సామాజిక సంస్కరణలకు తిలక్ తీవ్రంగా గర్హించాడు.

తిలక్ తన కాలంలో కల సాంఘిక సంస్కరణ కర్తల దృక్పథాన్ని వ్యతిరేకించాడు. ఆయన అభిప్రాయం సంస్కరణ కర్తలు పాశ్చాత్య విద్యను అభ్యసించటం వల్ల పాశ్చాత్య సామాజిక దృక్పథాన్ని కలిగి ఉన్నారు. వారికి హిందూమత ధర్మాలు, సాంప్రదాయాలు, విలువల పట్ల నిరసన భావం ఉంది. తిలక్ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా ధర్మశాస్త్రాల వ్యాఖ్యానంలో ఘోర మార్పు సంభవించవచ్చును. నూతన సామాజిక చట్టాలను రూపొందించవలసి రావచ్చును. అయితే అధిక సంఖ్యాక ప్రజలు మత ధర్మాలకు కట్టుబడి ఉన్నంత కాలం, వారి మతపరమైన అభిప్రాయాలను, ఉద్రేకాలను కించపరచటం సరికాదు. భారతదేశంలో సామాజిక సంస్కరణ కర్తలు ఋషులు కూడా అయితే స్వలాభాపేక్ష కలిగిన ఆధునిక సంస్కరణకర్తలకు భారతీయ మత ధర్మాలను, ప్రమాణాల పై నిర్ణయాలను చేసే అర్హత లేదని తిలక్ నొక్కి చెప్పాడు. వారికి సాంఘిక సంస్కరణల పట్ల పాశ్చాత్య అర్థంలో లౌకిక దృక్పథం ఉంది. ఈ విధంగా తిలక్ సామాజిక మార్పును, సంస్కరణలను సమర్థించినప్పటికీ ఈ సంస్కరణలకు పాశ్చాత్య విలువలను కలిగిన పరిజ్ఞానం సామాజిక సంస్కరణ కర్తలుకాక, హిందూమత విలువలు, ప్రమాణాల పట్ల గౌరవం ఉన్న వ్యక్తులు మాత్రమే చేపట్టాలని వాదించాడు. ఈ విధంగా సామాజిక సంస్కరణల పట్ల తిలక్ దృక్పథం రాజకీయాలు, సంస్కృతి పట్ల ఆయన భావాలకు అనుగుణంగా ఉంది.

## 7.7 సారాంశము :-

బాలగంగాధర్ తిలక్ రాజనీతి, తత్వ విచారంలోని అనేక అంశాలను ఈ పాఠంలో సమగ్రంగా చర్చించటం జరిగింది. ఈ చర్చ ఫలితంగా తిలక్, రాజకీయ భావాలు ఆయన కాలంలో ఉధృతంగా కొనసాగుతున్న జాతీయోద్యమంతో ముడిపడి ఉన్నాయి. ఈ వాస్తవానికి అనుగుణంగానే ఆయన రాజనీతి తత్వ విచారం అన్ని అంశాలలో జాతీయ వాదం ప్రతిబింబిస్తున్నది. ఆయన ప్రతిపాదించిన స్వరాజ్, స్వధర్మ, జాతీయ విద్య, స్వదేశీ మొదలైన భావనలలో జాతీయవాదం అంతర్లీనంగా ప్రవహిస్తున్నది. ప్రధానంగా తిలక్ రాజకీయాలకు భారతీయ సంస్కృతిని, మత ధర్మములను, ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రాతిపదికగా ఆయన జాతీయవాదం బహిర్గతమవుతున్నది. రాజకీయాలను, ఆధ్యాత్మికతలను అనుసందానించటం, రాజకీయాలకు ఆచరణాత్మకంగా అమలుపరచటం, భారతదేశ సామాజిక నైతిక, ఆధ్యాత్మిక వారసత్వానికి అనుగుణమైన రాజకీయ ప్రణాళికను ప్రతిపాదించటం భారతీయ రాజనీతి తత్వ విచారంలో తిలక్‌కు అతి విశిష్టమైన శాశ్వతమైన స్థానాన్ని కల్పించాయి.

## 7.8 మాదిరి ప్రశ్నలు :-

1. భారత రాజనీతి విచారములో తిలక్ స్థానమును అంచనా వేయుము.
2. స్వరాజ్ పై తిలక్ భావాలను విమర్శనాత్మకంగా పరిశీలింపుము.
3. బాలగంగాధర తిలక్ యొక్క ఉదార వాద సిద్ధాంతాన్ని నిశితంగా పరిశీలింపుము.

## 7.9 ఆధార గ్రంథాలు :-


1. Varma, V.P. - "Modern Indian Political Thought"
2. Sankar Ghose - "Modern Indian Political Thought"
3. Bali, D.R. - "Modern Indian Thought"
4. Vishnoo Bhagavan - "Indian Political Thinkers"

పాఠం -8

# అరవింద్ ఘోష్

## 8.0 లక్ష్యం :-

రాజనీతి తత్త్వ విచార వేత్తలలో అరవింద్ ఘోష్ ఒకరు. అరవిందుని అతి భౌతిక వాదము గూర్చి, అరవిందుని నిష్క్రియ ప్రతిఘటన, అంతర్జాతీయ వాదము, మానవ ఐకమత్య అభివృద్ధి గూర్చి, రాజ్య భావన గూర్చి తెలుసుకొనుట ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :-


8.0 లక్ష్యం

8.1 ఉపోద్ఘాతము

8.2 అరవిందుని అతి భౌతికవాదము

8.3 జాతీయవాదము - మానవ ఐకమత్యము

8.4 రాజ్య భావన

8.5 వ్యక్తి - సమూహము/సమాజము

8.6 సారాంశము

8.7 మాదిరి ప్రశ్నలు

8.8 ఆధార గ్రంథాలు


## 8.1 ఉపోద్ఘాతము :-

శ్రీ అరవింద్ ఘోష్ (1872 - 1950)నకు ఆధునిక భారత రాజనీతి తత్త్వ విచార వేత్తలలో ఒక ప్రత్యేక స్థానముంది. ఆయన భావాలు భారత సాంస్కృతిక పునరుజ్జీవమునకు, భారత జాతీయ వాదమునకు ఎంతగానో దోహదపడినవి.

అరవిందుని మేధా సంపత్తి తాత్విక విషయాలలోను, ఆంగ్ల భాషా పటిమలోను సాంఘీక పున: వ్యవస్థీకరణను వివరించుటలోను వ్యక్తమవుతుంది. అందువలననే ఆయన భావాలు చాలా మంది మేధావులకు మార్గోపదేశమైనవి. 'The Life Divine' మరియు 'Savitri' అన్న ఉద్గ్రంధాలు అరవిందుని మేధాసంపత్తి యొక్క తారాస్థాయిని తెల్పు గ్రంథాలైనవి. వాటిలో తాత్విక ఆలోచనలు, పద్యకావ్య రూపంలో వెలిశాయి. అందువలననే అరవిందుని రచనలు ప్రపంచానికి ఒక సందేశమిచ్చేవిగా రవీంద్రనాధ ఠాగూర్ భావించారు. ప్రెంచి తత్త్వవేత్తయైన "Romain Rolland" అరవిందుని రచనలను ఆసియా ఐరోపా దేశాల మేధాసంపత్తుల కలయికగా భావించారు. అరవిందుడు బహుముఖ ప్రజ్ఞాశాలి, మేధావి, కవి, అతి భౌతిక వాది, ఋషి, దేశభక్తి పారాయునుడు, జాతీయవాది, విప్లవకారి, రాజనీతి తత్త్వవేత్త, అన్నింటిని మించి మానవాళి శ్రేయస్సును కోరిన తపస్వి. ఆయన వెలిబుచ్చిన ఆధ్యాత్మిక తాత్విక మరియు యోగ సంబంధమైన భావాలు అత్యున్నత స్థాయిలో మానవ శ్రేయస్సునకు, సాంఘీక మనుగడకు తోడ్పడేవి. అయితే ప్రాశ్చాత్య భాషా ప్రజ్ఞాశాలి అవుటచేత ఆయన వాడిన ఆంగ్లభాష సామాన్యులకు అర్థము చేసుకొనుట సులభతరము కాదు. విద్యావంతులకు కూడా ఆయన భావాలు వాస్తవాన్ని దూరంగా చూస్తున్నట్లు కన్పిస్తాయి. 'The Human Cycle' మరియు 'the ideal of human unity' రచనలలో అరవిందుని సామాజిక దృక్పధము, వ్యక్తి, సమాజముల సంబంధాల గురించి చాలా స్పష్టంగా మరియు ఆచరణీయంగా కన్పిస్తాయి.

అరవిందుని తండ్రి పాశ్చాత్య, ముఖ్యంగా ఆంగ్లేయుల నాగరికతాభిమాని. అరవిందుని బాల్యం నుంచి గ్రీకు, లాటిన్, ఆంగ్ల భాషలలో దిట్టగా తయారు చెయ్యాలన్న తపనతో, అతని తండ్రి అరవిందునికి మాతృభాష బెంగాలీ కూడా నేర్పించలేదట. అరవిందుని ఏడవ యేటనే ఉన్నత చదువులకు ఇంగ్లండు పంపి, అతని పై భారతదేశ ప్రభావము పడకుండా అతని తండ్రి జాగ్రత్త తీసుకున్నారు. కాని, ఇంగ్లండులో వుండగనే అరవింద ఘోష్ భారతదేశ తత్వము, నాగరికత, సంస్కృతుల గూర్చి క్షుణ్ణంగా తెలుసుకోసాగాడు. అంతే కాకుండా అప్పట్లో ఇంగ్లండులో భారతదేశ విముక్తి కొరకు పనిచేస్తున్న కొన్ని రహస్య సంస్థలతో సంబంధములు కూడా పెట్టుకొని, క్రమేపి భారతదేశం వచ్చి, దేశవిముక్తి కొరకు ఏదో ఒకటి చెయ్యాలనే తపనను పెంచుకున్నాడు. తన తండ్రి ఆశించిన దానికి భిన్నంగా అభిప్రాయాలు పెంచుకుంటూ వచ్చాడు. అంతే కాకుండా తన తండ్రిలో కూడా మార్పు రాసాగింది. బ్రిటీష్ పాలనలో భారతదేశంలో జరుగుచున్న పాలనాపరమైన ఆకృత్యాలకు సంబంధించిన "పేపర్ క్లిపింగ్స్"ను కుమారునికి పంపిస్తూ వుండేవాడు. ఫలితంగా అరవిందునిలో భారతదేశ విముక్తి కొరకు పాటు పడాలనే తపన ఇంకింత పెరిగింది.

అరవింద్ ఘోష్ తన ఇరవై ఒకటవ ఏట 1893లో స్వదేశానికి తిరిగి వచ్చాడు. అప్పటి నుంచి 1907 వరకు బరోడ రాష్ట్ర సర్వీసులో వివిధ శాఖలలోను, మహారాజ 'శాయోజ రావు' కళాశాలలో ఉపన్యాసకునిగా, ఆంగ్ల భాషా చార్యునిగా, అటు తరువాత ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. 1905 నుంచి 1910 వరకు దేశ రాజకీయ కార్యకలాపాలలో చురుకుగా పని చేశారు.

1905లో బెంగాల్ విభజన సమస్యతో భారతదేశంలో అతివాద ధోరణి పెరిగి, ఆధునిక భారత రాజనీతి తత్వవిచారములో ఒక ముఖ్యాంశముగా స్థిరపడింది. రామకృష్ణ, వివేకానందుల ప్రభావముతో భారతదేశ విముక్తి కొరకు, అరవిందుడు జాతీయాభిమానిగా, అందులోనూ జాతీయ విప్లవకారిగా తయారయ్యారు. బెంగాల్‌లో అప్పట్లో నడపబడుతున్న కొన్ని రహస్య విప్లవ రాజకీయ సంస్థలలో సంబంధము కల్గి కొన్ని కార్యక్రమాలలో పాల్గొనసాగాడు. కొన్ని కుట్ర కేసులలో సంబంధముందన్న కారణం పై అరెస్టు చేయబడ్డాడు. కాని సరియైన సాక్ష్యాధారాలు లేనందున అరవిందుడు విడుదలైనాడు. ఒకవేళ శిక్షపడితే ఉరిశిక్ష కావచ్చని (అభిప్రాయాలు) తన సహచరులతో పాటు తనకు కూడా అనిపించింది. అయితే ఈ లోపు 'ఆలిపూర్' జైలులో ఉన్నప్పుడు, అరవిందుడు ఒకరకమైన మార్మిక (mystic) అనుభవము పొంది, విప్లవకారి దశ నుండి ఆధ్యాత్మిక యోగిగా మారారు. విప్లవకారిగా భారతదేశాన్ని దాస్య శృంఖలాల నుండి విముక్తి కావించాలనే తపన స్థానములో విశ్వ మానవాళికి శాంతి సౌభాగ్యాలు కల్పించేందుకు, అది కూడా తగిన ఆధ్యాత్మిక - వాస్తవిక దృక్పథాన్ని వెలికి తీసుకొచ్చేందుకు తన వంతు కృషి చెయ్యాలనే తపన పెల్లుబికింది. అలా చెయ్యాలనే గురుతర బాధ్యత తన పై నిర్దేశించబడినదిగా భావించాడు. అందువలననే తన శేష జీవితాన్ని అప్పట్లో ఫ్రెంచి వారి అధీనంలో వున్న పాండిచ్చేరి నందు, ఆశ్రమ జీవితాన్ని గడుపుటకు రహస్యంగా వెళ్ళవలసి వచ్చింది. ఆ దశలోనే తన ఉద్గ్రంథాలను రచించాడు. అంతే కాకుండా శాంతి సౌభాగ్యాలతో, ఆధ్యాత్మిక - వాస్తవిక దృక్పథాలతో సరియైన మానవ సహజీవనమును పెంపొందించుటకు పాండిచ్చేరిలో జాతిబేధ రహిత (cosmopolitican) మరియు అంతర్జాతీయ నగరంగా (Aurovill) "ఆరోవిల్"ను అభివృద్ధిపరిచారు. అరవిందుడు, తన ప్రభావంతో తన ఆశ్రమంలో స్థిరపడి 'ది మదర్'గా పిలువబడిన ఫ్రెంచి స్త్రీ - వీరిద్దరి కృషి వలన 'ఆరోవిల్' ప్రపంచ ప్రసిద్ధి గాంచింది.

అరవిందుని తత్వ విచారము ఒక రకంగా ప్రాచీన భారత తత్వ విచారమే. ఆయన దానిని నూతన కోణంలో చూపించాడు. దానిలో యదార్థ జీవితపు విలువలు వాటి ప్రాసంగిత (Relevance)లను బహిర్గతపర్చాడు. అరవిందుని తత్వ విచారమును ఒక్కమాటలో 'భారతదేశ ఆదర్శవాదము యూరప్ భౌతిక వాదముల సరికొత్త మేలికలయికగా' కొందరు భావించారు.

## 8.2 అరవిందుని అతి భౌతిక వాదము :-

అరవిందుడు భారతదేశ ఆధ్యాత్మికతను వేదాంత దర్శనములలోను, బుద్ధుని బోధనలను కనుగొన్నాడు. లేకపోతే కాలక్రమేపి ఆధ్యాత్మికత, బౌద్ధ ప్రభావముల పటుత్వము తగ్గి, వాస్తవ జీవితానికి సంబంధము లేని త్యాగము, వైరాగ్యము, సన్యసించుట వంటి భావాలు తలెత్తి, ప్రపంచ తాత్విక చింతనలలో భారతదేశ ప్రాధాన్యతను వెనుకబడేటట్లు చేసిందని అరవిందుని అభిప్రాయము.

అందువలననే భారతీయ ఆధ్యాత్మికత, బుద్ధుని సామాజిక దృక్పధము, పాశ్చాత్య పదార్థ వాదము (matirialism)ల మేళవింపుతో తన తత్వవిచారాన్ని (పెంపొందించాడు) అభివృద్ధిపరచాడు.

అరవిందుని దృష్టిలో అత్యున్నత వాస్తవికత గతి తార్కికమైనది మరియు బహుముఖత్వము కలది (Supreme realisly is dynamic and multiplicity). ఆ విధంగా ఏకత్వము భిన్నత్వములు రెండూ యదార్థములే. ఈ గుణమును అతి చిన్న పరిస్థితి నుంచి ప్రపంచ పరిస్థితి వరకు చూడవచ్చునని అరవిందుని ధృడ అభిప్రాయము. కాకపోతే భారతీయ ఆధ్యాత్మికత దృష్ట్యా చెప్పాలంటే 'కనిపించే దానికి వెనుక చైతన్యము లేక చిదాత్మ (spirit) వున్నదని గ్రహించి ఆ విధంగా బ్రహ్మ పదార్థమును (Brahman) గ్రహించుటే మానవ ధర్మము. ఇట్టి దానిని గ్రహించుట మానవుని గ్రాహకశక్తి మరియు మానసిక స్థాయి (consciousness) పెరుగుతున్న కొద్ది సులభతరమవుతుంది. అలాగని అరవిందుడు పండిత - పామరుల మధ్య వ్యత్యాసాన్ని చూపలేదు. అంతే కాకుండా ఇట్టి జ్ఞాన సముపార్జనకు ఒకే నిర్దుష్ట మార్గాన్ని కూడా అంగీకరించలేదు. ఏ మార్గము ద్వారా వెళ్ళిన (తాత్విక మార్గం, యోగ మార్గం, యదార్థ జీవన మార్గం) బ్రహ్మ పదార్థ జ్ఞానమును గ్రహించవచ్చు. అంతే కాకుండా ఇట్టి సత్యమును మానవ నిత్య జీవితము నుంచి గ్రహించుటే కాక, అట్టి అనుభవసారము మానవ సంబంధాల మెరుగుకు తోడ్పడాలి.

మానవ జీవితములో రెండు స్థాయిలు - తక్కువ, ఎక్కువ స్థాయిలుంటాయని అరవిందుడు భావించాడు. తక్కువ స్థాయిలో (lower level) భౌతిక అవసరాల దృష్ట్యా, ఎక్కువ స్థాయిలో (higher level), ఆధ్యాత్మిక అవసరాల (spiritual needs) దృష్ట్యా వివిధ ప్రదేశాలలోవున్న అన్ని జాతులు మానవ శ్రేయస్సు కొరకు కృషి చేస్తాయని అరవిందుని భావన. అయితే అరవిందుని ప్రత్యేకత ఏమిటంటే మానవుని స్వీయ నిర్ణయాధికారాన్ని, అభివృద్ధిని మరొకరు (మతాధిపతి, ప్రవక్త మరియు రాజు) శాసించరాదని చెప్పుట.

## 8.3 జాతీయవాదము - మానవ ఐకమత్యము (Nationalism - Human Unity) :-

అరవిందుడు ఇండియాకి తిరిగి వచ్చిన తరువాత, మితవాద రాజకీయ వాదుల (Modaralis) పనితీరును, వాస్తవ పరిస్థితులను పరిశీలించిన మీదట వారి పై నమ్మకాన్ని కోల్పోయాడు. భారతదేశ విముక్తికి కావలసిన సన్నాహాలు, అందుకవసరమైన ధైర్యము సామర్థ్యములు మితవాదులలో అరవిందునికి కన్పించలేదు. వారిలోని పోకడలు సంకుచిత పరిమిత వర్గ ప్రయోజన ధోరణులు ఈయనకు అంగీకారము కాదు. మితవాదుల పై నున్న అసంతృప్తి చివరికి 1907లో సూరత్ కాంగ్రెస్ సమావేశాలలో చీలికకు దారి తీసి, అతివాదులు వేరైపోయారు. వీరిలో అరవిందుడు ప్రముఖుడు.

అతివాదుల భారతదేశ ఆధ్యాత్మికతను నమ్మినవారు. దాని నుండి ప్రేరణ పొంది భారతదేశ పునర్ నిర్మాణమునకు కంకణము కట్టాలని నమ్మారు. కాకపోతే, దేశవిముక్తి, పునర్ నిర్మాణము సాధ్యమైనంత త్వరలో జరగాలని, అవసరమైతే దౌర్జన్య పద్ధతుల (voilent struggle) ద్వారానైనా వీటిని సాధించాలని వారి ధ్యేయము. 'స్వరాజ్యము' అన్న పదానికి అర్థము కూడ వీరి దృష్టిలో ఇదే. మరోలా చెప్పాలంటే మితవాదులు భారతదేశ నిర్మాణము (political and economic restructive) దేశ విముక్తికి (political independence) దారి తీస్తుందని భావించగా, అతివాదులు దీనికి భిన్నంగా దేశవిముక్తి, స్వదేశ పునర్ నిర్మాణమునకు దారి తీస్తుందని తలంచారు.

జాతీయవాదము జీవముతో నిండిన ధ్యేయము, పట్టుదల మరియు ఆచరణాత్మక కార్యక్రమాల ప్రోదిగా అతివాదులు భావించారు. స్వధర్మమునకు సమాజ ధర్మమునకు మధ్య తేడా లేదని వీరు నమ్మారు. అందువలననే జాతీయవాదమును జాతి ఔన్నత్యము కొరకు ఉపయుక్తమయ్యే ప్రేరణాశక్తిగా భావించారు. జాతి పునర్ నిర్మాణములో ఏలాంటి సంకుచిత భావాలు, ముఖ్యముగా ప్రజలను గుంపులు గుంపులుగా విభజించేవిగా ఉండరాదు. అనగా వారి దృష్టిలో జాతి అనేది జాతి నిరా ప్రక్రియలో సమాన భాగస్వాముల కలయిక.

అరవిందుడు నిష్క్రియ ప్రతిఘటన (Passive Resistance) అను భావనను ప్రతిపాదించారు. ఐర్లాండులోని 'సిన్‌ఫెన్. (Sinn Fein) ఉద్యమము నుండి ఈ భావనను గ్రహించి, బ్రిటీష్ వారితో ఎట్టి సంబంధము లేకుండా స్వదేశ సంస్థలు సర్వీసులతో, జాతి పునర్ నిర్మాణము చేయాలని ప్రబోధించారు. ఆయన ఉద్దేశములో జాతీయవాదమనేది పాశ్చాత్యభావమైనప్పటికి, దాని భావము మరియు ఆచరణ భారతదేశ చరిత్రకు క్రొత్తదేమి కాదు.

తోటి అతివాదుల మాదిరి అరవిందుడు కొన్ని అతివాద రాజకీయ పద్ధతులను స్వదేశ స్వాతంత్రము కొరకు సమర్థించారు. సాయుధ పోరాటము, వివిధ రకాలైన బహిష్కరణలను (ఆర్థిక, విద్యాలయ, కోర్టులు బ్యురోక్రసీ, బ్రిటిష్ సహకారులను సాంఘీకంగా బహిష్కరించుట) సమర్థించారు.

ఆనాటి భారత పరిస్థితులకు శాంతియుత ప్రతిఘటన అనుకూలమే అయినప్పటికి, సాయుధ పోరాటంపట్ల అరవిందుడు విముఖత చూపలేదు. హింసాయుత పద్ధతులకు వెనుకాడుటను అరవిందుడు బలహీనతగా భావించాడు. స్వాతంత్రము ఏ దేశానికైనా ప్రాణపదమైనది. ఒక వ్యక్తి పీకను మరొక వ్యక్తి నులుముతూ వుంటే, అందుబాటులోవున్న ఏ సాధనంతోనైనా ఆత్మ రక్షణ కోసం ఎలా ప్రయత్నిస్తాడో అలాగే ప్రజా జీవనానికి భంగం కల్గుతున్నప్పుడు సాయుధ పోరాటమైనా న్యాయబద్ధమేనని అరవిందుడు అభిప్రాయపడినాడు. హింసకు ప్రతిహింస తప్పని సరి. అరవిందుడు తన రాజకీయ జీవితంలోని తొలి దినాలలో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా సాయుధ పోరాటం సాగించటం సాధ్యమని తలంచినాడు. 1905 సం॥లో అరవిందుడు రచించి ప్రచారం చేసిన "భవానీ మందిరం" బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా సాయుధ పోరాటాన్ని సూచించింది. వ్యవస్థాపరంగా తగిన జాగ్రత్తలు తీసుకుంటే సాయుధ విప్లవం సాధ్యమేనని అరవిందుడు అభిప్రాయపడినాడు.

అరవిందుడు వివిధ రకాల బహిష్కరణలను సమర్థించాడు. ఆర్థిక, విద్యలయాల, క్టోర్టు, బ్యూరోక్రసి, సాంఘీక బహిష్కరణలున్నాయి. బ్రిటీష్ జాతి వ్యాపార జాతియని, బ్రిటీష్ వ్యాపారాభివృద్ధికి భారతదేశం ముడి సరుకులను ఉత్పత్తి చేసి వారి ఉత్పత్తులకు మార్కెట్‌గా ఉపయోగపడుతున్నదని అరవిందుడు పేర్కొన్నాడు. భారతదేశ ప్రజలు కనుక బ్రిటీష్ వారి ఉత్పత్తులను కొనుగోలు, వినియోగం చేయకుండా వుంటే మన దేశంలో కొనసాగుతున్న బ్రిటీష్ పాలనను చావు దెబ్బతీయవచ్చని అరవిందుడు అభిప్రాయపడినాడు. విదేశీ వస్తువులకు బదులుగా భారతీయులు స్వదేశీ వస్తువులను ఉపయోగించాలని ఫలితంగా ఆర్థిక స్వావలంబన సాధ్యమని ఒక్కాణించాడు. అనగా ఆర్థిక బహిష్కరణ వలన బ్రిటీష్ ప్రభుత్వాన్ని కూలద్రోయుటతో పాటు, స్వదేశీ పరిశ్రమలను ఉత్పత్తులను ప్రోత్సహించవచ్చు.

బ్రిటీష్ వారిచే నిర్వహించబడే విద్యా సంస్థల బహిష్కరణ కూడా భారత స్వాతంత్ర పోరాటంలో ముఖ్యమైన అంతర్భాగముగ ఉండాలని అరవిందుని అభిప్రాయము. అరవిందుని ప్రకారం ఆనాటి విద్యా విధానము జాతీయ భావాలకు విరుద్ధముగనున్నది. ప్రభుత్వం పట్ల విద్యార్థులలో విధేయతను పెంపొందిస్తున్నది. కావున ప్రభుత్వ ఆధిపత్యంతో లేదా ధన సహాయంతో నడిచే విద్యా సంస్థలకు తమ పిల్లలను పంపవద్దని తల్లి దండ్రులకు విజ్ఞప్తి చేశాడు. ప్రత్యామ్నాయంగా జాతీయ విద్యా విధానమును అభివృద్ధిపరచాలని కోరాడు.

వీటితో పాటు న్యాయస్థానాల బహిష్కరణను కూడా ఉపయుక్తమైన ఆయుధంగా అరవిందుడు భావించి కోర్టులను బహిష్కరించాలని న్యాయవాదులకు విజ్ఞప్తి చేశాడు. అదే విధంగా బ్యూరోక్రసి / ప్రభుత్వ కార్యవర్గం ప్రజలందించే సహకారం పైనే ఆధారపడి ఉంటుందని, భారతీయులు తమ సహకారాన్ని ఉపసంహరించుకుంటే బ్రిటీష్ ప్రభుత్వ పతనమౌతుందని భావించాడు. బహిష్కరణ పిలుపుకు భిన్నంగా బ్రిటీష్ పాలనకు సహకరించిన వారిని సంఘ బహిష్కరణ చెయ్యాలని, వారిని విందులు, పండుగలు, వివాహాది సుభకార్యములకు అనుమతించరాదని అరవిందుడు పేర్కొన్నాడు.

అరవిందుని పై ఇటలీ జాతీయవాది 'మాజని' (Mazzini) ప్రభావము చాలా వుంది. అరవిందుని దృష్టిలో జాతీయాదము ఒక మతము వంటిది, అయితే అది ప్రజలకు ఉపయోగపడే పరిస్థితిని సృష్టించే సాధనముగా ఉండాలి. దాదాపు మిగిలిన అతివాదుల

మాదిరి ఈయన కూడ భారతావనిని మాతృమూర్తిగా భావించారు. అందువలననే మాతృ దేశ దాస్య శృంఖలాలను ఛేదించుటకు తపస్సు జ్ఞానము శక్తి అవసరమని భావించాడు. ఇలాంటి భావన పాశ్చాత్యులకు ముఖ్యంగా బ్రిటీష్ వారికి కూడ వుందనియు, వారు ఆ భావనము తాత్విక క్రమశిక్షణ మరియు శక్తి సామర్థ్యాల పేరుతో పిలుస్తారని అరవిందుడు పేర్కొన్నాడు.

భారతదేశంలో ఆధ్యాత్మిక జ్ఞానము, ధృఢ సంకల్పము మరియు సమిష్టి కృషికి సంబంధించిన ప్రేరణలు - వేదాలు, ఉపనిషత్తులు భగవద్గీతలో ఉన్నాయని అరవిందుని ధృఢనమ్మకము. ఈ ఆధ్యాత్మిక చింతన కేవలం దేశ సాంఘిక ఆర్థిక రాజకీయ పరిస్థితులకే పరిమితము కాక, స్వేచ్ఛ, సమానత్వము, ఐక్యతలకు సంబంధించినదని అరవిందుడు నొక్కి చెప్పారు. అలానే జాతీయవాదము కేవలము కొన్ని దేశ పరిస్థితులకు సంబంధించినదిగా కాని, ఒక దేశ గొప్పతనమును చాటేదిగా కాని వుండరాదని ఒక్కాణించారు. జాతీయవాదము ఒక ఆధ్యాత్మిక చింతన అది ఒక దార్శనిక ధృక్పథము. దేశ పురోగతి మానవత్వపు విలువలను ఆచరించుటలో వుంటుంది. అందువలననే జాతీయవాదము కాని, మానవతావాదము కాని మానవుని అంతఃకరణములో వుండాలి. అలాంటి పరిస్థితులలో మాత్రమే దేశ పురోభివృద్ధితో పాటు ప్రపంచ ఏకీకరణ (world union) సాధ్యమౌతుంది. అయితే దేశములో వ్యక్తుల వలె ప్రపంచ ఏకీకరణలో జాతులు స్వేచ్ఛ, సమానత్వము, ఐక్యతలను పోగొట్టుకోకూడదు. అప్పుడే అది ఒక రకమైన ప్రపంచ సమాఖ్య (world federation) అవుతుంది.

అరవిందుని యొక్క అంతర్జాతీయ వాదము / మానవ ఐకమత్యము క్రమేపి పురోభివృద్ధి చెందుతున్న మానవ సహజీవన వ్యవస్థ. కుటుంబము, తెగ, జాతి, సమాజము మరియు రాజ్యము - ఇవన్ని వివిధ స్థాయిలలో మానవుల అవసరాల దృష్ట్యా ఒక రకమైన అవగాహనలు, సహకారాలు అందించుకునే పరిస్థితులు. అయితే ఈ వివిధ దశలలో రెండు రకాల అవసరాలు భౌతిక మరియు మానసిక అవసరాలుంటాయని అరవిందుడు విశ్లేషించాడు. ప్రతి దశలోను భౌతిక అవసారల దృష్ట్యా కొన్ని రకాలైన మానవ సంబంధాలు మరియు మానసిక అవసరాల దృష్ట్యా మరికొన్ని రకాల మానవ సంబంధాలు వుంటాయని అరవిందుడు వివరించాడు. ఈయన దృష్టిలో మానసిక అవసరాలు అనగా వివిధ ప్రాంతాలలో నివసిస్తున్న జాతులందరిలో, మానవులంతా సమానమని భావించి తదనుగుణంగా వ్యవహరించాలి. కాకపోతే ఈ రెండు రకాల అవసరాలలోను ఏ ఒక్కటి తక్కువ కాగూడదని చెపుతూ మానవ మనుగడకు మానసిక అవసరాలు మాత్రమే అంతర్జాతీయ మరియు మానవ ఐకమత్యములను పెంచేవని నొక్కి వక్కాణించారు. మొదటి ప్రపంచ యుద్ధానంతరం వలస వ్యవస్థ నుంచి విముక్తి పొంది ఆవిర్భవించిన నూతన రాజ్యాలు లేదా జాతులు, ఇలాంటి మానసిక అవసరాలను గ్రహించి తమ రాజకీయ జీవితను నిర్ణయించుకోసాగాయి. మరొకమాటలో చెప్పాలంటే అరవిందుని దృష్టిలో అంతర్జాతీయ వాదము మరియు మాన ఐకమత్యము పెంపొందాలంటే, కుటుంబము నుంచి అంతర్జాతీయత వరకు ఏ స్థాయిలోను వ్యక్తి గుంపు నలిగిపోకూడదు. దీనిని గ్రహించి మానవ శ్రేయస్సుకు పాటుపడాలనే (superconsciousness) తపననే మానసిక అవసరతగా అరవిందుడు భావించాడు. ఇట్టి గ్రహింపునే అరవిందుడు superconsciousness గా పిలిచాడు.

## 8.4 రాజ్య భావన (State idea) :-

అరవిందుని దృష్టిలో రాజ్యమనేది మానవ సహజీవనాన్ని గూర్చి ఏర్పడ్డ ఒక రకమైన దశ. కుటుంబము, తెగ, జాతి, సమాజము, రాజ్యము, అంతర్జాతీయత - ఇవన్నియు వివిధ స్థాయిలలో మానవ సహజీవనానికి ఉపయోగపడే స్థాయిలు. ప్రతి దశ అవసరమైనదే. ప్రతి దశలోను సత్ఫలితాలు దుష్ఫలితాలు ఉంటాయి. ఏ దశనూ పూర్తిగా విస్మరించలేమని అరవిందుని భావన. కాకపోతే రాజ్య భావన మరియు వ్యవస్థలో కష్టనష్టాలు అధికమని ధృడంగా విశ్వసించాడు. అలాగని రాజ్యము అసలుండరాదని కాని, దాని అవసరత లేదని కాని ఆయన ఉద్దేశము కాదు. రాజ్యము, వ్యక్తి శ్రేయస్సును పెంచేదిలా వుండాలే కాని, నియంత్రించేదిలా వుండరాదు. మానవ జీవితాన్ని గురించి, అసలు సృష్టి గురించి తాత్విక చింతన చేసిన వారు, రాజ్యమనే వ్యవస్థను ఒక సాధనంలా మాత్రమే ఉపయోగిస్తారని అరవిందుడు నమ్మాడు. కాకపోతే వాస్తవంలో వున్న దాదాపు అన్ని రాజ్యాలు, అలా వ్యక్తి శ్రేయస్సును పెంచేదిగా లేవని కూడా గ్రహించాడు.

ముఖ్యంగా ఐరోపా రాజ్యాలు సామూహిక అహంకారం (collective ego)ను సైనిక రాజకీయ ఆర్థిక సిద్ధాంతాల పేరిట వ్యక్తి స్వేచ్ఛ శ్రేయస్సులను కాలరాస్తున్నాయని గ్రహించాడు. ఈ పరిస్థితి ఎంత క్షోభకరంగా ఉన్నప్పటికి ఆశా భావమును కోల్పోవద్దని ఉద్బోధించాడు. అలాగే ఆధునిక రాజకీయ వేత్తలు పాటిస్తున్న స్వార్థ, అహంకార, సాంప్రదాయ, సంకుచిత పద్ధతులు ప్రజలను దాస్యంలోకి నెట్టుచున్నప్పటికి, ప్రతి వ్యక్తి తమ జీవితాన్ని చక్కబరచుకునే శక్తిని కోల్పోరాదని భోదించాడు. అంతే కాకుండా రాజ్యమును గురించిన ఆయన ఆలోచన మరొక అడుగు ముందుకు వెళుతుంది. ఆయన ఉద్దేశంలో ప్రాచీన కాలంలో అత్యున్నత ఆదర్శాలు / సూత్రాల పేరుతో నడుపబడిన పరిపాలనలోను, సమకాలీన కాలంలో ఎంత మంచి వారిచే నడుపబడుచున్న రాజ్యాలలోనైన, రాజ్యము దాని ప్రయోజన దృష్టి మాత్రం వుండలేదని అరవిందుడు నొక్కి చెప్పాడు.

ఆధునిక పాశ్చాత్య భావాలైన ప్రజాస్వామ్యము (Democracy) మరియు సామ్యవాదము (Socialism)లు అరవిందునికి పూర్తిగా అంగీకారము కాలేదు. కేవలము భావనలో కన్నా వాటి వికృత స్వరూపాలు వాస్తవంలో మరీ ఎక్కువగా కన్పించాయని అరవిందుడు వాపోతాడు. ఈ రెండు వ్యవస్థలు వ్యక్తిని పూర్తిగా అణగద్రొక్కి సామూహిక అహం (collective ego)ను పెంపొందించాయి. ఈ పరిస్థితినే ఒక సందర్భములో మెజారిటీ నిరంకుశత్వం (tyrammy of majority) అను పేరుతోనూ, మరొక సందర్భములో దేశ లేక ప్రజల శ్రేయస్సు పేరుతోనూ, పిలుస్తూ వ్యక్తిని నిరశిస్తూ సమూహం లేదా గుంపు కొరకు తనను త్యాగం చేసుకోమని బోధిస్తాయి. ప్రభుత్వాలే కాక వాటిని సమర్థించే ప్రజా సమూహాలు రాజకీయ పక్షాలు ఇట్టి దుర్బోధలనే చేస్తాయి. అంతే కాకుండా ఈ వ్యవస్థలలోనే ప్రజాస్వామ్యము సామ్యవాదముల పేరిట వ్యక్తి లేక గుంపు లేక దేశ ఆధిపత్యము కొరకు ప్రయత్నిస్తారు. అందువలననే ఈ ఆధునిక ప్రపంచంలో కూడ సైనిక, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక ఆధిపత్యాల కొరకు పోరు తీవ్రతరమౌతున్నది. పెట్టుబడిదారీ విధానము, సామ్యవాదముల మధ్య పోటీ కూడ ముఖ్యంగా ఆధిపత్యము దృష్ట్యానే తప్ప, వ్యక్తి శ్రేయస్సు దృష్ట్యాకాదని అరవిందుడు అభిప్రాయపడినాడు. ఈ వ్యవస్థలలో క్రమేపి రాజ్య ఆధిపత్యము, జోక్యము పెరుగుతున్న కొద్దీ వ్యక్తి స్వేచ్ఛను, స్వీయ నిర్ణయాధికారమును కోల్పోతున్నాడు.

## 8.5 వ్యక్తి - సమూహము / సమాజము :-

అరవిందుని సామాజిక మరియు రాజనీతి తత్వ విచారమంతయు, ఒక రకంగా చెప్పాలంటే స్వేచ్ఛా అనే భావన దృష్ట్యా లేక వ్యక్తి - సమూహము / సమాజము భావన దృష్ట్యా అర్థం చేసుకొనవచ్చు. అరవిందుడు ఒక రకంగా ప్రయోజన వాది (teleologist) సృష్టి లేక మానవాళితో కూడిన ప్రపంచము పురోభివృద్ధి గాంచుతూనే ఉంటుంది. దీనినే చిదాత్మ లేక చేతనము యొక్క పురోభివృద్ధి అనియు, మానవాళి దృష్ట్యా ఆ చేతన శక్తియే మనిషి అంతరాత్మను గూర్చి తెలుసుకుంటూ, మానవ శ్రేయస్సు కొరకు పాటుపడుట అనియు అతి స్థూలము అరవిందుని తత్వము తెల్పుతుంది. ఇట్టి పురోభివృద్ధిని ఆంగిక సమైక్యములా (organic unity) చూపించినప్పటికి, అరవిందుని దృష్టిలో ప్రతి భాగము లేక వ్యక్తి ఒక నిర్దిష్ట స్థానములో స్వతంత్ర ప్రతిపత్తిని కల్గిన భాగము.

సామాజిక శాస్త్ర దృష్ట్యా చెప్పాలంటే మానవాళి మనుగడ తత్వము, వ్యక్తి - సమూహముల మధ్య సంబంధముగ గ్రహించాలని అరవిందుని భావము. ప్రకృతిలో మాదిరిగానే మాన సమాజంలో కూడ వ్యక్తి (భాగము) - సమూహము (whole)ల సమన్వయము అతి కీలకమైనది. ఆ సమన్వయయముల నిష్పత్తులు మారుతూ ఉంటాయి. వ్యక్తులు లేకుండా కుటుంబము కాని, తెగ కాని, జాతి కాని, సమాజము కాని, రాజ్యము కాని, అంతర్జాతీయత కాని లేవు. అలాగని వ్యక్తులు మాత్రమే వుండి సామూహిక జీవనము లేకుండ ఉండదు. వ్యక్తుల భౌతిక మరియు మానసిక అవసరాల దృష్ట్యానే ఆ సామూహిక సహజీవన స్థితులు ఏర్పడతాయి. కాకపోతే అరవిందుని దృష్టిలో వ్యక్తులు ప్రతిచోట ఆ సామూహిక జీవనంలో నలిగిపోతున్నారని అరవిందుడు చింతించాడు. దానికి గల కారణమేమనగా సమూహపరంగా ఉన్న విలువలు సంస్థలు వ్యక్తి వికాశమును కాలరాస్తాయి. అందున రాజ్య వ్యవస్థలో వ్యక్తి మరి అధికంగా నలిగిపోతాడని అరవిందుడు స్పష్టపరచాడు. ఈ సందర్భముగ మూడు ఉదాహరణలు ఇవ్వబడినవి.

1. వ్యక్తిని అధీనంలో ఉంచిన రాజ్యాలు - ప్రాచీన స్పార్టా, ఆధునిక జర్మనీ;
2. వ్యక్తికి తగినంత స్వేచ్ఛ, శక్తి, గౌరము ఇస్తూ వ్యక్తిని నియంత్రణలో వుంచిన రాజ్యాలు - ప్రాచీన ఏథెన్స్, ఆధునిక ఫ్రాన్స్;
3. వ్యక్తి స్వేచ్ఛ, వికాసము మరియు గౌరవములకు పాటుపడిన రాజ్యము - బ్రిటన్.

కానీ మూడవ రకమైన రాజ్యము క్రమశిక్షణ (Discipline) మరియు సమర్థవంతమైన వ్యవస్థీకరణ (efficinet organisation)ల పేర్లతో అసలైన రాజ్య ప్రయోజనాన్ని దెబ్బతీశాయి. ఈయన దృష్టిలో అసలైన రాజ్య ప్రయోజనము వ్యక్తి తన భౌతిక మనో వికాసమును పెంపొందించుకో గల పరిస్థితులను రాజ్యము కల్పించుట.

అరవిందుడు ప్రపంచ రాజ్యము (world state), లేక ప్రపంచ ఏకత్వము (world union) అనే భావనను సమర్థించాడు. కాని ఆ భావనలో లేక స్థితిలో కూడ వ్యక్తులు తమ ఉనికిని కోల్పోరాదని స్పష్టపరచాడు. ఈ విధమైన మానవాళి మనుగడ గూర్చిన ప్రాచుర్యము నొందకలేక పోవుటకు కారణము ఆయన ఉపయోగించిన భాష, ఆలోచన స్థాయి మరియు ఊహాత్మకమైన మానవ మనుగడ సరళి సామాన్యులు గ్రహించకపోవుటే. ఆయన రాజనీతి తత్వాన్ని పాశ్చాత్య రాజనీతి తత్వవేత్తయైన హెగెల్ రాజనీతి తత్వముతో పోల్చుట పరిపాటియైనది. కాని ప్రముఖ భారత రాజనీతి తత్వ బోధకుడైన 'వి.పి. వర్మ' వివరించినట్లుగ 'హెగెల్ వాదము'లో కన్నా అరవిందుని వాదంలో వ్యక్తి వికాశము మనుగడ గౌరవములకు విశిష్ట స్థానమున్నది.

## 8.6 సారాంశము :-

అరవిందుని మేథా సంపత్తి తాత్విక విషయాలలోను, ఆంగ్ల భాషా పటిమలోను సాంఘీక పునః వ్యవస్థీకరణను వివరించుటలోను వ్యక్తమవుతుంది. అందువలననే ఆయన భావాలు చాలా మంది మేధావులకు మార్గోపదేశమైనవి. అరవిందుడు భారతదేశ ఆధ్యాత్మికతను వేదాంత దర్శనములలోను, బుద్ధుని బోధనలను కనుగొన్నాడు. అరవిందుని దృష్టిలో రాజ్యమనేది మానవ సహజీవనాన్ని గూర్చి ఏర్పడ్డ ఒక రకమైన దశ. అరవిందుని సామాజిక మరియు రాజనీతి తత్వ విచారమంతయు, స్వేచ్ఛా అనే భావన దృష్ట్యా లేక వ్యక్తి-సమూహము/సమాజము భావన దృష్ట్యా అర్థం చేసుకోవచ్చు.

## 8.7 మాదిరి ప్రశ్నలు :-

1. అరవిందుని అతి భౌతికవాదము గూర్చి వివరింపుము?
2. జాతీయవాదము - మాన ఐకమత్యము గుర్చి వ్రాయుము?
3. అరవిందుని దృష్టిలో రాజ్య భావన అంటే ఏమిటి? దీన్ని గూర్తి వ్రాయుము?

## 8.8 ఆధార గ్రంథాలు :-


1. Varma, V.P. - Modem Indian Political Thought
2. Sankar Ghose - Modem Indian Political Thought
3. Bali D.R. - Modem Indian Thought

పాఠం - 9

# మహాత్మాగాంధీ - I

## 9.0 లక్ష్యం :-

మహాత్మాగాంధీ - I పాఠం యొక్క లక్ష్యం గాంధీ భావాలకు, సిద్ధాంతానికి గల ప్రాతిపదికలను వివరించడం, గాంధీతత్వానికి కీలకమైన 'సత్యం', 'అహింస' అనే భావనలను గాంధీ అర్థం చేసికొన్న క్రమాన్ని వివరించడం మరియు వాటి ఆచరణను అనగా సత్యం, అహింసలను వ్యక్తిగత జీవితంలోను, భారత జాతీయ ఉద్యమంలో జరిపిన అనేక పోరాటాలలో గాంధీ ఎలా అన్వయం చేశాడో వివరిస్తూ ఆయా సందర్భాలలో మార్గాలకు, లక్ష్యాలకు మధ్య ఎట్టి సంబంధం వుండాలని బోధించాడో కూడా వివరించడం. అంతేగాక మహాత్మాగాంధీ - II పాఠం లక్ష్యం రాజ్యం, ప్రభుత్వం, ఆస్తి, ధర్మకర్తృత్వం, మతము, మతసామరస్యం, వర్ణవ్యవస్థ మరియు సామాజిక అసమానతలు అనే అంశాల పై గాంధీ భావనలు వివరించడం. మరియు గాంధీ ఆదర్శమైన 'స్వరాజ్యం' అందులోని ముఖ్య భాగమైన వికేంద్రీకరణను వివరించడంతో పాటు స్త్రీలు, యుద్ధం మరియు కార్మిక సంఘ ఉద్యమం పై గాంధీ దృక్పధాన్ని వివరించడం.

## విషయసూచిక :-


9.0 లక్ష్యం

9.1 ఉపోద్ఘాతం

9.2 గాంధీతత్వానికి ఆధారాలు

9.3 అహింస మరియు సత్యాగ్రహం : మార్గాలకు, లక్ష్యాలకు మధ్య సంబంధం

10.4 రాజ్యం మరియు ప్రభుత్వం - భావనలు

10.5 ఆస్తి హక్కు మరియు ధర్మకర్తృత్వ సూత్రం

10.6 మతము మరియు మతసామరస్యం

10.7 వర్ణవ్యవస్థ మరియు సామాజిక అసమానతలు

10.8 స్వరాజ్య ఆదర్శం

10.9 వికేంద్రీకరణ

10.10 స్త్రీలు, యుద్ధం మరియు కార్మిక సంఘు ఉద్యమాల పై దృక్పధం

10.11 సారాంశము

10.12 మాదిరి ప్రశ్నలు

10.13 ఆధార గ్రంథాలు


## 9.1 ఉపోద్ఘాతం :-

20వ శతాబ్దంలో భారతదేశం వలస పాలనలో కొనసాగుతున్నప్పుడు దేశ రాజకీయాలను తన సిద్ధాంతంతోను, ఆచరణతోను గాఢంగా ప్రభావితం చేసిన గాంధీని ఆచరణాత్మక, క్రియాశీలక తత్వవేత్తగా ప్రపంచం గుర్తించింది. ఆ గుర్తింపును అతని పేరుతో

కలిసిపోయిన మహాత్మా (మహా + ఆత్మ) అనే పదాన్ని బట్టి అంచనా వేయవచ్చు. అతని సిద్ధాంతానికి, కార్యాచరణకు ప్రాతిపదిక అయిన ఆత్మ లేక దైవం లేక సత్యం నందు విశ్వాసంతో, నిత్యమైన దైవాన్ని నిరంతరం భావించడం వల్ల 'యత్ భావం తత్ భవతి' సూత్రం ప్రకారం తన ఆత్మశక్తిని తాను గ్రహించిన దాన్ని వినియోగించే క్రమంలో దాని లక్షణమైన ప్రేమను పరోపకారంగా జాతిని నిర్మించడం, జాతిని బ్రిటీష్ సామ్రాజ్యవాదం నుంచి విముక్తి చేయడానికి పోరాడటం అనే రూపాల్లో ప్రకటించాడు. తత్ఫలితంగా మహాత్ముడు జాతిపిత అయ్యాడు. సత్యంలోని భాగమైన అహింస (ప్రేమ)పట్ల, నిరంతర దైవస్మరణ పట్ల గాంధీకి వున్న నిబద్ధతే అనేక హింసాత్మక ఘటనలను నిలువరింప చేయడమే గాక, అతను హత్యకు గురైనపుడు కూడా రామ నామాన్ని జపించేట్లు చేసింది.

గాంధీ కుటుంబ ప్రేమను, జాతి ప్రేమను, విశ్వమానవ ప్రేమను ఒకే స్థాయిలో చూపాడు. నేడు వ్యక్తి ఆలోచనలు మొదలుకొని కుటుంబ వ్యవస్థ, రాష్ట్రము, దేశము, ప్రపంచంలో మానవ సంబంధాలలో, రాజ్యాల సంబంధాలలో హింస నానాటికీ పెరుగుతున్న సందర్భంలో గాంధీ తత్వాన్ని తెలిసికోవడం అనేది మానవ జాతి మనుగడను పరిరక్షించడానికి, నైతికంగా సుసంపన్నం చేయడానికి అవసరం.

గాంధీ భావాలన్నీ మౌలికంగా మతాలలోనిదే అయినా నేడు ప్రపంచంలో ఘర్షణ (ఆర్థిక ప్రయోజనాలతో పాటు) మతవాదం వల్ల జరుగుతున్నా గాంధీ తత్వం వల్ల ఇబ్బంది ఏమీ ఉండదు. ఎందుకంటే గాంధీ ఉపయోగితా వాదాన్ని అలాగే మతాధికార రాజ్య వ్యవస్థను ప్రోత్సహించలేదు. ప్రపంచీకరణ నేపథ్యంలో జాతీయత, స్వరాజ్యం, స్వావలంబన, వికేంద్రీకరణ భావనలలో విశ్వమానవ ప్రేమకు ఆటంకం కాని పరిధిలో నేటి సమస్యలకు పరిష్కారం వెదకడం అవసరం.

## 9.2 గాంధీ తత్వానికి ఆధారాలు :-

గాంధీ వ్యక్తిత్వాన్ని తీవ్రంగా ప్రభావితం చేసినవారు ముఖ్యంగా ముగ్గురు. ఆధ్యాత్మిక నేత్త రాయ్‌చంద్ భాయి, టాల్‌స్టాయి, మరియు రస్కిన్. వీరే కాక ఎమర్సన్, థోరూలు కూడా వున్నారు.

అలౌకిక, అనంత సత్యం యొక్క ఉనికిని గూర్చి మొదటిగా తల్లి ద్వారా గాంధీకి సంక్రమించిన విశ్వాసమే అతని భావాలకు, ఆలోచనలకు, కార్యాచరణకు ప్రధానమైన ఆధారం అని చెప్పవచ్చు. ఇంద్రియ జగత్తుకూ, అలౌకిక సత్యానికి మధ్య కార్యాకారణ సంబంధాన్ని విశ్వసించాడు. నిరంతర చలనంతో కూడిన-జగత్తుకు ఆవల సృష్టి, స్థితిలయాలకు ఆధారమై, నిశ్చలంగా వున్న పర బ్రహ్మమే సత్యం అని గ్రహించాడు. కనుకనే మరణం మధ్య జీవాన్ని, అసత్యం మధ్య సత్యాన్ని, చీకటిలో వెలుగును చూడగలనని నమ్మాడు. సత్యం అనేదే మోక్షం రూపంలో అతని జీవిత గమ్యం కూడా. సత్యానికి చిత్ (చిత్ అంటే చైతన్యం / జ్ఞానం / ప్రేమ) మరియు ఆనందం అనే లక్షణాలున్నాయనే వైదిక విశ్వాసాన్ని కూడా గాంధీ గ్రహించాడు. ఈ అలౌకిక సత్యంలో ప్రేమ వుంటుంది. గనుక విషయ సంబంధమైన (భౌతికమైన) స్వార్థపూరిత ప్రేమ ద్వార గాక, నిస్వార్థమైన (అహింస) విశ్వప్రేమ (చరాచరాలను ప్రేమించటం) ద్వారానే సత్యంను చేరవచ్చునని గాంధీ నమ్మాడు. అందుకే నిస్వార్థ లేక పవిత్ర లేక నైతిక జీవనమే సత్యాన్వేషికి అవసరమన్నాడు గాంధీ. అట్టి జీవితానికి మనో శారీరక నిగ్రహం, త్యాగం అవసరం.

గాంధీ తండ్రి కరమ్ చంద్ పెద్దగా చదువుకున్నవాడు కాకపోయినా లోకజ్ఞానం కలవాడు. పెక్కు ఆస్థానాలలో పనిచేసినా ఆత్మగౌరవం కోల్పోకుండా గౌరవంగా బ్రతకగల్గిన ధైర్యవంతుడు. తండ్రి లక్షణాల ప్రభావం గాంధీ పై వుంది.

జైనుల ద్వారా అహింసా సూత్రాన్ని గాంధీ గ్రహించాడు. ఆహార విహారాదుల్లో ఏ జీవికి హాని కల్గించరాదనే దృష్టి వల్ల శాఖాహార నియమం ఏర్పడింది. సత్యానికి అనేక పార్శ్వాలున్నందున ఏ ఒక్కరూ సంపూర్ణ సత్యాన్ని గ్రహించలేకపోవచ్చు అనే జైన భావన పరమతాల, విశ్వాసాల పట్ల సహనాన్ని, గౌరవాన్ని బోధిస్తుంది. జైనులు నియమాలకే కాక వాటి ఆచరణకూ ప్రాధాన్యతనిచ్చారు. త్రికరణాల్లో ద్వేషాన్ని విసర్జిస్తూ అధర్మాన్ని ప్రతిఘటించడం అనేది మరో ముఖ్య సూత్రం. దీన్నించే గాంధీ సత్యాగ్రహ భావనను గ్రహించాడు. అలాగే ఉపవాసం ద్వారా శరీరాన్ని శోషింపచేసి మనసును, ఆత్మను శుద్ధి చేసికోవాలనే నియమం నుంచి నిరాహార

దీక్షను స్వీకరించాడు. అయితే అనేక సందర్భాలలో గాంధీజీ చేపట్టిన నిరాహార దీక్షలు తన పరిశుద్ధత కోసమే గాక ప్రజల సామాజిక, రాజకీయ చైతన్యాన్ని పెంచడానికి కూడా ఉపయోగపడ్డాయి. కొన్ని సందర్భాలలో ఆమరణ నిరాహార దీక్ష చేపట్టాడు. నశ్వరమైన శరీరాన్ని ఒక ధార్మిక సమస్య పై తనకు తానై (శరీర) త్యాగానికి గాంధీని సిద్ధపడేలా చేయడంలో 'భగవద్గీత' పాత్ర చాలా ఉంది. గాంధీ విద్యాభ్యాస నిమిత్తం లండన్ వెళ్ళేందుకు తల్లిని అంగీకరింప చేయడానికి ఒక జైనుని సమక్షంలో 'మద్యం, మాంసం, మగువ'లను ముట్టనని ప్రతిజ్ఞ చేశాడు.

బాల్యంలోనే పుస్తక పఠనం ద్వారా శ్రవణుని పితృ భక్తి, హరిశ్చంద్రుని సత్య వ్రతం గాంధీని ఆకర్షించాయి. తల్లిదండ్రుల యెడల గల భక్తి కోసం సర్వమూ త్యజించాలన్న నిశ్చయం గాంధీకి తర్వాత కల్గింది. అయితే రోగిష్ఠియైన తండ్రికి శ్రవణుని వలె సేవ చేయాలనుకొన్నా గాని తండ్రి మరణ సమయంలో భోగవాంచతో పడకగదిలో ఉన్నందుకు పశ్చాత్తాపపడ్డాడు. విషయ వాంఛల పట్ల వైరాగ్యం వుంటేనే త్యాగం సాధ్యమని గ్రహించాడు. తులసీదాసు రామచరిత మానసంను ఉన్నత గ్రంథంగా భావించాడు.

దివ్యజ్ఞాన సమాజం ద్వారా హిందూ గ్రంథాలు పరిచయం అయి ఆసక్తి కల్గింది. తత్వజ్ఞానంలో భగవద్గీత అసమానమైనదిగా భావించాడు. అందులో ముఖ్యంగా భౌతిక విషయాలను ధ్యానించే మనిషికి వాటి యందు ఆకర్షణ కలిగి, కోరిక కలిగి, తద్వారా కోపము కల్గును. మరియు కోపము వలన అవివేకము, అవివేకము వలన మతి భ్రమ కల్గి దాని వల్ల బుద్ధి నశించునని, బుద్ధి నసించినచో సర్వమూ నశించుననే విషయాలు గాంధీ మనస్సులో బాగా నాటుకొన్నాయి. గీతలోని కర్మ యోగ ప్రాధాన్యాన్ని గ్రహించాడు. సత్యాగ్రహ ఉద్యమంలో ఆశించిన ఫలితం రాక నిరుత్సాహం కల్గితే దాన్ని అధిగమించడానికి కర్మ యోగాన్ని అనాసక్తి యోగంగా (నిష్కామ కర్మగా) చేస్తే ఫలితం ఆశించడం వల్ల కలిగే దుఃఖం పోతుందని గ్రహించాడు. కర్మయోగం అనేది చేసే పనిలో దీక్షను, నైపుణ్యాన్ని పెంచుతుంది. అలా పని చేసి ఫలితాన్ని దైవానికి వదిలితే దైవమే మన పనికి తగ్గ ఫలితాన్నిస్తుందనే భావన కూడా గీత నుంచే స్వీకరించాడు. అలాగే సుఖ దుఃఖాలు మొదలగు ద్వంద్వాల ప్రభావానికి లోనుగాకుండా ఉండే స్థితి ప్రజ్ఞను కూడా గీత బోధిస్తుంది. గీతాబోధ ఆచరణకై గాంధీ తన జీవిత ప్రయత్నం చేశానన్నాడు. ఆధ్యాత్మిక ఔన్నత్యం కోసం భారతీయ, ముని సంప్రదాయంలోని బ్రహ్మచర్యాన్ని 40వ ఏట స్వీకరించి జీవితాంతం ఆ వ్రతాన్ని పాటించాడు.

గాంధీ న్యూటెస్టామెంట్‌లోని 'సెర్మన్ ఆన్ ది మౌంట్'ను గీతకు సాటిగా గుర్తించాడు. అందులో ముఖ్యంగా 'ఎవరు ఎట్లు చేయుదురో వారు అట్టి ఫలమనుభవింతురు. కాని అన్యాయముతో అన్యాయమును పారద్రోల లేరు. ఎవరేని నీ కుడి చెంప మీద కొడితే నీవు నీ ఎడమ చెంప కూడా వాని కేసి త్రిప్పు' అనే వాక్యాలు గాంధీని బాగా ఆకర్షించాయి.

లండన్‌లో చేసిన గ్రంథపఠనం యొక్క ప్రభావం గాంధీ పై చాలా ఉంది. ముఖ్యంగా కార్లైల్ వ్రాసిన 'వీరులు - వీరపూజ' అనే గ్రంథం వల్ల ఉన్నతాదర్శాలు, స్వార్థ త్యాగం, దేశ సేవ లాంటి భావాలు కల్గాయి. అలానే ఎడ్విన్ ఆర్నాల్డ్ గ్రంథాలైన 'Light of Asia' నుంచి బుద్ధుని జీవితంలోని సమానత్వం, శాంతి, అహింస భావలను, Song Celestial అనే భగవద్గీతానువాదంలో అనేక విషయాలు గ్రహించాడు.

గాంధీ పై రష్యన్ తత్వవేత్త టాల్‌స్టాయ్ రచనల ఉత్తరాల ప్రభావం చాలా ఉంది. చివర్లో టాల్‌స్టాయ్ సంపదను త్యజించి క్రైస్తవ మత సూత్రానుసారం శరీర శ్రమతో సాధారణ జీవితం గడపటం వల్ల 'సిద్ధాంతాలను ఆచరణలో పెట్టే నిబద్ధత'ను గాంధీ గ్రహించాడు. టాల్‌స్టాయ్ గ్రంథమైన 'The Kingdom of God is with in You' నుంచి మత భావాల కన్నా నైతిక జీవనం ముఖ్యం అని తెలిసికొన్నాడు. యుద్ధంలో తప్పనిసరిగా చేరాలనే నాటి జార్ ఉత్తర్వును అది అహింసకు వ్యతిరేకం అనే వాదంతో టాల్‌స్టాయ్ ధిక్కరించాడు. అలా అధర్మాన్ని ధిక్కరించడానికి అందరికీ నైతిక హక్కు వున్నదని గాంధీ గ్రహించాడు. అలాగే టాల్‌స్టాయి సూత్రీకరణ అయిన సొంత ఆస్తి వ్యవస్థ సర్వ అనర్థాలకు మూలం అనేది కూడా గాంధీకి బాగా నచ్చింది. ఈ ప్రభావంతోనే కుటుంబ భవిష్యత్ క్షేమం కోసం కట్టే ఇన్స్యూరెన్స్ ఆపేశాడు. మరియు వృత్తి ద్వారా ఆస్తి సంపాదించాలనే ఉద్దేశ్యాన్ని త్యజించాడు. కుటుంబం అనేదాన్ని విస్తృత అర్థంలో (సర్వమానవాళిని తన కుటుంబంగా) చూడాలంటాడు గాంధీ.

ఆరోగ్య మరియు అహింసా ధర్మ దృష్టితో శాఖాహారాన్ని సమర్థించడమే గాక తక్కువ ఖర్చుతో జీవించడం వల్ల, ఉదాహరణకు కారులో ప్రయాణం బదులు కాలినడక వల్ల ఆరోగ్యాభివృద్ధి, శరీర దృఢత్వత కలిగిందని గాంధీ అన్నాడు. అలాగే మానవ జన్మ దుర్లభం గనుక ఈ జీవితాన్ని గడపడం అనే విషయంలో సమయాన్ని కూడా జాగ్రత్తగా ఖర్చుపెడ్తూ సద్వినియోగం చేసికోడం నేర్చాడు. అలా క్రమంగా అంతరంగ, బహిరంగ జీవితాల మధ్య సమన్వయం కుదిరి జీవితం సత్యమయం అయి తృప్తి పొందేవాడు.

ఆహార నియమాలు, ఉపవాసాలు, నిరాహారాలను తాను ప్రారంభించిన టాల్‌స్టాయ్ ఆశ్రమంలోనూ ప్రవేశపెట్టాడు. గీతలో చెప్పినట్లుగా నిరాహారికి శబ్దాది విషయసుఖాలు వత్తిడి తగ్గును. ఇంద్రియ నిగ్రహానికి ఉపవాసాలు పనికి వస్తాయి. ఉపాధ్యాయులు తాము చేసిన పనులే పిల్లలకు నేర్పాలని, తాము చేయని పనులు పిల్లల చేత చేయించ కూడదనే (ఈ ఆశ్రమంలో) నియమాన్ని పాటింపచేశాడు. ఆత్మశిక్షణ విద్యాభ్యాసంలో ఒక భాగమని ఇక్కడ గ్రహించాడు. ఆత్మశిక్షణ అంటే శీల నిర్మాణం మరియు ఈశ్వర సాక్షాత్కారం పొందడమని అన్నాడు. శరీరానికి ఉన్నట్లుగానే బుద్ధికి, ఆత్మకు వ్యాయామం అవసరం. అయితే ఉపాధ్యాయుని నడత, శీలం వల్లనే విద్యార్థులకు ఆత్మశిక్షణ అలవడుతుంది. అంటే ఇక్కడ ఉపాధ్యాయుని ఆచరణ ప్రధానం. అంతేగాక విద్యార్థులను భౌతికంగా శిక్షించరాదని గాంధీ అన్నాడు.

రస్కిన్ వ్రాసిన **Unto This Last** అనే గ్రంథం గాంధీ పై తీవ్ర ప్రభావం చూపింది. పారిశ్రామిక నాగరికత కొందర్ని ధనికులుగా మార్చి అత్యధికులను శ్రామికులుగా చేసి వారిని ఆర్థికంగా, నైతికంగా, సాంఘికంగా అధోగతికి నెట్టిందని రస్కిన్ అన్నాడు. రస్కిన్ పుస్తకంలోని పలు విషయాలను ఆచరణలో పెట్టాలనే నిర్ణయాన్ని అది చదివిన మరుసటి రోజే తీసుకొన్నాడు. తక్షణమే తనలో మార్పు తెచ్చిన ఈ పుస్తకాన్ని 'సర్వోదయం' పేర గుజరాతీ భాషలోకి అనువదించాడు. తనలోని భావాలకు ప్రతిబింబం అందులో చూశాడు. ఆ పుస్తక సారాంశంగా గాంధీ గ్రహించిన సర్వోదయ భావాలు:

1. అందరి మంచి యందే తన మంచి యున్నది.
2. అన్ని వృత్తుల విలువ ఒకటే. జీవనోపాధి హక్కు అందరికీ సమానమే.
3. నిరాడంబరంగా వుంటూ కష్టపడి పని చేసే రైతు జీవనమే నిజమైన జీవనం.

మొదటి దానిలోనే మిగతా రెండూ కలిసి వుంటాయి. నిరాండంబర జీవితం అలవర్చుకొనే క్రమంలో భాగంగా ఇంటి పనులు, వంట పని, బట్టలు ఉతకడం వంటివి తామే చేసి కోవడం వల్ల స్వతంత్రతతో పాటు ఆత్మ విశ్వాసం పెరగడం, డబ్బు ఆదాఅవడం జరుగుతుంది. పై ఆదర్శాలు సాధించేందుకు గాంధీ దక్షిణాఫ్రికాలో ఫినిక్సు ఆశ్రమం **1904**లో స్థాపించాడు. ఈ ఆశ్రమంలో పనులను వీలయిన మేరకు యంత్రాలతో గాక చేతులతో చేశారు. అందరూ తమ పని (పారిశుద్ధ్యంతో సహా) తాము చేసికొంటూ ఇతరులకు సేవ చేయాలి. శారీరక శ్రమతో కూడిన వృత్తి చేయకుండా కేవలం మేధోపర వృత్తి ద్వారా వ్యక్తి వికాసం జరగదని నమ్మాడు. సర్వ ప్రజానీకం సుఖంగా జీవించాలంటే గతంలో వున్న అట్టి సమాజాన్ని పునర్నిర్మించాలి. అదే గ్రామీణ వ్యవస్థ. వ్యవసాయాభివృద్ధి, గ్రామీణ పరిశ్రమల పునర్నిర్మాణం ఇందులో ప్రధానం. ఈ భావనను 'హింద్ స్వరాజ్' అనే గ్రంథంలో విస్తరించాడు. దాని ఉన్నత స్థితికీ రాజరాజ్యం అనే పేరు పెట్టాడు.

గాంధీ ఆలోచనా విధానాన్ని అమెరికన్ తత్వవేత్తలైన ఎమర్సన్, థోరోలు కూడా ప్రభావితం చేసారు. హేతువుకు అతీతమైన అంతర్వాణి ప్రతి వ్యక్తిలోనూ వుంటుంది. దీన్ని ధ్యానం ద్వారా వికసింపచేయాలి. దైవాంశ అయిన అంతర్వాణిని బట్టి నడవడమే ఉత్తమ జీవితం అని ఎమర్సన్ అంటాడు. పైగా నాటి సామాజిక రుగ్మతలైన బానిసత్వాన్ని, పెట్టుబడిదారీ వ్యవస్థ వల్ల వచ్చిన పేదల కష్టాలను నిరసించాడు. ఈ భావాల నుంచి కూడా పాశ్చాత్య నాగరికత హింసాపూరితం అని గాంధీ గ్రహించాడు. కాలాన్ని, దూరాన్ని నాసనం చెయ్యడం అనేది దాని హింస లక్షణం.

థోరూ కూడా పెరిగే సంపద పేదరికాన్ని పెంచుతున్నందున ధనార్జన పాపహేతువన్నాడు. బ్రిటన్ భారతదేశాన్ని దోపిడీ చేయడాన్ని విమర్శించాడు. భౌతికావసరాలను సాధ్యమైనంత తగ్గించుకొని బహు క్లుప్తంగా, సరళంగా జీవించడం సత్యాగ్రహంలో

ఒక సూత్రం. ఆశ్రమ జీవితంలోనూ ఇదే వుంటుంది. ఈ విషయంలో థోరూ నుంచి కూడా స్ఫూర్తిని గాంధీ పొందాడు. తనకు అన్యాయమని తోచిన ఏ చట్టాన్నైనా ధిక్కరించే హక్కు ప్రతి వ్యక్తికీ ఉన్నదన్నాడు. శాసనోల్లంఘన (Civil Disobedience) అనే మాటను మొదటిసారిగా వాడిన వాడు థోరూ. అంతర్వాణి ప్రబోధంతో చిత్తశుద్ధితో చట్టాన్ని ధిక్కరించే ఒక వ్యక్తి చర్య చిత్తశుద్ధి లేని వంద మంది కార్యాచరణ కన్నా విలువైనది అని థోరూ భావన. ఇట్టి థోరూ భావన నుంచే వ్యక్తిగత సత్యాగ్రహ భావనను గాంధీ గ్రహించాడు. ఇదే గాక సహాయ నిరాకరణ, సాత్విక నిరోధం, శాసనోల్లంఘన అనే భావాలను కూడా గ్రహించాడు.

పై ప్రభావాల ఫలితంగా రూపొందించిన గాంధీ వ్యక్తిత్వంలోంచి వెలువడిన గాంధీ భావాలు, కార్యాచరణ నుంచి గాంధీకి సంబంధించిన 'అలౌకిక, లౌకిక జ్ఞాన పద్ధతి' అనేది గమనార్హమైనది. పైన పేర్కొన్న ప్రభావాల ఫలితంగా గాంధీ అంతిమ సత్యం దిశగా తన దైనందిన జీవితాన్ని వీలయినంతగా మలుచుకోగలిగినా దానిని (అంతిమ సత్యాన్ని) తాను ఒక యోగ పద్ధతిలో ఒక గురువు ద్వారా దర్శించేందుకు తగిన కృషి చేయలేదని పేర్కొన్నాడు. గాంధీ పై రాయ్ చందో భాయి ప్రభావం చాలా ఉన్నదని అంగీకరించినప్పటికీ ఆయనను ఆధ్యాత్మిక గురువుగా గాంధీ స్వీకరించలేదు. ఒక గురువు కోసం అయన చేసిన పరిమిత ప్రయత్నం సఫలం కాలేదు. అంతిమ సత్యాన్ని చేరడానికి చేసిన కృషిలో భాగంగా అంతర్వాణి సహాయం పొందడం జరిగింది. ఆధ్యాత్మిక సత్యాన్ని స్వయంగా దర్శించి తెలుసుకొనే యోగ పద్ధతి పై గాంధీకి ఒక గురువు, కృషి లేనందున స్పష్టత లేదు. లౌకిక సత్యాన్ని లేక జ్ఞానాన్ని గ్రహించడానికి ఇంద్రియానుభవం ఆధారం అని నమ్మాడు. అయితే గాంధీ ఇంద్రియ జ్ఞానంతోపాటు తిరిగి నిర్ణయాలు చేయడానికి తన అంతర్వాణి పై ఆధారపడ్డాడు.

గాంధీ అనుసరించిన ఈ పద్ధతి కూడా అతని దైవ విశ్వాసంతో సంబంధించినదే. తన విశ్వాసానికి ఎంత అనుగుణంగా తాను జీవించగలిగితే అంతగా తాను దైవం వైపు ప్రయాణిస్తానని గాంధీ నమ్మాడు. తన జీవిత ధ్యేయం ఈశ్వర సాక్షాత్కారమని, ప్రతి జీవినీ దైవ స్వరూపంగా చూసి, సేవించినపుడే తనకు దైవ దర్శనం అవుతుందని నమ్మాడు. అట్టి అభిలాష గల మనిషి జీవన స్రవంతికి దూరంగా ఉండలేడు. అందువల్ల సత్యారాధనయే గాంధీని రాజనీతిలోకి దింపింది. ఆత్మశుద్ధి లేనిదే ప్రజీ జీవిలో సమైక్యత ఏర్పడదు. మరియు అహింస,ధర్మపాలన సాధ్యపడదు. కనుక జీవన రంగంలో ప్రతి భాగమూ పరిశుద్ధంగా ఉండటం అవసరం అని, అన్ని జీవన రంగాల్లో సత్య వ్రతం సాధ్యం అని అంటాడు గాంధీ. సర్వవ్యాపుడైన భగవంతుడు వ్యక్తి నిజాయితీ నిబద్ధత స్థాయిని బట్టి సత్యాన్ని (అంతిమ సత్యం, దానిలో భాగమైన వ్యావహారిక సత్యం, కర్తవ్యంలను) తెలియజేసేది కూడా అంతర్వాణి అయిన సత్యమే. తనకు ఒక్కో విషయం పై ఒక్కో సందర్భంలో ఒక్కో రకమైన అభిప్రాయమూ, దానికి తగిన కార్యాచరణా వుండటం అనేది అసంబద్ధమైన విషయంగా కాక ఆయా సందర్భాలలో ఆయా విషయాలను సత్యం లేక ధర్మం అని తన మనసు దృఢంగా భావించడం వల్లేనంటాడు గాంధీ. తాను చేసిన చిన్న, పెద్ద పనులన్నీ అంతర్యామి (insider) ప్రేరణ వల్లే జరిగాయన్నాడు. 1895 నుంచి తాను చేసిన పనులన్నీ ఆత్మదర్శనం కోసమే, ఈశ్వర సాక్షాత్కారం కోసమే, మోక్షం కోసమే అన్నాడు గాంధీ. ఒక విషయం పై తన చివరి (Latest) అభిప్రాయమే వీలయిన ఖచ్చితమైనదిగా భావిస్తానని అంటాడు. అంతేగాక సత్యనిష్ఠ గల వారు నియమాల మీదనే ఆధారపడి పని చేయకూడదు. తమ భావాన్ని మాత్రమే అంటిపెట్టుకొని వుండకూడదు. అందు దోషం వుండవచ్చునని గ్రహించాలన్నాడు గాంధీ.

బ్రిటీష్ వాళ్ళు మాంసాహారులైనందువల్ల శక్తివంతులై మనల్ని పరిపాలిస్తున్నారనే స్నేహితుని అభిప్రాయం ఆధారంగా భారతీయులందరూ మాంసాహారులై, వీరులై తెల్లవాళ్ళను జయించవచ్చుననే విశ్వాసం గాంధీకి బాల్యంలో కల్గింది. తల్లి దండ్రులకు తెలియకుండా రహస్యంగా తాను మాంసం తినడం దేశ స్వాతంత్ర్యం కొరకే గనుక సత్యపథానికి వ్యతిరేకం కాదని నమ్మాడు. అయితే ఇది (ఆకలి లేదని అబద్ధం చెప్పడమూ మరియు శాఖాహార నియమోల్లంఘనల ద్వారా) తల్లి దండ్రులను మోసగించడమే గనుక మాంసభక్షణ వాయిదావేసి భవిష్యత్‌లో బహిరంగంగానే తినాలని గాంధీ నిర్ణయించాడు. చాలా కాలం తర్వాత తనకు రాజకీయ రంగంలో అవసరమైన శక్తి ఆధ్యాత్మిక ప్రయోగాల (సత్యం) నుంచి వచ్చిందని ప్రకటించాడు. అలా శక్తికి ఆధారం భౌతిక పదార్థంగాక, ఆత్మ అని తన అభిప్రాయాలను, నమ్మకాలను మార్చుకొన్నాడు.

సత్యమే అన్నింటిలోనూ గొప్పదని, అందు పలు విషయాలు (జ్ఞానం, ప్రేమ) వుంటాయని, ఈ జగత్తులో సత్యం తప్ప మరోటి ఏమీ లేదని గాంధీ నమ్మాడు. అంటే ప్రపంచాన్ని భ్రమగా కొట్టివేయక సత్య స్వరూపంగానే చూశాడు. సత్యశోధనకు సంబంధించిన సాధనలు ఎంత సరళమైనవో అంత కఠినమైనవి కూడా. సత్యాన్వేషి అహంకారం విడిచి ధూళికణం కన్నా చిన్నగా వుండాలి. అలావుండి, భౌతిక విషయాలలో తాదాత్మ్యం చెందకుండా వుంటే సత్యం లీలగా గోచరిస్తుందన్నాడు గాంధీ.

ఆస్తికులు తమలో గల భగవంతుణ్ణి సజ్జీవులలోనూ చూడగలిగి వారితో నిర్లిప్తంగా వుండాలి. రాగ ద్వేషాలను దూరంగా వుంటే శక్తి వికసిస్తుందని గాంధీ అన్నాడు. జగత్తూ సత్యమే (సత్యంలో భాగమే) కనుక చరాచరాలను ముఖ్యంగా మనుషులందరినీ ప్రేమించడం అనేది సత్యాన్ని ప్రేమించడంలో భాగమే. పిరికివాడు అందరినీ ప్రేమించలేడు. కనుక త్యాగబుద్ధి ద్వారా ధైర్యాన్ని అలవర్చుకోవాలి. గీతోపదేశం ద్వారా అర్జునుడు పొందింది ధైర్యమే. అయితే నిత్యజీవితంలో భయాన్ని పోగొట్టేందుకు రామనామస్మరణ ఉత్తమమని చిన్ననాడే గ్రహించాడు. భయపడినపుడే అన్ని జాతుల వారు దైవస్మరణ (దక్షిణాఫ్రికాకు ప్రయాణంలో ఓడ తుఫానులో చిక్కిన సందర్భంలో) చేశారని, తర్వాత తిరిగి మాయలోపడ్డారని గాంధీ అన్నాడు. అయితే అలా అవకాశవాదంగా కాక, సత్యంతో కూడిన నీతి మీద ఆధారపడ్డ ఈ ప్రపంచంలో జీవితాన్ని అనుక్షణం సత్యం వైపే నడపాలని భావించాడు.

భగవద్గీతలో మనిషి ఎలా సత్యదూరుడవుతాడో చెప్పే శ్లోకం - విషయలోలత్వం వల్ల మనిషి సర్వమూ కోల్పోతాడు. గాంధీని పరోక్షంగా సత్య శోధనకు కట్టుబడేట్లు చేసింది. అంటే సదసద్వివేకంతో (శుద్ధబుద్ధి ద్వారా) సత్యాన్ని చేరాలని గ్రహించాడు. అలాగే కామాది గుణాలను శుద్ధి చేయుటకు హృదయపూర్వక ఉపాసన ఉత్తమ సాధన అని గ్రహించాడు.

ఒక ఏడాది దేశమంతటా పర్యటించి ప్రజాసమస్యలను గూర్చి స్వయంగా తెలిసికొని యోచించి తగు నిర్ణయం తీసికోమని గోఖలే గాంధీకి సలహా ఇచ్చాడు. గాంధీ తన జ్ఞానానికి ఆధారంగా ఈ అనుభవాత్మక పద్ధతి (empirieal study)ని కూడా అంగీకరించాడు. ప్రజాసేవ ద్వారా ఈశ్వర సాక్షాత్కారం పొందాలనుకొన్నాడు గాంధీ. మూడో తరగతి రైలు ప్రయాణీకుల సమస్యలు పరిష్కరించబడాలంటే చదువుకున్న వారు బీదవాళ్ళుగా మారి మూడో తరగతిలో ప్రయాణిస్తూ ప్రయత్నపూర్వకంగా అక్కడి సమస్యలను (ప్రయాణీకుల కష్టాలను, దురభ్యాసాలను) పరిష్కరించాలని గాంధీ కోరాడు. అనేక సందర్భాలలో రైతులు, కార్మికుల తమ సమస్యల పరిష్కారం కోసం కృషి చేయవలసినదిగా గాంధీని కోరినపుడు తాను స్వయంగా చూసిగాని ఒక నిర్ణయం తీసికోనని అనేవాడు.

మరిన్ని ప్రజోపయోగ కార్యాలు చేయడం కోసం శక్తిని అదుపులో వుంచుకోడానికై కోర్టులు పెట్టే ఆంక్షలను ఒక స్థాయిలో వ్యతిరేకించినా మరో స్థాయిలో వ్యతిరేకించకుండా పట్టువిడుపులు ప్రదర్శించాడు. ఒకే విషయాన్ని సందర్భాన్ని బట్టి వివిధ రకాలుగా చూడాలని భావించాడు. సత్యం యెడల గల పట్టుదలే ఇట్టి రాజీని (ఆహారం విషయం నుంచి బ్రిటీష్ వారిలో పోరాటం వరకు అనేక విషయాల్లో) ఆస్వాదించే చేసిందని అన్నాడు.

అక్షరజ్ఞానం కన్నా అనుభవ జ్ఞానంను ఉన్నతమైనదిగా గాంధీ భావించాడు. తన ప్రజాసేవా కార్యకలాపాల వల్ల తన బిడ్డల చదువు అశ్రద్ధ చేసినందుకు గాంధీ చింతించలేదు. పైగా దీన్ని స్వతంత్రంగా దేవికిచ్చిన బలిదానంగా భావించాడు. అనగా పాండిత్యం కన్నా స్వతంత్రం వెయ్యిరేట్లు మిన్న అని గాంధీ అర్థం. అంతేగాక **1920**వ సం॥లో స్వతంత్రానికి వ్యతిరేకమైన స్కూళ్ళు, కాలేజీలు విడిచి పెట్టాలని **(boycott)** గాంధీ ఉద్బోధించాడు. చదువును అశ్రద్ధ చేసినా పిల్లల శీలనిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చాడు. తల్లిదండ్రుల యొక్క ప్రవర్తనను బట్టి పిల్లలలో నైతిక విలువలు ఏర్పడతాయన్నాడు. (బ్రహ్మచర్యం ద్వారా గాంధీ సాధించదలచుకున్న వాటిలో ఇది ఒకటి). పైన పేర్కొన్న కొన్నిఅంశాలు తెలియ చేస్తున్నట్లుగా అనుభవం ద్వారా లౌకిక జ్ఞానం లభిస్తుందన్న విషయానికే గాంధీ బద్ధుడైనాడు.

## 9.3 అహింస మరియు సత్యాగ్రహం - లక్ష్యాలకు, మార్గాలకు మధ్య సంబంధం :-

గాంధీ దృష్టిలో అహింస అనగా విశ్వవ్యాప్తమైన ప్రేమ. అంటే కేవలం మనుషుల్నే గాక మొత్తం విశ్వాన్ని (సృష్టిని) ప్రేమించాలి. అపకారిని కూడా ప్రేమించుట అహింసలో భాగం. 'సత్యాగ్రహం'లో 'సత్' మరియు 'ఆగ్రహం' అనే పదాలున్నాయి. సత్ అనగా ఉండుట. శాశ్వతమైనదేదో అదే (దైవమే) వుంటుంది. అనగా సత్యమే దైవం లేక దైవమే సత్యం. దైవ లక్షణమైన విశ్వ ప్రేమను ఆచరించుట సత్యాగ్రహం. (గాంధీకి అహింస అంటే ఆత్మశక్తి లేక ప్రేమశక్తి లేక దైవశక్తి అని అర్థం). ప్రేమే దైవం కనుక సత్యాగ్రహం లేక ప్రేమించడం అంటే అత్యున్నతమైన, అత్యుత్తమమైన తిరుగులేని శక్తిని సంపాదిస్తూ, దాన్ని ప్రదర్శించడం లేక ఉపయోగించడం అని అర్థం.

ఆస్తికులు తమలో గల భగవంతుణ్ణి సర్వులలోనూ చూడగలిగి వారితో నిర్లిప్తంగా - రాగ ద్వేషాలకు అతీతంగా ఉంటే శక్తి వికసిస్తుందని గాంధీ నమ్మాడు. తాను స్థాపించిన ఫినిక్స్, టాల్‌స్టాయ్, సబర్మతి ఆశ్రమాలలో ఈ సూత్రం ప్రకారం సాధ్యమైనంత వరకు హింసా ప్రవృత్తిగల (పాములు వగైరా) ప్రాణులను చంపరాదని నిర్ణయించి, అమలు చేశాడు. బెంగాల్‌లో కాళికాలయంలో నాడు జరుగుతున్న జంతుబలిని భగవత్సేవగా కాక హింసగానే చూశాడు. గాంధీ దృష్టిలో జంతువు నిస్సహాయ ప్రాణి. అందుకే అవి మనుషుని సాయం పొందడానికి అధికారి. మరింత ఆత్మశుద్ధి, త్యాగం వల్లనే జంతు సంరక్షణ సాధ్యం అంటాడు గాంధీ.

ఆహారం విషయంలోనూ గాంధీ అహింసా సూత్రాన్ని పాటించాడు. ఇంగ్లాండులో శాఖాహార ప్రాధాన్యతను గ్రహించి దాన్ని ప్రచారం చేసి అందరినీ శాఖాహారులుగా మార్చాలనుకొన్నాడు. అట్టి సంఘంలో సభ్యుడయ్యాడు. ఆరోగ్యమూ, ధర్మదృష్టి, తల్లికి చేసిన ప్రమాణము ఇక్కడ ముఖ్య విషయాలు. కొన్నాళ్ళు చేపలు, గుడ్లు జీవ జంతువులకు చెందవని, తిన్నా హింసకాదని భావించినా ప్రమాణ పరిధిలో అవి ఉన్నాయని గ్రహించి వెంటనే వాటిని త్యజించాడు. సత్యానికి సంబంధించిన అహింస, ప్రేమ పార్శ్వాలు అర్థం అయ్యే కొద్దీ మాంసాహారమూ, గుడ్లూ, పాలు కూడా హింసతోకూడినవే అని నమ్మి పూర్తిగా శాఖాహారాన్ని సమర్థించి, పాటించి, ప్రచారం చేశాడు. క్షణికమైన రుచిని వదులుకోవడం కష్టమే అయినా సాధించాడు. మరియు తినేది శాఖాహారమే అయినా అవి మితాహారంగా వుండేట్లు చూసుకొన్నాడు. ఆహారాన్ని అమితంగా రుచి కోసం తింటే వచ్చే జబ్బుల్ని చేసిన తప్పుకు శిక్షగా భావించేవాడు. అప్పుడు ఉపవాసం ద్వారా లేక అవసరమైతే ప్రకృతి ద్వారా రోగాన్ని తగ్గించుకోవాలి. అలాకాక రసాయనాల వంటి మందులైతే మనోచాంచల్యాన్ని కల్గిస్తాయి. తద్వారా మానవత్వమూ పోయి మనిషి శరీరానికి బానిస కావచ్చు. దోషాల వల్లనే (శిక్షలాగా) జబ్బులు భగవంతుని అనుగ్రహం వల్ల వచ్చేవే అని గాంధీ గ్రహించాడు. కొన్ని రోగాలకు మాంసపుటీ, గుడ్లు, పాలు లాంటివి వాడాల్సి వచ్చినపుడు (తన భార్యా బిడ్డల అనారోగ్య విషయంలో కూడా) తాను బ్రతకడానికై ఇతర జీవుల్ని చంపడం లేక హింసించడం కన్నా జబ్బుతో చనిపోవడమే మంచిదని భావించాడు.

మితాహారం వలనే మితంగా మాట్లాడటం అనే లక్షణాన్ని (క్రమంగా మౌన వ్రతంలోకి వెళ్ళడం కోసం) గాంధీ సంపాదించాడు. సత్యారాధకునికి మౌనం అవసరమని స్వానుభవం వల్ల గ్రహించాడు. మనోశక్తి దుర్వినియోగం కాకుండా వుండటం కోసం కూడా మౌనవ్రతం అవసరం.

ప్రభావరీత్యా సాత్వికాహారం మంచిదని గాంధ ్ హించాడు. ఇంద్రియ గమనం కోసం కామ వికారం కల్గించే పాలను విసర్జించి పండ్లను, (పండ్లు, ఆకుపచ్చని పండ్లు, ఎండు ఫలాలు) స్వీకరించాడు. ఇవి బ్రహ్మచర్యం మొ॥ ఆత్మ సంయమ గుణాన్ని పెంచేవి. ఆహారాన్ని రుచికోసం కాక శరీరపోషణ కోసమే తిన్నప్పుడు ప్రతి ఇంద్రియం శరీరం కోసం, శరీరం ద్వారా ఆత్మ సాక్షాత్కారం కోసం పని చేస్తుందని గాంధీ నమ్మాడు. గాంధీ భార్య కూడా తనకు అవసరమైన వైద్యంలో భాగంగా మాంసంతో చేసిన చారును తాగడానికి తిరస్కరిస్తూ "దుర్లభమైన మానవ జన్మతో లభించిన శరీరాన్ని మాంసాహారంతో భ్రష్టు పట్టరాదన్నది". గాంధీకి పశువుల మాంసం ఎంత త్యాజ్యమో, పశువుల పాలు కూడా అంతే త్యాజ్యము. అత్యవసర పరిస్థితులలోనైనా పాలు తాగవలసి వచ్చినపుడు మేకపాలు తాగి, అది సత్యాగ్రహపు మోహంతో జీవించాలనే కోర్కెవల్ల జరిగిందన్నాడు. కానీ ఇది ఒక రకంగా

సత్యాన్ని అణచివేయడమేనని సత్యాన్ని త్యజిస్తూ అహింస ద్వారా సమస్యల్ని పరిష్కరించలేమన్నాడు. అలాగే శాంతియుతంగా లేకుంటే సత్యాగ్రహమూ సాధ్యం కాదని గాంధీ గ్రహించాడు.

మొదట్లో గాంధీకి న్యాయవాద వృత్తిలో ధర్మ సిద్ధాంతాల అన్వయం అంత తేలికగా కన్పించలేదు. ధర్మబద్ధంగా వృత్తిచేస్తూ తగిన జీవన భృతి సంపాదించడమూ అనుమానాస్పదమే అయింది. అయితే ప్రతి (పక్ష) వాదికి న్యాయం చెయ్యడం వల్ల తాను త్వరగా న్యాయం పొందగలనని అనుభవం ద్వారా తెలిసికొన్నాడు. అంతేగాక విడిపోయిన వాది, ప్రతివాదుల్ని కలపడమే వకీలు యొక్క పరమ ధర్మమని గాంధీ గ్రహించాడు. చంపారన్‌లో నీలి మందు రైతులచే బలవంతంగా పండించే తెల్లదొరలైన భూస్వాముల దౌర్జన్యాలు, పీడన గుర్చి విన్నప్పుడు గాంధీ నీలి మందు రైతుల అభిప్రాయాలతో పాటు, నీలిమందు కొఠార్ల యజమానుల అభిప్రాయాలూ వినాలన్నాడు. అలాగే వాణిజ్యంలో సత్యం నడవదు అనే దక్షిణాఫ్రికాలోని భారతీయ వ్యాపారుల వాదనను తిరస్కరిస్తూ వాణిజ్యవేత్తలు సత్యవంతులుగా వుండాలని, మరియు స్వదేశంలో కన్నా విదేశంలో సత్యనిష్ఠ ఎక్కువగా వుండాలని గాంధీ అన్నాడు. ఎందుకంటే వారి అసత్య గుణాలు, ప్రవర్తన భారతీయులందరికీ ఆపాదించబడకుండా వుండాలంటే వారు సత్యవ్రతులవ్వాలని కోరాడు.

సత్యం అనే వృక్షాన్ని పోషిస్తూ వుంటే అది సేవా రూపంలో ఫలాలనిస్తుందన్నాడు. గాంధీ తన సేవలకు గుర్తింపుగా వచ్చిన బహుమతులను కూడా తిరిగి ప్రజా సేవకే వినియోగించాడు. రోగులకు, ఇబ్బందుల్లో వున్న వారికి సేవ చేయడం వల్ల తక్షణ ఆనందం పొందేవాడు. సేవా భావం ముందు భోగాలు, ధనార్జన మొ॥నవి తుచ్ఛమైనవిగా చూశాడు. మనో ద్రవ్యాన్ని శారీరక శక్తిని పొదుపు చేయడమే గాక ఆర్థిక వ్యయాన్ని తగ్గించుకోవలసిన అవసరాన్నీ గాంధీ గుర్తించాడు. తన పనులన్నీ తానే చేసికోవడం (స్వశక్తి పై ఆధారపడటం) వల్ల వ్యయాన్ని తగ్గించుకొన్నాడు. ఇలాంటి స్వతంత్రతే ఇతరులుకు (యుద్ధాల్లో గాయపడిన వారికి, రోగులకు మొ॥ వారికి) సేవ చేయగలరు.

యుద్ధాల్లో గాయపడిన వారికి సేవ చేస్తున్నప్పుడు గాంధీకి బ్రహ్మచర్య భావన బలపడింది. విషయలోలురకు సమయంలో చాలా భాగం వికారం కల్గించే ఆలోచనలతోనూ, కోర్కెలను తీర్చుకోవడంలోన గడిచిపోతుంది. కనుక వారికి పరోపకారం చేయడం వీలుపడదు. గాంధీ బ్రహ్మచర్యం ద్వారా కుటుంబ సేవ, శీల నిర్మాణంతో కూడిన పిల్లల పెంపకంతో పాటు సమాజ సేవ చేయవచ్చని గ్రహించాడు. ఈ బ్రహ్మచర్యా వ్రతులు కేవలం శరీరాన్నే గాక మనసు కూడా వికారం చెందకుండా చూసుకోవాలన్నాడు. ఇక్కడ కామ వికారపు యోచనలు నివారించడానికి రామనామ స్మరణం లేక మంత్ర జపం ఉపయోగకరమని గుర్తించాడు.

బ్రహ్మచర్యానికీ ఆహారానికీ సంబంధం ఉంది. అయితే అది ఎక్కువ మనసుకు సంబంధించినది. సదాలోచనల వల్ల భగవన్నామస్మరణ వల్ల భగవంతుని దయవల్ల మనోమాలిన్యం తొలుగుతుంది. అప్పుడే మనసు నిర్వికార స్థితిని పొందుతుంది. బ్రహ్మచర్యమంటే మనోవాక్కాయాలతో సర్వేంద్రియాలను నిగ్రహించటం. దీన్ని సరిగా పాటిస్తే బ్రహ్మ దర్శనమౌతుందని గాంధీ నమ్మాడు. ఆ దర్శనం విషయాలపట్ల అభిరుచిని పోగొడుతుంది. కనుక మనసులో విషయాల బదులు పరమేశ్వరుణ్ణి నామస్మరణ ద్వారా ప్రతిష్ఠించుకోవాలి.

ఏకపత్నీ వ్రతంను సత్యవ్రతంలో ఒక భాగంగా చూశాడు. కామానికి లోబడి వున్నంత వరకు ఏకపత్నీ వ్రతానికి విలువ లేదు. అంతేగాక సంతాన నిరోధానికి ఉపకరణాల కన్నా (నిగ్రహమే) సంయమమే మంచిదని గ్రహించాడు. అలా మిగిలిన సమయాన్ని, శక్తిని ప్రజాసేవకు ఉపయోగించాడు. వైరాగ్యం అలవడి కొన్ని నియమాలు పాటించే సంసిద్ధత అలవడినాకే ఆ నియమం గూర్చి శపథం పూనడం మంచిదని గాంధీ భావించాడు.

అలా మొదలైన బ్రహ్మచర్య వ్రతానికి తన భార్య అనుమతిని తరువాత పొందాడు. బ్రహ్మచర్య వ్రతమే సత్యాగ్రహ ప్రారంభానికి పూనుకొనేలా చేసిందని గాంధీ భావించాడు. ఈ వ్రతం వల్ల శరీరం, బుద్ధి, ఆత్మలకు రక్షణ కలుగుతున్నట్లు గ్రహించాడు. కనుక నిత్యం అప్రమత్తంగా వుండి జిహ్వను వశంలో ఉంచుకోవాలనుకొన్నాడు. వీలైనంత వరకు వండని మితాహారం

ముఖ్యంగా పళ్ళు తీసుకోవడం బ్రహ్మచర్యానికి మంచిదన్నాడు. ఉపవాసాలు కూడా విషయాలను శాంతింప చేసి బ్రహ్మ చర్యానికి ఉపకరిస్తాయి. అయితే మనసు కూడా ఇంద్రియ సంయమనానికి తోడ్పడినపుడే బ్రహ్మచర్యం సఫలమౌతుంది.

విశ్వప్రేమ (అహింస) ద్వారా దైవాన్ని తెలిసికోవచ్చని గాంధీ విశ్వసించాడు. దైవమూ ప్రేమ వేరు కాదని, ప్రేమ ఉన్నచోట దైవమూ వుంటుందని కూడా విశ్వసించాడు. తీవ్రమైన భక్తి, విశ్వాసాల వల్ల దైవ సహాయం పొందవచ్చన్నాడు. ప్రహ్లాదుడు, గజేంద్రుడు (గజేంద్ర మోక్షంలో) తమ భక్తి విశ్వాసాల ఫలితంగా దేవుని సహాయం పొందారు. అనగా అట్టి లక్షణాలున్న భక్తులను కష్టసమయాల్లో భగవంతుడే కాపాడతాడు. ప్రార్థన అనేది వినయాన్ని సూచిస్తూ, శ్రద్ధను తెలియచేస్తుంది, శాంతిని కలిగిస్తుంది. దక్షిణాఫ్రికాలో ఫినిక్సు ఆశ్రమంలోను, టాల్‌స్టాయ్ ఆశ్రమంలోను సామూహిక ప్రార్థన ద్వారా గాంధీ సత్యాగ్రహ శిక్షణనిచ్చాడు.

కష్టాలలో వున్నప్పుడు మాత్రమే గాక తప్పులు చేసి కష్టాలపాలు అవకుండా దైవం తన యందు విశ్వాసమున్నవారిని ఆదుకుంటుందని గాంధీ నమ్మాడు. లౌకిక జీవనంలో తప్పును అంగీకరించడమూ సత్య వ్రతంలో భాగమే. గాంధీ బాల్యంలో తాను రహస్యంగా తాగే సిగరెట్ల ఖర్చుకై చేతి కడియంలోని బంగారాన్ని కొంత రహస్యంగా అమ్మి ఆ (దొంగతనం) అపరాధ భావన భరించలేక తండ్రికి తెలియచేసి క్షమాపణ కోరాడు. కోపించని తండ్రి దుఃఖంలో పితృవాత్సల్యాన్ని గ్రహించాడు. తప్పును అంగకరించి, మరల తప్పుచేయననే వాగ్దానమే అందుకు కారణం అని గ్రహించాడు. తనకు మాంసాహారం అలవాటు చేసిన స్నేహితుని ప్రభావం వల్ల వ్యభిచారం బారిన పడబోయి అదృష్టవశాత్తూ తప్పించుకోగలిగాడు.

ఇంగ్లాండ్‌లో చలిని తట్టుకోడానికి మాంసాహారం అవసరమైనా తాను చేసిన ప్రతిజ్ఞ కోసం తిన్లేదు. అంతేగాక సాధారణ జీవనం పట్ల గౌరవంతో పాశ్చాత్య నాగరికత పట్ల ముఖ్యంగా వేషభాషలు, సంగీత నృత్యాలపట్ల మోహాన్ని అధిగమించాడు. పాశ్చాత్య దేశాలలో విద్యనభ్యసించే వారితో సహా అక్కడ వివాహితులు ఆడపిల్లలతో కలిసి తిరగరాదనే నియమం వుంది. స్త్రీ మోహంతో గాంధీ తనకు వివాహమైనదన్న విషయాన్ని దాచి, చివరకు ఓ స్త్రీతో తన సాన్నిహిత్యాన్ని ఒక వృద్ధురాలు ప్రోత్సహిస్తున్నప్పుడు గాంధీ తన నిజాన్ని దాచడం అనే పొరపాటు మరో పొరపాటుకు దారితీస్తుందని గ్రహించి వారికి నిజం తెలియజేశాడు. అలా తెలియచేయడమే (ఒప్పుకోవడమే) తన తప్పును క్షమార్హమైనదిగా చేసిందని గ్రహించాడు. తెల్లవారిని అనుకరించడమే నాగరికత అని నమ్మి ఆ వ్యామోహంలో అనేక రకాల అలవాట్లు చేసికోవడం, తిరిగి వారిది అనాగరిక సంస్కృతి అని అర్థమైనాక ఆ అలవాట్లను విడనాడటానికి చాలా కష్టపడ్డాడు. అనేక సందర్భాలలో తప్పును చేయబోయి వెంటనే సరిదిద్దుకోగలగడం కేవలం దైవం యొక్క జోక్యం వల్లనే అని గ్రహించాడు. ఒక తప్పుకుపడ్డ శిక్షను ప్రాయశ్చిత్తంగా భావించడం మాత్రమే గాక ఆ తప్పు పునరావృతం కానివ్వనని ప్రతిజ్ఞ గైకొనడం నిజమైన ప్రాయశ్చిత్తం అవుతుందని గాంధీ భావించాడు.

సత్యం అంటే దైవం, ఆత్మ లేక ప్రేమ కనుక సత్యాగ్రహి ఆత్మలక్షణమైన అహింసను ఆచరిస్తాడు. భౌతిక పదార్థాన్ని గురుత్వాకర్షణ శక్తి ఎలా కలిపి వుంచుతుందో మానవాళిని ప్రేమ శక్తి అలా చేస్తుంది. ఇది నిస్వార్థ ప్రేమ. కానిపక్షంలో ఇది జన్మపరంపరకు కారణమౌతుంది. కనుక దీన్ని తెలిసికొని వాడాలి. అలా అహింస మానవాళిని ఒక క్రమబద్ధమైన సమూహంగా మారుస్తుంది. అయితే అహింసను ఆచరించడానికి ధైర్యం కావాలి. ఎందుకంటే పిరికివాళ్ళు అందరినీ ప్రేమించలేడు. కాబట్టి అందరినీ కలిపే ప్రేమను తెలియ చేయటానికి నిర్భయత్వం కావాలి. మనుషులంతా దైవ స్వరూపులే, దేవుని బిడ్డలే గనుక అంతస్సారంలో ప్రతి ఒక్కరూ అహింసా మూర్తులే. (హింస అనేది జంతు ప్రవృత్తికి చెందినది) అయితే స్వచ్ఛమైన లేక మంచి మనుషులే అహింసను తెలిసికోగలరు. కనుక ప్రతి ఒక్కరూ స్వచ్ఛత లేక నిస్వార్థత కోసం ప్రయత్నించాలి అని గాంధీ భావించాడు.

అందరినీ ప్రేమించే (నిస్వార్థ ప్రేమ) విషయం సుసాధ్యం చేయడానికి మనిషినీ, పనిని వేరుగా చూడాలని గాంధీ గ్రహించాడు. అంటే మంచి పనిని మెచ్చుతూ, చెడు పనిని విమర్శిస్తూ మనుషులందర్నీ మానవ సహజ ప్రేమతో చూడాలి. గాంధీ అన్ని సంఘటనలను సత్యం ఆధారమైన నైతిక కోణం నుంచి చూసేవాడు. శత్రువును సైతం ద్వేషించరాదు అనే సూత్రం ద్వారా గాంధీ అవతలి వారిలో మార్పుకు ఆఖరు క్షణం వరకు అవకాశం ఇచ్చి వారిని తన మార్గం వైపు తిప్పుకునే అవకాశం కల్పించుకొన్నాడు.

అలాకాక ఎవరినైనా హింసతో నిరోధించినా లేక వారి పై దాడి చేసినా అది మనం మన పైనా, దైవం పైనా దాడి చేసినట్లే అవుతుందని నమ్మాడు.

బ్రిటీష్ వారిది హింసాపూరిత సంస్కృతి అని క్రమంగా గాంధీకి అర్థమైనాక వారిని క్షమించడానికి, వారు చేసే దౌర్జన్యాలకు తిరిగి ప్రతికారం చేయకుండా వుండటానికి తనకు భగవంతుడు శక్తి నిస్తాడని నమ్మాడు. దక్షిణాఫ్రికాలో గాంధీని కొట్టిన వారి పై కేసులు పెట్టకపోవడం ఆంగ్లేయులను తల వంచుకొనేలా చేసింది. వ్యక్తిని, పనిని వేరుగా చూసే క్రమంలో గాంధీ ఇలా చేశాడు. దక్షిణాఫ్రికాలోనే అవినీతిపరులైన ఇద్దరు పోలిస్ అధికారులకు వ్యతిరేకంగా పిర్యాదు చేసినపుడు వారిని న్యాయస్థానం శిక్షించక వదిలివేసినా, తర్వాత ప్రభుత్వం వారిని డిస్మిస్ చేసింది. తిరిగి గాంధీ యొక్క ఉదాసీనత వల్ల వారికి వేరే ఉద్యోగాలు లభించాయి. వ్యక్తినీ, పనినీ వేరు చేసి చూడడం వల్ల మంచి పనుల పట్ల ఆదరణ, చెడ్డ పనుల పట్ల నిరాదరణ మరియు మనుషుల పట్ల (అహింస) ఆదరణ, దయ కలిగి ఉండాలని గ్రహించాడు. ఆ దృష్టి కోణం వల్ల తనకు ఆత్మ తృప్తి లభించిందన్నాడు.

కనుక తాత్కాలిక శక్తి అయిన ద్వేషాన్నిగాక శాశ్వత శక్తి అయిన అహింసను వాడాలి. శతృత్వం పోతే మిగిలేది ప్రేమే. ఎలాగూ జన్మపరంపరలో ఎవరు ఎవరితోనైనా కలిసి జీవిస్తూ ప్రేమించాలి. గనుక ఈ జన్మలోనే అందర్నీ ప్రేమిస్తే మానవాళి ఒక కుటుంబంగా కనిపిస్తుంది మరియు జన్మ పరంపర నుంచి ముక్తి లభిస్తుంది. అలా స్వార్థాన్ని వీడి విశ్వ ప్రేమను ఆచరిస్తే మన శక్తి పెరుగుతూనే వుంటుంది.

అలా నిస్వార్థతను పెంచుకొనే క్రమంలో ముందుగా మనలోని దుష్ట ఆలోచనలను, దుష్ట సంకల్పాలను జయించాలి. అలా మనలోని పశు ప్రవృత్తిని ధైర్యంగా పారద్రోలితే మనలోని అంతర్వాణి పని చేస్తుంది. అది చెప్పినట్లు నడవడమే సత్యాగ్రహము (సత్యాన్ని ఆచరించుట). అది అహింసనే ప్రభోదిస్తుంది.

అయితే పిరికితనంతో అంతర్వాణికి గాక ఇతరులకు లొంగి బానిసలయ్యే దాని కంటే హింసా ప్రయోగమే మంచిది. అయినా మనిషినీ, పనినీ వేరు చేసి చూడాలి గనుక క్షమాగుణం అనేది ప్రతికారం కన్నా ఉన్నతమైనదని గ్రహించాలి. భౌతిక దాడికి పరిమిత స్వభావం గల భౌతిక శక్తిని వాడే బదులు, క్షమ, ప్రేమ ద్వారా అనంతమైన ఆత్మశక్తిని వాడి శాశ్వత ఫలితాలు పొందవచ్చని గాంధీ అంటాడు. ఇది స్వచ్ఛమైన, నిస్వార్థమైన ప్రేమ అని ఋజువు కావాలంటే ముందు పగ, ద్వేషాలనే అంతరంగ శతృవులను జయించాలి. బహిరంగ శత్రువును కొట్టలేక (కొట్టాలనే ఇచ్ఛ వుండి) క్షమించడం అసత్యమౌతుంది. కొట్టగలిగి వుండి కూడా (ద్వేషాన్ని, పగను జయించి) కొట్టకుండా వుంటే సంయమనం పాటించినట్లవుతుంది. ఇదీ అసలైన పురుషత్వం అని గాంధీ అంటాడు. అలాంటి నిర్భయుడు, శక్తివంతుడు (కోపాన్ని జయించి శక్తిని ఆదా చేయుట) ఎవరికి హాని చేయడు, చేయలేడని గాంధీ అంటాడు.

ఒక ఆటంబాంబు చేసిన విధ్వంసాన్ని మరో ఆటంబాంబుతో పూడ్చలేమని సాధకులూ, సత్యాగ్రహ సంగ్రామ కర్తలూ గ్రహించాలి. కనుక మనుషులంతా హింసను సత్వరం విసర్జించాలి. జంతు లక్షణమైన హింసను విడనాడి ఉన్నత, నైతిక సూత్రమైన అహింసకు కట్టుబడటంలో మానవ ప్రవృత్తి, ఔన్నత్యం వుంది. ద్వేషాన్ని విసర్జించాలంటే ప్రేమే సాధనం.

సత్యాగ్రహమంటే అన్యాయపూరిత సంబంధాలను ప్రేమ లేక ఆత్మశక్తితో సత్సంబంధాలుగా మార్చి వేయడమే. ప్రతి హింస బదులు ప్రేమించడం వల్లే ప్రపంచం కొనసాగుతుంది. హింసను క్షమతో సహిస్తూ వ్యక్తుల్ని ప్రేమించడంలో మనం స్వచ్ఛందంగా బాధల్ని సహించాల్సి వుంటుంది. అలా క్రూరనియంతనైనా ఒక వ్యక్తి తన పవిత్ర ఆత్మశక్తితో ఎదుర్కోవచ్చు. అనగా క్రూర చట్టాలను వ్యతిరేకించవచ్చు. చట్టాన్ని ఉల్లంఘించేవారు చట్టాన్ని విధేయతతో పాటించే స్వభావం కలవారై వుండాలి. అప్పుడే అనగా చట్టం అనుభవంలోకి వచ్చినపుడే దాని మంచి చెడ్డలు నిర్ణయించవచ్చు. బ్రిటీషు వారి అన్యాయపూరిత చట్టాలను విజ్ఞాపనల ద్వారా సరి చేయలేనపుడు, చెడ్డ చట్టాలనే పాటించబడటం ఇష్టం లేనపుడు ఆ చెడ్డ చట్టాలను ఉల్లంఘించి అందుకు ప్రతిఫలంగా బాధలను (శిక్షలను) స్వీకరించడం సత్యాగ్రహంలో భాగం. ఇది భారత సంప్రదాయంలోని స్వీయ త్యాగమే. ఋషులకు ఆయుధ ప్రయోగం

తెలిసినా వాటి నిరుపయోగమూ, మోక్షానికి అహింస ఎలా మార్గమో కూడా తెలుసు గనుక వారు బాధలను స్వీకరించారు. ఇట్టి పద్ధతినే గాంధీ సవినయ నిరోధం (civilized resistance) అన్నాడు. ఎందుకంటే ఇది అనాగరిక లేక నేరపూరిత నిరోధం (criminal reistance) కాదు కనుక.

ఘర్షణ, యుద్ధము అనేవి ఆటవిక సూత్రాలైతే, తన శరీరానికి బాధలు స్వీకరించడమనేది హింసకు ప్రత్యామ్నాయమూ మరియు మానవత్వపు సూత్రం. అదే అహింస యొక్క అంతస్సారం. మనుషులు మధ్య, రాజ్యాల మధ్య ఇది అమలైతే అత్యంత తక్కువ ప్రాణ నష్టం వుంటుంది. క్రూరుల పై యుద్ధాన్ని నిరాకరించేదిగా కాక, మరింత క్రియాత్మకమైన అసలైన యుద్ధంగా అహింసను అర్థం చేసుకోవాలని గాంధీ అంటాడు. దీని వల్ల మనం భౌతికంగా ఎదుర్కొనే ప్రతి దాడి లేక ప్రతిచర్య చేస్తాము అని ఊహించే శత్రువు ఊహలు తలక్రిందులౌతాయి. అప్పుడే అతను విజ్ఞతతో యోచించే స్థితికి వెళ్ళవచ్చు.

కనుక సత్యాగ్రహానికి క్రమశిక్షణ, ఆత్మనిగ్రహం, పరిశుద్ధత పునాదులు. దానిన ఆచరించే వ్యక్తికి సామాజిక గుర్తింపు (అతన్ని ఇతరులు అనుసరించే నిమిత్తం) అవసరం. చెడు పనిని, చెడు చేసిన వ్యక్తిని వేరు చేసి చూడటం ద్వారా, ఆ వ్యక్తిని ప్రేమించడం ద్వారా చెడును మంచిలోనూ, కోపాన్ని ప్రేమతోనూ, అసత్యాన్ని సత్యంతోను, హింసను అహింసతోను జయించటానికి ప్రయత్నించాలి అని గాంధీ ఉద్బోధిస్తాడు.

అందుకే సత్యాగ్రాహి తన అంతరంగ శత్రువులను జయించడానికి కృషి చేస్తూ వుండాలి. పరిశుద్ధత కోసం చేసే అట్టి కృషే సత్యాగ్రహికి సగం జయాన్ని సాధించి పెడుతుంది. అంతేగాక చెడుకు వ్యతిరేకంగా ప్రజలను సమాయత్తం చేయాలి. చైతన్యపూరిత ప్రజానీకమే చెడును నియంత్రించగలదు. ఒకే వ్యక్తి అయినా సత్యాగ్రహం ద్వారా బలమైన శక్తిని వినియోగిస్తాడు. చెడును నియంత్రించడం అనేది నాగరికంగా వుండాలంటే సత్యాగ్రహాన్ని చక్కగా అర్థం చేసికొని, నిజాయితీగాను, గౌరవంగాను వుండి, ద్వేష భావం లేకుండా వుండాలని గాంధీ చెప్పాడు.

శాసనోల్లంఘనలో అహింస ముఖ్య భాగం. ప్రభుత్వానికి ఆధారమైన హింస ప్రజల యొక్క అన్ని చర్యల్ని నిర్వీర్యం చేస్తుంది. కనుక సత్యాగ్రహులు సైనికుని వలె క్రమశిక్షణ గల్గి ఎటువంటి కవ్వింపు చర్యలకు లొంగక తీవ్ర నిగ్రహం కల్గి వుండాలి. రాజ్య విధేయత వల్ల తమకు స్వేచ్ఛ కలుగుతుందని గ్రహించినా, చెడు చట్టాన్ని గౌరవించడమనేది చెడును స్వీకరించడమే. నిజమైన సత్యాగ్రాహి చెడు చట్టాలను వాటిని అమలుపరిచే రాజ్యాధికారాన్ని తిరస్కరిస్తాడు. తన పై హింస జరిగినా తాను హింసను వాడుట చట్టధిక్కారము, శాసనోల్లంఘనము ద్వారా తాను స్వేచ్ఛను స్వచ్ఛందంగా కోల్పోయి జైలు కైనా వెళతాడు. ఇట్టి వ్యక్తులు కొద్ది మందైనా నిజాయితీగా వుంటే అధికఫలం సాధించగలరు అని గాంధీ విశ్వసించాడు.

నియంతలు ఉపయోగించిన హింస కూడా శాశ్వత ఫలితాల నివ్వలేకపోయింది. నశ్వరమైన భౌతిక శక్తి పై ఆధారపడిన హింస తాత్కాలిక ఫలితాలనే ఇవ్వగలదు. అన్యాయపూరిత ప్రభుత్వాలను వ్యతిరేకించడం ప్రజల యొక్క హక్కు మాత్రమే గాక బాధ్యత కూడా అని గాంధీ నమ్మాడు. కనుక అధికార హింసకు లొంగక, అందుకు ప్రతిఫలంగా వచ్చే బాధలు, శిక్షలు ధైర్యంగా స్వీకరించాలి. ఆ విధంగా సత్యానికి కట్టుబడి న్యాయం సాధించడానికి భౌతికంగా (ప్రాణాలతో సహా) ఎంత మూల్యమైనా చెల్లించవచ్చు. అవినీతి, అసత్యం కన్నా మరణమే మేలని గాంధీ అంటాడు.

చెడును నిర్మూలించలేకపోయినా దానిని సమర్థించకుండా, దానికి సహకరించకుండా, సహాయం చేయకుండా వుండాలి. కొన్ని మంచి విలువలను, అభిప్రాయాలను కలిగి వున్నంత మాత్రాన మనిషికి సంతోషం లభించదు. వాటి అమలుకు ప్రయత్నం చేయాలి. అలా చేసేటప్పుడు తన బంధు మిత్రులను, దేశాన్ని కూడా విస్మరించవచ్చు. సత్యాన్ని ఆచరించడం వల్ల అంతిమంగా మానవాళికంతకూ సేవ చేయగల్గుతారు.

చెడును నిర్మూలించేందుకు అధిక సంఖ్యాకుల మద్దతుకై ఎదురు చూడరాదు. సత్యాగ్రహుల (సత్యాన్ని ఆశ్రయించి వుండే వారి) వెంట దైవం వుంటుంది. ఒక ప్రభుత్వం ఎవరినైనా అన్యాయంగా నిర్బంధిస్తున్నప్పుడు నిజాయితీ పరులు వుండదగ్గ

అసలైన ప్రదేశం జైలే అని గాంధీ నమ్మాడు (అంటే సత్యాగ్రహులు నిర్బంధం వంటి శిక్షలను స్వీకరించాలి). బానిస రాజ్యంలో స్వేచ్ఛా జీవి గౌరవంగా వుండగలగేది జైలులోనే. బయట వుండి అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడేదాని కన్నా నిర్బంధంలో వుండి సత్యవాది చేసేదే తీవ్ర పోరాటం అవుతుంది. అలాకాక చట్టధిక్కారం వల్ల కుటుంబానికి, ఆస్తికి జరిగే పరిణామాలకు భయపడేవారు నియంతృత్వ రాజ్య రక్షణలోనే వుంటారు. కాని మనసును చంపుకొనే అట్టి అవమానకర స్థితి కన్నా ఆ రాజ్యాన్ని వ్యతిరేకించడమే తేలిక మరియు మంచిది. నిర్బంధంలో వున్న సత్యాగ్రాహి మనస్సు స్వేచ్ఛగా వుండగలదు. పాలకులు మరియు వారిని అంగీకరించి స్వేచ్ఛగా వున్నట్లు కన్పించే వారే నిజమైన బానిసలు. అట్టి నియంతల రాజ్యం సత్యాగ్రాహులను ఏ మాత్రం కదిలించలేక పోయింది. పైగా వారి శరీరాలకు ఒకోసారి హాని చేయలేని స్థితిలో కూడా వుంటుంది. సత్యం అంటే వున్న భయమే దాన్ని నిస్సహాయం చేస్తుందని గాంధీ అంటాడు.

తన నిర్భయత్వం వల్ల సత్యాగ్రాహి శత్రువు యొక్క మంచి తనాన్ని నమ్ముతాడు. మానవ స్వభావంలోని మంచితనం పై విశ్వాసం వల్ల రాజీపడే అవకాశాలను వదులుకోడు. అలా చెడు చేసేవాడితో సంబంధాన్ని తృంచివేయక దాన్ని మరింత పవిత్రంగా చేసేందుకు సత్యాగ్రాహి కృషి చేస్తాడు. ఈ విధంగా శత్రువులోని మంచి కోణాలను తెలియజేయడం ద్వారా వాటిని పెంచుతూ పాశవికతను అణచుకోడానికి సహాయపడవచ్చు.

సత్యాగ్రహం అనేది ఆత్మశక్తి గనుక కొద్ది మంది సత్యాగ్రహులైనా భారతదేశానికి స్వాతంత్ర్యం సాధించగలరు. వారి వెనుక మౌనంగా వున్న కోట్లాది భారతీయుల శక్తి వున్నది. ధృడచిత్తం, మృదుత్వం అనేవి విజయాన్ని సాధిస్తాయి. అత్యధికులు నిజాయితీగా సత్యాగ్రహానికి పూనుకొంటే ప్రజా వ్యతిరేక ఆజ్ఞలు నిష్క్రమిస్తాయి. అయితే సత్యాగ్రాహి తీవ్ర వ్యతిరేక పరిస్థితులకు సిద్ధపడివుండాలి. కొందరు ఉద్యమం నుంచి నిష్క్రమించే అవకాశం వుంది. సత్యాగ్రహులు అవమానాలకు, కారాగార వాసానికి గురి చేయబడవచ్చు. ఆకలి దప్పులకు, తీవ్రమైన చలికి, వేడికి గురికావచ్చు. తీవ్ర శారీరక శ్రమ చేయవలసి రావచ్చు. కొరడా దెబ్బలు, అపరాధ రుసుము, ఆస్తి స్వాధీనము, దేశ బహిష్కరణ లాంటివి విధించవచ్చు. జైలులో నిరాహారం తదితర సమస్యల వల్ల కొందరు మరణించవచ్చు. అయితే సమాజం మొత్తం చెడ్డ చట్టాలను నిరోధిస్తే సత్యాగ్రహం ఫలవంతమౌతుంది. గాంధీ దృష్టిలో సత్యాగ్రహ విజయానికి నిజాయితీపరులైన కొద్ది మంది సత్యాగ్రహులు చాలు. అత్యధికులు పోరాటం నుంచి విరమించినా గాంధీ తాను మరణించడానికి ఇష్టపడతానన్నాడు గానీ చెడు చట్టాలకు తలవంచనన్నాడు. స్థిరత్వం లేని వాళ్ళు సత్యాగ్రహ ధర్మానికి కట్టుబడి వుంటామని ప్రతిజ్ఞ చేసినపుడు ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను సంపూర్ణంగా నిర్వర్తించాలి. ఇతరులతో ప్రమేయం లేకుండా వ్యక్తి తన ప్రతిజ్ఞకు తాను మరణించే వరకు కట్టుబడాలి.

తన నిర్భయత్వం వల్ల సత్యాగ్రాహి అధిక స్వేచ్ఛ గలిగి నిరంకుశ చట్టాలకు లొంగకుండా వుంటాడు. అట్టి సత్యాగ్రహాన్ని సమాజానికి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా వాడవచ్చు. ఆ విధంగా బానిస వ్యాపారాన్ని నిరసిస్తూ థోరూ, నల్లవారి స్వేచ్ఛకై లూథర్ చాంధసవాదులకు వ్యతిరేకంగా గెలీలియో, తోటి నావికుల పై కొలంబస్ సత్యాగ్రహాన్ని ఉపయోగించారని గాంధీ పేర్కొన్నాడు.

ప్రేమ ద్వారా సాధించిన దాన్ని ప్రేమతోనే నిలుపుకోవాలి. తల్లి తన గర్భంలోని పిండాన్ని ప్రేమిస్తూ దాన్ని ప్రేమతోనే పెంచుతుంది. లేనిచో బిడ్డ పెరుగుదల సరిగా ఉండదు. అలాగే, తల్లి ఇచ్చే శిక్షణలో ప్రేమ తప్ప శక్తి ప్రయోగం వుండదు. అలాగే సత్యాగ్రహం ద్వారా పొందినదేదయినా సత్యాగ్రహం ద్వారానే నిలుపుకోవాల్సి వుంది. సమాజంలో వున్న దురాచారాలను మనకు సత్యాగ్రహ స్పూర్తి లేమి వల్ల వచ్చాయని గాంధీ భావించాడు. వాటిని మనం అంతమొందించక పోవడానికి మనకు వున్న భయం లేక అలసత్వము లేక కొందరి పట్ల వున్న అనుచిత గౌరవం కారణమని ఆయన భావించాడు.

అధికారం మత్తులో వున్న మనిషి తన లోపాలను గుర్తించలేడు. అప్పుడతని చట్టాలను, ఆజ్ఞలను ఉల్లంఘించే సాత్విక నిరోధకులకు ఆత్మ శిక్షణ అలవడుతుంది. వీరి పై రాజ్య శక్తిని సమర్థవంతంగా అమలు పరచలేరు. అంతేగాక వీరి సమ్మతి లేక అంగీకారం లేకుండా అధికారులు తమ పనులు చేయించలేరు. ఇదే స్వరాజ్య పద్ధతి. ఇందులోనే స్వాతంత్ర్యం వుంటుందని గాంధీ

అన్నాడు. ఇలా సత్యాగ్రహం ద్వారా నిరంకుశ పాలకులను కూడా మార్చవచ్చును. భారతదేశానికి వున్న ప్రత్యేక ఆయుధమే ఈ సత్యాగ్రహం అని గాంధీ వక్కాణించాడు. అందుకే ఇతర ఆయుధాలకన్నా ఇదే ఎక్కువ ఆదరనాన్ని పొందింది. అసలు ఇది సర్వత్రావున్నదే మరియు అన్ని కాలాలలో అన్ని పరిస్థితులలో ఉపయోగించడానికి వీలైనది.

భౌతిక విషయాలకు కాకుండా సత్యానికి కట్టుబడి వుండటం అనేది పవిత్ర విషయం. కనుక అన్యాయ చట్టాలను సవినయంగా వ్యతిరేకించడం అనేది పవిత్ర కార్యమే. అలా చేయలేనపుడు అది అమానుషము, ఆత్మనున్యూనపరచడమే అవుతుంది. ఇలాంటి సవినయ ఉల్లంఘన (civil disobedience) అనే సత్యాగ్రహంను ప్రజలకు ప్రభుత్వానికి మధ్య గాని, తండ్రి కొడుకుల మధ్య గాని, స్నేహితుల మధ్య గాని వాడవచ్చు. ఇరుపక్షాలను పరిశుద్ధుల్ని చేసే ఆయుధం ఇది. దీని వల్ల విజయం నిశ్చయమని గాంధీ భావించాడు. తమకు తెలిసో తెలియకో కుటుంబాలలోనే సత్యాగ్రహాన్ని తరచు పాటిస్తుంటారు. అయితే ఆలసత్వం వల్ల మనం ఈ సూత్రాన్ని కుటుంబం బయట వినియోగించలేకపోతున్నాం. సాంఘిక, రాజకీయ రంగాల్లో దీనితో ప్రయోగాలు చేయడం ద్వారా వాటిలోకి మతాన్ని (నైతిక విలువలను) ప్రవేశపెట్టడమే అవుతుంది.

ఆచరణలో పెట్టటానికి ఆలస్యమైనా గాని పాలకుల - పాలితుల మధ్య విశ్వాసరాహిత్యం బదులు ప్రేమను, నమ్మకాన్ని నెలకొల్పడం ద్వారా సత్ఫలితాలు వస్తాయి. అలాగే భిన్న సామాజిక వర్గాల మధ్య సంబంధాలలో కూడా సత్యాగ్రహం మిక్కిలి ఉపయోగకరం. సత్యం, అహింసలలో నమ్మకమున్న నాయకులు ఈ పద్ధతిని ప్రతిపాదిస్తే ప్రజలు వెంటనే స్పందిస్తారని గాంధీ ఆశించాడు. అంతేగాక సత్యాగ్రహం ద్వారానే జాతి సాంఘిక, ఆర్థిక, రాజకీయ పురోగతి సాధిస్తుందని విశ్వసించాడు. అయితే పోరాడే వ్యక్తి సత్య వ్రతుడైతేనే అతనికి సత్యం వల్ల శక్తి లభిస్తుంది. కనుక సత్యాగ్రహం బలవంతుని ఆయుధం. అట్టి వ్యక్తి మరణ భయం లేకుండా (నిర్భయంగా) పోరాడతాడు.

ఆయుధాలతో పోరాడే వారి ధైర్యం ఆయుధం లోనే వుంది గనుక వారు ప్రవృత్తి రీత్యా నిర్భయులు కారు. సత్యాగ్రాహికి శరీరం, కుటుంబం, ఆస్తి పట్ల మమకార రాహిత్యంతోపాటు నిర్భయత్వం, ప్రేమ, సత్యం పై విశ్వాసం, సత్య వ్రతము అవసరమని గాంధీ అంటాడు. రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడుతున్నప్పుడు సత్యాగ్రాహి ప్రాణాలకు, స్వేచ్ఛకు, ఆస్తి ధ్వంసానికి లేక స్వాధీనానికి అవకాశం వున్నందున అతను ఆస్తి కూడబెట్టరాదు. ఉన్నా మమకారం ఉండరాదు. లేక ఆస్తిని విదేశాల్లో ఉంచుకోవాలి. అంతకు మించి శరీరం పట్ల, కుటుంబం పట్ల వైరాగ్యం మిక్కిలి అవసరం. అట్టి త్యాగంతో కూడిన సత్యాగ్రహ ప్రభావం కుటుంబ సభ్యుల పై కూడా వుంటుంది.

పోరాటంలో ఇరుపక్షాలు సత్యాగ్రహులైతే సత్యాగ్రహమే అవసరం లేదు. అందులో ఒకరు దురాగ్రహులైతేనే సత్యాగ్రహం అవసరమవుతుంది. ప్రభుత్వం పట్ల దురాగ్రహం నాడితే అన్యాయం మరింత పెరుగుతుంది. అలాకాక ప్రేమతో అన్యాయాన్ని ఎదిరిస్తే నిర్భయత్వం సాధ్యం. అలా హింసకు గురి అయినా గానీ సమానత్వం సాధించవచ్చు. దైవానికి తప్ప భూమి పై దేనికీ భయపడక అన్యాయాన్ని వ్యతిరేకించేటప్పుడు సత్యాగ్రహులు ఎంత కష్టమైనా భరించాలని గాంధీ అంటాడు.

అలా సత్యపథంలో పయనిస్తూ సత్యాన్ని చేరాలని గాంధీ ఉద్బోధిస్తాడు. లక్ష్యం - మార్గం అనే చట్రంలో కూడా గాంధీ సత్యాగ్రహాన్ని వివరించడం, విశ్లేషించడం గమనించవచ్చు. లక్ష్యం గూర్చి ఎంత స్పష్టత వున్నా మార్గం తెలియనపుడు దాన్ని చేరలేము. కనుక మార్గాన్ని తెలిసికొని దానిని పరిరక్షించుకొంటూ పురోగమించాలని అంటాడు.

'మార్గం' గూర్చి తెలిసికొంటే చాలు 'లక్ష్యాన్ని' చేరటం తేలిక అని గాంధీ అంటాడు. వాటి మధ్య సంబంధాన్ని విత్తు, చెట్టుల సంబంధంతో పోల్చవచ్చంటాడు. అనగా మార్గం, లక్ష్యం అనేవి అవిభాజ్యాలు. భగవంతుడే మనకు మార్గం విషయంలో పరిమిత స్వేచ్ఛనిచ్చాడు. దాన్ని బట్టి (ఫలితం) లక్ష్యం వుంటుంది. అంటే మంచి మార్గం, మంచి లక్ష్యాన్ని చెడు మార్గం చెడు లక్ష్యాన్ని చేరుస్తుంది. సత్యాగ్రహమే వ్యక్తిని సత్యానికి చేరుస్తుంది. మరియు సత్యం, అహింసలు ఒక నాణేనికి రెండు ముఖాలు. మార్గం - లక్ష్యం సంబంధాన్ని గీతలోని నిష్కామ కర్మ భావనతో గాంధీ జోడిస్తాడు. అనగా మంచి మార్గంలో వేళ్ళడం మన

కర్తవ్యం, ఫలితం దైవానికి వదలాలి. ఇదే సుదీర్ఘమైన మార్గంగా కన్పించినా జన్మ పరంపరను దృష్టిలో వుంచుకొంటే ఇదే దగ్గర మార్గం కూడా. అంతేగాక చెడు మార్గం ద్వారా శాశ్వత సత్యం లభించదని అనుభవం చెబుతుంది. అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని అంటాడు. ఫలితం ఆశించని ప్రయత్నమే మన కర్తవ్యమని గాంధీ పేర్కొంటాడు.

అహింసను ఏ మేరకు ప్రదర్శిస్తామో ఆ మేరకు మనకు దివ్యత్వం వస్తుంది. ఇక్కడ చెడు చేసే వానికీ మేలు చేయడమంటే అతను చేసే చెడు పెంచడం కాదు. అతనికి నష్టం జరిగినా కాని అతనికి దూరమవడం, సహకరించకపోవడమే అతని మీద ప్రేమతో మేలు చేయడం. అయితే దుర్మార్గుణ్ణి బలవంతంగా మంచిగా మార్చరాదు. ఎందుకంటే హింస జంతు ప్రవృత్తి. మనిషి తన సహజ ప్రవర్తనా సూత్రమైన అహింసకు కట్టుబడినపుడు ఉన్నత లక్ష్యం సుసాధ్యం. ప్రేమ మీద విశ్వాసం వున్న వారికే ఇది లభ్యమౌతుంది. ప్రతి మనిషికీ ఇది సాధ్యం కూడా అంటాడు గాంధీ. అహింసావాది తన ఆత్మ గౌరవం తప్ప అన్నింటినీ త్యజించడానికి సిద్ధపడాలంటాడు.

నేడు సమాజానికి ఆధారం పూర్తిగా అహింస కాకపోయినా అది హింసే అయివుంటే మనుషులు తక్కువ మందే మిగిలి వుండేవాళ్ళు. కుటుంబాల మధ్య వున్న ప్రేమ జాతుల మధ్యకు ఇంకా ప్రవేశించలేదు. జడమైన అణువులకే ఒక క్రమం ఉన్నప్పుడు మనుషుల మధ్య ప్రేమ బంధం మరింత సాధ్యం. మానవ జాతి కొనసాగించడమే ప్రేమ సూత్రం పని చేస్తుందన్న విషయాన్ని ఋజువు చేస్తుంది. అయితే చరిత్ర యుద్ధాలనే పేర్కొంది కాని మానవ సంబంధాలలో ప్రేమను విస్మరించింది. మనకు కనబడే హింస పై వున్న నమ్మకాన్ని తగ్గించలేదు. మానవ జాతి పరిణామ క్రమంలో మాంసం తినే స్థాయి నుంచి వేటాడే దశకు, అక్కడ నుంచి వ్యవసాయము, స్థిర, నాగరిక జీవన స్థాయికి చేరుతూ అహింస వైపు పయనిస్తుంది. అయితే అది సాగింత ముందుకు సాగాలని గాంధీ ఆశించాడు. తిరోగమనానికి కూడా అస్కారమున్నందున నిరంతర కృషి అవసరమన్నాడు. మనిషి మరణానికి సిద్ధపడి జీవించినపుడే స్వేచ్ఛగా వుండగలడు. అహింసకు కట్టుబడిన వారికిది సాధ్యం.

చిరునవ్వుతో దాడి మూలంగా వచ్చే మృత్యువును చూసినచో, ఆ చిరునవ్వు కూడా హంతకునిలో ప్రేమను చిగురింప జేస్తుంది. సత్యం, అహింసలు జీవన సూత్రాలుగా వుంటే ఏదీ అసాధ్యం కాదు అని గాంధీ విశ్వసిస్తాడు. అహింస ఒక శాస్త్రం అని, ఆశించిన ఫలితం దక్కకపోతే అది మరిన్ని పరిశోధనలకు దారి తీస్తుందేగాని, అంతమైపోదు. అంతేగాక శరీరాన్ని ఆహారం పోషించినట్లుగా అహింస ఆత్మను జాగృతం చేస్తుంది. అది ఆత్మకున్న ప్రత్యేక లక్షణం. దీని ద్వారా మనిషి తన జీవిత లక్ష్యాన్ని చేరాలని గాంధీ బోధించాడు.

సత్యం, అహింసలు వున్న చోట దైవం వుంటుంది. దైవం అచలం, సర్వవ్యాపం, అనంతం కనుక ఈ పద్ధతిని కూడా అలాగే (అందరిపట్ల, అన్నిచోట్ల, అన్ని కాలాలలో) ఉపయోగించాలి. దీనికై మనకు వినయం, నిజాయితీ నిస్వార్థత వంటి లక్షణాలు వుండాలి.మనలోని ఆలసత్వం వల్ల ఇవి కష్టమైన విషయాలుగా కనబడతాయి. సత్యం, అహింసల పట్ల దృఢవిశ్వాసం సగం విజయంతో సమానం. విశ్వాసం వల్ల వాటిని అనుసరించి లక్ష్యం చేరడం తేలిక.

అయితే అహింస ఆచరణకు కావలసిన శిక్షణ అనేది హింసలో ఇచ్చే శిక్షణ కన్నా సుదీర్ఘమైనది, కష్టతరమైనది. విశ్వాసాలు, దైవస్మరణ చేస్తూ చెడు పనులు చేయలేరు మరియు ఆయుధాల పై గాక దైవం పై ఆధారపడతారు. పిరికివాళ్ళు ఆయుధాలు చేపడతారు మరియు దైవాన్ని కూడా నమ్మలేరు. విశ్వాసికి ఆయుధం పెట్టే బలం, ధైర్యం వుంటాయి. అందరినీ దైవ స్వరూపంగా చూస్తాడు గనుక హింస చేయడు. శక్తి అనేది దృఢచిత్తంలోంచి రావాలి అని, నిర్భయత్వం అనేది ఆధ్యాత్మికతకున్న మొదట అవసర్యక విషయమని గాంధీ అంటాడు.

అహింస ద్వారా శత్రుత్వం, శత్రుభావన అంతమైపోతాయి. నిరంతర ప్రయత్నం వల్ల అనేక ఆటంకాలు అధిగమించాలి. కనుక దైవ మార్గానికి ధైర్య, సాహసాలు అవసరం. కనుక మనసుతోనే దాన్ని మొదలు పెట్టి మనసులో వున్న బలహీనతలను, పిరికితనాన్ని, పిత్రుభావనలను ధైర్యంగా విసర్జించాలి. లేనిచో హింసాత్మక మనసుతో శరీరం చేసే అహింస సఫలం కాదు. దాని

లక్ష్యాన్ని చేరలేము. కనుక నిరంతర, తీవ్ర మానసిక శిక్షణ అవసరం. ఆలోచన, మాట, క్రియలు మూడూ కూడా సత్యం, అహింసలతోకూడి వుంటే పరిపూర్ణ స్థితికి చేరవచ్చని గాంధీ అంటాడు.

ఈ సాధన చేస్తూ మనల్ని మనం పరీక్షించుకోడానికి మనసుకు, శరీరానికి తీవ్ర హాని కల్గించే చోటుకు వెళ్ళాలి. ఉదాహరణకు ఇరువురు వ్యక్తులు కొట్లాడుతున్నప్పుడు నష్టానికి సిద్ధపడి హింసను ఆపే ప్రయత్నం చేయాలి. అట్టి సత్యాగ్రహికి శరీరం ప్రధానమైనది కాదు. అతని లక్ష్యమైన దేవుడే అతనికి రక్షా కవచం. అహింస అత్యున్నత ఆయుధం గనుక దాని అర్థాన్ని దేవుని అనుగ్రహంతోనే గ్రహించాలి గాని మాటలతో కాదు.

కుటుంబంలోనే అహింసను చేపడితే దాన్ని ప్రపంచంలో ఎక్కడైనా తేలికగా ప్రయోగించవచ్చు. సత్యాగ్రహికి ప్రపంచమంతా కుటుంబమే. ఆయన ఎవరినీ భయపెట్టడు. ఎవడూ ఆయనకు భయపడరు. అహింస స్వీయానుభవంతోనే మొదలవ్వాలి. 'పాపాన్ని ద్వేషించు, పాపిని కాదు' అనే సూక్తి ప్రకారం మనిషిని, పనిని వేరుగా చూసి మంచి పనిని మెచ్చుకొని, చెడ్డ పనిని విమర్శించాలంటాడు గాంధీ. అంతేగాని మనిషిని ద్వేషించరాదు. ఇది కష్ట సాధ్యం కనుక తీవ్ర ఆచరణాత్మక శిక్షణ మనుషులకు జాతికి అవసరం. అలా అహింస అలవడిన వ్యక్తుల జీవితం ప్రేమమయం అవుతుంది.

అహింసను పాటించాలనుకొన్నవారు కోపాన్ని నిగ్రహించుకోవాలి. ఇది కుటుంబంలో శిక్షణలాగా కూడా వుంటుంది. మనుషుల మధ్య, జాతుల మధ్య సంబంధాలలో ఇది భాగమవ్వాలి. జాతీయతకు, విశ్వమానవ ప్రేమకు వైరుధ్యం లేదని గాంధీ అంటాడు. చెడు పట్ల అత్యంత వ్యతిరేకతను, మనుషుల పట్ల అత్యంత ప్రేమను సమన్వయం చేయవచ్చును. అసత్య చట్టాల రూపంలో వున్న తప్పును లేక చెడును వ్యతిరేకిస్తూ సహనం కల్గి వుండాలి. అలా సత్యాగ్రహం సవినయ ఉల్లంఘన లేక సవినయ నిరోధంగా వుంటుంది. ఇది ఎలా సవినయం లేక నాగరికం (civil) అంటే ఇది నేరపూరితం కాదు కనుక. ఆ క్రమంలో రాజ్యానికి తన సహకారాన్ని (Co-Operation) ఉపసంహరిస్తాడు. ప్రజల అంగీకారం పైనే ప్రభుత్వం ఆధారపడి వుండాలన్న సూత్రం పై సత్యాగ్రహం ఆధారపడి ఉంటుంది.

'మనిషికి నిరపేక్ష సత్యాన్ని తెలిసికొనే సామర్థ్యం లేనందున అతనికి ఇతర్లను శిక్షించే అధికారం లేదు' అనేది సత్యాగ్రహంలో (హింస కాక) ప్రేమే వుండటానికి మరో కారణం. సత్యాగ్రహం యొక్క సార్వత్రిక ప్రయోజకత్వమే దాని శాశ్వతతత్వాన్ని, విజయాన్ని సూచిస్తుంది.

మనిషిలో జంతువు కన్నా ఉన్నతమైన అంశ వున్నదన్న విశ్వాసము మరియు హింస ప్రేమకు లొంగుతుందన్న విశ్వాసము వున్నవాళ్ళు సత్యాగ్రహానికి సమర్థులైనవారు సత్యాగ్రహశక్తి ప్రయోగానికై పేదరికానికి కట్టుబడి వుండటం (బాధలు స్వీకరించే క్రమంలో) అవసరం. క్రమశిక్షణతోకూడిన దీర్ఘకాల పోరాట మార్గం అనే వ్యక్తి పరిపూర్ణుడౌతాడు. అలా సత్యాగ్రహం ఒక ఉదాత్తమైన, ఉన్నతమైన విద్య అవుతుంది. మామూలు విద్య కన్నా ముందు ఇది ప్రతి బిడ్డకూ అలవడితే జీవన పోరాటంలో ద్వేషాన్ని ప్రేమతోనూ, అసత్యాన్ని సత్యంతోనూ, హింసను బాధలతోనూ తేలికగా జయించడం జరుగుతుంది. అలా సత్యాన్ని అన్వేషిస్తూ దాన్ని చేరే నిరంతర ప్రయత్నమే సత్యాగ్రహం అవుతుంది. ఇది బాధలు స్వీకరించడం నేర్పుతుంది గనుక ఒక వ్యక్తి ఒక బలమైన సామ్రాజ్యాన్ని ఎదుర్కోగలడు. దీని విజయానికి స్థూలంగా మూడు ఆవశ్యకతలు వున్నాయి:-

1. ప్రత్యర్థి పట్ల ద్వేషం వుండరాదు
2. విషయం లేక సమస్య నిజమైనదై వుండాలి
3. చివరి వరకు సత్యాగ్రహి బాధలు పడటానికి సిద్ధపడి వుండాలి.

ఈ లక్షణాలతోటి పోరాటమే లక్ష్యానికి మంచి మార్గం.

పద్ధతుల్లో కెల్లా సత్యాగ్రహం బలమైనది గనుక సామరస్య పూర్వకంగా ప్రజలకు, ప్రభుత్వానికి సమస్యా పరిష్కారాలను గూర్చి నివేదించిన పిదపే సత్యాగ్రహానికి దిగాలి. క్రూర పాలకులకు ప్రజల శరీరాల మీద, ఆస్తుల మీద అధికారం వుందని, అయితే వారు వ్యక్తుల ఆత్మలను ఏమీ చేయలేరని గుర్తుంచుకోవాలి. ఈ సత్యం నుంచే సత్యాగ్రహ విజ్ఞానమంతా లభిస్తుంది. అలా బలమైన విశ్వాసము, వినయము, సహనము సత్యాగ్రహం ద్వారా అలవడతాయి.

అనంతమైన సత్యానికి కట్టుబడిన సత్యాగ్రహికి అప్రమేయశక్తి కలిగి తరతమ బేధాలు శత్రు భావన లేక అందరి పైనా ఆశక్తిని (విశ్వప్రేమ లేక అహింస) ప్రయోగిస్తారు. అయితే కొన్ని లక్షణాలు శిక్షణ సంపాదించిన వారు మరింత సమర్థవంతంగా ఈ శక్తిని ఉపయోగిస్తారు.

ఇతర్లను గాక తనని తాను వశపరచుకొనే ప్రేమ కనుక సత్యాగ్రహి మరణం వరకు బాధలు సహిస్తాడు. అతను కోపానికి లోనుగాక ఇతర్ల కోపాన్ని భరిస్తాడు గాని భయంతో చెడు ఆజ్ఞలు పాటించడు. తాను ధర్మకర్తగా వున్న ఆస్తిని మాత్రం చివరి వరకు కాపాడే ప్రయత్నం చేస్తాడు. వ్యక్తిగత ఆస్తి ధ్వంసమైనా, ప్రభుత్వ స్వాధీనమైనా భరిస్తాడు. అయితే సమర్థించడం మానడు. బ్రిటీష్ పతాకానికి వందనం చేయడు. అధికారులను అవమానించడు. పైగా వారు అవమానానికి, దాడికి గురైతే కాపాడతాడు. చెడు మార్గంలో వారిని భయపెట్టకుండా వారి హృదయాల్లో మార్పు తెస్తానికి ప్రయత్నిస్తాడు. ఈ ప్రయత్నంలో తమ సంఖ్యాపరమైన బలం పై గాక సత్యనిష్ఠ వల్ల లభించిన ఆత్మశక్తి పై ఆధారపడతాడు. ఖద్దరు ధరిస్తాడు. విచక్షణ పోగొట్టే మత్తు పదార్థాల జోలికి పోడు. మనస్ఫూర్తిగా క్రమశిక్షణ సూత్రాలు పాటిస్తాడు. ఆత్మగౌరవానికి భంగం కల్గించని జైలు నియమాలనూ గౌరవిస్తాడు. ఈ లక్షణాల వల్ల బ్రిటీష్ వారిలో మార్పు సాధించడం సాధ్యమని గాంధీ నమ్మాడు.

అహింసా పోరాటాన్ని విజయవంతం చేయడానికై మత కల్లోలాల ప్రభావం తగ్గించడానికి, నిరోధించడానికి ప్రాణాలకు తెగించి పని చేసే ఒక శాంతి దళం ఆవశ్యకతను గాంధీ గుర్తించాడు. ఆ దళ సభ్యులకు ఈ క్రింది లక్షణాలు ఉండాలి. అవి:

1. దైవం, అహింసల పై విశ్వాసం. దీనివల్ల సర్వులలోనూ దైవాన్ని చూడగలరు మరియు ధైర్యంగా మరణానికి సిద్ధపడగలరు. దుర్మార్గుణ్ణి కూడా గౌరవించగలరు.
2. దైవాన్ని చేరే మార్గమే మతం గనుక అన్ని మతాలను గౌరవించాలి. అన్ని మత సూత్రాల జ్ఞానం అవసరం.
3. సాధారణంగా స్థానికులనే సభ్యులుగా చేయాలి. ఇది సమర్థతను పెంచుతుంది.
4. ఒకరు గాని చిన్న గ్రూపుగానీ ఈ పని చెయ్యగలడు. కనుక సంఖ్యా బలం కోసం ఎదురు చూడనక్కర్లేదు.
5. నిరంతర సేవా కార్యక్రమాల ద్వారా ప్రజలకు సన్నిహితంగా వుంటే అట్టి వారు అరాచక పరిస్థితులలో అనుమానితుడు గాను, అవాంఛనీయ వ్యక్తిగాను చూడబడడు.
6. నిష్పక్షపాత దృష్టి కల్గి వుండాలి.
7. అలజడులకు సంబంధించి గతంలోని ముందస్తు హెచ్చరికల ఆధారంగా శాంతి దళం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలి.
8. ప్రజలందరిలో స్నేహ సంబంధాలు నెరపగలిగే తీరిక వున్న వ్యక్తులతో శాంతి దళం నెలకొల్పడం మంచిది.
9. సభ్యులు తేలికగా గుర్తించబడేందుకు వీలుగా ప్రత్యేకమైన దుస్తులు (పేదల స్థాయిలోనివి) ధరించాలి. అవి వేడి, చలి, వర్షం నుంచి కాపాడగలిగేవైతే చాలు.

సత్యాగ్రహి తాను నిర్మూలించదలచిన విషయానికి విస్తృతమైన, తీవ్రమైన ఆందోళనా కార్యక్రమం ద్వారా బహుళ ప్రచారం కల్పించాలి. తద్వారా చెడు వ్యాప్తిని నిరోధించాలి. అంతేగాక అహింసావాది తన శిక్షణను రోగులకు సేవ చేయుటలోను, ప్రమాదంలో వున్న వారిని - ఉదా॥ దొంగలు, దోపిడీదార్ల నుంచి ప్రజల ప్రాణాలను, ఆస్తులను రక్షించడంలోను పొందుతాడు. బాహ్య శత్రువులు

లేనందున అహింసా వాది తన ప్రత్యర్థులకు తగిన విచక్షణ నిమ్మని దైవాన్ని ప్రార్థిస్తాడు. అలా తాను నైతికంగా పెరుగుతాడు. హఠయోగం లాంటివి శరీరాన్ని దృడపరచి, పరిశుద్ధం చేసి మనోనిగ్రహానికి దారి తీస్తుంది. సత్యాగ్రహి శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా లేకపోతే భయానికి లోనవుతాడు. కనుక శారీరక శిక్షణ అవసరం. రక్షణ బాధ్యత నిర్వహించేందుకు ఒకే చోట రోజంతా స్థిరంగా నిలుచుని వుండటం, తీవ్ర వాతావరణ పరిస్థితుల్లోనూ జబ్బు పడకుండా వుండటం, ప్రమాద స్థలానికి వేగంగా వెళ్ళ గలగడం, ఒంటరిగా ప్రమాదకర ప్రదేశాల్లో తిరిగే ధైర్యం, విపరీతమైన శారీరక హింసను, ఆకలిని భరించే శక్తిని కల్గి యుండటం వంటి లక్షణాలు సత్యాగ్రహికి అవసరం. అలా అవసరంలో ప్రమాదంలో వున్న వ్యక్తులున్న చోటుకు చేరి వారికి సేవ చేసే క్రమంలో వచ్చే కష్టాలను సంతోషంగా స్వీకరించాలి. ఈ శిక్షణనంతటికీ ఆధారం దైవం పై విశ్వాసం. విశ్వాసి భూమి పైని ఎటువంటి భౌతికశక్తి కైనా ఎదురు నిలవగలడు.

దైవ విశ్వాసము వంటిదే బ్రహ్మచర్యము కూడా. సత్యాగ్రహికి ఇంద్రియ నిగ్రహం ద్వారా అంతర్గత శక్తినిచ్చేది బ్రహ్మచర్యమే. మితాహారిగా వుండి శక్తి వంతంగా వుండాలంటే ప్రాణశక్తి (vital energy)ని కాపాడుకోవాలి. అలా కాపాడుకొన్న శక్తి అమితంగా పెరుగుతుంది. రూపానికి, స్పర్శకు, ఇతర భౌతిక ప్రభావానికి లొంగే వాడు తన శక్తిని కాపాడుకోలేడు. అలాగే కీర్తినీ, సంపదను ప్రేమించేవాడు సత్యాగ్రహి కాలేడు. కనుక మానసికంగా కూడా బ్రహ్మచర్య అవసరం. తాను కాపాడుకొన్న శక్తి తనను కాపాడుకోటానికి ఉపయోగపడుతుంది. ఇదే సత్యాగ్రహి శారీరక శిక్షణకు ఆధారం.

బ్రహ్మచర్యం ద్వారా నిర్భయుడైన వ్యక్తిని భౌతిక ఆయుధాలు ఏమీ చేయలేవు. అతడు ప్రత్యర్థిని నమ్మడానికి భయపడడు. అనగా అనేకసార్లు మోసపోయినా మనిషి యొక్క మంచితనం పై విశ్వాసమే ప్రత్యర్థిని విశ్వసించడానికి ఆధారం. పోరాటానికి సిద్ధపడిన సత్యాగ్రహి శాంతి కోసమూ ఆరాటపడతాడు. అందుకే శాంతికై వచ్చే సగౌరవమైన అవకాశాన్ని అతడు ఆహ్వానిస్తాడు. అలాగే గౌరవ ప్రదంగా రాజీపడే ఏ అవకాశాన్నీ విడవడు. రాజీ కుదరనపుడు పోరాటం కొనసాగిస్తాడు. ప్రత్యర్థుల దృష్టి కోణాన్ని తద్వారా విషయాలను అర్థం చేసికొంటే ప్రపంచంలో నాల్గింట మూడువంతుల అపార్థాలు తొలగినట్లే. అప్పుడు వారి పట్ల ఉదారంగా వుండి వెంటనే స్పందించడం వీలవుతుంది. అంతేగాక సత్యాగ్రహి తన తప్పులను పెద్దవిగాను, స్పష్టంగాను, ఇతర్లవి చిన్నవిగానూ చూడాలి అని గాంధీ అన్నాడు.

సత్యాగ్రహి పోరాట కాలానికి, ఓరిమికి పరిమితులు లేనందున అతనికి ఓటమి అనేదే వుండదు. సత్యాగ్రహ పద్ధతి విజయాన్ని విశ్వసిస్తే కష్టాలను లెక్కచేయడు. మార్గం మరియు లక్ష్యం పై విశ్వాసం వుంటే ఎర్రని సూర్యుడు చల్లగా వుంటాడు. అలసట చెందడు. అసహనంగా మారడు. సమయం వృథా చేయక ఏ పనిలో నిమగ్నమైతే ఆ పనిలో ఆనందాన్ని పొందుతాడు. అలాగే వస్తువుల్నీ, సమయాన్నీ వృథా చేయక వాటిని జాతికి చెందినవిగాను, వాటి ఉపయోగార్థము ధర్మకర్తలుగా వుంటాడు. గాంధీకి మొదటిదీ చివరిదీ కూడా సత్యాగ్రహమే గనుక భారత స్వాతంత్ర్యానికి దీన్ని మించిన మార్గం లేదని గ్రహించాడు.

ప్రజలకు విలువైన వస్తువుల హేతువు ద్వారా మాత్రమే గాక, బాధలు అనుభవించడం ద్వారా కూడా లభించాయని గాంధీ పేర్కొన్నాడు. హింసించడం ఆటవిక సూత్రమైతే, బాధలు పడటం మానవ సూత్రం. ఈ సూత్రమే వ్యతిరేకులలో మార్పు తెచ్చి వారి చెవులు హేతువును వినేటట్లుగా చేస్తుంది. నిజమైన సహనం కష్టాలను తెలియనివ్వకపోగా ఆనందాన్నిస్తుంది. విజయం తథ్యమని తెలిసినా తాను బాధలనుభవిస్తుందీ విజయాన్నిచ్చేది దైవమే అని సత్యాగ్రహి గ్రహించాలంటాడు గాంధీ. యుద్ధంలో లక్షల మంది త్యాగం కన్నా ఒక అమాయకుని త్యాగం అత్యంత విలువైనది. అతని ఇష్టపూర్వక త్యాగం అతను ఎలాంటి నియంతనైనా ఎదుర్కొనేందుకు సిద్ధం చేస్తుంది.

చెడు నిరోధించేందుకు చేసే సహాయ నిరాకరణ ద్వేషం, ప్రతీకారం లేకుండా ప్రేమ పూరితమై వుంటుంది. ఇట్టి అహింసాతత్వం దైవ ఆధారితం కనుక ఇది హుందాతనంతో కూడిన వినయాన్ని సూచిస్తుంది. త్వరిత విజయానికి వినయం తోడ్పడుతుంది. సహాయ నిరాకరణకు కారణం బలమైనదైతే దానికి సామాజిక సమర్థింపు లభిస్తుంది. తండ్రి చేస్తున్న చెడు పనికి వినయవంతుడైన

కొడుకు సహాయ నిరాకరణ చేస్తాడు. అవసరమైతే ఇంటి నుంచి వెడలుతాడు. ఆ వియోగాన్ని భరించలేని తండ్రి తను చేసిన పనికి పశ్చాత్తాపడతాడు. అలాంటివే రాజుకు ప్రజలకు మధ్య కూడా సాధ్యమే. అయితే ప్రజలు నిర్భయులై స్వేచ్ఛా ప్రియులైనపుడే సహాయ నిరాకరణ సాధ్యం. సందర్భాన్ని బట్టి అది వారి యొక్క బాధ్యత కూడా అవుతుంది. శిక్షకు భయపడిగాక స్వచ్ఛందంగానే ప్రభుత్వ చట్టాలు పాటిస్తారు. ఇట్టి హేతుబద్ధమైన, ఇష్టపూర్వకమైన విధేయత కలవారే సమర్థవంతంగా సత్యాగ్రహం (సహాయనిరాకరణ) చేయగలరు. వారు ఆ హక్కు పొందుతారు కూడా. ఇబ్బందికరమైన అనేక చట్టాలు వుంటాయి కనుక సహనం వుండాలి. అయితే అవి సహించరానివి మరియు అనైతికమైనవి అయినపుడే సహాయ నిరాకరన మరియు సవినయ శాసనోల్లంఘన చేపడతారు. తత్ఫలితమైన బాధలు సహించడం మరో అర్హత అవుతుంది. అనగా బాధలు భరించలేని వారు, సంపదను, కుటుంబ బంధాల్ని త్యజించలేనివారు సత్యాగ్రహానికి అనర్హులు కనుక పై లక్షణాలు అవసరం. అంటే క్రమశిక్షణ అవసరం. దీన్ని కొన్ని పరిమితులకు లోబడి బాధ్యతగా వేయకపోతే అది నేరం అవుతుంది. తప్పు చేసిన వారు, తప్పు చెయ్య నిరాకరించిన వారు కూడా శిక్షలు అనుభవిస్తుంటారు. అయితే నేరస్తులు చట్టాన్ని ఉల్లంఘించి శిక్షలు తప్పించుకో చూస్తారు. సత్యాగ్రహులు అలాకాక జైలు నియమాలను (ఆత్మగౌరవానికి భంగం లేనంత వరకు) వాటి వల్ల వచ్చే కష్టాలను ఇష్టపూర్వకంగా స్వీకరిస్తారు. బయట వుండి కన్నా ఇక్కడే తమ ధ్యేయానికి కృషి చేస్తారు. అనగా ఇక్కడ విరోధం ముగిసి విధేయత మొదలవుతుంది. తనునాగరిక ప్రవర్తనచే నేరస్తులనూ ప్రభావితం చెయ్యగలరు. జ్ఞానం, శక్తి గలిగిన అట్టి ప్రవర్తన నియంతలలోనూ మార్పు తేగలదు. ఆ విధంగా స్వచ్ఛందంగా బాధలు స్వీకరించడమనే దాన్ని అన్యాయాలను అరికట్టే సత్వర, ఉత్తమ పరిష్కార మార్గంగా గాంధీ పేర్కొన్నాడు.

సహాయ నిరాకరణలో అహింస కీలక అంశం. అహింసతోనే పోరాటం కొనసాగించగలమని, అత్యంత రెచ్చగొట్టే పరిస్థితుల్లోనూ హింసకు పాల్పడము అనే సంయమమే సత్యాగ్రహ సైనికుని అసలు లక్షణం. ఇట్టి స్ఫూర్తితో పోరాడితే దైవాన్ని చేరే అర్హత, దాన్ని బట్టి మిగతా అంశాలు వుంటాయి. ఈ పోరాట క్రమంలో ప్రజలు క్రమశిక్షణ, ఆత్మ నిగ్రహం, సమిష్టి కార్యాచరణ, అహింస, వ్యవస్థాపన మరియు జాతి ఔన్నత్యాన్ని పెంచే ఇతర అంశాల ప్రాధాన్యతనూ గ్రహిస్తారు అని గాంధీ విశ్వసించాడు.

సత్యాగ్రహ వృక్షం కొమ్మలే సహాయ నిరాకరణ, సవినయ శాసనోల్లంఘన. అన్యాయ చట్టాలను నిరోధించడం ద్వారా ప్రభుత్వం జనేచ్ఛను గౌరవించేట్టు చేయాలి. విధేయత తెలుపము అని చెప్పడం ద్వారా మనం చేసేది న్యాయమే అని గాంధీ ప్రకటించాడు. ఇది న్యాయం వైపు పయనం. శాసనోల్లంఘన ద్వారా ప్రభుత్వం పట్టు వదలడమే గాక, ప్రజలు తమ శక్తిని గ్రహించి ఆత్మ విశ్వాసాన్ని పెంచుకోగలరు. గాంధీ ఆధ్వర్యాన స్వాతంత్ర పోరాటంలో భాగంగా రద్దు చేయవలసిన చట్టాలన్ని, ప్రతి వారు తేలికగా ఉల్లంఘించుటకు వీలైన చట్టాలను ఉల్లంఘించాలని నిర్ణయించారు. ఉదాహరణకు ఉప్పును తయారు చేయడం. అలాగే ప్రభుత్వం నిషేధించిన పుస్తకాలను అమ్మడం కూడా శాసనోల్లంఘనమే. సమిష్టి శాసనోల్లంఘన శాంతియుత వాతావరణం లోనే జరగాలి. దీని లక్ష్యమైన స్వాతంత్ర్యం కూడా శాంతి, అహింసల ద్వారానే సిద్ధించాలని గాంధీ కోరుకున్నాడు. పోరాడే వారు నిర్బంధాన్ని మామూలు విషయంగా చూడాలి. అంతేగాని నిరసనతో భారీ ప్రదర్శనలు చేయనక్కరలేదు. పైగా సామూహిక స్వచ్ఛంధ అరెస్టులకు సిద్ధపడాలి.

ఉల్లంఘణ నాగరికంగా వుండాలంటే అది అహింసతోనూ, బహిరంగంగాను జరగాలి. ప్రతి పౌరునికి శాసనోల్లంఘన అనేది సహజమైన అనుల్లంఘనీయమైన హక్కు. తానున్నంత వరకు దానిని వదులుకోడు. రాజ్యాలు నేరపూరిత ఉల్లంఘనను శక్తితో అణచివేస్తాయి. కనుక మనం 'ఉల్లంఘన' కన్నా 'నాగరికత'కు అధిక ప్రాధాన్యత నివ్వాలని గాంధీ అంటాడు. ఇది హక్కు మరియు బాధ్యత అవుతుంది. ఈ దేశంలో ప్రతి బ్రిటీష్ వ్యక్తి క్షేమాన్ని మనం హామీ ఇవ్వాలి. వారు తమ ఆయుధాలతోగాక మన అహింసతోనే తమ రక్షణ చూసుకోవాలి. ఇది మొదటగా హింసను తటస్థీకరిస్తూ క్రమంగా హింసకు స్థానం లేకుండా చేస్తూ దాని స్థానంలో ప్రేమను, ఘర్షణ స్థాయిలో అంగీకారాన్ని ప్రవేశ పెడుతుంది.

నిరాహారదీక్ష అనేది సత్యాగ్రహంలో మరో ముఖ్య ఆయుధం. దీనికి కూడా దైవం పై విశ్వాసం అవసరం. దీనికి అనంత సహనం, దృఢసంకల్పం, ఏకాగ్రత, పరిపూర్ణ నిశ్చలత, కోపం లేకుండా వుండటం అనేది చాలా అవసరం. సత్యాగ్రహులు ఏ ఒక్క నాటికైనా ఈ లక్షణాలు సంతరించుకోవాలి. సత్యాగ్రహం (నిరాహార దీక్షతో సహా) వ్యక్తిగత ప్రయోజనాల కోసం కాక పరుల ఉపయోగం కోసం నిర్దేశించబడుతుంది. కనుక నిరాహార దీక్షను ప్రత్యర్థుల పై గాక తన వారి బాగు కోసం చేపట్టాలని గాంధీ భావన. ఆమరణ నిరాహార దీక్ష అనేది ఆఖరి మరియు అత్యంత తీవ్రమైన ఆయుధం. దీనికి పూర్తి పరిశుద్ధత అవసరం. అట్టి పరిపూర్ణ త్యాగం మానవాళినంతటినీ ప్రభావితం చేయగలదు. పవిత్రమైన లక్షఆయం కోసమే ఈ ఉత్కృష్ట మార్గాన్ని ఉపయోగించాలి. అంతేగాని స్వార్థ ప్రయోజనాల కోసం దీన్ని ఉపయోగించరాదు. ఆమరణ నిరాహార దీక్ష ప్రార్థనా స్ఫూర్తిని పెంచుతుంది. ప్రజలందరినీ జాగృతం చేస్తుంది. అంతర్వాణి ప్రబోధం మేరకు లక్ష్యం యొక్క పరిశుద్ధత పై విశ్వాసంతో ఇది చేపడతారు. సరైన శిక్షణతోనే దీన్ని చేపట్టాలి అంటాడు గాంధీ.

నాయకుని ప్రాణం ఆపదలో వుందని అనుచరులు ఆందోళనకు దిగితే అది అర్థరహితం అవుతుంది. ప్రజలకు నాయకత్వం వహించే సత్యాగ్రాహి హేతువిరుద్ధమైన ప్రజాభిప్రాయానికి తల ఒగ్గాల్సిన పని లేదని గాంధీ పేర్కొన్నాడు. ఇక సత్యాగ్రాహి విషయంలో కూడా ఒకేసారి సంపూర్ణత ఆశించలేము. ఎందుకంటే ఒక సైనికునికి యుద్ధ తంత్రం మొత్తం ఎలా తెలిదో అలాగే ఒక సత్యాగ్రహికీ సత్యాగ్రహ శాస్త్ర జ్ఞానం మొత్తం తెలీకపోవచ్చు. అప్పుడు నాయకుని ఆజ్ఞమేరకు ప్రవర్తిస్తే సరిపోతుంది. ప్రజలంతా సత్యాగ్రహులవ్వాలంటే సత్యాగ్రహ నియమాలన్నింటిని తెలిసికొని వాటిని పాటించడం నేర్వాలి. ముఖ్యంగా త్రికరణ శుద్ధిగా అహింసావాదులవ్వాలి. సంతోషంగా మరణాన్ని ఎదుర్కొనేవారై ఉండాలి. హింసాపూరితమైన భౌతిక శక్తికి తలవంచక దైవానికి కట్టుబడి వుండటం ద్వారా మనుషులు పరిపూర్ణత అనే లక్ష్యాన్ని సాధించగలరు అని గాంధీ వక్కాణించాడు.

రచయిత

P. సుధాకర్

# మహాత్మాగాంధీ - II

## 10.4 రాజ్యం మరియు ప్రభుత్వం భావనలు :-

గాంధీ రాజ్యాన్ని వ్యవస్థీకృతమైన హింస మరియు శక్తిగా చూశాడు. రాజ్యం యొక్క అనివార్యమైన శక్తి ప్రయోగం అనేది వ్యక్తుల వికాసాన్ని, సునిశితత్వాన్ని నాశనం చేస్తుందన్నారు. అందుకే గాంధీ పెరుగుతున్న రాజ్యాధికారాన్ని భయంతో చూసేవాడు.

బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం తన చట్టాలను గూర్చి ప్రకటించే సార్వత్రికత, నిష్పాక్షికత మరియు నిశ్చయాత్మకతలకు వ్యతిరేకంగా అంతర్వాది యొక్క పవిత్రతను ప్రకటించే వ్యక్తిగా గాంధీ నిలబడ్డాడు. అయితే రాజ్యాధికారాన్ని వ్యతిరేకించే అహింసావాదాన్ని బట్టి గాంధీని యధాతథస్థితిని సమర్థించే వానిగా చూడరాదు.

గాంధీ రాజ్య వ్యవస్థ పట్ల తీవ్ర నిరసనను, వ్యతిరేకతను పెంచుకోడానికి బహుశా కొన్ని అంశాలు దోహదం చేసి వుండవచ్చు. అవి:

1. పేదలు, రక్షణ లేని వారైన జులు తెగ పై దక్షిణాఫ్రికా ప్రభుత్వం జరిపిన తీవ్ర అణచివేత, అకృత్యాలు,
2. సత్యాగ్రహ సమయంలో భారతీయుల అణచివేతకు దోహదం చేసే చట్టాలను తొలగిస్తానని వాగ్దానం చేసి కూడా స్మట్స్ మాట తప్పడం,
3. బ్రిటీష్ సామ్రాజ్యవాదులు భారతదేశంలో జరిపిన క్రౌర్యము, అకృత్యాలు.

తన సార్వభౌమాధికారంతో తన చట్టాలకు అనుల్లంఘనీయతను కల్పించడం ద్వారా రాజ్యం వ్యక్తుల హక్కులను సాకారం చేసే వ్యవస్థను దెబ్బ తీస్తుంది. సార్వభౌమాధికారానికి చట్టబద్ధత కల్పించుకొన్నా అది నాగరికతలోని నైతికతను బలహీనపరుస్తుందని గాంధీ గ్రహించాడు. కనుకనే గాంధీ నిర్దిష్ట కాల ప్రదేశంలోని ప్రభుత్వ ప్రవర్తనను బట్టి గాక మొత్తం రాజ్య వ్యవస్థనే హింసగా చూసి వ్యతిరేకించాడు.

వ్యక్తి తన భవిష్యత్తును తాను నిర్దేశించుకొనే నైతిక హక్కుకు సవాలుగా మారిన రాజ్యాధికారవాదాన్ని గాంధీ వ్యతిరేకించాడు. ఈ భావన కూడా గాంధీ యొక్క మౌలిక భావన అయిన సత్యం పై ఆధారపడినదే. గాంధీ దృష్టిలో దైవానిదే అత్యున్నత అధికారం. దీని స్థానంలోకి రాజ్యాధికారం ప్రవేశించడాన్ని నిరసించాడు. అంటే ఏ రాజ్యము లేక పాలకుడు తనను తాను దైవానికి ప్రత్యామ్నాయంగా కాని లేక వ్యతిరేకంగా కాని నిలబెట్టుకోరాదు. అంతేగాక అంతర్వాణి ప్రబోధం మేరకు అనైతికమైన ఏ రాజ్య చట్టాన్నైనా వ్యక్తికి వుందని నమ్మాడు, ప్రకటించాడు మరియు తాను ఆచరించాడు. అలా వ్యవస్థీకృత రాజ్యాధికారం కన్నా ప్రజల నైతిక అధికారం బలీయమైనదని భావించాడు. దానికన్నా దైవాధికారాన్ని తిరుగులేనిదిగా భావించాడు. దైవాన్ని విశ్వసించి, దైవానికి భయపడే వారు ఏ వ్యక్తికీ, శక్తికీ, అధికారానికీ భయపడక్కర్లేదని ప్రకటించాడు.

అయితే రాజ్య వ్యవస్థను హింసతో నిర్మూలించాలని గాకుండా అహింసతో పూరించాలని భావించాడు. గాంధీ స్వరాజ్‌లో ఆర్మీ, నేవీ, చట్టాలు, కోర్టులు, పోలీసులు, యంత్రాలు వగైరా వుంటాయి. అయితే ఆ వ్యవస్థలు ప్రజల స్వేచ్ఛా రక్షణకే గాని అధికార ప్రయోగానికి కాదు. ఇక తన ఆదర్శ సమాజంలో ఏ అధికార వ్యవస్థ వుండరాదని కోరుకున్నాడు.

భవిష్యత్ అహింసాత్మక భారత రాజ్యంలో పోలీసు అవసరమే అనే తన అభిప్రాయానికి తన అసంపూర్ణ అహింసే కారణమని గాంధీ ఒప్పుకొంటాడు. అయితే ఆ పోలీసులు అహింసావాదులుగా, సంస్కర్తలుగా, ప్రజా సేవకులుగా వుంటారు. వారు ప్రధానంగా

దొంగలు, దోపిడీదార్ల విషయాలకు పరిమితమౌతారు. ఈ అహింసా సమాజంలో నేరం వున్నా నేరస్థులు వుండరని, నేరాన్ని ఒక రుగ్మతగా పరిగణించి నేరస్థులను రోగులుగా చూసి వారికి ఆసుపత్రుల వంటి జైళ్ళలో చికిత్స చేయాలని గాంధీ అన్నాడు. నేరస్తులు జైలుసిబ్బందిని తనస్నేహితులుగా భావించాలని చెప్పాడు. గాంధీ దృష్టిలో మానసిక అస్వస్థత నుంచే నేరం పుడుతుంది. కనుక రాజ్య యంత్రాంగం కూడా అహింసాత్మకంగా స్పదించాలి. అంతిమంగా రాజ్యరహిత సమాజమే గాంధీ ఆదర్శం.

## 10.5 ఆస్తి హక్కులు మరియు ధర్మకర్తృత్వ సూత్రం:-

ప్రకృతి మొత్తం దైవం నుంచే వచ్చింది. దైవానికే చెందుతుంది. ప్రకృతిని ఉపయోగించుకొనే హక్కు ఏ ఒక్కరికో లేక కొద్ది మందికో గాక అందరికీ వుంటుంది. దైవం మనిషిని శ్రమించి బ్రతికే నిమిత్తం సృష్టించాడని గాంధీ విశ్వసించాడు. అనగా మనిషి తన శరీర శ్రమతోనే తన శరీరాన్ని పోషించుకోవాలి. మానసిక శ్రమతో మేదస్సును పోషించుకోవాలి. అందుకే శ్రమించకుండా తినేవాడు దొంగతో సమానమన్నాడు గాంధీ. అంతేగాక వ్యక్తిగత ఆస్తి సర్వానర్థాలకు మూలమని నమ్మాడు. శక్తివంతమైన దైవానికి దాచవలసిన అవసరం లేదు కనుక ప్రకృతిద్వారా శ్రమించి సంపాదించాలి గాని, భవిష్యత్ కోసం దాచుకోరాదని గాంధీ అంటాడు.

గాంధీ గీతను తన ధార్మిక నిఘంటువుగా చేసికొన్నాడు. అందులోని అపరిగ్రంథం (Non-Possession), సమభావం, మొదలగు భావాలు గాంధీని ఆకర్షించాయి. సంపద అందరికీ చెందుతుందని, ఆస్తి కూడబెట్టరాదనే భావాలే ధర్మకర్తృత్వ భావనను రూపొందించాయి. గీతలోని అపరిగ్రహం, సమభావం లక్షణాలు ట్రస్టీకి వుండాలని గాంధీ భావించాడు. హృదయంలో మార్పు ద్వారానే ఈ లక్షణాలు వస్తాయి. కోట్ల కొద్దీ ధనమున్నా ఒక్క దమ్మిడీ కూడా తనది కాదని ట్రస్టీ మరియు ముముక్షువు భావిస్తారు. శ్రమ జీవన సత్యాన్ని కూడా అర్థం చేసికొంటే ధర్మ కర్తృత్వపాలన తేలిక అవుతుంది. దాన్ని చట్టబద్ధం చేయవచ్చు. చట్టపరిధిలోని స్వేచ్ఛ ప్రకారం ట్రస్టీ తన వారసుణ్ణి నియమించవచ్చు.

ప్రస్తుత సమాజంలో విజృంభిస్తున్న కోర్కెలు, దిగజారుతున్న నైతిక విలువలు, నిర్లక్ష్యం చేయబడుతున్న సంప్రదాయము మొదలగున్నవి సమాజంలో ప్రేమ, స్నేహం, సానుభూతి వంటి వాటికి స్థానం లేకుండా చేస్తున్నాయి. తత్ఫలితంగా పరస్పర అనుమానం, అసూయ, భయం వంటివి స్థిరపడుతున్నాయి. ఇదంతా స్వేచ్ఛా, సమానత్వాల సమన్వయ లోపంగా భావించవచ్చు.

భౌతికతే యధార్థమని నమ్ముతూ, భౌతిక సుఖం కోసం సంపదను అపరిమితంగా ప్రోగు చేసికోవాలనే మానసిక ప్రవృత్తి వున్న సమాజంలో అసమానతలు అనివార్యం. మరియు ఆదర్శాల స్థాపన కష్ట సాధ్యం. చట్టం ద్వారా ఆర్థిక సమానత సాధించినా గానీ, ఈ ప్రవృత్తులున్నంతవరకూ తిరిగి అసమానతలు తలెత్తుతూనే వుంటాయి. వాస్తే వానికి జంతు స్థాయి (భౌతిక) అవసరాలు తీరినా ఈ మనోవృత్తులు మనిషిని అక్కడే అపుతాయి గానీ అతణ్ణి ఉన్నత అవసరాలైన ప్రేమ, నైతికత, ఆధ్యాత్మిక పురోభివృద్ధి మొ॥వి సాధించుకోనేటట్లు చేయలేవు. ఈ సమస్యలన్నిటికీ గాంధీ సూచించిన పరిష్కారం 'అపరి గ్రహం'. గాంధీ దృష్టిలో కలిగి వుండటం అంటే మరుసటి దినం కోసమే అని అర్థం. గాంధీ ప్రకారం సత్యప్రియుడు. ప్రేమను ఆచరించే వాడు మరుసటి రోజు కోసం ఏమీ దాచుకోడు. అంతేగాక తాను సృష్టించే సంపద అంతా సమాజం లేక జాతి కోసమే గాని తన కోసం కాదని భావిస్తాడు. తన భవిష్యత్తుకు అవసరమైనది దైవమే ఇస్తుందని విశ్వసిస్తాడు. ఈ సూత్ర నిర్లక్ష్యమే సంపద ప్రోగు చేసికోడానికి దారి తీస్తుంది. అందుకే పేదలకన్నా సంపన్నులే మిక్కిలి అసంతృప్తితో వుంటారని గాంధీ అన్నాడు. ఈ సమస్య పరిష్కారానికి గాంధీ ధర్మకర్తృత్వాన్ని సూచించాడు.

ఆస్తిపరులు ఆస్తిని త్యజించనవసరం లేకుండానే ఆస్తిని, తమ తెలివిని సమాజం మేలుకై వినియోగించాలని కోరాడు. అందరూ సమానంగా భావించబడినా, శారీరక, మానసిక సామర్థ్యాలలో తేడాల వల్ల కొందరు నిజాయితీగానే అధికంగా సంపాదించగలరు. వారిని నిరుత్సాహపరచక్కర్లేదని గాంధీ అంటాడు. అట్టివారు తమ శక్తియుక్తుల్ని, సంపదనూ సమాజం కోసం వాడాలి. శ్రామికుల సహాయం లేకుండా ఎవరూ సంపదను సృష్టించలేరు గనుక ఎవరి అవసరానికి మించి సంపదవున్నా అది సమాజం కోసమే అని గ్రహించాలి.

సంపన్నులు ధర్మకర్తృత్వ పద్ధతి ద్వారా పేదలకు సహాయపడుతూ తమని తాము సంస్కరించుకోవచ్చని గాంధీ అన్నాడు. మానవ నైజాన్ని మార్పు చేయవచ్చుననే నమ్మకం పై ఈ పద్ధతి ఆధారపడి వుంది. సమాజ అవసరాలకు మించకుండా వ్యక్తికి సంపద హక్కు వుండరాదని గాంధీ అన్నాడు. అంతేగాక సమాజ అవసరాలకు భిన్నంగా లేక వ్యతిరేకంగా వ్యక్తి సంపద ఉపయోగించబడరాదన్నాడు. అందుచేత కోర్కెల నియంత్రణే నాగరికత అని గాంధీ విశ్వసించాడు. దీనిని ప్రాథమిక స్థితికి చేరడంగా కాక హింసాయుత కోర్కెలను స్వచ్ఛందంగా విడనాడడంగా అర్థం చేసికోవాలి. సత్యవంతమైన ప్రవర్తన ద్వారా సమాజంలో సామరస్యం నెలకొల్పవచ్చని గాంధీ నమ్మాడు.

ధర్మకర్తృత్వం ద్వారా ఆశించిన సామాజిక మార్పు సాధ్యమని, ఇది హింసను, స్వేచ్ఛారాహిత్యాన్ని తొలగిస్తుందని గాంధీ అన్నాడు. ప్రభుత్వ రంగంతోపాటే ఈ వ్యవస్థ కూడా వుంటే ప్రభుత్వరంగ లక్షణాలైన అసమర్థత, అవినీతి, ఆలసత్వం, నిస్తేజం, ఉద్యోగస్వామ్య దౌష్ట్యం వంటి వాటికి విరుగుడుగా కనిపిస్తుంది. వాస్తవానికి ఈ సిద్ధాంతం ప్రభుత్వ, ప్రైవేటు సంపదలకు, వినిమయ వస్తువులకు, పెట్టుబడి వస్తువులకు తేడా చూడదు. దీని ప్రకారం కార్మికుడు కూడా తన నిపుణతకు, తన శ్రమకు తాను ధర్మకర్తగా వ్యవహరించి దాన్ని వ్యక్తిగత ప్రయోజనానికి గాక సమాజ ప్రయోజనానికే వినియోగించాలి అని గాంధీ అన్నాడు.

స్వచ్ఛందంగా ధర్మకర్తృత్వం అమలులోనికి రానపుడు కేవలం సంపన్నులలోనే మార్పు రావాలని ఆశించక ఇతరులూ మారి ఈ విలువలను అంగీకరించి అహింసతో కూడిన తమ అభిప్రాయాల ద్వారా సంపన్నులను మార్చవచ్చు. అవసరాన్ని బట్టి సహాయ నిరాకరణను చేపట్టవచ్చునని గాంధీ పేర్కొన్నాడు.

## 10.6 మతము మరియు మత సామరస్యం:-

మతం అనేది దైవ భావన పై ఆధారపడి మనిషిని దైవాన్ని కలిపే మార్గంగా గుర్తించబడింది. సత్యవ్రతులైన వారికి మోక్షం త్వరగా సిద్ధిస్తుంది. కనుక మన పనులన్నీ ఆధ్యాత్మిక వికాసం కల్గించేవిగా వుండాలన్నాడు గాంధీ. అన్యాయం బలీయమైనపుడు 'దైవ అవతారం' భావన గుర్తుకొస్తుంది. గాంధీ దృష్టిలో అత్యున్నత నైతిక శక్తిగలవారే నిర్భయంగా అన్యాయాన్నెదిరించి అవతార పురుషులుగా గుర్తించబడతారు.

హేతువుకు అతీతమైన దైవాన్ని హేతువు, మేధస్సు ద్వారా తెలిసికోలేము. ఆత్మాన్వేషణనే భక్తి అని, ఆత్మ సాక్షాత్కారం తర్వాత భక్తి జ్ఞానంగా మారుతుందని గాంధీ అన్నాడు.

సత్యానికి, నైతిక నిబద్ధతకు మించిన మతం ఏదీలేదు. గాంధీ దృష్టిలో మతం అంటే మానవ స్వభావాన్ని ఔన్నత్యం దిశగా మార్చేది, సత్యానికి కట్టుబడేటట్లు చేసి నిరంతరం పవిత్రీకరించేది అని అర్థం. అనగా సమస్తాన్ని ధారణ చేసినది (దైవం). మనిషిని అదే పోషించి, కాపాడుతుంది. మతానికి నైతికత ముఖ్యం. మనిషిని, మనిషిని మరియు మనిషిని దైవాన్ని కలిపేది మతం. ఒక విత్తు పెరగడానికి నీరు ఎలా అవసరమో, సమాజం నైతికంగా అభివృద్ధి చెందడానికి మతం అలా అవసరం.

అన్ని మతాలు దైవ ప్రసాదితాలే. అన్నిటి యొక్క సారమూ ఒక్కటే అని, ఒక తోటలోని అనేక పూల వంటివని గాంధీ అన్నాడు. అన్ని మతాలు దేవుడొక్కడే అని, మనుషులంతా ఒకటే అని కనుక కలిసి వుండాలని చెప్పాయని గాంధీ అన్నాడు.

ప్రతి మతస్థుడు ఇతర మతాల గ్రంథాలను స్నేహ పూర్వకంగా చదివితే తన మతంలోని లోపాలను తొలగించుకోగలడు. సాటి మతస్థులు సహోదరులుగా భావించినపుడే ఇది మరింత అవసరం. ఒకే చెట్టు కొమ్మల్లాంటి భిన్న మతాల మధ్య హెచ్చు తగ్గుల భావన అర్థంలేనిది. కనుక ఇతర మతాల పట్ల సహనము, గౌరవము వుండాలి. మన మతాన్ని మనం అభిమానిస్తున్నట్లుగానే ఇతర మతాలను కూడా అభిమానిస్తే మత మార్పిడి అనేది అర్థరహితం అవుతుంది. అలా అన్ని మతాల మధ్య సామరస్యం పెంపొందుతుందని గాంధీ ఆశించాడు.

గాంధీ దృష్టిలో ఒక హిందువు మరింత ఉన్నతమైన హిందువుగా, ఒక ముస్లిం మరింత ఉన్నతమైన ముస్లింగా, ఒక క్రిస్టియన్ మరింత ఉన్నతమైన క్రిస్టియన్‌గా మారాలి. అలాగే ఇతర్లకై దైవానికి మనం చేసే ప్రార్థన 'నాకు జ్ఞానం ఇచ్చినట్లుగా అతనికీ ఇవ్వు' అని గాక, 'అతని అత్యున్నత అభివృద్ధికి కావలసిన సత్య జ్ఞానాలను అతనికి ఇవ్వు' అని వుండాలి అన్నాడు గాంధీ. మన మత విశ్వాసం గూర్చి వాచ్యపరంగా చెప్పటం గాక నైతిక ప్రవర్తన ద్వారా ప్రకటితం చేయాలి. సేవా తత్పరితతో అత్యంత క్లుప్తమైన, సరళమైన జీవితమే సందేశం లాంటిది. అనగా మనం సేవ చేస్తూ ఇతర్లను సేవ చేయమంటే వారికి అర్థమౌతుంది.

ఒక మతం ఎక్కువ, ఒక మతం తక్కువ అని తీర్పు చెప్పే అధికారం ఎవరికీ లేనందున అన్ని మతాలలోను వాస్తవముందని అంగీకరించాలి. బాహ్యమైన తేడాలు గతంలో వున్నాయి, భవిష్యత్‌లో వుంటాయి. భగవంతుడే భిన్నత్వంతో కూడిన సృష్టి చేశాడు. నేను చూసిన పద్ధతిలోనే మిగతా వారు కూడా దైవాన్ని దర్శించాలి అని ఎవరూ అనరాదంటాడు గాంధీ. వేరు వేరు మతాలు వున్నంత వరకూ ఆ మతాల వారికి బాహ్య చిహ్నాలు బహుశా అవసరం అవుతాయి. కాని అవి ఆడంబరంగా మారి తమ మతమే ఇతర మతాల కంటే గొప్పదని చెప్పడానికి సాధనమైనపుడు వాటిని త్యజించడం మంచిదని గాంధీ అన్నాడు.

సమిష్టి ప్రయోజనాలను ఆశించేవాడుగా, ఆధ్యాత్మికవేత్తగా మనుషుల మధ్య సమతాత్వాన్ని ఆత్మపరమైన ఐక్యతను నమ్మాడు. అందుకే జాతి, మత,కులపరమైన బేధాలను విశ్వసించలేదు. అహింస, బ్రహ్మచర్యం, అపరిగ్రహం లక్షణాల వల్ల జాతి, మత, బేధాలను అధిగమించవచ్చని గాంధీ భావించాడు. దక్షిణాఫ్రికాలో సమానత్వం దిశగా భారతీయుల (హిందూ, ముస్లింల) హక్కుల కోసం ఉద్యమించాడు. అలా నైతిక కోణం నుంచి హిందు, ముస్లిం ఐక్యత కాంక్షించాడు.

హిందూ ముస్లింల ఐక్యతా ఉద్దేశం గ్రహించి వీలైనప్పుడల్లా గాంధీ వీరి ఐక్యతకు ప్రయత్నించాడు. ఖిలాఫత్ ఉద్యమాన్ని సమర్థించాడు. కిలాఫత్ వ్యవహారం నిజమైతే హిందువులు మహ్మదీయులను సమర్థించి వారికి సహకరించాలన్నాడు. అయితే దానికి ప్రతిగా ముస్లింలు కూడా గోసంరక్షణకు కట్టుబడాలని కోరరాదన్నాడు. ఖిలాఫత్ కోసం ముస్లింలు గోవధను ఆపుతామంటే సరికాదని, ఒకే గడ్డ మీద ఇరుగు పొరుగు వుండటం వల్లే గోసంరక్షణకు పూనుకొంటే అది వారికి గౌరవమన్నాడు. ఐక్యతలో స్వచ్ఛందత వుండాలన్నాడు. ఇట్టి మతాల ఐక్యత స్వాతంత్ర్య సముపార్జనను త్వరితం చేస్తుందని కూడా భావించాడు. ఈ ఐక్యత కేవలం సాంఘిక, రాజకీయ కారణాలకే కాక ఆధ్యాత్మిక పురోగతిరీత్యా కూడా అవసరమన్నాడు.

మతాల మధ్య ఐక్యతను మరింత పెంచడానికి అన్ని మత గ్రంథాల, సూత్రాల జ్ఞానం అందరూ పొందాలి. ఏ మతానికి చెందిన ఉన్నాదులైనా తమ మతాల సారాన్ని గ్రహిస్తే అది సత్యం, శాంతి, ప్రేమలేనని, ఇతర మతాల సారమూ అదేనని గ్రహిస్తారు. అలా ప్రజల హృదయాల ఐక్యతను సాధించవచ్చని గాంధీ అన్నాడు.

ముఖ్యంగా సంఖ్యాపరంగా పెద్ద మతస్థులైన హిందువులు పిరికితనాన్ని వదిలి, ధైర్యంగా అన్ని ఇతర మతస్థులనూ నమ్మాలి, ప్రేమించాలి. వారికి సేవ చేయాలని గాంధీ కోరాడు. హిందువులు త్యాగ భావం అలవర్చుకొని భాతృత్వాన్ని పెంచుకోవాలని అన్నాడు. తమ నిజాయితీని ఋజువు చేసే కొద్దీ అల్ప సంఖ్యాకులకు ఆత్మ విశ్వాసం పెరిగి క్రమంగా అన్నదమ్ముల్లా మెలిగే పరిస్థితి వస్తుందని గాంధీ ఆశించాడు. దైవానికి తన బిడ్డలందరూ సమానమే గనుక దేశంలో తలెత్తిన మత బేధాలు, ఘర్షణలు తొలగించి సమానత్వాన్ని పాటించాలని కోరాడు. మత ఘర్షణలకు రాజకీయ పరిష్కారాలైన సీట్ల సర్దుబాటు లేక న్యాయ స్థానాల ద్వారా పరిష్కారాలు కాకుండా పరస్పర చర్చలు, అవగాహన, సానుభూతి వంటివి మిక్కిలి ఉపయోగకరం అని భావించాడు. 'ద్విజాతి' సిద్ధాంతం పట్ల ఆందోళన చెంది అది అసత్యమన్నాడు. చారిత్రకంగా మత మార్పిడి చేసుకొన్నవారు వేరే జాతిగా మారరన్నాడు. వాస్తవానికి సాంస్కృతిక పరంగా హిందు, ముస్లింలకు సారూప్యత, ఏకత వుందని గాంధీ నమ్మాడు. భారత జాతీయ భావనకు మతాల ఐక్యత మూలమని విశ్వసించాడు. అందుకు తగిన కృషి చేశాడు.

## 10.7 వర్ణ వ్యవస్థ మరియు సామాజిక అసమానతలు :-

ఆకర్షణ శక్తి చేత భూమి తన స్థానంలో ఉన్నట్లుగా అహింసచే సమాజం ఒకటిగా వుంటుంది. గాంధీకి స్త్రీలు గౌరవించబడే, అసమానతలు లేని, సర్వమత సమానత వున్న, మత్తు పానీయాలు, పదార్థాలు లేని, ప్రతి ఒక్కరూ తమ శీలాన్ని (character) జాగ్రత్తగా కాపాడుకునే సమాజం అభిలషణీయం.

వర్ణము, ఆశ్రమము అనేవి హిందూ మతంలో ముఖ్యాంశాలు. వర్ణ వ్యవస్థలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్ర వర్ణాలు వ్యక్తి జీవితంలో బ్రహ్మచర్య, గృహస్థ, వనప్రస్థ మరియు సన్యాస ఆశ్రమాలు (దశలు) వున్నాయి. ఈ దశల ద్వారా ప్రతి హిందువు తన జీవిత లక్ష్యమైన మోక్షాన్ని చేరాలి. మొదటి మరియు మూడవ దశలు ప్రస్తుతం స్ఫూర్తి లోపించి అది శారీరక, మానసిక అవసరాలకు పరిమితం చేయబడింది.

వర్ణ వ్యవస్థ పునర్నిర్మితమైతే ఆశ్రమ ధర్మాలు కూడా పునరుద్ధరించబడతాయని గాంధీ ఆశించాడు. వర్ణ ధర్మాల ప్రకారం బ్రాహ్మణులు అధ్యయనము, బోధన చేయాలి. క్షత్రియులు ప్రజా రక్షణ చేయాలి. వైశ్యులు సమాజ శ్రేయస్సు కొరకు సంపద సృష్టించాలి. శూద్రులు శరీర శ్రమను చేయాలి. గాంధీ దృష్టిలో వర్ణ ధర్మం స్థూలంగా భూమి పై మనిషి కర్తవ్యాన్ని నిర్దేసిస్తుంది. అందరూ తమ ధర్మాలు పరోపకార బుద్ధితో చేసి, సమాజం ఇచ్చిన ప్రతిఫలంతో జీవిస్తూ తృప్తి చెందాలి.

అలా వర్ణం వ్యక్తి జీవన సూత్రాన్ని తద్వారా అతని ధర్మాన్ని లేక కర్తవ్యాన్ని నిర్దేశిస్తుందే తప్ప హక్కులను, ఆధిక్యతను లేక న్యూనతను మాత్రం కాదని గాంధీ పేర్కొన్నాడు. సమాజం అన్ని వర్ణాల పై సమానంగా ఆధారపడి వుంటుంది. గనుక అన్ని వర్ణాలు సమానమేనన్నాడు. వర్ణ వ్యవస్థ సార్వత్రికంగా అన్వయించదగ్గదని గాంధీ విశ్వాసం. ప్రతి మతం కనుగొనే ముఖ్య సూత్రానికి అట్టి సార్వత్రికత వుంటుంది. వేదాలలో వర్ణాలను ఒకే శరీరంలోని భాగాలుగా పోల్చారు. గనుక హెచ్చు, తగ్గుల ప్రసక్తి వుండరాదని గాంధీ అన్నాడు. అట్టి హెచ్చు, తగ్గుల వివాదమే వస్తే శరీరం, సమాజం, మానవాళి కూడా ముక్కలౌతాయి. అంటే అది అంతర్యుద్ధాలకు, వర్గపోరాటాలకు దారి తీస్తుంది. అలాంటి అవాంఛనీయ సంఘటనలు అంతమవ్వాలంటే వర్ణ సూత్రాన్ని పాటించాలని గాంధీ కోరాడు. వర్ణం వల్ల జీవితం జీవించదగ్గది అవుతుందని, తృప్తి, శాంతి పెరుగుతుందని, కొట్లాటలు, ఘర్షణలు, ఆకలి, రోగము, పేదరికము అంతమౌతాయని గాంధీ భావించాడు. అంతేగాక వర్ణ వ్యవస్థ మత, సాంఘిక, ఆర్థిక అవసరాలు తీరుస్తుంది. అట్టి సూత్రాన్ని అమలు చేసే సమాజానికి ఆధ్యాత్మిక వికాసానికై తగిన సమయం లభిస్తుంది. సామాజిక రుగ్మతలు, ఆర్థిక పోటీ అంతమౌతాయి. సంపద న్యాయంగా పంపిణీ అవుతుందని గాంధీ విశ్వాసము.

అయితే ప్రజలు వర్ణ ధర్మ సూత్రాన్ని నిరాకరిస్తూ కర్తవ్యాన్ని హక్కుగా పొరబడి వ్యక్తిగత ప్రయోజనానికి దోహదం చేసే పనినే స్వీకరిస్తున్నారు. తద్వారా వర్ణ వ్యవస్థ వక్రతకు, సామాజిక పతనానికి దోహదం చేస్తున్నారని గాంధీ ఆవేదన చెందాడు. నేడు వర్ణమంటే హెచ్చు తగ్గులనే అర్థం వచ్చి ప్రపంచంచే అవహేళన చేయబడే స్థాయికి మన సమాజం దిగజారింది.

తన శక్తినంతటినీ ఉపయోగించి తన సృష్టి కర్తను తెలిసికొనుటే మనిషి పని. దానికై అతను జీవించి వుండాలి. అందుకై పూర్వీకుల వృత్తి చేపట్టి కొనసాగించాలి. అయితే ఈ సూత్రంలో తన ఇష్టానికి వ్యతిరేకంగా తప్పనిసరిగా పూర్వీకుల వృత్తినే చేపట్టాలనే బలవంతం లేదు. అట్టి బలవంతం లేకనే వర్ణ ధర్మం నిరాఘాటంగా వేల సంవత్సరాలు కొనసాగిందని గాంధీ అన్నాడు. శిక్షణ చేత ప్రజలు ఆ సూత్రంలోని బాధ్యతను, న్యాయాన్ని గ్రహించి స్వచ్ఛంధంగా దాన్ని స్వీకరించారు.

వర్ణం ముసుగులో వచ్చిన కులానికి, వర్ణానికి గాంధీ దృష్టిలో సంబంధం లేదు. వర్ణ వ్యవస్థను అనుసరించడం లోని వైఫల్యం వల్ల ఆర్థిక, ఆధ్యాత్మిక సమస్యలు, నిరుద్యోగం, పేదరికం, అస్పృశ్యత మరియు విశ్వాసరాహిత్యం వంటివి తలెత్తాయని గాంధీ భావించాడు. కులం భారతదేశాన్ని పతనం చేసిందని, కుల వ్యవస్థలో దైవం నిర్దేశించిన కుటుంబాన్ని పోలిన సంఘటిత తత్వం, సహజత్వం లోపించాయన్నాడు. అయితే కుటుంబం విస్తరణే కులం అని, రెంటిలోనూ రక్త సంబంధం, వారసత్వం వున్నాయని గాంధీ అన్నాడు.

ఉన్నత విద్యకై ఇంగ్లాండుకు సముద్రం దాటి వెళ్ళేటప్పుడు గాంధీని కుల బహిష్కరణ చేస్తామని కొందరు బెదిరిస్తే వారికా అధికారం లేదన్నాడు. అస్పృశ్యతను అమానుషమన్నాడు. అహ్మదాబాద్‌లోని సత్యాగ్రహ ఆశ్రమంలో అస్పృశ్యులనుచేర్చుకొన్నాడు. సహపంక్తి భోజనాలు వగైరా ఆచరింపచేశాడు.

గాంధీ ఆర్థిక సమానత్వ సూత్రాన్ని అంగీకరించాడు. అయితే అది సంపద యొక్క యాంత్రికమైన సమాన పంపిణీగా కాక ప్రతి మనిషి తన సహజ అవసరాలను తీర్చుకొనేందుకు వీలు కల్గి ఉండాలి. సంపద పోగు చేసికోడానికి ఆస్కారం వుండరాదు. ఈ సమానత్వంలో ప్రతి వ్యక్తికి సంతులిత ఆహారము, నివాసానికి గృహము, వైద్య సేవలు, పిల్లలకు విద్యావకాశాలు వుంటాయి. దీన్ని సాకారం చేయ్యడానికి కానీ, ఇతర కుటీర పరిశ్రమలు స్థాపించాలన్నాడు. అలా క్రమంగా సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగి సమానత్వాన్ని సాధించవచ్చంటాడు గాంధీ.

## 10.8 స్వరాజ్య ఆదర్శం :-

గాంధీ దక్షిణాఫ్రికాలో భారతీయుల ఓటు హక్కు, ఇతర అధికారాల కోసం పోరాడాడు. దీని వెనుక జాతీయతా భావము, సర్వ మానవ సమానత్వ భావము వున్నాయి. ఆవేద సమయాల్లో భారతీయులు, దక్షిణాఫ్రికాలోని భారతీయులు పరస్పర సహాయం చేసికొనేట్లు చేశాడు. అలా జాతీయతా భావాన్ని పెంపొందించాడు.

రవీంద్రుని శాంతినికేతనంలో పనివాళ్ళ చేత కాకుండా ఉపాధ్యాయులు, విద్యార్థులు తామే వంట చేసుకొంటూ స్వీయ పాకం గూర్చి ప్రత్యక్ష పాఠం నేర్వాలని సూచించాడు. రవీంద్రుడు స్వరాజ్య వ్యాప్తికి తాళం చెవిని ఈ సలహాలో చూశాడు. స్వతంత్రత, స్వపరిపాలనలో అనుభవం వల్ల స్వరాజ్య స్ఫూర్తిలో వస్త్ర బహిష్కరణ చేసి, దేశీయ మిల్లులు చేసిన నూలు తోనే బట్టలు నేసి ధరించాలని నిర్ణయించాడు. అయితే దేశీయ మిల్లు నూలు పరిమితం కనుక నూలు వడకడాన్ని మొదలు పెట్టి వీటన్నిటిని దేశభక్తి ప్రేరిత స్వీయ పోషణ కార్యకలాపాలుగా, పరాధీనత నుంచి బయటపడేసేవిగా గాంధీ చూశాడు.

మానవ జీవన సమగ్ర అభివృద్ధికి రాజకీయాధికారం ఒక సాధనం. ఇది జాతీయ ప్రతినిధుల ద్వారా జాతి జీవనాన్ని నియంత్రిస్తుంది. అయితే జాతికి స్వయం నియంత్రణ కలిగినట్లయితే ప్రతినిధులతో అవసరం లేదు. గాంధీకి ఇదే విజ్ఞానవంతమైన అరాచక స్థితి (ertightered anarchy). అట్టి స్థితిలో రాజకీయాధికారం వుండదు. ఎందుకంటే రాజ్యమే వుండదు గనుక. ఆ స్థితి పూర్తిగా సాధ్యం కాదు కనుక థోరూ చెప్పినట్లుగా 'తక్కువగా పాలించే ప్రభుత్వాన్నే ఉత్తమ ప్రభుత్వంగా భావించాలన్నాడు' గాంధీ.

అధికార వ్యవస్థ క్రింద వుండకుండా ప్రజలు తమంత తాము శాసించుకోవడం అహింస. ఇది పరిశుద్ధ అరాచకానికి దారితీయగలదని గాంధీ ఆశించాడు. ప్రతి వ్యక్తి తన అంతర్వాణిని గౌరవిస్తే ఇది సాధ్యం. వ్యక్తి అనుమతి లేనిదే ప్రభుత్వం అతన్ని నియంత్రించజాలదు. అట్టి వ్యక్తి ప్రభుత్వం కన్నా ఉన్నతుడే. వ్యక్తికి స్వేచ్ఛ ముఖ్యమైనా సమాజ అవసరాలకై పురోగతికై తనని తాను సరిదిద్దుకుంటాడు. విశృంఖలతకు, నియంత్రణకు మధ్య 'గోల్డేన్‌మీన్'న్ని తెల్సికోవాలంటాడు గాంధీ. సామాజిక పురోగతి కోసం వ్యక్తి సమాజ నియంత్రణను స్వచ్ఛందంగా అంగీకరిస్తే అది ఇరువురినీ ఉన్నతీకరిస్తుందని అన్నాడు.

సత్యం, అహింసల ద్వారా పూర్ణ స్వాతంత్ర్యం అంటే ప్రతి వ్యక్తి (ఏ విచక్షణా లేకుండా) స్వతంత్ర్యంగా వుండటమే. అంతరంగ, బహిరంగ స్వాతంత్ర్యాలు పరస్పరాధారితాలు. కనుక ఏ మేరకు సత్యం, అహింసలు సాధిస్తామో ఆ మేరకు పూర్ణ స్వాతంత్ర్యం పొందుతామని గాంధీ అన్నాడు. వేదాలలో 'స్వారాజ్యం' అంటే ఆత్మ నిగ్రహం మరియు స్వయంపాలన అని అర్థం. స్వాభావికంగా మనిషికి స్వేచ్ఛ ఎలా వుండాలో, ప్రతిజాతి కూడా స్వయం పాలనకు తగినదై వుంటుందని గాంధీ అన్నాడు. రాజ్యాధికారం కన్నా స్వీయ నియంత్రణ విలువైనది. వ్యక్తి స్వేచ్ఛ వల్ల సామాజిక ప్రయోజనం అధికంగా సిద్ధిస్తుంది. కనుక వ్యక్తి స్వేచ్ఛను నిరాకరిస్తూ ఏ సమాజమూ నిర్మించబడదు.

అహింసాత్మక స్వరాజ్యంలో శతృత్వం వుండదు కనుక అందరూ తమ శక్తి కొలది సామాజిక లక్ష్యాలకై పాటుపడతారు. దురలవాట్లు లేనందున ఆరోగ్యము, సామర్థ్యమూ పెరుగుతాయి. సంపన్నుల ఆస్తి కూడా సమిష్టి ప్రయోజనాలకే వినియోగించబడుతుంది. హక్కుల ఉల్లంఘన వుండదు. ప్రత్యేక హక్కులూ వుండవు. కనుక నియంత్రణకై అధికారం లేక హింస వుండదు. అత్యంత తక్కువ స్థితిలోని వ్యక్తికీ సమాన లేక పూర్తి స్వేచ్ఛ వుండటమే స్వరాజ్యం.

ఈ స్వరాజ్యంలో ప్రజలు తమ విధులను గుర్తించి నిర్వహించడం ద్వారా హక్కులను పొందుతారు. అలా పొందిన స్వేచ్ఛకు వారే న్యాయం చేయగలరు అంటాడు గాంధీ. అది కూడా సామాజిక న్యాయం దిశగానే వాడతారు. అనగా సమర్థవంతంగా విధుల నిర్వహణకే హక్కులు ఉపయోగపడతాయి. గీతలో చెప్పినట్లు 'కర్తవ్యమే నీ వంతు ఫలితాన్ని నాకు వదులు' - కార్యాన్ని విధిగా, ఫలితాన్ని హక్కుగా గ్రహించమంటాడు గాంధీ.

విశ్వమంతా అణువులోనూ నిక్షిప్తమై వుంది గనుక రెంటికీ ఒకే సూత్రంలా వ్యక్తికీ, జాతికీ స్వేచ్ఛ వుండాలంటాడు గాంధీ. అనగా ఎట్టి విచక్షణ లేక స్వరాజ్యం అందరికీ వర్తించాలి. స్వరాజ్యమంటే అత్యధికుల చేత ప్రభుత్వంగా భావిస్తే వారు జ్ఞానులు, నిస్వార్థపరులు అయితేనే స్వరాజ్యం సాధ్యం.

పూర్ణ స్వరాజ్యమంటే శ్రామికులకు పూర్తి ఆర్థిక స్వేచ్ఛ వుండటమే. రాజకీయ స్వాతంత్ర్యమంటే ఏ దేశ సంస్థలకూ అనుమతించక మన అవసరాల, సమస్యల దృష్టిలో మనకు అనుకూలంగా సంస్థలను నిర్మించుకోవడం. నైతిక శక్తి ఆధారితమైన అట్టి ప్రజాసార్వభౌమాధికారాన్నే గాంధీ 'రామ రాజ్యం' అన్నాడు. తన 'హింద్ స్వరాజ్'ను అందరి యొక్క, నిర్ణయం యొక్క పాలనగా భావించాడు. 'పూర్ణ' స్వరాజ్ అంటే అందరికి స్వేచ్ఛ అని వక్కాణించాడు. దానిలోని సత్యం, అహింసలే స్వేచ్ఛను సమానం చేస్తాయి. అట్టి రాజ్యం కొరకు శ్రమిస్తూ, జీవిస్తూ ఆఖరకు మరణించడానికీ గాంధీ ఇష్టపడ్డాడు. అనగా అనంతమైన సహనము, పట్టుదల ద్వారా స్వరాజ్‌ను సాధించవచ్చంటాడు.

## 10.9 వికేంద్రీకరణ :-

కేంద్రీకరణ ఏ రూపంలో జరిగినా అనగా అధికారం, పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానం కేంద్రీకృతమైతే అది గాంధీ దృష్టిలో హింసే. అన్నిటికన్నా అధికార కేంద్రీకరణను మిక్కిలిభయానకమైనదిగా భావిస్తాడు. అధికార కేంద్రీకరణ వ్యక్తిత్వాన్ని, పెట్టుబడి, సాంకేతిక పరిజ్ఞానాల కేంద్రీకరణలు అత్యధికులు జీవించే అవకాశాలను మృగ్యం చేస్తాయి. కనుక ఈ మూడూ హింసా రూపాలే. అందుకే గాంధీ అహింసాత్మక సామాజిక వ్యవస్థ కేంద్రీకరణకు వ్యతిరేకం. కనుక అధికారం అన్ని గ్రామాల్లోకి పంపిణీ కావాలని అంటాడు. అదే వికేంద్రీకరణ. ఇక్కడ అధికార వ్యవస్థ అంతా వ్యక్తి కేంద్రంగా వుండి, ఆ వ్యక్తి గ్రామం కోసం, ఆ గ్రామం గ్రామాల కూటమి కోసం త్యాగం చేసేట్టుగా వుంటుంది. బయటి లేక చివరి పరిధి చిన్న కేంద్రాల అధికారాన్ని అణచి వేయక వాటికి శక్తినిచ్చి, వాటి నుంచి శక్తిని గ్రహిస్తాయి. వాస్తవంగా అసాధ్యమైనా ఇట్టి దానికై భారతీయులు కృషి చేయాలని గాంధీ కోరాడు.

ప్రతి గ్రామంలోని ప్రజలందరూ పాల్గొన్నప్పుడే ప్రజాస్వామ్యం. భారతదేశంలోని అసలైన ప్రజాస్వామ్యానికి గ్రామమే యూనిట్. స్వాతంత్రం ఇక్కడి నుంచే మొదలవ్వాలంటాడు గాంధీ. ఒక గ్రామం పంచాయితీరాజ్ వ్యవస్థను కోరుకుంటే దాన్ని ఎవరూ ఆపలేరు. అంటే బాధ్యతల నుంచి వచ్చే హక్కుల్ని ఎవరూ అణచి వేయలేరంటాడు గాంధీ. అలా ప్రతి గ్రామం పూర్తి అధికారాలున్న ఒక రిపబ్లిక్‌గా మారగలదు. అవసరాన్ని బట్టి ఇతర వ్యవస్థల పై తగు సహాయం కోసం ఆధారపడుతుంది.

పంచాయితీ వ్యవస్థలో నిజాయితీ, శ్రమను తిరిగి పునర్నిర్మించాలని గాంధీ కోరాడు. అట్టి గ్రామాల్లో కలహాలను ఖర్చులేకుండా అంతం చేస్తే త్వరిత న్యాయం చేకూరుతుంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి సమృద్ధిగాను, గ్రామాలు పరిశుద్ధంగాను, మత్తపానీయాలు లేకుండాను, సినిమాలు, అస్పృశ్యత లేకుండాను, అన్ని మతస్తులు సోదర భావంతో మెలుగుతూ వుండాలని గాంధీ ఆశించాడు.

ప్రజలను శక్తివంతం చేసి పంచాయితీలు మరింత ఉపయోగకరంగా చేయడానికి గాంధీ ప్రజల విద్యా స్థాయిని పెంచాలన్నాడు. దేశం సైనికంగా కాక నైతికంగా పెరగాలన్నాడు. స్వరాజ్ అంటే అధికారాన్ని నిరోధించే శక్తిని అందరూ సంపాదిండమేనని కూడా గాంధీ అన్నాడు. ప్రజలు తమ భవిష్యత్‌ను తామే నిర్మించుకోవాలి.

డబ్బున్న వాళ్ళకే ఓటు పరిమితమైన దాని కన్నా, శీలం వుండి డబ్బు, అక్షరాస్యత లేనపుడు ఓటు నిరాకరించడం దుర్భరం అని గాంధీ అన్నాడు. గాంధీ వయోజన ఓటు హక్కును సమర్థిస్తాడు. అది అందరి హేతుబద్ధమైన కోర్కెలు తీరడానికి ఉపయోగపడుతుంది. ప్రతినిధుల అభిప్రాయాలకన్నా శీలానికే ప్రాధాన్యనివ్వాలన్నాడు. అట్టివారు ఏ పదవికైనా అర్హులే.

ప్రతినిధుల సభలో నుంచే గాక బయట నుంచి అనేకులు దేశానికి సేవ చేయవచ్చు. ప్రతినిధుల సంఖ్యకు ప్రజాస్వామ్యానికి సంబంధం లేదని గాంధీ అభిప్రాయపడ్డాడు. సంఖ్య తక్కువ వుంటే సమస్యలూ తక్కువ ఉంటాయన్నాడు. ప్రజామోదం పొందిన సంస్థ నిర్దేశించిన సభ్యులే ఎన్నిక కాబడాలన్నాడు. ధన వ్యయం కాకుండా ఎన్నికలు జరగాలి. ప్రతి విషయం ధనంతో ముడి పెడితే ప్రజాసేవ జరగదన్నాడు.

నిర్మాణాత్మక విషయాలైన ఐక్యత, అంటరానితనం నిషేధం, సంపూర్ణ మద్య నిషేధం అనేవి సత్యం, అహింసలతో కూడినవే. వీటి సాధనకై శాసన సభలు కృషి చేయాలన్నాడు. సత్యం, అహింసలు ధ్యేయమేగాక మార్గం కూడా కనుక మంచి ప్రజలచే ఎన్నుకోబడిన సరైన ప్రతినిధులు సత్యం, అహింసల సాధనకు కృషి చేస్తారు. ప్రజా వాక్కే దైవ వాక్కుగా గౌరవించబడాలన్నాడు. సత్యం, అహింసలు లేని ప్రజాస్వామ్యం అర్థరహితమన్నాడు గాంధీ.

అధికార పక్షం ప్రత్యర్థులతో గౌరవంగాను, నిజాయితీ గాను వ్యవహరించాలి. సభ్యుల మధ్య న్యాయపూరిత సంబంధాలు వుండేలా స్పీకర్ చూడాలని గాంధీ భావించాడు. మైనారిటీ వర్గానికి మెజారిటీ వర్గం నుంచి స్వతంత్రంగా వ్యవహరించే హక్కు వుంది. 'మనస్సాక్షి'కి సంబంధించినంత వరకు మెజారిటీ నిర్ణయానికి విలువ నివ్వక్కర్లేదన్నాడు. అంతేగాక ఒక వ్యక్తి అభిప్రాయము సరియైనదైనపుడు అది అధికుల అభిప్రాయం కన్నా విలువైనదిగా పరిగణించబడాలని గాంధీ కోరాడు. అదే అసలైన ప్రజాస్వామ్యం అని గాంధీ విశ్వసించాడు.

## 10.10 స్త్రీలు, యుద్ధం మరియు కార్మిక సంఘ ఉద్యమం :-

గాంధీ దృష్టిలో ఆత్మపరంగా స్త్రీ, పురుషులు ఒకటే. పరస్పర ఆధారంతో ఒకే రకమైన జీవితాన్ని జీవించే వారు మౌలికంగా కూడా ఒకటే. కానీ శారీరక తేడాల వల్ల స్త్రీ, పురుషులు చేసే పనుల్లో భిన్నత వచ్చి చారిత్రకంగా స్త్రీ, పురుషుడి పెత్తనంలోకి వచ్చింది. కుటుంబ పోషణకై పురుషుడు శ్రమిస్తే, పిల్లల పెంపకం, గృహ నిర్వహణకు స్త్రీ శ్రమించింది. స్త్రీకి సంతానాన్ని పెంచే నేర్పే గనుక లేకుంటే మానవ జాతి అంతమై వుండేదని గాంధీ అన్నాడు. అంతేగాక పురుషుడు చేసే కుటుంబ రక్షణలోను, స్త్రీ చేసే గృహ నిర్వహణలోనూ సమాన ధైర్యం అవసరమని గాంధీ అన్నాడు. పిల్లల్ని పెంచడంలోనూ, గృహ నిర్వహణలోను, కుటుంబం కోసం శ్రమించి సంపాదించడంలోనూ స్త్రీని అహింసా మూర్తిగా చూశాడు.

తన గర్భంలో వున్న శిశువును తన శరీర శక్తి ద్వారా, ప్రేమతోపోషిస్తుంది. కొన్ని రకాల ఆహారం, మందులు గర్భంలోని శిశువుకు హానికరమని తెలిస్తే వాటిని నిరాకరించి తాను బాధను భరిస్తుంది. పురిటి నొప్పులు భరిస్తుంది. ఈ సృష్టి కోసం ప్రేమతో అన్ని బాధలు భరిస్తుంది. ఆ స్త్రీ పిల్లలను తీర్చిదిద్దడంలో ధర్మాన్ని, ప్రమాదంలో వున్న బిడ్డను కాపాడటంలో క్షత్రియ ధర్మాన్ని, శ్రమించి పోషించడంలో వైశ్య ధర్మాన్ని, మల మూత్రాల నుంచి శుభ్రపరచడంలో శూద్ర ధర్మాన్ని పాటిస్తుంది అంటాడు గాంధీ. అట్టి స్త్రీ తన ప్రేమను మొత్తం మానవాళికి కూడా పంచితే ప్రపంచం అహింసాయుతం అవుతుందని గాంధీ ఆశించాడు. పురుషుడికి తల్లిగా, వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేదిగా, మౌనంగా వుండు నాయకురాలి స్థానం ఆమెకు వుంది. అహింసను నేర్పే శక్తి అహింసా మూర్తి అయిన స్త్రీకే వుందని, సత్యాగ్రహ ఉద్యమానికి స్త్రీ సహజంగానే నాయకురాలు కాగలదని గాంధీ పేర్కొన్నాడు.

వ్యాపారాత్మకమైన నేటి సమాజంలో ఉద్యోగం చేసి సంపాదించే అదనపు భారాన్ని స్త్రీ పై పెట్టడాన్ని గాంధీ గర్హిస్తాడు. ఇదంతా ఆస్తికి వారసుడిగా వుండి తద్వారా అధికారం పొందిన పురుషుడి స్వార్థం వల్లేనని అంటాడు. కనుక చట్టపరంగా స్త్రీకి వున్న ఆటంకాలు తొలగాలని ఆశించాడు.

త్యాగానికి, ఓరిమికి మారుపేరైన స్త్రీ రాజకీయ రంగంలోకి వస్తే ఆ రంగం పరిశుద్ధమౌతుందని, ఆమె అధికారదాహానికి, సంపద ప్రోగు చేయడానికి అడ్డుకట్ట వేయగలదని గాంధీ ఆశించాడు. క్రమంగా విముక్తి చెందుతున్న స్త్రీ, పురుషుడు స్వార్థంతో నిర్మించిన సంస్థలను, శాసనాలను అహింసతో ప్రతిఘటిస్తుంది. స్త్రీని అబల అని పిలవడమే ఆమెను ఆత్మ స్వరూపంగా చూస్తానికి నిరాకరించినట్లవుతుంది. వాస్తవానికి నేటికీ ఓర్పుకీ, త్యాగానికి, వినయానికి, విశ్వాసానికి, జ్ఞానానికి మారు పేరుగా స్త్రీ కొనసాగుతుంది.

వ్యక్తిగత జీవితంలో కూడా గాంధీ స్త్రీ పట్ల తన దృక్పథాన్ని మంచిగా మార్చుకొన్నాడు. మొదట్లో విషయలోలత్వంతో భార్య పై పెత్తనం చేస్తూ తాను ఏకపత్నీ వ్రతుడు గనుక భార్య ప్రాతివత్యాన్ని ఆశించాడు. ఆమె పై ప్రేమే ఆమెను అనుమానించడానికి కారణమైందన్నాడు. స్త్రీకి భర్త మీద కోపం వస్తే లోలోపల కుమిలి పోవాల్సిందే గాని కోర్టు కెళ్ళి విడాకులు పొందే స్థితి లేదు. అలా న్యాయం స్త్రీ విషయంలో ఏకపక్షంగా వుందనీ గ్రహించాడు. ఆమెకు చదువు చెప్పే ప్రయత్నాలనుకూడా అతని విషయలోలత్వం ఓడించింది. ఏకపత్నీ వ్రతంలో కూడా నిగ్రహం వుంటే స్త్రీని భోగవస్తువుగా కాక సమంగా చూడవచ్చని గాంధీ ఉద్దేశ్యం. తన భార్య పై అజమాయిషీ, దౌర్జన్యం లాంటివి చేసినపుడు ఆమె సహన శక్తి వల్ల తన మనసాక్షి పని చేసిందని గాంధి గ్రహించాడు. తన నిర్వికారత పెరిగే కొద్దీ కుటుంబంలో సుఖ శాంతులు, నిర్మలత్వం పెరిగాయన్నాడు. అహింస గురించి పూర్తి జ్ఞానం కలిగాక తనలో అనుమాన ప్రవృత్తి తగ్గి తనకు భార్య సహచారిణి, సహధర్మచారిణిగా కన్పించిందన్నాడు.

స్త్రీలు తమ శరీర సౌందర్యానికి ప్రాధాన్యతనిస్తే పురుషునికి బానిసగా మారాల్సి వస్తుందన్నాడు. కనుక మానవాళిని ప్రేమించడం ద్వారా స్త్రీ తన హృదయ సౌందర్యాన్ని ప్రకటించాలని కోరాడు. బాధ్యతను గ్రహించి నెరవేర్చినవారు ప్రతిష్ఠాత్మక స్థాయికి చేరతారు. వారు సమాజంలో వున్న అన్ని అవాంఛనీయ పరిమితుల పై అహింసాత్మకంగా ప్రతిఘటించాలన్నాడు. తమ రక్షణకై పురుషుని సహాయం కోసం ఎదురు చూడకుండానే తమ శక్తి పైనా, శీలం పైన, దైవం పైన ఆధారపడాలన్నాడు. స్త్రీని గౌరవించని సమాజం నాగరిక సమాజం కాదు.

సత్యాగ్రహంలో స్వదేశీ ఉద్యమంలో భాగంగా స్త్రీలు నూలు వడకడాన్ని, ఖాదీని, దేశభక్తిని ప్రచారం చేయడాన్ని, దాన్ని ఆచరణలో బట్టలు నేసి నిరుపేదలకు ఉచితంగా ఇవ్వడాన్ని గాంధీ ప్రోత్సహించాడు. ఉద్యమం తీవ్రస్థాయికి చేరాక స్త్రీలు ఇతర పోరాట రూపాల్లోకి రావచ్చని చెప్పి, వారు కూడా లాఠీలకు, అరెస్టులకు వెరవకుండా పోరాడటాన్ని ప్రోత్సహించి, శ్లాఘించాడు.

జంతు స్వరూపమైన హింస అత్యున్నత స్థాయిలో కన్పించేది యుద్ధంలోనే. శాశ్వత శాంతి సాధ్యతను నమ్మకపోవడం అంటే మనిషిలోని దైవత్వాన్ని నమ్మకపోవడమేనంటాడు గాంధీ. శాంతి సాధన వైఫల్యానికి ఇప్పటి వరకు కృషి చేసిన వారి నిజాయితీ లోపమే కారణమంటాడు. అయితే వారికీ విషయం తెలియకపోవచ్చు. శాంతికి సంబంధించిన కొన్ని పరిస్థితులు మాత్రమే అనుకూలమైతే చాలదు. వినాశనం చేసే ఆయుధాల పై అధిపత్యం వున్నవారు వాటి ఫలితాలను గ్రహిస్తే శాశ్వత శాంతి సుసాధ్యమని గాంధీ అన్నాడు. అయితే పెద్ద రాజ్యాలు సామ్రాజ్యవాద తత్వం వదిలితేనే గాని ఇది సాధ్యం కాదన్నాడు. కోర్కెలను, సంపదను ప్రోగు చేసికోవడం మానితేనే గాని సామ్రాజ్యవాద తత్వం అంతమవ్వదు. దైవంలో విశ్వాసం లేకపోవడమే ఇక్కడ సమస్య. అనగా వారు కోరుకునే శాంతిలోనే వారికి నమ్మకం లేదని తెలుస్తుంది. వినాశన భయంతోనే ఆయుధాలను పెంచుకోవడం జరుగుతుంది. కనుక పెద్ద రాజ్యాలు వినాశన భయాన్ని ఆయుధాలను త్యజించినట్లయితే శాంతి ఏర్పడుతుంది. అంతేగాక ఇవి వెనుకబడిన దేశాల దోపిడిని, సామ్రాజ్యవాదాన్ని విడిచి తమ నడతను మార్చుకోవాలి. అలా ప్రస్తుత నడతకు వ్యతిరేకంగా ప్రవర్తించడం అనేది పెద్ద దేశాలకు, రాజ్యాలకు ఒక విప్లవం లాంటిదే. అయితే తప్పును ఆపడంలో దైవానికి వున్న శక్తి అపరిమితం గనుక అట్టి మార్పు తద్వారా శాశ్వత శాంతి అసాధ్యం కాదు. ఆయుధ పోటీ పెరుగుతున్నంత కాలం మానవ నాశనం ఆగదు. కనుక ధైర్యంగా

ఎటువంటి ఆంక్షలు లేకుండా అహింసా పద్ధతిని అది అందించే సత్ఫలితాలను అంగీకరిస్తే తప్ప ఈ వినాశనం నుంచి బయటపడం. హింస, ప్రజాస్వామ్యం కలిసి వుండలేవు. పేరుకు ప్రజాస్వామ్యాలే అయిన దేశాలు నిష్కపటంగా సంపూర్ణాధికార రాజ్యాలుగా మారాలి లేదా అవి నిజాయితీగా ప్రజాస్వామ్యానికే కట్టుబడాలనుకొంటే అవి ధైర్య సాహసాలతో అహింసాయుతంగా మారాలి అని గాంధీ కోరాడు. సత్యం, అహింసలకు నిబద్ధుడైన గాంధీ మానవ సంబంధాలతో ముఖ్యంగా రాజ్యాంగాల మధ్య సంబంధాలలో అహింసనే కోరుకున్నాడు.

ఆదర్శవంతమైన కార్మిక, యాజమాన్య సంబంధాలను దృష్టిలో వుంచుకొని గాంధీ ఒక సంస్థలో పని చేసే వారంతా సమానమేనన్నాడు. పెట్టుబడి, శ్రమ పరస్పరాధారితాలు కనుక వాటి మధ్య ఘర్షణ లేదని విశ్వసించాడు. కనుక అహింస శ్రామిక యజమాని సంబంధాలను సోదర సంబంధాలుగా మారుస్తుందని నమ్మాడు. అంతేగాక శ్రామికుల శ్రేయస్సుకై యజమానులు పితృ సమాన ప్రేమతో, ఆసక్తితో కృషి చేయాలన్నాడు.

గాంధీ సూచించిన ధర్మ కర్తృత్వ భావనలో శ్రామికులూ యజమానులతో సమానులౌతారు. ఇది చట్టం యొక్క వత్తిడి వల్ల గాక పరస్పర ప్రేమాభిమానాల పై ఆధారపడి జరగాలని గాంధీ కోరుకున్నాడు. పెట్టుబడి ఆధిక్యతను గాంధీ వ్యతిరేకించాడు. పది లక్షల మంది మనుషుల కన్నా పది లక్షల రూపాయలకు ఎక్కువ విలువ ఎందుకు వుండాలని గాంధీ ప్రశ్నించాడు. గాంధీ ఆశించిన కార్మిక సంబంధాలలో పరస్పర సహాయ, సహకారాలు వుండి, సామరస్యం పరస్పర విశ్వాసం, ఐక్యతతో వారు వర్ధిల్లుతారు. తద్వారా మానవశక్తి మరింత పెరుగుతుంది. మానసిక, శారీరక పరిశుద్ధత ద్వారా ఇది సాధ్యమని నమ్మాడు. మత్తు పానీయాల, పదార్థాల సేవన, జూదం, మాంసాహారం, అప్పులు చేయడం వంటివి శ్రామికులు త్యజించాలని గాంధీ కోరాడు. వారు శ్రద్ధతో పని చేస్తే యజమానుల నుంచి సత్ప్రవర్తనను ఆసించవచ్చు. భాగస్వామ్య హక్కులకై కృషి చేస్తూ నిజాయితీగా పని చేయాలని గాంధీ అన్నాడు.

శ్రమించి సంపాదించడం ద్వారా శ్రామికులు మనుషులుగా నిరూపించబడుతున్నారు. కనుక మన గురించి మనం శ్రమ పడటంలో అగౌరవం ఎలా లేదో, ఇతర్ల గురించి శ్రమించడంలోనూ అగౌరవం లేదు. కనుక శ్రామికులు అసంతృప్తి విడిచి తమ శ్రమకు తాము (జాతి పట్ల) ధర్మకర్తలుగా వ్యవహరించాలన్నాడు. పైగా సంపన్నులు లేకపోయినా జాతి మనుగడ కొనసాగుతుంది. గాని, శ్రామికులు లేకుండా అది కుదరదని గాంధీ అన్నాడు. శ్రమకు తగిన మూల్యం పొందడం శ్రామికుల హక్కైతే, నిజాయితీగా శక్తి మేరకు పని చేయడం వారి బాధ్యత అవుతుంది. తన అనుభవంలో యజమానుల కన్నా శ్రామికులే అధిక నిజాయితీ కల్గి వున్నారని గాంధీ అన్నాడు. శ్రామికులు కూడా విద్యావంతులై మానవ సంబంధాలు, తమ హక్కులు వాటి అమలుకు గూర్చిన జ్ఞానం పొందాలన్నాడు.

కార్మికులకు సమ్మె హక్కు వుండాలని గాంధీ అన్నాడు. యజమానులు వివాదం సందర్భంగా మధ్యవర్తిత్వానికి సిద్ధపడితే అప్పుడు సమ్మె అనవసరం మరియు నేరం అవుతుందన్నాడు. పెరుగుతున్న అసహనం వల్ల కార్మికులు తమ డిమాండ్ల సాధనకై హింస వైపు మొగ్గుతున్నారని, తమను సమర్థించని వారిని అవహేళన చేస్తున్నారని అన్నాడు. అయితే వాస్తవంలో శ్రామికుల కన్నా పెట్టుబడిదార్లే సంఘటితపడి తద్వారా లబ్ది పొందుతున్నారు. చైతన్యరాహిత్యం, అంతర్గత విభజనల వల్ల శ్రామికులు మరింత దోపిడీకి గురి అవుతున్నారు. వారు అహింసను అర్థం చేసికొంటే వారి శక్తి అప్రమేయమౌతుందన్నాడు.

గాంధీ పెట్టుబడిదార్లతో శ్రామికులనే అసలు యజమానులుగా చూడాలన్నాడు. ఇది ఒక్క రోజులోనే జరగదని గుర్తించి, ఈ లోపు యజమానులు సమ్మె చేస్తున్నవారి యాజమాన్య హక్కుల్ని కూడా గుర్తించి, వారికి ఆయా సంస్థల పై నియంత్రణనప్పగించి తమ మంచితనాన్ని ప్రదర్శించాలన్నాడు. అంతిమంగా తాము కోల్పోయిందేమీ లేదని యజమానులు గ్రహిస్తారన్నాడు.

నేడు సమ్మెల పెరుగుదలకు మత విశ్వాసం స్థానంలో ధన ప్రభావం చేరడాన్ని కారణంగా గాంధీ గుర్తించాడు. కార్మికులు కాని వారి నాయకత్వం వల్ల లేక నాయకత్వలోపం వల్ల కార్మికులు ప్రతి చిన్న విషయానికీ సమ్మె చేయడం లేక తమ సమస్యను సరిగా

ప్రతిపాదించలేకపోవడం జరుగుతుంది. అంతేగాక శ్రామికులు సమ్మె కాలానికి తమ సంఘం పై ఆర్థికంగా ఆధారపడుతున్నారు. అలాకాక శ్రామికులు తమ పైనే తాము (ప్రత్యామ్నాయ ఉపాధి ద్వారా) ఆధారపడితే వారు సమ్మెను దీర్ఘకాలం చేయగలిగి యజమానులలో మార్పు తేగలరు. సమ్మె చేస్తున్న వారికి ప్రత్యామ్నాయంగా శ్రామికుల లభ్యత వుంటే సమ్మె నిరుపయోగం. అప్పుడు అన్యాయానికి వ్యతిరేకంగా రాజీనామానే పరిష్కారం అని గాంధీ అన్నాడు.

మధ్యవర్తిత్వం, న్యాయస్థానాలు కూడా శ్రామిక సమస్యలను పరిష్కరిస్తాయి. ఆర్థిక లక్ష్యాలకై సమ్మె చేసేటప్పుడు రాజకీయ లక్ష్యాలు వుండరాదని గాంధీ కోరాడు. పశ్చిమ దేశాల్లో వలే శక్తి, హింస ప్రయోగించకుండా, శ్రామికులు అహింసతో తమ పరిస్థితుల్నీ, యజమానుల్నీ మార్చగలరని గాంధీ విశ్వసించాడు.

శ్రామికుల పరిస్థితులు మెరుగుపడేందుకు తగిన విశ్రాంతి, చదువు, కుటుంబ పోషణకు, పిల్లల చదువుకు తగిన వసరులు, పారిశుద్ధ్య పరిస్థితులు, వృద్ధాప్యంలో జీవించడానికి కొంత (పొదుపు చేసిన) సొమ్ము అవసరం అని గాంధీ గుర్తించాడు. యజమానులు పని చేయించుకొనేందుకే పరిమితమై పై వాటిని నిర్లక్ష్యం చేస్తున్నారన్నాడు. సమ్మెతో పాటు పని నిలుపుదల, హర్తాళ్లు వంటివి మంచి సాధనాలే. కాని అవి దుర్వినియోగం చేయబడరాదు. అన్నిటికన్నా యజమానులకూ, శ్రామికులకూ మధ్య సోదర బావం పెంచడం ఉత్తమ పరిష్కారం అని గాంధీ భావించాడు. అది అహింసతోనే సాధ్యమన్నాడు.

స్వతంత్ర భారతదేశంలో వర్గాల మధ్య ఘర్షణ తొలగుతుందని గాంధీ ఆశించాడు. భిన్నత్వం కొనసాగినా ఇప్పటి స్థాయిలో అసమానతలు, నిరుద్యోగం వుండదని, రాజ్యా విధానం అహింస అయితే ఏ ఘర్షణా లేకుండా సమానత వస్తుందని ఆశించాడు.

అహింస ద్వారా పెట్టుబడిదార్లను కాకుండా పెట్టుబడిదారీ వ్యవస్థను అంమొందించాలి. పెట్టుబడిదార్లను ట్రస్టీలుగా మార్చాలి. గాంధీ దృష్టిలో ఏ వ్యక్తీ బాగు చేయబడలేనంతగా చెడిపోడు. అలాగే ఏ వ్యక్తికీ చెడిపోయారనుకొన్న ఇతర్లను నాశనం చేసేంత పరిపూర్ణత వుండదు. పేదల దోపిడీని అంతమొందించడానికి గాను వారి అజ్ఞానాన్ని తొలగించి వారు పెట్టుబడిదార్లతో సహాయ నిరాకరణ చేసేట్లు తోడ్పడాలని గాంధీ అన్నాడు. అది దోపిడీ దార్లలోనూ మార్పు తెస్తుంది. అంతిమంగా కార్మికులు యాజమాన్యంలో భాగస్వాములవుతారు.

దైవానికి చెందిన సంపదను ప్రజలందరికీ చెందేట్లు అహింసతో చేయవచ్చు. అనగా సంపదకు వ్యక్తిగతమైన హద్దు పెట్టింది మనిషే కనుక మనిషే దాన్ని మార్చగలడు. గాంధీ తన రామరాజ్యంలో అందరికీ ఒకే రకమైన హక్కులు వుంటాయన్నాడు. అలా అసలైన సామ్యవాదం వస్తుంది. సంపన్నులు స్వచ్ఛందంగా ధర్మకర్తలుగా మారకపోతే వారు పరిస్థితుల ప్రభావంతో చెయ్యక తప్పనిసరి పరిస్థితి రావచ్చని హెచ్చరిస్తాడు. శ్రామికులు తమ శక్తిని తెలిసికొని సత్యం, అహింసల ద్వారా సంపన్నులలో మార్పు తెచ్చి సమాన న్యాయాన్ని సాధిస్తే వర్గ పోరాటం అనావశ్యకమని తెలుస్తుందని గాంధీ అన్నాడు. అంతేగాక గాంధీ దృష్టిలో వర్గ పోరాటం హింసాత్మకం కనుక అభిలషణీయం కాదు.

## 10.11 సారాంశం :-

గాంధీని ఆచరణాత్మక, క్రియాశీలక తత్త్వవేత్తగా ప్రపంచం గుర్తించింది. గాంధీ వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసినారు రామ్‌చంద్ భాయి, టాల్‌స్టాయి, రస్కిన్. గాంధీ న్యూటెస్టామెంట్‌లోని 'సెర్మన్ ఆన్ ది మౌంట్'ను గీతకు సాటిగా గుర్తించాడు. సత్యం అనే వృక్షాన్ని పోషిస్తూ ఉంటే అది సేవా రూపంలో ఫలాలనిస్తుందన్నాడు. విశ్వప్రేమ ద్వారా దైవాన్ని తెలిసికోవచ్చు అని అంటాడు. ప్రకృతిని ఉపయోగించుకునే హక్కు ఏ ఒక్కరికో కాక అందరికీ ఉంటుంది. మతం అనేది దైవ భావన పై ఆధారపడి, మనిషిని దైవాన్ని కలిపే మార్గంగా గుర్తింపబడింది. దైవానికి చెందిన సంపదను ప్రజలందిరకీ చెందేటట్లు అహింసతో చేయవచ్చు. హింసాత్మకం అభిలషణీయం కాదు.

## 10.12 మాదిరి ప్రశ్నలు :-

1. గాంధీతత్వానికి గల ఆధారాలను వివరించుము.
2. గాంధీ యొక్క అహింస, సత్యాగ్రహ భావనలను వివరిస్తూ, మార్గం - లక్ష్యం సంబంధం పై గాంధీ దృక్పధం వివరించండి.
3. రాజ్యం, ప్రభుత్వం పై గాంధీ భావనలతో పాటు స్వరాజ్య ఆదర్శాన్ని పేర్కొనుము.
4. మతము, వర్ణ వ్యవస్థ పై గాంధీ అభిప్రాయాలను వ్రాయుము.
5. కార్మిక ఉద్యమం పట్ల గాంధీ భావాలను మరియు ధర్మకర్తృత్వ సూత్రాన్ని వివరించుము.

## 10.13 ఆధార గ్రంథాలు :-


1. ఆత్మకథ లేక సత్య శోధన - మహాత్మాగాంధీ
2. The Selected Works of Mahatma Gandhi - Vol - IV & VI, Navajivan Trust, 1968. Navajivan Publishing House, Ahmadabad.
3. గాంధేయ మార్గం - తాత్వికత - ఏటుకూరు బలరామమూర్తి, గాంధేయ సమాజ సేవా సంస్థ, గాంధీ క్షేత్రం, అవనిగడ్డ.
4. Mahatma Gandhi And Sarvodaya - V.P.Varma
5. "The Relevance of the Gandhian Socio-Economic Philosophy to Contemporary Reality" - V.K. Arora, Indian Journal of Political Science -Vol XLII No.4.



రచయిత

P. సుధాకర్

పాఠం - 11

# సర్వోదయ

## 11.0 లక్ష్యం :

ఆధునిక భారత రాజకీయ, సామాజిక తత్త్వ విచారంలో సర్వోదయకు ప్రముఖ స్థానం ఉన్నది. 'సర్వోదయ' అనేది ఒక ప్రజాస్వామ్య ఉద్యమము. ఈ ఉద్యమము గాంధీజీ అంతర్ దృష్టి మీద ఆధారపడిన రాజకీయ తత్త్వము. సర్వ ప్రజలు సుఖశాంతులతో ఆనందదాయకమైన జీవితం గడపాలని కోరుతూ, స్వార్థరహిత సేవలను కోరుతూ, అధికార కాంక్ష, ధన దాహం వంటి తత్త్వాన్ని వ్యతిరేకిస్తుంది. సర్వోదయ సర్వజనామోదితమైన నిర్ణయాలే సత్ఫలితాలను ఇస్తాయి గాని అధిక సంఖ్యాకతను పరిగణనలోకి తీసుకోవడం శ్రేయస్కరం కాదని వాదిస్తుంది. సర్వోదయ అనేది సత్యాన్ని ప్రతిపాదన చేస్తూ కొనసాగే మహాయజ్ఞము. ఈ ఉద్యమాన్ని గాంధీజీ తర్వాత వినోభాభావే మరియు జయప్రకాష్ నారాయణ్‌లు బహుళ ప్రాచుర్యంలోనికి తీసుకువచ్చి మహోద్యమంలా కొనసాగించారు. వినోభాభావే గాంధీజీ అహింస, సత్యాగ్రహాల పట్ల ప్రభావితుడై సర్వోదయ ఉద్యమాన్ని అనుసరిస్తూ భూదాన ఉద్యమం కూడా సత్యాగ్రహ ఉద్యమమేనని విశ్వసిస్తాడు. జయప్రకాష్ నారాయణ్ కూడా సాంఘిక, ఆర్థిక పునర్నిర్మాణానికి పరిపూర్ణమైన సిద్ధాంతం సర్వోదయ ఉద్యమం అని భావిస్తూ ప్రజాస్వామ్య సామ్యవాదం వైపు మొగ్గు చూపుతాడు. సర్వోదయ భావనను, గాంధేయవాదాన్ని, వినోభా భావే మరియు జయప్రకాష్ నారాయణ్‌ల సర్వోదయ భావనలు, తత్త్వాలు వివరించటం ఈ పాఠం యొక్క ముఖ్య లక్ష్యం.

**విషయసూచిక :**


**11.1** సర్వోదయ - పరిచయం

**11.2** సర్వోదయ - జయప్రకాష్ నారాయణ

**11.3** పక్షరహిత ప్రజాస్వామ్యము

**11.4** తాత్విక అరాజకవాదము

**11.5** వికేంద్రీకరణ

**11.5.1** గ్రామరాజ్యము

**11.6** సర్వోదయ - వినోభా భావే

**11.7** భూ దానము - సత్యాగ్రహము

**11.8** వినోభాభావే - పక్షరహిత ప్రజాస్వామ్యము

**11.9** సర్వోదయ రాజకీయ అంతర్భావాలు

**11.10** సారాంశము

**11.11** నమూనా ప్రశ్నలు

**11.12** చదువదగిన గ్రంథాలు

## 11.1 సర్వోదయ - పరిచయము :

సర్వోదయ ముఖ్య ఉద్దేశ్యం సర్వప్రజలు సుఖశాంతులతో ఆనందదాయకమైన జీవితం గడపడమే. సేవానిరతి, త్యాగనిరతి దాని ప్రధాన ప్రక్రియలు. సర్వోదయ స్వాతంత్ర్యము, న్యాయము, సోదర భావాలను, విలువలను గురించి ఎక్కువగా నొక్కి చెబుతుంది. అహింస, ప్రేమలు రాజ్యం ఏలే సమాజం, అందరికీ స్వేచ్ఛ, సమానత్వం, న్యాయము సమకూరే సమాజము, సాంఘిక ఆర్థిక సమానతలు గల సమాజం, పరస్పర సహకారం, సమైక్యత, సుహృద్భావం, సమ్మేళనాలు మూర్తీభవించిన సమాజ స్థాపనయే సర్వోదయ ఉద్యమచరమ లక్ష్యం. రాజకీయ సాంఘిక పునర్నిర్మాణ పథకాన్ని రూపకల్పన చేయడానికి జరిగే శక్తివంతమైన మేథాసంబంధిత ప్రయత్నమే సర్వోదయ రాజకీయతత్త్వము. సర్వోదయ ఉద్యమము మహాత్మాగాంధీ గారి అంతర్‌దృష్టి మీద ఆధారపడింది. స్వతంత్ర భారతదేశంలో గాంధీజీ భావాలను పెంపొందించడానికి ఇది ఒక ఆరోగ్యప్రదమైన ప్రయత్నము. గాంధీజీ చెప్పిన వికేంద్రీకరణం, గ్రామవాదాల అభ్యున్నతి కోసం తోడ్పడగలదు. సర్వోదయ గాంధీజీ నుంచి వికేంద్రీకరణ భావనను గ్రహించినప్పటికీ పక్షరహిత ప్రజాస్వామ్యభావన మాత్రం స్వతస్సిద్ధంగా సర్వోదయ ప్రతిపాదించిన భావనయే. భారతీయ నాగరికత తత్త్వం, సంస్కృతులలోని సత్ సాంప్రదాయాల్ని మేళవించిన భావనయే సర్వోదయ ఉద్యమం. గాంధీజీ కలలు కన్న రామరాజ్యస్థాపన కృషిలో సర్వోదయ కీలక పాత్ర నిర్వహిస్తుందని నిరాటంకంగా చెప్పవచ్చును. సర్వోదయ రాజ్య నిర్మాణాన్ని వ్యతిరేకిస్తుంది. మానవుడు తనను తాను పరిపాలించుకొనే అంతర్‌పాలనయే స్వరాజ్యభావన. సర్వోదయ ఉద్దేశ్యం అధికార రాజకీయాల స్థానే సహకార రాజకీయాలుండటము. వ్యక్తి క్రమశిక్షణతో తనను తాను పాలించుకొనే ప్రభుత్వస్థాపన సర్వోదయ భావన ప్రభావితం చేయగలిగే, ఉత్తేజపూరితమైన ఒక మహా ఉద్యమము. అధికారం, పేరు ప్రతిష్ఠల కోసం రాజకీయ వర్గాలు, సమూహాలు జరిపే రాజకీయ పోరాటం ప్రజాస్వామ్యము అనే భావనను అర్థరహితంగా మారుస్తున్నది. పాలనా నిర్వహణలో ప్రజలకు సమున్నత స్థానం కల్పించేందుకు ప్రజాస్వామ్యంలో మౌలిక మార్పులు పరివర్తన తీసుకురావడానికి సర్వోదయ కృషి చేస్తుంది. అధికార వికేంద్రీకరణ కొరకు సర్వోదయ పాటుపడుతుంది. ప్రజలు ప్రజాస్వామ్య పద్ధతిలో తమ తమ సమస్యలను పరిష్కరించుకొనే పద్ధతిలో తర్ఫీదు తీసుకోవాలని సర్వోదయ తత్త్వం ఉద్బోధిస్తుంది. తద్వారా గ్రామాలలో గ్రామీణ స్వపరిపాలన సాధ్యపడుతుంది. అవినీతి, లంచగొండితనాలు లేని స్వచ్ఛమైన మంచి ప్రభుత్వ స్థాపన జరగటం అభిలషణీయమైన మార్పుగా సర్వోదయ భావిస్తుంది. స్వచ్ఛమైన ప్రభుత్వ స్థాపన ద్వారా ప్రజలు ఉన్నత స్థాయిని చేరుకోవాలని సర్వోదయ అభిలషిస్తుంది.

## 11.2 సర్వోదయ - జయప్రకాష్ నారాయణ్ :

భారతదేశ సామ్యవాదుల్లో అగ్రగణ్యుడు జయప్రకాష్ నారాయణ్ సహాయనిరాకరణోద్యమదారుగా తన జీవితాన్ని ఆరంభించాడు. అమెరికాలో విద్యార్థిగా ఉన్నప్పుడు తూర్పు ఐరోపా మేధావుల సంపర్కం వల్ల మార్క్సిస్టుగా మారాడు. ముఖ్యంగా అమెరికా, బ్రిటీష్ సామ్యవాదుల భావాలను ఈయనను ఎక్కువగా ప్రభావితం చేసాయి. 1954లో ప్రజా సోషలిస్టుపార్టీకి రాజీనామా చేసి పార్టీ రాజకీయాల నుండి విరమించుకొన్నాడు. 1954 నుండీ సర్వోదయ ఉద్యమానికి తన జీవితాన్ని అంకితం చేసుకున్నాడు.

జయప్రకాష్ నారాయణ్ విప్లవాత్మక సామ్యవాదం కంటే ప్రజాస్వామ్య సామ్యవాదంపై ఎక్కువ మొగ్గు చూపాడు. అలాగే సామ్యవాదం భారతదేశ సంస్కృతిలో ఒక భాగంగా చెప్పాడు. సర్వోదయ స్వాతంత్ర్యము, సమానత్వము, న్యాయము అనే విలువలు గించి నొక్కిచెబుతుందని చెబుతూ సర్వోదయ పూర్తిగా రాజ్య నిర్మాణాన్ని వ్యతిరేకిస్తుందని చెప్పాడు. రాజ్యాధికారాన్ని పెంపొందించటం ద్వారా ఎటువంటి విజయాన్ని సాధించడం సాధ్యం కాదని తెలియజేసాడు. జయప్రకాష్ నారాయణ్ సర్వోదయ తత్త్వంలో భాగంగా పార్టీరహిత ప్రజాస్వామ్యాన్ని ఉద్బోధించారు. ఆధునిక రాజ్యాలలో రాజకీయ పక్షాలు కేవలం అధికారాన్ని చేజిక్కించుకోవడానికి జరిగే నిర్దాక్షిణ్యపూరిత ప్రయత్నాలుగా మాత్రమే ఈయన పరిగణించారు. అలాగే రాజ్యంలోని ప్రధాన కార్యకలాపాలలో ప్రజలు

పాలుపంచుకొనే అవకాశం ఈనాడు లేదనేది నిర్వివాదాంశం. ఈ కారణాల దృష్ట్యా సర్వోదయి పక్షరహిత ప్రజాస్వామ్య వ్యవస్థను కోరుతుందని ఆయన తెలియజేస్తారు. రాజకీయ అనర్థాలకు దూరంగా ఉండగలిగే పక్షరహిత సమాజ నిర్మాణము సర్వోదయ ముఖ్యలక్ష్యము. గ్రామాలను స్వయం పాలక, స్వయం పోషకాలుగా తయారుచేయవలెనని, దున్నే వానికే భూమి చెందాలనే భావనలను ప్రచారం చేసారు. సహకార సేద్యవిధానాన్ని, సహకార ఋణవ్యవస్థలు, మార్కెట్ విధానం, ప్రభుత్వ సహాయంతో పరిశ్రమలు నెలకొల్పడం వంటి పునర్నిర్మాణ కార్యక్రమాల్ని ప్రబోధించాడు. ఆర్థికావసరాలు తీరనిదే క్రియాత్మకమైన సంస్కృతి ఏర్పడదు అని నమ్మాడు. ప్రపంచ వసుధైక సమాజాన్ని సమర్థించాడు.

### 11.3 పక్షరహిత ప్రజాస్వామ్యము (Partyless Democracy) :

అతి భౌతికవాద భావ ప్రాతిపదికగా రాజకీయ సాంఘిక పునర్నిర్మాణం పథకాన్ని రూపకల్పన చేయడానికి జరిగే శక్తివంతమైన మేధాసంబంధిత ప్రయత్నమే సర్వోదయ రాజకీయ తత్వము అని జయప్రకాష్ నారాయణ్ ఉద్ఘోదించాడు. స్వతంత్ర భారతదేశంలో గాంధీ భావాలను పెంపొందించడానికి ఇది ఒక ఆరోగ్యప్రద ప్రయత్నము. ఆధునిక కాలంలో ప్రజానీకం రాజకీయాలలో చురుకుగా పాల్గొనడానికి, సంఘం తన అభీష్టాన్ని వ్యక్తం చేయడానికి అవకాశాలు చాలావరకూ మృగ్యం అయ్యాయి. అధునాతన ప్రచార సాధనాలవల్లనూ, ధృవ్యామోహం వల్లనూ, ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల నుంచి తమకు నచ్చిన సరి అయిన వ్యక్తిని ఎన్నుకోవడం, అదీ సర్వ స్వతంత్రంగా కేవలం తమ ఇష్టానుసారంగా ఎంపిక చేసుకోవటం ప్రజలకు అసాధ్యమైపోయింది. భారతదేశంలోని కొన్ని రాజకీయ పక్షాలు తమ ప్రత్యర్థులపై హింసకు పాల్పడుతున్నాయనే జగమెరిగిన సత్యం. పదవి కోసం, అధికారం కోసం జరిగే విచక్షణారహితమైన ధన వ్యయం, హింసా ప్రయోగం ప్రజాస్వామ్య రాజకీయ వ్యవస్థకు మాయనిమచ్చగా తీరని హాని కలుగజేసినాయి. రాజ్య నిర్వహణా కార్యకలాపాల్లో ప్రజలు స్వేచ్ఛగా పాల్గొనే అవకాశం లేదు. ఈ కారణాల దృష్ట్యా సర్వోదయ పక్షరహిత ప్రజాస్వామ్య వ్యవస్థను కోరుతుందని జయప్రకాష్ నారాయణ్ చెబుతారు. ఈ పక్షరహిత ప్రజాస్వామ్య వ్యవస్థను సిద్ధించుకోవడానికి నాలుగు ప్రధాన ప్రక్రియలున్నాయని ఆయన చెబుతాడు. అవి

1. రాజకీయ వర్గ ప్రమేయం లేకుండా గ్రామాలలో ప్రజల విశ్వాసాన్ని, అభిమానాన్ని చూరగొన్న వారిని, ప్రజాసేవకులుగా పేరుపడినవారిని సార్వత్రిక సాధారణాభిప్రాయం (Universal Consensus) తో పంచాయితీ సభ్యులుగా నియమించటం. భూదాన, గ్రామ దాన ఉద్యమాలు ఎంతో లాభకరమైనవి, పటిష్టమైనవి. సమాజ అభివృద్ధి కోసం ఈ ఉద్యమాలు ప్రోత్సహించడం ఎంతో అవసరమైంది. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఏకసూత్ర ప్రాతిపదికగా నిర్మాణం అవ్వాలి. పక్షరహిత ప్రజాస్వామ్యానికి ఇది సంస్థాపరమైన సాధనము.

2. రాజకీయ వర్గ హింస, అవినీతి వంటి అనర్థాలకు దూరంగా ఉండగలిగే సమాజనిర్మాణం సర్వోదయ లక్ష్యం. ఈ ఉద్యమానికి అంకితమైన వ్యక్తి ఎటువంటి పదవినీ ఆశించడు మరియు ఎన్నికల్లో పాల్గొనడు. తన అంతరాత్మ ప్రబోధాన్ని బట్టి అతడు తన ఓటు హక్కును వినియోగించుకోవచ్చు.

3. మరో ప్రధాన ప్రక్రియ ఏమంటే వివిధ రాజకీయ వర్గాలను సర్వోదయ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆహ్వానించడము. ఈ రాజకీయ వర్గాలకు సిద్ధాంతపరంగా విభేధాలు ఉండవచ్చు. కాని ప్రజాసంక్షేమం కోసం చేపట్టే అనేక కార్యక్రమాలను ఈ రాజకీయ వర్గాలన్నీ సహకార భావంతో కలిసి ఆచరిస్తే, సర్వోదయ కలలు కనే సర్వత్రా విప్లవం చైతన్యం వచ్చి తీరుతాయి.

4. చట్టసభకు ఎన్నికైన ప్రజాప్రతినిధి శాసనసభలో ప్రవేశించిన మరుక్షణం రాజకీయవర్గ సాన్నిహిత్యాన్ని, సంబంధాన్ని వదులుకొని, వర్గ ప్రాధాన్యాన్ని తటస్థీకరించే విధానం అమలులోనికి రావాలి. అభ్యర్థులు ఎన్నికలలో పాల్గొనేటప్పుడే ఒక

వర్గప్రతినిధిగా కాక - జాతి ప్రతినిధిగా పాల్గొనాలి. మంత్రుల నియామకం వర్గ ప్రాతిపదికపై కాక అత్యధిక సభ్యులు సూచించిన, అందరి ఆదరాభిమానం చూరగొన్న వారే ఎన్నికై అధికారాన్ని సద్వినియోగం చేయాలి.

## 11.4 తాత్విక అరాజకవాదము (Philosophical Anarchism) :

సర్వోదయ పూర్తిగా రాజ్యనిర్మాణాన్ని వ్యతిరేకిస్తుంది. రాజ్యాధికారాన్ని పెంపొందించడం ద్వారా ఎటువంటి విజయాన్ని సాధించడం సాధ్యం కాదని జయప్రకాష్ నారాయణ్ ఉద్బోధిస్తాడు. రాజ్యం భూతదయామయుడైన భగవంతుని భూతల ప్రతిబింబం కాదు. అది కేవలం ప్రభుత్వ యంత్రాంగాన్ని యావత్తూ తమ తెలివితేటలతో, నైపుణ్యంతో, చొరవతో, మధ్దత్తుతో తమ ఇష్టానుసారం నియంత్రించగలిగే వారికి అతి చక్కగా ఉపయోగపడే ఒక యాంత్రిక పరికరం మాత్రమే. రాజ్యం అనేది శాసనం అనే అధికారంతో భయాన్ని రేకెత్తిస్తూ బలవంతమైన జోక్యంతోనూ, వ్యవస్థాపిత హింసాపూరిత విధానాలతోనూ, తదితర అరాజక విధానాలతోనూ కూడుకొని ఉంటుంది. ఈ కారణాలవల్లనే రాజ్యభావనను, రాజ్యాన్ని గాంధీజీ పూర్తిగా వ్యతిరేకించినాడు. మానవుడు తనను తానే పాలించుకొనే అంతరపాలన "స్వరాజ్యం" కోసం గాంధీజీ ఎక్కువ ఆసక్తి చూపినాడు. సర్వోదయ ముఖ్య ఉద్దేశ్యం అధికార రాజకీయాల స్థానే సహకార రాజకీయాలు ఉండటము. ప్రజల మధ్య స్వచ్ఛందంగా జరిగే పరస్పర సహాయ క్రియాత్మకతలకు సర్వోదయ అధిక ప్రాముఖ్యం ఇస్తుంది.

## 11.5 వికేంద్రీకరణ (Decentralisation) :

అధికార వికేంద్రీకరణ కోసం సర్వోదయ పాటుపడుతుంది. ఆర్థిక, రాజకీయ స్థాయిలలో అధికార వికేంద్రీకరణ జరిగి తీరాలని గాంధీ వాదించారు. అవినీతి, లంచగొండి తనాలు లేని ప్రభుత్వ స్థాపన జరగటం వాంఛనీయమని సర్వోదయ భావిస్తుంది. రాజనీతి స్థానే లోకనీతి ఆక్రమించడంలో గల ప్రాముఖ్యాన్ని ఇది తెలియజేస్తుంది. స్వశక్తిపై ఆధారం, క్రమశిక్షణ ప్రతి ఒక్కరికీ అలవడాలని సర్వోదయ చెబుతుంది. ఏ ప్రభుత్వమైతే తక్కువగా పరిపాలిస్తుందో అదే ఉత్తమోత్తమ ప్రభుత్వం (That government is the best which governs the least) అనే విషయాన్ని గ్రహించగలగాలని సర్వోదయ ఆశిస్తుంది. ప్రజల అధికారం అంటే నిజమైన జనశక్తి పెంపొందాలని సర్వోదయ నొక్కి చెబుతుంది. జనశక్తి లేక ప్రజాధికార స్థిరీకరణం కోసం రెండు ప్రక్రియలు ఉన్నాయని సర్వోదయ అంటుంది. ఒకటి నిరంతర ప్రచారం, రెండు అధికార వికేంద్రీకరణ. ప్రజాభిప్రాయాన్ని మార్చడమే గాక వారి హృదయాల్లో కూడా మార్పు తేవాలన్నది సర్వోదయ ప్రధాన లక్ష్యమని జయప్రకాష్ నారాయణ్ చెబుతారు.

### 11.5.1 గ్రామ రాజ్యము :

అధికారం కోసం వివిధ రాజకీయ పక్షాలు పోటీపడి ప్రజాస్వామ్యాన్ని, విలువల్ని నాశనం చేస్తున్నాయి. కీలక నిర్ణయాలను ఏ కొద్ది మందో చేస్తే వాటిని యావత్ ప్రజానీకం మౌనంగా ఆమోదించి, అనుసరించవలసి వస్తూంది. అందుచేత ప్రజాస్వామ్యంలో మౌలిక పరివర్తన తీసుకురావటం సర్వోదయ లక్ష్యం. గ్రామ పంచాయితీ తనకు తానే చట్ట నిర్మాణం చేసుకొని పరిపాలన సాగించాలని గాంధీజీ అభిప్రాయపడినాడు. ప్రజలు క్రమశిక్షణతో ఆర్థిక సాంఘిక రాజకీయ సమస్యలను సమర్థవంతంగా పరిష్కరించుకోగలిగే రీతిలో శిక్షణ తీసుకోవాలనేది సర్వోదయతత్త్వం ఉద్బోధిస్తుంది. గ్రామాలలోని ప్రజానీకం తమ సమస్యలను తమ పరిధిలో పరిష్కరించుకోగలిగితే సర్వోదయ వాదులు చెప్పే గ్రామీణ స్వపరిపాలన అనే గ్రామ రాజ్యము సిద్ధిస్తుందని జయప్రకాష్ నారాయణ్ చెబుతారు. మౌలికంగా గ్రామంతో ప్రారంభమయ్యే ఈ ప్రక్రియ పై స్థాయిలలో అంటే జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో విస్తరించినపుడు స్వపరిపాలన విస్తృతమవుతుంది అని ఆయన విశ్వసిస్తారు.

## 11.6 సర్వోదయ - వినోభా భావే :

గాంధీజీ తన ఆధ్యాత్మిక వారసునిగా వినోభాజీని ఎన్నుకోవటం అతనిపట్ల గాంధీజీకున్న నమ్మకానికి నిదర్శనం. 1940లో తాను ప్రారంభించిన సత్యాగ్రహంలో ప్రథమ సత్యాగ్రహిగా గాంధీజీ వినోభాభావేను, ద్వితీయ సత్యాగ్రహిగా జవహర్‌లాల్ నెహ్రూను నిర్ణయించారంటే ఆయన దృష్టిలో వారిద్దరికీ ఎంతో ప్రాధాన్యమున్నదీ అంచనా వేయవచ్చు. యువక దశలో వినోభా విప్లవకారుడు. హింసావాదంతోనే ఆయనకు విశ్వాసం. అలాంటిది ఆయన ఆ తరువాత గాంధేయవాదిగా, అహింసావాదిగా మారిపోవటం నిజంగా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. గాంధీజీ నిర్దేశించిన ఖాదీ, బేసిక్ విద్య, కుటీర పరిశ్రమలు మొదలైన వాటి విషయంలో వినోభాజీకి అచంచలమైన విశ్వాసం. గాంధీజీ మరణం తర్వాత దేశంలోని పరిస్థితులు వినోభా మనస్సును వికలం చేసాయి. నాయకులలో అవినీతి, అధికార వ్యామోహం, ప్రజలలో నిస్పృహ పెచ్చు పెరిగాయి. ప్రజలలో భూసంస్కరణల పట్ల కోర్కె పెరిగింది. ప్రజలలో ఏర్పడిన భూదాహం తీర్చకపోతే దేశంలో అశాంతి తగ్గదన్న నిర్ణయానికి వచ్చి భూదానోద్యమానికి అంకురార్పణ చేసారు. ఆయన భారతదేశమంతటా పర్యటించి లక్షలాది ఎకరాలను భూదానం క్రింద సేకరించారు. భూదానం, గ్రామదానోద్యమంగాను, శ్రమదానోద్యమంగాను, జీవన దానోద్యమంగాను వివిధ రూపాలు దాల్చింది. భారతదేశంలో అహింసాయుతంగా భూవిప్లవం సాగడాన్కి మూలపురుషుడు వినోభాభావే. వ్యక్తిగత ఆస్తి విషయంలోను, భూసంస్కరణల విషయంలోను భారత దేశంలోనే కాక ప్రపంచంలోనే భావవిప్లవం రేకెత్తించిన ఘనత ఆయనది. నేడు భారతదేశంలో గాంధీయిజానికి ప్రతీక ఆచార్య వినోభా భావే.

## 11.7 భూదావాలు - సత్యాగ్రహము :

1951 ఏప్రియల్ నెలలో వినోభా తెలంగాణాలోని పోచంపల్లి గ్రామంలో ఉపన్యసిస్తుండగా కొందరు భూమి లేని హరిజనులు తమకు భూమిని ఇప్పించవల్సిందిగా వినోభాజీని కోరారు. తద్వారా వినోభాజీకి ఆనాడే ఆకస్మికంగా నూతన భావ విప్లవోదయమైంది. అదే భూదానోద్యమానికి అంకురార్పణ చేయడాన్కి ఉపకరించింది. ఆ అంకురం క్రమంగా దినదినాభివృద్ధి చెందింది. అదే మహావృక్షమైనది. ప్రతివారూ తమ భూమిలో ఆరవ వంతు భూమిలేని పేదలకు దానం చేయాలని వినోభా చేసిన విజ్ఞప్తి ఫలించింది. ఆయన భారతదేశమంతటా పర్యటించి లక్షలాది ఎకరాలు భూదానం క్రింద సేకరించారు. వినోభా ఉద్యమం బ్రిటన్, అమెరికా, జపాన్ దేశీయులను సయితం ఆకర్షించింది. ఆయాదేశాల నుంచి పెక్కు మంది భారతదేశం వచ్చి వినోభా చేస్తున్న పాదయాత్రలో కూడా పాల్గొన్నారు. భారతదేశంలో అహింసాయుతంగా భూ విప్లవం సాగుతున్నదని వారు గ్రహించారు. వినోభా భూదాన ఉద్యమం కూడా సత్యాగ్రహం ఉద్యమమేనని విశ్వసిస్తాడు. శాంతియుత పోరాటాలను వినోభా కాదనలేదు. గాంధీజీ అహింస, సత్యం లను గాఢంగా నమ్మినవాడు వినోభా భావే. రాజకీయ పునర్నిర్మాణానికి మానవసమాజ పునరేకీకరణకు అహింస ఒక సర్వోన్నత భావన అనే గాంధీజీ తత్వాన్ని నమ్మినవాడు వినోభా భావే.

గాంధీ రాజకీయ సిద్ధాంతంలో సత్యాగ్రహం ఒక ప్రధాన అంశము. సత్యాగ్రహం స్వప్రయోజనం కోసం స్వలాభాపేక్ష కోసం రూపొందించినది కాదు. ఉద్దేశ పూర్వకంగా సత్యాన్ని ప్రతిపాదన చేస్తూ కొనసాగే ఉద్యమము. సామూహిక నిర్ణయం సత్యానికి భంగకరంగా ఉందని జ్ఞాన వికాస పూరితమైన ఏ ఒక్క వ్యక్తి అంతరాత్మకు అనిపించినా అతడు సత్యాగ్రహం చేస్తాడని వినోభా భావే ఉద్బోధించారు. గాంధీజీ సర్వోదయకు సత్యాగ్రహం మౌలిక ఆధారము. సత్యాగ్రహంలో వివిధ ప్రక్రియలు ఉన్నాయి. నిరాహారదీక్ష పూనటం ఒక ప్రక్రియ. అయితే దీనిని కేవలం వ్యక్తిగత సాన్నిహిత్యం, అనుబంధం గలవారికి వ్యతిరేకంగా ఉపయోగించవలసి ఉంటుంది. ఐచ్ఛికంగా తమంతట తామే వలస పోవటం సత్యాగ్రహంలో మరో ప్రక్రియ. అంటే మనకు కోపాన్నీ లేక బలహీనతనూ కలిగిస్తే అటువంటి ఉద్రిక్తత నుంచి దూరంగా వెళ్ళిపోవడమే విజ్ఞత. ఈ రెండు ప్రక్రియలను నమ్మి ఆదర్శవంతంగా తన జీవితాన్ని తీర్చిదిద్దుకున్నవాడు వినోభా భావే. ఆయనకు గాంధీజీ సత్యాగ్రహ సిద్ధాంతంలో అచంచలమైన

## 11.8. వినోభా భావే - పక్షరహిత ప్రజాస్వామ్యము :

వినోభా భావే భూదాన, గ్రామదాన ఉద్యమాలను ఎంతో లాభకరమైనవిగా, పటిష్టమైనవిగా చెబుతూ పక్షరహిత ప్రజాస్వామ్యానికి అవి ప్రతీకలుగా చెబుతారు. సార్వత్రిక సాధారణాభిప్రాయం ద్వారా గ్రామపంచాయితీని, గ్రామపంచాయితీ రాణా పంచాయితీని ఎన్నిక చేస్తుంది. రాణా పంచాయితీ సభ్యులు జిల్లా పంచాయితీ సభ్యులను ఎన్నుకొంటారు. రాష్ట్ర ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం ఏక సూత్ర ప్రాతిపదికగా నిర్మాణం అవుతాయని వినోభా ఉద్ఘాటించారు. ఆయన ఉద్దేశ్యంతో భౌతిక అధికారం గ్రామాలలో ఉంటే, నైతిక అధికారాన్ని కేంద్ర ప్రభుత్వం చెలాయిస్తుంది. పక్షరహిత ప్రజాస్వామ్య సిద్ధికి ఇది సంస్థాపరమైన సాధనము. వర్గ భావ విభేదాలు మరిచి ప్రజాసంక్షేమం కొరకు రాజకీయ పక్షాలన్నీ ప్రజాసంక్షేమ కార్యక్రమాలను సహకార భావంతో అమలు జరిపితే సర్వోదయ కలలు కనే సామాజిక వర్గరహిత విప్లవం వచ్చితీరుతుంది. వినోభా ఈవిధంగా అన్నారు "వివిధ రాజకీయ వర్గాలపై మా విధానానికి సంబంధించినంతవరకూ నేను చెప్పదలచుకొన్న విషయం ఏమిటంటే - వర్గాలు అంతరించిపోయి సర్వజనామోదమైన కార్యక్రమాలను ఆచరించడం కోసం, సజ్జనులైన నిజాయితీ గల ప్రజలతో ఒక ఐక్యసమితిగా ఏర్పడవలె. ప్రజలందరి సమ్మతిని పొందగలిగేవారు విభేదాలను మరచిపోయి కలసికట్టుగా అనుసరించగలిగే ఒక కార్యక్రమాన్ని నేను వారి ముందు ఉంచుతాను. ఇది వర్గాలను ఒక దానికొకటి సన్నిహితమయ్యేటట్లు చేసినందువల్ల, వాటి మధ్య ఉండే బేధాభిప్రాయాలు క్రమేణా సమసిపోయి, అంగీకారం పొందగలిగే అంశాలు ఎక్కువ అవుతాయి. ప్రస్తుతం అందరి ఆమోదయోగ్యమైన దేశాన్ని ముందుకు నడిపే ప్రజల అంతర్గత బలం 'జనశక్తి' ని రూపొందించగలిగే 'భూదాన' కార్యక్రమం మనకు ఉంది".

## 11.9 సర్వోదయ రాజకీయాంతర్భావాలు :

### 11.9.1 మార్క్సిస్టు వర్గ పోరాట సిద్ధాంత ఖండన :

సర్వోదయ ప్రధాన ఆశయం ప్రజలందరూ ఆనందదాయకమైన జీవితం గడపాలన్నది. సేవానిరతి, త్యాగనిరతి సర్వోదయ యొక్క ప్రధాన ప్రక్రియలు. స్వార్థరహిత సేవలను కోరుతూ అధికార వాంఛను గర్హిస్తుంది. హింసాపూరిత వాదం కలిగిన మార్క్సిస్టు వర్గ పోరాట సిద్ధాంతాన్ని సర్వోదయ వ్యతిరేకిస్తుంది. అందరికీ స్వేచ్ఛ, సమానత్వాన్ని సమకూర్చే సమాజం మరియు సాంఘిక, ఆర్థిక అసమానతలు గల సమాజం స్థాపన జరగాలన్నదే సర్వోదయ ఉద్యమ చరమ ఉద్దేశ్యం.

### 11.9.2 అధిక సంఖ్యాకతావాద ఖండన :

అందరి భావాలను మంచి చెడ్డలపరంగా చర్చించి, విశ్లేషించి, తర్కించి, తీసుకొనే సర్వజనామోదితమైన నిర్ణయాల సత్ఫలితాలను ఇవ్వగలవు గాని, అధిక సంఖ్యాకతను పరిగణలోనికి తీసుకోవటం శ్రేయస్కరం కానేకాదని సర్వోదయ వాదిస్తుంది అధిక సంఖ్యాకతా వాదానికి బదులు సాధారణాభిప్రాయానికి సముచిత ప్రాధాన్యం ఇవ్వడం సమాజ పురోభివృద్ధికి దోహదం చేస్తుంది. అందువల్లనే అది అధిక సంఖ్యాకతా భావనను తొలగించి వేసి, దాని స్థానంలో మౌలిక సాధారణాభిప్రాయం చోటు చేసుకోవటం ఉత్తమం అని సర్వోదయ భావిస్తుంది.

### 11.9.3 భూదానము - సత్యాగ్రహము :

గాంధీజీ రాజకీయ సిద్ధాంతాలలో సత్యాగ్రహం ఒక ప్రధాన అంశము. ఇది స్వప్రయోజనం కోసం కాకుండా సత్యాన్ని ప్రతిపాదనము చేస్తూ కొనసాగే ఉద్యమము. వినోభా ఉద్దేశ్యంలో భూదాన ఉద్యమం కూడా సత్యాగ్రహ ఉద్యమమే. సత్యాగ్రహ

అనే పదాన్ని గాంధీజీ ప్రేమ శక్తి, ఆత్మశక్తి అని పేర్కొంటాడు. సత్యాగ్రహం అంటే నిరంతరం సత్యాన్ని సంరక్షించడమని ఆయన అభివర్ణించాడు. సత్యాగ్రహం శక్తియుతమైన స్వయం భావనను బోధిస్తుంది. సత్యభావనతో గూడిన చర్యయే సత్యాగ్రహము.

## 11.10 సారాంశము :

స్వతంత్ర్య భారతదేశంలో గాంధీజీ భావాలను పెంపొందించడానికి ఇది ఒక ఆరోగ్యప్రదమైన ప్రయత్నము. సర్వోదయ గాంధీజీ అంతర్ దృష్టి మీద ఆధారపడింది. అతి భౌతికవాద భావ ప్రాతిపదికగా రాజకీయ సాంఘిక పునర్నిర్మాణ పథకాన్ని రూపకల్పన చేయడానికి జరిగే శక్తివంతమైన మేధాసంబంధిత ప్రయత్నమే సర్వోదయ రాజకీయ తత్త్వము. ముఖ్యంగా సర్వోదయ గాంధీ చెప్పిన వికేంద్రీకరణ, గ్రామ వాదాల అభ్యున్నతి కోసం తోడ్పడగలదు. సర్వోదయ వికేంద్రీకరణ భావన లేక గ్రామరాజ్యభావన గాంధీజీ నుంచి గ్రహించినప్పటికీ పక్షరహిత ప్రజాస్వామ్య భావన మాత్రం స్వతస్సిద్ధంగా సర్వోదయ ప్రతిపాదనయే. నియంతృత్వంలోని ప్రమాదాలనూ, అనర్థాలనూ, రాజకీయశక్తి కేంద్రీకరణల వల్ల ఏర్పడే దుష్ఫలితాలను హెచ్చరించడం ద్వారా సర్వోదయవాదులు ఇంకా బాల్యవ్యవస్థలోనే ఉన్న స్వతంత్ర భారతదేశ ప్రజాస్వామ్య వ్యవస్థకు అమూల్యమైన సేవ చేయగలిగారు. పటిష్టమైన దేశ నిర్మాణానికి సత్ సంప్రదాయం ఉండటం ఎంతో అవసరం. భారతీయ నాగరికత తత్త్వం, సంస్కృతులలోని సత్ సాంప్రదాయాల సమ్మిళితం సర్వోదయ ఉద్యమం. స్వపరిపాలనతో ప్రజాస్వామ్యం యదార్థ ప్రయోగం కావాలనే సర్వోదయ ఉదాత్తమైన ఆశయం, గాంధీ కలలు కన్న రామరాజ్య స్థాపన కృషిలో కీలకపాత్ర నిర్వహిస్తుందని ఘంటా పథంగా చెప్పవచ్చు. వ్యక్తి తనను తానే క్రమశిక్షణతో పరిపాలించుకొనే ప్రభుత్వ స్థాపన నిజం కావాలనే సర్వోదయ ఉద్యమ ఆశయం నిజంగా, నిస్సందేహంగా ఉత్తేజపూరితమైన మహోద్యమం.

## 11.11 నమూనా ప్రశ్నలు :

1) సర్వోదయ గురించి వివరిస్తూ జయప్రకాష్ నారాయణ్ పక్షరహిత ప్రజాస్వామ్యమును గురించి వ్రాయండి.
2) వినోభా భావే సర్వోదయ భావనలను గురించి తెలియజేస్తూ భూదానోద్యమము గురించి తెలియజేయండి.

## లఘు వ్యాసరూప ప్రశ్నలు :

1) సర్వోదయ ఉద్యమం గురించి వివరిస్తూ గ్రామరాజ్యము - వికేంద్రీకరణను గూర్చి కూలంకషంగా వివరించండి.
2) భూదానోద్యమమును గూర్చి తెలియజేస్తూ సర్వోదయ రాజకీయ అంతర్భావాలు గురించి వ్రాయండి.
3) సర్వోదయ ఉద్యమానికి జయప్రకాష్ నారాయణ్ భాగస్వామ్యాన్ని తెలియజేయండి.
4) వినోభా భావే భూదానోద్యమమును గూర్చి వివరించండి.

## 11.12 చదువదగిన గ్రంథాలు :

1. Jaya Prakash Narayan : A Picture of Sarvodaya Social Order
2. Vinobha Bhave : "Bhoodan Ganga" "Bhoodan Yagna"
3. Prof. N.H. Sita Rama Sarma : Modern Indian Political and Social Thought (Telugu Academy)

డా॥ వెంకటేశ్వరరావు

పాఠం - 12

# డా॥ బి.ఆర్. అంబేద్కర్

## 12.0 లక్ష్యం :-

మైనారిటీ వర్గ నాయకుడిగా అంబేద్కర్‌కి ఉన్న విశిష్ట స్థానాన్ని గూర్చి, కుల వ్యవస్థ అభివృద్ధి కొరకు, షెడ్యూల్డ్ కులాల బాగు కొరకు, అంటరానితనాన్ని రూపుమాపుటకు, ఆయన ప్రతిపాదించిన రాజ్య సామ్యవాద లక్షణాలను గూర్చి తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

## విషయసూచిక :-


12.0 లక్ష్యం

12.1 పరిచయం

12.2 సంగ్రహ జీవిత విశేషాలు - రచనలు

12.3 అంబేద్కర్ కులవ్యవస్థ భావాలు

12.4 అంబేద్కర్ - మైనారిటీలు, అల్ప సంఖ్యాక వర్గాలు

12.5 అంబేద్కర్ రాజకీయ భావాలు - విశ్లేషణ

12.6 అంబేద్కర్ లౌకికవాదం

12.7 అంబేద్కర్ ప్రతిపాదించిన రాజ్య సామ్యవాద లక్షణాలు

12.8 సారాంశము

12.9 మాదిరి ప్రశ్నలు

12.10 ఆధార గ్రంథాలు


## 12.1 పరిచయం :-

భారత రాజ్యాంగ రచయిత అంబేద్కర్ గొప్ప విద్యావేత్త. సర్వశాస్త్ర విశారదుడు. న్యాయశాస్త్రం, మానవ శాస్త్రం, రాజనీతి శాస్త్రం, అర్థ శాస్త్రం ఆయన ఆసక్తితో అధ్యయనం చేశాడు.

## 12.2 సంగ్రహ జీవిత విశేషాలు - రచనలు :-

డా॥ భీమ్‌రామ్ రామ్‌జీ అంబేద్కర్ 1891వ సంవత్సరము ఏప్రియల్ నెల 14వ తేదీన మహారాష్ట్రలోని మెవో గ్రామంలో జన్మించాడు. తండ్రి రాంజీ, తల్లి భీమాబాయి. తల్లిదండ్రులు అతనికి పెట్టిన పేరు భీమారావు. స్కూల్లో రికార్డులను బట్టి అతని ఇంటిపేరు అంబావదేకర్. అంబేద్కర్ గురువు గారు ఆ పేరును తన ఇంటి పేరు మీదుగా అంబేద్కర్‌గా మార్చించారు. ఈ పేరుతోనే అంబేద్కర్ ప్రసిద్ధుడయినాడు. అంబేద్కర్ సతారా గ్రామం నుంచి తన ప్రాథమిక విద్యను ప్రారంభించాడు. 1907వ సంవత్సరములో మెట్రిక్, 1912లో బి.ఏ. విద్యను పూర్తి చేశాడు. తదనంతరము బరోడా మహారాజు సహాయంతో ఉన్నత విద్య

నిమిత్తము అమెరికా వెళ్ళాడు. 1915లో యం.ఏ. పూర్తి చేసి 1921లో లండన్‌లో యం.ఎస్.సి. డిగ్రీ పొందారు. 1923వ సంవత్సరములో ఆర్థిక శాస్త్రములో డాక్టరేట్ పట్టాను పొందారు. ఇదే సంవత్సరములో బార్ ఎట్‌లా అయినాడు.

1952 కొలంబియా విశ్వవిద్యాలయం నుండి "డాక్టర్ ఆఫ్ లాస్" బిరుదంతో డిగ్రీ పొందారు. 1953లో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి "డాక్టర్ ఆఫ్ లెటర్స్" బిరుదంతోను ఘన సత్కారాలను పొందాడు. రాంజీ పూర్వీకులు కొంకణ ప్రాంతానికి చెందినవారు. రత్నగిరి జిల్లాలోని మంజాన్‌గడ్‌కు 5 మైళ్ళ దూరంలో వున్న 'అంబావదే' రాంజీ వంశీయుల స్వగ్రామం. వీరి కుటుంబానికి ఆ గ్రామంలో ఒక ప్రత్యేక గౌరవం ఉండేది. ప్రతి ఏటా జరిగే గ్రామదేవత ఉత్సవాలకు ఉపయోగించే పల్లకి వీరి ఇంటనే ఉంచేవారు. అంబేద్కర్ తాతగారైన మాలోజీ సక్‌పాల్ 'మహర్' కులానికి చెందినవాడు. నిమ్నజాతి కులాలన్నింటిలోను 'మహర్లు' కొంత సాహసవంతులుగా కనిపిస్తారు. అంబేద్కర్‌కు బాల్యదనలో తన పదిహేనవ ఏట వివాహము జరిగింది. అవి బాల్య వివాహాలు ఆచరణలో ఉన్న రోజులు. మెట్రిక్ పాసయిన కొద్ది రోజులకే అంబేద్కర్‌కు వివాహము జరిగింది. 1935లో అంబేద్కర్ మొదటి భార్య మరణానంతరము, మరల 1948లో బ్రాహ్మణ కులానికి చెందిన డా॥ శారదను ద్వితీయ వివాహం చేసుకొన్నాడు.

**అంబేద్కర్ రచనలు:-** అంబేద్కర్ రాజకీయవేత్త మాత్రమే కాదు, మంచి పరిశోధకుడు, బహుగ్రంథకర్త. తాను తలపెట్టిన కార్యక్రమానికి అనువుగా భారతీయ శాస్త్ర పురాణాలను పరిశీలించి అనేక విషయాలను అధ్యయనం చేశాడు. ప్రాచ్య, పాశ్చాత్య విజ్ఞానాలను అవగాహన చేసుకొని సిద్ధాంతీకరించాడు. ఆర్థిక శాస్త్రం, రాజకీయ శాస్త్రం ఆయనకు అభిమాన పాత్రమైన విషయాలు. ఆయన రచనలన్నీ ఇంగ్లీషు భాష లోనే వున్నాయి. ఆయన రచనలు ఈ విధంగా ఉన్నాయి.

1. **ఏనిషియంట్ ఇండియన్ కామర్స్ (1915):-** కొలంబియా విశ్వవిద్యాలయంలో యం.ఏ. కోసం వ్రాసిన పరిశోధక వ్యాసం ఇది.
2. **ది ప్రాబ్లెమ్ ఆఫ్ ఏ రూపీ (1922):-** ఇది ఆయన లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్‌కు సమర్పించిన సిద్ధాంత వ్యాసం. దీనికి ఆయనకు డాక్టరేట్ డిగ్రీ లభించింది. దీనిలో అంబేద్కర్ చూపిన తర్క నైపుణ్యమూ, బుద్ధి సూక్ష్మత అసాధారణమైనవి.
3. **ప్రావిన్షియల్ డీ సెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా (1923):-** ఇది సిద్ధాంత వ్యాసం దీనికి అంబేద్కర్‌కు 'డాక్టర్ ఆఫ్ సైన్స్' డిగ్రీ లభించింది.
4. **రేనడ్ గాంధీ అండ్ జిన్నా:-** ఇది మహాదేవ గోవింద రేనడ్ 101వ జయంత్యుత్సవ సందర్భంగా తయారు చేసిన వ్యాసం.
5. **ది ఎవల్యూషన్ ఆఫ్ ప్రావిన్షియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా (1925):-** బ్రిటీష్ ప్రభుత్వం భారత దేశంలో అనుసరిస్తున్న దండ నీతిని ఇందులో విమర్శించాడు. మాంటేగ్ ఛేమ్సుఫర్డు సంస్కరణల ప్రసక్తి కూడ ఇందులో వుంది.
6. **ఎన్నిలేషన్ ఆఫ్ కాస్ట్ (1936):-** ఇది వర్ణ వ్యవస్థ పై గొప్ప విమర్శనాత్మక వ్యాసంగా ప్రసిద్ధి చెందింది.
7. **ఫైనాన్షియల్ హిస్టరీ ఆఫ్ బ్రిటీష్ ఇండియా:-** ఈ గ్రంథ రచనకు 1936లో ప్రణాళిక సిద్ధం చేసుకొన్నాడు. కానీ అది అసంపూర్తిగానే వుంది.
8. **థాట్స్ ఆన్ పాకిస్థాన్ (1940):-** ఇది ఉత్తమ శ్రేణి గ్రంథంగా ప్రశంసలు పొందింది. ఇందులో దేశ సమకాలీన పరిస్థితులు చర్చించాడు.
9. **వాట్ హిందూస్ హావ్ డన్ టు ద అన్‌టచ్‌బుల్స్ (1943):-** ఈ పుస్తకంలో కొన్ని అధ్యాయాలు మాత్రమే వ్రాశాడు. ఇది అసంపూర్తిగానే వుండిపోయింది.
10. **వాట్ కాంగ్రెస్ అండ్ గాంధీ హేవ్ డన్ టు అన్‌టచ్‌బుల్స్ (1945):-** ఇది గొప్ప విమర్శనాత్మక గ్రంథం, కాంగ్రెస్‌కు ఆశనిపాతమైన రచన. దళితుల ఓట్లు కాంగ్రెస్‌కు ఎక్కువగా రాలేదని దీనిలో నిరూపించాడు. గాంధీకి, కాంగ్రెస్‌కు దూరంగా ఉండాలని మైనారిటీ వర్గాల వారికి సూచించాడు.

11. హు వర్ శూద్రాస్ (1946):- ఈ గ్రంథంలో ఇండో - ఆర్యన్ సమాజంలో నాలుగో వర్ణం ఏర్పడటానికి దోహదం చేసిన పరిస్థితులను వివరించాడు.

12. ది అన్‌టచబుల్స్ (1948):- బౌద్ధ ధర్మాన్ని అనుసరించిన వారూ, బ్రాహ్మణులచే వెలివేయబడినవారు, అంటరాని వారయ్యారని ఇందులో సిద్ధాంతీకరించాడు.

13. 1951 మేలో 'బుద్ధుడు అతని ధర్మ భవిష్యం' అనే విషయం పై కలకత్తా నుండి వెలువడే 'మహాబౌద్ధ' అనే ఆంగ్లమాస పత్రికలో ఒక వ్యాసం వ్రాశాడు. తరువాత అది పుస్తకంగా వచ్చింది.

## 12.3 అంబేద్కర్ కులవ్యవస్థ - భావాలు :-

అంబేద్కర్ కులవ్యవస్థ పై భావాలు ఆయన సామాజిక నేపధ్యం ప్రత్యక్ష ఫలితం. పాశ్చాత్య భావాలైన స్వేచ్ఛా సమానత్వం, సౌభ్రాతృత్వము సంబంధించిన తనకు గల విస్తృతమైన పరిజ్ఞాన ఫలితంగా ఆయన భారతదేశంలో పాతుకుపోయిన కులవ్యవస్థ దోపిడీతత్వాన్ని స్పష్టంగా గుర్తించగలిగాడు. భారతదేశంలో కులవ్యవస్థ జాతీయ ఐక్యతకు, సమైక్యతకు అవరోధంగా రూపొందిందని ఆయన విమర్శించాడు. కులవ్యవస్థ ప్రతిపాదించిన పని విభజన (Division of Labour) సక్రమైనది కాదని ఆయన వాదించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం కులవ్యవస్థ ప్రతిపాదించిన పని విభజన హేతుబద్ధరహితమయినది, అసమంజసమయినది, అశాస్త్రీయమైనది. కులవ్యవస్థ ప్రతిపాదించిన కర్మ సిద్ధాంతముతో పూర్తిగా ముడిపడి వుంది. కర్మ సిద్ధాంతం వ్యక్తులలో చొరవను నశింపజేసి వారిలో ఆత్మన్యూనతను ప్రేరేపిస్తుంది. కులవ్యవస్థ వ్యక్తులు కులపరంగా సక్రమించిన వృత్తులు తప్ప మరే ఇతర వృత్తులను చేపట్టకుండా నిషేదిస్తుంది. దీని ప్రకారం వ్యక్తులు తమకు ఇష్టం వున్నా లేకున్నా తమ తమ కుల వృత్తులలోనే జీవితాంతము కొనసాగాలి. వారు తమ కుల వృత్తులను విసర్జించేందుకు మార్గమేమీ లేదు. ఈ విధంగా కులవ్యవస్థ ఆర్థికాభివృద్ధికి పెద్ద అవరోధంగా రూపొందింది.

అంబేద్కర్ కులవ్యవస్థతో పాటు కులవ్యవస్థ ప్రత్యక్ష ఫలితం అయిన అంటరానితనం కూడా తీవ్రంగా నిరసించాడు. భారతదేశంలో షెడ్యూల్డ్ కులాల వారు అనేక శతాబ్దల నుంచి అనుభవిస్తున్న నికృష్టమయిన పరిస్థితులకు, దుస్థితికి ఈ అంటరానితనమే ప్రధాన కారణమని ఆయన అనేక సందర్భాలలో ఉద్ఘాటించాడు. అంటరానితనం ఆయా వర్గాల ప్రజల మూర్తిమత్వాన్ని అభివృద్ధి చెందకుండా నిరోధించటమే కాక వారి ఆర్థిక ప్రగతికి కూడ తీవ్రమయిన ప్రతిబంధకం అయ్యింది. అంటరానితనం వల్ల ఈ వర్గ ప్రజలు అనేక పౌర హక్కులను, సౌకర్యాలను కోల్పోవలసి వచ్చింది. కులవ్యవస్థను ఖండించే లేదా నిర్మూలించే ప్రజాభిప్రాయం లేదా యంత్రాగం ఏదీ లేకుండా పోవడం వల్ల ఈ వ్యవస్థ నిరాటంకంగా కొనసాగుతూ వచ్చింది. ఆయన అభిప్రాయం ప్రకారం అంటరానితనం సమస్య వర్గ పోరాట సమస్య. ఒక వర్గం ప్రజలు మరొక వర్గం ప్రజల పై తలపెట్టే అన్యాయానికి ప్రతీక. అంటరానితనం యధాలాపంగా ఉద్భవించిన వ్యవస్థ కాదు. అయినప్పటికీ ఈ వ్యవస్థకు శాశ్వత స్వభావము వుంది. ఇంకోమాటలో చెప్పాలంటే అంటరాని వారికి ఇతరులకు మధ్య శాశ్వతమైన పోరు సంభవిస్తున్నది. అంబేద్కర్ అభిప్రాయం ప్రకారం అంటరానితనం బానిసత్వానికంటే ఎంతో భిన్నమైనదీ, ఎంతో ప్రమాదకరమయినది కూడ. బానిసత్వానికి లేని దోపిడీ ప్రవృత్తి అంటరానితనానికి వుంది. అంటరానితనం అవధుల్లేని ఆర్థిక దోపిడీ వ్యవస్థ వంటిది.

దేశ రాజకీయ వ్యవస్థ పై కులవ్యవస్థ ప్రభావాన్ని ఈ క్రింది విధంగా వివరించాడు.

1. కులవ్యవస్థ ప్రభావం చేత ఎన్నికలలో ప్రజలు కుల ప్రాతిపదిక మీదే తమ ఓటు వేయడం జరుగుతుంది. అందుచేత సమర్థవంతమయిన వ్యక్తులు ఎన్నిక చేసే అవకాశం తక్కువ.

2. మెజారిటీ కులం కేవలం తమ జనాభా ఆధారంగా ఎక్కువ శాతం సీట్లు పొందే అవకాశం ఉంది.

3. కొన్ని పరిస్థితుల్లో మైనారిటీ వర్గాల ప్రజలు (ఓటర్లు) మెజారిటీ వర్గ అభ్యర్థులకు తప్పనిసరిగా ఓటు చేయవలసి వుంటుంది.

4. మైనారిటీ వర్గ ప్రజల జనాభా పరిమితం కావటం చేత వారి అభ్యర్థులను మెజారిటీ వర్గ అభ్యర్థుల పై గెలవటం అసాధ్యం.

5. కులవ్యవస్థ ఫలితమయిన అసమానతల వల్ల ఉన్నత కులాలకు చెందిన ఓటర్లు దిగువ కులాలకు చెందిన అభ్యర్థులకు ఓటు వేయడం జరుగదు.

అయితే దిగువ కులాలకు చెందిన ఓటర్లు ఉన్నత కులాలకు చెందిన అభ్యర్థులకు ఓట్లు వేయటం గర్వకారణంగా భావించే అవకాశం వుంది. అందుచేత దిగువ కులాలకు చెందిన అభ్యర్థులు ఎన్నికలలో గెలిసే అవకాశము లేదు.

ఈ విధంగా కులవ్యవస్థ ఒంటరితనం తత్వాన్ని సంతరించుకొనటం కాక ఒంటరితనం ఒక గొప్ప సుగుణంగా చేసింది.

**కులవ్యవస్థ పై అంబేద్కర్ ప్రతిపాదించిన భావాలను విమర్శిస్తూ గాంధీ ఈ విధంగా పేర్కొన్నాడు:-** కులవ్యవస్థకు మతంతో ఎటువంటి సంబంధం లేదు. అది కేవలం ఒక ఆచారం (custom) మాత్రమే. కులవ్యవస్థ ఆధ్యాత్మికత, జాతి అభ్యున్నతికి ప్రమాదకరమని నేను భావించడం లేదు. హిందూ మతంలోని వర్ణ, ఆశ్రమ వ్యవస్థలకు కులవ్యవస్థకు ఎటువంటి సంబంధం లేదు. వర్ణ వ్యవస్థ వ్యక్తుల హక్కులను కాకుండా వారి విధులను నిర్వచిస్తుంది. కులవ్యవస్థ ప్రతిపాదించిన సూత్రాలు మానవ సంక్షేమానికి, వారి మధ్య సత్సంబంధాలు ఏర్పడటానికి దోహదం చేస్తుంది. కులవ్యవస్థ ఏర్పరచిన వృత్తులలో అదమం, ఉన్నతం అనే వ్యత్యాసం లేదు. ఆ వృత్తులన్నీ మంచివే, చట్టబద్ధమయినవే, సమాన హోదా కలిగినవే.

కులవ్యవస్థ వల్ల కలిగే దుష్ట ఫలితాలను దృష్టిలో వుంచుకొని అంబేద్కర్ కులవ్యవస్థను పూర్తిగా నిర్మూలించాలని (Anitilation of Caste) వాదించాడు. కుల నిర్మూలనకు కొన్ని విస్పష్టమయిన కారణాలను ప్రతిపాదించాడు. అవి

1. కులవ్యవస్థ అసమర్థతను అన్ని స్థాయిలలో పెంపొందింప చేస్తుంది.
2. కులవ్యవస్థ ప్రకారం బ్రాహ్మణులు మాత్రమే ఉపాధ్యాయులు, మేధావులు. ఈ భావం సమాజంలో సంస్కరణలను ప్రతిఘటిస్తుంది.
3. కులవ్యవస్థ కేవలం పని విభజన మాత్రమే కాదు. అది వ్యక్తులను విభజిస్తుంది.
4. కులవ్యవస్థ హిందువులను పూర్తిగా అవ్యవస్థీకరణకు గురి చేసింది. వారిని నిర్వీరులను చేసింది.
5. కులవ్యవస్థలో సమాజ వ్యతిరేక భావం వుంది.
6. కులవ్యవస్థ వ్యక్తులలో స్వార్థపరతత్వాన్ని, సంకుచిత భావాన్ని పెంపొందింప చేస్తుంది.
7. కులవ్యవస్థ పాతుకుపోయిన సమాజంలో ఐక్యతను సాధించటం అసాధ్యం.
8. కులవ్యవస్థ వ్యక్తులలో విశాల దృక్పథాన్ని, సేవాదృక్పథాన్ని పూర్తిగా నిర్మూలిస్తుంది.
9. కులం, వర్ణం రెండూ ప్రమాదకరమయినవి.
10. కులవ్యవస్థలో హేతుబద్ధతకు తావు లేదు.

ఈ విధంగా అంబేద్కర్ కులవ్యవస్థ ప్రమాదభరిత స్వభావాన్ని బహిర్గతం చేస్తూ ఆ వ్యవస్థను సమూలంగా నిర్మూలించాలని ఉద్ఘాటించాడు. అంబేద్కర్ కులవ్యవస్థ, నిర్మూలన పై ప్రతిపాదించిన భావాలు హిందూమత పునాదులను ప్రశ్నిస్తున్నాయి. అయితే ఆయన భావాలు ఎంత వరకు ఆచరణాత్మకం అయ్యేది సందేహాస్పదం. అంబేద్కర్ కులవ్యవస్థ నిర్మూలనకు తాను ప్రతిపాదించిన సూచనలను రాజ్యం అమలుపరచాలని వాదించాడు. ఇది కూడా అసాధ్యమే.

అయితే అంబేద్కర్ ఈ వాస్తవాన్ని గుర్తించ గలిగాడు. కులనిర్మూలనకు తాను ప్రతిపాదించిన సూచనలు అమలుపరచటం

సాధ్యంకాదని కూడ ఆయన గుర్తించ గలిగాడు. అందుచేత ఆయన తన వాదనలలోని హేతుబద్ధతను గుర్తించి తమ పాత సాంప్రదాయాలను విసర్జించి సమానత్వం, స్వేచ్ఛ, సౌభ్రాతృత్వంల సూత్రాల పై ఆధారపడిన ఒక నూతన సామాజిక వ్యవస్థను ఏర్పరచాలని హిందువులకు బోధించాడు.

## 12.4 అంబేద్కర్ - మైనారిటీలు, అల్ప సంఖ్యాక వర్గాలు:-

భారతదేశంలోని మైనారిటీ వర్గానికి చెందిన నాయకులలో అంబేద్కర్‌కి అతి ప్రధానమైన, విశిష్టమయిన స్థానం వుంది. మైనారిటీ వర్గ నాయకుడుగా అంబేద్కర్‌కు వున్న ప్రాముఖ్యత ప్రజాదరణ మరే ఇతర మైనారిటీ వర్గ నాయకులకు లేదనటం అతిశయోక్తి కాదు. అంబేద్కర్ మైనారిటి వర్గ ప్రజల సంక్షేమం పట్ల కనబరిచిన ఆసక్తి, వారి అభివృద్ధికి ఆయన మేధోపరంగా, రాజకీయపరంగా చేసిన కృషి ఈ వర్గాల ప్రజల పట్ల రాజ్యాంగము ప్రదర్శించిన ఆసక్తి కన్నా విస్తృతమైనవి, సమున్నతమైనవని చెప్పటం సమంజసమే. వాస్తవానికి మైనారిటీ వర్గ ప్రజల సమస్య అంబేద్కర్ ప్రతిపాదించిన సామాజిక ప్రజాస్వామ్యం (Social Democracy) ప్రణాళికలో అత్యంత కీలకమైన అంశం. అంబేద్కర్ 1919లో సౌత్ బరో (South Borough) సంఘము ముందు ఇచ్చిన సాక్ష్యం, బొంబాయి శాసన మండలిలో ఆయన చేసిన ఉపన్యాసాలు, 1928లో నియమించిన సైమన్ కమీషన్‌కు ఆయన అందించిన సహకారం, 1930 - 31లో నిర్వహించిన రౌండ్ - టేబుల్ (Round Table Conferences) సమావేశాలలో ఆయన చేసిన ఉపన్యాసాలు, భారత రాజ్యాంగ రచన మొదలైనవి అన్నీ మైనారిటీ వర్గ ప్రజల పట్ల అంబేద్కర్‌కు వున్న ఆసక్తి, తపనకు ప్రత్యక్ష నిదర్శనాలు.

మైనారిటీ వర్గంగా షెడ్యూల్డ్ కులాలను ఉద్ధరించటమే అంబేద్కర్ జీవితాశయం. అయినప్పటికీ ఆయన ఇతర మైనారిటీ వర్గ ప్రజలను నిర్లక్ష్యం చేయటం లేదు. షెడ్యూల్డ్ కులాల పట్ల ఆయన కనపరిచిన ఆసక్తి వారి అభివృద్ధి పట్ల ఆయన దృక్పధం మైనారిటీ ప్రజల వర్గాల పై కూడ తీవ్రమైన ప్రభావాన్ని కనబరచాయి. 1945 మే నెలలో బొంబాయిలో చేసిన ఒక ప్రసంగము ద్వారా అంబేద్కర్ మైనారిటీ వర్గ ప్రజల సమస్యల పట్ల, సంక్షేమం పట్ల తన విధానం ఏమిటో స్పష్టం చేశాడు. ఈ ఉపన్యాసంలో అంబేద్కర్ శాసన సభల్లో మైనారిటీ వర్గ ప్రజలకు ప్రాతినిధ్యం కల్పిచటం అనే అంశం పై సుదీర్ఘంగా చర్చించి సంబంధించిన ఐదు సూత్రాలను ప్రతిపాదించారు.

1. మైనారిటీ పాలన సైద్ధాంతపరంగా అసాధ్యం, ఆచరణ పరంగా న్యాయ విరుద్ధం.
2. శాసన సభల్లో మైనారిటీ వర్గాలకు కల్పించే సాపేక్షక ప్రాతినిధ్యం, ఆ వర్గం తన పాలనను స్థాపించేటంత విస్తృతంగా వుండరాదు.
3. శాసన సభల్లో స్థానాలను కేటాయించటంలో మైనారిటీ వర్గం, మెజారిటీ వర్గాల ప్రజలకు హాని కలిగించే విధంగా స్థానాల పంపిణీ జరగాలి.
4. ఈ స్థానాల కేటాయింపులో మొత్తం మైనారిటీ వర్గాలు కలిసి సంయుక్తంగా మెజారిటీ వర్గం పై ఆధారపడకుండా స్వంతగా తమ ప్రభుత్వం ఏర్పరుచుటకు దోహదం చేసే విధంగా వుండాలి.
5. ఈ స్థానాల కేటాయింపులో మైనారిటీ వర్గాలకు స్థానాలు వారి సామాజిక, ఆర్థిక, విద్యా పరిస్థితులకు అనుగుణంగా వుండాలి.

ఈ విధంగా అంబేద్కర్ శాసన సభలో వివిధ వర్గాలకు సమతుల్యమయిన ప్రాతినిధ్యం కల్పించే ఆశయంతో తాను పై 5 సూత్రాలను ప్రతిపాదించాడు.

అంబేద్కర్ కార్యనిర్వాహక విభాగంలో హిందువులతో పాటు, ముస్లింలు, షెడ్యూల్డ్ కులాలకు కూడ ప్రాతినిధ్యం ఉండాలని వాదించాడు. ఈ ప్రాతినిధ్యం పరిమాణం శాసన సభలలో ఈ వర్గాల పరిమాణంతో సమానంగా వుండాలని అంబేద్కర్ సూచించాడు. అంబేద్కర్ కేంద్ర - రాష్ట్ర క్యాబినెట్‌లలో సిక్కులు, తదితర మైనారిటీ వర్గాలకు 1 లేదా 2 స్థానాలను ప్రత్యేకంగా కేటాయించాలని

కూడ వాదించాడు. దీంతోపాటు ఆంగ్లో - ఇండియన్‌లు, భారతదేశ క్రైస్తవులకు పార్లమెంటరీ కార్యదర్శుల స్థానాలలో కొన్నింటిని కేటాయించాలని కూడా అంబేద్కర్ వాదించాడు. అంబేద్కర్ చేసిన మరో విప్లవాత్మక సూచన ఏమిటంటే క్యాబినెట్‌లోని మైనారిటీ వర్గాలకు చెందిన మంత్రులను పార్లమెంటులోని ఆయా వర్గాలకు చెందిన ప్రతినిధులు ఎన్నుకోవాలి.

ప్రభుత్వ ఉద్యోగాలలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజలకు ప్రాతినిధ్యం వుండాలని వాదించాడు. ఈ ఉద్యోగాలలో ఏ వర్గానికి చెందిన ప్రజలకు ఆధిక్యతను కట్టబెట్టరాదని ఆయన ఉద్ఘాటించాడు. చట్టబద్ధత కల్పించాలని కూడ ఆయన పేర్కొన్నాడు. ఈ సందర్భంలో అంబేద్కర్ భారతదేశంలో రాజకీయపరమైన మెజారిటీకి భిన్నమైన, మతపరమైన మెజారిటీ (Communal Majority) ఉద్భవించినదనీ అది శాశ్వతమైనదనీ, స్థిరమైనదని పేర్కొన్నాడు. అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించిన ఒక విజ్ఞాపన పత్రంలో మైనారిటీ వారి హక్కుల పట్ల ప్రత్యేకమైన ఆసక్తిని ప్రదర్శించాడు.

అంబేద్కర్ భారతదేశంలో పార్లమెంటరీ తరహా కార్య నిర్వాహక వర్గ విధానం ప్రవేశ పెట్టబడటం వల్ల దేశంలోని మతపరమైన మెజారిటీకి శాశ్వతంగా కార్య నిర్వాహక అధికారం సంక్రమించే పరిస్థితి ఉత్పన్నం అవుతుందని వాదించాడు. దీని ఫలితంగా మైనారిటీ ప్రజల జీవితాలకు, స్వేచ్ఛకు, సుఖ సంతోషాలకు కీడు కలుగుతుందని కూడ ఆయన భావించాడు. దీనికి కారణం చూపిస్తూ అంబేద్కర్ పార్లమెంటులో మెజారిటీ సాధించి ప్రభుత్వాన్ని ఏర్పరచిన రాజకీయపార్టీ మంత్రి వర్గంలో తన పార్టీకి చెందని వ్యక్తులకు స్థానం కల్పించకపోవడం జరుగుతుంది. అంతేకాక ఈ రాజకీయ పార్టీ పార్లమెంటులో తన మెజారిటీని నిలుపుకోగలిగినంత కాలం మాత్రమే పదవిలో కొనసాగుతుంది. ఈ పద్ధతి మెజారిటీ, రాజకీయ మెజారిటీ అనే ఊహన పై ఆధారపడి వుంది. కానీ వాస్తవంలో భారతదేశంలో రాజకీయ మెజారిటీ అనీ ఏదీలేదు.

ఈ కారణం చేత అంబేద్కర్ భారతదేశానికి అమెరికా కార్యనిర్వాహక నమూనాను ప్రతిపాదించాడు. ఆయన భారతదేశం తన పరిస్థితులకు, మైనారిటీ వర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా అమెరికా కార్య నిర్వాహక వర్గ నమూనాను మార్పు చేసి స్వీకరించాలని వాంచించాడు. ఈ విధంగా అంబేద్కర్ పార్లమెంటరీ తరహా కార్యనిర్వాహక వర్గ విధానాన్ని తిరస్కరించాడు. మైనారిటీ వర్గ ప్రజల ప్రయోజనాలను, మెజారిటీ వర్గ ప్రజలతో ఏర్పడిన ప్రభుత్వం కాలరాయకుండా ఉండేందుకే అంబేద్కర్ భారతదేశం, అమెరికా తరహా అధ్యక్షపాలనను ప్రతిపాదించినట్లు గుర్తించవచ్చు. దేశంలోని మైనారిటీలను సామాజికపరమైన, అధికారపరమైన నియంతృత్వం నుంచి పరిరక్షించేందుకు అంబేద్కర్ ఒక అధికారిని నియమించాలని సూచించాడు.

ఈ అధికారికి ఆడిటర్ - జనరల్ హోదాను కల్పించాలని కూడ ఆయన సూచించాడు. దీంతో పాటు కేంద్ర - రాష్ట్ర ప్రభుత్వాలు మైనారిటీ వర్గ ప్రయోజనం కోసం తగిన నిధులను కేటాయించాలని ఆయన ప్రతిపాదించాడు.

1953లో అంబేద్కర్ మైనారిటీ వర్గ ప్రజల సమస్యల పరిష్కారానికి ఒక నూతన దృక్పథాన్ని ప్రతిపాదించాడు. అంతేకాకుండా అంబేద్కర్ వివిధ రాష్ట్రాలలో నివసించే అల్ప సంఖ్యాక భాషా వర్గాల ప్రయోజన పరిరక్షణకు ప్రత్యేక విధానాన్ని అవలంభించాలని సూచించాడు. ఈ సందర్భంలో ఆయన 1955లో నియమించిన రాష్ట్రాల పునర్విభజన సంఘం తన నివేదికలో పొందుపరచిన ప్రతిపాదనలను తీవ్రంగా విమర్శించాడు. ప్రధానంగా ముఖ్యంగా ఆయన భాషా సూత్రాల ప్రాతిపదికగా రాష్ట్రాలను ఏర్పరచటం వ్యతిరేకించాడు.

ఈ విధంగా అంబేద్కర్ మతపరమైన మెజారిటీ నిరంకుశత్వం నుంచి మైనారిటీ వర్గాల ప్రయోజనాలను పరిరక్షించే అనేక ప్రతిపాదనలను చేశాడు. ఆయన శాసన సభ, కార్యనిర్వాహక వర్గం ప్రభుత్వ ఉద్యోగాలలో మైనారిటీ వర్గాలకు తగిన ప్రాతినిధ్యం కల్పించాలని ప్రతిపాదించటంతో పాటు పెద్ద రాష్ట్రాల ఆధిక్యత నుంచి చిన్న రాష్ట్రాలను పరిరక్షించటానికి తగిన సూచనలను చేశాడు. ఈ దిశలో ఆయన చేసిన ప్రతిపాదనలలో భారతదేశం అమెరికా తరహా కార్యనిర్వాహక వర్గ విధానమును అనుసరించాలని చేసిన సూచన అత్యంత ప్రధానమైనది. ఈ విధానాన్ని అవలంభించటం వల్ల మైనారిటీ వర్గ ప్రజలు సురక్షితంగా జీవించగలరని, కార్యనిర్వాహక వర్గంలో వారికి తగిన ప్రాతినిధ్యం లభిస్తుందని ఆయన పేర్కొన్నాడు. ఈ విధంగా అంబేద్కర్ అమెరికా తరహా

కార్యనిర్వాహక వర్గ విధానం దేశంలోని మైనారిటీ వర్గ ప్రజల అవసరాలకు అనుగుణంగా వుందని ఆయన వాదించాడు.

## 12.5 అంబేద్కర్ రాజకీయ భావాలు - విశ్లేషణ :-

అంబేద్కర్ రాజకీయ సైద్ధాంతిక భావజాలం ప్రధానంగా సామాజిక, ఆర్థిక భావజాలం. ఆయన భావజాలానికి సార్వజనీన, సర్వకాలిక గుర్తింపు వుంది. ఆయన రాజకీయ తాత్వికత కాల్పనికమైంది, ఆదర్శపూరితమయినది కాదు. ఆయన అభిప్రాయం ప్రకారం రాజకీయ, సామాజిక తాత్వికత ప్రధానంగా వ్యక్తులకు సమస్యలకు అవసరాలకు సంబంధించి ఉండాలి, దీనికి అనుగుణంగానే అంబేద్కర్ రాజకీయ తాత్వికత కీలక మానవ సమస్యలకు, అంశాల వ్యక్తీకరణ. ఆయన తాత్వికతలో సిద్ధాంతానికి ఆచరణను అనుసందానించాడు. ఆయన భావజాలం సమస్యలను పరిష్కరించే, సంఘర్షణలను నివారించే దృక్పదాన్ని కలిగి ఉంది. అందుచేత సహజంగానే ఆయన తన రాజకీయ భావజాలంలో ఒక భాగంగా వ్యక్తి, సమాజం పట్ల ఒక ప్రత్యేక దృక్పదాన్ని ఏర్పరచుకొన్నాడు. దీనికి అనుగుణంగా ఆయన రాజకీయ తాత్వికతలో వ్యక్తి కేంద్ర బిందువు. అంబేద్కర్ అభిప్రాయం ప్రకారం వ్యక్తి, సమాజం మౌలికమయినవి అయినప్పటికి రాజ్యం (state) ఒక ఆవశ్యక వ్యవస్థ. అందుచేత ఆయన అరాచక వాది కాదు. అంతేకాక ఆయన హబ్స్, హెగెల్ ప్రతిపాదించిన నిరపేక్ష రాజ్యభావనను సమర్థించలేదు. అంతేకాక ఆయన రాజ్యం అతిమం అయ్యింది అనేవాదనను అంగీకరించలేదు. అంబేద్కర్ రాజ్యాన్ని వ్యక్తుల మంచిని సాధించే సాధనంగా మాత్రమే గుర్తించాడు. అయితే ఆయన సమాజంలో క్రమబద్ధతను, శాంతి భద్రతలను సాధించే సంస్థగా రాజ్యానికి తగిన విలువను ఆపాదించాడు. ఆయన సుస్థిరమయిన రాజ్యాన్ని వాంఛించాడు. రాజ్యం ప్రజల సంక్షేమానికే చట్టాల్ని రూపొందిస్తుంది. కాబట్టి వాటిని గౌరవించటం, శిరసావహించటం, విధేయతను ప్రదర్శించటం కనీస ధర్మం.

అంబేద్కర్ రాజకీయతత్వ విచారాన్ని పరిశీలిస్తే ఆయన ప్రజాస్వామ్యానికి, పార్లమెంటరీ వ్యవస్థకు, సోషలిజానికి, స్థానిక ప్రభుత్వ వ్యవస్థకు కీలక ప్రాధాన్యతను ఇచ్చినట్లు గుర్తించవచ్చు. ఆయనకు ఈ వ్యవస్థల పై సమగ్రమయిన దృక్పథమే కాక వాటి పట్ల సకారాత్మకమైన, నిర్మాణాత్మకమైన దృక్పదం వుంది. స్వభావ సిద్ధంగా అంబేద్కర్ ఉదార ప్రజాస్వామ్యవాది. ఆయన షెడ్యూల్డ్ కులాల పట్ల ప్రత్యేకమైన ఆసక్తిని కనపరచినప్పటికీ, ప్రజాస్వామ్యం, అత్యున్నత ప్రధాన ప్రజాస్వామ్య లక్షణమైన సమానత్వ సూత్రాన్ని విస్మరించలేదు. రక్తపాత రహితంగా ప్రజల సామాజిక, ఆర్థిక జీవితాల్లో విప్లవాత్మకమైన మార్పును ప్రవేశపెట్టి ప్రభుత్వ రూపం, విధానమే ప్రజాస్వామ్యమని అంబేద్కర్ ప్రజాస్వామ్యాన్ని నిర్వచించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం ప్రజాస్వామ్యం ఒక ప్రభుత్వ రూపమే కాదు. మౌలికంగా అది ప్రజల అనుబంధాన్ని, ఉమ్మడి అనుభవాన్ని పెంపొందింపచేసే సాధన. ప్రజాస్వామ్యం వ్యక్తుల పట్ల గౌరవాన్ని అభిమానాన్ని పెంపొందింపజేసే దృక్పదం.

అంబేద్కర్ అభిప్రాయం ప్రకారం లౌకిక దృక్పదం కలిగిన ప్రజాస్వామ్యమే సంపూర్ణమయిన వాస్తవమైన ప్రజాస్వామ్యం. ఆయన రాజకీయ రంగాలలోనేకాక సామాజిక, ఆర్థిక రంగాలలో కూడ ప్రజాస్వామ్యం నెలకొనాలని ఉద్ఘాటించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్యం రాజకీయ ప్రజాస్వామ్యానికి విడదీయరాని సంబంధం వుందని భావించాడు. అయితే ఈ సూత్రం రాజ్యాంగంలో ప్రతిబింబించలేదని ఆయన గుర్తించాడు.

అంబేద్కర్ అభిప్రాయం ప్రకారం రాజకీయ అధికారం, సామాజిక, ఆర్థిక ప్రగతికి మార్గం. ఈ భావం కారణంగానే అంబేద్కర్ అనగారిన వర్గాలకు ప్రత్యేక నియోజక వర్గాలుండాలని వాదించాడు. అంబేద్కర్ ప్రజాస్వామ్యంలో ఎటువంటి నిరకుశత్వానికి చోటు లేదని ఉద్ఘాటించాడు. ఈ విధంగా అంబేద్కర్ రాజకీయ తత్వ విచారంలో జాన్‌లాక్ తత్వ విచారం ప్రస్ఫుటంగా ప్రతిబింబిస్తుంది. జాన్‌లాక్ లాగా అంబేద్కర్ రాజకీయ, ఆర్థిక ఉదారవాదాన్ని సమర్థించాడు. అంబేద్కర్ రాజకీయ భావాలను విశ్లేషిస్తే ఆయన ప్రజాస్వామ్యబద్ధమయిన సామ్యవాదాన్ని సమర్థించినట్లు గుర్తించవచ్చు.

**విశ్లేషణ:-** భారతదేశ రాజకీయాలలో అంబేద్కర్‌కు విశిష్ట స్థానం లభించటానికి రెండు రకాల కారణాలను పేర్కొనవచ్చును. ఒకటి, అంబేద్కర్ భారత రాజ్యాంగ నిర్మాతగా స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వంతో సూచించిన సామాజిక ప్రజాస్వామ్య వ్యవస్థకు, ఆదర్శవంతమయిన సమాజాన్ని ప్రతిష్ఠించాలని ఆశించాడు. రెండు, అణచివేతకు గురవుతున్న వర్గ ప్రజల విముక్తికి జీవితాంతం ఆయన చేసిన పోరాటం. తన జీవితాంతం సాగించిన ఈ పోరాటంతో అంబేద్కర్ ఒక ప్రత్యామ్నాయ సామాజిక వ్యవస్థను స్థాపించాలని ఆశించాడు. అంబేద్కర్ సూచించిన ప్రత్యామ్నాయ సామాజిక వ్యవస్థ హిందూ తాత్వికతలకు వ్యతిరేకంగా, బౌద్ధ, మార్క్సిస్టు తాత్వికతలను ప్రతిబింబిస్తుంది. అంబేద్కర్ భవిష్యత్తులో మానవాళి బుద్ధుడు, మార్క్స్ ప్రతిపాదించిన సిద్ధాంతాలలో ఒక దానిని అనుసరిస్తుందని ప్రగాఢంగా విశ్వసించాడు. అయితే ఆయన అంతిమంగా మార్క్సిజమ్ కంటే బుద్ధుని సిద్ధాంతాల పై మొగ్గు కనబరచాడు.

అంబేద్కర్ భారతదేశంలోని అణగారిన వర్గాలను ఒకే ఏకీకృత వర్గంగా లేదా ఆర్థిక వర్గంగా పరిగణించలేదు. భారత సామాజిక వ్యవస్థ పై ఆయనకు గల అపారమైన పరిజ్ఞానం కారణంగా అంబేద్కర్ భారత సామాజిక వ్యవస్థ, ప్రధానంగా కుల వ్యవస్థను అనేక భిన్నత్వాలతో మారిన ఒక సామాజిక దృగ్గోచరంగా పరిగణించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం భారతదేశ సమాజం క్రమానుగత శ్రేణి పంథాలలో అనేక వర్గాలుగా విభజితమైంది. అందుచేత ఈ సమాజంలో ప్రజాస్వామ్య వ్యవస్థ మనుగడకు అవసరమైన సమానత్వం, సౌభ్రాతృత్వం భావాలు వృద్ధి చెందలేవు. కులవ్యవస్థ కేవలం ఒక పని విభజన మాత్రమే కాదు. ఈ వ్యవస్థ సామాజికాహార ప్రాతిపదిక మీద కార్మికులను శ్రేణీత్వం పంథాలో విభజనకు దారి తీసింది. ఈ విభజన యస్వభాసిద్ధ దృక్పదం లేదా సర్వోజనితంగా సంభావించినాడు.

## 12.6 అంబేద్కర్ లౌకికవాదం :-

అంబేద్కర్ బౌద్ధమతాభిమాని అయినప్పటికి ఆయనలో లౌకికవాద తత్వం అంతర్లీనంగా వుంది. ఆయన మతం సమాజానికి అవసరం అనే నిరంతరం వాదిస్తూ వచ్చాడు. అయినప్పటికి ఆయన మతం నియమాలను పఠించటాన్ని తిరస్కరించాడు. అంబేద్కర్ మతాన్ని సమాజానికి పునాదిగా పరిగణించాడు. దీనిని బట్టి అంబేద్కర్ నియమాల పై ఆధారపడిన మతాన్ని సమర్థించినట్లు గుర్తించవచ్చును. సాంప్రదాయబద్ధమైన మత నియమాలను, నిబంధనలను నిర్మూలించి, వాటి స్థానంలో మత సూత్రాలను ఏర్పరచటం ద్వారా భారతదేశంలో వాస్తవమైన మతాన్ని వాదించడం ఆయన లౌకిక తత్వాన్ని వెల్లడిస్తుంది. అంతేకాక అంబేద్కర్ మతం శాస్త్రీయతకు అనుగుణంగా ఉండాలని వాదించాడు. హేతుబద్ధత లేని మతం హాస్యాస్పదంగా రూపొంది, మానవుల జీవితాన్ని శాసించే సూత్రంగా తన శక్తిని కోల్పోతుంది. చివరకు పూర్తిగా విచ్ఛిన్నం అవుతుందని కూడ వాదించాడు. ఈ అభిప్రాయాలు అంబేద్కర్ లౌకిక వాదంపై అంబేద్కర్‌కు గల ప్రగాఢ విశ్వాసాన్ని అధికారమతంగా పరిగణించరాదనే సూత్రం భారత రాజ్యాంగం సూత్రాలలో కీలకమైందిగా రూపొందింది.

## 12.7 అంబేద్కర్ ప్రజాస్వామ్య సామ్యవాద పిద్ధాంతం :-

అంబేద్కర్ పరిపూర్ణమైన సామాజిక సంస్కరణ కర్త. ఆయన భారత సమాజంలో గల సాంప్రదాయ విలువలకు తీవ్రంగా ఖండించి, వాటి స్థానంలో నూతన విలువలను ప్రతిపాదించాడు. ఆయన సూచించిన నూతన, ఆదర్శ సమాజం ఆధునిక భారతదేశ పరిస్థితులకు అనుగుణంగా వుంది. ఆయన అభిప్రాయం ప్రకారం వ్యక్తి తన సంక్షేమానికి తానే బాధ్యుడు. అయినప్పటికీ సమాజ శ్రేయస్సును కాంక్షించే బాధ్యత కూడ వ్యక్తి పై వుంది. సమాజం వ్యక్తులందరికీ సమానంగా సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని అందించాలని వాదించాడు. ఈ లక్ష్యాన్ని ప్రజాస్వామ్య సామ్యవాద పంథాలో సాధించాలని ఆయన ఉద్ఘాటించాడు.

ఆయన ఆర్థికాభివృద్ధి సాధనకు ఒక విస్తృత్న రాజ్య సామ్యవాద నమూనాను సూచించాడు. ఈ నమూనాకు రెండు లక్షణాలున్నాయి.

(i) ఈ నమూనా ఆర్థిక వ్యవస్థలోని కీలక రంగాలలో జోక్యాన్ని, నియంత్రణను ప్రతిపాదిస్తుంది.

(ii) ఈ నమూనా కేవలం శాసనం ద్వారా మాత్రమే సామ్యవాదాన్ని సాధించటాన్ని తిరస్కరిస్తుంది.

**అంబేద్కర్ ప్రతిపాదించిన రాజ్య సామ్యవాద లక్షణాలు:-** అంబేద్కర్ ప్రతిపాదించిన రాజ్య సామ్యవాద లక్షణాలు ఈ క్రిందివి.

1. కీలక పరిశ్రమలు జాతీయకరణ
2. మౌళిక పరిశ్రమలు జాతీయకరణ
3. వ్యవసాయ పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థగా ఏర్పాటు చేయడం
4. పరిశ్రమలు, వ్యవసాయభూములు, ఇన్సూరెన్స్‌ల పై ప్రైవేటు వ్యక్తులకు గల హక్కులను ప్రభుత్వం స్వాధీనపరచుకొని డిబెంచర్స్ రూపంలో వారికి తగిన పరిహారాన్ని చెల్లించడం
5. వ్యవసాయ పరిశ్రమ ఈ క్రింది విధంగా పునర్ వ్యవస్థీకరించడం
   (i) వ్యవసాయ పొలాలను ఏర్పాటు చేసి వాటిని ఉమ్మడి పొలాలుగా మార్చటం
   (ii) ప్రభుత్వం సేకరించిన భూములుగా విభజించి
   (iii) వ్యవసాయ పొలాలను ప్రభుత్వం నిర్ధేశించిన నియమాలు, నిబంధనలకు అనుగుణంగా సాగు చేసుకునేందుకు వీలు కల్పించటం
   (iv) ఉమ్మడి వ్యవసాయ పద్ధతిని ప్రవేశ పెట్టడం

ఈ విధంగా అంబేద్కర్ వ్యవసాయ రంగాన్ని ప్రభుత్వ పరం చేయటంతో పాటు ఉమ్మడి వ్యవసాయ పద్ధతి సూచించాడు. అంతేకాక పారిశ్రామిక రంగంలో సవరించిన రాజ్య సామ్యవాద పద్ధతిని ప్రవేశ పెట్టాలని కూడ సూచించాడు. అంబేద్కర్ సూచించిన సామ్యవాద ప్రణాళికను అనుసరించి పరిశ్రమలలో వ్యవసాయానికి అవసరమైన పెట్టుబడులను ప్రభుత్వమే సమకూర్చాల్సి వుంటుంది. అంబేద్కర్ ప్రతిపాదించిన భీమా జాతీయకరణ వల్ల రెండు ప్రయోజనాలు ఉన్నాయి. ఒకటి, ప్రజలకు చెల్లించవలసిన భీమా మొత్తానికి ప్రభుత్వ గ్యారంటీ ఉంటుంది. రెండు, ఆర్థిక అభివృద్ధి ప్రణాళికల అమలుకు అవసరమైన వనరులు ప్రభుత్వానికి సమకూరతాయి. అంబేద్కర్ అభిప్రాయపడినట్లు వేగవంతమైన పారిశ్రామిక అభివృద్ధికి అత్యంత అవశ్యం. ప్రైవేటు రంగం వల్ల పారిశ్రామికాభివృద్ధి మందకొడిగా మాత్రమే సంభవిస్తుంది. అంతేకాక ప్రవేటు రంగం వల్ల సమాజంలో ఆర్థిక అసమానతలు పెరిగే అవకాశం వుంది.

అయితే అంబేద్కర్ తాను ప్రతిపాదించిన రాజ్య సామ్యవాదం ప్రణాళికా అమలు శాసనసభల ఇష్టాయిష్టాలకు వదిలి వేయరాదని ఉద్ఘాటించాడు. ఈ సామ్యవాదాన్ని రాజ్యాంగం ద్వారా ఏర్పాటు చేయాల్సి వుంటుంది. దాని వల్ల సామ్యవాద ప్రణాళికలను సవరించటానికి , లేదా పూర్తిగా రద్దు చేయటానికి మెజారిటీ ఆధీనంలో ఉండే పార్లమెంటుకు ఎలాంటి అధికారం ఉండరాదు. దీనివల్ల పార్లమెంటరీప్రజాస్వామ్య వ్యవస్థ పరిధిలోనే రాజ్య సామ్యవాద స్థాపనకు అవకాశం ఏర్పడుతుందని అంబేద్కర్ వాదించాడు. ఈ విధంగా అంబేద్కర్ సామ్యవాద స్థాపన, పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ కొనసాగింపు, నియంతృత్వ నివారణ అనే మూడు లక్ష్యాల సాధనకు అనుగుణమైన సమగ్రమైన ప్రణాళికను ప్రతిపాదించాడు. ఈ మొత్తం మీద అంబేద్కర్ ఆర్థికాభివృద్ధి ప్రక్రియలో రాజ్యానికి అతి కీలకమైన పాత్రను కల్పించాడు. అయితే రాజ్యం తన పాత్రను ప్రజాస్వామ్య సూత్రాలకు, సామాజిక సూత్రాలకు అనుగుణంగా నిర్వర్తించాలని అంబేద్కర్ ఉద్ఘాటించాడు.

అంబేద్కర్ సామ్యవాదం, కమ్యూనిజం మధ్య విభజన చేశాడు. ఆయన సామ్యవాదం మౌళిక భావాల అంశాల పై కొన్ని సందేహాలు వ్యక్తపరచాడు. ఆయన బుద్ధుడు, మార్క్స్‌ల సామ్యవాదాల భావాలను తులనాత్మకంగా పరిశీలించి, ఈ ఇద్దరు ప్రతిపాదించిన సామ్యవాదం ప్రవేటు ఆస్థికి వ్యతిరేకమని పేర్కొన్నాడు. అంబేద్కర్, మార్క్స్ ప్రతిపాదించిన సామ్యవాద భావాల

పట్ల ఎక్కువ ఆసక్తిని కనబరచాడు. అందుచేత భారత రాజ్యాంగంలో పొందుపరచిన సామ్యవాద భావాలు, సమానత్వం అంతర్లీనంగా వున్నాయి.

బుద్ధుడు ప్రతిపాదించిన సామ్యవాద ప్రణాళికలో తాత్వికాంశాలు ఎక్కువగా చోటు చేసుకున్నాయి. అంబేద్కర్ ప్రజాస్వామ్య సామ్యవాద భావాలను అవగాహన చేసుకునేందుకు ఆయన తాత్విక రచనలను అధ్యయనం చేయటం అవసరం. అంబేద్కర్ తాత్విక రచనలన్నీ ఆయన గొప్ప ప్రజాస్వామ్య వాది అనే వాస్తవాన్ని ఋజువు చేస్తాయి. ఈ కోణం నుంచి చూస్తే భారతదేశ కమ్యూనిస్టులు, సోషలిస్టులు అంబేద్కర్ భావాలను అవగాహన చేసుకోవటంలో విఫలమయ్యారని గుర్తించవచ్చు. భారతదేశంలో నెలకొన్న పరిస్థితులకు అనుగుణంగానే అంబేద్కర్, మార్క్స్, బుద్ధుడు ప్రతిపాదించిన భావాలను తన సామ్యవాద ప్రణాళికలో సమైక్య పరిచాడు.

కొందరు రచయితల అభిప్రాయం ప్రకారం అంబేద్కర్ సామ్యవాదం అహింసా మార్గం ద్వారా ప్రవేటు ఆస్తిని రద్దుపరచటం అనే అంశం చుట్టూ కేంద్రీకృతం అయ్యింది. అంబేద్కర్ భూమి కొందరిలో కేంద్రీకృతం కావటం ఆర్థికాభివృద్ధికి ఏ విధంగా తోడ్పడదని వాదించాడు. పారిశ్రామిక రంగంలో యాంత్రీకరణను అంబేద్కర్ వ్యతిరేకించలేదు. ఈ అంశంలో అంబేద్కర్ గాంధీ వాదంతో పూర్తిగా విభిన్నిస్తాడు. అంబేద్కర్ వాదన ప్రకారం యాంత్రీకరణ ఒక చెడు కాదు. అంతేకాక యాంత్రీకరణ వల్ల కలిగే దుష్ఫలితాలను నివారించే విధంగా భారతదేశ సామాజిక వ్యవస్థను మార్పు చేయాలని సూచించాడు. ఏమైనప్పటికీ అంబేద్కర్ దేశంలో ఆర్థికాభివృద్ధి వేగంగా సాధించేందుకు పారిశ్రామీకరణ ఆవశ్యకమని ఉద్ఘాటించాడు.

అంబేద్కర్ కారల్ మార్క్స్ ప్రతిపాదించిన శాస్త్రీయ సామ్యవాద సిద్ధాంతములో కొన్ని మౌళిక లోపాలు వున్నాయని గుర్తించటం వల్లే ఆయన భారతదేశ పరిస్థితులకు అనుగుణమైన ప్రజాస్వామ్య సామ్యవాదాన్ని ప్రతిపాదించాడు. కారల్ మార్క్స్‌కు భిన్నంగా అంబేద్కర్ ప్రతిపాదించిన సామ్యవాద సిద్ధాంతాలలో సమానత్వానికి కీలక స్థానం ఉంది. అంబేద్కర్ సమానత్వానికి, వ్యక్తి స్వేచ్ఛకు కూడా ప్రాధాన్యతను కల్పించాడు. వ్యక్తి స్వేచ్ఛను పరిరక్షించడం రాజ్యం బాధ్యతలలో కీలకమైందని అంబేద్కర్ నొక్కి చెప్పాడు. అయితే వ్యక్తి స్వేచ్ఛకు హాని కలిగించడం రాజ్య సామ్యవాదాన్ని స్థాపించటం ఎలాగో అస్పష్టంగా వివరించలేకపోయాడు. అయితే ఆయన ఈ సమస్యకు రాజ్యాంగం ద్వారా ఒక పరిష్కార మార్గాన్ని సూచించాడు. అయితే భారత రాజ్యాంగం అమలులోకి వచ్చాక తాను సూచించిన పరిష్కార మార్గం అర్థరహితమని ఆయన గుర్తించాడు.

## 12.8 సారాంశము :-

ఈ పాఠంలో అంబేద్కర్ రాజకీయ, సామాజిక, తాత్వికతల పై చేసిన చర్చ ప్రాతిపదికగా అంబేద్కర్ ప్రతిపాదించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ భావాలకు ఆధునిక భారత రాజనీతి తత్వ విచారంలో అత్యున్నత స్థానం వుంది అనే వాస్తవాన్ని గుర్తించవచ్చును. ఆయన భారత సామాజిక, ఆర్థిక, రాజకీయ వ్యవస్థల పై తనకు గల విస్తృతమైన అవగాహన, పరిజ్ఞానాల ఆధారంగా ఈ నాటి పై విశిష్టమైన భావనలను కూడా ప్రతిపాదించినట్లు కూడ గుర్తించవచ్చును. అంబేద్కర్‌కు గల విశిష్టత ఏమిటంటే ఆయన భారతదేశ రాజకీయ, ఆర్థిక వ్యవస్థలకు దేశ సామాజిక వ్యవస్థ కోణం నుంచి విశ్లేషించాడు. ఆయనకు గల ఈ దృక్పధం అనేక విమర్శలకు గురైనప్పటికీ, భారతదేశ చారిత్రక నేపధ్యంలో పరిశీలిస్తే అంబేద్కర్ దృక్పధం సమంజసమైనది, సహేతుకమైంది అని గుర్తించవచ్చును. ఎందుచేతనంటే సాంప్రదాయబద్ధమైన భారతదేశంలోని మతం, సామాజిక వ్యవస్థ సమాజంలోని అన్ని అంశాలను ప్రభావితం చేస్తున్నది. అంబేద్కర్ సామాజిక తాత్వికతలో కొంత స్థాయిలో అతివాదం గోచరించినప్పటికీ ఆయన రాజకీయ తాత్వికతలో ఉదారవాదం సంపూర్ణంగా ప్రతిబింబిస్తుంది. ప్రజాస్వామ్యం పై, పార్లమెంటరీ వ్యవస్థ పై, ప్రజాస్వామ్య కీలక సూత్రాలైన సమానత్వం, సౌభ్రాతృత్వం, స్వేచ్ఛల పై ఆయన కనబర్చిన ప్రాధాన్యత, నిరంకుశత్వం, ఉద్యోగిస్వామ్యం, అసమానతల పట్ల ఆయన ప్రదర్శించిన తీవ్రస్థాయి వ్యతిరేకత, ఆయన ఉదారవాద తత్వానికి గొప్ప నిదర్శనం.

అంబేద్కర్ భారత సమాజంలో నెలకొన్న అప్రజాస్వామిక లక్షణాలన్నింటిలో గల వ్యవస్థ పై తన పూర్తి దృష్టిని కేంద్రీకరించాడు. అంబేద్కర్ కులవ్యవస్థను విమర్శించినంత స్థాయిలో మరే ఇతర అంశాన్ని విమర్శించలేదు. అంబేద్కర్ కులవ్యవస్థ అమానవీయ కోణాన్ని తన విస్తృత రచనల ద్వారా బహిర్గతం చేయడమే కాక కులవ్యవస్థ నిర్మూలనకు అనేక మార్గాలలో తన జీవితాంతం అవిశ్రాంత పోరాటాన్ని సాగించాడు.

ఈ విధంగా అంబేద్కర్ తాత్వికత, ఆలోచనల్లో పాశ్చాత్య రాజనీతి తత్వ విచారంలోని ప్రజాస్వామ్యం, లౌకిక వాదం, ఉదారవాద భారతీయ రాజనీతి తత్వ విచారంలోని అహింస, సర్వమానత్వం, సౌభ్రాతృత్వం, మానవీయ విలువలు సమ్మిళితమై అంతర్లీనంగా ప్రవహిస్తున్నాయి. అంతేకాక అణగారిన జాతుల ప్రజల విముక్తి, సముద్ధరణ పట్ల ఆయన ప్రదర్శించిన ఆసక్తి కూడ ఆయనలో దాగివున్న ఉదారవాదం, మానవతావాదాలకు ప్రతీక.

## 12.9 మాదిరి ప్రశ్నలు :-

1. అంబేద్కర్‌ను ఒక ఉదారవాద రాజనీతి మేదావిగా నీవు ఎలా అంచనా వేయుదువు?
2. భారత రాజ్యాంగ రూపకల్పనకు డా॥ బి.ఆర్. అంబేద్కర్ సేవలను మదింపు చేయుము.
3. అంబేద్కర్ రాజకీయ భావనలను క్షుణ్ణంగా పరిశీలింపుము.
4. మైనారిటీ, అల్ప సంఖ్యాక వర్గ ప్రజల కోసం అంబేద్కర్ చేసిన సేవలను విశ్లేషణాత్మకంగా పరిశీలింపుము.

## 12.10 ఆధార గ్రంథాలు :-


1. Jatva, Dr. - "The Political philosophy of Dr. Ambedkar" (1965)
2. Ambedkar writings and speeches - Education Department, Government of Maharastra (1987)
3. Chandra mouli, V. - B.R. Ambedkar Man and His Vision, (1990)
4. Chalam, K.S. - 'The relavence of Ambedkarisim in India', (1993)



రచయిత

మొగలి రవిశేఖర్

పాఠం - 13

# యం.యన్. రాయ్

## 13.0 లక్ష్యం :-

మానవేంద్రనాద్ రాయ్ (M.N. Roy) ఆధునిక భారత రాజనీతి తత్వవేత్తలలోని ప్రముఖులలో ఒకరు. రాయ్ ప్రతిపాదించిన తీవ్ర/నవ్య మానవతా వాదము (Radical / New Humanism), ఆధునిక భారత రాజనీతి తత్వ విచారములో ఒక ముఖ్య అంశముగ మన గల్గుచున్నది. రాయ్ యొక్క రాజనీతి తత్వ విచారము గూర్చి ఆలోచనా సరళిని బట్టి అతని ఆచరణ, కార్యక్రమములు గూర్చి ఆఖరి దశలోనే నవ్య మానవతావాదమును గూర్చి తెలుసుకొనుట ఈ పాఠము యొక్క లక్ష్యం.

## విషయసూచిక :-


13.0 లక్ష్యం

13.1 పరిచయం

13.2 విప్లవవాది (మొదటి దశ)

13.3 మార్క్సియవాది (రెండవ దశ)

13.4 రాడికల్ హ్యూమనిస్టు (మూడవ దశ)

13.5 నవ్య మానవతావాదము

13.6 సారాంశము

13.7 మాదిరి ప్రశ్నలు

13.8 ఆధార గ్రంథాలు


## 13.1 పరిచయం :-

మానవేంద్రనాద్ రాయ్ ఫిబ్రవరి 6, 1886లో జన్మించారు. జనవరి 25, 1954న మరణించారు. ఆయన చిన్ననాటి పేరు నరేంద్రనాద్ భట్టాచార్య. ఆయన బాల్యంలో స్వామి వివేకానంద, బంకింమ్ చంద్ర, స్వామి రామతీర్థ, దయానంద సరస్వతి గార్ల ప్రభావానికి గురైనాడు. బెంగాల్‌లో స్వదేశీ ఉద్యమము తీవ్ర స్థాయిలో ఉంటున్న సమయంలో రాయ్ విప్లవ కార్యాల పై అభిరుచి చూపినాడు. బిపిన్ చంద్రపాల్, అరవింద్ ఘోష్ మరియు సురేంద్రనాద్ బెనర్జీల రాజకీయ భావాలు రాయ్‌ని ఎంతగానో ఆకట్టుకున్నాయి. అదే విధంగా రాయ్, V.D. సవార్కర్ త్యాగనిరతి సాహస పోరాటం ద్వారా విశేషంగా ప్రభావితమైనాడు. యుగాంతర్ గ్రూప్ నాయకులు కార్యకర్తలతో కలసి పనిచేసిన అనుభవముంది. 1910లో హౌరా (Howrow) కుట్ర కేసుకు సంబంధించి, 1915లో కలకత్తా కుట్ర కేసుకు సంబంధించి రాయ్ నిర్బంధించబడినాడు. 1915లో రాయ్ భారతదేశం నుంచి తప్పించుకొని 'డచ్' అచ్చటి నుండి 'జావా' ఫిలిప్పైన్స్ చివరకు అమెరికా చేరి కొంతకాలం లాలా లజపతి రాయ్‌తో కలసి పనిచేశాడు. అమెరికా నుండి 1919లో మెక్సికో వెళ్ళినాడు. ; మెక్సికోలో ఉన్నప్పుడు అంతర్జాతీయ కమ్యూనిస్టయిన మైఖేల్ బరోడిన్ (Michael Barodin)తో పరిచయమై కమ్యూనిస్టుగా మారిపోయాడు.

రాయ్ బహు గ్రంథకర్త. ఆయన రచనలలో ప్రముఖమైనవి - '1. India in Transition, 2. Fascism, 3. Materialism, 4. Revolution and Counter Revolution, 5. Indian National Movement, 6. Peoples plan for economic development of India, 7. The Russian Revolution, 8. Reason, Romanticism and Revolution, 9. My experience of china, 10. Draft constitution of free india' మున్నగున్నవి.

యమ్.యన్. రాయ్ తత్వ విచారంలోను, ఆచరణ కార్యక్రమాలలోను వున్న మూడు దశలు -

1. **విప్లవవాది:-** ఆయన బాల్యం నుంచి 1919 వరకు కొనసాగుతుంది.
2. **మార్క్సీయవాది / కమ్యూనిస్టు:-** ఇది 1919 నుంచి రమారమి 1946 వరకు కొనసాగింది.
3. **రాడికల్ హ్యూమనిస్టు:-** 1947 నుంచి చనిపోయేంత వరకు నవ్య మానవతా వాదిగా రాయ్ కన్పిస్తాడు.

## 13.2 విప్లవవాది (మొదటి దశ) :-

రాయ్ చిన్నతనం నుంచి జాతీయ విప్లవవాదిగా పెరిగాడు. అనేక రహస్య సంస్థలతో పరిచయము, సాన్నిహిత్యము పెంచుకొని, కొన్ని రహస్య కార్యకలాపాలలో కూడ పాల్గొనుట జరిగింది. స్వామి రామతీర్థ, వివేకానంద, బంకింమ్ చంద్ర చటర్జీ, రాయ్‌లో జాతీయ భావాలు రేకెత్తించిన వారిలో ప్రముఖులు. 1919 వరకు రాయ్ విప్లవవాదిగా వివిధ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. ఒక విధంగా ఇది తన రాజకీయ జీవితానికి శిక్షణ కాలముగ పనిచేసింది. ఈ దశలో భారతదేశ దాస్య శృంఖలాలను విప్లవం ద్వారా, అదియును రహస్య సాయుద పోరాటము ద్వారానే ఛేదించవచ్చుననే దృఢ సంకల్పముతో ఉన్నాడు. సాయుధ పోరాటమునకు కావలసిన ఆయుధాలు మరియు నిధులను విదేశాల నుంచి ముఖ్యంగా జర్మనీ నుంచి సరఫరా చేయుటకు సంధాన కర్తగా రాయ్ చాలా శ్రమపడ్డాడు.

1915 బెంగాలు విభజనకు వ్యతిరేకంగా బెంగాలు మరియు ఇతర రాష్ట్రాలలో అలజడి, అశాంతి దౌర్జన్యం మరియు హింసాకాండ చెలరేగాయి. జాతీయ విప్లవవాదులకు, విప్లవకారులకు ఇది ఒక అనుకూల పరిస్థితి అయింది. జితిన్ ముఖర్జీ అనే విప్లవ నాయకుని ఆధ్వర్యంలో కొంతమంది విప్లవకారులు బెంగాలులో ఆందోళనలు చేపట్టారు. అందులో రాయ్ ప్రముఖ పాత్ర వహించారు. ఆ పరిస్థితులలోనే స్వదేశీ ఉద్యమము (విదేశీ వస్తువులను బహిష్కరించి స్వదేశీ వస్తువుల వాడుక) మరియు జాతీయ విద్యావిధానము అన్న అంశాలు నినాదాలుగా రూపు దిద్దుకున్నాయి.

ఇండియాలోని బ్రిటీష్ వ్యతిరేకతను, జర్మనీ ప్రోత్సహిస్తూ, బ్రిటీష్ ప్రభుత్వానికి అండగా వున్న భారతీయ సైన్యము ఐరోపా నుంచి వైదొలగేలా ప్రయత్నాలు చేసింది. అదే అదనుగా తలంచి రాయ్ జర్మనీ నుంచి కొంత ఆయుధ సామాగ్రిని నిధులను సంపాదించ ప్రయత్నించాడు. కాని అనుకున్న విధముగ కొంత ధనమును సంపాదించకల్గాడే కాని, ఆయుధ సామాగ్రిని జర్మనీ వారు అందించలేదు. మరొక మారు (1915 లో) రాయ్ జర్మనీ నుంచి ఆయుధ సామాగ్రిని ఆశించి భంగపడినాడు. అంతే కాకుండా తనకు సహాయపడతానన్న జర్మనీ రాయబారి అసహాయతను వ్యక్తపరచుటతో రాయ్ ఇండియాకి రాలేక అమెరికా వెళ్ళిపోయారు.

'మార్టిన్' అన్న క్రైస్తవ బోధకుని వేషంలో శాన్ ఫ్రాన్సిస్‌కో చేరినాడు. అచ్చట భద్రత లేని కారణంగా (Stanford) స్టాన్‌ఫడ్ విశ్వవిద్యాలయానికి చేరాడు. అచ్చటనే భారత జాతీయ ఉద్యమానికి స్పందిస్తున్న కొందరు భారతీయులను కలిశాడు. వారిలో ఒకడైన 'ధనగోపాల్ ముఖర్జీ' సలహా పై తన పేరును మానవేంద్రనాద్ రాయ్‌గా మార్చుకొని తన ఉనికిని బయటపడకుండా జాగ్రత్త పడినాడు.

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలోని మొదటి భాగంలో అమెరికా తటస్థ దేశంగా ప్రకటించుకుంది. అందువల్ల భారత జాతీయ ఉద్యమ ఆందోళనాకారులకు, వారి కార్యకలాపాలకు, అమెరికా అనువైన ప్రదేశంగా లేదు. అలాగని అమెరికాలో భారత జాతీయోద్యమానికి ప్రోత్సాహం లేదని కాదు. కాకపోతే ఈ ఆందోళనల వెనుక జర్మనీ మద్దతును మాత్రము అమెరికా చాల జాగరూకతతో అంచనా వేయసాగింది. అంతే కాకుండా మొదటి ప్రపంచ యుద్ధ చివరి కాలంలో అమెరికా కూడా జర్మనీ వ్యతిరేక మిత్ర పక్షాలతో చేరుటతో, జాతీయ ఆందోళనకారులలో కొందరిని జర్మనీ ఏజంట్లుగా భావించి నిర్బంధించుట జరిగింది. వారిలో రాయ్ ఒకరు. అయితే శిక్షపడేలోగానే రాయ్, బ్రిటీష్ ఆధిపత్యము తక్కువగా ఉన్న మెక్సికోకు పారిపోయాడు.

రాయ్ న్యూయార్క్‌లో వుండగనే అమెరికన్ సోషలిస్టులతో పరిచయం ఏర్పడి, తనలో సామ్యవాద తత్వ బీజాలు నాటుకున్నాయి. మెక్సికోలో కమ్యూనిస్టు మేధావుల సాహచర్యము ఎక్కువగా ఉండుటతో, రాయ్ మార్క్స్ తత్వాన్ని అకలింపు చేసుకోవటానికి గట్టిగ కృషి చేశాడు. తత్ఫలితంగానే రాయ్ కమ్యూనిస్టుగా మారాడు. జాతీయ విప్లవవాదిగా, జర్మనీ చేతిలో భంగపడుట వలన గానీ, కమ్యూనిజం పై ఆశక్తి పెరుగుట వలన గానీ విప్లవవాదం పై ఆశక్తి సన్నగిల్లి, మార్క్సిస్టుగా జాతీయ ఉద్యమానికి తోడ్పడాలని నిర్ణయించుకున్నాడు.

## 13.3 మార్క్సీయవాది (రెండవ దశ) :-

యమ్.యన్. రాయ్ మెక్సికిలో ఉన్నప్పుడు కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ, ఆ దృక్పదంలో భారతదేశ అన్ని రకాల పరిస్థితుల గూర్చి విపులీకరిస్తూ వివిధ వార్తా పత్రికలకు వ్యాసాలు వ్రాశాడు. భారతదేశ సమస్యలన్నింటికి నూతన పంధాయైన మార్క్సిస్టు ఆలోచనా విధానం సమస్యలను పరిష్కరించగలదని ఆశించాడు. అంతకు ముందు తనకు జర్మనీ నుంచి లభించిన నిధుల నుంచి కొంత భాగాన్ని మెక్సికోలో సోషలిస్టు కార్యకలాపాలకు ఉపయోగించాడు. అంతే కాకుండా అంతర్జాతీయ కమ్యూనిస్టు లేదా సోషలిస్టు ఉద్యమానికి తాను కూడా పాటుపడాలనే ధ్యేయంతో మిగిలిన దేశాలలోని కమ్యూనిస్టు ఉద్యమాల గూర్చి తెలుసుకుంటూ, తన అభిప్రాయాలను వెలిబుచ్చుతూ వచ్చాడు. ఆ సందర్భములోనే మెక్సికోలో కమ్యూనిస్టు పార్టీని స్థాపించి ఉద్యమాన్ని నడపటానికి నియమింపబడ్డ 'మైఖేల్ బరోడిన్' (Michael Borodin) అనే నాయకునితో రాయ్‌కి సన్నిహిత సాన్నిత్యము ఏర్పడినందున, రాయ్ మార్క్సిస్టు జీవితంలో ఒక మలుపుగా చెప్పవచ్చు. అప్పటి నుంచి 'బరోడిన్' 'రాయ్'లు అంతర్జాతీయ కమ్యూనిస్టు (సదస్సులలో) మహా సభలలో ప్రముఖ పాత్ర వహించసాగారు.

రెండవ అంతర్జాతీయ కమ్యూనిస్టు మహా సభలలో (2nd communist international) రాయ్ కొక ప్రత్యేకత ఏర్పడింది. ఆ మహా సభలలో లెనిన్ ప్రతిపాదన ప్రకారం ఏ దేశములోనైనా ముఖ్యంగా వర్ధమాన దేశాలలో కమ్యూనిస్టు ఉద్యమము ఆ దేశ 'జాతీయ బూర్జువాల' (National Bourgeoisie) మద్దతుతో నడపాలి. దీనితో విభేదించిన రాయ్ 'వర్ధమాన దేశాలలో మాత్రం (ఇండియా) జాతీయ బూర్జువాలు కమ్యూనిస్టులకు వ్యతిరేకులే కాని ఏ మాత్రం వారికి సహకరించరని, పైగా విరోదులుగ మారే ప్రమాదం వుందని' ప్రతిపాదించారు. ఇండియాలో జాతీయ బూర్జువా వర్గం బ్రిటీష్ వ్యతిరేకత స్వాతంత్ర సముపార్జన వరకే పరిమితమని, స్వాతంత్రానంతరం కమ్యూనిస్టు ఉద్యమానికి బద్ధ శత్రువవుతుందని రాయ్ నొక్కి ఒక్కాణించారు.

ఆవిధంగా ఇండియా లాంటి వర్ధమాన దేశాల్లో కమ్యూనిస్టు ఉద్యమము స్వశక్తి పై ఆధారపడుతూ చిన్న బూర్జువా వర్గాన్ని కలుపుకునేందుకు ప్రయత్నించాలని రాయ్ విశదీకరించాడు. లెనిన్ అంతటి వాని ప్రతిపాదనను వ్యతిరేకించినందుకు రాయ్‌ని కొందరు నిరసించినప్పటికి, లెనినే స్వయంగా రాయ్ ప్రతిపాదనలోని సత్యాన్ని గ్రహించినందున రాయ్‌కి ఆ సభలో ప్రత్యేక స్థానం ఇవ్వబడింది. లెనిన్, రాయ్‌లు ప్రతిపాదించిన రెండూ ఆ సభలో అంగీకరించబడ్డాయి. తత్ఫలితంగా భారతదేశ సమస్యకు సంబంధించినంత వరకు పరిస్థితులను బట్టి కమ్యూనిస్టులు ఎవరి మద్దతు ఎప్పుడు ఎలా తీసుకోవాలి అన్న విషయాన్ని కమ్యూనిస్టు ఉద్యమకారులకు వదిలివేస్తూ, మరియు అలాంటి ఉద్యమాలకు అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమము మద్దతు ఇవ్వాలని రాయ్ కోరాడు.

రాయ్ ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. మూడవ ప్రపంచ కమ్యూనిస్టు మహా సభల తర్వాత తూర్పు దేశాల కొరకు ఒక కమ్యూనిస్టు సంస్థను నెలకొల్పటానికి ప్రయత్నాలు జరిగాయి. ఆ సందర్భములోనే భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బ్రిటీష్ కమ్యూనిస్ట్ పార్టీ ద్వారా నడపాలని రష్యా ఆలోచించింది. కాని అప్పటికే రాయ్ జర్మనీ వెళ్ళి అచ్చటి భారత కమ్యూనిస్టు మద్దతుదారులను సంఘటిత పరచసాగాడు. అప్పటి నుంచి సాధ్యమైనంత వరకు బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీ ద్వారా కాక, జర్మన్ కమ్యూనిస్టు పార్టీ ద్వారానే ఇండియాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని నడపటానికి ప్రయత్నించాడు. 1926 నుంచి రాయ్ కమ్యూనిస్టు ఉద్యమము కొరకు 'పీపుల్స్ పార్టీ'ని స్థాపించి చిన్న బూర్జువా వర్గాన్ని కలుపుకోవటానికి ప్రయత్నించాడు. ఇండియాలోని బ్రిటీష్ ప్రభుత్వము, జాతీయ బూర్జువాలు ఆశించిన సంస్కరణలను కేవలము తమ మార్కెట్ ప్రయోజనాల దృష్ట్యానే అంగీకరిస్తాయని, అసలైన సామ్యవాద స్థాపనకు ఉపయోగపడవని రాయ్ తన పార్టీ ద్వారా ప్రచారము చేశాడు. కాని అప్పటికే చైనాలో జాతీయ బూర్జువా వర్గం మద్దతును పొందలేక కమ్యూనిస్టు ఉద్యమము ఎలా దెబ్బతిన్నదో అందరికి తెలిసింది. అందువలన రాయ్ దృక్పధము సరియైనది కాదని గ్రహించి బ్రిటీష్ కమ్యూనిస్టు పార్టీ ద్వారానే ఇండియాలో కమ్యూనిస్టు ఉద్యమాన్ని బలపరచాలనే దృక్పదం పెరిగింది.

1930 నుంచి 1936 వరకు రాయ్ జైలు శిక్షననుభవిస్తూ తత్వ శాస్త్రం, సైన్సు మున్నగు విషయాలను క్షుణ్ణంగా చదివి నూతన దృక్పదాన్ని ఏర్పరచుకోసాగాడు. 1936లో, జైలు నుంచి విడుదలై రాయ్ భారత జాతీయ కాంగ్రెస్‌లో చేరి దానిలో తీవ్రవాద అనుకూలురను సంఘటిత పరచటానికి ప్రయత్నించాడు. ఆ సమయంలోనే తాను స్థాపించిన 'Independent India' అను వార పత్రిక, 1940 నుంచి 'Radical Humanist' అను పేరుతో ఇప్పటికి ప్రచురింపబడుతున్నది. బ్రిటీష్ వలస విధానము కన్న జర్మనీ పాసిస్టు ధోరణి మరీ ప్రమాదకరమని భావించి, రాయ్ 1942 క్విట్ ఇండియా ఉద్యమాన్ని వ్యతిరేకించాడు. దీనితో కాంగ్రెస్‌కు దూరమై, రాయ్ 1946లో 'రాడికల్ డెమక్రటిక్ పార్టీని' స్థాపించాడు.

## 13.4 రాడికల్ హ్యూమనిస్టు (మూడవ దశ) :-

రాయ్ యొక్క నూతన దృక్పదాన్ని 'తీవ్ర / విజ్ఞాన / నవ్య మానవతా వాదము' (Radical / Scientific / New Humanism) అను పేరుతో ప్రచారము చేయసాగాడు. అతని ఉద్దేశంలో రాజకీయ ప్రచారమనునది రాజకీయ అధికారం కోసం కాక, ఒక రకమైన సాంస్కృతిక పునరుః జీవన ఉద్యమము కోసం లేక ఒక రకమైన తీవ్ర మానవతా దృక్పదం కోసం జరగాలని రాయ్ అభిప్రాయం. అందువలననే తను స్థాపించిన 'రాడికల్ డెమక్రటిక్ పార్టీని' 1948లో రద్దు చేసి ప్రచార ఉద్యమాన్ని సాగించాడు.

రాయ్ యొక్క నవ్య మానవతా వాదములో రెండు అంశాలున్నాయి. మొదటిది మార్క్సిజం పై విమర్శనాత్మక సమీక్ష, రెండవది నవ్య మానవతావాదము.

**మార్క్సిజం పై విమర్శనాత్మక సమీక్ష :-** రాయ్ దృష్టిలో మార్క్స్ ఒక మానవతావాది. మానవుని స్వేచ్ఛకు మార్క్సిజంలో ప్రాధాన్యత ఉంది. కాకపోతే మానవ చరిత్ర అంతటిని ఆర్థిక దృక్పదంలోనే చూచుట సంకుచిత ఆలోచన విధానమని రాయ్ భావించాడు. ఈయన దృష్టిలో ఆర్థిక విధానమునకు భౌతిక / శారీరక అవసరాలకు సంబంధముంది. ఉత్పత్తికన్నా ఉత్పత్తి సాధనాల గురించిన భావన మానవుని మేధస్సులో ఉంటుందని, అదే సృజనాత్మక చర్య అని రాయ్ భావించాడు. అనంతరమే ఆర్థిక విధానము స్థిరపడుట మరలా మార్పు చెందుతూ ఉండుట జరుగుతుందని చెప్పినాడు. మరొక రకంగా చెప్పాలంటే రాయ్ దృష్టిలో 'మనిషి తన స్వీయ రక్షణ కొరకు సృజనాత్మకతలో స్వచ్ఛందముగ ఎన్నుకునే చర్యలు సమాజమునకు పునాది' . ఈ భావన 'ఏంజెల్స్' వెలిబుచ్చినట్లు 'ఆర్థికేతర అంశాలు కూడా చరిత్రకు ఆధారమనే అంశాల్ని బలపరుస్తున్నాయి.

మార్క్స్ ప్రతిపాదించిన 'గతి తార్కిక భౌతిక వాదం' కూడా రాయ్‌కి అంగీకారం కాదు. ఆధునిక విజ్ఞాన శాస్త్రం ప్రకారం భౌతిక ప్రపంచంలో జరిగే మార్క్స్ పదార్థం (matter) యొక్క రూపాంతరము మరియు అవిచ్ఛిన్నత వంటిదేకాని వ్యతిరేక ధోరణులకు చావుండదని రాయ్ భావము.

మార్క్సిజంలో వ్యక్తికి స్వేచ్ఛవున్నట్లు కన్పించినా ఆచరణలో వ్యక్తికి ప్రాధాన్యత కానరాదు. వర్గమనే ఊహాత్మక భావన వ్యక్తి ఉనికిని స్వభామును సంకుచితపరుస్తుంది. సమాజం కొరకు సామ్యవాద దృష్టితో చూచినప్పటికి వ్యక్తి సమూహాముకు దాసుడవుతున్నాడు. మరొక విధంగా చూస్తే మార్క్సిస్టు భావనలో సమాజ లక్ష్యం కోసం వ్యక్తి సాధనంగా మారుట కన్పిస్తుంది.

రాయ్ విభేదించిన మార్క్సిజంలోని మరొక అంశము మిగులు విలువ సిద్ధాంతము. రాయ్ దృష్టిలో మిగులు విలువ లేనిదే పారిశ్రామిక పురోభివృద్ధి అసాధ్యము. కార్మిక శక్తిని దోచుకొనకుండగనే మిగులు విలువను ఏర్పరుచుట సాధ్యమని రాయ్ అభిప్రాయపడినాడు.

మార్క్సిజంలోని హింసాయుత విధానమును వర్గ పోరాటమును రాయ్ అంగీకరించలేదు. ప్రజాస్వామిక శాంతియుత పద్ధతులలో, విజ్ఞాన శాస్త్రం మరియు విద్య వంటి సాధనాల ద్వారా, మానవునిలో సామాజిక స్పృహ పెంచుకుంటూ హింసేతర మార్గాలను ఎంచుకుంటూ సమాజ మార్పు కోసం పాటు పడాలని రాయ్ ఆశించాడు.

**నవ్య మానవతావాదము :-** రాయ్ దృష్టిలో నవ్య మానవతావాదము ఆధునిక విజ్ఞానము పై ఆధారపడిన స్వేచ్ఛ తత్వమే. మానవునికి తనకు కావలసిన హేతుబద్ధమైన సరియైన సామాజిక వ్యవస్థను ఏర్పరచుకునే సామర్థ్యము మానవ స్వభావములోనే అంతర్లీనముగ ఉండునని రాయ్ భావించాడు. అలా ఏర్పరచుకొనుటకు మార్గము నైతికమైనది. సమాజ పురోగమనము తిరోగమనము నైతిక మార్గం పైనే ఆధారపడి ఉంటుందని రాయ్ నొక్కి చెప్పాడు. అయితే ఈ నైతిక మార్గము కేవలము మతపరమైనదిగా కాని లేక సాంప్రదాయ బద్ధమైనదిగా కాని ఉండదు. అది హేతుబద్ధమైనది మరియు సశాస్త్రీయమైనది. ఈ భావనను రాయ్, హాబ్స్, హెగెల్, మార్క్స్, ఫైర్‌బాచ్ (Feuerbach) మరియు లెనిన్‌ల నుండి గ్రహించారు.

## 13.5 నవ్య మానవతావాదము:-

1. **భౌతికవాద పునాదులు :-** రాయ్ ఆధునిక విజ్ఞాన శాస్త్రం పై దృఢమైన విశ్వాసము కల్గి ఉండుటచేత 'సృష్టి అంతయు భౌతిక పదార్థములో జరిగే రూపాంతరముగ' గ్రహించి భౌతికవాదిగా మారాడు. భౌతిక పదార్థమనగా అది ఒక రకమైన శక్తి (Electrical Energy). కాకపోతే దానికి కాలము (Time) మరియు ప్రదేశము (Space)లకు సంబంధించినప్పుడే దానిని గురించి మానవునకు ఒక అవగాహన వస్తుంది. భౌతిక లేద సామాన్య శాస్త్రలలో ఈ పాగుక్తి (prediction) అనునది కాలము ప్రదేశము మరియు భౌతిక పదార్థ రూపాంతరముల గూర్చియే తెలుపుతుంది. మరోలా చెప్పాలంటే కారణము - ఫలితముల సంబంధముల గూర్చి చెప్పగల్గుట వలననే సామాన్య భౌతిక మరియు ఇతర విజ్ఞాన శాస్త్రములు కూడా అభివృద్ధి చెందినవి.

మానవులు శారీరక నిర్మాణముతో కూడి ప్రకృతిలో భాగంగా భౌతిక పదార్థము లాగానే ఉంటారు. అందువలన భౌతిక పదార్థములలోని రూపాంతరములో లాగా మానవ మేధస్సులో కల్గే మార్పుల వలన గ్రాహక శక్తి వివిధ రకాలుగా మారుతూ వస్తుంది. భౌతిక శాస్త్రములో లాగానే కారణ - ఫలితములను మానవ మనుగడలో (ఆలోచన - కార్యాచరణ) కూడా చూడవచ్చునని రాయ్ విశదీకరించాడు. మానవునిలోని అంతరాత్మానుసరణము (conciousness) వాస్తవిక మనుగడ నుంచి పెరుగుతూ వస్తుంది. మానవుడు ప్రకృతిలో భాగము మరియు ప్రకృతి పై ఆధారపడి తన మనుగడను కొనసాగించుటకు ప్రకృతిని ఉపయోగించుకునే శక్తి గల జీవి. ఆ విధంగా భౌతిక ప్రపంచము ఏర్పడుటకు ఆధారమైన 'కారణము - ఫలితముల' సంబంధాలు మానవునికి కూడా వర్తిస్తాయి.

ఆ విధముగా మానవ జీవితము రెండు అంశాలతో ముడిపడి ఉంటుంది. మొదటిది మానవునికి పకృతితో గల సంబంధము కాగా రెండవది తోటి మానవులతో గల సంబంధము. ఈ రెండు అంశాలతో కూడిన మానవ అనుభవంలో అంతరాత్మనుసరణము సంకల్పమునకు (will) దారి తీస్తుంది. సంకల్ప ప్రయత్నమే కార్యరూపం (action) దాల్చును. ఆ

విధంగా మానవ మనుగడను గూర్చి తెల్పే పునాదులు మానవ స్థితి (ప్రకృతి సంబంధ జీవితము)లో ఉంటాయి. ఇలా రాయ్ మానవ జీవితమునకు భౌతికపరమైన ప్రాతిపదికలు చూపాడు.

2. **నైతిక విలువలు :-** రాయ్ ప్రకారము మానవుడు హేతుబద్ధ మరియు నైతిక జీవి. రెండు (హేతుబద్ధ, నైతికత) మానవుని అంతరాత్మనుసరణము నుండే అభివృద్ధి చెందుతాయి. అంతరాత్మనుసరణ ఇంతకు ముందు చెప్పినట్లుగ, ప్రకృతి పరిసరాల స్పందనే. మరొకవైపు ప్రతి వ్యక్తి తోటి వారితో సహజీవనము చేస్తూ ఉంటాడు కనుక, ప్రకృతితో పాటు మానవ పరిసరాల ప్రతిస్పందననే అంతరాత్మనుసరణ సామాజిక భావముగ భావించవచ్చు. అనగా మానవుని అంతరాత్మనుసరణము (దీనిలోని హేతుబద్ధత, నైతికత) ఒక వైపు ప్రకృతి పరంగా, మరొక వైపు సామాజిక పరంగా అభివృద్ధి చెందుతూ వస్తుంది.

మానవ సమాజము దృష్ట్యా మానవ మనుగడకు అతికీలకమైనది స్వేచ్ఛ అని రాయ్ నమ్మాడు. ప్రకృతిలో భాగంగా, ప్రకృతి పై ఆధారపడుతూ మరియు మానవ సమూహంలో భాగంగా, మానవుల పై ఆధారపడుతూ మనుగడను సాగించుటకు స్వేచ్ఛ అనే ఇచ్ఛ (self - preservation) మూలాధారము. అందువలననే స్వేచ్ఛను కూడా రాయ్ అంతరాత్మను సరణములో భాగంగానే గ్రహించాడు.

ఈ విధంగా మానవ జీవితమునకు స్వేచ్ఛ మూలాధారము. దానికి అడ్డువస్తున్న ప్రకృతి సంబంధమైన మరియు మానవ సంబంధమైన ప్రతి బంధకాలను తొలగించే ప్రయత్నాలే స్వేచ్ఛా పోరాటము. అదే హేతుబద్ధమైన మరియు నైతిక బద్ధమైన పోరాటము. ఇది రెండు స్థాయిలలో జరుగునని రాయ్ విశదీకరించాడు. ఒకటి భౌతిక పోరాటము - కనీస అవసరాలు తీర్చుకుంటూ జీవించుటకు చేయవలసిన ప్రయత్నాలు, మరియు రెండు నైతిక పోరాటము - తోటివారి సహకారంతో మెరుగుబడే జీవితం కోసం చేసే ప్రయత్నాలు.

3. **చరిత్ర తత్వము (Philosophy of History) :-** మార్క్స్ మానవ చరిత్రను వర్గ పోరాటముల చరిత్రగ భావిస్తే యమ్.యన్. రాయ్ మానవ చరిత్రను స్వేచ్ఛాయుతమైన నైతికమైన పోరాటముగ భావిస్తాడు. భౌతిక స్థాయిలో భౌతిక అవసరాల కోసం, నైతిక స్థాయిలో నైతిక అవసరాల కోసం (సామాజిక సహకారం) ప్రయత్నించుటే రాయ్ దృష్టిలో చరిత్ర. కాకపోతే ఈ ప్రక్రియలో జరిగే హింసాత్మకమైన సంఘటనలు విజ్ఞాన శాస్త్ర లోపం వల్లనే జరిగాయని రాయ్ భావించాడు. విజ్ఞాన శాస్త్రము తత్ఫలితమైన సాంకేతిక సామర్థ్యము మానవ మనుగడకు ఉపయోగపడేలా చూచుకొనుటే మానవ చరిత్ర ధర్మము. ఇదంతయు పరిణామ క్రమకొనసాగింపే. ఒక వ్యక్తి గాని, గుంపు గాని మానవ జీవిత విధానాన్ని తీవ్ర స్థాయిలో మార్చుటకు చేసే ప్రయత్నాలు హింసాయుతము కావచ్చు. కాని రాయ్ దృష్టిలో విజ్ఞాన శాస్త్ర తోడ్పాటుతో మానవ మనుగడ స్థితిని మెరుగు పర్చుటయనునది నైతిక సంబంధమైనది. ఇదే సరియైన విప్లవమని మరియు నవ్య మానవతా వాదమునకు దారి తీస్తుందని రాయ్ భావించాడు.

4. **వ్యవస్థీకృత ప్రజాస్వామ్యము (organised democracy) :-** రాయ్ యొక్క నవ్య మానవతా వాదమును జాతి లేక వర్గముల దృష్ట్యా కాకుండ వ్యక్తి స్వేచ్ఛ దృష్ట్యానే అర్థం చేసుకోవాలి. సమాజంలో ఉండే ఏ సంస్థయైనా లేక సమాజమనే వ్యవస్థయైనా వ్యక్తి స్వేచ్ఛను హరించరాదు. మార్క్స్ వ్యక్తి స్వేచ్ఛకు ఎంత ప్రాధాన్యత ఇచ్చినప్పటికి కమ్యూనిస్టు / సోషలిస్టు వ్యవస్థలలో సామూహిక అంతరాత్మనుసరణము లేదా సామూహిక అహంకారము (collective ego) వ్యక్తి స్వేచ్ఛను అణగద్రొక్కివేగా ఉన్నందుకు రాయ్ బాధపడినాడు. అలాంటి నిర్బంధ వ్యవస్థలలో వ్యక్తిని స్వేచ్ఛావాదిగా ఊహించలేము. అందువలననే రాయ్ తన నవ్య మానవతా వాదము ద్వారా సామాజిక పునఃనిర్మాణము ఎలా జరగాలో విశదీకరించాడు.

ఇంతకు ముందు చెప్పినట్లు వ్యక్తులు రెండు రకాల సంఘర్షణలలో మునిగి తేలుతుంటారు. భౌతిక మరియు నైతిక లేక సాంస్కృతిక సంఘర్షణలు. రాయ్ ఇక్కడ విజ్ఞాన శాస్త్ర పాత్రను, ప్రాముఖ్యతను చూపిస్తాడు. జ్ఞాన సముపార్జనలో ప్రకృతి సంబంధమైన విషయాలను గూర్చి తెల్సుకొన్నప్పుడే సరైన పురోభివృద్ధి. ఆ జ్ఞానము మానవ మనుగడకుపయోగించుట

అంతిమ లక్ష్యము. అందువలననే రాయ్ దృష్టిలో మానవ మనుగడ విజ్ఞాన శాస్త్రాభివృద్ధి పై ఆధారపడి ఉంటుంది. మానవ సంబంధాలు మెరుగుపడుట అంటే, ప్రకృతితో తద్వారా తోటి మానవులతో ఎంత సహకరింపు పొందగలం అన్నదే అతి పెద్ద మానవ సమస్య.

మానవ సమాజ నిర్మాణమును ప్రజాస్వామ్య వ్యవస్థగా గ్రహిస్తాడు రాయ్. సమాజము కావలసిన రీతిలో నిర్మించునది వ్యక్తులే. వ్యక్తులు వారికున్న అవగాహనను (consciousness based on relationship with nature and human beings) బట్టి సమాజ నిర్మాణమును కొనసాగిస్తారు.

రాయ్ యొక్క వ్యవస్థీకృత ప్రజాస్వామ్య భావనలో ముఖ్యంగా మూడు అంశాలున్నాయి.

1. సమాజ నిర్మాణంలో పూర్తిగా వ్యక్తుల పాత్ర.
2. అధికార వికేంద్రీకరణ మరియు
3. అధికారకాంక్షతో కూడిన పార్టీలు లేకపోవుట (పార్టీరహిత).

వ్యవస్థీకృత ప్రజాస్వామ్యము ప్రజలచే నిర్మించబడి వారిచేతనే నడపబడేదిగా ఉండాలి. దాదాపు ప్రాచీన గ్రీకు భావనేదైనా ప్రత్యక్ష ప్రజాస్వామ్యములా ఉండాలి. కాకపోతే సమాజము యొక్క పరిమాణము పెరుగుతున్న కొద్దీ ప్రజల ప్రత్యక్ష ప్రాతినిధ్యము కష్టమౌతుంది. అందువలనే రాయ్ 'కమిటీ పద్ధతి'ని అనుకూలమైనదిగా భావించాడు. ఆ విధముగ రాయ్ యొక్క వ్యవస్థీకృత ప్రజాస్వామ్యము కమిటీ పద్ధతితో కూడిన ప్రజాస్వామ్యమే. గ్రామ స్థాయి నుంచి జాతీయ స్థాయి వరకు, నాలుగు అంచెలలో, గ్రామ, జిల్లా, రాష్ట్ర, కేంద్ర స్థాయిలలో ఈ కమిటీ పద్ధతి పని చేస్తుంది. రాయ్ అన్ని స్థాయిలలో కన్నా గ్రామ స్థాయి కమిటీ పద్ధతికి అధిక ప్రాధాన్యత ఇచ్చాడు. తన నవ్య మానవతా వాదము యొక్క సంకల్ప సిద్ధిని గ్రామ స్థాయి కమిటీ పద్ధతిలో కన్పించాలని కాంక్షించాడు. ఎప్పుడు ఏ స్థాయిలోనైనా ఏర్పడ్డ ప్రజా కమిటీలు వివిధ సమస్యలను పరిష్కరించుకొనుట కోసం తగు సమాచార సేకరణ నిర్ణయీకరణ (పరిష్కార మార్గం) అమలు జరిగేలా చూచుకొనుట. ఈ ప్రక్రియ అంతయు అనగా సమాచార సేకరణ, నిర్ణయీకరణ, అమలు ప్రక్రియలు ఉప కమిటీల ద్వారా నిర్వహించబడవచ్చును. ప్రజా ప్రతినిధులుగా గాని, ప్రభుత్వాధికారులుగా గాని ఉన్న మిగిలిన యంత్రాంగము ఈ కమిటీల నిర్వర్తన పై ఆధారపడి పని చేయాలి.

గ్రామ స్థాయి ప్రజా కమిటీల పాత్ర విశిష్టమైనది. ఇవి మిగతా స్థాయిలలో జిల్లా, రాష్ట్ర, కేంద్ర - కమిటీల ప్రతినిధులను ఎన్నుకొనుటేకాక వారు ఆశించిన మేరకు పనిచేయకపోయినచో వారిని రీకాల్ (పునరాయనము) చేసే అధికారము కూడా వుంది. ఆ విధముగ వివిధ స్థాయిలలోని పరిపాలనను సరియైన ప్రజా పరిపాలనగా రూపొందించవచ్చు.

వ్యవస్థీకృత ప్రజాస్వామ్యములో ఈ ప్రక్రియను బట్టి రాజకీయ పార్టీలకు ఏ పాత్ర వుండదు. అన్ని విషయాలను ప్రజలే కమిటీల ద్వారా పరిష్కరించుకుంటూ, అవసరమైన మార్పులకు అవకాశమిస్తు, కేవలం సమస్య పరిష్కార దృష్ట్యానే పాలన నిర్వర్తన కొనసాగిస్తారు. సాధారణంగా రాజకీయ పార్టీలన్నీ అధికార దాహంతోను, అధికారాన్ని పొందాక దానిని నిలుపుకొనుట కోసం కుహన రాజకీయాలను మరియు హింసా రాజకీయాలను ప్రోత్సహిస్తాయని రాయ్ గ్రహించి, పార్టీరహిత ప్రజాస్వామ్యాన్ని కోరాడు. ఈ భావనే జె.పి నారాయణ్‌ను సర్వోదయ భావం వైపు నడిపించింది.

రాయ్ యొక్క వ్యవస్థీకృత ప్రజాస్వామ్యానికి పునాది నవ్య మానవతావాద దృక్పధము. దీనిలో ముఖ్యాంశాలైన (1) భౌతిక వాద ప్రాతిపదికలు, మరియు విజ్ఞాన శాస్త్రము (2) వ్యక్తి ప్రాధాన్యత (3) స్వేచ్ఛా ప్రాతిపదికపై మానవ యత్నాలు - ఈ మూడింటికి తావున్న సమాజమే సరియైన మానవ సమాజముగ రాయ్ భావించాడు.

## 13.6 సారాంశం :-

మానవేంద్రనాథ్ రాయ్ ఆధునిక భారత రాజనీతి తత్వవేత్తలలోని ప్రముఖులలో ఒకరు. నవ్య మానవతావాదము ఆధునిక భారత రాజనీతి తత్వ విచారములో ఒక ముఖ్య అంశముగ మన గల్గుచున్నది. యమ్.యన్. రాయ్ తత్వ విచారంలోను, ఆచరణ కార్యక్రమాలోను వున్న మూడు దశలు -

1. విప్లవవాది. 2. మార్క్సియవాది. 3. రాడికల్ హ్యూమనిస్టు

మానవ సమాజము దృష్ట్యా మానవ మనుగడకు అతి కీలకమైనది స్వేచ్ఛ అని రాయ్ నమ్మాడు. ఆయన మానవ చరిత్రను స్వేచ్ఛాయుతమైన నైతికమైన పోరాటముగ భావిస్తాడు. ఆయన నవ్య మనవతావాదము ద్వారా సామాజిక పునః నిర్మాణము ఎలా జరగాలో విశదీకరించాడు.

## 13.7 మాదిరి ప్రశ్నలు :-

1. యమ్.యన్. రాయ్ విప్లవవాది. దీని గూర్చి విశిష్టముగా వివరింపుము?
2. రాయ్ మార్క్సియవాది అనుటకు కారణాలు తెలుపుము?
3. రాయ్ నవ్య మానవతావాదము గూర్చి వివరింపుము?

## 13.8 ఆధార గ్రంథాలు :-

1. Varma, V.P. - Modern Indian Plotical Thought
2. Sankar Ghose - Modern Indian Plotical Thought
3. Bali D.R. - Modern Indian Thought

పాఠం - 14

# మహమ్మదాలీ జిన్నా

## MOHAMMAD ALI JINNAH

14.0 లక్ష్యం :

జిన్నా న్యాయవాద వృత్తిలో పేరు ప్రఖ్యాతులు గడించినాడు. ఆయన హిందూ ముస్లిం ఐక్యతకు పాటుపడి తరువాత మతం పేరుతో ప్రత్యేక రాజ్య ఆవిర్భావానికి మూలకారణమైనాడు. జిన్నా ద్విజాతీ సిద్ధాంతాన్ని, శాసనసభ్యునిగా, ప్రభుత్వ సలహాదారుగా, రాజకీయవాదిగా, ఆయన చేసిన సేవల్ని గూర్చి తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

విషయసూచిక :


14.1 ఉపోద్ఘాతము

14.2 శాసనసభ్యునిగా జిన్నా

14.3 ముస్లింలీగ్ జిన్నా

14.4 రాజకీయవాదిగా జిన్నా

14.5 రౌండ్ టేబిల్ సమావేశాలు

14.6 జిన్నా ద్విజాతి సిద్ధాంతం

14.7 జిన్నా-పాకిస్థాన్

14.8 సారాంశము

14.9 నమూనా ప్రశ్నలు

14.10 చదువదగిన గ్రంథాలు.


### 14.1 ఉపోద్ఘాతము

మహమ్మదాలీ జిన్నా కరాచీలో జన్మించినారు. ఈయన పుట్టిన సంవత్సరం అక్టోబర్ 20, 1875 లేదా డిసెంబర్ 23, 1876 కాని అయి ఉండవచ్చును. ఈయన సెప్టెంబర్ 10, 1948న మరణించినాడు. మహమ్మదాలీ జిన్నా మొదట రాజకీయవాదిగా ఉండి హిందూముస్లిం ఐక్యతకు పాటుపడి తరువాత మతం పేరుతో ప్రత్యేక రాజ్య ఆవిర్భావానికి మూలకారణమైనాడు. జిన్నా న్యాయవాద వృత్తిలో పేరు ప్రఖ్యాతలు గడించినాడు. 1906లో ఈయన దాదా భాయ్ నౌరోజీకి వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేయడం జరిగినది. గోఖలేకి జిన్నా మీద చాలా ఉన్నతమైన అభిప్రాయం కలదు. ఈయన హిందూ ముస్లింల యొక్క ఐక్యతకు రాయబారి వలె పనిచేయగలడని పేర్కొన్నాడు. గోఖలే అంటే జిన్నాకు అత్యంత గౌరవాభిమానాలు కలవు. గోఖలేను జిన్నా రాజకీయ ఋషిగా ప్రశంశించడం జరిగినది. జిన్నా చాకచక్యం కల్గిన భయరహితమైన న్యాయవాది, ఒక బ్రిటీష్ మేజిస్ట్రేట్ నీవు మూడవ తరగతి మేజిస్ట్రేట్‌తో వ్యవహరించడంలేదని నిందా పూర్వకంగా ప్రశ్నించినప్పుడు జిన్నా భయరహితంగా మీ ముందు ఉన్నది మూడవ తరగతి కౌన్సిల్ కాదు, మహాశేలవం అని సమాధానమిచ్చినాడు.

జిన్నా తన తొలిరోజులలో జాతీయవాదిగా ఉన్నారు. న్యాయవాదిగా జిన్నా లోకమాన్య తిలక్‌కు అనుకూలంగా గెలిచి వాదించినారు. ఆ విధంగా తిలక్‌ను కాపాడటం జరిగినది.

**14.2 శాసనసభ్యునిగా జిన్నా**

1910లో జిన్నా ఇంపీరియల్ కౌన్సిల్‌కు ముస్లిం ఎలక్టోరేట్ ద్వారా బొంబాయి నియోజక వర్గానికి ఎన్నికైనాడు. ఈ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో జిన్నా అనేక అంశాలపై ప్రసంగించినాడు. వానిలో ప్రధానమైనవి ఎలిమెంటరీ విద్యా బిల్లు, ట్రాన్స్‌ఫర్ ఆఫ్ రెజిస్ట్రేషన్ బిల్లు, ఇండియన్ క్రిమినల్ ఎమెండ్‌మెంట్ బిల్ మొదలైనవి. ఏప్రియల్ 1912న జిన్నా ఎలిమెంటరీ విద్యా బిల్లును గోఖలే ప్రవేశపెట్టినప్పుడు జిన్నా దానిని సమర్ధించినాడు. హార్‌కోర్టు బట్లర్ దీనిని వ్యతిరేకించినాడు. జిన్నా ప్రెస్ బిల్లును కూడ వ్యతిరేకించలేదు. ఈయన ఇండియన్ డిఫెన్స్ బిల్లును సమర్ధించినాడు. మొదట మతప్రాతిపదికపై నియోజక వర్గాలను వ్యతిరేకించినాడు. తరువాత ముస్లిం ప్రయోజనాన్ని సాధించడానికి గాను ప్రత్యేక ఎలక్టోరేట్లను అంగీకరించినాడు.

**14.3 ముస్లింలీగ్ జిన్నా**

అఖిల భారత ముస్లింలీగ్ స్థాపన 1906లో జరిగినది. దీని యొక్క తొలి సమావేశం ఆగాఖాన్ నాయకత్వాన ఢాకాలో జరిగినది. జిన్నా ముస్లింలీగ్ సభ్యుడుగా చేరడం మహమ్మద్ ఆలీని సయ్యద్ వజీర్‌హుస్సేన్ ని అంగీకరింప చేసినాడు. జిన్నా ముస్లింలీగ్‌ను స్థాపించిన వెంటనే దానిలో చేరలేదు. మొదట జిన్నా ముస్లింలీగ్ సంకుచిత భావాలను సమర్ధించేదిగా ఉందని పేర్కొన్నాడు. కాని 1912 లో ఈయన ముస్లింలీగ్ సభ్యుడుగా కాక కేవలం ఒక అతిథిగా ఆ సభకు హాజరుకావడం జరిగినది. ఈ సభలో ఆయన రాజ్యాంగపరమైన మార్పులు చేయవలసినదిగా కోరినాడు. మార్చి 22, 1913 లు అఖిలభారత ముస్లింలీగ్ ఒక నూతన రాజ్యాంగాన్ని లక్నో సమావేశంలో ఏర్పాటు చేయడం జరిగింది. ముస్లింలీగ్, కాంగ్రెస్ ఉమ్మడి కోర్కె స్వపరిపాలన. ఇందులో జిన్నా కృతకృత్యుడైనాడు. ఆ తరువాతి సంవత్సరమే ఈయన ముస్లింలీగ్‌లో సభ్యుడుగా చేరినాడు. 1914 లో ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ తరుపున జిన్నా ఇండియా కౌన్సిల్‌లో సంస్కరణలను చేయడం కోసం ఇంగ్లాండ్ వెళ్ళినాడు.

1916 లో తిలక్ స్థాపించిన హోమ్‌రూల్ లీగ్‌లో జిన్నా చేరలేదు. అక్టోబర్ 1916 జిన్నా 16 వ బొంబాయి ప్రొవిన్సియల్ కాన్ఫరెన్స్‌కు అధ్యక్షత వహించినాడు. దీనిలో హిందూ ముస్లింల ఐక్యత గురించి ఉద్బోధించినాడు. 1917 కలకత్తా కాంగ్రెస్‌లో జిన్నా కాంగ్రెస్ లీగ్ స్కీమ్‌ను సమర్ధించినాడు.

**ప్రభుత్వ సలహాదారుగా జిన్నా :**

సహాయ నిరాకరణ ప్రారంభంలో జిన్నా తాను కాంగ్రెస్‌కు చెందనని పేర్కొన్నాడు. 1920లో నాగపూర్ కాంగ్రెస్ సహాయ నిరాకరణ తీర్మానాన్ని వ్యతిరేకించినాడు. ఈయన న్యాయవాదిగా రాజ్యాంగ పరమైన పద్ధతులపై నమ్మకముంచినాడు. 1921 ఫిబ్రవరి 19 పూనాలో జిన్నా గాంధీ ప్రవేశపెట్టిన సహాయనిరాకరణ ఉద్యమానికి ఖాదీకి బదులుగా రాజకీయ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత కలదని పేర్కొన్నాడు.

1924 మహమ్మదాలీ జిన్నా మడ్డిమాన్ కమిటీ సభ్యుడుగా నియమించబడినాడు. ఈ కమిటీ 1919 గవర్నమెంట్ ఆఫ్ ఇండియా చట్టం ఏ విధంగా పని చేయుచున్నదో గమనించడానికి ఏర్పాటు చేయబడింది. ఈ కమిటీ అల్ప సంఖ్యాక రిపోర్టుపై సంతకం చేయడం జరిగినది. ఈయనతో పాటుగా సప్రూ పరంజన్ పాయ్ శివస్వామి అయ్యన్నార్ మొదలైన వారు ద్వంద ప్రభుత్వాన్ని నిలిపి వేయవలసినదిగా కోరినారు. జిన్నా స్కీన్ కమిటీలో సభ్యుడుగా ఉన్నాడు. ఇది భారతదేశంలో అధికారులను భారతీకరించడానికి ఉన్న సమస్యలను పరిశీలించడానికి ఏర్పడినది.

## 14.4 రాజకీయవాదిగా జిన్నా:

జిన్నా యొక్క రాజకీయ స్థాయి చాలా ఎక్కువ. జిన్నా విజయవంతుడైన న్యాయవాదిగా, రాజకీయవేత్తగా పేరు ప్రతిష్టలు సంపాదించినాడు. ఎడ్విన్ మాంటిగ్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ జిన్నాను ప్రశంసిస్తూ వ్రాసినాడు. జిన్నా చాలా తెలివైనవాడనియు, తన దేశంలో సమస్యలన్నింటిని తానే పరిష్కరించగలడని వ్రాసినాడు.

మితవాదుల స్థాయి తగ్గి అతివాదుల ప్రాబల్యం కోల్పోయిన 1920 తరువాత గాంధీ కాంగ్రెస్‌లో ప్రాధాన్యత కల్గిన నాయకుడుగా మారిన తరువాత జిన్నా యొక్క ప్రాధాన్యత తగ్గినది. జిన్నాకు గాంధీ ఆధిక్యత కల్గిన కాంగ్రెస్ ఇబ్బందికరంగా పరిణమించినది. ఈ కారణం వలన జిన్నా కాంగ్రెస్‌ను పూర్తిగా వదలివేసినాడు. జిన్నా ఆలీ సోదరులు ఆరంభించిన కిలాఫత్ ఉద్యమంలో తన భాగస్వామ్యం వహించలేదు. దానిని గాంధీ సమర్ధించినాడు. 1924లో జిన్నా మరియొకసారి ముస్లీంలీగ్‌కు అధ్యక్షునిగా ఎన్నుకోబడినాడు. జిన్నా అభిప్రాయంలో హిందూముస్లింల మధ్య ఐక్యత లోపించినట్లయితే విదేశీపాలన కొనసాగుతూనే ఉంటుందని పేర్కొన్నాడు. 1924 లీగ్ ఒక తీర్మానాన్ని ఆమోదించడం జరిగినది. దానితో సమాఖ్య రాజ్యాంగం పూర్తిగా ప్రాదేశిక స్వయం ప్రతిపత్తి ఇవ్వడం మరియు భవిష్యత్తులు ప్రాదేశిక పునర్ విభజన వలన ముస్లిం వర్గాలకు పంజాబ్, బెంగాల్ నార్తువెస్ట్ ఫ్రాంటియర్ ప్రోవిన్స్ ఏవిధమైన ఇబ్బందిలేకుండా చూడటం మొదలైన కోర్కెలను చర్చించడం జరిగినది.

1924 లో సెంట్రల్ అసెంబ్లిలో మోతిలాల్ నెహ్రూ స్వరాజ్ పార్టీ అనుగుణంగా జిన్నా ఓటు వేసినారు. జిన్నా మోతిలాల్ నెహ్రూకు అనుగుణంగా ఉన్నప్పటికి పూర్తి అధికారం లేక మోతిలాల్‌కు కేవలం సలహా ఇచ్చేవాడు. కిలాఫత్ మరియు సహాయనిరాకరణ ఉద్యమరోజులలో మతసామరస్యం నశించినది. 1924లో హిందు ముస్లిం సంఘర్షణ జరిగినది. ఢిల్లీలో ఒక ఐక్యతాసమావేశం జరిగినది. దీనితో స్వరాజ్యస్థాపనకు ఒక స్కీమును రూపొందించడం జరిగినది. కాని ఈ కమిటీలో ప్రత్యేక నియోజకవర్గాలను సమర్ధించడం జరిగినది. కాని ఈ కోర్కెను లాలాలజపతిరాయ్ తీవ్రంగా విమర్శించినాడు. ప్రత్యేక నియోజక వర్గాలను కోరువారు భారతీయ ఐక్యతను కాంక్షించలేరు. ఒకసారి ప్రత్యేక నియోజకవర్గాలను సమర్ధించినట్లయితే సివిల్ వార్ ను ఎవరు ఆపలేరని పేర్కొన్నాడు.

1927 వ సంవత్సరంలో సైమన్ కమిషన్‌ను రాజ్యాంగ సంస్కరణలను రూపొందించడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసినది. దీనిని జిన్నా కాంగ్రెస్‌తో పాటుగా బహిష్కరించడం జరిగినది. ముస్లింలీగ్‌లో మరియొక వర్గం సైమన్ కమీషన్‌కు అనుకూలంగా ఉంది. చిర్‌ఖెండ్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ వైస్రాయ్‌కి చెప్పినాడు. జిన్నా కొరుకుడుపడని మనిషి, చాలా ఉన్నతమైనవాడు. అతనిని వదలివేయమని చెప్పినాడు. జిన్నా ఇంపేరియల్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌లో కమీషన్‌కు వ్యతిరేకంగా ఓటు వేసినాడు. బ్రిటీష్ వారికి ముస్లింలపైన పూర్తి విశ్వాసం కలదు. వారినుండి ఏ వ్యతిరేకత రాదు అని భావించినాడు. ఖిర్‌కెండ్ ఈ విషయంలో చాలా కోపోద్రిక్తుడైనాడు. ఆయన కోపంగా వైస్రాయ్‌కి ఉత్తరం వ్రాసినాడు. సైమన్ కమిషన్ ముఖ్యులైన ముస్లింలను చూడవలసిన ఆవశ్యకత కలదనియు జిన్నాను మినహాయించి మిగిలిన అల్ప సంఖ్యాక వర్గానాయకులను వెనుకబడినవర్గాల నాయకులను కలవవలసినదిగా కోరినాడు. ఆ విధంగా హిందువులను భయపెట్టవచ్చునని భావించినాడు. కమిషన్ ముస్లింలందరిని తనకనుగుణంగా మార్చుకుని తన రిపోర్టును ఇవ్వవచ్చని భావించినారు. ఇది పూర్తిగా హిందువులకు వ్యతిరేకంగా ఉంది. హిందువుల యొక్క అస్తిత్వాన్ని దెబ్బతీసేదిగా ఉందని చెప్పవచ్చును. వారు ఈవిధంగా చేసినప్పటికి జిన్నా సైమన్ కమిషన్‌ను తీవ్రంగా విమర్శించడం జరిగినది. ఆయన అభిప్రాయంలో సైమన్ కమిషన్ భారతీయ ఆత్మను అణచివేసేదిగా ఉందని పేర్కొన్నాడు.

1928 వ సంవత్సరంలో మోతీలాల్ నెహ్రూ తన రిపోర్టులో భారతదేశానికి డొమినియన్ స్టేటస్ ఉండాలని పేర్కొన్నాడు. బలహీన వర్గాలకు రాజ్యాంగపరమైన సంరక్షణను ఇవ్వవలెననియు, లెజిస్లేచర్‌లో ముస్లింలకు పెద్ద మొత్తంలో ప్రాతినిధ్యాన్ని

వారి యొక్క సంఖ్యా ప్రాతిపదికపైన వారికి స్థానాలను కేటాయించాలని పేర్కొన్నాడు. ఈ రిపోర్టు ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గాలను కేటాయించాలన్న భావనను వ్యతిరేకించడం జరిగినది. అఖిల పక్ష సమావేశంలో ఈ రిపోర్టు పరిశీలించడానికి ఉంచినప్పుడు హిందూ మహాసభకు ప్రాతినిధ్యం వహించిన జయకర్ సెంట్రల్ లెజిస్లేచర్‌లో ముస్లింలకు 25% మాత్రమే ప్రాతినిధ్యం ఇవ్వాలని వాదించినాడు. ముస్లిం లీగ్ తరపున జిన్నా 33 1/3% వంతు కావాలని పేర్కొన్నాడు. తాను ముస్లింగా కాక ఒక భారతీయునిగా మాట్లాడుతున్నానని పేర్కొన్నాడు. దీనిని తేజ్ బహదూర్ సప్రూ అంగీకరించినాడు కాని ఈ ప్రతిపాదనను అంగీకరించకపోవటం వలన జిన్నా బాగా నిరాశకు గురియైనాడు. దీనికి ప్రధాన కారణం కాంగ్రెస్‌లో ఎక్కువ భాగం హిందూ మహాసభ ప్రాబల్యం కలదు. ఆ విధంగా ముస్లింలకు తగిన న్యాయం జరగలేదు.

ఈ ఒక్క అంశం వలన జిన్నా 14 అంశాల ఫార్ములా తాను రూపొందించినాడు. దీని ప్రకారం బలహీనమైన సమాఖ్య రాజ్యం ప్రత్యేక నియోజక వర్గ వ్యవస్థను ముస్లింల యొక్క రక్షణకు ఏర్పాటు చేయాలని యు సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీలో ముస్లింలకు 1/3 వంతు కంటే తక్కువగా ఉండరాదని పేర్కొన్నాడు. ఈ 14 సూత్రాల ఫార్ములాను 1929లో కాంగ్రెస్ నిశితంగా విమర్శించడం జరిగినది. దీనితో జిన్నా తీవ్ర నిరాశకు గురియైనాడు.

### 14.5 రౌండ్ టేబిల్ సమావేశాలు - జిన్నా:

జిన్నా మొదటి రెండవ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్సుకు లండన్ వెళ్ళినాడు. అక్కడ జిన్నా యొక్క విజ్ఞాపన మేరకు డాక్టర్ మూన్ జీ హిందూ మహాసభ నాయకుడు జాయింట్ ఎలక్టోరేట్ల స్థాపనలో కొన్ని రాయితీలు కల్పించడానికి అంగీకరించినాడు. కాని జయకర్, రామ్‌సీమెక్ డొనాల్డ్ సంభాషణలను నిలిపి వేయవలసినదిగా కోరినారు. హిందువులకు ఎక్కువ రాయితీలు ఇవ్వడం, ఎన్ని ఎక్కువ రాయితీలు కల్పించాలని నిర్ణయించే బ్రిటీష్ ప్రభుత్వమని పేర్కొన్నాడు. రెండవ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్‌లో కాంగ్రెస్ సాధ్యం కాని కోరికలను కోరటం వలన విఫలమైనదని జిన్నా అభిప్రాయపడినాడు. ఈ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్‌లో జిన్నా పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది. హిందువులు ఆయన ముస్లిం మతానికి చెందిన వాడని అనుకోగా, ముస్లింలు జిన్నా హిందువులకు అనుకూలమని భావించేవారు. రాజులు ఆయనను ప్రజాస్వామ్యవాది అని భావించేవారు. బ్రిటీష్ వారి అభిప్రాయంలో ఈయన అతివాదిగా ముద్రవేయబడినాడు. జిన్నా యొక్క అవసరం ఎవరికి లేకుండా పోయినది. 1936 మార్చిలో తనంతట తాను గానే చెప్పినాడు. తాను హిందువులను, ముస్లింలను, రాజులను, బ్రిటీష్ ప్రభుత్వాన్ని గూడ అసంతృప్తి పరిచానని పేర్కొన్నాడు.

జిన్నా మూడవ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్ మరియు జాయింట్ పార్లమెంట్ కమిటీని వదలివేయటం జరిగినది. ఈ సమయంలో జిన్నా రాజకీయాల పట్ల ఆసక్తిని చూపలేదు. ప్రీవీ కౌన్సిల్ ప్రాక్టీస్‌ను కొనసాగించినారు. ఇంగ్లండ్‌లో ఒక ఎస్టేట్‌ను సంపాదించినాడు. రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్ అనుభవంతో తాను నిరాశ చెంది లండన్‌లో స్థిర నివాసమేర్పచుకొన్నాడు.

1933 నియకత్ అలీ లండన్ వెళ్ళి జిన్నాను భారతదేశానికి తిరిగి రావలసినదిగా ఒప్పించడం జరిగినది. భారతదేశంలో ముస్లింలకు నాయకత్వం వహించవలసినదిగా కోరినాడు. జిన్నా 1934 ఏప్రియల్‌లో తిరిగి భారతదేశానికి తిరిగి వచ్చి ఇక్కడ వున్న పరిస్థితిని పరిశీలించి తిరిగి వెనుకకు వెళ్ళినాడు. తరువాత బొంబాయిలో ఉన్న ముస్లింలు సెంట్రల్ లెజిస్లేచర్‌కు ఆయన పేరును నిర్ణయించడం జరిగినది. దీనికి ఆయన ఎన్నిక కాబడినాడు. మహమ్మదాలీ 1930లో చనిపోయే వరకు ముస్లింలీగ్‌కు అఖిల భారతస్థాయిలో నాయకుడే లేడు. అక్టోబర్ 1935లో జిన్నా తిరిగి భారతదేశానికి వచ్చాక ఆయన దానికి నాయకుడు అయినాడు.

1935లో జిన్నా హిందూ ముస్లింల ఐక్యత సాధించినట్లయితే సగం స్వతంత్ర పోరాటాన్ని సాధించినట్లే, దీనిని సాధించనిచో హిందువులు ముస్లింలు బానిసలమవుతామని పేర్కొన్నాడు. అక్టోబర్ 1936లో 80 మిలియన్ల ముస్లింలు ఉదార

అభివృద్ధి వర్గంగా తయారు చేయాలని వారు ఇతర వర్గాలలో కలిసికట్టుగా పని చేసినట్లయితే దేశానికి గొప్ప సేవ చేసిన వారవుతారని పేర్కొన్నాడు.

1937 ఎన్నికలకు ముందు జిన్నా జాతీయ ప్రభుత్వాన్ని కావాలని కోరినాడు. ఆత్మ గౌరవాన్ని కోరే భారతీయుడు కూడ, విదేశీ ఆధిపత్యాన్ని సహించడని పేర్కొన్నాడు. ఎన్నికల తరువాత లీగ్ కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చునని ఊహించినాడు. జూలై 1937లో అబ్దుల్ కలామ్ ఆజాద్ మరియు ఖాలీ క్వాజామాన్ లీగ్ సభ్యులకు ఒక సూచన చేయడం జరిగినది. కేబినెట్‌లో లీగ్ ఒక ప్రత్యేక వర్గంగా పని చేయలేదని పేర్కొన్నారు. కాని ఈ అంశంలో చర్చలు విఫలమైనవి. ఆజాద్ లీగ్ సభ్యులు తమ అంతర్మాత ప్రభోదానుసారంగా మతపరమైన అంశాలను దృష్టిలో పెట్టుకొని ఓటు చేయడాన్ని వ్యతిరేకించినాడు. చర్చలు విఫలమైన తరువాత అజాద్ ఉత్తర్‌ప్రదేశ్ కేబినెట్‌లో ఇద్దరు లీగ్ సభ్యులను మంత్రులుగా నియమించవలసినదిగా కోరినాడు. కాని నెహ్రూ ఒకరి కంటే ఎక్కువ తీసుకోవడానికి అంగీకరించలేదు. ఈ విషయంలో అజాద్ బాధపడటం జరిగినది. జనవరి 1937 జిన్నా నెహ్రూకు ఉత్తరం వ్రాయడం జరిగినది. దానిలో జిన్నా భారతదేశంలో రెండు శక్తులు పని చేయుచున్నాయని పేర్కొన్నాడు. ఒకటి బ్రిటీష్ సామ్రాజ్యవాదం, రెండవది భారత జాతీయవాదం, కాంగ్రెస్ ప్రాతనిధ్యంలో నడిచేది అని పేర్కొన్నాడు. ఈ విధంగా లీగ్ ఒక రాజకీయ శక్తిగా పనిచేయలేదు. అంతేకాక నెహ్రూ ఖాలీ క్వాజామాన్ హిందూ ముస్లింల సమస్య మేధావులకు భూస్వాములకు మాత్రమే వచ్చిన సమస్య వారి యొక్క ఉద్దేశంలో ముస్లింలకు లెజిస్లేచర్‌లో ప్రత్యేక వర్గంగా ఉంచాలని వారు భావించినారు. కాని నెహ్రూ వారిని విమర్శిస్తూ తాను సామాన్య ముస్లింల జనాభా యొక్క సమస్యలను, దారిద్ర్యాన్ని గూర్చి ఆలోచించినాడని ముస్లిం నాయకులు కేవలం కౌన్సిళ్ళలో సీట్ల శాతం గూర్చి మాత్రమే ఆలోచించినాడని పేర్కొన్నాడు. దీనితో జిన్నా బాగా నిరాశ చెందినాడు. దీని ప్రభావం వలన కాంగ్రెస్ లీగ్ సంభాషణలు విఫలమైనాయి.

లక్నో సమావేశంలో అక్టోబర్ 1937 ప్రభుత్వం ఏర్పడిన 3 నెలల తరువాత కాంగ్రెస్ మంత్రివారి ఆఫీస్‌కి రావటం లో జిన్నా కాంగ్రెస్‌ను తీవ్రంగా విమర్శించినాడు. వారు కేవలం హిందువులకు అనుగుణమైన విధానాన్ని అనుసరిస్తున్నాడనియు. ఇది ముస్లింలకు న్యాయం చేకూర్చలేదనియు పేర్కొన్నాడు. ఏ హిందూ నాయకుడు ముస్లింల సమస్యను పరిగణలోకి తీసుకోలేదు. ముస్లింలు అందరూ కేవలం వ్యవస్థాత్మకమైన కృషి సల్పడం ద్వారానే అధికారంలోకి వచ్చే అవకాశం కలదని పేర్కొన్నాడు.

### 14.6 జిన్నా ద్విజాతి సిద్ధాంతం:

లక్నో సమావేశం తరువాత జిన్నా ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించినాడు. దీని ప్రకారం రెండు జాతులు ఎల్లప్పుడు ఒకరిని ఒకరు ఎదుర్కొంటూనే ఉన్నారు. ప్రతి ప్రోవిన్స్‌లోను ప్రతి నగరంలోను ప్రతి గ్రామంలోను వారి మధ్య తేడాలు ఉన్నాయి.

కాంగ్రెస్ పరిపాలన యొక్క అనుభవం తరువాత జిన్నా అధిక సంఖ్యాకుల పాలన అంటే కాంగ్రెస్ పాలన అని జిన్నా అభిప్రాయపడినాడు. అంతేకాక ఇది హిందూపాలన అని కూడ అభిప్రాయపడినాడు. 1937 అక్టోబర్‌లో అధిక సంఖ్యాక వర్గానికి చెందినవారు స్పష్టంగా హిందూస్థాన్ హిందువులకు అని నిరూపించడం జరిగినది. జిన్నా అభిప్రాయంలో నెహ్రూ కాంగ్రెస్ యొక్క కార్యక్రమాన్ని రూపొంది ముస్లిం జనాభాను కలిసి వారికి తెలియచేయడం జరిగినది. ఇది ముస్లింలీగ్‌కు పెద్ద సమస్యగా తయారైనది.

1938లో నెహ్రూ జిన్నాకు వ్రాసిన లేఖలో ముస్లింల యొక్క ప్రధాన సమస్య లేవనే విషయం తనకు స్పష్టంగా తెలియదని పేర్కొన్నాడు. వివాదానికి కారణమేమనే విషయం తనకు తెలియదని పేర్కొన్నాడు. జిన్నా దానికి సమాధానంగా ముస్లింలు అనుభవిస్తున్న బాధలు నిజమైనవనియు వాటిని గురించి ఆశ్చర్యాన్ని కల్గిస్తుందని పేర్కొన్నాడు. తరువాత జిన్నా కాంగ్రెస్ పాలన

ప్రోవిన్స్‌లలో కొనసాగినట్లయితే సివిల్‌వార్ తప్పదని తమ సైన్యాన్ని తయారు చేస్తున్నాననియు దెబ్బకు దెబ్బతీయడం ఖాయమని పేర్కొన్నాడు. గాంధీ పేర్కొన్న అహింసా పోరాటాన్ని విమర్శించడం జరిగినది. గాంధీ జిన్నాకు వ్రాసిన లేఖలో లక్నో ఉపన్యాసం కేవలం కాంగ్రెస్ మీద యుద్ధాన్ని ప్రకటించినట్లుగా ఉందని వ్రాసినాడు. జిన్నా దానికి సమాధానంగా ముస్లింలు తమని రక్షించుకోవడానికి చేసిన ప్రయత్నమని పేర్కొన్నాడు.

**(October)** అక్టోబర్ 1938లో జిన్నా కాంగ్రెస్ మంత్రుల పశుప్రాయమైన అణచివేసే ధోరణిని లీగ్ పట్ల వ్యవహరించడం జరుగుతున్నది. తాను రాజ్యాంగ వాదాన్ని సమర్థించినాననియు తనకు కాంగ్రెస్ అనుసరించిన రాడికల్ విధానం నచ్చలేదని పేర్కొన్నాడు. ఈ ధోరణికి వ్యతిరేకంగా జిన్నా ప్రత్యక్ష చర్యకు పూనుకోవలసిన ఆవశ్యకత కలదని పేర్కొన్నాడు. దీనిని ఫజుల్‌హక్, సికిరిదర్ హయత్‌ఖాన్, సమర్థించినాడు. లీగ్ దీని కోసమై ఒక ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయడమైనది. దీని ద్వారా కాంగ్రెస్ పాలిత ప్రోవిన్సులలో ముస్లింల యొక్క సమస్యలను అధ్యయనం చేయవచ్చునని భావించినారు. ఈ కమిటీలు ఫిర్‌పూర్ రిపోర్టు మరియు షరీఫ్ రిపోర్టును పరిశీలించినది. ఈ రిపోర్టు పూర్తిగా కాంగ్రెస్ పాలన గూర్చి చేసిన విమర్శలే. అప్పటి వైస్రాయ్ విన్‌లిత్‌గో వీటిపై న్యాయపరమైన విచారణను చేయవలసినదిగా కోరినాడు. కాంగ్రెస్ పాలనకు వ్యతిరేకంగా ఉంది అనే విషయం నిరూపించడం జిన్నాకు సాధ్యం కాలేదు.

కాని, బ్రిటీష్ ప్రభుత్వం ముస్లింలీగ్‌కు సానుభూతి వైఖరిని ప్రదర్శించడం జరిగినది. బ్రిటీష్ వారు వారి పరిపాలనను బాగుగా సమర్థించడం జరిగినది.

1939లో జిన్నా ఒక ప్రకటనను చేయడం జరిగినది. అధికారాన్ని ముస్లింలకు ముస్లిమేతరులకు చెరిసగం పంచుకోవాలనియు ముస్లిం భారతదేశం ముస్లింమేతర భారతదేశంగా ఉండాలని భావించినాడు. జిన్నా హిందూ సామాజిక వ్యవస్థను నిశితంగా విమర్శించడం జరిగినది. డిసెంబర్ 22, 1939ని విముక్తి దినంగా పండుగ చేసుకోవడం జరిగినది. ఏడు ప్రోవిన్సులలో మంత్రులు రాజీనామా చేయడం జరిగినది. దీనితో వారు కాంగ్రెస్ యొక్క ఆధిపత్యం నుండి విముక్తి పొందినారనియు వారికి సంపూర్ణ స్వేచ్ఛ కాంగ్రెస్ నుండి లభ్యమైనట్లుగా భావించినాడు.

నవంబర్ 1939లో జిన్నా విన్‌లిత్‌గో వైస్రాయ్‌కి రాజ్యాంగ సంస్కరణలను హిందువులకు ముస్లింలకు ఆమోదయోగ్యం కాకుండా చేయరాదని పేర్కొన్నాడు. విన్‌లిత్‌గోని ముస్లింల యొక్క భావాలకు తగిన విలువ ఇవ్వలేదని జిన్నా భయరహితంగా తెలియచేసినాడు. జిన్నా ఏప్రియల్ 1940లో పార్లమెంట్ 80 మిలియన్ల ముస్లింల సబ్జెక్ట్‌లను రాజ్యాంగం రూపంలో తీసుకొని వచ్చినట్లయితే శాంతియుతంగా తమ జీవనం కొనసాగించవచ్చునని భావించినాడు. దీని వలన ముస్లింలకు నూతన శక్తి వస్తుందని జిన్నా సంతృప్తి పడినాడు. ఇది విటో శక్తిని కూడ ఇచ్చినది. ఈ శక్తి పాకిస్తాన్ ఆవిర్భావానికి ఆధారభూతమైనది.

1939లో ముస్లిం విద్యార్థులు పాకిస్తాన్ స్థాపనకు ఆసక్తిని కనపరచడం జరిగినది. ఈ కోర్కెను జిన్నా అంగీకరించినాడు. మార్చి 26, 1940లో ముస్లింలీగ్ పాకిస్తాన్ తీర్మానాన్ని ఆమోదించడం జరిగినది. దీనికి అధికారికంగా తమ మద్దతును తెలియచేయడం జరిగినది. దీనికి రాజ్యాంగ బద్ధమైన ప్రణాళిక ఏది పని చేయదు. ఎక్కడైతే ముస్లింలు సంఖ్యా బలం ఎక్కువగా ఉన్నాయో ఆ ప్రాంతాలకు ఉత్తర పశ్చిమ మరియు తూర్పు రాష్ట్రాలకు సర్వం సహాధికార సార్వభౌమాధికారం ఇవ్వవలసినదిగా కోరినాడు. జిన్నా అభిప్రాయంలో ముస్లింలు అల్ప సంఖ్యాక వర్గాలకు చెందిన వారని పేర్కొనుట తప్పు, వారు ఆ వర్గాలకు చెందరు. వారు మొత్తం ఒకే జాతిగా ఉన్నారు. హిందువులు ముస్లింలు రెండు వేర్వేరు మత తరహాలకు చెందివారు, రెండు భిన్నమైన నాగరికతలకు చెందినవారు. వారు హిందువులతో వివాహ సంబంధాలు కలుపుకొనేవారు కాదు. కలిసి భోజనాలు చేయరు. వారి చరిత్ర వేరు, పురాణాలు వేరు. వారి నాయకులు వేరు. ఈ రెండు జాతులు కలిసి బ్రతకడం సాధ్యం కాదు. వారు ఒక రాజ్యంగా ఉంటే అనుకొని ఉపద్రవాల సంభవించే అవకాశం ఉంది.

భారతదేశంలో ప్రధాన సమస్య మతపరమైనది కాదు. అంతర్జాతీయమైనది. భారతదేశంలో కూడ రెండు స్వతంత్ర ప్రతిపత్తి కల్గిన జాతి రాజ్యాలుగా చేయాలని భారత ఉపఖండం ఒకటిగా ఉంది. మిగిలిన ప్రపంచ రాజ్యాలను చూసినట్లయితే బాల్కన్ పెనిన్‌సులాలో 8 సార్వభౌమ రాజ్యాలుగా విభజన పొందడం జరిగినది. అదే విధంగా భారతదేశం రెండు స్వతంత్ర ప్రతిపత్తి పొందిన రాజ్యాలుగా విభజన పొందగలవని పేర్కొన్నాడు.

కాంగ్రెస్ సమర్థించిన అంకగణిత ప్రజాస్వామ్యం బ్రిటన్‌లో విజయవంతమైనది. బ్రిటన్ ఒకే రాజ్యంగా ఉంది. భారతదేశంలో ప్రభుత్వం హిందువుల ఆధిక్యతతో ఉంది. బ్రిటన్‌లో ప్రభుత్వాలు మార్పు చెందుతూ ఉంటాయి. ఈ రోజు కన్‌జర్‌వేటివ్ ప్రభుత్వం, రేపు లిబరల్ ప్రభుత్వం, ఇంకొకసారి లేబర్ ప్రభుత్వం వచ్చేవి. కాని భారతదేశంలో శాశ్విత ప్రభుత్వం ఉంది. అది కేవలం హిందువులతో నడుపబడుచున్నది. కనుక ఈ విధమైన ప్రజాస్వామ్యం భారతదేశానికి పనికిరాదని జిన్నా అభిప్రాయపడినాడు

భారతదేశం సమగ్రతకు, ఐక్యతకు ప్రధానకారణం, బ్రిటీష్ వారి పాలన అనియూ తుపాకీ గుళ్ళతో ఈ ఐక్యత సాధ్యమైనదనియు వారి పాలన అంతమైనచో భారతదేశం రెండుగా విభజించే అవకాశం ఉందని పేర్కొన్నాడు.

**14.7 జిన్నా - పాకిస్తాన్:**

పాకిస్తాన్ తీర్మానంలో స్పష్టత లోపించినది. ఇందులో ఏ ప్రాంతాలు ఉండాలి అనే విషయం మాత్రం స్పష్టంగా వివరించలేకపోయినారు. భారతదేశంలో ఉత్తర పడమర ప్రాంతాలు సింధూ బెలూచిస్తాన్ నార్తు వెస్ట్ ఫ్రాన్‌టియర్ ప్రోవిన్స్ పంజాబ్ కలిపి తూర్పు ప్రాంతంలో బెంగాల్ కలిపి మరియొక సార్వభౌమ రాజ్యంగా ఏర్పడుతుందా లేక ఒకే సార్వభౌమ రాజ్యంగా పాకిస్తాన్ ఏర్పడుతుందా అనే సందేహాన్ని వ్యక్తం చేసినాడు. ఈ అంశం పై ముస్లింలలో ఏకాభిప్రాయం లేదు.

జాతీయ ముస్లింలీగ్ ఢిల్లీలో 1940 ఏప్రియల్ సమావేశం జరిగినది. దీనికి అల్లాబక్స్ సింధ్ ముఖ్యమంత్రి ఆరంభించడం జరిగినది. ఈయన ముస్లిం లీగ్‌లు ముస్లింల యొక్క బాధ్యత వహించడం తమ హక్కుగా భావించడం జరిగినది. దీనిని వారు వ్యతిరేకించడం జరిగినది. జాతీయ ముస్లింలు ప్రత్యేకమైన ఒంటరి ప్రాంతాన్ని ఇష్టపడలేదు. వారు అఖండ భారతావనిని కోరడం జరిగింది. భారతదేశం హిందువులకు, ముస్లింలకు జన్మభూమి అని పేర్కొన్నారు.

క్రిప్స్, రాయబారం 1942లో నూతన రాజ్యాంగాన్ని ప్రోవిన్సులలో ప్రవేశపెట్టాలని పేర్కొన్నాడు. ఇది భారత యూనియన్‌కు బయట ఉంటుందనియు వారి యొక్క రాజ్యాన్ని వారు ఏర్పాటు చేసుకోగలరని పేర్కొన్నాడు. సెక్రటరీ ఆఫ్ స్టేట్ అమెరికా వైస్రాయ్‌కి జిన్నా ఉత్తరం వ్రాయడం జరిగినది. దీనిలో మేము ముస్లింలు రక్షించుకొనుటకు పాకిస్తాన్‌ను అంగీకరించినామని పేర్కొన్నాడు. ముస్లింలీగ్‌లో వారికి మెజారిటీ లేదు అంతేకాక ముస్లిం పాలిత ప్రాంతాలలో ఎక్కువ భాగం క్రిప్స్ రాయబారాన్ని అంగీకరించలేదు.

1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో కాంగ్రెస్ యొక్క ప్రధాన ఉద్దేశం దేశంలోని ప్రాంతాలకు స్వతంత్ర్యాన్ని సముపార్జించడం అని పేర్కొనడం జరిగినది. ఇది బ్రిటీష్ వారికి పెద్ద తలనొప్పిగా తయారైనది. 1943లో జిన్నా మూడు సంవత్సరాల తరువాత పాకిస్తాన్ తీర్మానమొక్కటే ముస్లింలకు పరిష్కారమని భావించినాడు. ముస్లింలకు ఇది జీవన్మరణ సమస్య అయినది. ఏప్రియల్ 1943లో గాంధీ జైలులో ఉన్నాడు. మే 1944లో గాంధీ జైలు నుండి విడుదలైన తరువాత తాను ముస్లింలకు, ఇస్లాంకు శతృవుని కానని పేర్కొన్నాడు. జిన్నా గాంధీని బొంబాయిలో కలవడానికి ఇష్టపడినాడు.

కాని శ్యాంప్రసాద్ ముఖర్జీ హిందూ మహాసభ నాయకుడు. గాంధీని జిన్నా కలవడానికి ఇష్టపడలేదు. జయకర్ కూడా ఈ విషయంలో కూడా గాంధీని జాగరూకునిచేసినాడు. జిన్నా గాంధీతో జరిపిన చర్చలలో పాకిస్తాన్ కావాలనే విషయంలో

మార్పులేదు. ఈ చర్చల చివరిలో సి. రాజగోపాలాచారి ప్రతిపాదనను చర్చించడం జరిగినది. దీని ప్రకారం ఉత్తరం పడమర మరియు తూర్పు భారతదేశంలో ముస్లింలు అత్యధిక సంఖ్యాకులుగా ఉన్నారు. ఈ ప్రాంతాలలో ప్లెబిసైట్ నిర్వహించడం జరిగినది. ఇది వయోజన ఓటింగ్ ద్వారా నిర్వహించడం, ప్రత్యేక రాజ్యాన్ని ఏర్పాటు చేయటం మొదలైనవి. గాంధీ ప్రత్యేక రాజ్యం భారత సమాఖ్యలో ఉండి విదేశీ వ్యవహారాలు రక్షణ మరియు అంతరంగిక సమాచారాలు, కష్టమ్స్ మరియు కామర్స్ శాఖలు ఉమ్మడి ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని నడపబడతాయని పేర్కొన్నాడు., ఇది బ్రిటీష్ వారు భారతదేశాన్ని వదలి వెళ్ళే వరకుననియు వారు వెళ్ళిన తరువాత పాకిస్థాన్ మరియు ఇండియా అనే రెండు స్వతంత్ర రాజ్యాలు ఏర్పడతాయని ఇది లాహోర్ తీర్మానం యొక్క సారాంశం. అక్టోబర్ 1944లో హిందూ ముస్లిం సమస్యకు ఒకే ఒక పరిష్కారం భారతదేశాన్ని రెండు సార్వభౌమాధికార రాజ్యాలుగా విభజించడం అని అభిప్రాయపడినాడు.

1946 ఎన్నికలలో ముస్లింలీగ్ 30 స్థానాలను పూర్తిగా సెంట్రల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి ఎన్నిక కావడం జరిగినది. దాదాపుగా అన్ని ప్రావిన్స్‌లలో 492కు 425 సీట్లను గెలుచుకోవడం జరిగినది. అవి ముస్లింలకు కేటాయించబడినవి. ఈ సీట్లని పాకిస్తాన్ స్థాపనను ఆధారం చేసుకొని గెలిచినవే ఈ సంఘటన జిన్నాకు ఊతమిచ్చినది.

1946లో కేబినెట్ మిషన్ సరళ సమాఖ్యపై తన దృష్టిని సారించడం జరిగినది. కేంద్రానికి పరిమిత అధికారాలు ఇవ్వడం జరిగినది. ప్రొవిన్సులను మూడు వర్గాలుగా విభజించడం జరిగినది. హిందువులు ముస్లింలు ఎక్కువ జనాభా ఉన్నారు. మూడవ స్థాయి ఇరువురు సమానంగా ఉన్నారు. కాంగ్రెస్ ముస్లింలీగ్ ఇరువురు కొన్ని అభ్యంతరాలతో ఈ కెబినెట్ మిషన్ ప్రణాళికను అంగీకరించడం జరిగినది. నెహ్రూ దానికి కొన్ని అభ్యంతరాలు తెలియచేయడం జరిగినది. పెతిక్ లారెన్స్ భారత ప్రధానకార్యదర్శి హౌస్ ఆఫ్ లార్డ్స్‌లో జూలై 1946లో భారత రాజ్యాంగ సభ గూర్చి వ్యాఖ్యానించడం జరిగినది. జిన్నా నెహ్రూ చేసిన వ్యాఖ్యలకు తీవ్ర అభ్యంతరం తెలియచేసి కేబినెట్ ప్లాన్‌ను వ్యతిరేకించి రాజ్యాంగ సభను లీగ్ సభ్యులను బహిష్కరించమని కోరినాడు.

జూలై 1946లో జిన్నా శాంతి పూర్వక ఒప్పందానికి రావడం లీగ్ పరిమిత పాకిస్తాన్‌కు తన అంగీకారాన్ని తెలియచేయడం జరిగినది. దాని ప్రకారం రక్షణ, విదేశీ వ్యవహారాలు, సమాచార వ్యవహారాల శాఖలను యూనియన్ ఆఫ్ ఇండియాకు అప్పగించడం జరిగినది. లీగ్ ఒక వైపు పాకిస్తాన్ వైపు దృష్టిని సారిస్తూనే రెండవ వైపు బ్రిటీష్ పాలన నుండి దాస్య విముక్తి సాధించాలని మరియు భవిష్యత్తులో హిందూ ఆధిపత్యం నుండి తమని కాపాడుకోవాలనే అంశాన్ని దృష్టిలో పెట్టుకొనుట జరిగినది. 1946లో అఖిల భారత కాంగ్రెస్ కమిటీ కేబినెట్ మిషన్ ప్రణాళికను అంగీకరించడం జరిగినది. కాని జిన్నా అప్పటికే ఇది చాలా ఆలస్యమైనదనియు లీగ్ ఎప్పటికీ పాకిస్తాన్ విషయంలో తన నిర్ణయాన్ని మార్చుకోదనియు పేర్కొన్నాడు.

1946 ఆగస్టులో వైస్రాయ్ నెహ్రూను ఇన్‌టరిమ్ గవర్నమెంట్‌ను కేంద్రంలో ఏర్పాటు చేయమని ఆహ్వానించడం జరిగినది. దీనిలో ముస్లింలీగ్ సభ్యుల నాయకత్వంలో చేయడం జరిగినది.

నియాఖత్ ఆలీఖాన్ భారతదేశం రెండు రాజ్యాలు కావాలనియు ఆపద్ధర్మ ప్రభుత్వంలో నెహ్రూ నాయకత్వాన్ని వారు అంగీకరించలేదు. వారికి ఉమ్మడి సమిష్టి బాధ్యతలేదని పేర్కొన్నాడు. ఘజన్‌ఫర్ ఆలీఖాన్ మొదలైనవారు ఆపద్ధర్మ ప్రభుత్వంలో చేరడానికి ప్రధాన కారణం పాకిస్తాన్ అనే లక్ష్యాన్ని సాధించడానికి. డిసెంబర్ 9న రాజ్యాంగ సభ మొదటిసారి సమావేశమైనప్పుడు లీగ్ సభ్యులు హాజరు కాలేదు.

మౌంట్ బాటన్ గవర్నర్ జనరల్ చివరకు ఒక నిర్ణయానికి రాక తప్పలేదు. ఈ సమస్యకు ఒకేఒక పరిష్కారం దేశవిభజన ద్వారానే సాధ్యమౌతుందని అభిప్రాయపడినాడు. మౌంట్‌బాటన్ ప్రణాళిక జూన్ 1947లో దేశవిభజనకు

రూపుదిద్దుకొన్నది. ఈ విధంగా సైయ్యద్ అహమ్మద్‌ఖాన్ మరియు ఇక్బాల్ ఆశయాలతోపాటుగా 1940 లీగ్‌తీర్మానం వాస్తవంలోకి వచ్చినది. అధికారాన్ని బదిలీ చేయడం ద్వారా ఆగస్టు 15, 1947లో పాకిస్తాన్ ఆవిర్భవించినది.

మౌంట్‌బాటన్ భారత్ పాకిస్తాన్ డొమీనియన్లకు మొదటి గవర్నర్ జనరల్ కావాలని అనుకొన్నాడు. నెహ్రూ దానికి తన అంగీకారాన్ని తెలియచేసినాడు. కాని జిన్నా దానికి అంగీకరించలేదు. జిన్నా పాకిస్తాన్ మొదటి గవర్నర్ జనరల్ అయినాడు. జిన్నా తన జీవిత కాలంలో పాకిస్తాన్‌ని చూస్తానని అనుకోలేదు. చివరకు తన కలను నిజం చేసుకోవడం జరిగినది. జిన్నా పాకిస్తాన్ మతాన్ని ఆధారంగా చేసుకొని అవతరించునని అభిప్రాయపడినాడు. పాకిస్తాన్ రాజ్యాంగం కూడా ఇస్లాం రాజ్యాన్ని అంగీకరించినది.

జిన్నా ఆర్థిక వ్యవస్థలో కూడ ఇస్లాం భావాలను ప్రవేశపెట్టినాడు. జూలై 1948లో జిన్నా మరణించే వరకు పాశ్చాత్య ఆర్థిక వ్యవస్థ అనేకమైన అపరిష్కృతమైన సమస్యలను సృష్టించినదనియు దీనివలన రెండు ప్రపంచ యుద్ధాలు వచ్చినవి అని అభిప్రాయపడినారు. ఇప్పటి పాశ్చాత్య ఆర్థిక సిద్ధాంతం పాకిస్తాన్‌కు పనికి రాదన్నాడు.

జిన్నా స్వతహాగా మతపరమైన భావాలు కల్గినవాడు కాదు. ఈయన ఒక రాజకీయవేత్త, ఈయన కొంత కాలం భారతజాతీయవాదిగా ఉన్నాడు. తరువాత బ్రిటీష్‌కు సామ్రాజ్యవాదుల యొక్క విభజించు పాలించు విధానాన్ని సమర్థించినాడు.

## 14.8 సారాంశము :

గోఖలేకి జిన్నా మీద చాలా ఉన్నతమైన అభిప్రాయం కలదు. ఈయన హిందూ ముస్లింల ఐక్యతకు రాయబారి వలె పనిచేయగలడని పేర్కొన్నాడు. జిన్నా చాకచక్యం కల్గిన భయరహితమైన న్యాయవాది. 1910 లో జిన్నా ఇంపీరియల్ కౌన్సిల్‌కు ముస్లిం ఎలక్టోరేట్ ద్వారా బొంబాయి నియోజక వర్గానికి ఎన్నికైనాడు. అఖిల భారత ముస్లింలీగ్ స్థాపన 1906లో జరిగినది. దీని యొక్క తొలి సమావేశం ఆగాఖాన్ నాయకత్వాన ఢాకాలో జరిగినది. జిన్నా ముస్లింలీగ్ సభ్యుడుగా చేరడం మహ్మద్ ఆలీని సయ్యద్ వజీర్ హుస్సేన్‌ని అంగీకరింపచేసినాడు. ముస్లింలీగ్ కాంగ్రెస్ ఉమ్మడి కోర్కె స్వపరిపాలన. ఇందులో జిన్నా కృతకృత్యుడైనాడు. 1920లో నాగపూర్ కాంగ్రెస్ సహాయనిరాకరణ తీర్మానాన్ని వ్యతిరేకించినాడు. 1921 ఫిబ్రవరి 19 నానాలో జిన్నా గాంధీ ప్రవేశపెట్టిన సహాయనిరాకరణ ఉద్యమానికి ఖాదీ బదులుగా రాజకీయ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టవలసిన ఆవశ్యకత కలదని పేర్కొన్నాడు. 1924 మహమ్మదాలీ జిన్నా మడ్డిమాన్, కమిటీ సభ్యుడుగా నియమించబడినాడు. ఈయనతోపాటుగా సప్రూ పరంజపే శివస్వామి అయ్యర్ మొదలైన వారు ద్వంద్వ ప్రభుత్వాన్ని నిలిపి వేయవలసినదిగా కోరినారు. జిన్నా యొక్క రాజకీయ స్థాయి చాలా ఎక్కువ. జిన్నా విజయవంతుడైన న్యాయవాదిగా, రాజకీయవేత్తగా పేరు ప్రతిష్ఠలు సంపాదించినాడు. ఎడ్విన్ మాంటింగ్ సెక్రటరీ ఆఫ్ స్టేట్ జిన్నాను ప్రశంసిస్తూ వ్రాసినారు. జిన్నా చాలా తెలివైనవాడనియు, తన దేశంలో సమస్యలన్నింటిని తానే పరిష్కరించగలడని వ్రాసినాడు. 1924లో సెంట్రల్ అసెంబ్లీలో మోతీలాల్ నెహ్రూ స్వరాజ్ పార్టీ అనుగుణంగా జిన్నా ఓటు వేసినారు. జిన్నా మోతీలాల్ నెహ్రూకు అనుగుణంగా ఉన్నప్పటికి పూర్తి అధికారం లేక మోతిలాల్‌కు కేవలం సలహా ఇచ్చేవాడు. 1928వ సంవత్సరంలో మోతీలాల్ నెహ్రూ తన రిపోర్టులో భారతదేశానికి డొమినియన్ స్టేట్ ఉండాలని పేర్కొన్నాడు. బలహీన వర్గాలకు రాజ్యాంగపరమైన సంరక్షణను ఇవ్వవలెననియు, లెజిస్లేచర్‌లో ముస్లింలకు పెద్ద మొత్తంలో ప్రాతినిధ్యాన్ని వారి యొక్క సంఖ్యా ప్రాతిపదికపైన వారికి స్థానాలను కేటాయించాలని పేర్కొన్నాడు. అఖిలపక్ష సమావేశంలో ఈ రిపోర్టు పరిశీలించడానికి జయకర్ సెంట్రల్ లెజిస్లేచర్‌లో ముస్లింలకు 25% లీగ్ తరపున జిన్నా 33 1/3% వంతు కావాలని పేర్కొన్నాడు. ఈ ఒక్క అంశం వలన జిన్నా 14 అంశాల ఫార్ములా తను రూపొందించినాడు. ఈ 14 సూత్రాల ఫార్ములాను 1929లో కాంగ్రెస్ నిశితంగా విమర్శించడం జరిగింది. 1935లో జిన్నా హిందూ ముస్లింల ఐక్యత సాధించినట్లయితే

సగం స్వతంత్ర పోరాటాన్ని సాధించినట్లే. లక్నో సమావేశం తరువాత జిన్నా ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. 1939లో ముస్లిం విద్యార్థులు పాకిస్థాన్ స్థాపనకు ఆసక్తిని కనపరచడం జరిగింది. ఆ కోర్కెను జిన్నా అంగీకరించినాడు. జులై 1946లో జిన్నా శాంతి పూర్వక ఒప్పందానికి రావడం లీగ్ పరిమిత పాకిస్థాన్‌కు తన అంగీకారాన్ని తెల్పడం జరిగినది. జిన్నా పాకిస్థాన్ మొదటి గవర్నర్ జనరల్ అయినాడు. జిన్నా ఆర్థిక వ్యవస్థలో కూడా ఇస్లాం భావాలను ప్రవేశపెట్టినాడు. జిన్నా స్వతహాగా మతపరమైన భావాలు కల్గినవాడు కాదు. ఈయన ఒక రాజకీయవేత్త. ఈయన కొంతకాలం భారత జాతీయవాదిగా ఉన్నాడు.

## 14.9 నమూనా ప్రశ్నలు :

1. జిన్నా దిజాతి సిద్ధాంతాన్ని వివరించండి?
2. హిందూ ముస్లిం ఐక్యతకు జిన్నా ఏ విధంగా పాటుపడినాడో తెలుపుము?

## 14.10 చదువదగిన గ్రంథాలు :-


| | | | |
|---|---|---|---|
| 1. | **Modern Indian Political Thought** | - | **Sankar Ghosh** |
| 2. | **Modern Indian Political Thought** | - | **V.P. Varma** |
| 3. | **Speeches and Writings of Mr. Jinna** | - | **Ed.Jamiluddin Ahmad** |
| 4. | **Divide and Quit** | - | **Pendred Moon** |
| 5. | **Indian Muslims** | - | **Ram Gopal** |
| 6. | **Pathweay to Pakistan** | - | **Khaliquzz Aman** |


డా॥ యల్. శారద

పాఠం - 14. ఎ.

# ఇక్బాల్ ఆధునిక ఇస్లామ్

14.ఎ.0 లక్ష్యం

లక్ష్యం :- ఆధునిక ముస్లిం జాతీయ నాయకులలో మహ్మద్ ఇక్బాల్ ఒకరు. పాశ్చాత్యతత్వం పై ఇక్బాల్ భావనలు, రాజకీయ భావనలు. జాతీయోద్యమంలో ఇక్బాల్ పాత్ర తెలుసుకోవటం ఈ పాఠం యొక్క లక్ష్యం.

విషయసూచిక :-


14.ఎ.1 ఇక్బాల్ ఆధునిక ఇస్లామ్

14.ఎ.2 పాశ్చాత్యతత్వం పై ఇక్బాల్ అభిప్రాయాలు

14.ఎ.3 ఇస్లాం మతతత్వం పై ఇక్బాల్ భావనలు

14.ఎ.4 రాజకీయ భావనలు

14.ఎ.5 జాతీయోద్యమంలో ఇక్బాల్ పాత్ర

14.ఎ.6 ముగింపు

14.ఎ.7 నమూనా ప్రశ్నలు

14.ఎ.8 చదువదగిన గ్రంథాలు


సారాంశం :-

ఆధునిక యుగంలో ముస్లిం సంస్కృతిలో వచ్చిన మార్పు 7వ శతాబ్ది రాజకీయాలకంటే భిన్నమైనది. ఇక్బాల్ మానవునిలో ఉన్న శక్తిని పెంపొందింపచేయడానికి పాశ్చాత్య నాగరికత కొంతవరకు దోహదం చేసినదని పేర్కొన్నాడు. ఇక్బాల్‌పై నిషే యొక్క ప్రభావం కూడ కొంతవరకు ఉంది. ఈయన శక్తికీ, క్రియాశీలతకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినాడు. ఇక్బాల్ 1905 లో తన 32వ ఏట కేంబ్రిడ్జి యూనివర్శిటీలో తాత్విక భావనలను అధ్యయనం చేసినాడు. మెక్‌టానర్ హెగెల్ వ్యాఖ్యాన కర్త యొక్క అభిప్రాయాలకు ఎక్కువగా ప్రభావితుడైనాడు. ఈయన 1908 నుండి 1934 మధ్యకాలంలో న్యాయవాద వృత్తిని చేపట్టి తన జీవనాన్ని కొనసాగించాడు. ఇక్బాల్ రాజనీతి తత్వంపై ఎక్కువ భాగం ఇస్లాం యొక్క ప్రభావం కలదు. ఇక్బాల్‌పై ఇస్లాం యొక్క ప్రభావం ఎక్కువగా ఉంది. సామాజిక పరమైన ఐక్యత మతపరమైన విశ్వాసం పైన ఆధారపడి ఉంటుంది. ఇది హేతుబద్ధమైన ఆలోచన కాదు. కేవలం మతపరమైనది. ఇక్బాల్ ముస్లింలను సామాజిక పునర్ నిర్మాణం కోసం ఇస్లాంను వదలి శాస్త్రీయ దృక్పథం వైపు ఆసక్తి చూపమని పేర్కొనలేదు. ఈయన యొక్క అభిప్రాయంలో ఖురాన్ భగవంతుని నుండి వచ్చిన ఆఖరి ప్రవచనం. ఇది సార్వజనీనమైనది. మహమ్మద్ ఆఖరి ప్రవక్త ఖురాన్ ప్రవచనాల నుండి ప్రవక్త యొక్క బోధనం నుండి మానవాళి మొత్తం తన గమ్యాన్ని చేరుకోగల్గుతారని చెప్పాడు. ముస్లింలు కష్టకాలంలో ఉన్నారని అది ఎంతోకాలం ఉండదనీ, 'రాత్రి చీకటి వెలసిపోయి సూర్యోదయ కాంతితో వెలుగు రేఖలు విరజిమ్మినట్లుగా తోటంతా తిరిగి తాహిద్ పాటతో నింపబడుతుందని వివరించాడు. ఇక్బాల్ మాటల కంటే చేతలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినాడు. భగవంతుడు ప్రపంచంలోనే ఉంటూ మనం ఎదుర్కొనే సమస్యలలో భాగాన్ని అనుభవిస్తూ, మనకు దూరంగా ఉంటూ ప్రపంచంలోని ప్రతి అణువులో నిక్షిప్తమై ఉన్నాడని పేర్కొన్నాడు. ఇక్బాల్ తనదైన శైలిలో ఇస్లాంను విశ్లేషించినాడు. ఆధునిక మానవాళి యొక్క

యొక్క సమస్యలను విప్లవాత్మకమైన మార్పుల ద్వారా పరిష్కరించవచ్చని పేర్కొన్నాడు. ఇక్బాల్ ఒక కవి. ఆయన యొక్క పద్య రచనల ఎక్కువ భాగం తాత్వికపరమైన సిద్ధాంతాలు మరియు మతపరమైన భావనలతో కూడుకొని ఉన్నాయి. మానవాళికి ఒకే ఒక అల్లా ఇస్లాం మతం ఉన్నలేకు మానవతా వాదం పైన నమ్మకంతో పేదల పట్ల ప్రేమతో అనేక పద్య కావ్యాలను రచించినాడు. ఇక్బాల్ ప్రపంచానికి ఒక సందేశకర్త. ఈయన పెట్టుబడిదారి విధానాన్ని విమర్శించినాడు. ఇక్బాల్ తన రచనలలో సోషలిజాన్ని మార్క్సిజాన్ని నాస్తిక భౌతికవాదాన్ని ఆధారం చేసుకొని ఉన్నాయని విమర్శించినాడు. కాని తన చివరి రచనలో మానవతా దృక్పథంతో కూడిన సామ్యవాదానికి దగ్గరయ్యాడు. ఇక్బాల్ మొదట జాతీయవాదిగా ఉండి హిందూస్థాన్ హమార అనే పద్య రచన చేయడం జరిగింది. భారతదేశం ప్రపంచంలో ఉన్నతమైనదనియు ఈ దేశంలో ఉన్న మత మట్టి పవిత్రమైనదనియు పొగడడం జరిగింది. ఈ పాలన ఇస్లాం సాంప్రదాయవాదాన్ని బలహీన పరుస్తుందని భావించినాడు. ఇస్లాంను తిరిగి వెలుగులోకి తీసుకొని రావడం ద్వారా మానవ పరిణామక్రమములో తిరిగి దాని పాత్రను నిర్వహించేలా చేయడం తన యొక్క కర్తవ్యమని పేర్కొన్నాడు. 1930 లో ఇక్బాల్ ముస్లింలీగ్‌లో అధ్యక్ష ఉపన్యాస ఐరోపావాసుల భావన అయిన మతాన్ని రాజకీయాలను వేరు చేయాలనే సిద్ధాంతాన్ని వ్యతిరేకించాడు. ఇక్బాల్ మార్టిన్ లూథర్ యొక్క ప్రొటెస్టెంట్ విప్లవం వలన విభజన అనేది ఐరోపా ఖండంలో జరిగినది. ఇది రాజ్యాల విభజనకు దారి తీసినది. ఇస్లాం సిద్ధాంతం ప్రకారం ముస్లింలకు ప్రతి రాజ్యం తమ రాజ్యమే ప్రతి రాజ్యము భగవంతుని రాజ్యమే అనే భావాన్ని ప్రచారం చేసినాడు. 1930 లో ఇక్బాల్ ఇస్లాం భగవంతుడు విశ్వం, ఆత్మ మరియు పదార్థం అనేది ఒక శరీరంలోని అంగాల వంటివి. ఇస్లాం యొక్క అభిప్రాయంలో పదార్థమే ఆత్మ అనియు ఇది కాలాన్ని ఎస్థిర్ణాన్ని చేరుకుంటుంది. ఇక్బాల్ తాత్కాలిక అంశాలను ఆత్మసంబంధమైన అంశాలను మిళితంచేయడానికి ప్రయత్నించినాడు. ఇక్బాల్ అభిప్రాయంలో కేవలం మతం ద్వారానే ప్రపంచంలో ముస్లింలు అందరికి ఐక్యతను సాధించవచ్చని పేర్కొన్నాడు. ఇక్బాల్ ఇస్లాం అంతర్జాతీయవాదాన్ని అభివృద్ధి పరచినాడు. ఇక్బాల్ కేవలం ప్రపంచ వ్యాప్తంగా ఇస్లామిక్ ఐక్యతకు గూర్చి మాత్రమేకాక భరతదేశంలో ముస్లింలకు ప్రత్యేక స్థానం కావాలని పేర్కొన్నాడు. 1909లో ఉమ్మడి జాతీయతా వాదం భారతదేశానికి అత్యావశ్యకమని పేర్కొన్నాడు. 1909 లో అయిన ముస్లింలీగ్ కమిటీకి ఛైర్మన్‌గా ఎన్నికైనాడు. ముస్లింలకు ప్రత్యేక రాజ్యం ద్వారానే ముస్లింమేతర ఆధిక్యం నుండి ముస్లింలను కాపాడి ప్రశాంత జీవనాన్ని కొనసాగించడానికి అవకాశం ఉందని పేర్కొన్నాడు. చివరికి ఇక్బాల్ ఆశయసాధనకు అనుగుణంగా 1940 లో ముస్లిం లీగ్ పాకిస్థాన్ తీర్మానాన్ని చేయడం జరిగినది. ఇక్బాల్ ముస్లింలకు చేసిన సేవలు అపారమైనవి.

### 14.ఎ.1. ఇక్బాల్ ఆధునిక ఇస్లామ్ :

భారతదేశంలో బ్రిటీష్ వారికంటే ముందు ముస్లింల యొక్క ప్రభావం విశేషంగా ఉండి. భారతీయ ముస్లింలలో బ్రిటీన్‌ను ముదటిసారిగా సందర్శించినది అబూతాలిబ్. భారతీయ ముస్లిం నాయకులు బ్రిటీష్ వారి పాలనలో లోపాలను ఎత్తిచూపడం ద్వారా వారి విధాన ప్రక్రియలో మార్పును సాధించలేకపోయినారు. వారు అనుసరించిన విభజించి పాలించు విధానాన్ని అల్పసంఖ్యాక వర్గంగా ఉన్న ముస్లింలు సమర్థించడం జరిగినది. దీని యొక్క ప్రభావం భారతజాతి సమగ్రతను దెబ్బతీసినది. ఈ విధానం భారతదేశంలో వేర్పాటువాదాన్ని బలపరచినది. ముస్లిం నాయకులలో ప్రముఖులు సైయ్యద్ అహమ్మద్, మహమ్మద్‌అలీ రహమత్ అలీ, ఇక్బాల్, జిన్నా, ఆజాద్ మొదలైనవారు.

### 14.ఎ.2 పాశ్చాత్యతత్వం పై ఇక్బాల్ అభిప్రాయాలు:

ఆధునిక ముస్లిం జాతీయ నాయకులలో మహమ్మద్ ఇక్బాల్ మరియు మహమ్మద్ అలీ జిన్నా ప్రముఖులు. ఆధునిక యుగంలో ముస్లింల సంస్కృతిలో వచ్చిన మార్పు 7వ శతాబ్ది రాజకీయాల కంటే భిన్నమైనది. ఇక్బాల్ ఐరోపాలో ఉన్నప్పుడు ఐరోపావాసుల యొక్క చాకచక్యానికి, క్రియాశీలతకు ప్రభావితుడైనాడు. ఇది మానవ జీవితంపై విశేషమైన ప్రభావాన్ని చూపుతుందని పేర్కొన్నాడు. ఇక్బాల్ మానవునిలో ఉన్న శక్తిని పెంపొందింపచేయడానికి పాశ్చాత్య నాగరికత కొంత వరకు దోహదం చేసినదని పేర్కొన్నాడు. ఇక్బాల్‌పై

నిషే యొక్క ప్రభావం కూడా కొంతవరకు ఉంది. ఈయన ప్రధానంగా నిషే వెల్లడి చేసిన సూపర్‌మేన్ యొక్క ప్రభావం వలన ఈయన సర్వోత్కృష్టతకు, ఆచార వ్యవహారాలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇవ్వలేదు. ఈయన శక్తికి, క్రియాశీలతకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినాడు.

ఇక్బల్ 1905 లో తన 32 వ ఏట కేంబ్రిడ్జ్ యూనివర్శిటీలో తాత్విక భావనలు అధ్యయనం చేసినాడు. అక్కడ ఈయన మెక్‌టాగర్ట్ హెగెల్ వ్యాఖ్యానకర్త యొక్క అభిప్రాయాలకు ఎక్కువగా ప్రభావితుడైనాడు. ఈయన మ్యూనిచ్‌లో **(The Development in Metaphysics)** అనే సిద్ధాంత వ్యాసాన్ని వ్రాసినాడు. తరువాత ఈయన 1908లో భారతదేశానికి రావడం జరిగినది. లాహోర్‌లోని ఓరియంటల్ కాలేజీలో ఉపన్యాసకునిగా కొంతకాలం పనిచేయడం జరిగినది. 1911లో ఉపన్యాస వృత్తిని వదిలివేసి తన అభిరుచికి తగిన రచనా వ్యాసాంగం పై ఆసక్తిని కన్పరచినాడు. ఈయన 1908 నుండి 1934 మధ్యకాలంలో న్యాయవాద వృత్తిని చేపట్టి తన జీవనాన్ని కొనసాగించినాడు. దీనితోపాటుగా ఉర్దూ మరియు పర్షియన్ భాషలలో కవిత్వాన్ని వ్రాయడం జరిగినది. ఈయన వ్రాసిన అస్‌రార్-ఇ-ఖుదా అనే పెద్ద పద్య సంకలనాన్ని నికల్‌సన్ 1920లో ఆంగ్లభాషలో తర్జుమా చేయటం జరిగినది.

ఇక్బల్ ఒకవైపు ఐరోపావాసుల యొక్క స్థిరత్వాన్ని, క్రియాశీలతను ప్రశంశిస్తూనే మరియొకవైపు పెట్టుబడీదారీ సమాజంలో ఆత్మవినాశనకరమైన ఆత్మ న్యూనతాభావం వ్యక్తి జీవితంపై విరక్తి కల్గేలా చేసినదని పేర్కొన్నాడు. ఈ పెట్టుబడి ద్వారా సమాజంలో వ్యక్తికి వ్యక్తికి మధ్యన రాజ్యానికి రాజ్యానికి మధ్యన పశుప్రాయమైన పోటీ ఉందని పేర్కొనడం జరిగినది. అందువలన ఇక్బల్ ఐరోపా రాజకీయ సంస్కృతిని వారి జీవన విధానాన్ని అంగీకరించలేదు. ఇక్బల్ రాజనీతితత్వంపై ఎక్కువభాగం ఇస్లాం యొక్క ప్రభావం కలదు. పాశ్చాత్య రాజనీతి తత్వవేత్తల ప్రభావం కూడా కొంతవరకు కలదు. వీరిలో ప్రధానంగా నిషే విలియం జేమ్స్, హెన్రి బెర్గ్‌సన్ భావనల యొక్క ప్రభావం ఇక్బల్‌పై కలదు. ఇక్బల్‌పై ఇస్లాం యొక్క ప్రభావం ఎక్కువగా ఉంది. సామాజికపరమైన ఐక్యత మతపరమైన విశ్వాసంపైన ఆధారపడి ఉంటుందని పేర్కొన్నాడు. ఇది హేతుబద్ధమైన ఆలోచన కాదు కేవలం మతపరమైనది.

### 14.ఎ.3 ఇస్లాం మతతత్వం పై ఇక్బల్ భావనలు:

ఇక్బల్ ముస్లింలను సామాజిక పునర్ నిర్మాణం కోసం ఇస్లాంను వదలి శాస్త్రీయ దృక్పథం వైపు ఆసక్తి చూపమని పేర్కొనలేదు. ఈయన యొక్క అభిప్రాయంలో ఖురాన్ భగవంతుని నుండి వచ్చిన అఖరి ప్రవచనం. ఇది సార్వజనీనమైనది. ఇది మిగిలిన అన్ని మతాల కంటే ఉన్నతమైనది. మహమ్మద్ ఆఖరి ప్రవక్త. ఖురాన్ ప్రవచనాల నుండి ప్రవక్త యొక్క భోదనల నుండి మానవాళి మొత్తం తమ గమ్యాన్ని చేరుకోగల్గుతారని పేర్కొన్నాడు. ఇక్బల్ తాను ముస్లింనని గర్వించినాడు. ముస్లింలు ప్రపంచ విజేతలనియు ప్రపంచాన్ని ప్రేమించ గల్గిన వారనియు పేర్కొన్నాడు. కాని ఆధునికయుగంలో ముస్లింలు కష్టకాలంలో ఉన్నారని పేర్కొన్నాడు. ఇది ఎంతోకాలం కొనసాగదని "రాత్రి చీకటి వెలిసిపోయి సూర్యోదయ కాంతి వెలుగు రేఖలు విరజిమ్మినట్లుగా తోటంతా తిరిగి **(Unity of God)** తాహిద్‌పాటతో నింపబడుతుందని" భావుకతతో వివరించడం జరిగినది.

ఇక్బల్ అభిప్రాయంలో ఇస్లామ్ చురుకైన సామాజిక చర్యలను సమర్ధిస్తుందని పేర్కొన్నాడు. ఈయన సూఫిజాన్ని, గ్రీకు తత్వాన్ని వ్యతిరేకించినాడు. ఇవి రెండు పూర్తిగా ఆధ్యాత్మిక ప్రపంచాన్ని సమర్ధించినవనియు దీనివలన ప్రాపంచిక సంబంధమైన కోర్కెలన్నింటికి అతీతంగా ఉండేలా చేస్తుందని అందువలన మానవునిలోని సృజనాత్మక శక్తి లోపించి మానవుని నిర్వీర్యుని చేస్తుందని పేర్కొన్నాడు. ఇక్బల్ మాటల కంటే చేతలకు ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినాడు.

ఇక్బల్ భగవంతుడు మానవతీతుడనియు ఈ ప్రపంచానికి భిన్నంగా సర్వోత్కృష్టమైన స్థితిలో ఉన్నాడన్న భావనను వ్యతిరేకించినాడు. దీనికి భిన్నంగా భగవంతుడు భూమండలానికి వెలుపల లేడనియు ఆయన ఈ ప్రపంచంలోనే ఉంటూ మనం ఎదుర్కొనే సమస్యలలో భాగాన్ని ఆయన అనుభవిస్తూ మన జీవితాలన్నింటిని గమనిస్తూ ఉంటాడు. మనకు దూరంగా ఉంటాడనియు మనకోసం ఉన్నాడనియు ఆయన ప్రపంచంలోని అణువణువులో నిక్షిప్తమై ఉన్నాడనియు పేర్కొన్నాడు. ఆయన చంద్రకాంతిలో ప్రతిబింబిస్తాడనియు మన అందరి గృహాలపైన ఆయన దృష్టి ఉంటుందని పేర్కొన్నాడు.

ఇక్బల్ తనదైన శైలిలో ఇస్లాంను విశ్లేషించినాడు. ఇస్లాం తత్వంలో విప్లవాత్మకమైన మార్పులను తీసుకొని రావడం ద్వారా ఆధునిక మానవాళి యొక్క సమస్యలను పరిష్కరించవచ్చునని పేర్కొన్నాడు.

ఇక్బల్ కవియేకాని తత్వవేత్తకాదు. ఈయన యొక్క పద్య రచనలు ఎక్కువభాగం తాత్వికపరమైన సిద్ధాంతాలు మరియు మతపరమైన భవనలతో కూడుకొని ఉన్నాయి. ఈయన సూఫీ అయినప్పటికి సూఫీ సిద్ధాంతాన్ని వ్యతిరేకించినాడు.

## 14.ఎ.4. రాజకీయ భావనలు:

ఇక్బల్ యొక్క అభిప్రాయంలో నాస్తిక భౌతికవాదం మరియు మితిమీరిన జాతీయవాదం ఆధునిక యూరప్‌కు శాపంగా పరిణమించినది. ఇక్బల్ వీటిని వ్యతిరేకించి ఆధ్యాత్మికతకు ఆధారంగా ఉన్న ఇస్లాంపై విశ్వాసాన్ని ఉంచినాడు. ఆధునిక మానవుడు తన మితిమీరిన మేధాసంపత్తితో ప్రశాంతంగా జీవించలేక పోవుచున్నాడు. ఆర్థిక రాజకీయ జీవితంలో మానవుడు ఎల్లప్పుడు ఇతరులతో పోరాడవలసిన పరిస్థితి ఏర్పడినది. ఆధునిక ముస్లింలు టర్కి ఈజిప్ట్, పెర్షియాలు దేశభక్తి మరియు జాతీయవాదంపై ఆకర్షితులైనారు. ఈవిధమైన మార్పును నిషే వారి యొక్క బలహీనతగా వివరించినాడు. ఇది అహేతు బద్ధమైనదనియు మరియు సంస్కృతికి భిన్నమైనదనియు పేర్కొన్నాడు. వీరు సనాతన మతం పట్ల విశ్వాసాన్ని కోల్పోవడం వలన కొంతమంది సామ్యవాదం వైపు మొగ్గచూపడం జరిగినది. నాస్తిక భావనలతో కూడిన సామ్యవాదాన్ని ఆధారం చేసుకొని హెగెల్ యొక్క తాత్విక భావనలు, ఇక్బల్ వాదన ప్రకారం జాతీయవాదం, నాస్తిక సామ్యవాదం మానసిక వత్తిడులను, ద్వేషాన్ని, అనుమానాన్ని రేకెత్తింపచేసినది. కనుక ఈ భావనలు సంపూర్ణమైనవి కాదు. అసంతృప్తిని కల్గించే భావనలుగా ఉన్నాయి. మానవాళికి ఒకే ఒక ఆశ నిజమైన మతం . ఇది పిడి వాదం కాదు. మరియు ఆచారాన్ని ఆధారం చేసుకొని పనిచేయలేదు. ఆ విధమైన మతం మాత్రమే ఆధునిక శాస్త్రీయ యుగంలో ఎదుర్కొనే సవాళ్ళను అధిగమించి మానవునిలో విశ్వాసాన్ని పెంచేదిగ ఉండాలి. దీని ద్వారానే వ్యక్తి యొక్క వ్యక్తిత్వ వికాశం పెంపొందే అవకాశం ఉందని పేర్కొన్నాడు.

ఇక్బల్ మానవతావాదం పైన నమ్మకంతో పేదల పట్ల ప్రేమతో అనేక పద్య కావ్యాలను రచించినాడు. ఇక్బల్ వాస్తవానికి ఒక సారస్వతవేత్త కాని రాజకీయ నీతిజ్ఞుడు కాదు. ఈయన పెట్టుబడిదారీ విధానాన్ని విమర్శించినాడు. అలా అని చెప్పి ఈయన సామ్యవాది కాదు. ఇక్బల్ ఖురాన్‌పై విశ్వాసం ఉంచినాడు. దీని ప్రకారం భగవంతుడు భూమిని అందరికోసం సృష్టించినాడు. అందువలన భూస్వాముల యొక్క పెత్తందారీతనాన్ని నిశితంగా విమర్శించినాడు. ఇక్బల్ రాజకీయాలను ఆర్థికపరమైన అంశాలను, మతాన్ని దృష్టిలోపెట్టుకొని విశ్లేషించడం జరిగినది. ఇక్బల్ తన తొలి రచనలలో సోషలిజాన్ని మార్క్సిజాన్ని, నాస్తిక భౌతిక వాదాన్ని ఆధారం చేసుకొని ఉన్నాయని విమర్శించినాడు. కాని తన చివరి రచనలలో మానవతా దృక్పథంతో కూడిన సామ్యవాదానికి దగ్గరయ్యాడు.

ఇక్బల్ మొదట జాతీయవాదిగా ఉండి హిందూస్థాన్ హమారా అనే పద్యరచన చేయడం జరిగినది. ఈ రచన భారతదేశంలో ఇప్పటికి ప్రాధాన్యతను సంతరించుకొన్నది. భారతదేశం ప్రపంచంలో ఉన్నతమైనదనియు. ఈ దేశంలో ఉన్న మట్టి పవిత్రమైనదనియు పొగడుట జరిగినది.

కాని ఆయన యూరప్‌ను సందర్శించిన తరువాత ఇస్లాం మతోన్మాదిగా మారినాడు. చైనా, అరేబియా మరియు ఇండియా మావి అని పేర్కొన్నాడు. మేము ముస్లింలము ఈ ప్రపంచం మొత్తం మాది అని కూడా ప్రకటన చేసినాడు. ఈయన దేశభక్తిని జాతీయవాదాన్ని కూడా విమర్శించినాడు. ఇది కూడ ఒకరకమైన విగ్రహారాధన వంటిదని పేర్కొన్నాడు. ఇస్లాం అనేది ఒక మతం కాదు. ఒక తెగ. ఈ ఇస్లాంలో ఉన్న సహోదర భావాన్ని పొగిడి భారతదేశంతో విభిన్న మతాలతో కూడిన జాతీయవాదాన్ని తూలనాడినాడు. ఇక్బల్ హిందూపాలనకు భయపడినాడు. ఈ పాలన ఇస్లాం సాంప్రదాయవాదాన్ని బలహీన పరుస్తుందని భావించినాడు. ఇస్లాం ఈ ప్రపంచంలో విగ్రహారాధనను అణచివేయడానికి ఉందని పేర్కొన్నాడు. ఈ ఆశయాన్ని ముస్లింలు తప్పక నెరవేర్చగలరని పేర్కొన్నాడు.

ఇక్బల్ అభిప్రాయంలో ఇస్లాం జాతీయవాదానికి వ్యతిరేకి. వారి అభిప్రాయంలో జాతీయవాదం మానవాళికి గొప్ప శత్రువని పేర్కొన్నాడు. ఇది జాతివిచక్షణా విధానంపై ఆధారపడి ఉందనియు ఇది ఇస్లాం ప్రపంచాన్ని మరియు ముస్లింల యొక్క అస్తిత్వాన్ని దెబ్బ తీస్తుందని పేర్కొన్నాడు. ఈయన యొక్క అభిప్రాయంలో ఇస్లాం మానవతా దృక్పథానికి అనుకూలంగా ఉండి దాని యొక్క శ్రేయస్సును కాంక్షిస్తుందని పేర్కొన్నాడు. ఇస్లాంను తిరిగి వెలుగులోకి తీసుకొని రావడం ద్వారా మానవపరిణామ క్రమంలో తిరిగి దానిపాత్రను నిర్వహించేలా చేయడం తన యొక్క కర్తవ్యమని పేర్కొన్నాడు.

ఆధునిక ముస్లిం సిద్ధాంత కర్తలు మతాన్ని రాజకీయాల నుండి వేరు చేయాలనే భావనను వ్యతిరేకించినాడు. 1930లో ఇక్బల్ ముస్లింలీగ్ అధ్యక్ష ఉపన్యాసంలో ఐరోపావాసుల భావన అయిన మతాన్ని రాజకీయాలను వేరుచేయాలన్న సిద్ధాంతాన్ని వ్యతిరేకించినాడు. ఇది ఇస్లాం మతసిద్ధాంతం కాదని పేర్కొన్నాడు.

ఇక్బల్ మార్టిన్ లూథర్ యొక్క ప్రొటెస్టెంట్ విప్లవం వలన విభజన అనేది ఐరోపా ఖండంలో జరిగినది. ఇది వారిలో జాతీయతా దృక్పథాన్ని పెంపొందించడం జరిగినది. ఇది రాజ్యాల విభజనకు దారితీసినది. ఇది ఇస్లాం సిద్ధాంతానికి వ్యతిరేకం. ఇస్లాం అనేది జాతీయ మానవ సిద్ధాంతాన్ని ప్రచారం చేసినది. ఇస్లాం సిద్ధాంతం ప్రకారం ముస్లింలకు ప్రతిరాజ్యం తమ రాజ్యమే ప్రతిరాజ్యం భగవంతుని రాజ్యమే అనే భావాన్ని ప్రచారం చేసినాడు.

1930లో ఇక్బల్ ఇస్లామ్ భగవంతుడు విశ్వం ఆత్మ మరియు పదార్థం అనేవి ఒక శరీరంలోని అంగాల వంటివి అని మానవుడు ఆత్మీయ ప్రపంచం కోసం భౌతిక ప్రపంచాన్ని త్యజించేవాడు కాదు. ఇస్లాం యొక్క అభిప్రాయంలో పదార్థమే ఆత్మ అనియు ఇది కాలాన్ని విస్తీర్ణాన్ని చేరుకొంటాడు. కాని యూరోపియన్లల అభిప్రాయంలో ఆత్మ పదార్థం రెండు ద్వంద్వ భావనలని పేర్కొన్నాడు.

ఇక్బల్ తాత్కాలిక అంశాలను ఆత్మసంబంధమైన అంశాలను మిళితం చేయడానికి ప్రయత్నించినాడు. ఐరోపావాసులు సమర్థించిన లౌకిక తత్వాన్ని వ్యతిరేకించినాడు . వారు చర్చిని, రాజ్యాన్ని వేరు చేసినారు. ఖురాన్ రాజ్యాన్ని మతాన్ని నీతిని రాజకియాలను ఒకదానితో ఒకటి కలిసి పనిచేస్తాయని పేర్కొన్నాడు. ఇదేవిధంగా ప్లేటో రిపబ్లిక్‌లో పేర్కొన్నాడు.

యూరోపియన్ల అభిప్రాయంలో మతమనేది వ్యక్తిగతమైన అంశం . ఇస్లాం మతం ఆత్మ పదార్ధ ద్వందాలను గూర్చి వివరించటం జరిగినది. ఇక్బల్ ఇస్లాం ప్రకారం మనిషిని మతాన్ని వేరు చేయలేదు.

ఇక్బల్ అభిప్రాయంలో కేవలం మతం ద్వారానే ప్రపంచంలో ముస్లింలు అందరి ఐక్యతను సాధించవచ్చని పేర్కొన్నాడు. ఇక్బల్ ఇస్లాం అంతర్జాతీయతావాదాన్ని అభివృద్ధి పరచినాడు . జవహర్‌లాల్ నెహ్రూ ఐక్యత ఇక్బల్ యొక్క భావనలను తనవ్యాసమైన సాలిడార్ ఆఫ్ ఇస్లాం లో 1935లో నిశితంగా విమర్శించడం జరిగినది. ఇందులో ఈయన టర్కులు టురేనియన్ జాతిని చూసి గర్వించినారు. ఇరానియన్లు తమ యొక్క పురాతనజాతి సంప్రదాయాన్ని చూసి గర్వించేవారు. ఈజిప్షియన్లు సిరియన్లు పాలస్తీనియన్లు మరియు ట్రాన్స్ జోర్డాన్‌లో అరబ్బుల ఐక్యత కోసం కలలు కనడం జరిగినది. ఈ రాజ్యాలన్ని ప్రస్తుతం ఐక్యతను సాధించినవా అని ప్రశ్నించడం జరిగినది. సెంట్రల్ ఆసియాలో సోవియట్‌లో కొన్ని భాగాలలోను చైనాలో కొన్ని భాగాలలోను జాతీయతా భావం పెల్లుబుగుతున్నది. మహమ్మద్ ఇక్బల్ మతప్రాతిపదికగా జాతికి ఎక్కువ ప్రాధాన్యతను ఇచ్చినాడు. ఇక్బల్ కేవలం ప్రపంచవ్యాప్తంగా ఇస్లామిక్ ఐక్యతను గూర్చి మాత్రమే కాక భారతదేశంలో ముస్లింలకు ప్రత్యేక స్థానం కావాలని పేర్కొన్నాడు. 1909లో ఉమ్మడి జాతీయతా భావం భారతదేశానికి అత్యావశ్యకమని పేర్కొన్నాడు.

బెంగాల్ విభజనకు వ్యతిరేకంగా ఆందోళనను ఇక్బల్ సమర్ధించలేదు. కర్జన్ ముస్లింలకు కొన్ని ప్రత్యేక రాయితీలను కల్పించడానికి అంగీకరించి ఆయన ముస్లింలను సమర్థించేవాడుగా మారినాడు. ఆ విధంగా బ్రిటీష్‌వారు విభజించి పాలించు ధోరణికి బీజాన్ని నాటారు. 1909లో ఆయన ముస్లింలీగ్‌లో ప్రజాసంచలనం కమిటీకి ఛైర్మన్‌గా ఎన్నికైనాడు. ఇక్బల్ ఐరోపా తిరిగి వచ్చిన తరువాత ఒక దశాబ్ది కాలం పాటు పద్యరచన సాగించినాడు. ప్రతి సంవత్సరం ఇక్బాల్ అంజుమన్ హరియత్ ఇస్లాం సమావేశాలలో తన పద్యాలను చదివి వినిపించేవాడు.

అలీ సోదరులు నిర్వహించి కిలాఫత్ ఉద్యమంలో జిన్నాతో ఇక్బల్ ఒక్కడే దానిని వ్యతిరేంచినాడు. ఇక్బల్ ఒక్కడే దానిని వ్యతిరేకించినాడు. ఇక్బల్ సహాయనిరాకరణోద్యమంలో భాగస్వామ్యం వహించలేదు. డిసెంబర్ 1920లో సహాయనిరాకరణోద్యమం ఒక మతపరమైన బాధ్యతగా భావించినాడు. ఇక్బల్ దృష్టిలో ఇది ఇస్లాంలోని హరియత్‌కు వ్యతిరేకంగా ఉందని పేర్కొన్నాడు. ఈయన సహాయ నిరాకరణ ఉద్యమాన్ని సమర్ధించలేదు.

## 14.ఎ.5 జాతీయోద్యమంలో ఇక్బల్ పాత్ర:

ఇక్బల్ రాజకీయాలలో క్రియాశీలక పాత్రను నిర్వహించినది 1927 నుండి. అప్పట్లో ఈయన బెంగాల్ లెజిస్లేటివ్ అసెంబ్లీకి సభ్యునిగా ఎంపిక కాబడినాడు. అదే సంవత్సరంలో సైమన్ కమీషన్‌ను బ్రిటీష్ ప్రభుత్వం రాజ్యాంగపరమైన సంస్కరణలను రూపొందించడానికి నియమించడం జరిగినది. కాంగ్రెస్ ఈ కమిషన్‌ను వ్యతిరేకించినది. ముస్లింలీగ్‌లో ఈ అంశంపై భేదాభిప్రాయాలు తలెత్తినవి. జిన్నా సైమన్ కమిషన్‌ను వ్యతిరేకించినాడు. ఇక్బల్ సర్‌సయ్యషఫీ అనుకూలంగా ఉన్నారు. ఆయనను ముస్లింలీగ్ సెక్రటరీగా చేయడం జరిగినది. జూన్ 1928లో ఇక్బల్ ఆ పదవికి రాజీనామా చేసినారు. దీనికి కారణం ముస్లింలీగ్ ప్రాంతీయ స్వయం ప్రతిపత్తిని కోరడానికి అంగీకరించలేదు. ఈ తిరస్కారాన్ని ఇక్బల్ తీవ్ర అసంతృప్తికి గురిఅయినాడు.

1928 మోతీలాల్ నెహ్రూ నివేదికలో ముస్లింలకు ప్రత్యేక నియోజక వర్గ ఏర్పాట్లను అంగీకరించికపోవడం కూడా ముస్లింల వేర్పాటు వాదానికి ప్రధాన కారణం. దీనిని ఆధారం చేసుకొని 1930లో ముస్లిం ఇండియా స్థాపనను ఏర్పాటు చేయడం చేయవలసిన అవశ్యకత కలదని ముస్లింలీగ్ అధ్యక్ష ఉపన్యాసంలో చెప్పడం జరిగినది. ఈ ముస్లిం ఇండియాలో ఉండే రాష్ట్రాలను పంజాబ్ నార్తవెస్ట్ ఫ్రాంటియర్ ప్రోవిన్స్ సింద్ బలూచిస్తాన్ కలిపి ఒక రాష్ట్రంగా చేయాలని పేర్కొన్నాడు. ఇక్బల్ అభిప్రాయంలో ఉత్తర తూర్పు భారత ముస్లిం రాజ్యస్థాపనయే ముస్లిం యొక్క ప్రధాన లక్ష్యం. హిందువులలో ఒకేవిధమైన ఆలోచనా సరళి లోపించినది. 70 మిలియన్ల ముస్లింలు ఒకే విధమైన ఆలోచనా సరళిలో ఉన్నారు. వారు మిగిలిన భారతీయుల కంటే భిన్నమైన రీతిలో వ్యవహరించేవారు.

1930లో ఇక్బల్ ఉమ్మడి ఉత్తర తూర్పు ముస్లింల రాజ్యానికి స్పష్టత చేకూరలేదు. ఈయన ముస్లింల రాజ్యాలన్నింటిని పూర్తిగా భారతదేశం నుండి వేరు చేయాలా లేక భారత దేశంలోనే ముస్లింల ప్రావిన్సులన్నింటిని ఒక శక్తివంతమైన విభాగంగా ఏర్పాటు చేయాలా అనే విషయంలో స్పష్టమైన నిర్ణయం తీసుకొనలేకపోయినాడు. డిసెంబర్ 1933లో దేశ పునర్ విభజనను మతపరమైన సాంస్కృతికపరమైన మరియు చారిత్రకపరమైన అంశాలను ఆధారంగా చేసుకొని చేయాలని పేర్కొన్నాడు. మార్చి 1937 లో జిన్నాకు వ్రాసిన లేఖలో నెహ్రూ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉండి ముస్లింల సమస్యలను సోషలిజం ద్వారానే సమస్యలను పరిష్కరించవచ్చని వారిని ప్రక్కత్రోవ పట్టించినాడని విమర్శించినాడు.

ఇక్బల్ జిన్నాకు ఒక సలహాను ఇచ్చినాడు. ముస్లింల యొక్క ప్రధాన సమస్య ఆర్థిక సమస్య కాదు. సాంస్కృతికపరమైన మార్పు చాలా అవసరమని పేర్కొన్నాడు. నెహ్రూ ఆర్థికపరమైన విధానం ముస్లింల సాంస్కృతికపరమైన ఐక్యతను దెబ్బతీసేదిగా ఉందని పేర్కొన్నాడు. ఇక్బల్ చనిపోయే ఒక సంవత్సరానికి ముందు 1937వ సంవత్సరంలో నూతన రాజ్యాంగం ఏకసమాఖ్య రాజ్యాంగం పూర్తిగా ఆశారహితంగా ఉందని పేర్కొన్నాడు. ముస్లింలకు ప్రత్యేక రాజ్యం ద్వారానే ముస్లిమేతర అధిక్యం నుండి ముస్లింలను కాపాడి ప్రశాంత జీవనాన్ని కొనసాగించడానికి అవకాసం ఉందని పేర్కొన్నాడు.

## 14.ఎ.6 ముగింపు :-

జిన్నా ఇక్బల్ నడిచిన బాటలోనే నడవడం జరిగినది. చివరికి ఇక్బల్ ఆశయ సాధనకు అనుగుణంగా 1940లో ముస్లింలీగ్ పాకిస్తాన్ తీర్మానాన్ని చేయడం జరిగినగి. ఇక్బల్ ముస్లింలకు చేసిన సేవలు అపారమైనవి. ఆయన మిగిలినవారి కంటే ఉత్తమోత్తముడు అని పేర్కొన్నాడు.

14.ఎ.7 చదవదగిన గ్రంథాలు :-


1. Iqbal his Poetry and Message - Ali SA Qutub Khan
2. Iqbal as a thinker - Md. Asherof
3. Reconstruction of religious thought in Islam - Md. Iqbol
4. Modern Indian political thought - Sankar Ghosh
5. A study of Iqbal's philosophy - Dar B.A.
6. Modern Indian Political Thought - Sankar Ghosh
7. Modern Indian Political Thought - VP varma


డా॥ యల్. శారద

పాఠం - 15

# జవహర్‌లాల్ నెహ్రూ

## (నవంబరు 14, 1889 - మే 27, 1964)

### 15.0 లక్ష్యం :-

నెహ్రూ నవ భారత నిర్మాతగా, శాంతిదూతగా కీర్తింపబడేవాడు. ప్రజాస్వామ్యమునకు అవసరమగు ఆవశ్యకతలు గూర్చి నెహ్రూ లౌకికవాదము, జాతీయ, అంతర్జాతీయ వాదము గూర్చి, ఆయన ప్రతిపాదించిన అలీన విధానము, పంచశీల విధానము గూర్చి తెలుసుకొనుట ఈ పాఠం యొక్క లక్ష్యం.

### విషయసూచిక :-


15.0 లక్ష్యం

15.1 పరిచయం

15.2 బాల్యం, విద్యాభ్యాసము, ప్రభావము

15.3 తాత్విక పునాదులు

15.4 చారిత్రకతత్వము

15.5 నెహ్రూ - ప్రజాస్వామ్యము

15.6 ప్రజాస్వామ్యము - ఆవశ్యకతలు

15.7 సమానత్వము

15.8 స్వాతంత్రము మరియు సమానత్వము

15.9 స్వేచ్ఛ (స్వాతంత్రము) సమానత్వములు - రాజకీయ సామాజిక మరియు ఆర్థిక విర్మితులు

15.10 రాజకీయ పార్టీలు

15.11 సమన్వయ పాలన

15.12 శాంతియుత సాధనాలు

15.13 సామాజిక ఆర్థిక విర్మితులు

15.14 ప్రజాస్వామ్యము - విద్య

15.15 నెహ్రూ లౌకికవాదము

15.16 మత విషయాలలో రాజ్య తటస్థ వైఖరి

15.17 మతేతర సాంఘిక జీవనము

15.18 సామ్యవాదము/ఆర్థికాంశాలు

15.19 నెహ్రూ - జాతీయవాదము

15.20 నెహ్రూ అంతర్జాతీయవాదము

15.21 అలీన విధానము

15.22 పంచశీల

15.23 సారాంశం

15.24 మాదిరి ప్రశ్నలు

15.25 ఆధార గ్రంథాలు

## 15.1 పరిచయం :-

ఆధునిక భారత తత్వ విచారమునకు అమూల్య సేవలందించినప్పటికి, సాంప్రదాయానుసారంగాను మరియు పాశ్చాత్య దృక్కోణంలోను నెహ్రూను రాజనీతి తత్వవేత్తగా పరిగణించరు. ఆయనను గుర్తింపు పొందిన ఆలోచనాపరునిగాను, కార్యదీక్షాపరుని గాను, భారత సాంస్కృతిక ఉద్యమ మరియు జాతీయ ఉద్యమ ఫలితంగా ఆవిర్భవించిన జాతీయ నాయకునిగాను పరిగణించుట కద్దు (పరిపాటి).

20వ శతాబ్దంలో చలామణిలో వున్న తాత్విక ఆలోచనలన్నింటి పైనా నెహ్రూ దృష్టి మళ్ళించాడు. నెహ్రూ ఆలోచనలలో వ్యక్తి అభ్యున్నతికి మరియు మానవ హక్కులకు ప్రాధాన్యతనిచ్చే పాశ్చాత్య సాంప్రదాయ ఉదారవాద ప్రభావము, ఫేబియన్ సామ్యవాద ప్రభావముతో శాస్త్రీయ సామ్యవాదం పై విశ్వాసం ప్రబలి ఆయనలో బలపడిన వర్గరహిత సమాజ స్థాపన ఆశయము ప్రధానంగా కన్పిస్తుంది. తన ఆలోచనలను కార్యాచరణలోకి తీసుకు వచ్చేందుకుగాను గాంధీ ప్రభావముతో అహింసాయుత సాధనాలను ఎంచుకొనుట జరిగింది. నెహ్రూ రాజనీతి భావ జాలంలో ప్రజాస్వామ్యము, సామ్యవాదము, జాతీయ వాదము మరియు అంతర్జాతీయ వాదములు ప్రధానంగా కన్పిస్తాయి.

నెహ్రూ రాజకీయ భావాలు ప్రధానంగా Glimpses of World History (1934 - 35), Autobiography (1936), The Discovery of India (1940) మరియు ఆయన పలు వ్యాసాలు, పార్లమెంటు వెలుపట లోపట చేసిన ప్రసంగాల ద్వారా లభిస్తాయి.

## 15.2 బాల్యము, విద్యాభ్యాసము, ప్రభావము :-

నవ భారత నిర్మాతగా, శాంతి దూతగా, నిష్కళంక దేశభక్తునిగా, ప్రజాస్వామ్యవాదిగా, భారత తొలి ప్రధానిగా కీర్తించబడే జవహర్‌లాల్ నెహ్రూ, 1889 నవంబరు 14న, అలహాబాదులో (U.P.) మోతీలాల్ నెహ్రూ, స్వరూప రాణి దంపతులకు జన్మించారు. ఈయనకు ప్రారంభ విద్యాభ్యాసము ఇంటి వద్దనే 'ఫెర్డినాండ్ . టి. బ్రూక్స్' (దివ్యజ్ఞాన సమాజ సభ్యుడు) నేతృత్వంలో జరిగింది. ఈ ఉపాధ్యాయుని ప్రభావమును బట్టి నెహ్రూకు సాహిత్యం, పద్యభాగముల పై అభిరుచి పెరిగి 'Scott, Dickens, Thackeray, H.G. Wells, Mark Twain' వంటి వారి రచనలు విస్తృతంగా అధ్యయనం చేశారు. ఈయన ప్రభావం వల్లనే నెహ్రూకు శాస్త్ర విజ్ఞానం పట్ల (Science) మరియు ఆధ్యాత్మిక (మత) విషయాల పట్ల ఆసక్తి పెరిగింది. అనంతరం హిందూమతం పై ఆసక్తి పెరిగి, మక్కువతో ఉపనిషత్తులను, భగవద్గీతను మరియు బౌద్ధమత సాహిత్యమును నెహ్రూ అధ్యయనము చేశాడు. ఈ రీతిగా నెహ్రూలో ప్రారంభమైన మత సంబంధ నైతికత, గాంధీతో తనకు గల సుదీర్ఘ సాహచర్యంతో స్థిరపడింది. తన 13వ ఏట నెహ్రూ దివ్యజ్ఞాన సమాజములో సభ్యునిగా చేరాడు. అయితే నెహ్రూలో స్థిరమైన శాశ్వత మార్పును తెచ్చింది శాస్త్ర విజ్ఞానమే.

ఇంగ్లండు నందలి హారో (Harrow) నందు విద్యనభ్యసించేందుకు నెహ్రూ 1905 సం॥లో ఇంగ్లండు వెళ్ళారు. అచ్చట విద్యాభ్యాసం అనంతరం ట్రినిటి కాలేజి మరియు కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయము నందు ఉన్నత విద్యనభ్యసించాడు. 1910 సం॥లో న్యాయశాస్త్ర అధ్యయనమునకు గాను 'ఇన్నర్ టెంపుల్' న్యాయ కళాశాలలో చేరారు. ఈ సమయంలోనే నెహ్రూ నిశ్చయత లేకనే

ఫేబియన్ మరియు సామ్యవాద భావాల చేత ఆకర్షితుడైనాడు. ఇంగ్లండులో ఉండగా నెహ్రూ ఆలోచనలు, వేష భాషలు పాశ్చాత్యీకరణ పొందాయి. ఒక సందర్భములో నెహ్రూ స్వయంగా ఇలా అన్నారు! "నేను హారో మరియు కేంబ్రిడ్జిల పలు దురాభిప్రాయాలను గ్రహించితిని, నాయిష్ట అయిష్టాలలో నేను బహుశా భారతీయుడిలా కాక ఆంగ్లేయుడిలా ఉన్నానేమో!".

1912లో ఇంగ్లండు నుండి భారతదేశం తిరిగి వచ్చాక అలహాబాదు హైకోర్టులో న్యాయవాదిగా నెహ్రూ కొంత కాలం పని చేశారు. న్యాయవాద వృత్తిలో ఆశక్తి లేనందున, అదే సంవత్సరము 'భారత జాతీయ కాంగ్రెస్'లో చేరారు. 1916లో అనిబిసెంట్ మరియు తిలక్‌ల ఆధ్వర్యంలో ప్రారంభమైన హోంరూల్ ఉద్యమంలో పాల్గొన్నారు. బ్రిటీష్ వారితో మితవాదుల నిష్ప్రయోజన సంభాషణల పై అసంతృప్తి చెంది, విదేశ పాలకులతో తిరుగుబాటు దోరణిని కాంక్షించాడు.

తొలిసారి గాంధితో 1916 లక్నో సమావేశంలో పరిచయం కల్గినా, నెహ్రూను గాంధి ఆకర్షించలేకపోయాడు. అనంతరం 1919లో బ్రిటీష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గాంధి చేపట్టిన రౌలట్ చట్టాల ఉపసంహరణ ఉద్యమము నెహ్రూను ఎంతగానో ఆకర్షించింది. 1920లో ఉద్ (oudh) నందు రైతు ఉద్యమంలో నెహ్రూ పాల్గొనుట అతని రచనలలోను, జీవన విధానములోను మార్పు తెచ్చింది. 1921 సం॥లో నెహ్రూ సహాయ నిరాకరణ ఉద్యమ సంబంధముగ నిర్బంధించబడినాడు. 1926 - 27 సం॥లలో ఐరోపా దేశాలను సందర్శించాడు. 1927లో కొద్దికాలం రష్యాలో గడుపుట వలన కమ్యూనిజం పై అభిమానం ఏర్పడింది.

1929 డిశంబరు 31న, లాహోర్ కాంగ్రెస్ సమావేశంలో నెహ్రూ అధ్యక్షతన 'సంపూర్ణ స్వరాజ్య తీర్మానము' ఆమోదించబడింది. 1936, 1937, 1946 సం॥లలో కాంగ్రెస్‌కు అధ్యక్షుడుగా సేవలందించాడు. 'క్విట్ ఇండియా' ఉద్యమ సమయంలో 3 సం॥ల పాటు కారాగారములో ఉన్నాడు. 1946 ఆగస్టు 16న జాతీయ ప్రభుత్వానికి ఉపాధ్యక్షుడుగా, స్వాతంత్ర్యానంతరం దేశానికి ప్రధానియై, మరణించేంత వరకు (మే 27, 1964) ప్రధానిగా తన సేవలందించి అమరుడైనాడు.

నెహ్రూ ఆలోచనల పై తన తండ్రి మోతీలాల్ నెహ్రూ, కారల్ మార్క్స్, గాంధి, రవీంద్రనాథ్ ఠాగూర్ వంటి మహామహుల ప్రభావమున్నది.

## 15.3 తాత్విక పునాదులు (Philosophical Foundations) :-

నెహ్రూ రాజనీతి తత్వ విచారమునకు తాత్విక పునాదులుగా భౌతిక విషయాల పై దృష్టి చాలించు Agnosticiom, సౌఖ్యవాదము (Cyrenaic) మరియు బౌద్ధ మతతత్వము ప్రధానముగ కన్పిస్తాయి.

నెహ్రూ తత్వ విచారములో Agnostic (అతి భౌతిక విషయాల పట్ల ఆసక్తి లేకపోవుట) పోకడలున్నాయి. ఈ మేరకు మోతీలాల్ నెహ్రూ (తండ్రి) ప్రభావమున్నది. మోతీలాల్ నెహ్రూ వాస్తవిక వాదము, హేతు వాదము మరియు మార్మికతతో కూడిన అత్యున్నత యదార్థత భావనల వ్యతిరేకతలు నెహ్రూ ఆలోచనలను ఎంతగానో ప్రభావిత మొనర్చినవి. గాంధి తన తల్లి కుమారునిగా తల్లి ప్రభావానికి విశేషంగా లోను కాగా, నెహ్రూ తండ్రి కుమారునిగా మోతీలాల్ నెహ్రూ ప్రభావానికి అమితంగా లోనయ్యాడు. నెహ్రూ అతి భౌతిక విషయాలపట్ల చిన్నతనం నుంచి కూడా అనాసక్తతను కల్గి వుండేవారు. ఉపాధ్యాయుడు ఫెర్డినాండ్.టి.బ్రూక్స్ మరియు అనిబిసెంట్‌ల ప్రభావము రసెల్ సంశయ వాదము వలన, నెహ్రూలో దాగివున్న కొద్దిపాటి మత విశ్వాసాలు సహితము తుడిచిపెట్టుకు పోయాయి.

మూడు దశాబ్దాల పాటు గాంధి అనుంగు సహచరుడుగా వున్ననూ, నెహ్రూ అతి భౌతిక అంశాల పై విశ్వాసము పెంపొందించుకొనక 'Agnostic' గానే కొనసాగుట విశేషము. శాస్త్ర విజ్ఞానము పై నెహ్రూకు గల అపార నమ్మకం కూడా ఆయన 'Agnostic'గా కొనసాగుటకు సహకరించింది.

వాస్తవంగా ఆలోచిస్తే నెహ్రూలో మూర్ఖపు పట్టుదల వాదం (పిడివాదం) (dogmatic) లేదా తీవ్ర నాస్తిక వాదంలు కన్పించవు. అలా అని నెహ్రూ ఆధ్యాత్మిక వాది (Spirithalist) కాదు. సత్తాశాస్త్రం (ontology), ప్రమాణ శాస్త్రం (epistemology)లకు సంబంధించిన క్లిష్ట సమస్యలపై చర్చలు నెహ్రూకు అంగీకారం కాదు. అయితే ఈయన కొన్ని అస్పష్టమైన ఆదర్శ వాంఛలు కల్గి ఉన్నప్పటికి, ఆధ్యాత్మిక స్థితిని ఆమోదించలేదు. అలా అని పదార్థం, శక్తి మరియు చలనములను (matter or power or motion) నిర్దుష్టమైన వాస్తవాలుగా కూడ భావించ లేదు. కావున నెహ్రూ మౌలిక తాత్వికతను 'agnosticism'గా భావించనగును.

ప్రారంభములో నెహ్రూ తాత్వికతను కొంత వరకు సౌఖ్యవాదము ప్రభావితం చేసింది. ఈ మేరకు నెహ్రూ పై పాటర్ (Pater) మరియు ఆస్కార్ వైల్డ్ (oscar wilde) రచనల ప్రభావమున్నదిగా భావించవచ్చు. నెహ్రూ తాత్విక ఆలోచనలు జ్ఞాన సంబంధమైన లేదా అతి భౌతిక వాదములు ప్రాతిపదికగా కాక ఆయన సొంత అనుభవ ప్రభావాల ఫలితంగా కార్యరూపం దాల్చాయి. నెహ్రూకు జీవితమంటే ఆశావాద మరియు అసంఖ్యాక అవకాశాల దృక్కోణమే. ప్రాచీన గ్రీకుల వలె నెహ్రూ కూడా మానవునిలో అంతర్లీనముగా వున్న శక్తులు సామర్థ్యాలు అవసరమైన సామరస్యతతో పురోభివృద్ధి చెందుతాయని తలంచాడు. నెహ్రూ వేదాంత మరియు బౌద్ధమత నైతికాంశములైన ఆత్మత్యాగం (self-abnegation), సల్లేఖనము లేదా స్వీయ క్షీణత (self-mortification) వంటి వాటిని గాని, జీవితాన్ని సంతోషంగా గడపాలనే మధ్య తరగతి సిద్ధాంతమును గానీ ధృడపరచలేదు. సామాజిక ఆదర్శవాదిగా సాధారణ ప్రజల భావోద్రేకాలను ప్రజాస్వామ్య దృక్పథంతోనే నెహ్రూ చూశాడు.

నెహ్రూ తాత్విక ఆలోచనలు బౌద్ధమత ప్రభావానికి కూడా లోనయ్యాయి. 'The Discovery of India' రచనలో నెహ్రూ బాల్యంలోనే బుద్ధుని కథ తనను ఆకర్షించిందని, 'Edwin Arnold' రచించిన 'Light of Asia' తనకు అత్యంత ప్రీతిపాత్రమైన గ్రంథమని పేర్కొన్నాడు. నైతిక దృగ్గోచరమును మరియు వాస్తవిక భావన మిశ్రమ నిరంతరత కొనసాగింపులను విశ్లేషించుటకు బౌద్ధమతం అనుసరించే మనో విజ్ఞాన దృక్పథము నెహ్రూను ఎంతగానో ఆకర్షించింది. బౌద్ధమత అష్టాంగ మార్గాలు నెహ్రూను ప్రభావితం చేశాయి. అశోకుని ప్రభావం, లక్ష సాధనాలు లక్ష్యాలతో పాటు మంచివిగా ఉండాలనే భావాలు బౌద్ధమత ప్రభావం నుంచి నెహ్రూ గ్రహించి పాటించుట జరిగింది.

## 15.4 చారిత్రక తత్వము (Philosophy of History) :-

చరిత్ర అభ్యాసంతో పాటు నెహ్రూకు సంపూర్ణ చారిత్రక దృగ్గోచరము పై మక్కువ మెండు. కేంబ్రిడ్జి విశ్వ విద్యాలయంలో వుండగా క్రమేపి ఆ శక్తిని మానవ నాగరికత క్రమ వికాసము పై కేంద్రీకరించాడు. తన 'Glimpses of World History' రచనలో ఆయా ప్రాచీన నాగరికతల పరిణామ క్రమమును స్పష్టముగ పేర్కొంటూ నెహ్రూ చారిత్రక సామాజిక సాస్త్ర (Historical Sociology) నిర్మితికి కొంత మేరకు ప్రయత్నించాడు. ఇది కేవలము గత సంఘటనలను క్రమముగా వివరించుటతో ఆగిపోక, ఆయా సామాజిక రాజకీయ సంఘటనలు చోటు చేసుకొనుటకు తోడ్పడిన సందర్భానుసారాల ప్రాతిపదికతో కూడిన వివరణ లిస్తుంది. నెపోలియన్‌ను ఉదహరిస్తూ నెహ్రూ ఇలా వ్రాశాడు.

"ఒక వేళ నెపోలియన్ మరొక కాలంలో లేదా మరింత శాంతియుత కాలంలో జన్మించి వుంటే, బహుశ గుర్తింపు పొందిన జనరల్ లేదా సైన్యాధిపతి అయి వుండేవాడు. అంతకంటే అధికుడయ్యేవాడు కాదు. మరియు గుర్తింపు పొందేవాడు కాదు. అయితే విప్లవం (ఫ్రెంచి) మరియు అనంతర మార్పులు నెపోలియన్‌ను పురోగమింపజేశాయి. దీనిని ఆయన సక్రమంగా ఉపయోగించుకున్నాడు''.

నెహ్రూకు చరిత్ర అంటే ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన వ్యక్తుల జీవిత కథ కాదు. చరిత్రలో వస్త్వాశయ (objectivity) శక్తులకు ప్రాధాన్యతనిచ్చాడు. అంతమాత్రాన ఈయనకు పూర్తిగా భౌతిక వాద వస్త్వాశయ వాదిగా పరిగణించ వీలుకాదు. చరిత్రలోని ప్రముఖ నాయకులను, ఉదాహరణకు భారత రాజకీయ సామాజిక రంగాలలో గాంధి నిర్మాణాత్మక పాత్రను, రష్యా బోల్షివిక్ విప్లవంలోను అనంతర పరిస్థితులను చక్కబరుచుటలో లెనిన్ నాయకత్వ ప్రతిభను నెహ్రూ ప్రస్తుతించకుండా వుండలేకపోయాడు.

మనదేశంలోని కుల నిర్మితులకు సంబంధించిన నెహ్రూ భావాలు మానవాకృతి శాస్త్ర (Anthropology) పునాదుల ప్రాతిపదికగా లేవు. ఇండో-ఆర్యనులు వాని పవిత్రతను లేదా ప్రత్యేకతలను కాపాడుకునే నేపథ్యంలో కుల వ్యవస్థ ఆవిర్భవించిందనే పాశ్చాత్యుల వాదంతో ఏకీభవించాడు. వర్ణము అనగా రంగు అని, సూద్రులు లేదా ద్రావిడులు భారత ఆదిమ జాతుల వారని నెహ్రూ అభిప్రాయము. ఆర్యులు - ద్రావిడుల మధ్య జాతుల మరియు రాజకీయ పోరాటాలు జరిగాయని, ఇండో - ఆర్య మతాచార్యులు వేదాలను సంకలనము చేసారని, ఆర్యుల రాకకు ముందే ద్రావిడులు మొహంజదారో హరప్పా నాగరికతలను నిర్మించారని నెహ్రూ తన 'Discovery of India' గ్రంథంలో ప్రస్తావించాడు. సామ్యవాద మేధావిగా భారతదేశంలో కులరహిత, వర్గరహిత సమాజాన్ని కాంక్షించినా, ప్రధానంగా కుల వ్యవస్థను కానీ, అగ్రకుల ఆధిక్యతను, మూఢవిశ్వాసాలను ఖండించలేదని, కులాల ఆవిర్భావం పై తగు పరిశోధన చేయలేదని గ్రహించవచ్చు.

## 15.5 నెహ్రూ - ప్రజాస్వామ్యము :-

నెహ్రూ ప్రజాస్వామ్య భావాలు 20వ శతాబ్దపు పాశ్చాత్య సాంప్రదాయ ఉదార వాదము మరియు ఫేబియన్ సామ్యవాద భావాలచే ప్రేరేపించబడి, వ్యక్తి ఆత్మగౌరవాన్ని అతని హక్కులను కాపాడే దిశగా కొనసాగుతాయి. కావున ఈయన ప్రజాస్వామ్య భావన నూతనంగా కనుగొనబడిందిగా కన్పించదు. 'పార్లమెంటరీ ప్రభుత్వం పై చాలా గ్రంథాలు వ్రాయబడి వున్నవని, ఆయన ప్రజాస్వామ్య భావాలు చాలా వరకు బ్రిటీష్ అమెరికా, మరియు ఫ్రెంచి గ్రంథాల నుంచి గ్రహించినవేనని' నెహ్రూ అంగీకరించాడు. అయితే ఈ గ్రంథాలు 19వ శతాబ్దపు పరిస్థితులకు అద్దం పడుతున్నాయే కాని, సమకాలీన సమస్యలకు సంబంధించినవిగా లేవని నెహ్రూ అభిప్రాయపడినాడు.

ప్రజాస్వామ్యానికి సంబంధించిన నెహ్రూ భావాలు ఆయనలోని మానవతా వాదంను ప్రతిబింబిస్తూ ఆసాంతం ఆయన రచనలలో, ప్రసంగాలలో జాలు వారినవి. వ్యక్తి సామాజిక జీవితముల మధ్య అన్యోన్యత, సరైన సమతుల్యత మరియు వ్యక్తులు సమూహాల మధ్య సర్దుబాటు నెహ్రూకు ప్రధాన సమస్యలు. ఇట్టి మానవ సమస్యలను మానవతా దృక్పథంతో పరిష్కరించవచ్చని, వీటికి ప్రజాస్వామ్య సజీవ తత్త్వమే పరిష్కారం చూపగలదని విశ్వసించాడు. ప్రజాస్వామ్యం పై నెహ్రూకున్న విశ్వాసమే క్రమేపి ఆయనను కమ్యూనిజ ప్రభావం నుంచి దూరపరచి, గాంధి సూచించిన అహింసాయుత సాధనాల దిశగా మరల్చింది.

## 15.6 ప్రజాస్వామ్యము - ఆవశ్యకతలు (Essentials) :-

ప్రజాస్వామ్యమునకు వ్యక్తి స్వాతంత్రమును మరియు సమానత్వమును ఆవశ్యకతలుగా నెహ్రూ తత్త్వ విచారంలో వ్యక్తికి కేంద్రిక మరియు మౌలిక ప్రాధాన్యత కన్పిస్తుంది. వ్యక్తి స్వాతంత్రమును మానవుని సంపూర్ణాభివృద్ధికి తోడ్పడు మౌలికాంశముగా చూశాడు. ఒక్క ప్రజాస్వామ్య ప్రభుత్వము మాత్రమే, మానవత్వపు విలువలను గుర్తించి వ్యక్తి స్వాతంత్రమును పెంపొందించుటకు అవసరమైన సామాజిక నిర్మితులను నెలకొల్పునని నెహ్రూ తలంచాడు. నెహ్రూకు రాజ్యము, ప్రభుత్వములు వ్యక్తికి మంచి జీవితాన్ని అందించుటకు సాధనాలు మాత్రమే. 'India and the World' అను తన రచనలో నెహ్రూ 'ప్రభుత్వ రూపము మరియు స్వాతంత్రములు కేవలం మానవ సంక్షేమము, మానవ పురోభివృద్ధి అను లక్ష్యాలను చేరే సాధనాలుగా' పేర్కొన్నాడు.

నెహ్రూ స్వాతంత్ర భావనను స్థూల అర్థంలోనే చూశాడు. నిజమైన స్వాతంత్రము రాజకీయ రూపంలోనే కాక, ఆర్థిక మరియు ఆధ్యాత్మికత (spiritual) రూపాలను కూడా కల్గి ఉంటుంది. ఈయన దృష్టిలో స్వాతంత్రమనునది రాజకీయ నిర్ణయీకరణ లేదా రాజ్యాంగ రూపంలోనే కాక, అది ఆధ్యాత్మికతకు రూపంగా కూడా ఉండి మనస్సుకు హృదయానికి సంబంధించినదిగా ఉంటుంది. మనస్సు సంకుచితంగా మారినా, హృదయం అసూయ ద్వేషాలతో నిండినా స్వాతంత్రము అదృశ్యమౌతుంది. అట్టి సందర్భంలో వ్యక్తి పురోభివృద్ధి, చొరవ తీసుకొనే సామర్థ్యాలు అణచబడి, ఫలితంగా జాతి మరియు రాజ్యము కూడా నష్టపోతాయి. కావుననే నెహ్రూ వ్యక్తి తన స్వాతంత్రాన్ని కోల్పోవటం కంటే ప్రపంచంలో చెడ్డ విషయం ఏదీ వుండబోదని పేర్కొన్నాడు.

అయితే నెహ్రూకు పరిమితమైన వ్యక్తి స్వాతంత్రము అంగీకారము కాదు. ఆయన వ్యక్తి స్వాతంత్రమును సామాజిక సందర్భానుసారంగానే అర్థం చేసుకున్నాడు. వ్యక్తి శ్రేయోవాదిగా మరియు వ్యక్తి స్వాతంత్రాల పై విశ్వాసం వున్న వ్యక్తిగా నెహ్రూ ప్రకటించుకున్ననూ వ్యక్తి స్వాతంత్రము పై సామాజిక సమూహాలు లేదా గుంపుల ప్రయోజనాల దృష్ట్యా పరిమితుల అవసరాన్ని గుర్తించాడు. పార్లమెంటులో ఒక సందర్భములో నెహ్రూ ప్రజాస్వామ్య సమాజంలో వ్యక్తిగత స్వాతంత్ర భావన సమాజ స్వాతంత్ర భావనలోను మరియు వ్యక్తి సంబంధాలు సామాజిక గుంపు సంబంధాలతోను సమతుల్యత చెందాలని సూచించాడు.

పౌరులు తమ హక్కులను అనుభవించుట ద్వారా స్వాతంత్రమును పొందుతారు. రాజ్యము వ్యక్తి హక్కులను ఇతర వ్యక్తుల నుంచి మరియు సామాజిక గుంపుల నుంచి కాపాడే ఒక సాధనంగా ఉపయోగపడుతుంది. అనగా వ్యక్తి శ్రేయస్సుకు రాజ్యము సాధనమే. అయితే వ్యక్తి నుంచి కూడ ఇతరులకు, సమాజానికి హాని జరిగే ప్రమాదముంది. కావున రాజ్యము వ్యక్తి స్వాతంత్రానికి, సామాజిక భద్రతకు మధ్య సమతుల్యత (సామరస్యత) సాధించవలసి వుంది. మరొక విధంగా చెప్పాలంటే వ్యక్తి అవసరాలందు లక్ష్యముంచి, రాజ్యం తాను సంరక్షించే మొత్తం సమాజ అవసరాలను విస్మరించరాదు. రాజ్యము యుద్ధ సమూహాలలో రాజ్య ప్రయోజనాలకు, సాధారణ పరిస్థితులలో వ్యక్తి ప్రయోజనాలకు ప్రాధాన్యతనివ్వాలని నెహ్రూ సూచించాడు. ప్రతిహక్కు ఒక విధిని లేదా బాధ్యతను కల్గి ఉంటుంది. సమాజంలో అంతర్భాగముగ వ్యక్తి తన హక్కులతో పాటు విధుల అవగాహన కూడా కల్గి ఉన్నప్పుడే స్వాతంత్రమును అనుభవించగల్గుతాడు.

ప్రజాస్వామ్యమునకు స్వాతంత్రమును పర్యాయ పదముగా భావించిన నెహ్రూ క్రమశిక్షణ అవసరాన్ని విస్మరించలేదు. ప్రజాస్వామ్యము ప్రజా బాహుళ్యము పై, వారి శిక్షిత ప్రవర్తన పై ప్రధానంగా ఆధారపడి ఉంటుంది. కాబట్టి ప్రజాస్వామ్యములో స్వాతంత్ర కాంక్షను క్రమశిక్షణ అవసరతను ప్రజలు గుర్తించేలా చూడాలని నెహ్రూ అభిప్రాయపడినాడు. నిజమైన స్వతంత్రము బాధ్యతా రాహిత్యతను అంగీకరించదు. స్వాతంత్ర కాంక్ష ప్రజలలో స్వీయ క్రమశిక్షణ స్పృహను పెంచి, ప్రజాస్వామ్య విజయానికి సోపానమౌతుందని నెహ్రూ విశ్వసించాడు.

ప్రజలలో వుండే స్వీయ క్రమశిక్షణలు వారిలో పరస్పర సహన భావనను నెలకొల్పి, అల్ప సంఖ్యాక అభిప్రాయాలను మన్నించుటకు, (అల్ప సంఖ్యాకులు) వారు స్వేచ్ఛగా భావ ప్రకటన చేసుకొనేందుకు అవకాశాన్ని కల్పిస్తాయి. కాబట్టి ప్రజాస్వామ్యములో క్రమశిక్షణ, పరస్పర సహజీవనములను స్థిరపరచుటకు ఒత్తిడి ఉండాలని, అప్పుడు మాత్రమే ప్రజాస్వామ్యము అన్ని వర్గాల ప్రజల ప్రయోజనాలకు ప్రతినిధి కాగలదని నెహ్రూ పేర్కొన్నాడు.

వ్యక్తి స్వాతంత్రమును హరించే కేంద్రీకరణ పోకడలు నెహ్రూకు ఇబ్బందిని కల్గిస్తాయి. ఆధునిక రాజ్యాలలో నిరంతరం బలపడుతూ వున్న కేంద్రీకరణ ప్రక్రియను ప్రజలు తమ ప్రతి అవసరమునకు రాజ్యం పై ఆధారపడుటను నెహ్రూ గర్హించాడు. ఈ విధంగా రాజ్యంలో లేదా ప్రజా గుంపులలో కేంద్రీకరించబడే అధికారం వ్యక్తిగత స్వాతంత్రాన్ని బలహీన పరుస్తుందని, ఇట్టి కేంద్రీకరణ వ్యక్తి ఆనందముతో పాటు, మానవ పురోభివృద్ధికి ఆవశ్యకమైన సృజనాత్మక శక్తిని కూడా పరిమితం చేసే ప్రమాదకారి అని నెహ్రూ హెచ్చరించాడు. ఆధునిక రాజ్యాలలో కేంద్రీకరణ అనివార్యమైనప్పటికి వ్యక్తి స్వాతంత్రాన్ని సంరక్షించుకొనవలసి వుందని నెహ్రూ పేర్కొన్నాడు.

## 15.7 సమానత్వము :-

ప్రజాస్వామ్య ఆవశ్యకతలలో రెండవది సమానత్వము. తన 'Glimpses of World History' రచనలో నెహ్రూ 'ప్రజాస్వామ్యమునకు అర్థం సమానత్వమని మరియు ప్రజాస్వామ్యము సమానత్వమున్న సమాజంలోనే వర్ధిల్లునని' పేర్కొన్నాడు.

నెహ్రూ ప్రజాస్వామ్య సమాజాలలోని సమానత్వమును రాజకీయ రూపంగా కంటే ఆర్థిక, సాంఘీక రూపాలుగానే చూశాడు. ఆర్థిక, సాంఘిక సమానత్వాల లేమి వలన ఆధునిక రాజకీయాలు వాటి అర్థాన్ని, విలువలను కోల్పోతున్నాయని నెహ్రూ భావం.

సమానత్వ మంటే వ్యక్తులందరిని మరియు గుంపులన్నింటిని సమంచేయుటకాదని, అందరి పురోభివృద్ధికి ఆవశ్యకమైన అవకాశాలు ప్రతివానికి అందుబాటులో ఉండుటేనని నెహ్రూ పేర్కొన్నాడు. వ్యక్తుల సామర్థ్యాలలో వైరుధ్యాలుంటాయని, ఫలితంగా వ్యక్తులలో ఆర్థిక, విద్యా మరి ఇతర అసమానతలు తప్పవని, మొత్తం మీద ప్రజాస్వామ్యము అన్ని అసమానతలను సమం చేసేదిగా ఉంటుందని నెహ్రూ భావించాడు. మరొక విధంగా చెప్పాలంటే ప్రజాస్వామ్యము అసమానతలను రూపు మాపి సమానత్వాన్ని స్థిరపరచేదిగా ఉంటుంది.

నెహ్రూ సమానత్వ భావన జీవితానికి సంబంధించిన అన్ని అంశాలకు - రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక చెందినదిగా కన్పిస్తుంది. అయితే గౌతమ బుద్ధుని ప్రభావం వలన నెహ్రూ సాంఘిక, ఆర్థిక సమానత్వాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చినట్లుగా కన్పిస్తుంది. సమానత్వమును సమాన అవకాశాల ప్రాతిపదికగా చూస్తూ నెహ్రూ 'ప్రతి స్త్రీకి, పురుషునికి వారి వ్యక్తిగత సామర్థ్యమును బట్టి పురోభివృద్ధి చెందే అవకాశం వుండాలని.......... గౌరవము మరియు యోగ్యతలు కులాన్ని పుట్టుకను మరియు ఆస్తిని బట్టి కాక సామర్థ్యము మరియు శ్రమ శక్తుల ద్వారా లభించాలని పేర్కొన్నాడు. భారతదేశాన్ని దృష్టిలో వుంచుకుని చెప్పినప్పటికీ, మౌలికంగా జాతి, కుల, వర్గ మరియు వర్ణ వివక్షతకు తావు లేని సామాజిక ఐక్యతనే నెహ్రూ ఆశించాడు. అట్టి సామాజిక సమానత్వము ప్రతివ్యక్తిలో సౌభ్రాతృత్వ భావనకు తోడ్పడి తోటి వారిని తన సోదరులుగా, తన సమానులుగా పరిగణించేలా చేస్తుందని నెహ్రూ తలంచాడు. ఈ భావన వ్యక్తుల ప్రత్యేకతలకు, రాయితీలకు తావివ్వక నిజమైన ప్రజాస్వామ్య స్థాపనకు ఉపకరిస్తుందని నెహ్రూ అభిప్రాయపడినాడు.

ప్రజాస్వామ్యము బ్రతికి బట్టకట్టాలంటే స్వాతంత్రము (స్వేచ్ఛ) మరియు సమానత్వాల ఆవశ్యకతను పేర్కొంటూ, రాజకీయ సాంఘిక స్వాతంత్రాలు సమానత్వాలు, ఆర్థిక స్వాతంత్రము సమానత్వాలకు తప్పక దారి చూపేవిగా ఉండాలని నెహ్రూ పేర్కొన్నాడు. ప్రజల కనీస అవసరాల సంతృప్తికి అవసరమైన ఆర్థిక నిర్మితులు ఏర్పాటు నెహ్రూ కోరాడు. స్వాతంత్రము మరియు పేదరికము పరస్పర భంజకాలని, నిరపేక్ష పేదరిక నిరంతరత అన్ని రకాల స్వాతంత్రాలను నిరుపయోగం చేస్తుందని కాబట్టి ప్రజాస్వామ్య సమాజము అన్ని రకాల అసమానతలను వివక్షతలను తొలగించి, అభివృద్ధి అవకాశాలు అందరికి అందుబాటులో వుంచేదిగా ఉండాలని నెహ్రూ కోరినాడు.

## 15.8 స్వాతంత్ర్యము మరియు సమానత్వము :-

వ్యక్తి సర్వతో ముఖాభివృద్ధికి రాజకీయ స్వాతంత్రముతో పాటు, సామాజిక మరియు ఆర్థిక సమానత్వములు ఎంతైనా అవసరము. ఉదార ప్రజాస్వామ్య భావన రాజకీయ స్వాతంత్రము, సామ్యవాద భావన సమానత్వమును నొక్కి ఒక్కాణిస్తాయి. అదే విధంగా 19వ శతాబ్దంలో స్వాతంత్ర భావన ప్రముఖమైనది కాగా, 20వ శతాబ్దంలో సమానత్వ భావన అంటే ప్రాధాన్యత కలదిగా భావించబడింది. వీటన్నింటి ప్రభావము నెహ్రూ పై వుంది. పైగా ఆచరణలో రాజకీయ స్వాతంత్రమునకు ఆర్థిక సమానత్వమునకు సంఘర్షణ అనివార్యమని, బానిసత్వం మరియు వెనుకబాటుతనంతో కృంగిపోతున్న రాజ్యాలలో లక్షలాది ప్రజలు దారిద్యంలో, కరువు కోరల్లో చిక్కుకున్నప్పుడు ప్రజలకు రాజకీయ స్వాతంత్రము కంటే మంచి భోజనము ఆర్థిక వెసులుబాటు ఊరట కల్గిస్తాయని, ఇట్టి సమస్యలను సరైన ఆర్థిక, రాజకీయ ప్రణాళికల ద్వారా పరిష్కరించ వీలగునని నెహ్రూ పేర్కొన్నాడు. అయితే నెహ్రూ మౌలికంగా రాజకీయ స్వాతంత్రము లేదా రాజకీయ సమానత్వాలనే ఇతర సమానత్వాలకు చేయూతగా భావించాడు.

## 15.9 స్వేచ్ఛ (స్వాతంత్రము) సమానత్వములు - రాజకీయ సామాజిక మరియు ఆర్థిక నిర్మితులు :-

వ్యక్తి పురోభివృద్ధికి ఆవశ్యకములైన స్వేచ్ఛ (స్వాతంత్రము) సమానత్వముల పూర్తి అమలుకు, అవగాహనకు, రాజకీయ మరియు ఆర్థిక సామాజిక నిర్మితుల ఏర్పాటు అవసరతను నెహ్రూ గుర్తించాడు.

**రాజకీయ విర్మితులు:-**

**సార్వత్రిక ఎన్నికలు:-** నెహ్రూకు ప్రజాసార్వభౌమత్వము పై విశ్వాసము మెండు. వ్యవస్థీకరించబడిన ప్రజే రాజ్యమని, కావున రాజ్యము ప్రభుత్వ యంత్రాంగాలు ప్రజా సంక్షేమము కోసమే తమ అధికారమును ఉపయోగించాలని నెహ్రూ పేర్కొన్నాడు. అవగా అధికారమంతయు ప్రజలకే చెందునని, అది ప్రజల మంచికే ఉపయోగపడాలని భావము. ప్రభుత్వం మీద కొన్ని పరిమితులుంటాయని, అది బల ప్రయోగం పై కాక ప్రజా అంగీకారం పైనే కొనసాగాలని, ప్రజాస్వామ్య ప్రభుత్వము సాధారణ ప్రజల ఆశక్తులను ఆధారం చేసుకొని పని చెయ్యాలని, అట్లు కానిచో ప్రభుత్వాన్ని మార్చుకొని వేరొక ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొనే హక్కును కల్గి వుండాలని నెహ్రూ పేర్కొన్నాడు.

పాశ్చాత్య ఉదారవాద సాంప్రదాయాల ప్రభావము వలన నెహ్రూకు ప్రాతినిధ్య సంస్థల పై నమ్మకము కుదిరింది. ప్రజాస్వామ్య ప్రక్రియలో ఎన్నికలు అనివార్యమని వీటి ద్వారానే ప్రభుత్వ కార్యకలాపాలలో ప్రజలు భాగస్వామ్యము పొందుతారని, అలాగే తమ ఆశక్తులకు భిన్నంగా పని చేస్తున్న ప్రభుత్వాన్ని తొలగించి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసుకో వీలవుతుందని నెహ్రూ విశ్వసించాడు. ఎన్నికల ప్రక్రియ ద్వారా ప్రజలు తమ ప్రతినిధులను ఎన్నుకొనుటతో పాటు, ప్రభుత్వ జాతీయ అంతర్జాతీయ సంబంధాల క్రమబద్ధీకరణలో చురుకుగా తెలివిగా పాల్గొనేందుకు అవకాశం వుంది. అయితే ఎన్నికలు అన్ని వేళలా మంచి ప్రతినిధులను ఎన్నుకొనుటలో ప్రజల మనోగతాలను ప్రతిబింబించాయను నుడికారము నెహ్రూకు అంగీకారం కాదు. ఎన్నికలు వ్యక్తిలోని చెడు స్వభావాన్ని బహిర్గతపర్చి అప్పుడప్పుడూ అసమర్థులు ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కాబడే ప్రమాదమున్నదని నెహ్రూ పేర్కొన్నాడు. అయితే ప్రమాదము నుంచి ప్రజాస్వామ్యమును కాపాడేందుకు తక్షణ పరిష్కారమును నెహ్రూ చూపలేకపోయాడు.

**వయోజన ఓటు హక్కు:-** ఎన్నికల ప్రక్రియ ద్వారా తలెత్తున్న చెడులను తొలగించే దిసగా ఓటు హక్కును విస్తృత పరచాలని అనగా నియోజకులకు (ఓటరుకు) విద్య మరియు ఆస్తి వంటి అర్హతలను రద్దు పరచి వయోజనులందరికి ఓటు హక్కును ప్రసాదించుట మంచిదని నెహ్రూ తలంచాడు. సార్వత్రిక వయోజన ఓటు హక్కు ద్వారా ప్రభుత్వమును సంపన్న ఆధిక్యత వర్గ ఆశక్తుల ప్రాతిపదికగా కాక, ప్రజలందరి / అన్ని వర్గాల ఆశక్తుల ప్రాతిపదికగా పాలించే అవకాశము లభిస్తుంది. ప్రజాస్వామ్యమంటే ప్రజలచే పరిపాలించబడేదను భావమును ఓటు హక్కు సాక్షాత్కరిస్తుంది. ఈ విధంగా వయోజన ఓటు హక్కు ప్రజాస్వామ్యమునకు ఆధారమై, తలకు ఒక ఓటు సూత్ర ప్రాతిపదికన రాజకీయ స్వేచ్ఛను ప్రజలకు ప్రసాదిస్తుంది కనుక, భావి భారత రాజ్యాంగములో దీనిని (వయోజన ఓటు హక్కును) చేర్చాలని నెహ్రూ నొక్కి ఒక్కాణించాడు.

## 15.10 రాజకీయ పార్టీలు :-

వ్యక్తులు ఎంత సమర్థులైనప్పటికి, ప్రజలందరితో సంబంధము కాని, వారికి ప్రాతినిధ్యము వహించుటకు కాని వీలు కాదు. ఇది ఒక వ్యవస్థీకరించబడే రాజకీయ పక్షమునకే సాధ్యము. అందున ప్రజల ఆలోచనలు ఆశక్తులు ఏకరూపతను కల్గి వుండవు. కనుక ప్రజల విభిన్న ఆశక్తులకు, భావాలకు, నమ్మకాలకు ప్రాతినిధ్యం వహించుటకు రాజకీయ పార్టీలు అవసరమని నెహ్రూ భావించాడు. రాజకీయ పార్టీలు / పక్షాలు లేని ఆధునిక ప్రజాస్వామ్య ప్రభుత్వాలు ఊహకు అందవు. ప్రజలకు సంబంధించిన పలు అంశాల పట్ల వారికి అవగాహన కల్గించుటకు, వారికి నచ్చిన ప్రతినిధులను స్వేచ్ఛగా ఎంపిక చేసుకొనుటకు రాజకీయ పార్టీల అవసరత వుంది. ఆయా రాజకీయ పార్టీలు తమ ప్రణాళికలను ప్రజల ముందుంచి, ప్రజలను వీరి పార్టీ ప్రణాళికల వైపు ఆకర్షించేందుకు విస్తృతంగా ప్రచారం చేసే ప్రక్రియలో, ప్రజలకు చైతన్యం చేసి వారు మంచిని గ్రహించి బలపరచే సృజనాత్మకతను రాజకీయ విద్యను ప్రజలకందించి, సమర్థులైన ప్రతినిధులను ఎన్నుకొనుటకు సహకరిస్తాయి.

నెహ్రూకు పార్టీ రహిత ప్రజాస్వామ్యము పై విశ్వాసం లేదు. సమాజంలోని సైద్ధాంతిక భిన్నత్వాలకు ప్రాతినిధ్యం వహించేలా రాజకీయ పార్టీలు ఉండవలసిన అవసరతను నెహ్రూ అంగీకరించాడు. రాజకీయ పార్టీలు తమ సిద్ధాంతాలను ప్రజలలో ప్రచారం

చేసుకుంటూ, ప్రజల మద్దతును కూడగట్టుకుని అధికారాన్ని పొందేందుకు నిత్యము ప్రయత్నిస్తూ ప్రజాస్వామ్య కార్యాచరణను బలోపేతం చేస్తుంటాయి.

## 5.11 సమన్వయ పాలన :-

ప్రతి వ్యక్తి ఒక గుంపులో లేదా సమాజంలో అంతర్గత భాగమే. వ్యక్తి స్వాతంత్రము మరియు చర్యలు, గుంపు లేదా సమాజము పై అనుకూల లేదా ప్రతికూల ప్రభావాన్ని చూపవచ్చు. కావున వ్యక్తి - సమాజానికి / గుంపుకు మధ్య సామరస్యత నెలకొల్పుట ఎంతైన అవసరమని అందుకు సమన్వయ పాలన అవసరత వుందని నెహ్రూ నొక్కి ఒక్కాణించాడు. ప్రతి ప్రజా సముదాయము ఎదో ఒక విధమైన న్యాయపాలనకు లోబడి కొనసాగుతుందని, అట్లుకానిచో అది శాసన రాహిత్యానికి దారితీసి ప్రజలు అసంగటిత గుంపుగా మిగిలిపోయే ప్రమాదముందని నెహ్రూ భావము.

మరొక విధముగా చూస్తే చట్టము / న్యాయమును వ్యక్తులు తమ చేతుల్లోకి తీసుకున్నట్లయితే ప్రజా సముదాయంలో క్రమమునకు గానీ స్థిరత్వమునకు గానీ తావు లేని జంతు న్యాయం ప్రబలి ప్రజాస్వామ్య సమాజ కార్యాచరణ దెబ్బతినే ప్రమాదముందని నెహ్రూ హెచ్చరించాడు.

## 15.12 శాంతియుత సాధనాలు :-

సమస్యలకు శాంతియుత పరిష్కారమును చూపే ప్రభుత్వముగ నెహ్రూ ప్రజాస్వామ్యమును చూశాడు. ఒక వేళ ప్రజాస్వామ్య సాధనాల ద్వారా కాక, వేరే సాధనాల ద్వారా (సాయుధ / హింసాయుత) సమస్య పరిష్కారం ప్రజాస్వామ్య స్వభావమును ఉనికిని దెబ్బతీస్తుందని నెహ్రూ భావము. భావ ప్రకటనకు, స్వతంత్రముగ ఆలోచించుటకు ప్రజాస్వామ్యములో ప్రతి వ్యక్తికి అవకాశం ఉన్నప్పటికి, వాటిని వారి ఇష్టానుసారంనకు వదలి వేస్తే అరాచకత్వమునకు దారి తీయవచ్చు. వ్యక్తుల అభివృద్ధికి మరియు సమాజ సంక్షేమానికి సంబంధించిన కొన్ని ఉన్నత ఆదర్శాల సాధనకు అప్రజాస్వామిక హింసాయుత పద్ధతులను ఉపయోగించుట నెహ్రూ అంగీకారము కాదు.

నెహ్రూకు ప్రజాస్వామ్యము ఒక జీవన విధానము. అది ఒక శాంతి మార్గం మరియు లక్ష్య సిద్ధికి ఉత్తమ సాధనము. కావుననే ప్రజాస్వామ్యం పై ఆయన తన నమ్మకాన్ని ఎన్నడూ కోల్పోలేదు. ప్రజాస్వామ్యము పై విశ్వాసం కల్గిన వారందరూ హింసాయుత మార్గాలను విడిచి శాంతియుత సాధనాల ద్వారా అవసరమైన శాసన, ప్రభుత్వపర మార్పులు ఆశిస్తారని నెహ్రూ పేర్కొన్నాడు. సామాజిక సమస్యల పరిష్కారంనకుకూడా శాంతియుత సాధనాలనే నెహ్రూ సూచించాడు.

## 15.13 సామాజిక - ఆర్థిక నిర్మితులు :-

ప్రజాస్వామ్య లక్ష్య సాధనకు రాజకీయ నిర్మితులకు తోడుగా సామాజిక - ఆర్థిక నిర్మితులు కూడా అవసరమని నెహ్రూ నొక్కి ఒక్కాణించాడు. సామాజిక, ఆర్థిక ప్రజాస్వామ్య స్థాపనకు సాధనంగానే నెహ్రూ రాజకీయ ప్రజాస్వామ్యమును భావించాడు. 19వ శతాబ్దపు ఉదార ప్రజాస్వామ్య భావన, సమూల మార్పులకు లోనైన 20వ శతాబ్దపు సమకాలీన పరిస్థితులకు సరిపోదని, రాజకీయ ప్రజాస్వామ్యము క్రమేపి ఆర్థిక, సామాజిక ప్రజాస్వామ్యములను పెంపొందించుకొనవలసిన అవసరత ఉందని నెహ్రూ పేర్కొన్నాడు.

ఒకవేళ దేశంలో ఆర్థిక అసమానతలున్నట్లయితే రాజకీయ ప్రజాస్వామ్యము మరియు వయోజన ఓటు హక్కులు నిజమైన ప్రజాస్వామ్యమును ఏర్పరచలేవని నెహ్రూ అభిప్రాయము. తలకు ఒక ఓటు భావన మంచిదేయైనా, ఒక పేదవాడు ఒక కోటీశ్వరుడు

మరియు ఒక విద్యార్థికుడు, ఒక పామరుడు సమానంగా ఎన్నికల ప్రక్రియలో భాగస్వాములు కాలేరు. కావున తప్పనిసరిగా సమాజంలోని రాజకీయ నిర్మితులు, సామాజిక - ఆర్థిక నిర్మితుల చేత బలపరచబడినప్పుడే స్వేచ్ఛ, సమానత్వము మరియు సామాజిక న్యాయములు అందరికి అందగలవని నెహ్రూ పేర్కొన్నాడు. ఈ విధంగా నెహ్రూ ప్రజాస్వామ్య భావనలో రాజకీయ, సామాజిక మరియు రాజకీయ అంశాలు నిబిడీకృతమై ఉన్నాయి.

నెహ్రూ అభిప్రాయంలో 19వ శతాబ్దపు ప్రజాస్వామ్య భావన రాజకీయ స్వేచ్ఛను ప్రాధాన్యతనిచ్చి తలకు ఒక ఓటు ఇచ్చినంత మాత్రాన, పెట్టుబడిదారీ సమాజంలోని పలు అసంగతాలను కానీ, పేదరికమును కానీ రూపు మాపలేకపోయాయి. అప్పటి ప్రజాస్వామ్య భావన మరియు పెట్టుబడిదారీ విధానము పొందికను కోల్పోయి, పరస్పర వైరుధ్యాలకు దారి తీసి, అందరికి చెందవలసిన అధికారం కొద్ది మంది చేతులలో కేంద్రీకరించబడుటకు కారణమైందని నెహ్రూ అభిప్రాయపడినాడు. ఈ విధంగా అంతర్గతంగా నిరంతరం ప్రజాస్వామ్య పెట్టుబడిదారీ వ్యవస్థల మధ్య పరస్పర సంఘర్షణ కొనసాగింపు ఫలితంగా ప్రజాస్వామ్యము ప్రజల చేత ప్రజల కొరకు పరిపాలించబడుతుందను సూత్రమునకు దూరమౌతుందని నెహ్రూ భావన. పర్యవసానంగా ప్రజాస్వామ్యము పేదరికమునకు, నిరుద్యోగితకు సంపన్నుల పెత్తందారీ తనానికి ఆలవాలమౌతుందని నెహ్రూ తలంచి, దీనికి పరిష్కారంగా సామ్యవాదం వైపు మొగ్గు చూపటం జరిగింది.

భారత స్వాతంత్ర్యానంతరం ప్రధానియైన నెహ్రూ ఆర్థిక, సామాజిక నిర్మితులలో భాగంగానే మిశ్రమ ఆర్థిక విధానమును, ప్రణాళికాబద్ధమైన ఆర్థిక వ్యవస్థను కోరుతూ, పారిశ్రామిక తీర్మానాలను పంచవర్ష ప్రణాళికలను సమాజ అభివృద్ధి పథకాలను మరియు దీనిలో భాగంగా పంచాయితీరాజ్ వ్యవస్థను ప్రవేశపెట్టుట జరిగింది.

## 15.14 ప్రజాస్వామ్యము - విద్య :-

ఆధునిక సమాజాలు ముఖ్యంగా ప్రజాస్వామ్య సౌధాలు ప్రజల భాగస్వామ్యము పై ఆధారపడి ఉండును. కనుక, ప్రజాస్వామ్యములో విద్య ప్రాధాన్యతను విస్మరించతగదని నెహ్రూ పేర్కొన్నాడు. అనేక ప్రసంగాలలో నెహ్రూ సార్వజనీన విద్యలేమి భారత రాజకీయ ప్రజాస్వామ్యమును దెబ్బతీయునని హెచ్చరించాడు. ప్రజాస్వామ్య విజయానికి, ఆర్థిక - సామాజిక ప్రగతికి మరియు క్రమబద్ధ జాతి పునఃనిర్మాణమునకు విద్య ఆవశ్యకతను నెహ్రూ నొక్కి ఒక్కాణించారు. విద్య వ్యక్తి మరియు జాతి / రాజ్య వికాసమునకు సహకారి కావున నిరక్షరాస్యతతో సమతమతమవుతున్న పలు ఆసియా రాజ్యాలు సాక్షరతా ఉద్యమాలను (భారతదేశం కూడా) చేపట్టాలని హితవు పలికినాడు.

విద్య వ్యక్తిలో అంతర్లీనముగా వున్న సామర్థ్యాలను గుర్తించి, మేధను క్రమపరుస్తూ వ్యక్తి సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడుతుంది. వ్యక్తికి తన అభిరుచులను గుర్తించి ఆ మేరకు ఆశక్తి వున్న సామాజిక ఆర్థిక రంగాలను ఎంపిక చేసుకొనుటకు విద్య సహకరిస్తుందని నెహ్రూ విశ్వసించాడు. 'ఆకలి బాధ నుంచి విముక్తికి ఆహారం ఎంత అవసరమో, అజ్ఞానం నుంచి విముక్తి చెందుటకు విద్య అంతే అవసరమని' నెహ్రూ పేర్కొన్నాడు. విద్య వ్యక్తిలో సంకుచిత ధోరణులను పోగొట్టి విశాల దృక్పథాన్ని పెంపొందించి, తన తోటి వారిని సరిగా అవగాహన చేసుకొనుటకు సహకరిస్తుందని నెహ్రూ భావించాడు.

వేగంగా పురోభివృద్ధి చెందుతున్న విజ్ఞాన శాస్త్ర సామర్థ్యాలు, యంత్ర పరికరాలు మానవుని ఆత్మ నిశ్చయాన్ని (spirit) సంక్షోభంలోకి నెట్టి వేస్తాయని, ఇట్టి సంక్షోభం ఆర్థిక రాజకీయ సాధనాల ద్వారా కాక విద్య ద్వారానే పరిష్కరించబడునని అంతవరకు ఏ దేశంలోనైన శాంతి భద్రతలు అసాధ్యమని నెహ్రూ పేర్కొన్నాడు.

నెహ్రూ విద్యను కేవలం చదువుట, వ్రాయుటగ భావించక, విశాల మానసిక దృక్పథంతో కూడిన సాంస్కృతిక సాధనంగా భావించాడు. విద్య వ్యక్తి సమగ్రాభివృద్ధికి తోడ్పడుతూ వ్యక్తిలో స్వావలంబన (self - neliance)ను ధైర్యమును స్వతంత్రను పెంపొందిస్తూ బాధ్యతాయుత పౌరుడుగా వ్యక్తిని తీర్చిదిద్దాలని నెహ్రూ ఆశించాడు.

ప్రజాస్వామ్యము ఒక రాజకీయ రూపమే కాక, జీవన విధానము కూడా. కావున ప్రజాస్వామ్య సమాజంలో విద్యకు ఎంతో ప్రాధాన్యత వుందని, విద్య ద్వారానే ప్రజాస్వామ్య విలువలను ఒనకూర్చుకొనవచ్చని నెహ్రూ పేర్కొన్నాడు. భారత సమాజం ప్రధానంగా వ్యవసాయం మీద, కుల వ్యవస్థ మీద, మత సంబంధ అతి భౌతిక విషయాల మీద ఆధారపడినందున, ప్రజలలో సమానత్వ సౌభాతృత్వ భావనను పెంపొందించుటకు విద్య అవసరత ఎంతైనా ఉందని నెహ్రూ విశ్వసించాడు. సమాజ బాధ్యతల పట్ల ప్రజలలో సరైన అవగాహన విద్య ద్వారానే సాధ్యమని, ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానం విజయపథంలో దేశాన్ని నడిపించాలన్నా విద్య అవసరత ఎంతైనా వుందని నెహ్రూ పేర్కొన్నాడు.

## 15.15 నెహ్రూ లౌకిక వాదము :-

నెహ్రూ యొక్క అసంఖ్యాక రచనలను, ఉపన్యాసాలను పరిశీలిస్తే ఆయన ప్రముఖంగా మతవాది కాదని గ్రహించగలము. ఆయన పొందిన హేతుబద్ధ, విజ్ఞాన సంబంధ శిక్షణ కారణంగా నెహ్రూ మతము యొక్క వితండ వాదమును మూఢవిశ్వాసాలను అంగీకరించలేకపోయాడు. Agnostic అయిన నెహ్రూ అతిభౌతిక ప్రపంచము పై కాక ప్రాపంచిక అంశాల పైనే దృష్టిని కేంద్రీకరించాడు.

నెహ్రూ మతమును, స్వేచ్ఛను సమానత్వమును ప్రజలకు దూరం చేసే వ్యతిరిక్తముగ భావించాడు. సంపూర్ణాధికార రాజ్యాలు (Tolalitarian states) ప్రజల స్వేచ్ఛ స్వాతంత్ర్యాలను మతముసుగులోనే కాలరాశాయని, రాజులు మతాధిపతులు తమ స్వార్థ ప్రయోజనాలను మత ముసుగులోనే సంరక్షించుకుంటున్నారని, ప్రజల దారిద్ర్యానికి వారి గత జన్మ కర్మలు / పాపాలు కారణమని చెబుతూ మతము ప్రపంచ పేదరికమును స్థిరపరచేదిగా ఉందని నెహ్రూ వాపోయాడు. అయితే నెహ్రూ నాస్తికుడు కాదు. ఆయన మతము మానవత్వము భారతదేశానికి సేవ చేయుటే నెహ్రూ తన మతముగ భావించాడు. ఒక సందర్భములో నెహ్రూ 'నాదేశానికి సేవ చేయుటే మతమైతే నేను మతవాదినే, అట్లు కానిచో నేను మతవాదిని కానని' పేర్కొన్నాడు. అనగా మతమును నెహ్రూ సామాజిక సేవ సాధనంగానే చూశాడు గానీ, యజ్ఞ యాగాలు, మూఢ విశ్వాసాల ప్రాతిపదికగా చూడలేదని గ్రహించనగును.

o మతం పై నెహ్రూ అవగాహనను పరిశీలించగా అతడు ప్రధానంగా లౌకిక వాదిగా అవగతమవును. నెహ్రూ లౌకిక తత్వాన్ని బలపరుస్తూ విన్సెంట్ షీన్ [ Vincent Sheean] 'Nehru - the years of power' అను తన రచనలో 'నెహ్రూతో తనకున్న 12 సం॥ల సాహచర్యంలో ఎన్నడూ, నెహ్రూ ప్రసంగాలలో గానీ, పుస్తకాలలో (రచనలలో గానీ) గానీ మత మరియు హిందూ సంస్కృతుల ప్రభావములను చూడలేదని, ఇది భారతదేశంలోనే అరుదైన సంఘటనని పేర్కొన్నాడు. నెహ్రూలో వున్న లౌకిక సంకల్పమే ఆయనను స్వేచ్ఛా సమానత్వ ప్రాతిపదికగా వుండే లౌకిక రాజ్య భావన వైపు నడిపించింది. నెహ్రూకు లౌకిక వాదమనునది ఒక రాజకీయ భావననే కాక, అన్ని మత విశ్వాసాలను తనలో ఇముడ్చుకోగల ఒక సాంఘిక విప్లవాత్మక భావన కూడా. ఈయన లౌకికవాదము వ్యక్తులను ఆయా సామాజిక తరగతులుగా బంధించే దొంతర్ల వారీ (Hierarichy) సామాజిక నిర్మాణమును వ్యతిరేకిస్తుంది. నెహ్రూ లౌకిక వాదమును అంత: సమూహం, అంత: మానవుల మధ్య సరైన సంబంధాలను ఏర్పరచే మానసిక ఏర్పాటుగ భావించాడు. నెహ్రూ లౌకిక తత్వమును మత వ్యతిరేకికాగానీ, కేవలం భౌతిక ప్రయోజన ప్రాతిపదికగానీ చూడలేదు. దీనిని ఆధ్యాత్మిక (spiritual) అంశాల ప్రాతిపదికగా చూశాడు. ఇది తప్పని సరిగా ఆధ్యాత్మిక విలువలను మరియు కొన్ని ప్రవర్తన సామర్థ్యాలను కల్గి వుండాలని నెహ్రూ పేర్కొన్నాడు.

నెహ్రూ లౌకిక భావన ప్రధానంగా నాలుగు అంశాలతో మత స్వాతంత్ర్యము మత విషయాలలో రాజ్య తటస్థ వైఖరి, మతేతర సాంఘిక జీవనము మరియు మానసిక సంసిద్ధతలు ముడిపడి వుంది.

**మత స్వాతంత్ర్యము:-** నెహ్రూ అభిప్రాయములో లౌకిక తత్వ అతి ముఖ్య లక్షణము అన్ని మతాలకు సమాన స్థాయి అందుబాటులో ఉండుట, మరియు మత కార్యక్రమాల నిర్వహణకు అందరికి సమాన అవకాశాలుండుట. ఏ మతానికి మినహాయింపులుండరాదు. అలానే ఏ ఒక్కరికి మత కారణంగా మౌలిక హక్కులు దూరం కారాదు. లౌకిక వాదము అన్ని మత విశ్వాసాలను గౌరవిస్తుంది.

ప్రతి మతమునకు సమాన అవకాశాలు కల్పిస్తుంది. భారతదేశం విభిన్న మతాల మణిహారమని, వారు ఏ మతం వారైనా ఈ దేశంలో నివసించే వారందరూ భారతీయులేనని నెహ్రూ పేర్కొన్నాడు.

ఆధునిక సమాజాలు బహుళత్వము లక్షణముగా కల్గి వున్నాయని, ప్రతి వ్యక్తి మత నమ్మకానికి విలువ, భద్రతా వుండాలని నెహ్రూ పేర్కొంటూ లౌకిక తత్వం ఒక ఫెడరల్ సూత్రమని భిన్న మతాలు కల అన్ని సమాజాలలో అందరి శ్రేయస్సును ఇది సమానంగా కాపాడగల్గునని భావించాడు.

## 15.16 మత విషయాలలో రాజ్య తటస్థ వైఖరి :-

లౌకిక రాజ్యము మతేతర రాజ్యము. మత విశ్వాసాలకు అది దూరంగా ఉంటుంది. రాజ్యము ఏ మతాన్ని ప్రోత్సహించక మత విషయాలలో తటస్థంగా ఉంటూ, అన్ని మతాలను సమానంగా ఆదరించాలని నెహ్రూ కోరాడు. 'హిందూరాజ్, ముస్లింరాజ్' అన్న పదాలను నెహ్రూ తీవ్రంగా ఖండించాడు. అన్ని మతాలు పరస్పర సహజీవన సూత్రం పై ఆధారపడుతూ వుండేలా రాజ్యం మతముకు సంబంధించి పూర్తి తటస్థ వైఖరి కల్గి ఉండాలని నెహ్రూ ఆశించాడు.

**మానసిక స్థితి:-** లౌకికతత్వము వివిధ మతస్థులు పరస్పరం సోదర భావాన్ని పెంపొందించుకొని, సహజీవనం చేసేందుకు అవసరమైన మానసిక సిద్ధపాటును నెలకొల్పాలి. తాను బ్రతుకుతూ, ఇతరులు బ్రతికేందుకు సహకరించే వైఖరి వ్యక్తిలో బలపడాలి. అధిక సంఖ్యాకులు గల మతము అల్ప సంఖ్యాకులుగా వున్న మతాల పై ద్వేషాన్ని పెంపొందించుకొనక, మైనారిటీల ప్రయోజనాలు, భద్రత తమ పవిత్రకర్తవ్యముగ మెజారిటీ మతము గుర్తించుట లౌకిక తత్వ విజయానికి ఎంతగానో దోహదపడునని నెహ్రూ నొక్కి ఒక్కాణించాడు.

## 15.17 మతేతర సాంఘీక జీవనము :-

ప్రజల సాంఘీక జీవనాన్ని మతము ప్రభావితం చేయుట నెహ్రూకు నచ్చదు. సామాజిక అంశాలైన వివాహము - విడాకులు, సివిల్, క్రిమినల్ చట్టాలు, రాజకీయ పార్టీల వ్యవస్థీకరణ మరి అనేక ఇతర అంశాలు సహితం మతాధికారం ప్రభావమునకు లోనవుట నెహ్రూను అసహనమునకు గురి చేసింది. ఉదాహరణకు హిందూమత ప్రభావం ద్వారా ఏర్పడిన స్థిరమైన కుల వ్యవస్థ నెహ్రూకు అంగీకారం కాదు. ఆయా మతాల ప్రభావం ద్వారా కొనసాగే సాంఘీక జీవనము లౌకిక తత్వాన్ని దెబ్బతీస్తుందని నెహ్రూ వాపోయాడు.

ఈ విధముగా నెహ్రూ లౌకిక వాదము రాజకీయాలలో మత ప్రాధాన్యతను నిరసిస్తుంది. ఆధునిక ప్రపంచ సమాజాలన్నింటిలో లౌకిక తత్వము / మతేతర రాజ్య భావన అనివార్యమని, మన దేశంలోనైతే ఇది ఒక రాజకీయ అవసరతని, భిన్నత్వంలో ఏకత్వ సాధన సూత్రమని నెహ్రూ లౌకిక విధానమును ప్రస్తుతించాడు.

## 15.18 సామ్యవాదము / ఆర్థికాంశాలు :-

నెహ్రూ ఇంగ్లండులో విద్యనభ్యసిస్తున్న సమయంలోనే (క్రీ॥శ॥ 1910 - 12) ఫేబియన్ సామ్యవాదం పై మక్కువను కనపర్చాడు. జార్జి బెర్నాండ్ షా, వెబ్‌ల రచనలు నెహ్రూని ఎంతగానో ప్రభావితం చేశాయి. నెహ్రూ ఫేబియన్ సామ్యవాదమును స్పష్టమైన మానవతా వాదముగ అంగీకరించలేకపోయాడు. నెహ్రూ తన విద్యాభ్యాసానంతర 14 సం॥లో ఎంతో పరిణతి చెందినాడు. ఈ కాలంలో ఆయన రచనలలో మరియు ఉపన్యాసాలలో 'భారత రాజకీయ విముక్తి' ప్రధానంగా చోటు చేసుకుంది. 1926లో ఉత్తర ప్రదేశ్ తీవ్రవాద సమూహముతో చేయి కల్పి వ్యవసాయ సామ్యవాదం (Agrarian Socialism) పథకమునకు రూపకల్పన చేశాడు. వాస్తవంలో అది వ్యవసాయదారులను అధికంగా పీడిస్తున్న తాలుకాదారి మరియు జమిందారీ విధానాలను వ్యతిరేకించు ఉద్యమానికే పరిమితమైంది.

1926 - 27 సంఖలలో నెహ్రూ యూరప్ పర్యటనలో ఉన్నప్పుడు, సామాజిక ఆర్థిక స్వాతంత్రాలకై, తీవ్ర ఆదర్శాలచే ప్రేరేపించబడినాడు. బ్రస్సెల్స్ (బెల్జియం)లో జరిగిన సామ్రాజ్యవాద వ్యతిరేక సమావేశాలలో నెహ్రూ పాల్గొన్నాడు. రష్యాలో ఉన్న కొద్ది కాలంలో లెనినిస్ట్ కమ్యూనిజం పై విశేష ఆకర్షణను పెంచుకున్నాడు. తన 'Autobiography'లో కమ్యూనిస్టు తత్వం జీవిత సమస్యలకు సంబంధించి నెహ్రూకు సంతృప్తిని మరియు ఆశని కల్గించిందని పేర్కొన్నాడు. కమ్యూనిజం గతాన్ని వివరించటంతో పాటు భవిష్యత్ పై ఆశని కల్గిస్తుందని, మార్క్సిజం యొక్క శాస్త్రీయత, మత వ్యతిరేకత మరియు మూఢ విశ్వాసాల వ్యతిరేకత వైఖరి తనను ఆకట్టుకున్నాయని నెహ్రూ తెలియపర్చాడు. చారిత్రక నిర్మితులను బాహ్యంగా అధ్యయనం (superficial study) చేయు వారికి బహిర్గతమయ్యే వాస్తవాల మరియు పరిణామ క్రమంలో అవసరమైన అంతర్లీన గొలుసులుగా మార్క్సిస్టు చారిత్రక భౌతిక వాదము విశ్లేషిస్తుంది. ఇది చరిత్రను దైవ నైయుక్తిక శైలి ఆధారంగా కాక, సాంకేతిక సామర్థ్యాల మరియు ఆర్థిక శక్తుల ప్రాతిపదికగా వాఖ్యానిస్తుంది. చారిత్రక ప్రభావాలు లేదా శక్తులు అంతిమ స్థాయి ఆనందానికి దారి తీస్తాయనే భావన భౌతిక వాదులకు మరియు మత విపరీత ధోరణులను వ్యతిరేకించు వారికి మనోజ్ఞమైనదిగా ఉంటుంది. ఇట్టి మార్క్సిస్టుల చారిత్రక విశ్లేషణ, దాని వర్గరహిత సమాజ స్థాపన అనివార్యత నెహ్రూకు అంగీకారమే. చారిత్రక క్రమాన్ని అంగీకరించుటలో గ్రహించిన ఇట్టి సైద్ధాంతికత 1929-32 సంవత్సరముల మధ్య గల ప్రపంచ ఆర్థిక మాంధ్యాల పాఠాల ద్వారా బలపడి నెహ్రూను మార్క్సిస్టు విశ్లేషణను మరియు లక్షణాలను సమర్థించేట్లు చేశాయి. అయితే నెహ్రూ సంపూర్ణంగా కమ్యూనిజంను విశ్వసించినట్లు కానరాదు. ఆయనకున్న వ్యక్తి స్వేచ్ఛ ప్రియత్వము, ఆచరణలో కమ్యూనిస్టుల అధికారములో ప్రక్రియలను వ్యతిరేకించేలా చేశాయి. మార్క్స్ చారిత్రక భౌతిక వాదమును ప్రశంసించినా ఆయన 'మిగులు విలువ' సిద్ధాంతము పై ఆశక్తిని కనుపర్చలేదు.

1929లో 'ఇండియన్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్' మరియు భారత జాతీయ కాంగ్రెస్‌లకు నెహ్రూ అధ్యక్షుడుగా ఉన్నాడు. ఆయన చేసిన అధ్యక్ష ఉపన్యాసంలో సామ్యవాదం మరియు గణతంత్ర విదానం (Rephblicanism)ల పట్ల తన నిబద్ధతను సూటిగా ప్రకటించారు. 1930వ దశాబ్దంలో తన సామ్యవాదం ఒవెన్, ఫూరియర్ మరియు సెంట్ సైమన్‌ల వంటిది కాదని, అది అణగారిన వర్గాలకు, జాతులకు జరుగుతున్న నష్టాన్ని తొలగించే తత్వముగ ఉంటుందని నెహ్రూ ప్రకటించాడు. నెహ్రూ సామ్యవాదమును ఒక ఆర్థిక సిద్ధాంతముగ భావించి, మౌలిక ఉత్పాదక మరియు పంపిణీ సాధనాలు రాజ్య అజమాయిషీలో వుండాలని పేర్కొన్నాడు.

రాజకీయ రంగంలో స్వేచ్ఛా భావనను కోరిన, ఆర్థిక అంశాలలో రాజ్య జోక్య రహిత భావనను వ్యతిరేకించాడు. ఈయన ఆర్థిక భావాలు కొంత వరకు జర్మన్ దేశ సామ్యవాదులైన వాగ్నర్ (Wagner) ష్మమొల్లర్ (Schmaller) వంటివారి భావాలకు దగ్గరగా ఉన్నాయి. పరిశ్రమలకు రాజ్య / ప్రభుత్వ సహాయమును అంగీకరించినా ప్రైవేటు రంగాన్ని సముచితంగా బలపరచాలని నెహ్రూ భావించాడు.

నెహ్రూ నైతిక సామ్యవాద (Othical Sooalism) భావనను విశ్వసించాడు. దీనిని మానవ జీవన తత్వముగ నెహ్రూ భావించాడు. సంగ్రహంగా ప్రైవేటు ఆస్తి హక్కును రద్దు పరచుటను నెహ్రూ సామ్యవాదమును భావించవచ్చు. మార్క్సిస్టు లెనినిస్టుల మాదిరి నెహ్రూ కూడ సామ్యవాదమును మానవుని ప్రవృత్తులను అలవాట్లను కోరికలను మార్చుకొనుటకు అవసరమైన ప్రేరణలను విడుదల చేసేదిగా ప్రవచించాడు. నూతన నాగరికతకు సామ్యవాదం ఆధారమౌతుందని, కమ్యూనిస్టు రష్యా తరహాలోనే ప్రపంచ భవిషత్ రూపకల్పన జరగాలని, భారత జాతీయ కాంగ్రెస్ కూడ సామ్యవాద సంస్థగా మారితే మంచిదని 1936లో తన కోరికను వ్యక్తపరిచాడు. నెహ్రూ అధ్యక్షతన కాంగ్రెస్ 1955 అవధి సమావేశంలోసామ్యవాద తరహా సమాజ స్థాపనా ఆదర్శాన్ని అంగీకరించింది. ఇట్టి సామ్యవాద తరహా సమాజంలో (1) మౌలిక ఉత్పాకతా సాధనాలు సామాజిక యాజమాన్యం మరియు నియంత్రణలో ఉంటాయి. (2) జాతీయ ఉత్పాదకతను పెంచుట మరియు జాతి సంపదను సమానంగా విభజించుట ప్రముఖమైన అంశముగ ఉంటుంది. ఆయన అభిప్రాయంలో సామ్యవాదము మరియు సామ్యవాద తరహా సమాజము రెండూ ఒక్కటే. సమానత్వ సాధన, ఆర్థిక అసమానతలు తొలగించి అందరికి మంచి జీవితము అందించుటే సామ్యవాద తరహా సమాజ లక్ష్యాలు.

నెహ్రూ సామ్యవాదము కేవలం విద్యుద్దీకరణ మరియు పరిశ్రమల జాతీయకరణ ద్వారా ఉత్పత్తిని పెంచు దృష్టితో చూడక, ఆర్థిక పునర్ నిర్మాణములో గ్రామీణ కుటీర పరిశ్రమలకు మరియు ఖాదీకి కూడ స్థానం కల్పించే దృష్టితో చూసారు. లక్నో కాంగ్రెస్ సమావేశంలో అధ్యక్ష ఉపన్యాసం చేస్తూ

"నేను దేశంలో శ్రీఘ్ర పారిశ్రామికీకరణను కోరుతున్నాను. అది (పారిశ్రామికీకరణ) ఒక్కటి మాత్రమే ప్రజల సామర్థ్యాలను మెరుగు పరుస్తుందని మరియు పేదరికము పై పోరు సల్పునని తలంచుతాను. అయినప్పటికి నేను గతంలో మనస్ఫూర్తిగా ఖాదీ కార్యక్రమానికి సహకరించాను. ఇక ముందును సహకరిస్తాను, ఎందుకంటే ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమలు మన ప్రస్తుత ఆర్థిక వ్యవస్థలో ఒక ఖచ్చితమైన స్థానం కల్గి ఉన్నాయని నేను నమ్ముతున్నాను" అని పేర్కొన్నాడు.

భారత జాతీయ కాంగ్రెస్, నెహ్రూను 1938లో జాతీయ ప్రణాళికా కమిటీ ఛైర్మన్‌గా నియమించింది. ఈ హోదాలో కూడ ఆయన భారీ పరిశ్రమలతో పాటు దేశ పురోభివృద్ధికి కుటీర పరిశ్రమలను ప్రోత్సహించవలసిన అవసరతను ప్రస్తావించాడు. 1945లో అమెరికన్ యునైటెడ్ ప్రెస్‌కు ఇంటర్వ్యూ యిస్తూ (సిమ్లాలో) పురోగామి సామ్యవాదం (Progressive Socialism) పై మాట్లాడుతూ భారతదేశంలో వ్యవసాయ పునర్ నిర్మాణ అవసరతను నెహ్రూ నొక్కి ఒక్కాణించారు. బ్రిటీష్ పేటియనిస్టుల వలె కాక, నెహ్రూ తక్షణమే సామ్యవాదంను ఆచరించవచ్చని పేర్కొన్నాడు. విజ్ఞాన శాస్త్ర మరియు సాంకేతిక సామర్థ్యాల కవచము ద్వారా ఉత్పత్తిని పెంచ వచ్చునని విశ్వసించాడు. ఉత్పాదకత పురోభివృద్ధిలో ప్రణాళికా భావనను ఒక బలమైన సాధనంగా నెహ్రూ నమ్మినాడు. మిశ్రమ ఆర్థిక విధానము మరియు ఆచరణలకు బద్ధుడై పంచవర్ష ప్రణాళికలకు శ్రీకారం చుట్టాడు.

నెహ్రూ సామ్యవాద భావాలు క్రమేపి ఆయన మేధస్సులో వచ్చిన అనుభవవాద ఆలోచనల కనుగుణంగా మార్పు చెందుతూ వచ్చాయి. ఈ విధంగా జాతీయ ఉద్యమాన్ని నెహ్రూ ఆర్థిక కోణంలో అర్థం చేసుకుంటూ సామ్యవాద తరహా సమాజం పై మొగ్గు చూపాడు.

## 15.19 నెహ్రూ - జాతీయవాదము :-

ప్రముఖ జాతీయవాదియైన నెహ్రూ జాతీయవాదమునకు సంబంధించిన నూతన సిద్ధాంతమును ప్రతిపాదించలేదు. భారతదేశంలో సాంస్కృతిక పునాదుల మీద పోషించబడుతూ వస్తున్న వస్తుపర మౌలిక ఐక్యతను బట్టి విశేషంగా ప్రభావితుడైనాడు. పలు భిన్నత్వాలు ఉన్నప్పటికి భారతదేశంలో అనాదినుంచి ఇట్టి ఐక్యత కొనసాగుతున్నదని పేర్కొన్నాడు. భారతదేశ విశిష్ట లక్షణమైన సాంస్కృతిక బహుతనము (Clutural Pluralism) మరియు అనేక సంస్కృతుల సమాగమము (సమన్వయము) నెహ్రూను ఎంతగానో ఆకర్షించాయి. రవీంద్రనాదుని సంశ్లేషణాత్మక విశ్వజనీన వాదము (synthetic universalism) నెహ్రూను విశేషంగా ఆకర్షించింది. జాతీయ వాదము మతపరిమత వైఖరిలో సంగ్రహపర్చుట నెహ్రూకు అంగీకారము కాదు. కావుననే దయానంద సరస్వతి, వివేకానందుడు, బిపిన్ చంద్రపాల్, అరవిందులు జాతీయవాదం పట్ల అనుసరించిన మత వైఖరి నెహ్రూను ప్రభావితం చేయలేకపోయింది. అయితే జాతీయవాదము ఉద్వేగభరిత భావనలపై ఆధారపడుతుందని అంగీకరించాడు. Agnostic అయినప్పటికి భావోద్రేకమునకు అమితంగాలోనై నెహ్రూ 'భారత మాతృ ఆదర్శ భావన'ను అంగీకరించాడు. ఈయన అభిప్రాయంలో జాతీయ వాదమనునది స్వీయ ఘనతకు సంబంధించిన ఒక ఉన్నత భావన. 'జాతీయవాదమనునది మౌలికముగా గత అనుభావాలకు, సాంప్రదాయాలకు మరియు విజయాలకు సంబంధించిన సమూహ జ్ఞాపకము. గతంలో కంటే జాతీయవాదము ప్రస్తుతము శక్తివంతముగ వున్నది............ఎప్పుడైతే ఒక సమస్య ఉత్పన్నమౌతుందో అప్పుడు జాతీయవాదము ఆవిర్భవించి ఆ సందర్భాన్ని ఏలుబడి చేస్తుంది మరియు ప్రజలు వారి ప్రాచీన సాంప్రదాయాలలో సౌఖ్యమును శక్తిని వెదుకుతారు. ప్రస్తుత యుగములోని ప్రాముఖ్య పురోగతి ఏమనగా తమ జాతికి సంబంధించిన గతాన్ని తిరిగి కనుగొనుటే" అని నెహ్రూ పేర్కొన్నాడు.

బావోద్వేగములతో పాటు జాతీయవాదమునకు సుస్థిర సామాజిక, రాజకీయ మరియు ఆర్థిక పునాదులు కూడా ఉంటాయని, వీటితో పాటు భౌతిక ప్రయోజనాలను కూడా జాతీయ వాదం కాంక్షిస్తుందని నెహ్రూ అభిప్రాయపడినాడు. ఇట్టి జాతీయవాదమే ఐరోపా రాజ్యాలను జాతి రాజ్యాలుగా నెలకొల్పిందని, ఇదే జాతీయవాదము ఆఫ్రో-ఆసియా వలస రాజ్యాలలో ప్రజలను రాజకీయ మరియు ఆర్థిక ప్రజాస్వామ్యము వైపు గత శతాబ్దంలో పురికొల్పి వారికి విజయాన్ని చేకూర్చిందని నెహ్రూ పేర్కొన్నాడు. ప్రస్తుతం జాతీయవాదము రాజకీయ స్వాతంత్రము లేదా రాజకీయ ప్రజాస్వామ్యమునకు పర్యాయ పదంగా మారిందని, అయితే ఆర్థిక ప్రజాస్వామ్యమును విస్మరిస్తే అంతర్గత సంఘర్షణలు తలెత్తి జాతీయవాదము పలు సవాళ్ళను ఎదుర్కొనవలసి వస్తుందని నెహ్రూ హెచ్చరించాడు. జాతీయ ప్రయోజనాలను అందించే జాతీయవాదములో ఇతర దేశాలు లేదా పరజాతి పట్ల ద్వేషాన్ని పెంచి, సంకుచిత స్వార్ధ భావనను బలపరచే ప్రమాద పోకడలను కల్గివుందని వీటిని అదుపులో ఉంచవలసిన అవసరతను నెహ్రూ ఒక్కాణించాడు.

నెహ్రూ యొక్క జాతీయవాద సిద్ధాంతము మరియు ఆచరణ ప్రధానంగా ఈ క్రింది మూడు అంశాల పై పురోభివృద్ధి చెందింది.

1. **బ్రిటీష్ పాలకుల జాతి అహంకార ధోరణి:-** ఇది నెహ్రూను కదలించింది. బ్రిటీష్ పాలకులు భారతీయుల పట్ల విస్తృత స్థాయిలో అనుసరించిన జాతి విచక్షణా విధానము నెహ్రూలో జాతీయవాదము ఆవిర్భవించి బలపడుటకు కారణమైనది.

2. **బ్రిటీష్ పాలకుల ఆర్థిక దోపిడి:-** తమ వలస వాదము సామ్రాజ్య వాదముల ద్వారా బ్రిటీష్ పాలకులు భారతదేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయుట దేశ దారిద్యతకు కారణమైందని నెహ్రూ బ్రిటీష్ పాలనను నిందించాడు. బ్రిటీష్ పాలనాధికారము పెరుగుతున్న కొద్దీ ఆయా రాష్ట్రాలలో లేదా ప్రాంతాలలో పేదరికము ఎలా స్థిరపడుతూ వచ్చిందో (స్థూలంగా) నెహ్రూ వివరించాడు. బ్రిటీష్ పాలన భారతదేశ గ్రామీణ వ్యవస్థను చిన్నాభిన్నం చేసింది. జమిందారీ విధానము ప్రవేశ పెట్టినందున గ్రామీణ ప్రజ, గ్రామ భూమి మీద ఉమ్మడి సహజీవన కొనసాగింపు పైన నియంత్రణను కోల్పోయి దారిద్ర్యంలోకి నెట్టబడ్డారని నెహ్రూ చింతించాడు. ఇంగ్లండు పారిశ్రామిక విప్లవ పురోగతికి, వారు బెంగాల్ రాష్ట్రాన్ని కొల్లగొట్టారని, పారిశ్రామిక పెట్టుబడిదారీ దేశమైన ఇంగ్లండుకు భారతదేశము ముడి సరుకులు అందించే ప్రతినిధిగా మారిందని నెహ్రూ వాపోయాడు.

3. **రాజకీయ పాలనా అంశాలు:-** సామ్రాజ్యవాద బ్రిటీష్ పాలకులు అధికారమును నియంత్రణను వారివద్దనే కేంద్రీకరించుకొని, నిర్ణయాకరణను కూడా వారి ఆధిపత్యంలోనే వుంచుకొని, విభజించి పాలించు సూత్రమును తెలివిగా ఉపయోగించి భారత ఐక్యతను దెబ్బతీశారని నెహ్రూ అభిప్రాయపడినాడు.

## 15.20 నెహ్రూ - అంతర్జాతీయ వాదము :-

నెహ్రూ తత్వములో దాగివున్న మానవతా వాదము లేదా ఆయన Agnosticism, నెహ్రూలో సర్వమత సౌభాతృత్వ భావనను పెంపొందించి, అంతర్జాతీయ వాదిగా ఆయనను స్థిరపరచింది. ఆఫ్రికా, ఆసియా దేశాల సంపూర్ణ రాజకీయ ఆర్థిక విముక్తిని కోరిన ప్రముఖ ప్రతినిధిగ నెహ్రూ కీర్తించబడినాడు. నెహ్రూ యొక్క ఆఫ్రికా - ఆసియా దేశాల ఐక్యత మరియు ప్రగతి భావన అనేకులైన పాలకులను నాజర్, సాదత్ వంటి వారిని ప్రభావితమొనర్చింది. నెహ్రూ అంతర్జాతీయ భావన వలస వాదమును, సామ్రాజ్యవాదమును వ్యతిరేకిస్తుంది. ఈ నేపథ్యంలో ఆయా దేశాల స్వాతంత్ర ఉద్యమాలను బలహీనపరచుటకు భారత సైన్యమును బ్రిటీష్ ప్రభుత్వము ఉపయోగించుటను నెహ్రూ వ్యతిరేకించాడు. ఫాసిస్టు శక్తులు ప్రపంచ శాంతికి ప్రమాదకారులుగా భావించిన, ఫాసిస్టు ధోరణులను వ్యతిరేకిస్తూ ఆఫ్రికా, ఆసియా దేశాలలోని స్వాతంత్ర ఉద్యమాలకు తన మద్దతు ప్రకటించాడు. ప్రపంచ శాంతిని కాంక్షిస్తూ, నెహ్రూ కొరియా, సుయాజ్ కాలువ సంక్షోభాలలో క్రియాశీలక పాత్ర వహించి ఐక్యరాజ్య సమితిని బలపరచి శాంతి స్థాపనకు తోడ్పడినాడు.

అంతర్జాతీయ వాదియైన నెహ్రూ జాతి దురభిమాన ధోరణి పై అప్రమత్తత అవసరతను నొక్కి చెప్పాడు. సంకుచిత, స్వార్థపూరిత, విస్తరణాత్మక మరియు అహంకారయుత జాతీయవాదమునకు నెహ్రూ వ్యతిరేకి. ఇట్టి జాతి దురభిమానమే ప్రపంచంలో యుద్ధాలకు కారణమని పేర్కొంటూ, ప్రపంచ శాంతి స్థాపనకు ఆర్థిక కోణంలో కూడా పరిష్కారం వెదకవలసిన అవసరతను సూచించాడు.

తన 'Discovery of India' రచనలో 'ప్రపంచ ఒత్తిడులను రూపుమాపి, అంతర్జాతీయ సమతుల్యత సాధనకు జాతీయవాదంను క్రామిక నియంతృత్వ నూతన ఆదర్శాలను అంతర్జాతీయ వాదముతో విలీనత (fusion) చెందాలని' నెహ్రూ పేర్కొన్నాడు.

పారిశ్రామికీకరణ అంతర్జాతీయ స్వభావమును కల్గివుందని, ఇది జాతీయ సరిహద్దులను చెరిపి, ప్రతి రాజ్యాన్ని అది ఎంత శక్తివంతమైనప్పటికి, ఇతర దేశాల మీద ఆధారపడేట్లు చేసిందని, ఉత్పత్తి, పంపిణీ మరియు రవాణా సాధనాలు సార్వజనీనత చెంది అంతర్జాతీయతకు దోహదపడిందని నెహ్రూ అభిప్రాయపడినాడు. అయితే వ్యక్తుల ఆలోచనలు ఇట్టి వాస్తవికతను గ్రహించక జాతీయవాద మూర్ఖత్వముతోనే నియంత్రించబడుతున్నాయని, ఏ దేశం వాస్తవంలో స్వతంత్రముగ మనజాలదని, అన్ని రాజ్యాలు పరస్పరం ఒక దానిపై ఒకటి ఆధారపడతాయని కావున అంతర్జాతీయ అనివార్యమని దీనిని పారిశ్రామికీకరణ పెట్టుబడిదారీ సమాజం, సామ్యవాదం ప్రోత్సహిస్తున్నాయని నెహ్రూ అభిప్రాయపడినాడు.

మానవ సంక్షేమము ఆయన అంతర్జాతీయ భావనలో ప్రధానాంశము. ఆయన హేతుబద్ధ ఆలోచనలు అనుభవవాదము శాంతియుత సహజీవనము పై మరియు ఏక ప్రపంచ భావన (ప్రభుత్వం)పై నమ్మకాన్ని పెంచాయి. నేటి అణుయుగంలో అంతర్జాతీయత అనివార్యమని, ప్రపంచ మనుగడకు ఐక్యరాజ్య సమితి ఆదర్శాల పై విశ్వాసం ప్రకటించి, సైనిక కూటములను దివధృవ (Bipolar) ప్రపంచ రాజకీయాలను నెహ్రూ వ్యతిరేకించాడు.

## 15.21 అలీన విధానము :-

నెహ్రూ ప్రతిపాదించిన అలీన విధానము అంతర్జాతీయ రాజకీయాలలో క్రియాశీలక భూమికను కల్గి వున్నది. నెహ్రూ అలీన విధానము మూడు సైద్ధాంతిక మరియు ఆచరణాత్మక మూలాంశాల (యోచనల) మీద ఆధారపడి ఉంది. మొదటిగ భారతదేశము నూతనంగాఆవిర్భవించిన జాతి రాజ్యము. కావున సామాజిక ఆర్థిక పునర్ నిర్మాణముపై దృష్టిని కేంద్రీకరించవలసి వుంది. తన ఆర్థిక, సామాజిక అశక్తులను దెబ్బతీసే సైనిక కూటములకు (Military Ulliance) దూరంగా వుండి ప్రణాళికాబద్ధమైన పురోభివృద్ధికి గాను అలీన విధానమును సహజమైనదిగా ఎంచుకున్నది.

రెండవదిగ అలీన విధానము చారిత్రక కారణాల దృష్ట్యా కూడా భారతదేశమునకు అనివార్యము. భారతదేశ చరిత్ర ప్రపంచ శాంతినే కోరుకుందని, ఎప్పుడూ విస్తరణాత్మక ప్రాబల్యాత్మక రాజకీయాలను సమర్థించలేదని నెహ్రూ పేర్కొన్నాడు. గతంలో ఈ సిద్ధాంతమును గౌతముడు, గాంధీలు ఆచరించారు. ఈ విధంగా భారతదేశం అలీన విధానమును ఎంచుకొనుట చారిత్రక అంశాల పై ఆధారపడినను, వర్తమాన, భవిషత్ ప్రయోజనాలను కూడా పరిగణలోకి తీసుకున్నట్లు గమనించవచ్చును.

మూడవదిగ ప్రపంచ ప్రాబల్యాత్మక రాజకీయాలు అలీన విధాన ఆవశ్యకతను బలపరచినవి. సైనిక మరియు ద్విధృవ కూటములుగ (పక్షములుగ) విడిపోయిన ప్రపంచ రాజకీయాలలో సుస్థిర శాంతి స్థాపనకై మరియు అంతర్జాతీయ ఒత్తిడిని తొలగించుటకు, ఈ సైనిక కూటములకు (అమెరిక, రష్యా కూటములకు) ప్రచ్ఛన్న యుద్ధానికి వెలుపల వుండే రాజ్యాల కూటమి అవసరత గుర్తింతబడినందున అలీన విధానము ఆవిర్భవించింది.

## 15.22 పంచశీల :-

అంతర్జాతీయ రాజకీయాలలో నెహ్రూ సామరస్య ధోరణిని ప్రతిపాదించాడు. నెహ్రూ శాంతియుత దృక్పథాన్ని ప్రతిపాదిస్తూ సంప్రదింపుల సామర్థ్యాలను మరియు పరస్పర సహకార అవగాహనను అంగీకరించాడు. ఇందుకుగాను ప్రపంచ సుస్థిర స్థాపనకు అత్యావసరమైన 'పంచసీల' సూత్రములను ప్రతిపాదించాడు. జూన్, 1954 సం॥లో బీజింగ్ నగరమందు నెహ్రూ, చైనా ప్రధాని చే-ఎన్-లాయ్‌లు సంయుక్తంగా ప్రకటించిన పంచశీల ప్రకటనలోని మౌలిక అంశాలు -

1. ప్రాదేశిక సమగ్రతను, సార్వభౌమాధికారమును పరస్పరం గౌరవించుట,
2. పరస్పరం ఒకరి పై మరొకరు దురాక్రమణ చేయుకుండుట,
3. ఒకరి అంతర్గత వ్యవహారాలలో మరొకరు జోక్యం చేసుకొనకుండుట,
4. పరస్పర సహకారము - అభివృద్ధి, మరియు
5. శాంతియుత సహజీవనము.

పంచశీల పథకములోని ఈ ఐదు అంశాలు రాజ్యాల మధ్య భద్రతను, నమ్మకాన్ని పెంపొందిస్తాయి. అయితే విమర్శకులు నెహ్రూ పంచశీల భారత బలహీనతను చాటి చెప్పిందని, కాశ్మీర్, టిబెట్ సమస్యల అపరిష్కార స్థితికి ఇదే కారణమని భావిస్తారు. అయితే నెహ్రూ పంచశీల పథకము ప్రపంచ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే సామర్థ్యం కలదని, ఏ దేశ అభివృద్ధియైన శాంతియుత సహజీవనం ద్వారానే సాధ్యమని, ప్రపంచ రాజ్యాలు పరస్పర సంఘర్షణను వీడి పరస్పరం సహకరించుకుంటూ మానవతా విలువలు కొనసాగించుటకు పంచశీల ఉపకరిస్తుందని భావించవచ్చు.

2004 జూన్ మాసంలో పంచశీల 50 సం॥ల పండుగ బీజింగ్‌లో జరిగింది. సమకాలీన సమాజంలో దీని అవసరత గుర్తించబడింది.

## 15.23 సారాంశం :-

జవహర్‌లాల్ నెహ్రూ నవ భారత నిర్మాతగా, శాంతిదూతగా, నిష్కళంక దేశభక్తునిగా, ప్రజాసామ్యవాదిగా, భారత తొలి ప్రధానిగా కీర్తించబడేవాడు. ఆయనకు చరిత్ర అభ్యాసంతోపాటు సంపూర్ణ చారిత్రక దృగ్గోచరము పై మక్కువ ఎక్కువ. వ్యక్తి స్వాతంత్ర్యము, సమానత్వము ప్రజాస్వామ్యమునకు చాలా అవసరమనే వారు. నెహ్రూ తత్త్వములో దాగి ఉన్న మానవతావాదము ఆయనలో సౌభ్రాతృత్వ భావనను పెంపొందించి, అంతర్జాతీయ వాదిగా స్థిరపరచినది. ఆయన ప్రతిపాదించిన అలీన విధానము అంతర్జాతీయ రాజకీయాలలో క్రియాశీలక పాత్ర కల్గిఉన్నది. ఆయన ప్రపంచ సుస్థిర స్థాపనకు అత్యావసరమైన 'పంచశీల' సూత్రాలు ప్రతిపాదించాడు.

## 15.24 మాదిరి ప్రశ్నలు :-

1. నెహ్రూ యొక్క లౌకికవాదాన్ని, జాతీయవాదాన్ని, అంతర్జాతీయవాదాన్ని గూర్చి వ్రాయము?
2. అలీన విధానము, పంచశీల గూర్చి వ్రాయుము?

## 15.25 ఆధార గ్రంథాలు :-


1. Varma, V.P. - Modem Indian Plotical Thought
2. Sankar Ghose - Modem Indian Plotical Thought
3. Bali D.R. - Modem Indian Thought

పాఠం : 16

# ఆచార్య నరేంద్రదేవ్ మరియు డా॥ రామ్‌మనోహర్ లోహియా

## 16.0 లక్ష్యం :

భారతదేశ స్వాతంత్రోద్యమములో పాల్గొన్న సోషలిస్టు ఉద్యమకారులలో అతిముఖ్యులుగా పేర్కొనతగినవారు ఆచార్య నరేంద్రదేవ్, డా॥ రామ్ మనోహర్ లోహియాలు వీరు భారతదేశంలో సోషలిస్టు ఉద్యమానికి పునాదులు వేసినారు. సోషలిస్టు ఉద్యమం దాదాపుగా వీరు ప్రతిపాదించిన సూత్రాలపైనే నడిచింది. వీరిరువురు భారత సోషలిస్టు ఉద్యమం చరిత్రలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకోగల్గినారు. ఆధునిక భారత సామాజిక రాజకీయ తత్వంలో సామ్యవాదం సాంప్రదాయం ఒక విడదీయరాని భాగం. ఈ విషయాన్ని విస్మరించి ఏ భారత రాజకీయ తత్వ శాస్త్రం సంపూర్ణం కాజాలదు. భారతదేశంలో సోషలిస్టు ఉద్యమ ఆవిర్భావం, భారత రాజకీయ సామాజిక చింతనలో సోషలిస్టు ఉద్యమానికి గల స్థానం, సామ్యవాద ఉద్యమానికి, జాతీయ ఉద్యమంతో పొత్తుకుదర్చడానికి ముఖ్యంగా ఆచార్య నరేంద్రదేవ్, రామ్‌మనోహర్ లోహియాలు చేసిన కృషి, వారి యొక్క రాజకీయ, సామాజిక, సామ్యవాద మొదలగు భావాలను వివరించడమే ఈ పాఠం యొక్క ప్రధాన లక్ష్యం.

## విషయసూచిక :


16.1 పరిచయం

16.2 సోషలిస్టు ఉద్యమ ఆవిర్భావం

16.3 స్వాతంత్ర్యానికి పూర్వం సోషలిస్టు సంప్రదాయం

16.4 ఆచార్య నరేంద్రదేవ్

16.5 మార్క్సిజమ్ పై నరేంద్రదేవ్ అభిప్రాయం

16.6 నరేంద్రదేవ్ సామ్యవాద భావాలు

16.7 గాంధేయ పద్ధతుల గురించి నరేంద్రదేవ్

16.8 కాంగ్రెస్ పార్టీతో సోషలిస్టు పార్టీ అవగాహనపై నరేంద్రదేవ్ అభిప్రాయం

16.9 సమ్మెపై నరేంద్రదేవ్ భావాలు

16.10 డా॥ రామ్ మనోహర్ లోహియ

16.11 లోహియా రాజకీయ కార్యకలాపాలు

16.12 సామ్యవాద ఉద్యమానికి లోహియా చేసిన కృషి

16.13 వీల్ ఆఫ్ హిస్టరీ - చరిత్ర గమనం

16.14 ఆసియాలోని సామ్యవాదపు సమస్యలు - లోహియా ఆలోచనలు

16.15 లోహియా నూతన సామ్యవాదం

16.15.1 నాలుగు మూలాధారాల రాజ్యం

16.15.2 ఏడు విప్లవాలు

16.16 ప్రపంచ సమాఖ్య

16.17 సారాంశం

16.18 మాదిరి ప్రశ్నలు

16.19 చదువదగిన గ్రంథాలు

## 16.1 పరిచయం :

భారతదేశంలో సామ్యవాద పెరుగుదల యించుమించు 20వ శతాబ్దపు ప్రక్రియ. పాశ్చాత్య దేశాలలో ప్రసిద్ధిగాంచిన సామ్యవాద తత్వవేత్తలు 19వ శతాబ్దంలో అభివృద్ధి చెందగా భారతదేశంలో ఆ అభివృద్ధి 20వ శతాబ్దానికి మారింది. ఋగ్వేదంలోను, బౌద్ధమత పవిత్ర గ్రంథాలలోను ప్రత్యేకంగా ధమ్మ పథంలో మానవతావాద ఆదర్శాలైన సౌభ్రాతృత్వం. ఏకత్వ ఉదహరింపులున్నప్పటికీ సామాజిక, ఆర్థిక పునర్నిర్మాణతత్వంగా సామ్యవాద పెరుగుదల భారతదేశంలో పాశ్చాత్య ప్రభావమే అనవచ్చు. భారతదేశంలో సామ్యవాద ఉద్యమ ఆవిర్భావం, దీని అభివృద్ధికి ఆచార్య నరేంద్రదేవ్, డా॥ రామ్ మనోహర్‌లోహియాలో చేసిన కృషిని తెలుసుకోవడం.

## 6.2 సోషలిస్టు ఉద్యమ ఆవిర్భావం :

భారతదేశంలో సోషలిస్టు తాత్వికచింతన 1926 తర్వాతనే మొదలైంది. అరవిందుడు 1893లో రాసిన కొన్ని వ్యాసాల్లో, 1908 ప్రాంతంలో తిలక్ వ్రాసిన కొన్ని వ్యాసాల్లోనూ, 1919 సం॥లో లాలాలజపతిరాయ్ వ్రాసిన గ్రంథం "ఫ్యూచర్ ఆఫ్ ఇండియన్ పాలిటిక్స్" అన్న గ్రంథంలో, "ప్రోలిటియల్" "రష్యన్ నిహిలిజం" సోషలిజం, "బోల్షిలిజం" అనేది కేవలం పొడిపొడి మాటలను తప్ప భారతదేశంలో సోషలిస్టు చింతనకు 1920 సం॥నికి పూర్వం ఉనికి కూడా లేదని చెప్పవచ్చును. 1920 సం॥లో సోషలిజాన్ని గురించి అమితమైన శ్రద్ధ కనబరచినవారు ఇద్దరే. యం.యస్. రాయ్, వీరేంద్రచటోపాధ్యాయ, ఈ మధ్య తెల్పిన విషయాలను బట్టి భగత్‌సింగ్ ఆయన అనుయాయుల రాతల్లో కొంత ఆదర్శపూరితమైన సోషలిస్టు భావాలున్నాయని తెలుస్తుంది. వీరు 1917 సం॥నాటి బోల్షివిక్ విప్లవం చేత ప్రభావితం చెందినవారే. జవహర్‌లాల్ నెహ్రూ తన తండ్రి వెంట 1926 సం॥లో రష్యా సందర్శించిన తర్వాత ఆయన హిందూ పత్రికలో ప్రకటించిన కొన్ని వ్యాసాలలో సోవియట్ రష్యా సాధించిన విజయాలను గురించి ఎంతో మక్కువ కనబర్చాడు నెహ్రూ.

భారతదేశంలో సామ్యవాద పెరుగుదలకు దారితీసిన సందర్భాలు పాశ్చాత్య దేశాలలో సామ్యవాద అభివృద్ధి సందర్భాలతో రెండు విధాలుగా భేదం కల్గియున్నవి. భారతదేశంలో సామ్యవాదం సామాజిక, ఆర్థిక పునర్‌నిర్మాణానికి ఒక ప్రణాళికగానే కాక విదేశీ సామ్రాజ్యవాద కఠినమైన సంకెళ్ళ నుండి విముక్తి పొందడానికి రాజకీయ విముక్తి ఆదర్శంగా కూడా పరిగణించబడుతుంది. వ్యవసాయ శ్రామికులను విముక్తి కల్పించే సిద్ధాంతాన్ని కల్పించడం రెండవ భేదం అవుతుంది.

1934 సం॥లో కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ భారతదేశంలో ఏర్పడినపుడు 1931 సం॥లో ఆవిర్భవించి, అప్పటికే పనిచేస్తున్న "బీహార్ సోషలిస్టు పార్టీ" 1934 సం॥లో ఏర్పడి పనిచేస్తున్న "బొంబాయి సోషలిస్టు గ్రూపు" కాంగ్రెస్ సోషలిస్టు పార్టీలో లీనమైనాయి. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఆవిర్భావానికి కారకులైన వారిలో ఆచార్య నరేంద్రదేవ్, జయప్రకాష్ నారాయణ్, అచ్యుత పట్వర్ధన్, డా॥ రామ్‌మనోహర్ లోహియా, మసానీ, కమలాదేవి, ఛటోపాధ్యాయ, పురుషోత్తంత్రికమ్‌దాస్, గంగాప్రసాద్ సిన్హా, యూసఫ్ మెహరాలీ, అశోక్ మెహతా, మొదలగువారు ముఖ్యులు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ మొదటి సమావేశం ఆచార్య నరేంద్రదేవ్ అధ్యక్షతన 1934లో పాట్నాలో జరిగింది. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ ఏర్పడినపుడు భారత జాతీయ కాంగ్రెస్‌లో భాగంగానే ఏర్పడింది.

## 16.3 స్వాతంత్ర్యానికి పూర్వం సోషలిస్టు సాంప్రదాయం :

భారతదేశంలో సమసమాజాన్ని స్థాపన చెయ్యాలన్నదే సోషలిస్టుల లక్ష్యం అయినప్పటికీ దేశానికి స్వాతంత్ర్యం రానిదే అట్టిది సాధ్యం కాదన్న విషయాన్ని సోషలిస్టులు విస్మరించలేదు. కాబట్టి అప్పటికి అవసరమైన "జాతీయతాభావాన్ని" సమసమాజ భావాలను తోడుచేయటమే తన లక్ష్యంగా సోషలిస్టులు అంగీకరించారు. సామ్రాజ్యవాద, వ్యతిరేక పెట్టుబడిదారీ వ్యవస్థను రూపుమాపాలనే కమ్యూనిస్టుపార్టీ భావాలకు, సోషలిస్టు భావాలకు చాలా తేడా వున్నాయనేది దీని వల్ల స్పష్టమవుతుంది. సోషలిస్టులు కాంగ్రెస్‌లోనే సోషలిస్టు గ్రూపుగా ఏర్పడింది. జాతీయతా భావాన్ని అన్ని వర్గాల ప్రజలకు అవసరమైన సిద్ధాంతంగా మార్చేందుకు, అశేష ప్రజానీకానికి వారి హక్కులను వారు రక్షించుకునేందుకు, సోషలిస్టు భావాల ద్వారా వారిని విద్యావంతుల్ని చేయటాన్ని సోషలిస్టులు వారి కార్యక్రమంలో తుదికంటా కొనసాగించారు.

## 16.4 ఆచార్య నరేంద్రదేవ్ :

ఆచార్య నరేంద్రదేవ్ భారతీయ సోషలిస్టు ఉద్యమ నాయకులలో ప్రముఖుడు. ఇతడు న్యాయశాస్త్రాన్ని అధ్యయనం చేసి, న్యాయవాద వృత్తిని స్వీకరించాడు. నరేంద్రదేవ్ బహుభాషా కోవిదుడు. ఇతనికి ఆంగ్లంలో, హిందీలో, సంస్కృతంలో మంచి ప్రావీణ్యం వుండేది. అరవింద, తిలక్‌లచే ఇతడు ఎక్కువగా ప్రభావితుడైనాడు. 1920లో జరిగిన సహాయ నిరాకరణోద్యమంలో తన న్యాయవాద వృత్తిని వదలివేశాడు. ఆయన కాశీ విద్యాపీఠంలో అధ్యాపకునిగా చేరి, తరువాత ఆ విద్యాపీఠానికి ప్రిన్సిపాల్ అయ్యాడు. పన్నుల నిరాకరణోద్యమంలో కూడా పాల్గొన్నాడు. 1934లో ఆయన అఖిల భారత కాంగ్రెస్ సోషలిస్టు సమావేశపు ప్రారంభసభకు అధ్యక్షత వహించాడు. రైతులను సంఘటితం చేసి, రైతు ఉద్యమంపట్ల ఎంతో ఆసక్తి ప్రదర్శించాడు. ఆయన అఖిల భారత కిసాన్ సభ స్థాపక సభ్యులలో ముఖ్యుడు. ఆయన నరేంద్రదేవ్ 1951లో జరిగిన ప్రజాసోషలిస్టు పార్టీ, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీ విలీనాల్లో శక్తివంతమైన పాత్రను నిర్వహించాడు.

సామ్యవాద ఉద్యమానికి, జాతీయోద్యమానికి మధ్య పొత్తు కుదర్చడానికి ఆయన ప్రయత్నించాడు. జాతీయ పోరాట ప్రాతిపదికను విస్తరించడం కోసం ఆర్థిక భావ సిద్ధాంతంతో ప్రజాబాహుళ్యాన్ని సమీకరించాలని ఆయన భావించినాడు. అంతర్జాతీయ స్వభావం గల సామ్యవాదానికి, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చే జాతీయోద్యమానికి మధ్య సమన్వయాన్ని కుదర్చడంలో ఆయన కృతకృత్యుడైనాడు. సామ్యవాదానికి మానవతా పునాదులు ఉండాలని ఆయన నొక్కి చెప్పినాడు.

నరేంద్రదేవ్ బౌద్ధ తత్వశాస్త్రంలో మంచి విద్వాంసుడు. ఆయనకు మేధా సంబంధమైన చాలా అభిరుచులు వుండేవి. సిద్ధాంతపరంగా ఆయన మార్క్సిస్టు అయినప్పటికీ, గాంధీ ప్రభావానికి లోనయ్యాడు. ఆయనకు గతితార్కిక భౌతికవాదం పట్ల కూడా ఆసక్తి వుండేది. నరేంద్రదేవ్ రాజకీయ భావాలు ఆయన రచనలలో వ్యక్తమౌతాయి. ఆయన ప్రముఖ రచనలు "సామ్యవాదము - జాతీయ విప్లవము", "రాష్ట్రీయత - సమాజవాదం".

## 16.5 మార్క్సిజమ్‌పై నరేంద్రదేవ్ అభిప్రాయాలు :

మార్క్సిస్టు సిద్ధాంతాల వలన ప్రభావితుడైన నరేంద్రదేవ్ తార్కిక సిద్ధాంతాన్ని ఆమోదించాడు. కాని మొత్తం భౌతికవాదాన్ని ఆమోదించలేదు. తనను శాస్త్రీయ సమాజవాదిగా పేర్కొన్నారు. ఈ సందర్భంలో ఆయన తన "సామ్యవాదం జాతీయ విప్లవం" అన్న రచనలో ఇలా అన్నాడు. "సామ్యవాదపు సూత్రాలను, లక్ష్యాలను, అవగాహన చేసుకొంటేనే మనం మన ముందున్న కర్తవ్యాన్ని నిర్వహించగలం. పరిస్థితిని సరిగ్గా అవగాహన చేసుకోవటానికి మార్క్స్ ప్రతిపాదించిన తార్కిక పద్ధతిని అర్థం చేసుకోవాలి. ఈ అవగాహనను వాస్తవ కార్యాచరణగా రూపొందించుకోవాలి. శాస్త్రీయ సామ్యవాదం గురించి మనం స్థాన రూపొందించుకొని తద్వారా ఊహాకల్పిత సామ్యవాదం, లేదా సామ్యవాద సంస్కరణ వాదానికి దూరంగా వుండాలి. ఈ వ్యవస్థను విప్లవాత్మకమైన మార్పు తప్ప మరేది చక్కబరచలేదు".

ఆయనకు చరిత్రను భౌతికపరంగా వివరించాలనే భావం ఉండేది. శాస్త్రీయ సామ్యవాదాన్ని ఆమోదించడం ద్వారానే మానవాళిని దైన్యం ఆకలి యుద్ధాల నుండి రక్షించటానికి వీలవుతుందని ఆయన భావించాడు. దేశపు ఉత్పత్తి వ్యవస్థలో ఆర్థికేతర శక్తులు కూడా పనిచేసి తమ వంతు పాత్ర నిర్వహిస్తాయనే అభిప్రాయం నరేంద్రదేవ్‌కు వుంది.

మార్క్సిజం గురించి వివరిస్తూ మార్క్సిజం స్థిరమైన శక్తికాదని ఆయన చెప్పాడు. కనుక మారిన పరిస్థితులకు, అవసరాలకు అనుగుణంగా దాన్ని మారేటట్లు చేయాలని చెప్పాడు. అయితే దీన్ని బట్టి ఆయన్ను పునశ్చరణవాది ప్రాథమిక సిద్ధాంతాన్ని మార్చాలని కోరాడు. మార్క్సిస్టు తత్వశాస్త్రంలోని విప్లవాకాశాన్ని నాశనం చేయాలని కూడా భావించాడు.

## 16.6 సామ్యవాద భావాలు :

నరేంద్రదేవ్ తన సామ్యవాద భావాల విషయంలో నికొలాయ్ బిలాహారిన్ రచన 'చారిత్రక భౌతికవాదం' నుండి స్ఫూర్తిని పొందాడు. బూర్జువా శ్రామిక వర్గం కాక మధ్యతరగతి పరివర్తనా వర్గాలు, మిశ్రమ వర్గాలు కూడా వున్నాయన్న అభిప్రాయాన్ని ఆయన ఆమోదించాడు. వర్గరహిత సమాజ స్థాపనను ఆయన కోరుకున్నాడు. సామ్యవాద రాజ్యంలో అధికారం దోపిడీకి గురైన వర్గం వారి చేతుల్లో వుండాలని, ఉత్పత్తి సాధనాలు సామ్యవాదం చేయబడాలని ఆయన చెప్పాడు. నూతన సమాజంలో దోపిడీకి సంబంధించిన ఆర్థిక కారణాలుపోయి, మానవాళి స్వేచ్ఛారంగానికి పయనిస్తుంది.

నరేంద్రదేవ్‌కు ప్రజాస్వామ్య సామ్యవాదం పట్ల విశ్వాసం వుండేది. కాబట్టి ఆయన దేశంలో ఉద్యోగిస్వామ్య జోక్యానికి వ్యతిరేకి. శ్రామికులు ఒక వర్గంగా పరిశ్రమల యాజమాన్య నిర్వహణను కలిగి ఉండాలని ఆయన ఆశించాడు. గాంధీజీతో సంబంధాలున్నప్పటికీ ఆయన తన వర్గపోరాట భావనను వదులుకోలేదు. ఆయన ఇలా అన్నారు. "సమాజంలోని విభిన్న వర్గాల మధ్య తేడాల వలన ఉన్నత, మధ్య తరగతివారు అనేకులు జాతీయోద్యమానికి దూరంగా వుంటున్నారు. ప్రాతిపదికలేని ఐక్యత కోసం ఆక్రోశించేకంటే, ఆర్థిక, వర్గ చైతన్యం ద్వారా ప్రజలను సంఘటితపరచి ఈ ఉద్యమ ప్రాతిపదికను విస్తరింపజేయాలి. ఈ రెండు సాధనాలు మాత్రమే ఏదైనా వర్గాన్ని ఆత్మ చైతన్యవంతులను చేసి వ్యవస్థీకరించగలవు. ఈ విధంగా నరేంద్రదేవ్ భారతదేశపు సామాజిక, ఆర్థిక సమస్యలను వర్గపోరాటపు సామాజిక శాస్త్రపరంగా వివరించాడు.

సామ్యవాద విప్లవం పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన దేశాలను విభిన్నం చేస్తుందనే లెనిన్ సిద్ధాంతాన్ని నరేంద్రదేవ్ విశ్వసించాడు. ఆయన శ్రామికవర్గాన్ని అగ్రగామిగాను, రైతులు మేధావి వర్గాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటంలో సహాయకులుగాను వర్ణించాడు. ప్రజలకొరకు ఆర్థిక సిద్ధాంతాలను అనుసరించటం ద్వారా జాతీయ పోరాటాన్ని సామ్యవాద పరంగా మార్చి భారతదేశాన్ని ప్రజాస్వామ్యానికి అనుకూలంగా రూపొందించేందుకు జనబాహుళ్య కార్యక్రమాలను రూపొందించటం

ఒక్కటే మార్గమని ఆయన ప్రకటించాడు. అందుకు భారతదేశంలోని సామ్యవాద ఉద్యమానికి, జాతీయోద్యమానికి ఐక్యత వుండాలని ఆయన వాంఛించాడు. దేశాన్ని విదేశీ సామ్రాజ్యవాదం నుండి విముక్తిగావించేందుకు జాతీయోద్యమంలోని బూర్జువా శక్తులతో అనుకూలంగా వర్తించే భావాన్ని ఆయన ఆమోదించాడు. అందువలన ఆయన సామ్యవాదులు జాతీయ స్వాతంత్ర్య పోరాటంలో చేరాలని అభిప్రాయపడ్డాడు. ఈ విధంగా ఆయన భారతదేశపు స్వాతంత్రోద్యమ ప్రాతిపదికను బలవత్తరం చేయాలని కోరాడు.

నరేంద్రదేవ్ భారతదేశాన్ని వ్యవసాయపరంగా కూడా పునర్నిర్మించాలని కోరాడు. దీని కోసం కిసాన్ సభలను ఏర్పాటు చేయడానికి ప్రయత్నించాడు. "రైతులలో అత్యధిక సంఖ్యాకులకు సామ్యవాద భావాలు తెలియజేయటం" అనే స్టాలిన్ భావంతో నరేంద్రదేవ్ ఏకీభవించాడు. వ్యవసాయాన్ని సహకార వ్యవస్థగా రూపొందించాలని ఆయన ప్రతిపాదించాడు. "దున్నేవానికే భూమి" అన్న నినాదాన్ని ఆయన సమర్థించాడు.

## 16.7 గాంధేయ పద్ధతుల గురించి నరేంద్రదేవ్ :

నరేంద్రదేవ్‌కు గాంధీ తత్వం మీద, కార్యక్రమం మీద విశ్వాసం లేదు. కాంగ్రెస్ తరహా రాజ్యాంగ పద్ధతిపై కూడా ఆయనకు విశ్వాసం లేదు. నరేంద్రదేవ్ గాంధీని శాస్త్రీయ సామ్యవాదిగా భావించలేదు. గాంధీని ఊహాపరమైన సామ్యవాదిగా నరేంద్రదేవ్ భావించాడు. గాంధీజీ ప్రవచించిన అహింసా సిద్ధాంతాన్ని కొంత ఆయన ఆమోదించలేదు. అయినప్పటికీ ఆయన సత్యాగ్రహ పద్ధతిపట్ల ఆకర్షితుడై ప్రజాస్వామ్య వాద తరహా ప్రభుత్వంలో సత్యాగ్రహం తప్పనిసరియైన హక్కు అని ఆయన చెప్పాడు. హింసను నిరోధించాలంటే సత్యాగ్రహానికి సంబంధించిన హక్కును ప్రజల నుండి తొలగించకూడదు. సత్యాగ్రహం స్వాతంత్ర్యం తరువాత కూడా అనుమతించదగినదే అని ఆయన చెప్పాడు. అధికారుల సోమరితనాన్ని తొలగించి, వారి విధుల పట్ల అవగాహన కలిగి వుండేలా చేయటానికి సత్యాగ్రహం సరైన పద్ధతి అని ఆయన విశ్వసించాడు. కాంగ్రెస్ సోషలిస్టు పార్టీ అధ్యక్షస్థానం నుండి మాట్లాడుతూ సోషలిస్టు భావాలతో విశేష ప్రజానీకాన్ని రాజకీయంగా వ్యవస్థీకరించి, ఆర్థిక సమస్యల గురించి చైతన్యాన్ని కలిగించగలిగితే వారి జీవితాన్ని స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో నింపవచ్చును. దాని తరువాత వచ్చే విప్లవకెరటం యింకా ఉధృతంగా వుంటుందని పేర్కొన్నాడు. ఆయన కిసాన్ సభలను ప్రోత్సహించాడు. సోషలిస్టు పునర్నిర్మాణానికి ఆయన ఒక వ్యవసాయ కార్యక్రమాన్ని తయారుచేశాడు. సహకార సంఘాలను ఏర్పాటు చేయడం ద్వారా (దానిలో సహకార పద్ధతులపై ఉత్పత్తి, మార్పిడి, వినియోగం ఉంటున్నాయి) దీన్ని సాధించవచ్చును. కార్మిక వర్గాన్ని గురించి మాట్లాడుతూ ఆర్థిక డిమాండ్లు, సమ్మెలు అవసరమన్నాడు. అయితే యివన్నీ జాతీయ స్వాతంత్రోద్యమంలో భాగం కావాలని ఆయన వాంఛించాడు.

## 16.8 కాంగ్రెస్ పార్టీతో సోషలిస్టుల పార్టీల అవగాహన - నరేంద్రదేవ్ అభిప్రాయం :

ఆయన కాంగ్రెస్ పార్టీకి సోషలిస్టు పార్టీకి మధ్య సదావగాహన వుండాలని పేర్కొన్నాడు. ఆయన మాటల్లో "పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం విదేశీ పాలనకన్నా అర్థ బానిసత్వం మెరుగైనదే. స్వాతంత్ర్య పోరాటం కేవలం బూర్జువా వర్గం చేత నిర్వహించబడిందని ఏ సోషలిస్టు అయినా భావిస్తే అతని సోషలిజం చాలా సంకుచితమైనదవుతుంది. ప్రస్తుత పరిస్థితులలో సోషలిస్టులు కాంగ్రెస్ పార్టీతో కలసి పనిచేస్తూ కాంగ్రెస్ పార్టీలోనికి సోషలిస్టు సిద్ధాంతాలను చొప్పించడానికి ప్రయత్నించాలి. జాతీయ ఐక్యతను సోషలిస్టుల వర్గపోరాట సిద్ధాంతం ఆటంకాన్ని కలిగిస్తున్నందున వాదనకు ఆయన అంగీకరించలేదు. కాంగ్రెస్ పార్టీ విస్తృతమైన పరిధిని కలిగిలేదని ఆయన భావించాడు. కార్మిక, కర్షక అశేష ప్రజానీకానికి అందులో స్థానం లేదని నరేంద్రదేవ్ ఉద్దేశ్యం. ఈ పేద వర్గాలకు ధనికవర్గాలకు వలె తమ స్థితిని తాము తెలుసుకొని తమ బాగుకోసం పోరాడశక్తిగల గలవారు కారని కూడా ఆయన భావించాడు. కార్మిక కర్షక వర్గ ప్రజానీకంలో, వర్గ ప్రజానీకంలో వర్గ చైతన్యాన్ని కలిగించి

దానిని జాతీయోద్యమానికి అనుకూలంగా మలచుకోవాలని ఆయన వాంఛించాడు. కాంగ్రెస్ పార్టీయొక్క నైరూప్యసిద్ధాంతాలు అశేష ప్రజానీకానికి అంతగా ఉపకరించేవి కావని ఆయన ఉద్దేశ్యం. తన జీవితాంతం నరేంద్రదేవ్ కార్మికులకు కర్షకులకు మధ్య యింకా వారికి కాంగ్రెస్‌కూ మధ్య సత్సంబంధాలను నెలకొల్పేందుకు పాటుపడ్డాడు. భారతదేశం వ్యవసాయిక దేశం కాబట్టి విప్లవానికి కావలసిన పరిపక్వదశ రాలేదనే వాదనను నరేంద్రదేవ్ త్రోసిపుచ్చి ఆర్థిక సామ్రాజ్యవాద దశలో ఏ దేశమూ మినహాయింపు కాదని భారతదేశంలో విప్లవానికి అనుకూలమయిన పరిస్థితులున్నాయని నరేంద్రదేవ్ విశ్వసించినాడు. అన్ని దేశాలు సామ్రాజ్యవాద దశలో ఒక దానితో నొకటి తప్పనిసరిగా సంబంధాలు కలిగియున్నాయి. కాకపోతే సరియైన రాజకీయ పరిజ్ఞానాన్ని పెంపొందించాల్సి వుంటుందని ఆయన పేర్కొన్నాడు. విప్లవాత్మకమైన సామాజిక పరిణామాలకు ఏ మాత్రం తక్కువ పరిస్థితులైనా దేశ పరిస్థితిని చక్కపరుచజాలవు. కాబట్టి మనకు కావలసినది క్రమశిక్షణాబద్ధమైన రాజకీయ పార్టీ సక్రమమయిన సిద్ధాంతం లేకుండా, లక్ష్యాలు లేకుండా విజయాన్ని సాధించడం కష్టమని నరేంద్ర భావించాడు.

## 16.9 సమ్మెపై నరేంద్రదేవ్ అభిప్రాయం :

నరేంద్ర, జార్జిసొరెల్ యొక్క శ్రామిక సంఘవాద సిద్ధాంతమైన సార్వత్రిక సమ్మెచే ప్రభావితుడైనాడు. ఆయన సార్వత్రిక సమ్మె యొక్క ఉద్వేగపూరిత సిద్ధాంతంతో కూడిన మరియు నేర్పుతో కూడిన ప్రయోజనాలను విశ్వసించాడు. సార్వత్రిక సమ్మె రెండు ఫలితాలను కలిగిస్తుందని నరేంద్రదేవ్ అభిప్రాయము. (1) మొత్తం దేశపు ఆర్థిక వ్యవస్థను పడిపోయేటట్లు చేస్తుంది. మొత్తం ఆర్థిక యంత్రాంగాన్ని నిలిపివేయడం ద్వారా సార్వత్రిక సమ్మె విదేశీ పీడకులను దేశం నుండి వెళ్ళేటట్లు చేస్తుంది. సార్వత్రిక సమ్మెను ప్రణాళికాబద్ధంగా నిర్వహిస్తే అది సామాజిక విప్లవానికి నాంది అవుతుంది.

## 16.10 డా॥ రామ్ మనోహర్ లోహియా :

డా॥ రామ్‌మనోహర్ లోహియా సామ్యవాదము యొక్క తీవ్రవాద ప్రచారకుడు. భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన ముఖ్యమైన పాత్ర వహించాడు. భారతదేశంలో సామ్యవాద ఉద్యమాభివృద్ధికి ఆయన విశిష్టమైన కానుకను అందించాడు. ఆయన వ్యక్తిత్వంలో అనేక గొప్ప లక్షణాలు మిళితమయ్యాయి. బుద్ధుని మానవతావాదం మరియు దయత్వము, మత ప్రవక్త యొక్క త్యాగము మరియు ప్రేమ మరియు శంకరుని ధైర్యము, తీవ్రత మొదలగునవి.

## 16.11 లోహియా రాజకీయ కార్యకలాపాలు (Hispolitical activities) :

1928లో లోహియా కలకత్తాలో కళాశాల విద్యార్థి ఈ దశలోనే ఆయన దేశ స్వాతంత్రోద్యమంలో పాల్గొన్నాడు. 1919లో ప్రవేశపెట్టిన సంస్కరణల తీరును గురించి తెలుసుకొనడానికి భారతదేశాన్ని సందర్శించిన సైమన్ కమీషన్‌ను బహిష్కరించే విషయంలో కళాశాల విద్యార్థులకు నాయకత్వం వహించి, ఆందోళనను నిర్వహించాడు. ఆ సందర్భంలో లోహియాకు యువజన సమావేశాలకు అధ్యక్షత వహించేందుకు వచ్చిన నెహ్రూతో పరిచయం ఏర్పడింది.

1929 లోహియా ఉన్నత విద్యాభ్యాసం కొరకు బెర్లిన్ వెళ్ళి 1933 ప్రారంభంలో ఆర్థిక శాస్త్రంలో పి.హెచ్.డి. పట్టా పొందిన తద్వారా భారతదేశం తిరిగి వచ్చాడు. 1924లో కాంగ్రెస్‌లోనే, కాంగ్రెస్ సామ్యవాద పార్టీ అన్న ఒక సామ్యవాద పార్టీ ప్రారంభింపబడింది. ప్రజాబాహుళ్యంలో సామ్యవాద భావాలను ప్రచారం చేసేందుకు కాంగ్రెస్ సోషలిస్ట్ (Congress Socialist) అన్న వారపత్రికను కాంగ్రెస్ పార్టీ ప్రారంభించింది. ఆ పత్రిక సంపాదకత్వం, అప్పటి ఆర్థిక, రాజకీయ సమస్యల విషయంలో పురోభివృద్ధితో కూడిన దృక్పథం ఉండడం వల్ల, లోహియాకు అప్పజెప్పటం జరిగింది. 1936లో జవహర్‌లాల్ నెహ్రూ సిఫారసుపై ఆ పదవిలో ఆయన రెండు సంవత్సరాలపాటు వున్నాడు. 1938లో ఆయన కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ

కార్యనిర్వాహక సంఘంలో సభ్యుడయ్యాడు. 1939 నుండి 1946 వరకు లోహియా, బ్రిటీష్ ప్రభుత్వంతో అవిశ్రాంతముగా పోరాడాడు. ఈ సమయములో ఆయన మహాత్మాగాంధీ నాయకత్వం, మార్గదర్శకత్వంలో పనిచేసి, నాలుగు సంవత్సరాల కారాగార శిక్షను అనుభవించాడు. 1947 ఫిబ్రవరిలో కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ సమావేశాలు డా॥ రామ్‌మనోహర్ లోహియా అధ్యక్షతన కాంగ్రెస్ అనే పదాన్ని తొలగించి, స్వతంత్ర సోషలిస్ట్ పార్టీగా, నూతన పేరును నిర్ణయించడం జరిగింది.

## 16.12 సామ్యవాద ఉద్యమానికి లోహియా చేసిన కృషి :

కాంగ్రెస్ నుండి విడిపోయిన తర్వాత కాలంలో, నూతన లక్ష్యాలను, భావాలను ఆమోదించటం అవసరమని లోహియా వాదించాడు. దీని ఫలితంగా, సామ్యవాద నాయకులు, సిద్ధాంతపరమైన రాజకీయ చింతనాధోరణిని విడనాడి, నూతన ప్రజాస్వామ్య సామ్యవాద రూపకల్పనకు, భారతదేశ సమస్యల విశ్లేషణలో మొదటి చర్యగా ఆచరణాత్మకమైన, ప్రయోగాత్మకమైన పద్ధతులను, అనుసరించారు.

1952లో సోషలిస్టు పార్టీ, కిసాన్ మజ్దూర్ ప్రజాపార్టీతో విలీనమైంది. దాని ఫలితంగా, ప్రజాసోషలిస్టు పార్టీ అన్న కొత్త సోషలిస్టు పార్టీ ఏర్పడింది. ప్రజా సోషలిస్టు పార్టీ అధ్యక్షునిగా, సామ్యవాద తత్వచింతనలో గాంధేయ భావాలను జోడించాలని చెప్పాడు. గ్రామీణ పరిశ్రమల పునరుద్ధరణ, ప్రాతిపదికగా గల వికేంద్రీకరింపబడిన ఆర్థిక వ్యవస్థ ప్రాముఖ్యతను సోషలిస్టులు గుర్తించాలని ఆయన అర్థించాడు. పెట్టుబడిదారీ విధానానికి, కమ్యూనిజమ్‌కు పెద్ద, పెద్ద యంత్రాలు, భారీయంత్రాల పట్ల వున్న వ్యామోహాన్ని పురస్కరించుకొని లోహియా వాటి రెంటి పట్ల వ్యతిరేకి అన్నట్లు తోస్తోంది. ఆయన దృష్టిలో యీ రెండు విధానాలు వృథా ఖర్చుతో కూడుకొని, భారతదేశానికి అనుకూలమైనవి కావు. వీటితో పోల్చిచూస్తే గాంధేయ భావాలు, కార్యాచరణ వడపోత పరికరంగా ఉపకరించి, వ్యర్థపదార్థాలను తొలగించటానికి ఉపకరిస్తాయని ఆయన చెప్పాడు.

లోహియా, ఆర్థిక వ్యవస్థను గాంధేయ భావాలకు అనుగుణంగా రూపొందించాలని అన్నాడు. పెట్టుబడిదారీ విధానం, కమ్యూనిజంకు ప్రతిగా మూడవ తత్వచింతనను రూపొందించవలసిన అవసరం వుందని ఆయన భావించాడు. ఈ నూతన భావనే నిజమైన సామ్యవాద భావన. ఈ సామ్యవాద భావన ఆయన అభిప్రాయం ప్రకారం, గాంధీయ భావాలైన వికేంద్రీకరింపబడిన ఆర్థిక వ్యవస్థ, గ్రామ ప్రభుత్వం ఆధారంగా రూపొందుతుంది. అందువల్ల గరిష్ఠ శ్రమశక్తిని, చిన్న పెట్టుబడులను వినియోగించే చిన్న యంత్రాల ప్రాముఖ్యాన్ని గుర్తించవలసి వుందని ఆయన చెప్పాడు. ఇలాంటి ఆలోచనా ధోరణి ఆయన సహకార్యకర్తలలో చాలా మందికి నచ్చలేదు. ఒక సంవత్సరం తర్వాత (1953, జూన్‌లో) అశోక్‌మెహతా వెనుకబడిన ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన రాజకీయ నిర్బంధాలను గురించి (Political Compulsions of a backward Economy) తన సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. అందులో అశోక్‌మెహతా కాంగ్రెస్ వారి భావాలు సోషలిస్టుల భావాలకు చేరువ అవుతుండడం వల్ల కాంగ్రెస్‌కు, ప్రజాసోషలిస్టు పార్టీ మధ్య సిద్ధాంతపరంగా అంగీకారం వుంచాలని చెప్పాడు. దానికి ప్రతిగా, లోహియా, కాంగ్రెస్ పార్టీకి దూరంగా వుంచాలని ప్రతిపాదించి, సోషలిస్టులు కాంగ్రెస్‌కు దూరంగా వున్నట్లే కమ్యూనిస్టులకు గూడా దూరంగా వున్నారని చెప్పాడు. అందువల్ల, ఆయన విధానపరమైన విషయాల్లో, ప్రజాసోషలిస్టు పార్టీ కాంగ్రెస్‌తో అంగీకారాన్ని లేక ఐక్యతను రూపొందించుకోవటానికి యిష్టపడలేదు. అయినప్పటికీ, ప్రత్యేక పరిస్థితుల్లో కాంగ్రెస్ పార్టీతో ఎన్నికల విషయంలో సర్దుబాట్లు చేసుకోవటంలో ఎలాంటి హానిలేదని ఆయన భావించాడు.

తిరువాన్కూర్ - కొచ్చిన్ కాంగ్రెస్‌తో ఒడంబడికలు, సర్దుబాట్ల విషయంలో తన పార్టీ విధానాలను తిరస్కరిస్తూ 1954లో భాషా సమస్యపై జరిగిన సందర్భంలో పిళ్ళై సోషలిస్టు మంత్రివర్గం రాజీనామా చేయాలని లోహియా కోరాడు. ఆ ప్రజా సోషలిస్టు ప్రభుత్వం రాజీనామా చేసేందుకు నిరాకరించడంతో, 1955లో డా॥ లోహియా నాయకత్వంలో నూతన భారతీయ

సోషలిస్టు పార్టీ ఏర్పడింది. తరువాతి సంవత్సరాల్లో, సామ్యవాద భావాలు ప్రచారం కొరకు సామ్యవాద వ్యవస్థ రూపకల్పన కొరకు లోహియా నాయకత్వంలోని సోషలిస్టు పార్టీ ప్రజాసోషలిస్టు పార్టీ మధ్య విభేదాలను తగ్గించటానికి ప్రయత్నాలు జరిగాయి కాని లోహియా ప్రజాసోషలిస్టు పార్టీతో సంబంధాలు నెలకొల్పుకోవటానికి మూడు షరతులు పేర్కొన్నాడు. 1. గయాపార్టీ సమావేశంలో పేర్కొన్నట్లు కాంగ్రెస్ పార్టీతో ఎలాంటి ఒడంబడిక ఉండకూడదు. 2. అంతర్గత సమస్యలను బహిరంగంగా చర్చించేందుకు పూర్తి అంతర్గత ప్రజాస్వామ్యం లేక స్వేచ్ఛ. 3. పార్టీ నిర్వహణ క్రమశిక్షణతో కూడి వుండడం. ఈ సమస్యలను పురస్కరించుకొనే ఆయన ప్రజాసోషలిస్టు పార్టీ నుండి విడిపోయాడు. లోహియా మరణించేంతవరకు, ఆయన రాజీలేని ధోరణిని అవలంభించడం వల్ల యీ రెండు సోషలిస్టు పార్టీల మధ్య ఐక్యత సాధ్యం కాలేదు. తన సిద్ధాంతాలను పణంగా పెట్టి ఎవరితోనైనా రాజీపడటం కంటే లోహియా విడిపోవటమే మంచిదని భావించాడు.

## 16.13 వీల్ ఆఫ్ హిస్టరీ - చరిత్ర గమనం :

లోహియా భారతదేశంలో సామాజికోద్యమాభివృద్ధికి కృషి చేయటమే కాక రాజకీయ ప్రాముఖ్యం గల విషయాలను గురించి కూడా చర్చించి, తద్వారా తనదైన సామ్యవాద సిద్ధాంతాన్ని రూపొందించటానికి ప్రయత్నించాడు. చరిత్రగతిని (Process of History) గూర్చి ఆలోచిస్తూ, లోహియా తన ప్రసిద్ధ రచన "వీల్ ఆఫ్ హిస్టరీ"(Wheel of History)లో చరిత్ర దయారహితంగా చక్రగతిలో కదులుతున్నట్లు కనపడుతుంది. అది ఎలాంటి మానసిక వేగము లేకుండా కదులుతుంది అని చెప్పాడు. ఆయన హెగెల్, మార్క్స్‌లకు సంబంధంచిన చరిత్ర వివరణలను, చరిత్ర స్థితిగతులను(Workings) గురించి రూపొందించిన సమాధానాలు, ఖచ్చితమైన ఆధారాలను అందించటం లేదన్న కారణంగా త్రోసిపుచ్చాడు.

లోహియా దృష్టిలో చరిత్ర చక్రంవలె పరిభ్రమిస్తుంది. చరిత్రను గురించిన లోహియా దృక్పథం అరిస్టాటిల్ చక్రగమన సిద్ధాంతానికి అనుగుణంగా వుంటుంది. చరిత్ర పురోగమనం తిన్నని రేఖల రూపంలో వుంటుందన్న భావంతో ఆయన ఏకీభవించలేదు. చరిత్ర విషయంలో చక్రగమనానికి సంబంధించిన సిద్ధాంతాల పరిశోధనా ఫలితాల్లో ప్రపంచ వ్యాప్తి ప్రామాణికత ఉండకపోయినప్పటికీ, ఆ పరిశోధనా ఫలితాలు తిన్నని పురోభివృద్ధిని గురించిన పురాతన సిద్ధాంతాల కంటే నిష్పక్షపాతంగా వుండి చరిత్ర అధ్యయనాన్ని చాలా వరకు మార్చాయి. పాశ్చాత్య ప్రపంచంలో చరిత్రకు సంబంధించిన చక్రగమనాన్ని ప్రతిపాదించిన స్పెంగ్లర్, నార్త్రాప్, సొరోకియా, టాయన్బీల (Spengler, Northrop, Sorokia Tounbee) అభిప్రాయాలతో లోహియా ఏకీభవించాడు. చక్రగమనంలో ఒక దేశం నాగరికంగా ఉన్నత దశను చేరుకోవచ్చును. అలాగే మరల ఉన్నత దశను చేరుకొనేలోగా అట్టడుగు స్థాయికి చేరవచ్చును.

లోహియా తన రచన 'వీల్ ఆఫ్ హిస్టరీ'లో మానవ చరిత్ర స్థిరంగా రూపొందిన కులాలకు, అస్పష్టంగా సంఘటితమైన కులాలకు మధ్య సంఘర్షణలతో కూడి వుంది. వర్గానికి, కులానికి మధ్య అంతర్గత డోలాయ మానస్థితి చరిత్ర పురోగతి విషయంతో ముఖ్యాంశం కులాలకు, వర్గాలకు మధ్య అంతర్గత చలనమే మానవ చరిత్ర అని లోహియా అభిప్రాయం, కులాలకు, వర్గాలకు మధ్య ప్రేరణలకు, నాగరికతలకు మధ్య అంతర్గత పోరాటం, మానవునిలోని, సమాజంలోని చెడు పెంపొందకుండా చేయబడనంత వరకు చరిత్రలో కొనసాగుతూనే ఉంటుంది. మంచి పథకాల ద్వారా మానవ జాతిలో సామరస్యాన్ని సాధించేందుకు వీలవుతుందని లోహియా భావించాడు.

వ్యవసాయాన్ని పారిశ్రామికీకరణ చేయటం, యాంత్రీకరించడం వల్ల జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అధికారం కొరకు పోరాటాలను అధికం చేస్తాయి. కాబట్టి అది మానవ జాతికి మేలు చేయదని లోహియా విశ్వసించాడు. అందువల్ల సమాజం నిరంతరం పురోభివృద్ధి సాధించేందుకు, మానవజాతిలో సామరస్యం నెలకొనేందుకు సమాజాన్ని గాంధేయ తరహాలో

రూపొందించాలని సామ్యవాదులకు లోహియా సలహాయిచ్చాడు, ఆసియాలోని సామ్యవాదులు చొరవ ప్రదర్శించాలని, మౌలిక ఆలోచనా ధోరణిని కలిగి వుండవలసిన అవసరాన్ని గురించి నొక్కిచెప్పాడు. శతాబ్దాలు తరబడి నెలకొన్న నియంతృత్వం భూస్వామ్య వ్యవస్థ నుండి విముక్తి చెందుతున్న సందర్భంలో ఆసియాలోని సామ్యవాదులు తమ స్వంత విధానాలను, సిద్ధాంతాలను రూపొందించుకోవాలని ఆయన సూచించాడు.

## 16.14 ఆసియాలోని సామ్యవాదపు సమస్యలు - లోహియా ఆలోచనలు :

ఆసియాలోని సామ్యవాదపు సమస్యలను గురించి చర్చిస్తూ, 1952 మార్చి 26న, రంగూన్‌లో జరిగిన ఆసియా సామ్యవాద సమావేశపు ప్రారంభసభలో ప్రసంగిస్తూ లోహియా ఇంకా పరిష్కరింపబడవలసిన ఆర్థిక సమస్యలున్న ఆసియాలో ఐరోపా తరహా సామ్యవాద ప్రజాస్వామ్యం వలన ఉపయోగం చాలా స్వల్పం అని చెప్పాడు. ఏదో ఒక ఆర్థిక వ్యవస్థ ద్వారా తమకు ఆహారం లభించగలదని నమ్మకం కలిగితే ఆసియాలోని ప్రజాబాహుళ్యం తమ ప్రజాస్వామ్య హక్కులను అమ్మకోవటానికి సిద్ధమవుతారు. ఆసియా దేశాల్లో సాంప్రదాయిక హేతువాద పూర్వక వివరణకు ప్రయత్నిస్తే ఆ ప్రయత్నం తప్పక పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ గానీ లేక కమ్యూనిస్టు తరహా వ్యవస్థను గానీ పోలిన వ్యవస్థకు దారితీస్తుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ, కమ్యూనిజమ్‌లు రెండూ ఒకే తరహా ఆర్థిక వ్యవస్థ పట్ల విశ్వాసం గలవి. పెట్టుబడిదారీ వ్యవస్థ వ్యక్తిగత ఆస్తిని ప్రోత్సహిస్తుంది. కమ్యూనిజమ్ వ్యక్తిగత ఆస్తిని ప్రభుత్వ ఆస్తిగా మారుస్తుంది. యిదే వీటి రెంటి మధ్య వ్యత్యాసం. శ్రమ, కాలం, వస్తుసామాగ్రి దుర్వినియోగం కాకుండా చక్కదిద్దడం (Rationalization) చివరికి నిరుద్యోగానికి దారితీస్తుంది. ఈ విధానం ఆసియాలోని పేదరికాన్ని పరిష్కరించలేదు కాబట్టి, ఎక్కువ పెట్టుబడి అవసరం లేని యంత్రాలతో పరిస్థితిని చక్కదిద్దవలసిన అవసరాన్ని గురించి ఆయన నొక్కి చెప్పాడు.

ఆర్థిక, రాజకీయ పునర్నిర్మాణం కొరకు ఐరోపా సామ్యవాదులు అవలంభించిన పద్ధతులు ఆసియా దేశాలకు, ప్రత్యేకంగా, భారతదేశానికి, ఇండోనేసియాకు అనుకూలమైనవి కావు. అందువల్ల నూతన పద్ధతిని కనుగొనాలి. 'రైతు సాంద్రవ్యవసాయ పద్ధతులను నేర్చుకోవాలి అలాగే ఏదో ఒక విధమైన సహకార వ్యవసాయాన్ని చేపట్టేలా రైతును ఒప్పించవలసి వుంటుంది. ఎక్కువ పెట్టుబడి అవసరం లేని యంత్రాలను రైతుకు అందజేయాలి. అతను చొరవను పెంపొందించుకోవాలి. అందువల్ల, అధికస్థాయి ప్రభుత్వాధికారం, శాసనసభా పరమైంది. కాని, పాలనా సంబంధమైనది. కాని, గ్రామీణ సమాజంలోని రైతుకు చెందాలి. భూమిని తిరిగి పంపిణీ చేయడం అన్న కమ్యూనిస్టు నినాదం మోసపూరితం, చివరికి నిరర్థకమైన, క్రూరమైన చర్యగా మిగిలిపోతుంది. అధికార వికేంద్రీకరణతో కూడిన సామ్యవాద భూమి పునఃపంపిణీ ఆర్థిక పరంగా మంచి ఫలితాలనివ్వటమేగాక, నూతన జీవిత విధానాన్ని గూడా రూపొందిస్తుంది అని ఆయన చెప్పాడు. ఆయన అభిప్రాయం ప్రకారం ఐరోపా సామ్యవాదులు సార్వత్రిక భావనల రూపంలో సామ్యవాదాన్ని నిర్వచించటానికి ప్రయత్నిస్తున్నారు. యీ విషయంలో వారు కొన్ని విజయాలను సాధించారు. వారి సామ్యవాదం క్రమబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన సామ్యవాదం ఆసియాలోని సామ్యవాదం అలా వుండడానికి వీలుకాదు. ఆయన అభిప్రాయం ప్రకారం ఆసియాలోని పరిస్థితి, వ్యవసాయంలో గాని, పారిశ్రామిక ప్రక్రియల్లో గాని జాతీయం చేసే ప్రక్రియల్లో గాని తీవ్రచర్యలు తీసుకోవలసిన స్థితిలో వుంది.

ఆసియాలోని సామ్యవాదం ప్రధాన లక్ష్యాలను వివరిస్తూ, అది పరిపాలనా యంత్రాంగ ప్రజాస్వామ్యీకరణ, చిన్నతరహా యంత్రాలపై కొద్ది మొత్తాల పెట్టుబడి, సామాజీకరింపబడిన ఆస్తి, సాధించ వీలైనంత సమానత్వం లాంటి భావనల సాధనకు ప్రయత్నించాలని లోహియా చెప్పాడు. వీటిని సాధించటానికి గాంధేయ పద్ధతిని అనుసరించే ప్రజాబాహుళ్య కార్యక్రమాన్ని ఆయన సూచించాడు. కమ్యూనిస్టుల వర్గపోరాటాన్ని అనైతికం, హింసాపూరితం అని ఆయన త్రోసిపుచ్చాడు. ఆయన అభిప్రాయం

ప్రకారం సామ్యవాద వర్గ పోరాటం, వికేంద్రీకరింపబడిన సమాజపు లక్ష్యాలకు వికేంద్రీకరింపబడిన సమాజపు లక్ష్యాలకు మంచి ఆర్థిక ఫలితాలనిస్తుంది.

హేతుబద్ధం కాని మతసంబంధమైన, రాజకీయాంశాలు విలీనం చేయుటం ఆసియా రాజకీయాల వినాశనానికి హేతువ (base) అని, దాని వలన వర్గసంబంధమైన మతతత్వ దృక్పథం పెంపొందుతుందని ఆయన భావించాడు. స్థిరమైన ప్రజాస్వామ్యం సాంప్రదాయం లేకపోవటంతో భయోత్పాత సృష్టి, హత్యలు, రాజకీయ పద్ధతుల పాత్రను ధరిస్తాయి. ఈ లోపాలను సరిచేయటానికి, పరిస్థితిని చక్కదిద్దటానికి సమగ్రమైన, మౌలికమైన సామాజిక సిద్ధాంతాన్ని రూపొందించవలసిన అవసరం వుందని ఆయన భావించాడు.

## 16.15 నూతన సామ్యవాదం (New Socialism) :

వికేంద్రీకరింపబడిన సామ్యవాద ప్రతిపాదకునిగా లోహియా రాజ్యాన్ని చాలా వరకు గాంధేయపద్ధతుల్లో రూపొందించాలని సూచించాడు. ఆయన అభిప్రాయం ప్రకారం రాజ్యం, ఆర్థిక రాజకీయాధికారాలు రెండింటిని వికేంద్రీకరించటానికి ప్రయత్నించాలి. ఆయన తన సామ్రాజ్యవాద రాజ్యాన్ని, నాలుగు మూలాధారాలున్న రాజ్యం అని చెప్పాడు. ఇలాంటి రాజ్యంలో వ్యతిరేక భావాలైన కేంద్రీకరణ, వికేంద్రీకరణను మిశ్రమం చేయటానికి ప్రయత్నం జరుగుతుంది. ఈ రాజ్యపు నాలుగు మూలాధారాల - గ్రామం, మండలం, (జిల్లా) రాష్ట్రం, కేంద్ర ప్రభుత్వం - ప్రయోజన పూర్వక ప్రజాస్వామ్య సూత్రంపై పనిచేసే విధంగా రూపొందింపబడుతుంది. ఈ రాజ్యపు ప్రధాన లక్షణాలు, లోహియా దృష్టిలో, యీ క్రింది విధంగా వుంటాయి.

1. ప్రభుత్వపు ప్రణాళికా పరమైన వ్యయంతో 1/4వ వంతు గ్రామ, జిల్లా నగర పంచాయతీల ద్వారా జరుగుతుంది.
2. పోలీస్‌దళం, గ్రామ, నగర, జిల్లా పంచాయతీలు లేక వాటికి సంబంధించిన సంస్థలకు విధేయంగా (Subordinate) వుంటుంది.
3. జిల్లా కలెక్టర్ పదవి తొలగించబడుతుంది. జిల్లా కలెక్టర్ విధులన్నింటిని జిల్లాలోని శాఖలకు బదిలీచేయడం జరుగుతుంది. వీలైనంతవరకు పరిపాలనలో నామినేషన్‌కు బదులు, ఎన్నిక విధానాన్ని అనుసరించటం జరుగుతుంది.
4. వ్యవసాయం, పరిశ్రమలు, ఇంకా యితర ఆస్తులు జాతీయం చేయబడతాయి. వీటిని వీలైనంతవరకు గ్రామం, నగరం, జిల్లా పంచాయతీలు నిర్వహిస్తాయి.
5. రాజకీయ, పరిపాలన వికేంద్రీకరణకు అనుగుణమైన ఆర్థిక వికేంద్రీకరణను చిన్నతరహా యంత్రాలను అత్యధిక స్థాయిలో వినియోగించటం ద్వారా ప్రవేశపెట్టవలసి వుంటుంది.

సమానత్వం పట్ల మానవుల కోరిక తీరకపోతే వారు పిచ్చి, పిచ్చి పనులు చేస్తారని లోహియా చెప్పాడు. అందువల్ల పరిశ్రమలను సామాజీకరించాలి, ఆర్థిక వ్యవస్థను ప్రణాళికాపరంగా రూపొందించాలి. సామాజిక యాజమాన్యం నియంత్రణ, వీలైనంతవరకు వికేంద్రీకరింపబడాలి.

### 16.15.1 నాల్గు మూలధారాలా రాజ్యం (Four Pillar States) :

ఉదారవాద, శ్రామికవర్గ ప్రపంచానికి యింతవరకు రెండు మూలాధారాలు రాజ్యమే తెలుసు. రాజ్యపు విధులను, అధికారాలను, సంయుక్త రాజ్యంలోని కేంద్రమూ, రాష్ట్ర విభాగాల మధ్య విభజించేందుకు రాజ్యాంగపరమైన సిద్ధాంతాలు

రూపొందించబడుతున్నాయి. వాటిని అమలుచేసే వివరణాత్మక విధానాలు రూపొందించబడుతున్నాయి. అయితే లోహియా అభిప్రాయం ప్రకారం, నాలుగు అవయవాలైన గ్రామం, జిల్లా, రాష్ట్రం, కేంద్రాలను పనిచేయటం ద్వారానే రాజ్యాంగ సిద్ధాంతం పనిచేయటం ప్రారంభమౌతుంది. సామాన్యపౌరుడు ఆసక్తి ప్రదర్శించటం జరుగుతుంది. ఇంతకుముందు సూచించిన సమానతలతో కూడిన నాలుగు మూలాధారాల ప్రజాస్వామ్యం ఆనందపూరిత పరిపూర్ణతను చేకూరుస్తుంది. ప్రపంచ ప్రభుత్వం రూపంలో ఐదవ మూలాధారాన్ని రూపొందించవలసిన అవసరాన్ని గురించి కూడా ఆయన చెప్పాడు. ప్రపంచంలో శాంతిని నెలకొల్పేందుకు యిది అవసరమని ఆయన భావించాడు.

సాంప్రదాయికమైన, వ్యవస్థీకృత సామ్యవాద మృత సిద్ధాంతమని మృతి చెందుతున్న వ్యవస్థ అని క్రమంగా లోహియాలో విశ్వాసం పెంపొందసాగింది. దాని స్థానంలో సామ్యవాదం ప్రవేశపెట్టబడాలని సూచించాడు. నూతన సామ్యవాదానికి సమానత్వం, ప్రజాస్వామ్యం అహింస, వికేంద్రీకరణ, సామ్యవాదం అన్న ఉన్నత సూత్రాలు ప్రమాణాలుగా ఉండాలి. నూతన సామ్యవాదం వీటిని సాధించటానికి ప్రయత్నించాలి. ఈ లక్ష్యసాధనకు ఆయన, ప్రపంచంలో నూతన సామ్యవాద స్థాపనకు ఉపక్రమించే కార్యక్రమాన్ని రూపొందించాడు.

ప్రథమంగా దేశంలోనే కాక, అన్ని దేశాల్లోను, అందరు మానవులు సమానులేనన్న సామాన్య సత్యాన్ని తెలియజేసే విధంగా సామ్యవాద సిద్ధాంతాన్ని పునర్నిర్వచించాలని లోహియా తన 'మార్క్స్ గాంధి, సోషలిజం' అన్న పుస్తకంలో చెప్పాడు. ఇలా జరిగితే, సాంప్రదాయక విధానాలన్నీ మార్పు చెందుతాయి. దేశ సరిహద్దుల్లో మెరగవుతున్న జీవన ప్రమాణాల స్థానంలో, ప్రపంచంలోని వ్యక్తులందరికీ, మంచి ప్రమాణంతో కూడిన, మంచి జీవన ప్రమాణాలను కలుగజేయటానికి కృషి జరుగుతుంది. పార్లమెంటరీ తిరుగుబాటు కార్యసరళితో కూడిన ప్రత్యామ్నాయాల స్థానంలో, అవసరమైన అన్ని సందర్భాల్లోను రాజ్యాంగబద్ధమైన కార్యాచరణ, పౌర ప్రతిఘటనలలో కూడిన సమతౌల్య సంయోగకార్యాచరణకు అనుసరించటం జరుగుతుంది. క్రమంగాను, అప్పుడప్పుడు జరిగే ఆస్తి సంస్కరణలు ఆదాయ పరమైన సంస్కరణలకు బదులు శ్రామికులను వినియోగించే ఆస్తి, మిగిలిన ఆస్తి అంతా సామాజీకరింపబడుతుంది. ఉన్నతస్థాయి, అట్టడుగుస్థాయి ఆదాయాల విషయంలో నిష్పత్తిని రూపొందించటం జరుగుతుంది. అసమానత్వంతో కూడిన అంతర్జాతీయ వ్యవస్థ స్థానంలో సామరస్య భావనతో కూడిన అన్ని దేశాల సమానత్వ ప్రతిపాదిక గలిగిన సభ్యత్వంతో ఏర్పడిన, వయోజన ఓటింగ్‌తో రూపొందిన కార్యనిర్వాహక వర్గం నెలకొల్పబడి నిర్వహించబడుతుంది. వాస్తవంలో సామ్యవాదాన్ని చేతులలోకి మార్చబోయేముందు, సామ్యవాదం మానవాళి ఐక్యతను సాధించాలి.

### 16.15.2 ఏడు విప్లవాలు (Seven Revolutions) :

"వీల్ ఆఫ్ హిస్టరీ" అనే తన రచనలో లోహియా, ప్రపంచం అంతటా ఏడు విప్లవాలు సంభవిస్తున్నాయని చెప్పాడు. 1. పురుషునికి, స్త్రీకి మధ్య సమానత్వం కొరకు 2. రంగు ఆధారంగా రాజకీయ ఆర్థిక, ఆధ్యాత్మికమైన అసమానతలకు వ్యతిరేకంగా 3. సుదీర్ఘ సాంప్రదాయాన్ని అనుసరించి ఉన్నత వర్గాలు, కులాలవారు, వెనుకబడిన కులం వారిపట్ల అసమానతలను పాటించడానికి వ్యతిరేకంగానూ, వెనుకబడిన వర్గాల వారికి ప్రత్యేకావకాశాలు కల్పించేందుకు. 4. విదేశాలచే బానిసత్వాన్ని అమలుచేయటానికి వ్యతిరేకంగాను, స్వేచ్ఛ ప్రపంచ ప్రజాస్వామ్య పాలన కొరకు, 5. సమానత్వం కొరకు, ప్రణాళికాపరమైన ఉత్పత్తి కొరకు, ప్రైవేట్ పెట్టుబడి ఉనికి దాని పట్ల అంకితభావానికి వ్యతిరేకంగాను 6. వ్యక్తిగత జీవనానికి వ్యతిరేకంగా, అన్యాయంతో కూడిన అవరోధాలకు వ్యతిరేకంగానూ, 7. ప్రజాస్వామ్య పద్ధతుల కొరకు, ఆయుధాలకు వ్యతిరేకంగాను, సత్యాగ్రహం కొరకు జరిగే విప్లవాలుగా లోహియా పేర్కొన్నాడు. లోహియా అభిప్రాయం ప్రకారం ప్రపంచం అంతటా ఈ నూతన సామ్యవాదన యీ ఏడు విప్లవాల విజయంపై ఆధారపడి వుంటుంది.

## 16.16 ప్రపంచ సమాఖ్య :

ప్రపంచ ప్రభుత్వం ద్వారా సమర్ధవంతమైన ప్రపంచసమాఖ్య ఏర్పాటు విషయాన్ని గురించి ప్రపంచంలోని సోషలిస్టు పార్టీలన్నీ ఆలోచించాలని లోహియా అర్థించాడు. ప్రపంచంలోని మానవులందరు తమ జాతీయ సరిహద్దులను, ప్రయోజనాలను విస్మరించి ప్రపంచ సమాఖ్య రూపకల్పనకు కృషి చేయాలని ఆయన అర్థించాడు. ఆయన భారతదేశపు విదేశాంగ విధానాన్ని విమర్శిస్తూ, భారతదేశపు విదేశాంగ విధానం నూతన ప్రపంచశక్తుల రూపకల్పన కొరకు చేసే వాస్తవ ప్రయత్నాలు కావు. భారతదేశపు పేదరికాన్ని, దైన్యాన్ని కప్పివుచ్చే రంగు రంగుల ఊహాపూరిత అంతర్జాతీయ ఘన విజయాల కంబళి, అని అన్నాడు. అందువలన భారతదేశంలోని సామ్యవాదం, అంతర్జాతీయ లక్ష్యాలను తనకు మార్గదర్శకంగా స్వీకరించాలని సూచించాడు. భారతదేశం బ్రిటీష్ కామన్‌వెల్తుతో సంబంధాలను రద్దు చేసుకొని మూడవ వ్యవస్థ రూపకల్పనకు కృషి చేయాలని సూచించాడు. యీ మూడవ వ్యవస్థ నిష్పక్షపాతంగా ఉండేలా రూపొందించుకోవలసి వుంటుంది. భారతీయ సామ్యవాదం, మనుష్యులందరూ సమానమని, వారందరూ సిద్ధాంతపరంగాను, విదేశాంగ విధానపరంగామూ ఒకే స్వేచ్ఛాపూరిత సంఘంగాను రూపొందాలనే ఆదర్శాన్ని సాధించే విధంగా కృషి చేయాలని సూచించాడు.

## 16.17 సారాంశం :

భారతదేశ స్వాతంత్రోద్యమంలో పాల్గొన్న సోషలిస్టు ఉద్యమకారులలో అతిముఖ్యులుగా పేర్కొనతగినవారు ఆచార్య నరేంద్రదేవ్, డా॥ రామ్ మనోహర్ లోహియాలు. వీరు భారతదేశంలో సోషలిస్టు ఉద్యమానికి పునాదులు వేసినారు. సోషలిస్టు ఉద్యమం దాదాపుగా వీరు ప్రతిపాదించిన సూత్రాలపైనే నడిచింది. వీరిరువురు భారత సోషలిస్టు ఉద్యమం చరిత్రలో ప్రముఖ స్థానాన్ని సంపాదించుకోగల్గినారు.

సామ్యవాద విచారంపై రచనలను చేసిన ప్రముఖులలో నరేంద్రదేవ్ ఒకడు. సామ్యవాద ఉద్యమానికి, జాతీయోద్యమానికి మధ్య పొత్తు కుదర్చడానికి ఆయన ప్రయత్నించినాడు. జాతీయ పోరాట ప్రాతిపదికను విస్తరించడం కోసం ఆర్థిక భావ సిద్ధాంతంతో ప్రజాబాహుళ్యాన్ని సమీకరించాలని ఆయన భావించాడు. అంతర్జాతీయ స్వభావం గల సామ్యవాదానికీ, దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యమిచ్చే జాతీయోద్యమానికి మధ్య సమన్వయాన్ని కుదర్చడంలో ఆయన కృతకృత్యుడయ్యాడు. సామ్యవాదానికి మానవతా పునాదులు వుండాలని ఆయన నొక్కిచెప్పాడు.

సామ్యవాద విచారంలో గాంధేయ భావాలను మరింత ఎక్కువగా చొప్పించాలని లోహియా వాదించినాడు. సామ్యవాద విచారంలో గాంధేయ భావాల ధ్యాన్యాన్ని, కుటీర పరిశ్రమల అభివృద్ధి ఆవశ్యకతనూ ఆయన నొక్కిచెప్పినాడు. డా॥ రామ్ మనోహర్ లోహియా ధృఢమైన ఆలోచనా పటిమను కల్గింపజేయుటమేకాక సమకాలీన సమస్యలకు భారతీయ సామ్యవాదులలో ఆసియాటిక్ దృక్పథాన్ని పెంపొందింపజేసిన సామ్యవాదమేధావి. లోహియా భావనలు పరిశీలించిన ఒకటి స్పష్టమవుతుంది. అది ఏమిటంటే "లోహియా భావనలు మార్క్సిస్టని కాని వాటిని సాధించుటకు ఆయన గాంధియన్ పద్ధతులను ఆచరించాడు. ఆయన సామ్యవాద భావనలకు గాంధీతత్వాన్ని కలుపడాన్ని విశ్వసించాడు. దీనివల్ల మనము వాస్తవ ప్రజాస్వామ్యాన్ని, సామ్యవాద సమాజాన్ని స్థాపించవచ్చునని లోహియా భావన. లోహియాను వికేంద్రీకరణ సామ్యవాద వ్యాఖ్యాతగా, నవీన సామ్యవాద ఉద్వేగ భరిత ప్రచారకునిగా జ్ఞాపకముంచుకొనవచ్చును.

## 16.18 మాదిరి ప్రశ్నలు :

1. భారతదేశంలో సోషలిస్టు ఉద్యమ ఆవిర్భావం, అభివృద్ధిని గురించి చర్చించండి.
2. ఆచార్య నరేంద్రదేవ్ యొక్క సోషలిస్టు భావాలను వివరించండి.
3. సోషలిస్టు ఉద్యమానికి రామ్‌మనోహర్ లోహియా చేసిన కృషిని వివరించండి.
4. లోహియా యొక్క నూతన సామ్యవాదాన్ని గురించి వ్రాయండి.

**లఘు ప్రశ్నలు :**

1. మార్క్సిజమ్‌పై నరేంద్రదేవ్ అభిప్రాయం.
2. గాంధీతత్వంపై నరేంద్రదేవ్ వైఖరి.
3. రామ్‌మనోహర్‌లోహియా 'వీల్ ఆఫ్ హిస్టరీ'.

## 16.19 చదువదగిన గ్రంథాలు :

1. వి.పి. వర్మ - మోడరన్ ఇండియన్ పొలిటికల్ థాట్
2. జె.పి. సుధ - మెయిన్ కరెంట్స్ ఆఫ్ సోషల్ అండ్ పొలిటికల్ థాట్ ఇన్ మోడరన్ ఇండియా
3. వి.యల్. దీక్షిత్ - సోషలిస్టు మూవ్‌మెంట్ ఇన్ ఇండియా

– డాక్టర్ కె. రామచంద్రమూర్తి

**(DPS 24)**

M.A. DEGREE EXAMINATION, MAY 2011.

Second Year

Political Science

Paper IV — SOCIAL AND POLITICAL THOUGHT IN INDIA

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

All questions carry equal marks.

1. Explain Mana's contribution to the Indian social ad political thought.

   భారతదేశ సామాజిక మరియు రాజకీయ తత్వ విచారమును మను యొక్క కృషిని వివరింపుము.

2. Discuss the major factors of modern Indian Renaissance.

   ఆధునిక భారత పునరీకరణకు ప్రధాన కారకాలను చర్చింపుము.

3. Explain Ram Manohar Roy's political thought.

   రామ్ మనోహర్ రాయ్ యొక్క రాజనీతితత్వ విచారమును వివరింపుము.

4. Discuss Gokhale's contribution to the Indian political thought.

భారత రాజకీయ తత్త్వ విచారమునకు గోఖలే చేసిన సేవను చర్చింపుము.

5. Explain in Aurobindo's political philosophy.

శ్రీ అరొబిందో యొక్క రాజనీతి తత్త్వ విచారమును వివరింపుము.

6. Discuss Mahatma Gandhi's views on religion and communal harmony.

మతము మరియు మతసామరస్యముపై మహాత్మాగాంధీ యొక్క భావనలను చర్చింపుము.

7. Elucidate Mahatma Gandhi's Gram Swaraj Concept.

మహాత్మాగాంధీ యొక్క గ్రామ్ స్వరాజ్ భావనను విపులీకరింపుము.

8. Discuss M.N. Roy's Humanist thought.

ఎమ్.ఎన్. రాయ్ యొక్క మానవతావాదమును చర్చింపుము.

9. Explain the Sarvodaya thought propounded by Jayaprakash Narayan.

జయప్రకాశ్ నారాయణ్ యొక్క సర్వోదయ తత్వ విచారమును వివరింపుము.

10. Bring out the strategies of revolution set out by Mohit Sen.

మోహిత్ సేన్ నుడివిడిన విప్లవ వ్యూహాలను వివరింపుము.

---

**(DPS 24)**

M.A. (Final) DEGREE EXAMINATION,
DECEMBER 2010.

Second Year

Political Science

Paper IV — SOCIAL AND POLITICAL THOUGHT IN INDIA

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

All questions carry equal marks.

1. What are the policies of acquisition of dominium according to Kautilya?

   కౌటిల్యుడు చిన్నరాజ్యాలను కబళించడానికి అవలంబించిన ముఖ్యమైన విధానాలేమిటి?

2. Discuss the political ideas of Raja Ram Mohan Roy.

   రాజారామ్ మోహన్‌రాయ్ రాజనీతితత్వ విచారాన్ని చర్చించుము.

3. "Poverty in India is a British Legacy" (Dadabhai Naroji). Comment.

   "బ్రిటీష్ పాలనయే భారతదేశ దారిద్రానికి కారణం" (దాదాబాయ్ నౌరోజి) వ్యాఖ్యానించుము.

4. Examine the political ideas of Aurobindo.

అరబిందో ప్రతిపాదించిన రాజకీయ భావాలను పరిశీలింపుము.

5. Write an essay on non-violence and satyagraha of Mahatma Gandhi.

మహాత్మాగాంధీ ప్రబోధించిన అహింస, సత్యాగ్రహంపై ఒక వ్యాసము వ్రాయుము.

6. Discuss M.A. Jinnah's "Two Nation Theory".

యం.ఎ. జిన్నా ప్రతిపాదించిన 'ద్విజాతీయ సిద్ధాంతాన్ని' చర్చించుము.

7. Analyze the theory of Neo-Humanism of M.N. Roy.

M.N. రాయ్ ప్రతిపాదించిన క్రొత్త మానవతావాదాన్ని విశ్లేషించుము.

8. Discuss B.R. Ambedkar's social justice.

B.R. అంబేద్కర్ ప్రతిపాదించిన సామాజిక న్యాయమును చర్చించుము.

9. Evaluate the views of Nehru on Democracy.

ప్రజాస్వామ్యంపై నెహ్రూ అభిప్రాయాలను మూల్యాంకనము చేయుము.

10. Discuss Jayaprakash Narayan's views on "Total Revolution".

"సంపూర్ణ విప్లవము" పై జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయాలను చర్చించుము.

---

**(DPS 24)**

M.A. (Final) DEGREE EXAMINATION, JUNE 2010.

Second Year

Political Science

Paper III — SOCIAL AND POLITICAL THOUGHT IN INDIA

Time : Three hours Maximum : 100 marks

Answer any FIVE questions.

All questions carry equal marks.

1. Discuss the political ideas of Manu.

   మను రాజనీతితత్వ విచారాన్ని చర్చించుము.

2. Evaluate the contribution of Dayanand Saraswathi towards Vedic revivalism.

   వేదాల పునర్జీవనానికి దయానందసరస్వతి చేసిన కృషిని అంచనా వేయుము.

3. Discuss the political ideas of Raja Ram Mohan Roy.

   రాజారామ్ మోహన్‌రాయ్ రాజనీతి తత్వ విచారాన్ని చర్చింపుము.

7

4. Examine the political ideas of Gopalakrishna Gokhale.

గోపాల కృష్ణగోఖలే రాజకీయ భావాలను పరిశీలించుము.

5. Write an essay on non-violence and satyagraha of Mahatma Gandhi.

మహాత్మాగాంధీ ప్రభోదించిన అహింస, సత్యాగ్రహంపై ఒక వ్యాసమును వ్రాయుము.

6. Explain the role of "Rama Rajya" in the Gandhian Philosophy.

గాంధీ రాజనీతి తత్వ విచారంలో "రామరాజ్య" స్థాపన భావనను వివరించుము.

7. Write an essay on social justice of B.R. Ambedkar.

బి.ఆర్. అంబేద్కర్ ప్రభోదించిన సామాజిక న్యాయంపై ఒక వ్యాసమును వ్రాయుము.

8. Examine the political ideas of Jawaharlal Nehru.

జవహర్‌లాల్ నెహ్రూ ప్రతిపాదించిన రాజకీయ భావాలను పరిశీలించుము.

9. Discuss Jayaprakash Narayan's views on "Total Revolution".

"సంపూర్ణ విప్లవం"పై జయప్రకాష్ నారాయణ్ అభిప్రాయాలను చర్చించుము.

10. Discuss Acharya Vinobha Bhave's views on Bhoodan movement.

"భూదాన్" ఉద్యమంపై ఆచార్య వినోభా భావే అభిప్రాయాలను చర్చించుము.

(కత్తిరించి పంపవలెను)

## అధ్యాపకులు, విద్యార్థుల సలహాలు, సూచనలు :

అధ్యాపకులు, విద్యార్థులు ఈ స్టడీ మెటీరియల్‌కు సంబంధించిన సలహాలు, సూచనలు, ముద్రణ దోషాలు తెలియపరచినచో, పునర్ముద్రణలో తగు చర్యలు తీసుకొనగలము. తెలియపరచవలసిన చిరునామా : **డిప్యూటీ డైరెక్టర్, దూరవిద్యా కేంద్రం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నాగార్జున నగర్ - 522 510.**

| Course | Year | Paper No. & Title |
|---|---|---|
| M.A. Political Science | IInd year | Paper - IV : Social and Political Thought in India |

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)

(కత్తిరించి పంపవలెను)